UNIVERSAL LIBRARY
OU_204334
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T. 83/Ch 64 K Accession No. T. 3385

Author

Title కర్పూర మంజరి.

This book should be returned on or before the date last marked below.

కర్పూరమంజరి

ద్వితీయభాగము

చిలకమర్తి లక్ష్మీనృసింహకవి విరచితము

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమహేంద్రి.
1954

కాపీరైట్] [వెల ౨—౦—౦

రాజమహేంద్రవరంబున

శ్రీ కొండపల్లి ముద్రాశాలయందు

ముద్రింపఁబడినది.

శ్రీరస్తు

కర్పూరమంజరి

ద్వితీయ భాగము

మొదటి ప్రకరణము

"సఖీ! కర్పూరమంజరీ! మహారణ్యమతిక్రమించి బయలుగా నున్న భూమికి మనము వచ్చుటచే సంధ్యాసౌందర్యముఁ గాంచగలిగితిమి. చూడుము! చూడుము! దాని రమణీయకము వర్ణనాతీతమై యున్నది. ఘన ప్రభావముచేఁ బగలు [illegible] యసాధారణతేజమున [illegible] నెల్ల నా [illegible] సంతాపింపఁజేసి యెట్టకేలకుఁ గాలవశమున [illegible] తేజముఁ గోల్పడి పశ్చిమాద్రి [illegible] బరాజయోద్రేక [illegible] కాయమున [illegible] మిత్రులు [illegible] స్తమింపనున్న [illegible] భాగ [illegible] పడమటికొండ [illegible] చుచున్నాఁడు. [illegible] ముకదా" అని మల్లిక [illegible] కర్పూరమంజరి [illegible] మల్లికా! [illegible] స్తమయమను [illegible] మున్నది. చూడు! [illegible] నాటకమునకు [illegible] రము ప్రస్తావన [illegible] యున్నది. కాలపురుష [illegible] సూత్రధారుఁడు [illegible] భాగ [illegible] శ్రీ [illegible] యైన భానుబింబమును [illegible] పెట్టి [illegible] ప్రవేశించి రాఁగలని యీ నాటకమును సూచించుచున్నది. [illegible] లుగు నటీనటులు [illegible] చున్నది. అదే ప్రభాకరుఁడు [illegible] స్తమించినాఁడు. ఇఁక [illegible] నాటక ప్రథమాంకము మనము దర్శింపఁగలము. అల్లదె! కథానాయకుఁడు [illegible] దుదయించు చున్నాఁడు. చూడు! ఆకాశ [illegible] బను [illegible] నగ్రదయ [illegible] నాఁడు. నిగనిగలాడు నాగద్రియ [illegible] నక్షత్రజంబులు [illegible]

లెక్కకుమిగిలినచుక్కలు, మెఱయుచున్నవి. ఈతఁడు చల్లని
డయ్యు మహాతేజశ్శాలియై సహజశత్రువైనయంధకారమును బట
పంచలుగఁ జేసియున్నాఁడు" అని కర్పూరమంజరి ప్రత్యుత్తర మి
య మల్లిక "సఖీ! నీయూహ సరసముగా నున్నది. కాని యిదివిన
ఈనిశాసౌందర్యము నాకు మఱియొకలాగు కనఁబడుచున్నది. గగ
నలక్ష్మిషోడశకళాపరిపూర్ణమైన చంద్రమండలము నెమ్మొగముగా
దానికళంకము కస్తూరితిలకంబుగా నీలనీలం బగునాకసంబు కొప్పుగా
జుక్కలు కొప్పునం దుఱిమినమల్లెపూవులుగా నలుగడల నలముకొన
తెలవెన్నెలలు నవ్వులుగా హాయులు గులుక జగన్మోహనంబగు న
కృతిఁ దాల్చి యీ సమయమున విశ్వమెట్లున్నదో చూచుటకు బయ
లుదేరినది. చెలీ! యీ నభోలక్ష్మి యెల్లతెఱఁగుల నిన్నుఁబోలియున్న
యది" యని పలికెను.

"సఖీ! నీకు నాపైఁ గలప్రేమచేత నన్ను గగనలక్ష్మితో
బోల్చుచుంటివి గాని ప్రకృతి సౌందర్యమునకు నావంటిదానిసౌంద
ర్యమా తగునే? దాని కదె సాటి. చిత్రకారుఁడు బహువిధవర్ణములచేత
హస్తనైపుణిచేతను వృక్షమునో పూవునో పండునో యొకఫలక
మీఁదఁ జిత్రించుఁ గాక! ఆయాచోటుల ననువుగా రంగులు పులు
మఁగలఁడా! ఎన్నియందములఁ దేవలయునో యన్నియందములఁ దెచ్చు
నాఁతి! ఏయియైన దేవదేవనిర్మిత మయినవృక్షములు ఫలములు, పువ్వు
లిత్తరి వగునా!"

అని వారిరువురు ప్రకృతిసౌందర్యమును జూచి మెచ్చి యానం
దము నొందుచుండ నంతలోఁ జంద్రిక వచ్చి "అమ్మా! గడి
రాత్రి యైనది. అమ్మగారు గుడారములోనికి రమ్మనుచున్నార
లండు. పోదము" అని పిలిచెను. పిలుచుటయు వారిరువురు "స

జయంతుఁడు వెంటవచ్చిన పరివారమునకు బసలనిమిత్తం భోజనములనిమిత్తము [illegible] గావించెను. చెట్లక్రింద గుఱ్ఱములఁ గట్టిరి. [illegible] గుడారములలో విశ్రమించెను. [illegible]మణియుఁ, గర్పూరమంజరియు, విజయసేనుఁడును తెండలకడ భోజనము చేసిరి. అనంతరము జయంతుఁడు మొదలగు ప్రధానపురుషు లారగించిరి. పగ లెల్లఁ బయనముసేయుటచే బడలికల పెంపున గుఱ్ఱపురౌతులుఁ బదాతులు భోజనములు సత్వరము ముగించి చెట్లనీడలఁ జాఁపలు, కంబళ్ళుఁ బఱచుకొని నిమేషమాత్రమునఁ గనులు మూసికొని నిద్రించిరి. ప్రయాణములలోసైతము రాజకుటుంబములకు సకలసౌకర్యములు జరుగనలసియుండెను గనుక మంచములు, పానుపులు, పల్లకులు, దీపస్తంభములు, రత్నకంబళములు, బహువిధఫలములు, నానావిధభోజనపదార్థములు వారివెంట నుండునట్లు రాజవాహనుఁ డేర్పాటుచేసెను. పరిచారికలు పానుపులు పఱచిన నిరుపమణియు విజయసేనుఁడును బవ్వళించి నిద్రించిరి.

పండువెన్నెలలు గాయుచుండెను. మలయమారుత తరంగములు యథేచ్ఛముగ శరీరముల సోఁకి హాయి యనిపించెను. కొన్ని [illegible]పుల మెలుఁగులు వీనులకు విందగు గానమువలె మనసున నానందముఁ గూర్చెను. నేలయంతయుఁ దెల్లముప్పుటిపఱచినట్లు గానబడెను. వెండిపూతె పూసినట్లు కప్పురపుంబొడి చల్లినట్లు, పాలగచ్చు వేసినట్లు గానఁబడెను. ఆసమయమునఁ గర్పూరమంజరి నాఁడు మకరందుఁ[illegible]తన యగ్నతలోఁ దనకుఁ గావించిన క్షేమదరూపక మహోపకారమును [illegible] యాతని యాకారమును స్మరించి యాతని మృదుమధురసంభాషణలను [illegible]హాసములను సుందర విలాసములను జ్ఞప్తికిం దెచ్చి[illegible] నతనితోడి కూటమి సంప్రాప్తించు పుణ్యకాలము గలుగు[illegible] తలపోయుచు నిద్రవోవకయుండెను.

మల్లికయు రెండుమూఁడుసారు లామెను బలుకరించి ప్రత్యుత్తరము గానక "ఏమమ్మా! నామాటలు వినఁబడుటలేదా? నీమనంబు మకరందరసము నాస్వాదించిన గొమ్మెదవలె మత్తిల్లియున్నది గాఁబోలు! నీచెవిలో మకరందబిందువు లస్తుపడెనేమో? కానిచో నా పిలుపులేల వినఁబడవు?" అని చిఱునవ్వు మొలకెత్తినమోముతో నర్మగర్భముగాఁ బలికెను. అప్పలుకులు విని "మూర్ఖురాలా! చమత్కారముగా మాటాడఁగలనని గర్వించి నీయిచ్చవచ్చినట్లు నన్ను దెప్పుచున్నావు. చాలు చాలు! నోరు మూసికొనియుండుము." అని కర్పూరమంజరి మందలించుచుంతలో "సందెకబళమమ్మా! సందెకబళము. పట్టెడన్నము పెట్టుఁడమ్మా! పెట్టుఁడు" అని యొక కేక వినఁబడెను. గుడారములచుట్టుఁ గావలిగాచుచున్న యామికులు కేకవైచిన యాపడఁతుకను లోపలికిఁ బోనీయక నిరోధించిరి. అది యొక్కపెట్టున మొఱవెట్టఁజొచ్చెను. కర్పూరమంజరి దాని కుయ్యాలించి మల్లికం బిలిచి "దానిమొఱ యేమో తెలిసికొని తనకడకుఁ దోడుకొనిరమ్మ"ని పంచెను. మల్లికయు గుడారముదాఁటి యావలకుఁ బోయి కావలివాండ్రకుఁ గర్పూరమంజరియాన దెలిపి యానెలంతను లోపలికిం దోడ్కొనివచ్చెను. మెడనిండ గురివెందపూసలసరము చేతుల గవ్వలగుత్తుల కంకణములు, గలిగి కడుమాసిన ప్రాతబట్ట గట్టి, చేత నొకకుండ దాల్చి కట్టెదుట నిల్చెను. ఆయంగనంజూచి కర్పూరమంజరి "నీకేమి కావలయు? నీవెవ్వతవు?" అని యడిగెను. అప్పడంతుక రాజపుత్రికం జూచి కుండ క్రిందఁబెట్టి దండముఁబెట్టి "తల్లీ! నే నెఱుకలదానను. ఈసమీపముననే మాపల్లియు కలదు. మా కన్నవస్త్రములు లేవు. మిక్కిలి పేదవాండ్రము. ఈదారిని బోవు బాటసారులం జేరి కూఁడుగుడ్డ నడుగుకొని తెచ్చుకొనుచుందుము. ఇంటికడ నాబిడ్డ లన్నము లేక మాడుచున్నారు. గొప్ప దొరలకు

గుడారములు వైచికొని దిగినారుగదా, పట్టెడన్నము దొరుకక పోవునా, యని యాసపడి వచ్చితిని. నే నెఱుక జెప్పఁగలను. కావలయు నేని మీకుఁగూడఁ జెప్పఁగలను" అని విన్నవించెను. దానిదీనాలాపముల నాలించి కర్పూరమంజరి జాలి నొంది దాని కేమైన నాహార మిడుమని మల్లికతోఁ జెప్పెను. "అమ్మా! అట్లె చేసెద" నని చెప్పి మల్లిక చెంచెతం జూచి నవ్వుచు "నోసి! యెఱుక జెప్పఁగలనంటివి, మా రాజపుత్రికకు నీ వెఱుక జెప్పు" మని హెచ్చరించెను. వలదు వలదని కర్పూరమంజరి పలుకుచున్నను నయ్యెఱుకలసాని యూరకుండక చేత నొక పుల్లబట్టుకొని క్రింద నేవో రెండు మూఁడు గీట్లు గీచి యాకసమువంకఁ జూచి చేయి చాఁపుమని కర్పూరమంజరిని వేఁడి హస్తపరీక్షఁ జేసి యిట్లనియె.

భాగ్యశాలివే తల్లి! అదృష్టం గలదానవే తల్లి! చుట్టాలసురభివే తల్లి! కొడుకులకోట వవుదువే తల్లి! నీమనసులో నున్న రాచబిడ్డఁడే నిన్నుఁ బెండ్లాడఁగలఁడె తల్లి! దాపున నున్నాఁడె తల్లి! దగ్గఱ నున్నాఁడె తల్లి! నిపంట పండునే తల్లి! సిరి నీకన్నుల కాఁపురమున్నదే తల్లి! వరాలబొజ్జవే తల్లి! నీదొరను గలసినప్పుడు నన్ను మఱచిపోకు తల్లి! ఒక వాఁతచీర యియ్యవే తల్లి!" అని యెఱుక చెప్పుటయుఁ గర్పూరమంజరి ముసిముసినవ్వులు నవ్వి "దానినోటికి వచ్చినట్లు ప్రేలినది. ఈ చెంచుపడఁతు లందఱకు నీవిధముగానే చెప్పుదురు. ఇందువిశేష మేమియు లేదు." అని పలికి దానికిం బిల్లలకు సరిపడిన యాహారముం బెట్టించి గట్టిచీరలు రెండిచ్చి పంపెను.

మల్లికయు దానిని సాగనంపి "సఖి! దాఁపుననే యున్నది దగ్గఱనే యున్నది" యని చెప్పినది. అచిరకాలములోనే నీవు నీ ప్రియునిఁ గలిసికొందువు గాఁబోలు" నని పరిహసించెను. "చాలు చాలు. నీయెగతాళి కట్టిపెట్టు. నాకు నిద్రవచ్చుచున్నది. రా పండు

కొండ'' మని రాజపుత్రిక మేను సెజ్జం జేర్చెను. మల్లికయు నామె దగ్గఱనే తనపానుపువిూఁదఁ బండుకొనెను. అందఱు గుఱ్ఱుపెట్టి నిద్రించిరి. యామికులు మాత్రము మేలుకొని కాంపు గాఁచుచుండిరి. ఎడనెడ బెబ్బులుల యఱపులు సింగపుఁ బొబ్బలు నక్కలకూఁతలును భయంకరములై వినఁబడుచు రాజపుత్రిక నిద్రకుఁ గొంచెము భంగము గలిగింప ''మకరందుఁడా! మకరందుఁడా! రక్షింపుము, రక్షింపుము'' అని యొకటి రెండుసారు లామె పలువరించెను.

రెండవ ప్రకరణము

''చంద్రచూడుఁడా! నాయనగారి యాజ్ఞప్రకారము మనము మాళవదేశమంతయుఁ దిరిగితిమి గదా. రాజధానియగు నుజ్జయిని యతిదూరమున నుండుటచేఁ బ్రజ లంతదవ్వు నడచిపోయి తాము చేసికొనవలసిన మనవిసనవులఁ బ్రభువుతో సరిగాఁ జేసికొనుట కవకాశము గలిగియుండదని పాలితులగు జనుల సుఖదుఃఖముల నారయు మని మహారాజుగారు మనలఁ బనిచినందుకుఁ బ్రజలు మిక్కిలిసంతోషభరితులైరి. వారు నాకుఁ దెలిపిన యిబ్బందు లన్నియు మహారాజుగారికి విన్నవించి యచిరకాలమున వానిం దొలఁగించుటకుఁ దగినప్రయత్నముఁ జేసెద. రాజాజ్ఞ సరిగా నెఱవేర్చుటచే నాతలపై భారమిప్పుడు దిగినట్లున్నది. నాహృదయమిప్పుడు చులకనై నది కార్యవ్యగ్రతయడఁగినందున నీవెన్నెలసుఖ మనుభవించుటకు మన స్సుత్సహించుచున్నది. కాలపురుషుఁడు బ్రహ్మాండభవనమునకు వైచిన వెల్ల [illegible] పరాగము చల్లినభాతిని నెల్లయెడలవసుంధర తెల్లనై యొప్పె. పైతృకం బగు రాజ్యంబు రెండుభాగములు చేసి సమానముగఁ బంచుకొను నన్న

దమ్ములట్లు దివాకరనిశాకరులు క్రమముగాఁ నహర్నిశలఁ బంచుకొని నైజతేజములచేఁ జగముల కుపకారము సేయుచున్నారు. ఈచల్లదనము నీవుఁగూడ ననుభవింపుము.'' అని యాళవేంద్రనందనుఁ డగు మకరధ్వజుఁడు వేడుక చెలికాఁ డగు చంద్రచూడునిఁ జూచి పలికెను. చంద్రచూడుఁడు* వాని మనోభావ మెఱిఁగి మెల్లగ నిట్లనియె. ''మిత్రుఁడా! నీవంటి మహారాజకుమారుఁడు సాంద్రసుధాధవళము లగు మేడలనుండువాఁడు. వనాంతరములకు వచ్చుటంజేసి వనలక్ష్మి గౌరవపురస్సరముగా నీకు స్వాగతమియ్యదలఁచి వెన్నెల పేరిసున్నము బ్రహ్మాండమంతయుఁ బూయించినది. కర్పూరపరాగము జల్లినట్లు విశ్వము తెల్లనై యుండుటనిజమే! అంతే కాదు. చెట్లనున్న పూలగుత్తులు పండ్లగుత్తులు వెన్నెలకతమునఁ దెల్లనై కర్పూరమంజరులట్లు వెలయుచున్నవి'' అని నర్మగర్భముగఁ బలికినఁ జంద్రచూడుని గని మకరందుఁడు ''మిత్రుఁడా! నీమాటనిజము. పుష్పఫలగుచ్ఛము లన్నియుఁ గర్పూరమంజరు లట్లే, వెలయుచున్నవి. ఈ గగనలక్ష్మియుఁ గర్పూరమంజరివలెనే యున్నది. ఏది చూచిన నా కాపద్మాక్షియే జ్ఞప్తికి వచ్చుచున్నది. అది లావణ్యరాశి. అంగనాకృతిఁ దాల్చిన శృంగారరసాధిదేవత; నడకలు మాటలు నేర్చినజాళువా పసిఁడిబొమ్మ. పుంబోఁడి యనుశబ్ద మన్యకాంతలయందు నిరర్థకమేగాని కర్పూరమంజరియందది సార్థకము. పలుకుపలుకున నది యమృతము లొలుకుచుండును. ఆమెనోట వెడలునవి మాటలుగావు, చెవులత్రుప్పుల దుల్లఁజేయుపాటలుగాని. ఆమెలోచనము పద్మగర్వనిర్మోచనము. ఎవఁడైన నొకసారి యామెఁజూచిన నేత్రములు చరితార్థము లగును. పలుకులువిన్న వీనులు చేసికొన్న పాపంబు దొలంగును. మిత్రుఁడా! ఆమెంజూచి యెంత కాలమైనది! నాఁడు విదర్భాపురము బాసినదాదిగా నామనసు మనసులో లేదు. ఆత్మ నిరంతరము విదర్భలో నుండుటచే

నా దేహము దీపములేనిగాజుకుప్పవలె నుజ్జయినిలో నున్నది. మరిలం గన్నులకఱవుదీఱ నావెన్నెలదీవిని జూడఁగల్గుదునే? ఆమె యే రాజనందనుని జెట్టబట్టనున్నదో! ఆమె కరస్పర్శనంబున నే రాజు హస్తము ధన్యతనొందునో? ఓహో! నామాటలు పిచ్చివాని పలుకు లట్లు నీవు గ్రహించుచున్నావు కాఁబోలు! ఆ సుందరీప్రసంగ మిప్పు డప్రస్తుతమై నీకు విసుగు గలిగింపవచ్చును. కావున విరమించెదనులే'' అని పలికి నిట్టూర్పు విడిచి యూరకుండెను.

అప్పుడు చంద్రహాసుఁడు ''మిత్రుఁడా! నాకనుఱెప్పలమీఁద నిద్రాదేవి రెండుకాళ్ళువైచి నిలిచియున్నట్లవి యెంతో బరువుగా నున్నవి. అతిప్రయత్నముననేగాని ఱెప్పలు తెఱచుట లేదు. నేను నీమాటలువినుచుండియే నిద్రపోవుచున్నాను. నేను కలగనుచున్నానో నీతో మాటలాడుచున్నానో సరిగాఁ జెప్పజాలను. ప్రపంచమంతయు నీకు కర్పూరమంజరీమయమై యున్నది. కొంపదీసి నన్నుఁగూడ నీవు కర్పూరమంజరిఁగా భావించి చెక్కిలి గాయమగునట్లు గట్టిగా ముద్దు పెట్టుకొందువేమోయని భయముగానున్నది. వలపు వెఱ్ఱి యెత్తిన వారు కేవలము పిచ్చివాండ్రు, సమానులు'' అని చంద్రహాసుఁ డింక నేమో చెప్పబోవుచుండ నంతలో నొకమూలనుండి ''పొడువుఁడు. తఱుముఁడు. పట్టుఁడు. పట్టుఁడు. అయ్యో! రక్షింపుఁడు. రక్షింపుఁడు'' అను నార్తనాదము వినఁబడెను. అంతలో నొకటిరెండు స్త్రీ కంఠములు వినబడెను. చంద్రహాసుఁ డులికిపడి లేచి నిలిచెను. మకరందుఁడు పీఠమునుండి దిగ్గున లేచి ''మిత్రుఁడా! ఏదో యార్తధ్వని వినఁబడుచున్నది. అందులో స్త్రీస్వనముగూడ వినఁబడుచున్నది. ఏదీ ఖడ్గము. ఖడ్గము! నే నిప్పుడె పోయి యక్కడ నుఱికెద. ఓరీ! ఎవఁడురా యక్కడ! ఖడ్గముఁ దెమ్ము'' అని గుడారమువైపున కరిగెను.

చంద్రచూడుఁడు భయమున గడగడవడఁకి "మిత్రుఁడా! నా ప్రాణము ప్రాణములో లేదు. నన్నువరి కప్పగించి పోయెదవు? అయ్యో! పేదవాఁడను. బ్రాహ్మణుఁడను. మాతల్లి కొక్కఁడనే కుమారుఁడను. నాప్రాణము రక్షింపుము" అని యతనిని బిగ్గరగాఁ గౌగిలించుకొనెను. మకరందుఁడు వానిపిరికితనమునకు నవ్వుకొని "వయస్యా! భయములేదు. నీప్రాణమునకు నాప్రాణ మడ్డమువైచెదను. నీ వీ గుడారములోనుండుము. నీ కిరువురు సేవకుల నప్పగించెదను. వారు నిన్ను గట్టిగాఁబట్టుకొందురు." అని చెప్పి ఖడ్గము ధరించి మెఱియల నంటి పోటుబంటులఁ బదుగురఁ దనవెంట రమ్మని యార్తధ్వని వచ్చినవైపునకు విసవిస నడచిపోయెను. విండ్లు నమ్ములు బల్లెములు మొదలగుసాధనంబుల ధరించి దంట లగుబంటులు పదుగురేగాక పెక్కండ్రు రాజకుమారుని వెంటనరిగిరి.

"వెఱువకుఁడు వెఱువకుఁడు! ఇదే నేవచ్చుచున్నాఁడ" నని యుచ్చైస్స్వరముతో దెసలు మాఱుమ్రోఁగునట్లు కేకలువేయుచు మకరందుఁడు మిక్కిలి వేగముతోఁ బరుగెత్తి గుడారములకడ కరిగెను. వీరభటులు యువరాజు ననుసరించి గమ్యస్థానముఁ జేరిరి. అప్పు డేమి చెప్పను? మొగమున జేగురుబొట్లు తలలపై నెమలిపింఛములు గ్రుచ్చిన తలఁగచుట్టలు, చేతఁ విండ్లు, నమ్ములు, భుజముల నీ తూపులతో నల్లినయమ్ములపొదులు, మొలలలో గవ్వలసరములు, గురివెంద పేరులు, ముంజేతుల దండల నెముకలకంకణములు, నెన్నడుమ కత్తిరింపులుగని బారుమీసములు గడ్డములు వ్రేలుచున్న కొండజనులు పుట్టగోచులు, పెద్దఱొమ్ములు, చిఱుతనిప్పులట్లు మెఱయుకన్నులుఁ గల బిల్లులు దిక్కులు బిక్కటిల్లునట్లఱచుచుఁ గర్వారవముఁ జరి యుందుమణి యున్నగుడారములోఁ బ్రవేశించి కొల్లవెట్టఁ జొచ్చిరి. చంద్రు క్రోల్పులులవలె నుగ్రమూర్తులై వచ్చి మునుముందుఁ గావలివాండ్రం గడతేర్చి నిద్రించుచున్నవారు నిద్రించుచుండఁగనే కత్తుల కుత్త

రించి బొమార్చి యాకస్మికముగా లేచి చేతికి దొరకినయాయుధంబు లంబట్టి తె మ్మెదిర్చిన జోదులగాయపఱచి కొందఱిని జెట్లకు బంధించి యథేచ్ఛముగఁ బ్రవర్తించుచుండిరి.

జయంతుఁడు వారిచే బంధింపఁబడెను. శూరుఁడైన విజయసేనుఁడు గాయము దగిలి నేలఁ బడెను. కల్పలతయుఁ జంద్రికయు మల్లికయు, "రక్షింపుఁడు. రక్షింపుఁ" డని యఱువఁజొచ్చిరి. ఇందుమణి దొంగలం జూచి తన మేనిఁ గల కర్పూరమంజరి యొడలియలంకారములు దీసి యిచ్చి తమ కేవిధమైనఁ కీడు సేయకుండ గావలసినదంతయు నొసఁగొనియిమ్మని యమూల్యాభరణంబులు చీనిచీనాంబరములు విలువగల నవ్వారువలు శాలువలుఁ గలపెట్టెలం జూపెను. కర్పూరమంజరి మూర్ఛిల్లెను. భిల్లులు కొల్లలుగొట్టుటకుఁ జక్కని యవకాశము దొరకెనని సంతసించి మహాహాంక్రమతోసికి జోక తనువచ్చినపని చేయఁజొచ్చిరి.

అంతలో మకరందుఁడు సపరివారముగా నచ్చటికరుదెంచి భిల్లులం దాఁకెను. రాజవాహనునిభటు లెవ్వరో దొంగ లెవ్వరో తెలిసికొనుట యటవికులవేసములఁ బట్టి యతనికి సులభమయ్యెను. నిశాచరులట్లు భయంకరాకారులై నిర్భయవిహారము సేయుచున్న నిర్దయాత్ములఁ గఱకుఁజెఱుపులఁ గఱకుకత్తులతో మకరందుఁడు సమరకుశలు రగునాతనియనుచరులును వనంటిబోదల నఱికినట్లు నేలఁబడ రెండుతునియలుగా నఱుకఁజొచ్చిరి. దోఁపునఁ గొడవగానున్న భిల్లులు మింటనుండి పిడుగులుపడినట్లు హఠాత్తుగా మహాశూరులువచ్చి తమ్ము దాఁకుదురని యూహింపలేక చెట్లుకూలినట్లు కూలిరి. కొందఱు మకరందుని విక్రమవిహారముఁ నెదుర నిలువలేక చేతనున్న పెట్టెలు మొదలగునవి జాఱవిడిచి పాఱిపోయిరి. రాజవాహనునిభటుల కళేబరములతోను, భిల్లులపీనుంగులతోను నచ్చోటు భయంకరమై యుండెను.

ఒక్క ముహూర్తములో దొంగలలో ననేకులు హతులైరి. తక్కిన వారు పలాయితులైరి.

మూఁడవ ప్రకరణము

ఆపద్బాంధవు లయినమహనీయు లెవరో తమ కుయ్యాలించి వచ్చి సాయముచేసి ప్రముచ్చులపీచ మడఁచి తమ్ముఁ గాపాడిరని యిందుమతియు మల్లికాచంద్రికలు జరిగినచిన్ని కయ్యంబువలన గ్రహించిరి గాని వచ్చినవా రెవ్వరో వా రెఱుఁగరు. దొంగలదాడివలనఁ గలిగినభయము కవంత శమించుచుండ గాదిలికూఁతురగు కర్పూరమంజరిమూర్ఛవలన నిందుమతికిని, మల్లికాచంద్రికలకును వెండియు మునుపటికన్న నధికమైన మనోవేదన కలిగెను. యోధులగంభీర భాషణంబులవలనఁ గాని, మృతినొందువారిమూర్తనాదమువలనఁ గాని కర్పూరమంజరికిఁ దెలివిరాలేదు. మల్లికాచంద్రికలు శైత్యోపచారములు చేయుచుండిరి. ఇందుమతి ప్రక్కనఁ గూర్చుండి మీఁదఁ జేయివైచి "బిడ్డా! తాతయుఁ దండ్రియు దగ్గఱలేనిత్రీ మహారణ్యమధ్యమున దిక్కుమాలి నీ వీలీల నాకు దక్కుదువని నిన్నుఁ దలంపనైతినమ్మా. అక్కటా! నీ దేహస్థితి యెట్లున్నదో తెలియఁజేయుటకై వైద్యులయిన లేరుగదా. దంట లనుకొందులు హతులైరిగదా. తల్లీ! తెల్లదామరవంటి మొగము నల్లఁబడినది. ఇఁక నేటిబ్రతుకు! ఏటి యాస! మల్లికా! నీ ప్రాణసఖ చైతన్యముదక్కి యున్నది. చంద్రికా! ఇంక నీ వెవ్వరితో నఱ్ఱొక్కు లాడుదువే!" యని పలువిధముల వగచుచు నొక్కమచ్చున నోడికగట్టుచున్న కన్నీటి సోనలచే నప్రయత్నముగ దుఃఖవర్షము పుత్రికపైఁ గురిపించుచుండెను.

మకరందుఁడు భిల్లులు పలాయితులైన వెనుక వాండ్రు తీసికొని పోక విడిచిన పెట్టెలను వెదకి తెమ్మని తనభటులఁ కానతిచ్చి చెట్టునకు బంధింపఁబడినజయంతుని విడిపించి భుజాదండముమీఁదఁ గాయము తగులుటం జేసి కలవరపాటుచే జొటజొటఁ గారు క్రొన్నెత్తురు నాఁపుటకై ప్రయత్నించియు నట్లు సేయలేక సొక్కియున్న విజయసేనునిఁ గని లేవఁ దీసి యాతని మొగముఁ జూచి యాశ్చర్యపడి జయంతుని నాన వాలుబట్టి "ఎవరో యనుకొంటిని మీరా? ఆఁడువాండ్రతోఁ గూడ వచ్చిరా" యని యడిగెను, వారు "మేము స్త్రీలతోఁ గూడ వచ్చితిమి. వారు కుటీరములలో నున్నారు. అటకుఁ బోదము రండు" అని యుత్తరమీయ నందఱు దోడ్కొని పటకుటీరములకడ కరిగెను. అరిగి లోనఁ బ్రవేశించి చూచునప్పటికి మోహపరాయణయై కనుగవ మూసికొని వివశయై పండుకొనఁబెట్టిన బంగారుబొమ్మవలె నున్న కర్పూరమంజరి యతని నేత్రములఁ గనఁబడెను. ఇందుమతియు మల్లికాచంద్రికలును వానిం జూచి తెల్లఁబోయిరి. సుదర్శనుఁ డగు సుదర్శననందనునిఁ జూచిన తోడనే వారికందఱకుఁ బ్రాణములు లేచివచ్చెను. నాఁటిమంది యాప్తబంధువులను జూచినట్లు వారికి ధైర్యముగలిగెను. కాని కర్పూరమంజరియవస్థ వారియుత్సాహమున కంతరాయము గలిగించెను. కుమారునకు గాయము తగిలినదని యిందుమతి యెఱుంగదు. నెత్తుటం దడిసిన వస్త్రములతో నున్న కొడుకుం జూడ నిందుమతి వగపినుమడించెను. ఆవిధముగా నున్న కుమారికం గనుఁగొని యీవిధముగా నున్న కుమారునిం గనుఁగొని యిందుమతి ధైర్యము చిక్కఁబట్టజాలక కొడుకుం గౌఁగలించుకొని "కుమారా! మీ యిరువుర కేకకాలమందే యాపద సంభవించెఁగా" యని వాపోయెను. మకరందుఁడు జయంతునిఁ జూచి "విజయసేనుని గాయము మిక్కిలి గొప్పదిగాదు. వెంటనే వ్రణపట్టికలు వైచి చికిత్సఁ జేయుఁడు. అచిరకాలంబున

గాయము మాను" నని చెప్పి బాలిక యిట్లుండుట కేమి కత మని యడిగెను.

మల్లిక నేత్రములనుండి బాష్పము లురుల "దేవా! దొంగ లం జూచి యీమె మూర్ఛిల్లి పరవశ యైనది. ఇంకం దెలివి రాలేదు. కొనయూపిరి మాత్ర మున్నది. నాఁడు మా చెలి విదర్భానగరమున దారుణజ్వరపీడిత యైనపుడు మీరె మా దేవికిఁ బుత్రికా భిక్షము పెట్టిరి. నేఁడును మరల మీరే వచ్చిరి. మీరు వచ్చుట యామెకుఁ బ్రాణము వచ్చుట మాకు శుభము వచ్చుట" యని పలికెను. "కుమారా! ఈమె మేనఁ బ్రాణము లున్నవో లేవో సత్వరము జెప్పు" మని యిందుమణి మకరందుని నడిగెను. మకరందుఁడు "అమ్మా! భయపడకుము. ఇది మూర్ఛ గాని మరణము గాదు. దురాత్ములైన భిల్లులదుండగముల చేత భయంపడి యీతీఁగబోఁడి మూర్ఛిల్లినది." అని చేయి జూచి "నాడి స్ఫుటముగా నున్నది. ఉచ్ఛ్వాసనిశ్వాసములు సరిగానున్నవి. శబ్దముఁ జేయక మీరు దూరముగానుండుఁడు. క్రమక్రమముగ నామెకుఁ జైతన్యము వచ్చును" అని పలికి వారికి ధైర్యముఁ గొలిపి తా నామెప్రక్కను గూర్చుండెను.

మోహావస్థ క్రమక్రమముగా సడలుట చేతనో మకరందుని హస్తస్పర్శసుఖముచేతనో బాలిక కాలుసేతులు గదలిచి కొంతసేప టికిఁ గనులు విచ్చిచూచి యెట్టయెదుట సాక్షాత్కరించిన మన్మథునట్లు గూర్చున్న మకరందునిఁ గనుగొని సిగ్గువెంపున మొదటఁ గనులుమూసి మరలఁ గన్నులు దెఱచి యా లావణ్య రసమునఁ దననేత్రమీనముల నోలలాడించెను. అట్లొండొరులు దర్శన స్పర్శన సుఖముల ననుభవించుచు వారిరువురుఁ గొండొకసేపు పరమానంద సముద్రమునఁ దేలి యాడుచుండ నంతలో మల్లికా చంద్రికలు వేఱొకపాన్పు నమర్చి మూర్ఛితయైనప్పుడు నేలఁబడియున్న కతమున ధూళిధూసరితమైన

బాలిక మేనుదులిపి లేవఁదీసి యాశయ్యంబందుకొనఁబట్టిరి. ఈయంతి రాయము వారి కిరువుర కనిష్టమైనను సహింపక తప్పినదిగాదు.

జయంతుఁడు విజయసేనుని గాయమునకుఁ దగిన చికిత్సలఁ జేసి రక్తస్రావముఁ గట్టించి యతనినిఁ గూడఁ బవ్వళింపఁ జేసి నిహతులయిన పరిజనులకు నగ్నిసంస్కారవిధానము దుస్సాధ్యమని హతశేషులచేత వారికిఁ దగినట్లు ఖననక్రియలు జేయించెను. పరిజనులలో గాయములు దగిలినవారికి సైతము చికిత్సలు చేయఁబడెను. పూరిపుల్లయైన దొంగల పాలుగాకుండ స్త్రీల కవమానము గలుగకుండఁ దమ్ముఁ గాపాడిన మకరందుని జయంతుఁడును దక్కిన పరిజనులును బలు తెఱంగులఁ గొనియాడిరి. తనకుఁ బుత్రపుత్రికాభిక్షము నాఁడు మకరందుఁడు ప్రసాదించె నని యిందుమణి పలు తెఱంగుల నాతని నుతించె.

ఆ నడిరేయి యానట్టడవిలో వారుండుటకుఁ గారణమేమని మకరందుఁడు ప్రశ్నించెను. అప్పుడు జయంతుఁ డిట్లనియె. "కుమారా! ఎఱుఁగుదువుగదా హేమచంద్రుని యనుజుఁడును విదర్భరాజగు రాజవాహనున కల్లుఁడు నగు చిత్రభానుఁడు కలఁడని కర్పూరమంజరి యాతని గారాబుకూఁతురు. చిత్రభానుఁడు శ్రీనగరమందున్నాఁడు. ఇందుమణీదేవియుఁ గర్పూరమంజరియు హేమచంద్రుని రాణియగు నరవిందాదేవిని, వాని గారాబుకొడుకు లగు విక్రమసేన హర్షవర్ధనులను జూచి పరామర్శించుట బంధుధర్మముగదా! అక్కారణంబున వీరు చిత్రభానుప్రేరితులై రాజవాహనుని యనుమతంబున నచ్చటికిఁ బోవుచున్నారు. విదర్భేశ్వరుఁడు తగు పరిజనంబు నిచ్చి యశ్వములిచ్చి యందలములిచ్చి యఖిల ప్రయాణ సాధనంబుల నిచ్చి పెద్దవాఁడను లోకానుభవము గలవాఁడను గనుక నన్నుఁ దోడిచ్చి కాశ్మీరమునకు వీరిని బయనముచేసి పంపెను. మందభాగ్యుఁడనైన నేను వీరి కీయవస్థఁ దెచ్చితిని. సమరమున ముక్కాకలుదేరిన వీరులు నిష్ఠా:

రణముగా మ్రుచ్చులచేతఁజిక్కి చచ్చిరిగాని హతాశుఁడనైన నేను కడతేఱిన గాఁగుంపునుగదా! నీవు సమయమునకు రాకున్న క్రూరులు నిర్దయులు నగుచోరులు మమ్మేమి చేసియుందురో! ఆర్తత్రాణపరాయణుఁడవైన నీచరిత్రము శ్లాఘాపాత్రము" అనవుఁడు మకరందుఁడు జయంతు నుద్దేశించి "అయ్యా! ఇందు మీతప్పు లేదు. కాలవశమున భానువంటి తేజమైన నొకప్పుడు మందగించును. అంతమాత్రమున మీ యట్టివారు మందప్రజ్ఞులుగారు. నేను మానవధర్మమును జేసితినిగాని శ్లాఘింపవలసినంత ఘనకార్యమేమియుఁ జేయలేదు. హేమచంద్ర మహారాజుమాట మీరిప్పుడు తలపెట్టుటం జేసి వారి దుర్మరణము నాకు జ్ఞప్తికివచ్చి నామనంబు గాసిల్లఁజేయుచున్నది. పుంభావము దాల్చిన ధర్మదేవతగదా యతఁడు! హేమచంద్రాస్తమయమునఁ గాశ్మీరదేశము- కాశ్మీరమనవేల? ప్రపంచము, చంద్రాస్తమయమైన నిశవలె నున్నది. నా తండ్రికి నతనికి నతనికి నొక్కటే ప్రాణమని చెప్పవచ్చును. కాలగతి మరలించువా రెవ్వరు లేరు."

అని పలుకుచుండఁ గర్పూరమంజరియుఁ బెదతండ్రిం దలంచి కన్నుల నీరు నించెను. ఇతరవిషయములఁ గూర్చి కొంత ప్రసంగమైన వెనుక జయంతుఁడు తమ ప్రయాణముమాట యెత్తి "మేము మరల విదర్భాపురమునకుం బోవలయునా, హతశేషపరివారముతోఁ గాశ్మీరమునకుఁ బోవలయునా యని నా మనంబు సందేహడోలికలోఁ బడి యూఁగుచున్నది. బాలుఁడవైనను నీవు జ్ఞానమున వృద్ధుఁడవు, ఇందు నీ యాలోచన మేమో చెప్పుము" అని యడిగెను.

అంతలో నిందుమణి యందుకొని "పరిజనములో సగము కడతేరినది. ఈయల్పపరివారముతో మనము పయనము సేయఁజాలము, పైగా విజయసేనునకు గాయము తగిలినది. బాలిక మిక్కిలి భయవిహ్వలయైనది. కావున విదర్భకరిగి తగినంత పరివారము వెంటబెట్టు

కొని పోవుట మంచి" దని పలికెను. "అయ్యో! ఇంతలోనే వియోగము గలిగెనా" యని కర్పూరమంజరి తనలో ననుకొని నిట్టూర్పు విడిచెను. మల్లికా చంద్రిక లిందుమణితో నేకీభవించిరి.

అప్పుడు మకరందుఁడు వారితో నేకీభవింపక వారందఱు విను నట్లు జయంతున కిట్లనియె. అయ్యా! మీరిప్పుడు మాళవదేశపు సరిహద్దులలోనున్నారు. నాకడఁ దగినపరివారమున్నది. మీరు నా వెంట నుజ్జయినికిరండు. అచ్చటనుండి మీకుఁ గావలసినపరిజనంబునుబరికరములను నిచ్చి మాజనకుఁడు మిమ్ము సురక్షితముగాఁ గాశ్మీర దేశము జేర్పఁగలఁడు. అది కర్తవ్యము గాని వెనుకకుఁబోవుట సముచితము గాదు. ఈరేయి మీరందఱు నాలోచించుకొనుఁడు. ఇంక నేను నా శిబిరంబున కరిగెద" అదివిని కర్పూరమంజరి మల్లికం జేరఁబిలిచి చెవిలో "ఓసీ! తెక్కలికాంద్రుడు మరల వత్తురేమో? ఆయన నిందే యుండుమని చెప్పవే" యని మెల్లగఁ బలికెను. "అట్లకాక" యని మల్లిక మకరందు నచటనుండుమని ప్రార్థించెను. ఆవేడికోలు కర్పూరమంజరీముఖంబుననే వచ్చినదిగా భావించి మకరందుఁ డియ్యకొనియె. నిద్రించుటకు వారు ప్రయత్నించిరిగాని, వారికందఱకుఁ ముఖ్యముగాఁ గర్పూరమంజరికిఁ గనులుమూసినతోడనే వెఱపుఁగొలుపు కలకలకల మోటరూపములు గనబడుటం జేసియామె పలుమాఱు త్రుళ్ళిపడి లేచుచువచ్చెను. మల్లికాచంద్రికలు గుఱ్ఱుపట్టి నిద్రించిరి. తెల తెల వేగుళ్ళప్పుడు మకరందుఁడు తన సైనికులలో గొందఱ నచట నునిచి తక్కినవారితోఁ గలిసి తన నెలవున కరిగెను.

అతఁడు చనినపిదప నిందుమణియు జయంతుఁడు మున్నగు వారందఱుఁ గలిసికొని తమప్రయాణ విషయమును జర్చించి మకరందుని మాటలు సహేతువులుగా నున్నవని తలంచి యాతని వెంట నుజ్జయినికిఁ బోయి యటనుండి శ్రీనగరమునకరుగుట సముచితమని

నిశ్చయించి యావార్త నతనికెఱింగించిరి. ఈనిశ్చయము చెవినిబడిన తోడనే కర్పూరమంజరీ మకరందుల యానందము మిన్నుముట్టెను. కొంతకాలమైన మరల నన్యోన్యావలోకన సుఖము సంప్రాప్త మగుటచే వారిహృదయములు ప్రశాంతములయ్యెను. ఆ మఱునాఁడు కర్పూరమంజరీ ప్రముఖ స్త్రీజనమును, విజయసేనుని, జయంతాదులను దోడుకొని మకరందుఁడు తనపరివార మంగరక్షగా నచ్చోటు గదలి యుజ్జయినికిఁ బయనమయ్యెను.

మకరందుఁడు మార్గమధ్యమున వనవాసులు మిక్కిలి వినయంబునఁ గొనితెచ్చియిచ్చు నెమిలిపింఛియములు, పులికళాసములు, జింకకొమ్ములు, తేనెపెఱలు మొదలగు నూడిగల నాదరపూర్వకంబుగ నందుకొనుచు వారు గావించువిన్నపములు సావధానుఁడై యాలకించుచుఁ జెంచులుగావించు విపరీతనృత్యములఁ గనుంగొని యానందించుచు నాకులు, చిగురులు, పండ్లు గాయలు దిని దిగంబరులై వృక్షశాఖలు నిలయంబులుగ మహాతపశ్శాలుల విధంబున నుండెడు నానావిహంగముల సందర్శించి యక్కజంపడుచు బయనము చేసెను. కర్పూరమంజరియు నమాయిక వేషభాషలుగల చెంచుకన్నియలంజూచి యచ్చెరుపడుచు నవ్యక్తమధురములైన పులుఁగుల గానములను మెచ్చుచు నల్లజింకకొమ్ముకొనయందుఁ దనకన్నుఁ జేర్చి దురదవోవ రాచుకొను నాఁడు జింకంగని కన్నులు చరితార్థములైనవని తలంచుచు సింహవ్యాఘ్రాది క్రూరసత్వంబుల బొబ్బలువిని యదరిపడుచుఁ బకృతిసౌందర్యమంతయుఁ గన్నులం జుఱ్ఱుచు మకరందుని వెంటనరిగెను. ఎడనెడ విడిసినతావుల మాపులు వీణఁబూని యామెల నాఁగ దాని నాదములోఁ దన కంఠస్వరముగలిపి యేదికంఠమో యేది వీణానాదమో తెలియనట్లు వినువారల మేనులు గగుర్పొడుచునట్లు వారు తన్మయత్వము నొందునట్లు పాడి పరిజనంబులకును, చెలిమి

కస్త్రైలకును ముఖ్యముగా మకరందునకును మార్గశ్రమ మపనయించు చుండును. మకరందసాహచర్యంబునఁ గర్పూరమంజరికిని, గర్పూర మంజరీ సహవాసంబున మకరందునకును మార్గాయాసమున్నది కనఁ బడలేదు. ఉజ్జయిని సమీపించినకొలఁది సంతోషము కలుగుటకు మాఱుగాఁ బరస్పరవియోగము గలుగునేమో యని భయము పొడమజొచ్చెను. గమ్యస్థానము నానాఁటికి దవ్వయయిన బాగుండు నని వారికిఁ దోఁచెను. బౌద్ధుఁడైన మకరందుఁడు జీవహింసా విముఖుఁడు గావున నొక్క జీవజంతువునైనఁ జంపక శాకాహారము తోడనే కాలము గడపెను. భూతదయాపరుఁడైన యాతని నియమం బులు బాగున్నవని కర్పూరమంజరియు మాంసాహారము వర్జించెను. వ్యసనంబులలో నొక్కటియై పాపహేతు వైన వేఁట నారాజనంద నుఁడు చిన్ననాఁటం గోలె వర్జించెను. మనుష్యులకు హానిసేయు క్రూరమృగంబులం దక్క నాహారమునిమిత్తమతఁడెన్నఁడు నేజంతు వును జంపి యెఱుఁగఁడు.

ఈవిధంబున బయనంబుచేసి కతిపయదివసంబులకు వారు తమ కన్నిదినము లాతిథ్యమిచ్చి చెక్కుచెదరక తమయింటికిఁ జేర్చినఁ వనలక్ష్మియొద్ద సెలవుగైకొని యుజ్జయినీ పురలక్ష్మిం జేరిరి. కుమారుని రాకకు సుదర్శనుఁడు సంతసించి వానిం గాఁగిటఁ జేర్చి కర్పూరమంజరీ ప్రముఖ స్త్రీజనంబుల రాక విని యానందమొంది వారల సగౌర వంబుగా సాదరంబుగా సస్నేహంబుగాఁ దోడ్కొనిరమ్మని చంద్ర ప్రభా దేవినిఁ బంపెను. ఆమెయు శుద్ధాంత కాంతాజనోచితమైన గౌర వాదరంబులు నెఱపి వారలనంతఃపురము ప్రవేశింపఁజేసెను. ఇందు మణి రెండుమూఁడుదినము లైనతరువాతఁ దమ్ముఁ గాశ్మీరమంపుమని చంద్రప్రభా దేవీముఖంబున సుదర్శనునకు విన్నవించెను. అటనుండి పోవుటకుఁ గర్పూరమంజరి కిష్టములేదు. పంపుటకుఁ మకరందునికిష్టము

లేదు. అటమీఁదఁ జిత్రభాను పుత్రికకు దేహపీడయుఁ మనఃపీడయుఁ గలుగఁజొచ్చెను. పయనమనుకొన్నప్పుడెల్ల నామెకొకనాఁడు తల యేఱు, మఱియొకనాఁడు బద్ధకము, వేఱొకనాఁడునిద్రాభావము అన్య దినంబున మనోవికారము మొదలగు విపరీతచేష్టలు పొడమెను. మక రందుఁడు వైద్యుఁడగుటచేఁ బ్రతిదినమామె చేయిజూచి రోగము చిన్నదైనను బ్రశ్నలధికముగ నడిగి పేరునలేదో మందిచ్చి చికిత్స చేయుచుండును. అతఁడు సన్నిధి నున్నంతసేపు, చేయి చూచునంత సేపు, మాటలాడునంతసేపు ప్రేమరసము జిలుకు చూపులు చూచు నంతసేపు నామె కేవిధమైన బాధయుఁ గనఁబడదు. అతఁ డావల కేగినతోడనే మరల నెప్పటి నొప్పులు తలయెత్తఁ జొచ్చెను. మల్లికా చంద్రికలు మాత్రము రోగకారణ మెఱుఁగుదురు. ఇందుమతి యది తెలియక తామేగో దుర్ముహూర్తమున విదర్భాపురము వెడలిన ట్లొకమాఱు దలంచును. ఎటుకలసాని యేగో క్షుద్రదేవతను బ్రయో గించియుండునని యొకమా ఱూహించును. అడవిలో నేదోపిశాచ మావహించియుండునని యొకసారితలపోయును. ఉజ్జయినీ జలమామెకు సరిపడలేదని యింకొకసారి భావించును. ఎట్లయిన శ్రీనగరమును ద్వరగఁజేరుట మంచిదని యామె నిశ్చయించి సత్వరముతమ్ముఁ బంపుమని యామె సుదర్శనునకు వర్తమాన మంపెను. కొన్ని యేనుఁ గులు గుఱ్ఱములు రథములు పండలములు సిద్ధముచేయించి చోరులు మఱి యే క్రూరులు దుండగములు చేయుట కవకాశము లేనంతబలము నిచ్చి సుదర్శనుఁడు వారిం బంపుమని మకరందున కానతిచ్చెను. మకరందుఁ డట్లచేసెను.

కర్పూరమంజరి మనస్సు నుజ్జయినిలో మకరందుని కడఁగుదువ బెట్టి శరీరముమాత్ర పండలములోఁ జేర్చెను. మకరందుఁడు తన మనస్సు నామెకు సాయమంపి నిర్మనస్కుఁడై నిర్విణ్ణుఁడై చాల

దూరము వారిని సాగనంపి జయంతునికడ సెలవుపుచ్చుకొని విజయ సేనుని బలుకరాంపులుకరించి క్షేమవార్త నంపుచుండుమని చెప్పి స్వగృహాభిముఖుఁ డయ్యెను. నదీప్రవాహమున కెదురువోవునావవలె నతనిమేను బహుప్రయత్నమునఁ గాని ముందుకు సాఁగిపోవదయ్యె.

నాల్గవ ప్రకరణము

ఆశ మనుష్యునకు మైకము గల్గించి వివశునిఁ జేయుటలో సాక్ష్యమును మించినది. ఆశామధ్యపాయి మొదలు మఱచి తిరుగును. తనతలలో వేయిపన్నుగలు పన్నును. ఆకసంబున నందలము లెక్కును. సముద్రములో సౌధములఁ గల్పించును. మహావాయుపథమున మనస్సునుసంచరింపఁ జేయును. అదియే వానికి జీవగఱ్ఱ. ఆశయను గుఱ్ఱము నెక్కిన వాఁడు మహావేగముగఁ బదునాల్గులోకములు సంచరించి యది యెట్టకేలకు నడువలేక కూలి తన్నుఁగూల్చినపుడు భగ్నమనోరథుఁడై కూలి మరల వెనుకకుఁబోవుట కవకాశములేని యపుడు గాఢపశ్చాత్తాపమునొంది నాశనము నొందును. తాఁ జెడుటయేగాక తన సంబంధముగలవారి నందఱను జెఱుపును. ఆశ విషముకన్న దహనముకన్న దారుణమైనది. ఇదివీరికి వారికనక యెల్లవారికి వారివారియవస్థలకుం దగినట్లు లాశ్రయమై దుస్తరమగు జంబాలపటలమున దింపును.

హేమచంద్రుని మరణమునకుఁ బూర్వము కందపాణి రాజకుటుంబమునకు మిక్కిలి కూర్చువాఁడు. తనకుమారికయైన మణిమాలికను హేమచంద్రుని జ్యేష్ఠనందనుఁడగువిక్రమసేనునకిచ్చివివాహము చేయవలెనని ప్రయత్నించుచుండెను. కాని నాఁడుగుహాలో

హరిశర్మ విక్రమసేనుఁడు మందభాగ్యుఁడనియుఁ జిత్రభానుపుత్త్రుఁడగు విజయసేనుఁడు మిక్కిలి యదృష్టవంతుఁడనియుఁ జెప్పి మణిమాలికను విజయసేనునికే యిమ్మని హితోపదేశము చేసినదాదిగా దండపాణి మనస్సు నావమీఁదిసూచీయంత్ర ముత్తర దిక్కువైపు దిరిగియుండునట్లు నిరంతరముఁ జిత్రభానునివైపు దిరిగియుండెను. చిత్రభానుడు కాశ్మీరదేశాధీశ్వరుఁడు గావలెననియు, వానిసూనుఁడు విజయసేనుఁడు యువరాజు గావలెననియుఁ దనకూఁతురు మణిమాలిక మొదటయువరాజపత్నియై, పిమ్మటఁ గాశ్మీర రాజ పట్టమహిషి గావలెననియుఁ గోరి యామనోరథసిద్ధికి నేకార్యము లవశ్యములో వానిం జేయుటకును నేదారిం బోయిన గమ్యస్థానముఁ జేరవచ్చునో యాదారిం బోవుటకును నిశ్చయించుకొనెను. కాశ్మీర రాజ్యసైన్యములు వానియధీనమం దుండుటచే సేనాచక్రమునకెల్ల నియామకుఁడయిన తనగీచినగీటు దాఁటవనుదృఢవిశ్వాసమున నెల్లయెడలఁ దాను చిత్రభానునకుఁ బాసటయైయుండ నిశ్చయించుకొనెను. దండపాణితమ్ముఁ డగువజ్రపాణి చిన్న సేనాపతియై మొదటినుండియు హేమచంద్రునిఁ గొలిచి యుండియుఁ జిన్ననాఁటంగోలెఁ గర్పూరమంజరిపైఁ గన్నువైచి తన్నిమిత్తము చిత్రభానునియెడఁ బక్షపాతము గలిగి యుండెను. అహల్యాసంగమాభిలాషియై యల్లి వజ్రపాణి కోడియై మునిగృహముఁ జొచ్చినట్లు, కర్పూరమంజరీసమాగమముఁ గాంక్షించి యీవజ్రపాణి చిత్రభానునియింటికుక్కయై తిరుగుచుండెను. ఆపరమమూర్ఖుఁడు కర్పూరమంజరి తనపై వలపునిలుపుచున్నదో లేదో తెలిసికొనఁజాలక చిత్రభానునిపాదసేవ యనునోలి నిచ్చినఁ గన్య యస్వాధీనము గాక తనచేఁజిక్కునని యాటలూరుచుండెను. స్వసుఖాభిలాషియై తమ్ముఁడును, స్వపుత్రికాసుఖాభిలాషియై యన్నయును చిత్రభానునికనుసన్న మెలంగుచుండిరి. అయన్నదమ్ము

లిరువురు ప్రతిదినము రాత్రులు చిత్రభానుని నెలవున కరిగి యత నితోఁ గాశ్మీరరాజ్యసంబంధములైన ప్రసంగములు సేయుచుందురు. రంధ్రాన్వేషియైనచిత్రభానుఁడు కాశ్మీరరాజ్యమందలి లోటుపాటులు దౌర్బల్యములు వారివలనఁ దెలిసికొనుచుండును. రాజకుటుంబముపై నిష్కారణముగా వారు పూనినద్వేషాగ్నిని రుద్రభట్టు తనవాక్స మిధలచేతఁ బ్రజ్వలింపఁ జేయుచుండును. ఈయిరువురఁ దనవశవర్తు లుగాఁ జేసికొనుటతోఁ దనివినొందక చిత్రభానుఁడు శ్రీనగరవాసు లలో ముఖ్యపురుషులఁ దనకడకు రావించియు వారియిండ్లకు స్వయ ముగాఁ బోయియుఁ, బూర్వమువిన్ను హేమచంద్రుఁడు నగరము నుండి వెడలనడఁచి నప్పుడుగాని, తరువాతగాని దనయెడ నెంతమా త్రము దోసములేదనియు దురాత్ములెవ్వరో మహర్షితుల్యుఁడైన తన యన్నను సంహరించిరనియు భ్రాతృహననదోషము తనకారోపించిన దురాత్ములు తత్కార్యముచేసిన వారిదుర్గతులకే పోవుదురనియు నొక్కి వక్కాణించి యొట్లుపెట్టుకొని ప్రమాణములుచేసి వారిలోఁ గొందఱిమనస్సులు తానునిర్దోషి యని నమ్మునట్లుజేసెను. కొందఱతని మాటలు నమ్మినను మఱికొందఱు వాని బలుకులకుం దలయూఁచి యట్లె కావచ్చునని పలికి మనసు లెప్పటియట్ల నుంచుకొనిరి.

చిత్రభానుని నంతఃపురికి రానిచ్చినందునను, నడిచాలకనగర మున నుండనిచ్చి నందునను వానిచేయూలు బిడ్డలువచ్చితన్ను సందర్శిం చుటకు సమ్మతించినందునను నరవిందాదేవిమీఁద మణివర్మకుఁ బట్ట రాని కినుక పొడమెను. కొన్నిదినములతఁడు రాజ్యవ్యాపారములం జూడనేలేదు. అంతిపురి కరుగనేలేదు. ఇల్లుకదలనేలేదు. వైదేశికులగు రాయబారులకుఁ గొన్ని ముఖ్యాంశములపైఁ దగినయుత్తరములీయ లేదు. అరవిందాదేవి రాచనగరునకు రమ్మని యంతఃపురపరిచారకుల చేతను, నిగమశర్మచేతను మాధవసేనునిచేతను నెన్నోసారులు వర్త

మాన మంపినను మణివర్మ "యిదేవచ్చెద నదేవచ్చెద శరీరమస్వస్థ ముగానున్నది. పెద్దవాఁడనగుటచే మునుపటివలె రాజ్యవ్యాపారముల యందు బుద్ధి ప్రసరించుటలేదు." అని యెన్నోవంకలు చెప్పి తప్పించు కొనుచుండును. కాని యాతని మనంబున నాశ్రయించిన తిక్కతీరుగ దయ్యెను. అరవిందాదేవి యెట్టకేలకు మణివర్మ తనపై బిట్టలుక బూనినాఁడని యూహించి యొకనాఁడు విక్రమసేన హర్షవర్ధనులను బిలిచి "మీరిరువురు రథారూఢులై మణివర్మయొద్దకుఁబోయి యతని యలుకఁదీర్చి మన నగరునకుఁ గొనిరాగలరా నాయనలారా!" యని యడిగెను. "తప్పక దీసికొనివచ్చెద" మని వారుత్తరమిచ్చి మఱునాఁ డుదయమున సముచితవస్త్రాలంకారములు ధరించి, తల్లికి వందన మొనర్చి స్యందన మెక్కి నందను లిరువురు తగుపరివారము వెంటఁగొని కాశ్మీర రాజ్యవజ్రవర్మ యగు మణివర్మగృహమున కరిగిరి. వారి రాకవిని మణి వర్మ విస్మయమునొంది "అయ్యో! నా మౌఢ్యమువలన నతిసుకు మారులగు రాజకుమారు లిల్లువెడలి రావలసివచ్చెఁ గాదా" యని నొచ్చుకొని విసవిస మేడదిగి యెదురువోయి యిరువుర బిగికౌఁగిటఁ జేర్చి ముద్దులాడి చేతితోఁ దలమీఁద వీపుమీఁదనిమిరి "నాయనా! మిమ్ము నేను నకారణముగా మిక్కిలి శ్రమపెట్టితిని. ఈ మందభాగ్యుని కతమున మీరంతఃపురము వెడలవలసివచ్చెఁగదా! ఛీ! నాబ్రతుకు కాల్పనా" యని మనంబున హేమచంద్రుని దలఁచి బిగ్గరగా వాపో యిన వారు శోకింతురని శంకించి నుమ్మలిక నెమ్మనమున నడంచు కొని వారి నుచితాసనంబులఁ గూర్చుండఁబెట్టి సేమమడిగి గారవించి వచ్చినపని యేమని యడిగెను.

అడుగుటయు విక్రమసేనుఁడు మెల్లగ నిట్లనియె. "తాతగారూ! నేను రాజును మీరు మంత్రియును సంబంధముచేత నిచ్చటికి రాలేదు. మాతండ్రిగారికి మీరు పితృప్రాయులై యుండిరి. మాకు మీరె పితా

మహులు, మీరె మాతామహులు. మాకు నిజమైన పితామహుఁడు లేనే లేఁడు. మాతామహుఁడు మహేంద్రదేవుఁడు మాయమ్మను మమ్మును మాతండ్రిగారి మరణానంతరమునఁ బరామర్శచేసి తనరాజ్యమున కరిగెను. ఆపత్సముద్రమును జెలియలికట్టయై నిరోధించి శుభపరంపరల నొడఁగూర్చుటకై మిమ్ముంజూపి మాజనకుఁడు స్వర్గస్థుఁడయ్యెను. రాజ్యమునకు రాజు లేని వెలితి, మాకుఁ దండ్రి లేని వెలితి నీవలనం దీఱునని మేము పుట్టెడాస పెట్టుకొని యుంటిమి. అట్టియాస లెల్లఁ జెడిపోయినవి. నవవైధవ్యదుఃఖభారమున నడఁగిపోయిన మాయమ్మకు మీ దర్శనాభావ ముఱిసినపుండున నుప్పుపెట్టినట్లయినది. ఇంతలోనే మీరు మాపై నింత యనుగ్రహము దప్పియుందురని మేమెన్నఁడుఁ దలంపలేదు. మాధవసేనుఁ డొక్కఁడే మంత్రాలోచనముచేసి కార్యభారము నిర్వహింపఁజాలఁడు కావున నెప్పటియట్ల మీరు రాజకార్యంబుల నిర్వర్తింపవలయునని నేను వేఁడుచున్నాను. మాయమ్మ మిమ్ము రమ్మని వేఁడుచున్నది.'' అనుచుండ నంతలో హర్షవర్ధనుఁ డందుకొని ''తాతగారూ! మీరు రాకపోవుటచేత మాకోట చిన్నపోయినది. మీ రిచ్చటికి రానియెడల మేమే మీయింటిదగ్గఱ నుందుము. మమ్ము గెంటినను నిక్కడనుండి వెళ్ళము'' అని ముద్దులొలుకఁ బలికెను. అంతముందు విక్రమసేనుని పలుకులకే సగముకరఁగిన యయ్యమాత్యుని హృదయము సహజమధురములై జాలిగొలుపు హర్షవర్ధనుని పలుకులకు నీరై పోవ మణివర్మ లేచి యిద్దరిబిడ్డల మరల కౌఁగిలించుకొని ''నాచిన్నియన్నలారా! ముద్దులమూటలగు మీమాటలు వినినవాఁడు మీ చెప్పినచొప్పునఁ జేయకయుండఁగలఁడె? మీ నుడువులకుఁ గరుఁగని డెందము ఱాయిగాని డెందముకాదు. నే నెప్పటికి మీ వాఁడనేగాని యన్యుఁడనుగాను. శిథిలగృహమువలె నున్న యీముసలిమేనున నెంతకాలము ప్రాణముండునో యంతకాలము

నేను మీ క్షేమమే కోరుచుందును. ఎందుకట్టివలెనన్న యీ దేహ మక్కఱకు వచ్చినంతకాలము మీనిమిత్తమె పనిచేసి మీనిమిత్తమె వినియోగింపఁబడును. ఈదేహమే మీకవసరమైన పక్షమున నిర్విచారముగా నేను దీనిని మీకు సమర్పింతును. కాని నాఁడు నాచేసిన యుపదేశము సరకుగొనక మీతండ్రి స్వబుద్ధిచే మరణంబు దెచ్చికొనియె. నేఁడు మీతల్లి నాపలుకులు ద్రోసిపుచ్చి చిత్రభానునిఁ జేర్చినది. మీరు పసికూనలు కార్యాకార్యము లెఱుఁగరు. మీపినతండ్రి దురాత్ములలో నగ్రగణ్యుఁడు. తొలుదొల్త నితఁడు వైదర్భులం గొండఱఁ జేర్చి కుట్రపన్ని మీతండ్రిం గడతేర్పఁజూచెను. అయ్యది నేనును మాధవసేనుఁడును మహాప్రయత్నంబునఁ గనిపెట్టి లిఖితమూలకమగు సాక్ష్యముతోఁగూడ మీతండ్రి కెఱిఁగించితిమి. దానంజేసి మీయయ్య చిత్రభానుని దేశముచుండి వెడలనడఁచెను. అనంతరము హరిశర్మయను దురాత్ముని బంచి యితఁడే మీజనకుని వంచించి చంపించెను. చంపించెనన నేల? స్వహస్తములతో నితఁడే చంపెనని నానమ్మిక. నేను కన్నులారఁ జూడలేదుగాని, మీపినతండ్రి స్వభావమునుబట్టి యితఁడే స్వయముగాఁ జేసినాఁడని యనుచుంటిని. రాజభక్తిపూరితమైన మనస్సుతో నేనిట్లనుచున్నాఁడను గాన నాయాలాపములలోఁ బాపమున్నయెడల సకలపాప పరిహర్త యగు నుమాభర్త నన్ను క్షమియించుగాక! మీపినతండ్రి తేనె బూసినకత్తి. వానిమాటలనియెడి నురులలో నెట్టివారు దగుల్కొనుచుందురు. మేఁకవన్నె పులి. మాటలలోఁ దేనియలుట్టిపడుచుండును. హృదయము విషకుంభము. అట్టివానిని జేరనిచ్చుటంజేసి నామాట చెల్లదు గదాయని నాచేసిన హితోపదేశములు నిరర్థకములని నేనటవచ్చుటలేదు. అంతియేగాని మీమీఁదఁగాని మీయమ్మమీఁదఁగాని నాకు రవంతయు నలుక లేదు. నాపుత్రికకుఁ సరవిందాదేవికి

నెట్టి భేదములేదు. ఇదె యామె దర్శనము శేయ మీతోడ వచ్చుచున్నాఁడ''వని మేడమీఁదికిఁ బోయి తలపాగయు నిలువుటంగియుఁ దాల్చి బిడ్డలతోఁగలిసి రథమెక్కి రాజాంతఃపురమునకుఁ బోయి యరవిందాదేవిని సందర్శించెను. ఆదేవియు నతనికి నమస్కరించి తనవలనఁ దప్పులున్న క్షమియింపుమని ప్రార్థించి యెప్పటియట్ల రాజకార్యంబులఁ జూడుమని కోరెను. మణివర్మ విక్రమసేనునితోఁ జెప్పినట్ల యామెతోఁగూడ జెప్పి కడపట నిట్లనియె. ''తల్లీ! నాకన్న నీవు జిన్నదానవు. నీబిడ్డలు పసిపాపలు. చిత్రభానుఁడు బెబ్బులులకన్న సింగములకన్నఁ గోడెత్రాచులకన్నఁ గ్రూరుఁడు. నిజముగా నతఁడు దానవుఁడుగాని మానవుఁడుగాఁడు. అతఁడు నీకు నీబిడ్డలకు హానిసేయఁజూచు దండపాణియు వజ్రపాణియుఁ బ్రతినిశియు వానికడకుఁబోయి యిక్కడివృత్తాంతమంతయు వాని కెఱిఁగించుచున్నారనియు వారే వానికి వేగులవాండ్రుగ నున్నారనియు నాగూఢచారులవలన నే వినియుంటిని. సైన్యమంతయు వారి యధీనములో నున్నది. అందుచేత మనము జాగ్రత్తగా నుండవలయును.''అనవుడు నరవింద ''తండ్రీ! నాచేసిన పొరపాటు క్షమింపుము. నాతోడికోడలు కర్పూరమంజరియు రేపో నేఁడో వత్తురు. వారువచ్చి నన్నుఁ జూచిన తరువాత గార్యపద్ధతియంతయు నీచెప్పినచొప్పున జరుగుగాక! ఇకమీఁద నీగీచినగీటు దాటుదాననుగాను. నేను నీబిడ్డను. నాబిడ్డలు నీమనుమలు.నన్నును నాయనుంగునిసువులను నీకప్పగించి కాదె మహారాజుగారు స్వర్గస్థులైరి. అని యనివార్యమై వచ్చు కన్నీటిసోనల నాపలేక వలవల నేడ్చెను. మణివర్మయు దుఃఖము నాఁపలేక వేడి కన్నీళ్ళువిడిచి ''అమ్మా! నాశక్తివంచనలేక నేను పాటుపడియెద. అవసరమైన మీనిమిత్తము నాప్రాణములైన నర్పించెద'' నని యభయప్రదానమిచ్చి కొన్ని యితరవిషయముల మాటలాడి సెలవుగైకొని యింటికిఁబోయెను.

అయిదవ ప్రకరణము.

ప్రియజనవిరహము దుస్సహము. అది జీవితమును దుఃఖభాజనముఁ జేయును. ప్రియజనవియోగిమైనకాలమున భానుఁడు సహస్రమయూఖములతో నైజతేజమున వెలుగుచున్నను జగమంధకారమై తోఁచును. చలువలు వెదఁజల్లుచు మింటఁ జందమామ వెలయుచున్నను జంతువు దుర్భర సంతాపము నొందుచుండును. సౌఖ్యప్రదములగు వస్తువులన్నియు దుఃఖప్రదములట్లు కనఁబడును. ఉజ్జయినినుండి బైలుదేరిననాఁటఁగోలెఁ గర్పూరమంజరి సరిగా నన్నము ముట్టక, నీరుద్రావక, నిదుర వోవక, మునుపటియట్లఁ గలకలలాడు నెమ్మొగముతో సఖీజనమును బలుకరింపక విధిలేక పయనము సేయుచుండెను. ఆమె యందలమందున్నను సెజ్జమీఁదనున్నను మకరందనామస్మరణమే సేయుచుండును. పరమయోగిని కన్నులుమూసి పరమేశ్వరునిధ్యానించునట్లు మకరందుని సుందరమూర్తిని ధ్యానించుచుండును. కన్నులు మూసిమూసి తన్మయత్వముజెంది మైమఱచి తనమనోనాథుఁ డెట్టయెదుటనున్నట్లు భావించుకొని చేతులుచాఁచి బయలు గౌఁగిలించుకొనును. అత్తఱి నెవ్వరయిన దాఁపుననున్న యెడల వారింజూచి సిగ్గుపడును. తానొక్కతెయున్న హాయని నిట్టూర్పు విడుచును. ఇత్తెఱంగున నత్తలిరుఁబోఁడి మకరందుని వియోగమునకుఁజిత్తమున నుత్తలపడుచు నెట్టకే తల్లితోడను నెచ్చెలులతోడనుఁ గలసి పయనముచేసి తనువు శ్రీనగరముఁ జేర్చెను.

జయంతుఁడు తమరాక ముందుగాఁ జిత్రభానునకుఁ దెలియఁ జేసియున్నకతనమున నాతఁడు దారపుత్త్రిల నూరుబయట నెదుర్కొని సంభావించెను. జయంతుఁడు వనములో దొంగలుకొట్టుట మగంటిమి గల బంట్లుకూలుట, విజయసేనుఁడు గాయపడుట,

కర్పూరమంజరి మూర్ఛిల్లుట, మాలవ రాజనందనుఁడు సాయపడి వారిన పాయమునుండి యుద్ధరించుట, పిమ్మట నుజ్జయినిలోఁ గొంత కాల ముండుట, సుదర్శనుండాదరించి తగుపరిజనమునిచ్చి పంపుట మున్నగు సవృత్తాంతమంతయుఁ జిత్రభానునకు విన్నవించెను. అదివిని యతఁడు విస్మయంబును విషాదంబునుబొంది మకరందుని తోడ్పాటు నకును, సుదర్శనుని యాదరంబునకును దద్దయుసంతసించి వారినందఱఁ దన గుడారంబుల యందు యారేయినిలిపి వారిరాక మఱునాఁ డర విందా దేవికిఁ దెలియఁబఱచెను.

ఆదేవి వారిరాక కనుమతించుటయు నాఁటియపరాహ్ణమున నిందుమణి కర్పూరమంజరిని విజయసేనునిఁబరిచారికాజనమును వెంటఁ బెట్టుకొని రాచనగరునకుం జనియెను. కర్పూరమంజరి కంటికి మొగ సాలలు, కొలువుకూటములు కళాహీనములై కానఁబడనామె మొగము గాఢవిషాదమును దెలుపుచుండెను. దేవింజూచి యందఱు దుఃఖా క్రాంతచిత్తులైరి. కర్పూరమంజరి చిన్ననాఁటనుండియు హేమచం ద్రునిఁ దండ్రిగ నరవిందను దల్లిగ భావించి వారు కన్నబిడ్డయట్లెపెరుఁ గుటం జేసి హేమచంద్రుని మృతికిఁ దన పెదతల్లిదురవస్థకు నామె యెంతేని యుమ్మలికనుఁ జెందెను. అరవిందాదేవి తనదుఃఖమును మాటలచేతఁగాక బొటబొటఁదొరఁగు బాష్పములచేత నే వెలిబుచ్చెను. విజయసేనుఁడు విక్రమసేన హర్షవర్ధనుల నోదార్చెను. ఇందుమణి, సమయోచితవచనములఁ దోడికోడలిని సమాశ్వాసించెను. పరామర్శ ముగిసినపిదప నందఱు మరల గుడారములకుఁబోవఁబయనమగుచుండ నరవింద కర్పూరమంజరిం బిలిచి "బిడ్డా! నీవిచ్చట నిలువుము. మీ యమ్మయుఁ దక్కినవారుఁ బోయివత్తురుగాక!" యని పలికెను. ఇందుమణియుఁ గర్పూరమంజరి యచ్చటనుండుటకు సమ్మతింప నామె పెదతల్లికడ నిలిచి పోయెను. తక్కినవారందఱు గుడారములకుం

జనిరి. ఆబాలిక యంతిపురినుండుట విక్రమసేనహర్షవర్ధనులకును సంతోషకరముగా నుండెను. అరవిందాదేవి నిరంతరము భర్తృమరణదుఃఖమునఁగడుంగడు గుందుచుండుటం జేసి యామెదుఃఖాపనోదార్థము కర్పూరమంజరి పురాణములనుండియుఁ బూర్వరాజుల చరిత్రములనుండియు మనోహరములైన కథలనేర్చి పెదతల్లికిఁ జెప్పుచుండును. విక్రమసేన హర్షవర్ధనులుగూడ మిక్కిలితమకముతో వానినాలకించుచువచ్చిరి. ఒకసారి తనప్రయాణమునుగుఱించి ముచ్చటించి త్రోవలోఁ జెంచుపడతిఁ జెప్పిన యెఱుక తెలిపి యామె వారిని నవ్వించెను. వెంటనే యానడిరేయి జరిగినభిల్లుల బందెపోటుజెప్పి వారందఱికి భయముగొలుపును. ఒకతూఱి విదర్భాపుర వృత్తాంతములు, మఱియొకసారి యుజ్జయినీ విశేషములు దెలిపి వారినానందింపఁ జేయును. ఒకసారి మకరందుని సాహసౌదార్యాదిగుణములు వర్ణించి వారి వీనులవిందు సేయును. మఱియొకతూఱి హేమచంద్రుని మరణవృత్తాంతము సవిస్తరముగా నర్మదనడిగి దెలిసికొని పెదతండ్రికంత దుర్మరణము సంభవించినందుకు బిట్టువిచారించుచుండును. విద్యావతి యగుటచే నా బాలిక శోకవిహ్వలయగు నరవిందకు నప్పుడప్పుడు వేదాంత వాక్యములుచెప్పి యామెయులనాట మందగింపఁ జేయును. ఈ విధముగాఁ దనకుశక్యమైనంతవఱకుఁ బెదతల్లిమనస్సునుండి శోకాంధకారమును వెడలద్రోలుటకు సర్వప్రయత్నములఁ జేయుచుండును. అందుచే నరవిందాదేవి కర్పూరమంజరినివిడిచిపెట్టనిచ్ఛగింపదయ్యె.

విదర్భాపురమునుండి తనకుటుంబము వచ్చిన వెనుకఁ జిత్రభానుఁడు రమారమి యొకవారముదనుక సుడారములయందు బసచేసి పిమ్మట దండపాణిప్రముఖులు తననిమిత్తము మరసి సమకూర్చిన భవనమునఁ గాపురముండ వెళ్ళెను. ఆగృహము విశాలమైన యావరణము గలిగి వెనకప్రక్క చిన్నయుద్యానము గలిగిముందువిశాలమైనవాకిలి

గలిగి రమణీయములగు మేడలుమిద్దెలు గలిగి రాజబంధువులు సపరివారముగా వసియించుట కనువుగానుండెను. అందువిడిసిన రెండు మూఁడు దినములకుఁ గర్పూరమంజరి తండ్రి పిలువనంప నాథవనమును తల్లిదండ్రులను జూడఁబోయెను. మాతాపితలు బాలికను రెండుమూఁడుదినములాఁపిరి. ఆలో నరవింద కర్పూరమంజరిని రమ్మని నర్మదచేత వర్తమానమంపెను. కర్పూరమంజరిమీఁద నరవిందకు గాఢానురాగము గలుగుట చిత్రభానున కొకవిధముచేత సంతోషకరముగాను, వేఱొకవిధముచేత సంతాపకరముగాను నుండెను. తన పుత్రికచేత మణివర్మప్రముఖులమీఁద కొన్ని కానిమాటలురాణితోఁ జెప్పింపవచ్చునని వారికలయిక నతఁడిచ్చగించెను. కాని చిరసహవాసదోషమునఁ దనపుత్రికకు నరవిందమీఁదను నామె బిడ్డల మీఁదను విప్పరాని కూర్మిజనించి భవిష్యత్కాలమున బాధకరమగునేమోయని భయముగలుగఁ జొచ్చెను. అయినను నతఁడామె రాచనగరమునకుఁ బోవుట కాటంకముఁ గలిగింపలేదు, రెండవనాటిరేయి చిత్రభానుఁడు భోజనానంతరమందుఁ గూఁతురుం జేరఁబిలిచి "బిడ్డా! నీవు నీ పెదతల్లితోఁ గలిసిమెలసి కొన్నినాళ్ళనుండి యుంటివిగదా! భర్తృమరణమునుగూర్చి యామె నీతో నేదేని చెప్పినదా?" యని యడిగెను. "నర్మద నడిగి నేను పెదవాయనగారి దుర్మరణవృత్తాంతముఁ దెలిసికొంటిని. అదియున్నదున్నట్లు జెప్పెనుగాని యెవరిమీఁదను నిందారోపణముఁ జేయలేదు. నర్మద చెప్పినంతసేపు నా పెదతల్లినోటమాట రాలేదు. కంటినుండి ముత్యాలచేరులు నేలకువ్రేలగట్టినట్లు బాష్పధారలు దొరఁగెను. ఇదియే జరిగినవృత్తాంతము" అనికూఁతురుతండ్రి కుత్తరము చెప్పెను. "అంతేనా? ఎవ్వరిమీఁద ననుమాన మున్నట్లు చెప్పలేదా? సరే! వాండ్రకు నిజము తెలియక పోవచ్చును. నిజము నిలుకడమీఁద దెలియకపోదు."

అనిపలికి కొంతసేపూరకుండి యేదో యాలోచించుచున్నట్లు పైకిఁ జూచి వెండియుఁ జిత్రభానుఁ డిట్లనియె. "బిడ్డా! అరవిందాదేవికడ నీవు తఱచుగానుందువుగనుక నామె కొక్క రహస్యము జెప్పవలయునని కోరుచున్నాఁడను. అది యేమందువేని సావధానవై వినుము. మా యన్న నట్టిదారుణమరణముపాలు చేసినవాఁడు పయోముఖవిషకుంభ మని చెప్పఁదగిన మణివర్మ. వాఁడమాత్యరూపముననున్న ఘోర రాక్షసుఁడు; మిత్రరూపముననున్న కాలభుజంగము. అమృతాకృతితో నున్న కాలకూటవిషము. బిడ్డా! యీపలుకులువిని నీవు తెలతెల్లఁ బోయెదవేమి? వాఁడిట్టిపని చేయలేఁడనియా నీయభిప్రాయము. నీవ క్కజంపడనక్కఱలేదు. అమాత్యులహృదయములు విషపాత్రములు. అమాత్యులు చేయనిపాపములు లోకములో లేవు. నరులప్రాణ ములఁదీయుట నల్లులఁజంపుటగానైన నుండదు. పేనుకుక్కినమాత్ర మైన వారికుండదు. స్వలాభపరాయణులై వారు కావించు దుండగ ములఁ దన దివ్యహస్తములో- దివ్యలేఖినియె- దివ్యపత్రములమీఁద- నా చిత్రగుప్తుఁడే వ్రాయవలయుఁగాని మఱియెవ్వరు లిఖింపఁజాలరు. క్రూరచిత్తుఁడైన యీయమాత్యుఁడు తనను నమ్మిన భృత్యుఁడుగా మిత్రుఁడుగా మనసారనమ్మిన మాయన్న కీసయంతముఁ దెచ్చుకొ నెను. ఇట్టిదురాత్ముని నమ్ముట ప్రక్కలోఁ బాము పెట్టుకొని పవ్వళిం చుటయని యెఱుఁగఁడు. బిడ్డా! ఆతఁడు నన్ను దేశమునుండి వెడలనడఁచుట మహాపాతకుఁడైనయీసచివాధముని మాటలనమ్మియే లేకున్న మాయన్న నన్నట్లు సేయునే?" యని బాష్పరోధమునఁ దన కంఠము గద్గదస్వరయుక్తముగా మాటలాడలేక కన్నీరువిడిచెను. కర్పూరమంజరియు దుఃఖపూరితయై కన్నీరుదుడిచికొని "తండ్రీ! విచారింపకు. నీసౌభ్రాత్రము నిరుపమానమైనది. కాలవశమున మన స్సులలో రవరవలు పొడముటయు దానికిందగినట్లు హేమచంద్రునిఁ

జంపుటకుఁ గొన్నికుట్రలు బైలువెడలుటయు నప్పుడు సంభవించెను. ఎందుచేతనో నీపై నప్పు డనుమానముగలుగ నతఁ డట్లుచేసెను. ఆయనమరణమునకు విచారించినఁ గార్యమేమి? నీయభిమత మేమో చెప్పుము. శక్యమైనపక్షమునఁ జేసెద''నని హెచ్చరించుటయుఁజిత్ర భానుఁడు మరల నిట్లు చెప్పఁదొడఁగెను. "అమ్మా! మణివర్మ హేమ చంద్రునిఁ జపించినట్లు నీవరవిందాదేవి మనసునకు నచ్చునట్టు గట్టిగఁ జెప్పవలయును. మణివర్మయన్న మాఁమన్న యట్ల నామెయుఁబడి చచ్చును. అతఁడే తన తండ్రిగా గురువుగా క్షేమంకరుఁడుగా నమ్మి తనప్రాణము కొడుకులప్రాణములు వానిచేతం బెట్టినది. అందుచేత నామె కతనిపై ద్వేషముపలుగునట్లు నీవు నొక్కి పలుకవలెను. మాయన్న యున్నప్పుడే మణివర్మ కాశ్మీర రాజ్యచక్రమును నిచ్ఛ వచ్చినట్లు ద్రిప్పినాఁడు. ఇప్పుడతఁడే రాజు వానిమాట నిరంకుశమై చెల్లుచున్నది. మాయన్న పేరుమీఁదుగా నాయిద్దరిబిడ్డలనైన వాఁడు బ్రతుకనిచ్చునని నాకునమ్మిక లేదు. ఆపసికూనలఁగూడ వాఁడెప్పు డో తినపొట్టంబెట్టుకొనును. కాబట్టిమణివర్మపై వ్రాలియున్న నీగా మె మనసునునీవుయథాస్థితిని మరలింపవలెను. నీవువిద్యావతివి. మాటలయందును జాణవు వాక్పటుత్వముగలదు. హేతుకల్పన చక్కఁగాఁ జేయఁగలవు. పూర్వోత్తరవిరోధము గలుగకుండ సందర్భ శుద్ధి చెడకుండ నెట్లుచెప్పవలెనో యట్లుచెప్పి కాశ్మీరరాజ్యమును రాజకుటుంబమును రక్షించునట్టి మార్గము చూడుము. అట్లయిన నీవు కష్టపరంపరలను వేఁడిగాడ్పులచే శోషిల్లుచున్న మన వంశవృక్షము నకు నీరుపోసిరక్షించినదానవగుదువు. నేనేమో చెప్పితినవక చక్కఁగా నాలోచించి కర్తవ్యముచేయుము. నాయన్న కుమారులు నాయన్న రాజ్యము చక్కఁగానుండుటయే నాకోరిక."

అప్పలుకులు విని కర్పూరమంజరి విస్మయమునొంది క్షణ మాలోచించి తండ్రి కిట్లనియె. "నాయనా! కాశ్మీర రాజ్యమునకు మన విక్రమసేనహర్షవర్ధనులకు క్షేమముగలుగుట నాకుఁ బరమ సంతోషము. కాని యెవరుచెప్పినను మణివర్మ మిక్కిలి యోగ్యుఁ డనియు, రాజకుటుంబమునకు హితకారియనియు నాత్మలాభపరాయ ణుఁడు గాఁడనియుఁ జెప్పుచున్నారు. నీమాటలుచూడ నతనివంటి మలినవర్తనుఁడు లేఁడని స్పష్టమగుచున్నది. పెదనాయనకు మణివర్మ యపకారము సేయుచుండ నేఁ జూడలేదు. ఇంతవఱకు వినలేదు. అట్టి సజ్జనునిపై రాజద్రోహము, రాజహత్య మొదలగు మహాదోష ముల నారోపించి నేనేవిధముగా నరవిందాదేవితోఁ జెప్పఁగలను? ఈ పని చేయుటకు నా యంతరాత్మ యొప్పుకొనుటలేదు. ఒక సద్గుణ వంతుని జెఱచుట మహాపాతకహేతువు. కావున నన్ను నీవీ విషయ మున క్షమింపవలయు. మణివర్మయే హేమచంద్రహంతకుఁడని నీవు చెప్పితివి కాని ప్రపంచమున నెట్టి దుర్భాగ్యుకయున్నదో యెఱుఁగు దువా? మాళవరాజాంతఃపురముననే నున్నకాలమున నే నిద్దఱు ముగ్గురివలన నీవే నీయన్నను జంపితివని—చంపించితివని వింటిని. అప్పలుకులు నేను నమ్మదునా? కర్పూరమంజరిని గన్నతండ్రిచేతులు భ్రాతృరక్తము తోడ నరుణంబులగునే! నీపై నపవాదము నెట్లు విశ్వసింపనో మణివర్మపై నారోపణలుగూడ నట్లె విశ్వసింపను. కావున నీపని నాతలపైఁ బెట్టకుము. అది నాచేఁతఁగానిపని." అని బాలిక యూరకుండఁ జిత్రభానుఁడు "పాపీ! బిడ్డా! నీవాపని జేయ లేకున్నను నాపై లోకులు మోఁపిన యపవాదము నీవు నమ్మలేదు. అదియే నాకుఁ బరమసంతోషము. అదియే పదివేలు. ఇంకఁ బండు కొనుము" అని యామెం బంపి తానును శయనాగారమునకుఁ బోయెను.

ఆఱవ ప్రకరణము

మణివర్మ యరవిందాదేవి యాజ్ఞఁ బాలించి యెప్పటి యట్ల రాజ్యవ్యాపారములఁ జూచుచుండెను గాని యాతనిమనస్సు యథాస్థితిని బ్రాపింపలేదు. చిత్రభానుఁడు శ్రీనగరమునకు వచ్చుటే యతని కిష్టములేదు. వచ్చినను నతఁ డచ్చట నిలువఁ జేసియుండుట కిష్టము. ఆతని కుటుంబము వచ్చు టంతకన్న నతనికి సరిపడలేదు. కుటుంబమువచ్చి రాజపత్నిని బరామర్శ చేసినపిదప సకుటుంబముగాఁ దా నూరువిడిచిపోవునట్లు దేవియెదుట వాగ్దానముఁ జేసి చేసినట్లు వీడు విడిచిపోకపోవుటగాక, మీఁదుమిక్కిలి యచ్చట స్థిరవాసము చేయఁ దలంచి యొక విశాలభవనము నాక్రమించుకొనుట వానికి మిక్కిలి కష్టముగా నుండెను. అన్నిటికంటె నెక్కువగఁ జిత్రభాను పుత్రికయైన కర్పూరమంజరి నిరంతరము దేవికి సన్నిధానవర్తినియైయుండుట లోకజ్ఞుఁడైన యతని కనుమానము హెచ్చించుచుండెను. అందుచేత నతఁ డేమిచేయుటకుఁ దోఁచక మూఢునియట్లు, కార్యసిద్ధి నిర్ణయింపలేకయుండెను. ఒకసారి కాశ్మీర రాజ్యముతో సంబంధమువదలుకొనుట యుక్తమని యతఁడు తలఁచును; వెంటనే మృతుఁడైన హేమచంద్రుని దలఁచియు లేఁబ్రాయముననున్న రాజకుమారులందలఁచియు బిడ్డవలెఁ దన్నునమ్మిన యరవిందం దలఁచియు నాయాలోచన మంతము నొందించును. ఒకతూరి చిత్రభానుని నూరువిడిచి తత్క్షణమె పొమ్మని సందేశ మంపవలయునని తలపోయును. రాణి యానలేక యట్లుచేసిన నామె యెట్లుగాఁదలంచునో యని శంకించును. తనవేగుల వాండ్రెంత తెలివిగలవాండ్రైనను లోలోపల నేమి జరుగుచున్నదో వారు తెలియఁజేయఁ జాలరుగదా! ఏమి జరుగుచున్నదో? ఏమి పన్నగడలు చిత్రభానుఁడు పన్నుచున్నాఁడో యని భయ

పడుచుండును. ఈవిధముగాఁ గొన్నిదినములతఁడు తలపోసి తల పోసి యరవిందాదేవికడకుఁ బోయి యామెతో నీవిషయమై ముచ్చ టింపఁదలఁచి విక్రమసేనునిం బిలిచి "కర్పూరమంజరి లేనిసమయమున మీయమ్మతోడను నీతోడను నే నించుక ప్రసంగింపవలతు. ఇట్లు మీ యమ్మతోఁ జెప్పుము" అని పలుక నక్కుమారుఁడు వల్లెయని తల్లి కడకరిగి యమ్మాట చెప్పెను. ఆమెయు మఱునాఁ డేంకాతమునఁ బ్రసంగించుటకుఁ దగినసమయము స్థలము నిర్దేశించి యమాత్యుని రావించెను. మణివర్మ ముడుతలువడిన మొగము ముగ్గుబుట్టవలె నెఱ సినతల, మాంసహీనములై వ్రేలుచర్మములు, వయోభారమునకుఁ దోడు స్వయముగాఁ బైనవైచుకొనిన కార్యభారముచేతఁ గొంచెము వంగిన నడుము, దేవికిఁ గుమారునకు జాలిగొలుప వారిని సమీపించి సన్మానితుఁడై పీఠముపైఁ గూర్చుండి మెల్లగ నిట్లనెను. "అమ్మా! చిర కాలజీవనము కష్టపరంపరాదర్శనముకొఱకే. కానిచో నట్టి నరపాల చంద్రుని హేమచంద్రుని చేతులుమీఁదుగా నేనుబోక జీవచ్ఛవమునై యుందునా? చిత్రభానుని రాకనుగూర్చి నేను మీతో నీవఱకే మనవి చేసికొనియుంటి. అతఁడు వచ్చుటే ముప్పు. రానిచ్చుట తప్పు. చేసిన తప్పు దిద్దుకొనుట యొప్పు. తనకుటుంబము మిమ్ముఁ బరామర్శ చేసిన తరువాతఁ దా నీయూరు విడిచిపోవునట్లు మాటయిచ్చెను గదా! ఇప్పుడు చేసినపనిచూడుఁడు. ఇచ్చట శాశ్వతనివాసము చేయఁదలంచి కాఁబోలు విశాలభవనము నాక్రమించుకొనియె. ఏకువలెవచ్చి మేకు వలె బిగుసుకొనెనన్న సామెత నిజమైనది. మీమనసులో మీకెట్లు న్నదోగాని యతఁ డిక్కడనుండుటచే నేను ముండ్లమీఁదనున్నట్లు న్నాను. నామనస్సు నిప్పుల బొరలుచున్నది. జ్వరములేకయే నేను తాపపడుచున్నాను. రోగములేకయే నాకాహారద్వేషము గలిగినది. తెగులులేకయే నిద్రాశూన్యములైన రాత్రులు గడపుచున్నాను.

చిత్రభానుఁడున్నచోట మనముండుట త్రాఁచుపామున్న యింట మెలఁగుట. వాని నుండనిచ్చుట కొంగున నిప్పు మూటఁగట్టుకొనుట. ఈవిషయములన్నియు నేను మున్నె సూచించియుంటి. విశేషించి కర్పూరమంజరి మిమ్మజస్రము పాయక తోడునీడవలెనున్నది. ఆమెపై మీకెంత మక్కువయున్నను నామె శత్రుని బిడ్డగదా. ఆమెకు మీపై నెంత యనురాగమున్నను మీరు తల్లిదండ్రుల తరువాతివారు గదా! మీగుట్టుమట్టు లామెతండ్రి కెఱిఁగింపకుండునా? ఎంతమంచిదైనను బాలిక మీఁకు వారికి వైరమువచ్చినప్పుడు తండ్రిపక్షము ముండక మీపక్షముండునా? అతఁడేమి దుస్తంత్రములఁ బన్నుచున్నవాఁడో మన మెఱుఁగము. నావేగులవాండ్రు విహంగకుఁడు కైరవుఁడు మున్నగువారు పలుతెఱంగుల వారిజాడలఁ దీయ యత్నించుచున్నారు. కాని పైపైవార్తలేగాని లోపలిగుట్టు తెలియుట లేదు. కావున నోతల్లీ! వాని నిచ్చటినుండి వెడలనడఁచుట మంచిది. ఆదికాలమున మన మహారాజుగారే వానిని దేశభ్రష్టుని జేసిరి. కావున నింద మన మీఁదనుండదు. వెనుకటి మహారాజు చేసిన పనియే మన మిప్పుడు చేయుచున్నాము. బలవత్తరములైన పూర్వకారణములే యిప్పుడు నున్నవి. అంతకన్న నెక్కుడు కారణములుం గలవు. కావున వానిని వెడలనడఁచుటకు నాకు సెలవిమ్ము. నీ ముదలయయ్యెనేని వానింబంపివేయుటకు యత్నించెద. నగరమువిడిచిపోవునో లేదో నాకును సందియమే. అందుచేత నే యత్నించెదనంటిని. మీఁదమీచిత్తము" అని ప్రభుహితాభిలాషియగు వృద్ధామాత్యుఁడు వచియింప నద్దేవి విక్రమసేనునివంకఁ జూచెను. విక్రమసేనుఁడు తల్లివైపు జూచెను.

"అమ్మా! తల్లికొడుకు లొండొరుల మొగములు చూచుకొని తెల్లఁబోవనేల? ఏదోకార్యపద్ధతి సత్వరము నిశ్చయింపుఁడు" అని యువామాత్యుఁడు హెచ్చరింప రాజమాత యిట్లనియె. "తండ్రీ! నీపలు

కులు వేదవాక్యంబులుం బోలె సత్యంబులు. మా కెల్ల చుట్టములునీవ! నీవంటి క్షేమంకరుఁడు మాకు వేయిజన్మములు దపస్సుచేసినను లభింపఁడు. నీయిష్టమెట్లో యట్లె నేను చేసెద. కాని యొక్కవిషయ మాలోచింపుఁడు. మామఱఁది నిప్పు దూరువిడిచిపొమ్మనుట నిద్రించుచున్న బెబ్బులిని మేల్కొలుపుట యగునేమో! పండుకొన్న త్రాచుబామును పడగవిప్పి యాడించుటయగునేమో! రాజుచున్న నిప్పు మండించుట యగునేమో! అఁడుదానను రాజనీతి నెఱుఁగనిదానను. అందుచేత నా మాటలే పాటిగాఁ గొనక నీవును మాధనసేనుఁడును రాజభక్తియుక్తులగు దక్కినని యోగులతోడను గార్యాలోచనముసలిపి యథోచితముగావర్తింపుము. కర్పూరమంజరి చిత్రభానుని పుత్రికయైననుసుగుణరాశి, ఇక్కడమాటలక్కడ నక్కడిమాట లిక్కడఁ జెప్పునదిగాదు. ఎక్కడిమాటలక్కడనే జీర్ణము చేసికొను స్వభావము దానిది. అయినను రాజ్యపరిరక్షణార్థము దానింగూడ నేఁ బరిత్యజించెద.అనవుడు మణివర్మ విక్రమసేనునివంక దిరిగి "కుమారా! సాలగ్రామము చిన్నదైనను బెద్దదైనను బూజ్యమె. రాజుబాలుఁడైనను వృద్ధుడైనను మాననీయుఁడె. కావున నీయభిమతముఁజెప్పుమని యడిగెను. అడుగుటయు నతఁడు "అయ్యా! కిరీటభారమే నేను తలఁదాల్చితినిగాని రాజ్యభారము మోయువాఁడవు నీవు. దండపాణిప్రముఖులతోఁగూఁడ నీవాలోచింపుము. మనకు వారిపై ననుమానమున్నట్లు మనవర్తనముచే వారికిఁ దెలియనీయఁగూడదు. అందఱితోపాటు వారింగూడ గౌరవపురస్సరముగాఁ బిలిచి కార్యనిశ్చయముచేయుట కర్తవ్యము. మీశాస్త్రజ్ఞానము మీలోకానుభవము, మీబుద్ధివిశేషము నాశ్రయించి మీ యిచ్చవచ్చిన తెఱంగున వర్తింపుఁడు. మీకుపదేశముజేయుటకు నేనెవ్వఁడనని వినయమున బదులుచెప్పెను. అప్పలుకులు విని యామాత్యాగ్రణి "సరే

మీరాయిరువురు నాకుందోఁచినపోల్కి సేయుమని సెప్పిరిగదా. మాధవసేనుఁడు సర్వకార్యములందును నన్ననుసరించును. దండపాణిని వజ్రపాణినిగూడఁ బిలువనంపి వారిమతము దెలిసికొనియెద. వారు నాతో నేకీభవింపకపోయినను నేను చిత్రభానుని బురమువిడిచిపోవలసి నదని చెప్పెద. ఏలయన, వారి రాజభక్తినిగూర్చి నాకనుమానము గలదు. వారయినను జాటుచాటున వానికిసాయము చేయవలసిన దేగాని సాహసించి బహిరంగముగా మనకు వ్యతిరేకముగా నుండఁజాలరు. అట్లు సేయుటకుఁగూడ వారికిఁ దగిన హేతువులు లేవు. ఇప్పటికి నేను సెలవుగైకొని పోయివచ్చెద'' నని స్వగృహమునకుఁబోయెను.

ఆరేయి మాణివర్మ దండపాణిని వజ్రపాణినిఁ దన గృహంబునకుఁ బిలువనంపి మొదటినుండియుఁ జిత్రభానునకు హేమచంద్రునకు గలసంబంధ ముపన్యసించి యతఁడు భాతృహంతయని లోకమునం గలవాడుకల నెత్తి నగరమున నతనినుంచుట కర్తవ్యమగునా కాదా యనుమాట గట్టిగా విచారించవలసిన దని వారితోఁ జెప్పెను. అప్పలుకులు వారికి శ్రోత్రపేయములుగా లేవు. మనసులోఁ జిత్రభానుని యెడఁ బ్రేమగలిగియుండుటఁ జేసి వారిరువురును నెటు చెప్పుటకు వీలు లేక కొంతసేపు మనసులలో వితర్కించుకొనిన పిదప దండపాణి యిట్లనియె. ''ఆర్యా! చిత్రభానునిమీఁద నలుకవొడమి హేమచంద్ర మహారాజు వానిని దేశమునుండి వెడలనడఁచిన మాట నిజమే. అది యప్పొరపాటని మేము తలంచుచుంటిమి. చిత్రభానుఁడు భ్రాతృహంత యనుమాట మేము నమ్మఁజాలము మేమేకాదు బుద్ధిమంతు లెవ్వరు నమ్మరు. అన్ననిమిత్త మతఁ డెంతో యడలుచున్నాఁడని వినుచున్నాము. అది కపటనాటకముగాక నిక్కమైనదుఃఖమే యని మా తలంపు. అతఁడిక్కడనున్నందువలన మనకేమియుపకారముగలుగును? అతనిం గదుపుట కందిరీఁగలతుట్టం జెదరగొట్టుట. భోఁగాములు చక్కఁగ

విచారించి మీయిచ్చవచ్చిన తెఱంగునఁ జేయుఁడు. ఈకార్యము నాకు మాత్ర మిష్టములేదు." అదివిని మణివర్మ "వజ్రపాణీ! నీయభిప్రాయ మేమి?" యని యడుగ వజ్రపాణి "అయ్యా! అన్నదమ్ములకు నేమి కారణము చేతనో మనస్పర్థలు కలిగినవి. వెనుకటి మహారాజు, విష యము సరిగ విమర్శించియో విమర్శింపకయో తమ్ముని వెడలఁ గొట్టెను. హేమచంద్రునితో వైరములంతయుందినవి. చిత్రభానుఁడు వెనుకటివైరము మఱచి మరల స్వదేశమునకు వచ్చినాఁడు. అతని జోలికిఁబోవుట యుక్తముగాదు. అదిగాక యతఁ డేమి చేయఁగలఁడు! ధనమా, రాజ్యమా, యధికారమా, సైన్యమా, యతనిచేత నేమి గలదు? కావున మనమతని నుపేక్షించియుండుట సముచితమని నా మతము."

అప్పలుకులు విని వారిమనస్సులోనున్న భావము సంపూర్ణ ముగ గ్రహించి యంతకన్న వారితో నెక్కువ ముచ్చటించుట యప్రస్తుతమని యప్పటికి వారికి సెలవిచ్చిపంపి మణివర్మ తనమనస్సులో నిట్లు వితర్కించెను. "అన్నన్నా! రాజ్యతంత్రనిర్వహణము కడుం గడుఁ గష్టముగదా! ఇదియనేకాపదల కాస్పదము. ప్రమాదము మానవ మాత్రునకు సహజము. అది మంత్రిపట్లవచ్చినా దానిని లోకము సహింపదు; రాజుసహింపఁడు. తల పెట్టినకార్యము శుభముగాఁ బరిణ మించెనా యామంత్రి యభినవబృహస్పతియనియుఁ గలియుగ శుక్రు డనియు, యుగంధరుఁడనియుఁ బ్రకృతిజనులు వేయితెఱంగుల సన్ను తింతురు. దైవవశమున నక్కార్యము మంత్రిలోపములేకయే చెడెనా వాఁడు పనికిమాలినవాఁడు, దండనార్హుఁడు నని యానోళ్ళతోనె నిం దింతురు. ప్రజాభిప్రాయము బహుముఖములు గలరాక్షసి, కార్య ధురంధరులపట్ల లోపమువచ్చెనా యది వారిం దప్పక మ్రింగివేయును. రాజుల చిత్తవృత్తులు నట్టివే. అందు రాజు పిన్నవాఁడైనప్పుడు

మంత్రిపాట్లు చెప్పవలసినదే లేదు. ఇక్కడ రాజు చిన్నవాఁడు. సంరక్షకురాలు తల్లి; యీఁడుని చేయవలసినకార్య మతికష్టమైనది. చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁడు మిత్రు లెవరో శత్రు లెవరో తెలియకుండ నున్నది. దైవమా! ఏమి తెలుపు! ఇట్టి సందిగ్ధసమయ మెన్నఁడు రాలేదు. ఏమైన నగుఁగాక! దైవముమీఁద భారమువైచి రాజకుటుంబక్షేమము విచారించి నాబుద్ధికి నచ్చినట్లు జేసెద. ప్రయత్నమే మనుష్యునివంతు; కార్యసిద్ధి దైవాయత్తము'' అని నిశ్చయించి ద్వితీయమంత్రి యగుమాధవసేనుని మఱునాఁడు బిలువనంపి యాతనితోననేక రాజకార్యములను ముచ్చటించిచిత్రభానునిప్రసంగముదెచ్చి నగరమునుంచి బహిష్కరించుట కర్తవ్యమా యకర్తవ్యమా యని యడిగెను. మాధవసేనుఁడును మణివర్మ యట్ల యఖండ రాజభక్తియుక్తుఁడు. అతనియట్లె చిత్రభానునియెడ విశ్వాసము లేనివాఁడు. అయినను మణివర్మ యట్లు కార్యనిశ్చయము సత్వరముగా నతఁడు చేయఁజాలఁడు. నోటనుండిమాట వెడలకమునుపు దాని నతఁ డెన్నిసారులో తూఁచును. భావమున నెన్నిసారులో దానిని మర్దనచేయును. అందుచేత నతఁడు చాలసేపాలోచనముచేసి కొట్టకొన కిట్లనియె "అన్నివిధములఁ జిత్రభానుఁడు శ్రీనగరమునకు దూరమున నుండవలసినవాఁడె. కాని, మనమింత తొందరపడవలసినయవసర మేమి? సాహసించినపక్షమున నేమిప్రమాదము సంభవించునో! వానిచర్యలు మఱికొంతకాలము కనిపెట్టి యవి విపరీతములయినపక్షమున మనమప్పుడు వానిని బహిష్కరింపఁగూడదా!'' అనుచుండ నతనిమాట కడ్డమువోయి మణివర్మ "ఎంతకాలము మనము నిదానించుట? తలుపులు గొళ్ళెము పెట్టి వాఁడు నాలుగుచూరు లంటించినపిదప మన మేమి చేయఁగలము? వాఁడిచ్చట దుర్మంత్రవృక్షమును బెంపఁదలంచి మొక్కనాటినాఁడు. దోహదము సేయుచున్నాఁడని నా నమ్మిక.

అది ప్రాణాపాయకరమైనదగునప్పుడు మన మేమిచేయఁగలము? మొలకయయినప్పుడె పెల్లగించుట కర్తవ్యము. కావున నామాట వినుము. నీవుపోయి చిత్రభానునిం గలసి సకుటుంబముగా నతఁడు శ్రీనగరము విడిచి వెళ్ళవలసినట్లు రాజశాసనమైనదని చెప్పుము. నేను పిన్నరాజుతోను రాణితోను మాటలాడితిని. ఎప్పుడో యొకప్పుడు మన మీకార్యము జేయవలసినవారమె. పెండలకడఁ జేయుట మంచిది'' అని కఠినస్వరముతోఁ బలికెను. ''మీచిత్తమువచ్చినట్లు జేసెద. ఈసాయంకాలమె పోయి చిత్రభానున కీవార్త నెఱింగించెద. ఆతని ప్రత్యుత్తరము మీకు నేఁ జెప్పెద''నని మాధవసేనుఁడు చెప్పి సెలవుగైకొని పోయెను.

ఏడవ ప్రకరణము

మణిసర్మ సందేశము మాధవసేనుఁ డెఱిఁగింపకముందె దండపాణి వజ్రపాణులవలన ముందుగఁ జిత్రభానుఁ డెఱింగి, సందేశము కడకునచ్చినప్పు డేమిచెప్పనొప్పునాయని విచారించుచుండెను. వార్తాహరు లెవ్వరైయుండిరో యతఁడు ముందుగ నూహింపలేకపోయెను గాని మఱునాఁడు మాధవసేనుఁడు వచ్చినతోడనే యతఁ డాసందేశ మెఱిఁగించుటకె వచ్చియుండునని నిశ్చయించియు యథోచితగౌరవమున నామంత్రి నెదుర్కొని యర్హాసనమునఁ గూర్చుండఁబెట్టి సేమ మరసి రాజకుటుంబముయొక్క క్షేమమునడిగి పిమ్మట నక్కడకు వానిం దోడితెచ్చిన పనియేమో తెలియఁ జేయుఁడగునని పలికెను. మాధవ సేనుఁడు చేతులునలుపుకొనుచు మెల్లమెల్లగా నేదో చెప్పఁబూనెను,

"అయ్యా! మీరు నేఁడేదో యుత్కృష్ట కార్యముమీఁద వచ్చినట్లు గనఁబడుచున్నారు. నసుగుచు మాటలాడవలసిన పనిలేదు. చెప్పఁదలఁచినమాట లేవో స్పష్టముగా గంభీరముగాఁ బలుకుఁడు. నావల్ల మీకెట్టిభయము లేదు. మనము ప్రాఁతచుట్టఱికముగాని మొగమొటిక లేనివారము గాము" అని చిత్రభానుఁడు కంఠమెత్తి పలికెను. "అయ్యా! నసుగుచు నగము చెప్పఁదలఁచుకొని రాలేదు. చెప్పవలసిన దేమో సంపూర్ణముగాఁ జెప్పిపోయెద" నని మాధవసేనుఁడు చెప్పెను. "అదే నాకు కావలసిన" దని చిత్రభానుఁడు మరల నొక్కి పలికెను. అప్పుడు మాధవసేనుఁ డిట్లనియె—"మనము చిరకాల మిత్రులము. అయినను స్వధర్మనిర్వహణము మానవునకు విధిగావున నేనప్రియము చెప్పుటకు వచ్చితిని. ఇందుకు మీరు నన్ను క్షమింతురు గాక! మీ యన్నగారు మిమ్ముఁ గొన్ని కారణములచేత వెడల నడఁచిరిగదా! ఆక్షణమే మీరు దేశమును విడిచిపోయిరి. ఇప్పుడు రాజకుటుంబమును బరామర్శచేయుటకై వచ్చిరిగదా! మీరు మీ కుటుంబము బంధుప్రేమ ప్రేరితులై వచ్చుట, విపత్సముద్రమున మునిఁగిన రాజపత్నిని రాజపుత్రులను సమాశ్వాసించుట యుక్తమె. మొట్టమొదట మీరు మీకుటుంబము వచ్చి పరామర్శించినపిదప నగరము విడిచిపోవునట్లు మాటనిచ్చిరి. మీమాట మీరు నిలుపుకొనుఁడు. మీరు మహారాజపుత్రులు. మహారాజసోదరులు. చంద్రవంశసంజాతులు. మీపూర్వులందఱు నాడితప్పనివారు. కావున మాటతప్పక సకుటుంబముగా మీరు శ్రీనగరము విడిచి మూఁడు దినములలో వెడలవలయు. ఇది రాజశాసనము. రాజమాతృశాసనము. మీ రొకరిని శాసించువారే గాని రొకరిచే శాసింపఁబడు వారు కారు. మీ భృత్యులమైన మేము మీకుఁ జెప్పవలసినవారము గాము. మీయన్నగారున్నప్పుడు మీరు వచ్చి వారియనుమతముననో వారిశాసనముఁ బ్రతిఘటించిరో యెక్కడ

నుండిన నది శ్లాఘ్యమైయుండును. వారి మరణానంతరమున సమాశ్వాసము పేరుఁబెట్టి వచ్చి భర్తృవియోగముచేత మాలఁబడియున్న రాణిని లోకానుభవము లేని పిన్నరాజును లోకువచేసి యిచ్చట నుండుట భావ్యముగాదు. ఇదియే నామనవి." అని సంపూర్ణముగా నతఁడు చెప్పఁదలఁచిన దంతయుఁజెప్పి ముగింపకమునుపే చిత్రభానుని మొగము గీచిన కందనుంపవలె నెఱ్ఱపడెను. కనుబొమలు ముడిపడెను. కన్గొనలు గురివిందగింజల లెఱ్ఱపడెను. పెదవు లదరఁ జొచ్చెను. మేను గగుర్పొడిచెను. ఆగ్రహము వానిని సంపూర్ణముగ నావేశించి వశపఱచుకొనెను. అపుడు వాని నోటనుండి యుచ్చైస్స్వరముతో నీ క్రిందిమాటలు వెడలెను.

"మాధవసేనుఁడా! నీవును నీకన్న నీచుఁడైన మణివర్మయు మాయన్నతో నామీఁద గాలి ప్రోఁగుఁజేసి నేరములు కల్పించి కొండెములు చెప్పి మాయిరువుర మైత్రిఁజెఱిపి పరస్పర ద్వేషములు గలిగించిరి. మాయలమాఁటలగు మీమాటలు వేదాక్షరములుగా నమ్మి వెంగలియగు మాయన్న నన్ను దేశమునుండి పొమ్మనెను. అతఁడు పెద్దవాఁడగుటచేతను, నేను మంచివాఁడనగుటచేతను, వాని నిర్ణయ మధర్మగర్భితమైనను వానియందలి గౌరవముచేత వానియాన శిరసావహించి యాలుబిడ్డల వెంటగొని నేను దేశాంతరములకరిగితిని. తండ్రిలేని బిడ్డలను నవవైధవ్యదుఃఖితయైన వదినెను జూడవచ్చుట తప్పా? నన్ను మీరు పొమ్మని నిర్బంధింపకపోయినపక్షమున నాయంతట నేనే వెడలిపోయి యుందును గాని నాపురనిర్గమనమును గుఱించి మీ రింత పట్టుబట్టుచున్నారు. కావున ముక్కంటి వచ్చినను నేనిక్కడనుండి కదలువాఁడనుఁగాను. ఎవ్వఁడు వచ్చి నన్నిక్కడనుండి కదపునో చూచెదఁగాక! వ్రేలితో నవ్వలఁద్రోసివైచుటకిది గుండుగాని బెండుగాదు. మీ బెదరింపులకుఁ బాఱిపోవుటకిది పిల్లిపిల్లగాదు సింగపుఁగొదమగాని. ఇది నా

తండ్రిరాజ్యము, నాతాతదేశము, నాముత్తాతల యార్జితము. ఇది నా జన్మభూమి. కావున నేనిక్కడనుండికదలను. స్వామిద్రోహులైన నీవును మణివర్మయు నాఁడుదానిని జిన్నవాండ్రను గన్నుబ్రామి రాజ్యము పంచుకొని తి వలెనని చూచుచున్నారు గాబోలు! నేనిట నుండి పోనని మీ పిన్నరాజుతోను రాజమాతతోను వృద్ధజంబుక మైన మణివర్మతోను గట్టిగఁజెప్పుము. పొమ్ము. పూర్వమిత్రుఁడవు బ్రాహ్మణుఁడవు నగుటచేఁ గరుణించితినిగాని కానిచో నిట్టిసందేశముఁ దెచ్చినందుకుఁ గత్తితో నీకుత్తుక నుత్తరింపవలసినదే;"

అట్లు చిత్రభానుఁడు కడుతీవ్రముగాఁబలుక మాధవసేనుఁడును రోషఘూర్ణితమనస్కుఁడై యిట్లనియె. "రాజకుమారా! కుత్తుక నుత్తరింతునని నీవుపలికిన జడియువాఁడనుగాను. నీ కట్టి సంకల్పము గలదేని నీ సంకల్ప మీడేర్చుకొనుము. బ్రాహ్మణుఁడ నని నీవు దయ దలఁపనక్కఱలేదు. మారాజశాసనము ననుసరించి మేము నీతోఁ జెప్పవలసినమాట జెప్పితిమి. నీకడ మేము సేవజేసినను నీయాజ్ఞ నెఱ వేర్పవలసినవారమేగదా! సేవకులమీఁద నాగ్రహించిన లాభమేమి? వార్తాహరులను దెగటార్చుట పౌరుషము గాదనియు నీతి గాదనియు రాజపుత్రుఁడవైన నీవే యెఱుఁగుదువు. ఎఱిఁగియుండియు నిట్టిసంభా షణలు చేయుదువని యెన్నఁడుఁదలంచియుండలేదు. హేమచంద్రుని యనుజునినోట నిట్టిమాట వెడలుట మిక్కిలి యాశ్చర్యము. సరే! మీప్రత్యుత్తము మారాజునకు, రాజమాతకు నెఱిఁగించెద. ఇంక మాకు సెలవిమ్ము." అని చివాలున లేచిపోయెను. అతఁడు వెళ్ళిన పిమ్మటఁ జిత్రభానుఁడును మాధవసేనుని విషయమునఁ దాను గావిం చిన సంభాషణ కఠినమై రాజకుమారోచితముగా లేదనియుఁ దాను తొందరపడె ననియు నతఁ డించుక పశ్చాత్తప్తుఁడై విచారించి మరల నెప్పటియట్ల బింకముగలిగి యుండెను.

రుద్రభట్టు చిత్రభానునితోఁగూడ శ్రీనగరమునకు వచ్చినది మొదలు వానికి నఖిలవిషయములయందు నుపదేశము చేయుచునే యుండెను. చిత్రభానుఁడు వానియుపదేశము పరమప్రమాణముగా, వేదవాక్యముగ గ్రహించుచుండెను. కొన్ని కారణములచేత రుద్రభట్టు బహిరంగముగ నెల్లవారికిఁ గనఁబడుట కిష్టపడమి మేడమీఁద నొకమూలఁ గృష్ణాజినము బఱచుకొని శాలువగప్పుకొని సంస్కృత గ్రంథమేదో చూచుకొనుచుండును. చిత్రభానుఁడు సన్నిధానమున కరిగి విషమసమస్యలవంటి సందిగ్ధవిషయములలో నాలోచనమడిగినప్పుడు బూర్వోత్తరపరిస్థితులఁబరికించి యుపదేశము చేయుచుండును. దండపాణియు వజ్రపాణియుఁ దప్ప రాజసేవకులలో నెవ్వరికి నతఁడు కనఁబడలేదు. మాధవసేనుఁడు తన్నువిడిచి వెళ్ళినతరువాతఁ జిత్రభానుఁడు మేడమీఁదికిఁబోయి రుద్రభట్టునకు నమస్కరించి తనకు నయ్యమాత్యునకు జరిగినసంభాషణ మంతయుఁ జెప్పెను. అతఁడదివిని "రావలసినపరిస్థితులు వచ్చుచున్నవి. వీనికెంతమాత్రము నీవు జడియవలదు. నీవు మాధవసేనునకుఁ జెప్పిన ప్రత్యుత్తరము రాజకుమారోచితముగా నున్నది. అంత తీవ్రముగఁ బలికి నందుకుఁబశ్చాత్తాపము నొందితి వంటివి. పశ్చాత్తాపమున కవసరము లేదు నన్నిపాతజ్వరమునకు మేకు గాల్చి వాత బెట్టుటయేమందు. ఇప్పుడునీవు దండపాణిని వజ్రపాణిని బిలిపించి కార్యాలోచనముఁ జేసి తెంపు సేయవలయు. గొప్పసందిగ్ధసమయమువచ్చినది. నీవిప్పుడు సంశయింపక సాహసింపఁదగును. ఆదండనాథులిద్దఱు నేమికోరుదురో యవియెల్ల వారికొడఁగూర్చినట్లు బాసజేసి వారిని నీయధీనము చేసికొనవలెను. సైన్యమంతయు వారి చేతిలోనున్నది. వారు నీకువశవర్తులగుదురా కాశ్మీరరాజ్యలక్ష్మి నీవశవర్తినియగును. ఈరేయి వారిం బిలిపించి మంతనముండవలయు. అంతయు వారితోనున్నది. అర్ధరాజ్యమడిగ

నను నిచ్చునట్లు వాగ్దానముచేయుము.'' అని గట్టిగాఁజెప్పెను. అట్ల
కాక! యని చిత్రభానుఁడు కరటకునిఁబిలిచి దండపాణి వజ్రపాణులను
రాత్రిబిలుచుకొని రమ్మని యానతిచ్చెను. చీఁకటిపడినతోడనే కరట
కుఁడు వారిరువురికడకుఁబోయి తన స్వామి సందేశమెఱిఁగించెను.
జాముర్రాత్రియైనవెనుక వీధులు నిర్జనమ్యములైనవెనుక రాజవీధులు
పరిత్యజించి వారు సందుగొందులఁబడి చిత్రభానుగృహముఁజేరిరి.
వారు లోపలఁబ్రవేశించినతోడనే వీధికవాటము దృఢముగా బం
ధింపఁబడియెను. చిత్రభానుఁడు వారినెదుర్కొని మేడమీఁదికిఁ గొని
పోయి రుద్రభట్టసన్నిధానమున నిలిపెను. మొగమున వెండిరేకు
లదికిట్లు బూదిపిండికట్లుమెఱయ మెడలో స్ఫటికాక్షసూత్రముధగ
ధగలాడుచుండ బ్రహ్మతేజ ముట్టిపడునట్లు-జింకతోలుమీఁదఁ బద్మా
సనముపై చికొని యపరశివునివలెఁ గూర్చున్న యాబ్రాహ్మణునిఁ
జూచియున్నదమ్ములు తత్పాదములకునమస్కరించిరి. అతఁడు ''మనో
రథసిద్ధిరస్తు'' అనిదీవించి రత్నకంబళిములపైఁగూర్చుండ నియమిం
చిన వారందు సుఖాసీనులైయుండిరి. చిత్రభానుఁడును వారిప్రక్కనె
గూర్చుండెను. రుద్రభట్టునకుఁ గుడిప్రక్క నొకమూఁకుడులో నగ్ని
వెలుఁగుచుండెను. అది యాఱిపోకుండ నడుమనడుమనతఁడే రెండు
మూఁడు సమిధలువేయుచుండెను. అపుడురుద్రభట్టు ముందుగానిట్లు
సంభాషణ మారంభించెను.—''అయ్యా! నేను చిన్ననాఁటనుండి
యాసేతుహిమాచలమగు భరతఖండమంతయుఁ దిరిగినాఁడను,
ఎన్నోదేశములు జూచినాఁడను. ఎందఱోరాజులతో సంభాషించి
నాఁడను. బహుజనులస్వభావములను గ్రహించినాఁడను. కాని,
మీవంటిసజ్జనుల నెందుఁజూడలేదు. మైత్రియనఁగా మీదే
మైత్రి. మిత్రుని నిమిత్తము ప్రాణములనయిన ధారవోయునట్ట
సజ్జనులను మిమ్మే చూచితిని. అట్లుకానిచొడల నీయర్ధరాత్రమున

నీ గాఢాంధకారమున న్వావరేటుఁగకుండ నతిరహస్యముగ ముసుఁగు లు వైచుకొని యెంతో కష్టపడి మీ రీమిత్రుని గృహంబునకు వత్తురే? ఇంతశ్రమ మీ రేలపడవలె? మీ యంతటవారు మీరు. విశేషించి కాశ్మీరసైన్యముల కధిపతులు. పిల్చినవాఁడో— రాజ్యము లేనివాఁడు. పూజ్యత లేనివాఁడు. ధనము లేనివాఁడు పరిజనము లేనివాఁడు బలఁగ ము లేనివాఁడు. అట్టివానిమాట తలఁదాల్చి మీ రిట్లువచ్చుట మీ చరి త్రమునకు వన్నెపెట్టుచున్నది. ఐశ్వర్యమున్నప్పు డందఱుమిత్రులె; ధనవిహీనునకు నాపత్కాలమున మిత్రులైనవారే మిత్రులు. అన్న యుఁ జుట్టములు, దేశీయులుఁ బరిత్యజింప నేకాకినై తిరుగు వీనిని మీరు చేపట్టినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. వేల్పులు సంతసింతురు. వెయ్యేల! పరమేశ్వరుఁడు సంతసించును? ఎడారిలో నోరెండి తిరుగు బాటసారికి మంచిసీటినూయి దొరకినట్లు, పేరాఁక లిక నకనకంబడువానికి నట్టడవిలోఁ బండ్లచెట్టు దొరకినట్లు నిర్భా గ్యుఁడైన వీనికి వీనియదృష్టమున మీరు లభించిరి. ఇతనికి ముంగిట రెండు పెన్నిధానములు దొరికెను. రెండుకల్పవృక్షములు పెరటిలో లభించెను. ఆవృక్షచ్ఛాయ నింకజల్లఁగ మనఁగలఁడు. ఆశాఖలు బట్టుకొని పైకెగఁబాకగలఁడు. అతనిముంచినఁ దేల్చిన మీ దేభార ము.'' అనవుడు దండపాణి వినయముతో ''స్వామీ! మేమేమి చేయఁ గలము? పూర్వమైత్రిచేత మే మీయనను వదలలేక పట్టిప్రాఁకులాడు చున్నాము. మాచేతనైన సాయము చేయఁగలము. ఇవ్వాడుమమ్ముఁ బిలువనంపిన కార్యమేదో సెలవియ్యవలయు'' నని పలికెను. పలుకు టయుఁ జిత్రభానుఁడు వారి చెఱియొకచేయి తన చెఱియొకచేతితోఁ బట్టుకొని మెల్లగా నిట్టులనియె—మిత్రులారా! నేను భయపడుచునే యిటకువచ్చితిని. వచ్చినందుకు నే ననుకొన్నంతపని జరిగినది. మాధవసేనుఁడు నిన్న వచ్చి సకుటుంబముగా నన్నీయూరినుండి

పోమ్మని తమ రాజుయొక్కయు రాజమాతయొక్కయు శాసనమైన దని చెప్పెను. అది విని కోపపరవశుఁడనై నే నిక్కడనుండి కదలనని దృఢముగాఁ బలికితిని. ఆపలుకుల కేమి! నన్నిక్కడ మీరుండుమన్న నుండెద. పొమ్మన్నఁ బోయెద. నాకు నిలువనీడ లేదు. చెట్లమీఁది పక్షి కైనను నెలవున్నదిగాని నాకు నెలవులేదు. సువిశాలమైన యీ విశ్వమే నామందిరమైనది. నక్షత్రయుతమైన యాకాశమె మణిరంజిత వితానమైనది. మెత్తని పచ్చిక బయళ్ళు రత్నకంబళములైనవి. వృక్షచ్ఛాయలు పందిళ్లయినవి. అడవులు పూవుఁదోట లయినవి. రాజకుమారుఁడనై యందుకు నేనీవిధముగా భోగములననుభవించుచున్నాను. విదర్భలో నుండుమన్న నత్తవారి యింటబ్రతుకకన్న హీనమైనది మఱియొకటిలేదు. అదిగాక చంద్రవంశజుఁడనై విక్రమసేనుని గారాబుకొడుకునై యమిత సౌఖ్యంబు లవ్వారిగా ననుభవించిన నేను పరులపంచల నొకరిచేతిక్రింద నొదిగియుండఁగలనా? నెనుక మాయన్నయందలి గౌరవముచేతఁ నే నట్టిటో పీడువిడిచి పోయితిని. ఇప్పుడు నాకిక్కడ నుండవలెనని యున్నది. మీయుత్తాలభుజలీల యీఁతికోలగా నే నింకు నిలువఁబడఁ దలఁచుచున్నాఁడ మీరు సస్సైన్యముగా నాకు బాసటమై నిలిచిరేని యీకార్యము తుద నెగ్గును ఇందుకు మీకు నేను బ్రత్యుపకారము మీయిచ్ఛాప్రకారముఁ జేసెద. నన్నిక్కడ సుప్రతిష్ఠితునిఁ జేసితిరేని మీకష్టైశ్వర్యము లొసఁగుదును. చదరంగపుటాటలో నొకగుఱ్ఱమును మఱియొకగుఱ్ఱము గాచినట్లు నన్ను మీరు గాతురేని మిమ్ము నేను మహోన్నత దశలో నిలుపుదును. ఇన్నిమాట లెందుకు! కాశ్మీర రాజ్యమే మీది. మీ మనస్సులో నున్నకోరిక యేమో దాఁచక చెప్పుఁడు. సముఖమున రాయబారము లెందుకు? చల్లకువచ్చి ముంత దాఁచనేల? అని యుపన్యసింప దండపాణి వెంటనే యుత్తరమీయలేక సందేహించెను. అతని

మొగమునఁ జెమటలు తోఁచెను. అతఁడు భయపడినట్లు కనఁబడెను. వజ్రపాణి వెలవెలఁ బోయెను. చిత్రభానుఁడు దండపాణిమీఁదఁ జేయి "వైచి, మిత్రుఁడా! ఏమి భయపడుచున్నట్లున్నావు? ఇది సేనాపతికిఁ దగినలక్షణము గాదు. క్షత్రియుఁడవు మహావీరుఁడవు. జంకన్నది నీవున్న యూరనుండఁ గూడదు. అట్టిదానికి నీమనస్సు నెలవు గాఁగూడదు." అని హెచ్చరించుచుండ దండపాణి "రాజద్రోహము, రాజద్రోహము." అని మెల్లగాబలికెను. అదివిని చిత్రభానుఁడు "రాజద్రోహమా? నేనుమాత్రము రాజునుగానా? ఈ వఱకు నా యెడలఁజేసిన ద్రోహముమాట యేమిచెప్పెదవు? మిత్రులయినందుకు నాకుజరిగిన యన్యాయమునకు మీరు ప్రతిక్రియ సేయవలయు. అవి పిచ్చిమాటలు, రాజెవఁడు? మీరాజు చనిపోయినాఁడు. ఈ పసికూన నీకు రాజా? మూలగూర్చున్న యావితంతువు నీకు శాసకురాలా? ఇంతబ్రదుకు బ్రతికి చివర కాఁడుదాని శాసనములా నీవుశిరసా వహింపవలసినది? దుస్తంత్రపేటికయైన యాముసలిరాబందు మణివర్మయా నిన్ను శాసించువాఁడు? ఛీ! ఈ పిఱికితనము విడువుము. వజ్రపాణీ! నీహృదయము వజ్రమువలెనుండవలె. మున్ను నేపాళసైన్యముల నుఱుమాడిన యాధైర్యమొకసారి నీమనమున నెలకొల్పుము. పిఱికికండలను దూరముగఁ దొలఁగింపుము. ధైర్యము చిక్కఁబట్టుము." అని మందలించెను. వజ్రపాణియేదో యుత్తరము చెప్పఁబోవుచుండ రుద్రభట్టందుకొని "రాజద్రోహము భీరువులమాట. మీరెవరిని రాజును జేసిన వాఁడేరాజు. చిత్రభానుని రాజుం జేయుఁడు. అప్పుడుమీరు రాజభక్తులగుదురు. ఇతఁడు విక్రమసేనుని కొడుకు గాఁడా? శూరుఁడుగాఁడా? రాజ్యము సమర్థతోఁ బాలింపలేఁడా? సైన్యముల నడుపలేఁడా! సమరముల విక్రమవిహారము సలుపలేఁడా? వీనికేమి కొఱఁత? మీ మనంబుల శంకలు బాఱఁద్రోలి యాతని

రాజుం జేసి ధనము, పలుకుబడి, యధికారము, నన్నియుఁ గలిగి మీరు మెలంగుఁడు. అదిగో! లక్ష్మివచ్చుచున్నది. మోఁకా లడ్డు పెట్టకుండ దిక్కుమాలిన యీచిత్రభానుని బాగుచేసినప్రతిష్ఠ మీకు దక్కుఁగాక! మీయభిప్రాయముఁ జెప్పుఁడు?" అని ప్రబోధింప దండపాణి మహాత్మా! సందియములేదు. చిన్నరాజును దండపాణి మోసముచేసి శత్రుపక్షమునుఁ జొచ్చినాఁడని లోకాపవాదము గలుగునని సందియపడుచున్నాను." అని మెల్లగాఁ జెప్పెను. వెంటనే రుద్రభట్టు "లోకాపవాదమా? లోకులనందఱ మెప్పింపఁదరమా; మన కిష్టమైనపని మనము చేయవలయునే గాని లోకులిట్లనుకొందు రట్లనుకొందురని శంకించిన నొక్కకార్యముఁ జేయఁగలమా? స్వబుద్ధిననుసరించిపోవుట శ్రేయము. లోకులు కాకులు ఇష్టమువచ్చినట్లు కూయుదురు. ఆకూఁతలన్నిఁటిని మనము లెక్కసేయరాదు. ప్రతిమనుష్యునిఁ గొందఱు నిందింతురు. కొందఱు మెత్తురు. ప్రతికార్యమును గొందఱు శ్లాఘింతురు. కొందఱు దూషింతురు. ఎల్లరు దేనిని మెచ్చరు. ఎల్లరు దేనిని దూషింపరు. "ఆత్మబుద్ధి స్సుఖంచైవ" యను నార్యోక్తి వినవే? ఎల్లవారికి నంతఃకరణ ప్రవృత్తియే ప్రమాణము. కావున నీవిందు సందియ పడక చిత్రభానుని కండయై నిలువుము. ఇదే సమయము. జారినలాభము లేదు. వెనుదీసినఁ బ్రయోజనము లేదు. అదను పదనుదప్పిన మరలఁ జూడరాదు." అని గంభీరభావముతోఁ బలికెను. దండపాణి మారాడలేక వారి యుపన్యాసములకు దాసుఁడై "మీయిచ్చవచ్చినట్లు జేసెద. ఈశరీరముమీఁది దీనిని మీ యిష్టము వచ్చినట్లుపయోగించుకొనుఁడు. నాతమ్ముఁడు నాతోడిపాటివాఁడే. మేము చిత్రభానునికొలఁకుఁ జిచ్చులుకుచున్న నులుకుదుము. జలధిఁ బడుమన్నఁ బడుదము. పంచప్రాణముల విడుతుమన్న విడుతుము. కాని మేముగాక యితరసైన్యాధిపతులు కొందఱు గలరు. అందు

ముఖ్యముగ గదాధరుఁడు, శూలపాణిమున్నగు దండనాథులు రాజ భక్తికిఁ బేరుపడినవారు. సేనలోఁ బలుకుబడి వారికిఁగూడ మెండుగాఁ గలదు. వారు మనపక్షమువారు. ఆవిషయమై మనము గట్టిగ విచారింపవలెను. అది యటుండఁగా మీకోరికలుగూడ మీరు వినవలయుఁ జెప్పుమన్న జెప్పెద''నని చిత్రభానుని మొగమువంకఁజూడ ''నిస్సంశయముగాఁ జెప్పవచ్చును''అని యతఁడు పలికెను. ''వ్యవహారముపట్ల మొగమోటముగూడ''దని రుద్రభట్టు చెప్పెను. అప్పుడు దండపాణి యిట్లనియె. ''నాకూఁతురు మణిమాలికను విజయసేనున కిచ్చి వివాహము సేయవలెనని చిరకాలమునుండి నేనభిలషించుచుంటిని. ఆవిషయమై మీయభిమతిమేమో తెలుపవలయు. ఇది నావిషయము. మాతమ్ముని మనోరథముగూడ జెప్పెద నాకర్ణింపుము. సిగ్గుపెంపున వాఁడు చెప్పఁజాలకున్నాఁడు. మీకర్పూరమంజరిని చేట్టబట్టవలె నని మావజ్రపాణి తడవుగాఁబట్టి తలపెట్టియున్నాఁడు. మాతమ్ముని మనోరథము మీరీడేర్పవలయునని కోరుచున్నాను. మాకింతకన్నఁ గోరికలు లేవు. మ. మనోవ్యక్త మనోరథసిద్ధులుచేసి సుఖంపవలెనని నాప్రార్థన''అని విరమింపఁ జిత్రభానుఁడు ''మన మిరువురము వియ్యమందుట నాకుఁ బరమానందకరము. విజయసేనుఁడు నీయల్లుఁడు నేఁడే యయ్యెనని నీవు నిశ్చయించుకొనుము. ఇఁకఁ గర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చుట విషయమున దాని మనోరథమెట్లుండునో చెప్పఁజాలను. అయినను దానిమనసు విఱిచి తప్పక నీకు వివాహముచేసెద''నని దృఢముగాఁ బలికెను. అతని పలుకునే దృఢీకరింపఁ దలఁచి రుద్రభట్టుగూడ నిట్లనియె—''ఇదియా మీకోర్కెలు! ఇందసాధ్యమైనదియు, నసంభవమైనదియు నేదియులేదు. విజయసేనున కెవ్వతెనో యొకబాలికను దెచ్చి వివాహము సేయవలయునుగదా. ఆకన్య మణిమాలికయే యగుఁగాక! మణిమాలిక

గుణమణిమాలికయని విందుము. అబ్బాలిక విజయసేనుని సహధర్మచారిణియై యర్ధాంగలక్ష్మియై మహాపతివ్రతయై సంతానవతియై భావికాలమున శ్రీకాశ్మీరరాజపట్టమహిషియై వర్ధిల్లుగాక యని మేమాశీర్వదించుచున్నాము. కర్పూరమంజరి యీనాఁటి బాలికలవంటిదిగాదు. జననీజనకులకు విధేయురాలు. చదువుల సరస్వతి. గానములప్రోవు. చక్కఁదనపు దీవి. ఆమె తండ్రిమాటవిని తప్పక వజ్రపాణి చేయి పట్టును. వజ్రపాణికి శచీదేవియుం బోలె నీ వజ్రపాణి కీమె యిల్లాలై పేరుప్రతిష్ఠలగాంచి జయంతునిఁ బోలు నందనుం గని చిరంజీవినియై వర్ధిల్లుగాకయని దీవించుచున్నాఁడ. నా యాశీర్వచన మమోఘమగుగాక! దివ్యులు ప్రసన్నులగుదురుగాక! చిత్రభానుఁడా! ఏమి యిది నీకిష్టమేగదా?" అన నతఁడు "సందేహములేదు. అట్లె జరుగుగాక" యనెను. "అట్లయిన మీరీ యగ్నిసాక్షిగా నాయెదుటఁ బ్రమాణములు సేయుఁడు" అని రుద్రభట్టానతిచ్చి ఋగ్వేదములోని యగ్నిసూక్తమంత్రముఁ బఠించి యగ్నికభిముఖుఁడై యుండెను. చిత్రభానుఁడు లేచి యగ్నికిఁ బ్రదక్షిణముఁజేసి "ఓ యగ్నిదేవా! నీవు సాక్షిగ మణిమాలికను విజయసేనునకు భార్యగాఁ జేసెద. కర్పూరమంజరిని వజ్రపాణికి వివాహముచేసెద." అని నమస్కరించెను. అనంతరము దండపాణిలేచి వహ్నికిఁ బ్రదక్షిణముసేసి "నేను సుఖదుఃఖములయందు నాప్రాణములకయిన నాసపడక చిత్రభానునిపక్షమున నుండెద. ఓయగ్నిదేవా! నీవిందుకు సాక్షివి" అని ప్రమాణము చేసెను. వజ్రపాణియు నన్న చేసినయట్లే ప్రదక్షిణముఁ బ్రమాణము గావించెను. అనంతరము వారిరువురు రుద్రభట్టునకు నమస్కరించి గృహములకరిగిరి. "వలలోఁ బెద్దచేఁపలు పడినవి. ఇఁక విజయమున కాటంకములేదు. ఇఁక నిర్భయముగ నిద్రఁబొమ్ము" అని రుద్రభట్టు చిత్రభానుని బహూకరించి పంపెను.

ఎనిమిదవ ప్రకరణము

అట్లు మాధవసేనుఁడు చిత్రభానునకుఁ దనసందేశ మెఱిఁగించి యాతని వీడ్కొని మణివర్మకడకుఁబోయి తాను రాజసందేశ మెఱిఁగించుటయు నతఁడు తన్నుఁ దూలనాడుటయు రాజశాసనముఁ దిరస్కరించుటయు లోనగు వృత్తాంతమంతయు నొకయక్షరమైన విడువకుండఁ జెప్పెను. సందేశఫల మట్లేయుండునని యిదివఱకె మనంబున నూహించుటంజేసి మణివర్మ వానిపలుకులు విని విస్మయము నొందలేదు. కాని యటమీఁది కర్తవ్యమేమియని యతఁడు విచారింపఁ దొడఁగెను. "మాధవసేనుఁడా! దండపాణియొక్కయు వజ్రపాణియొక్కయు బలముజూచుకొని మనయెడ నిట్టి తిరస్కారభావముఁ జూపియుండునా, లేక మామయైన విదర్భరాజువలన సహాయ్యము నపేక్షించి యిట్లు తూలనాడియుండునా? ఏమని నీవూహించెదవు?" అని యడిగెను. "ఉభయుల ప్రాపుఁగూడఁ జూచుకొని యతఁ డట్లు పరుషప్రలాపములు నోటవెడలనిచ్చెను. అందుముఖ్యముగ నిక్కడివారి బలముఁ జూచుకొనియె యతఁడు నిర్భయముగ నున్నాఁడు. అట్టిప్రాపు లేనియెడల రాజశాసనము ధిక్కరించుటకు వాఁ డెంతవాఁడు! [illegible]మని చూచితిమా పదిమంది సైనికులు లేరు. కావలసినవిత్తము లే[illegible] పలుకుబడి యంతకుముందే సున్న. అట్టివానికి ధైర్య మెక్కడినుఁ వచ్చెను. ఏదో దృఢమైన మూలకారణ ముండియుండవలయు" నని పెద్దమంత్రికిఁ జిన్నమంత్రి యుత్తరమిచ్చెను. "సరే! ఈవార్త[illegible] మాతకు మన చిన్నరాజునకు నెఱిఁగించి వారియభిప్రాయ[illegible]మో తెలిసికొని మనము చేయవలసిన యుపదేశముచేసి క[illegible]వ్య మిదమిత్థమని నిర్ణయింతము. శంఖమునఁ బోసినంగాని తీర్థము గాదుకదా! ఏకార్యమునకైన రాజశాసనము ప్రధానముగదా! పద పద. అక్క

డికి పోవుదము'' అని యిరువురు రాచనగరునకుం జని యరవిందా దేవిం గనుంగొనిరి. అప్పుడు మాధవసేనుఁడు తనకుం జిత్రభానునకు జరిగిన సంభాషణమంతయు వరుసగాఁ దెలిపెను. విక్రమసేనుఁడు వెల్లఁ బోయి మంత్రులవైపుఁ జూచెను. అరవిందాదేవి హృదయము చెదరి నట్లు ముఖవైఖరి తెలియఁజేసెను. ''అట్టయిన మనకు మరల దుర్దినములు సంభవించినవా'' యని యామె హీనస్వరముతోఁ బలికెను. ''సైన్యమునుబంపి యాతని నేల వెడలఁగొట్టఁగూడదు?'' అని విక్రమసేనుఁడు బలికెను. ''అదియే మేమును జేయఁదలఁచుచున్నాము. కాని సేనాపతుల రాజభక్తి స్థిరముగానున్నదో యూఁగులాడుచున్నదో తెలిసికొనుట కష్టముగా నున్నది'' యని మణివర్మ పలికెను. ''వారింతలో నంతకృతఘ్నులగుదురా?'' యని యరవింద వచియించెను. ''నాకనుమానముగా నున్నది. అది యిప్పుడే నిశ్చయింపవలయును. కావున మనము ముందుగా గదాధరుని, శూలపాణిని బిలిపించి వారి మనస్సెట్లున్నదో కనుఁగొందము'' అని మణివర్మ వాక్రుచ్చెను. ''అట్లకాక!'' యని నమ్మికగల బంటునొక్కనిఁ బిలిచి విక్రమసేనుఁ డాదండనాథుల నిరువురఁ బిలుచుకొనిరమ్మని పంచెను. వాఁడు నతిత్వరితముగ నరిగి యాచమూపతులం దోడ్కొనివచ్చె. వారిని సముచిత సత్కారములం గారవించి మణివర్మ సుఖాసీనులం జేసి హేమచంద్రుఁడు చిత్రభానుని గుణముల రోసి దేశమునుండి లవడఁచుట మొదలు నాఁటివఱకు జరిగిన యావద్వృత్తాంతము వారికి జ్ఞాపకము చేసి యిట్లనియె—

తులారా! రాజ్యమున కావశ్యములైన సప్తాంగములలో సైన్యకోశములు ప్రధానములు. సైన్యమున్నఁగాని రాజ్యలక్ష్మినిలువఁ జాలదు. కోశము సమృద్ధిగానుండినంగాని సైన్యము తనధర్మము తాను చేయదు. కాశ్మీరరాజ్యమునకుపట్టినంత కోశసమృద్ధియున్నది. సైన్య

మును మీవంటి సేనాపతులుండుటచే సర్వలక్షణసంపన్నమై సమర్థమై యున్నది. కాని రాజ్యమునకు వెండియుఁ జిత్రభానునివలనఁ గొన్ని కలఁతలు సంభవించునని తోఁచుచున్నది. ఒక్కకడుపునఁబుట్టియొక్కచో బెరిఁగి యొక్కమంచమునం బవ్వళించి యొకకంచమునం గుడిచిన హేమచంద్రుఁడే యతనిని నమ్మఁజాలక గాఢమైన యనుమానము మీఁద దేశమునందుండఁదగనివాఁడని వెడలనడచెనుగదా! హేమచంద్రుని మరణమునుగూర్చి యెట్టి వాదములున్నవో మీరే యెఱుఁగుదురు. చిత్రభానునిచరిత్ర మొకనాటకముగా నున్నది. ఎవఁడో హరిశర్మయనువాఁడు వచ్చి ప్రయాగలో చిత్రభానుఁడు మిక్కిలి దీనముగా మరణమొందెనని మాయమాటలు చెప్పి మహారాజుగారి మనస్సు కలంచెను. ఆమనఃక్షోభముచేతనే యాయన వికలచిత్తుఁడై హరిశర్మచేతిబొమ్మయై యాడి మరణముఁ దెచ్చుకొనెను. చిత్రభానుఁడు సజీవుఁడై యాయివలె నున్నాఁడు. చుట్టఱికమువంక బెట్టి తన యున్నబిడ్డలయందలి ప్రేమరసమెల్ల నక్కడవర్షించుటకు మరలవచ్చెను. వీరింబరామర్శించి వెడలిపోవుదునని చెప్పెఁగదా! పిమ్మట నాలు బిడ్డలం దెచ్చె. పురమువిడిచి పోవలసినదని సందేశముంప రాజమాత యొక్కయు, రాజుయొక్కయు శాసనము నిరాకరించి సందేశముం గొనిపోయిన మాధవసేనుని తృణీకరించి తూలనాడెను. అతఁడు నగరమునసుండుట రాజకుటుంబమునకు రాజ్యమునకు ననర్థకము. అతని నెట్లయిన వెడలనడువవలయు. కావున మీరండఱు నవసరమైనపక్షమున సైన్యములతో నాతనియిల్లు ముట్టడించి వానిని దేశమునుండి యావలకిఁ బంపవలయు, కఱకుదనమెక్కుడైన మనము చుఱుకుదనము నెఱపి వానిని బంధింపవలయు. బంధింపవలె నననేల? అవసరమగునేని శిరచ్ఛేదముఁ జేయవలయు. ఇంతకఠినముగాఁ బలికితి నని మీరు నొచ్చుకొనవలదు. మంత్రులు వైద్యులవంటివారు. వైద్యుఁడు

దయాళుఁడన్యుఁ నిష్కారుణముగా వ్రణమును ఛేదించునట్లు మంత్రులు రాజద్రోహులను నిర్దయాత్ములై దండింపవలయు. ఇవియెల్ల నేను మీకు జెప్పవలసినవి కావు. ఇదిగో మీరాజు! అదిగో ఆతనితమ్ముఁడు అదే హేమచంద్రమహారాజపట్టమహిషి. వారినిమువ్వురనుమాకుమీఁకు మీసైన్యమునకు నప్పగించి హేమచంద్రమహారాజుస్వర్గస్థుఁడయ్యెను. మీరు రాజభక్తిఁ జూపవలసిన సమయమిది. మీచిత్తనైర్మల్యముఁ బ్రకటింపవలసిన తరుణమిది. మీయున్నతభావముల వెల్లడింపవల సిన యవసరమిది. రాజ్యలక్ష్మిని గాపాడవలసినయదనిది. కావున మీరుమృతుఁడైన హేమచంద్రునిఁదలంచి రక్షణీయమైన రాజ్య లక్ష్మినిదలంచి, బాలుఁడై యేమియునెఱుంగకయున్న రాజుమొగము జూచి నవవైధవ్యదుఃఖభారవినమ్రమైన దేవిమొగముఁజూచి, భగ వంతుని మొగముఁ జూచి, మోమోటవిడిచి చిత్రభానునిమాయ లలోఁబడక యాతని వెడలనడఁచుటకు సర్వప్రయత్నములఁ జేయ వలయు. దండపాణి వజ్రపాణులవైఖరి వేఱువేఱుంగుగా నున్నదని యనుమానము గలుగుచున్నది. అయిన నిట్లు నిశ్చయముగాఁ జెప్పఁ జాల. ఇదిమీకు సమ్మతమగునోకాదో చెప్పుఁడు. మనసులో నొకటి పెట్టుకొని పైకొకటి ఱుప్పవలదు.

అప్పలుకులు గదాధరశూలపాణుల హృదయంబులం గదలిం చుటంజేసి వారుత్సాహపూరితులై రాజభక్తి బ్రేరితులైరి. గదా ధరుఁ డిట్లనియె. "మహాత్మా! సైన్యము రాజ్యలక్ష్మికి నంగరక్షక బలము. అది సమర్థమై యుండదేని రాజ్యలక్ష్మి యచిరకాలంబునఁ బరహస్తగతమై నశియించు. ఇంతవఱకుఁ గాశ్మీరసైన్యంబులు సమ ర్థంబులై శత్రుదుర్భేద్యములై పరచక్రభయంకరములై యున్న యవి. దండపాణియు హేమచంద్రునియెడ భక్తితత్పరుఁడై యుం డెను. ఆతని మనస్సు వాని తమ్ముని మనస్సు మాఱుటకుఁ దగినకారణ

ములు నాకగపడవు, అయినను దగిన కారణము లుండినంగానిమీరు వారిచరిత్ర మనుమానాస్పదమని పల్కరు. వారెట్లయిన నగుదురు గాక! నామాట చిత్తగింపుఁడు. ఈలోకమున నెవఁడైన హేమచంద్ర మహారాజునకుఁ గాశ్మీర రాజవంశమునెడ నాజన్మాంతముఁ గృతజ్ఞుఁడై యుండవలయునేని నిశ్చయముగ నట్టివాఁడు గదాధరుఁడే. గదాధరుని జీవనమంతయుఁ గాశ్మీర రాజుల ద్రవ్యమే. రక్తమంతయుఁ గాశ్మీర రాజుల ప్రేమరసమే. అట్టిగదాధరుఁడు కృతఘ్నుఁడగునేని నింక ప్రపంచమునఁ గృతజ్ఞత యనుమాట లేదనవచ్చును. నాపూర్వప్ర వృత్తాంతము నిమ్మహాదేవియు నీచిన్నిరాజు నెఱుంగకపోవచ్చును గాని సంపూర్ణముగ మీరెఱుంగుదురు. నేనొక రాచబిడ్డఁడను హిమాలయపర్వతప్రాంతమున నొకకొండపల్లియ మాయునికిపట్టు. మా తండ్రికృషీవలుఁడు. నాజననీజనకులకు నేనొక్కఁడనే పుత్రుఁడను. మందభాగ్యుఁడనైన నేనుపుట్టిన దినమే నాతల్లిభూలోకమును బాసి పరమపదముఁ గాంచెను. నిఱుపేదయైన నాతండ్రినాకుందల్లియై పురిటి మంచ మెక్కి యుగ్గుపాలుబోసి పెంచి మిక్కిలికష్టపడి నన్నుం బదియేండ్లవానిం జేసెను. ఆపదలకదృష్టహీనులు పరమబాంధువులు. నాతండ్రి నాపదియవయేట నన్నును దనకు నితరులకుఁగూడ భారముగనున్న తన శరీరమునువిడిచి పరలోకమునందైన సుఖముగలుగక పోవునా యని యచ్చటికిఁ జనెను. అప్పుడు చేయునది లేక నేను కొన్నిదినంబులు చుట్టములయింట నిలుగుపొరుగు వాండ్రయింటఁ గాలక్షేపముఁ జేసి వారిచేఁ దిరస్కృతుఁడనై కట్టగుడ్డలేకనిలువనీడలేక తినుటకన్నము లేక యాదరించుటకాప్తులు లేక నాది యనిచెప్పఁదగిన పదార్థము లేక పొట్టజరుగుటకుపాయముగానక మాధుకరవృత్తిచేత భిక్షాటనముచేత నొకపూఁటతిన్నట్లు నొకపూఁటతిననట్లు గొన్నిప్రొద్దులుపుచ్చి విసిగి దుండఁగులగు బాలకులఁ గొందఱఁగలిసి చిన్నచిన్నదొంగతనము

లారంభించితిని. క్రమక్రమముగా నందారితేటి పదియేనేండ్లప్రాయమున బందిపోటుల జట్టులోఁ గలసితిని. హేమచంద్రమహారాజుతండ్రి విక్రమసేననృపాలుఁడు కాశ్మీరమును బాలించుచు దేశక్షేమమరయుటకై మంచుకొండదాఁపున నున్నప్రాంతములకొకసారి వచ్చెను. ఆ ప్రాంతమున వసియించుజనులు "దురాచారులగు చోరులబాఁటినుండి తమ్ము రక్షింపు"మని యానరేంద్రుని వేఁడ నతఁడక్కడఁ గొన్నిదినములుండి సైనికులచేత బందిపోటుల వెతకించిపట్టించి వారిలోఁ బెక్కండ్రకుఁ దగినదండనల విధించి నన్నుం జూచి యిట్లనియెను. "ఓరీ! నీది లేఁబ్రాయము. ఆకారమును జూడ సద్వంశజాతుఁడవని తోఁచుచున్నది. మొగము విలాసమును గ్రక్కుచున్నది. నీ తెలివితేటలు నీసాహసము నీబాహుబలము మంచిదారి నుపయోగించిన లోకమునకెంతో మేలగు. నీవు నీవృత్తి మాని వెనుకటికార్యములకై పశ్చాత్తాపమునొంది సన్మార్గమున సంచరింతువేని నీభవిష్యచ్చరిత్రము శ్లాఘాపాత్రమగును. ఈతలంపుల విడువుము. నావెంటరమ్ము" అని దయార్ద్రహృదయుఁడై పలికిన యానరపాలుని వాక్యములు నాచెవులలో నిప్పుడును ధ్వనించుచున్నట్లున్నవి. కరుణారసపరిపూర్ణములైన యాయన చల్లని చూడ్కులు నామీఁద నిప్పుడు ప్రసరించుచున్నట్లున్నవి. శాంతరసమొలుకు నామహాత్ముని మూర్తి యిప్పుడు నాకన్నులఁ గట్టినట్లున్నది. ఆయన వాక్యామృతము నాశ్రవణములఁ బడినతోడనే నామనోమాలిన్యము నీటం గడిగినతెఱంగునఁ దొలఁగిపోయెను. మనస్సు నిష్కలుషమయ్యెను. పశ్చాత్తాపమహాగ్నిచేఁ బాపపటలము భస్మమయ్యెను. ప్రాఁతయాకులూడిపోయిన చెట్టువలెఁ గుబుసమూడ్చిన త్రాఁచువలె నామనసపుడు స్వచ్ఛమైయుండెను. వెంటనే నేనామహాత్ముని పాదములపైఁ బడి 'దేవా! నాతప్పులు క్షమింపుడు. నేను మహాపరాధిని. దరిద్రుఁడను. మీదండనలకన్న మీహితోపదేశమే నాకు

గొప్పశిక్షయై నన్ను శుద్ధునిఁ జేసెను. పశ్చాత్తాపమహాగ్ని నా హృదయముఁ గాల్చుచున్నది. ఇఁక నేసన్మార్గమున సంచరించెద. ఇఁక నన్ననుగ్రహింపుఁడు, అని వలవల నేడ్చి యారాజశేఖరుని పాదరాజీవముల నాబాష్పధారలచే నభిషేకించితిని. భూమండలాఖండలుఁడగు నప్పుడమిఱేఁడు నన్ను స్వయముగా దన చేతులతో నెత్తి వగవకు బాగుపడియెదవని ధైర్యముచెప్పి చేతితోఁ వీఁపుపైఁ దట్టి నన్ను స్నానము చేయింపుమనియు నూతన వస్త్రములనాచేఁ గట్టింపుమనియు సేవకుల కానతిచ్చెను. వారట్లు గావించిరి. అప్పుడు నేను క్రొత్తమనుష్యుఁడనైతిని. నా మనోవృక్షమునఁ గ్రొత్త తలఁపులను చివుళ్ళు మొలకలెత్తసాఁగెను. మహారాజుగారితో నేను రాజధానికివచ్చి విద్యాభ్యాసము జేయనారంభించితిని. నేను మిక్కిలి శ్రద్ధగాజదివి గురువుల యనుగ్రహమునకుఁ బాత్రమునైతిని. ఎప్పటికప్పుడు మహారాజుగారు నావర్తనముఁగూర్చియు నా విద్యాభివృద్ధిని గూర్చియు గురువులనడిగి తెలిసికొనుచువచ్చిరి సామాన్యవిద్యతోఁ బాటు ధనుర్విద్యయు నేర్చితిని. అందనేక బహుమానములు వడసితిని. గురువులయు సహకారులనియు మెప్పుగాంచితిని. అంతలో నమ్మహారాజు పరమపదము నందెను. హేమచంద్రమహారాజు రాజ్యాభిషిక్తుఁడయ్యెను. పితృభక్తిని హేమచంద్రుఁడు రామచంద్రుఁడు సత్యభాషణమున హేమచంద్రుఁడు హరిశ్చంద్రుఁడు ప్రసన్నభావమున హేమచంద్రుఁడు శరశ్చంద్రుఁడు. ఆ తండ్రికిం దగిన కొడుకు గావునఁ దండ్రిచే గారామునఁ బెంపబడిననన్ను మిక్కిలి కనికరంబునం గని యమ్మహారాజు మరణంబువలన దుఃఖితుఁడనైన నన్ను నోదార్చి కొంతసేవ కధిపతిం జేసి వివాహము జేసి నన్నొక యింటివానిం జేసెను. ఆమహాత్మునిదయవలనగౌరవమార్జించితిని. ధనమార్జించితిని సంతానవంతుఁడనయితిని గృహారామ క్షేత్రములసంపాదించితిని. మిత్ర

లపాగడ్దలకుఁజుట్టముల యాదరణకులోకులమన్న వకునాస్వామి యను గ్రహామునకుఁ బెద్దల దీవనలకు భాజనమైతిని. ఉదయమున లేచి హేమచంద్రునిపేరుఁ దలఁచి విక్రమసేనుని నామముఁదలఁచి, మొక్కు లిడుదును. నే వసించు గృహము వారిది. తినెడియన్నము వారిది. కట్టుబట్ట వారిది. నాచర్మముఁగోసి పాదరక్షలుగఁ గుట్టి యామహా త్మునకిచ్చినను నాఋణముతీరదు. వారు మసిబొగ్గును దెచ్చి మాని కముఁ జేసిరి. నత్తగుల్లను ముత్తెపుఁజిప్పఁజేసిరి. ఇత్తడిపుత్తడిఁజేసిరి పశువును మానిసింజేసిరి. ఇంతకన్న మహోపకార మెవ్వరు చేయఁ గలరు? ఇట్టినేను గాశ్మీరరాజులయెడఁ గృతఘ్నుఁడ నగుదునేని— ఛీ! నాజన్మమేల? జంతువులకును గృతజ్ఞత కలదు. పరమనీచమైన కుక్క పిడికెడన్నమువైచిన నదియెన్నఁడు మఱువదు. వృక్షముల సైతము తమకుఁ జిన్ననాఁడు నీరువోసి పెంచిన మనుష్యులకు బ్రతికి యున్నంతకాలము నీడనిచ్చును. కాయలిచ్చును. ఆకులిచ్చును. పండ్ల నిచ్చును. చచ్చియు వారికనేకవిధములనుపకరించును. క్షుద్రజంతువులు, ప్రాణులుసయితమట్లే కృతజ్ఞత గలిగియుండ నీశ్వరాంశసంభూతుఁడై జ్ఞానేంద్రియవ్యాపారముఁ గర్మేంద్రియవ్యాపారముఁ గలిగి విద్యా సంపన్నుఁడైన మనుష్యుఁడు కృతజ్ఞుఁడగుట యాశ్చర్యమా? అదిలేని వాఁడు వానరుఁడుగాని నరుఁడుగాఁడు. కావున నోమహాదేవీ! యో రాజా! యోయమాత్యులారా! ఈగదాధరుఁడు రాజకుటుంబమునకు రాజ్యమునకు క్షేమకరమగునట్లు వర్తించును. రాజా! బాలుఁడవయి నను రాజువగుటచే మాకుఁ బూజ్యుఁడవు. అందుచే మీపాదములపై నేను ప్రమాణము చేసెద" అని మహోత్సాహముతోఁ బలికి రాజ కుమారుని పాదములు స్పృశియించి ప్రమాణముచేసి రాజభక్తి బ్రకటించెను. అంతకుముందు నిరుత్సాహముచేఁ గ్రుంగియున్న రాజ మాతృ విక్రమసేనుల మనస్సులు నూతనోత్సాహ భరితములగు టయు వారిమొగములు వికాసవంతము లయ్యెను.

అంతట మణివర్మ "గదాధరా! నీవృత్తాంతముఁ గొంత నే నెఱుఁగుదును. నీ నడత నీమాటలకు విస్పష్టవ్యాఖ్యానముగానున్నది. ఉప్పునీరు మంచినీరుగా మాఱినట్లు ఎండ కాలవిశేషముచే వెన్నెల యైనట్లు దురాచారుఁడవు పరమసాధువైతివి. నాఁటనుండియు నీచరిత్రము శ్లాఘాపాత్రమై యున్నది. మేము నిన్ను నమ్మికొనియుండెదము. శూలపాణీ! నీయభిమతమేమో చెప్పుము?" అని యడిగెను.

అనవుఁడు శూలపాణియిట్లనియె. "మహాత్మా! చెప్పుటకేమున్నది? కుత్తుకలో విసముఁబెట్టుకొన్నవాఁడుసైతము రాజునెదుట విపరీతముగాఁ బలుకునా? తేనెతేటలూడిపడునట్లే పలుకును. నానడతయే నాభావమును వెల్లడింపవలెను. పలు పలుకులేల? నేను గదాధరుని తోడివాఁడనే. అతనిమనస్సు నామనస్సు నొక్కటియె. అవసరమగునేని మే మిరువురము మాప్రాణములను మా చిన్నిరాజునిమిత్తమై సమర్పించెదము. మాశిరస్సులు రాజ్యలక్ష్మికిఁ గానుకగా నిచ్చెదము. ఇంతకన్న వేఱు చెప్పవలసినది లేదు. దండపాణిని వజ్రపాణిని గూడఁ బిలిపించి వీరిద్దఱియెదుట వారిమనోగతము నరయుదము. మాటలం బట్టియు ముఖలక్షణములం బట్టియు వారిభావ మెఱుఁగవచ్చును. ఈవఱకు మీరు వారితో మాటలాడియుండుటవేఱు; రాజునెదుటఁ బలికించుటవేఱు."

"అది లెస్సయైనపని" యని మాధవసేనుఁడు హెచ్చరించెను. "వారు రాకుండనే మాకుముందుగా సెలవియ్యదగును." అని గదాధరుఁడు వెండియు నిట్లనియె. "ఈస్థితిగతులలో నామనవి యొకటి వినుండు. వెంటనే చిత్రభానుని వెడలఁగొట్టుటకు మనము ససైన్యముగా వానియిల్లు ముట్టడించుట కర్జముగాదు. వారిచేష్టలు మనము కనిపెట్టుచుందుము. మీఁదుమిక్కిలివచ్చినవెంటనే మేము వానిందాకుదుము. రేపుమాపు వచ్చిన తొందరలేదు. నాకిపుడు సెల

వాసంగుడు. పోయివచ్చెదను.'' అని యందఱవీడ్కొని శూలపాణిసహితుండై వెడలెను. మఱియొక పరిచారకుని బిలిచి దేవి దండపాణిని వజ్రపాణిని దోడితెమ్మని బనిచెను. వా డతివేగమున వారిసదనముల కరిగి రాజశాసన మెఱింగించెను. "నీవు ముందునడువుము మేము వెనుక వచ్చెదము'' అని వారిరువురు నొకముహూర్తము తమలోఁ దాము రహస్యముగ మాటలాడుకొని సేవకుం డరిగి యొకగడియ లోనె రాచనగరుఁ జొచ్చిరి. మనో మాలిన్యము పైకిఁ దోచెనో యన్నట్లు మొగములు తొంటియట్లుండక వికాసశూన్యములై యుండెను. మణివర్మ వారినిగూడ సబహుమానముగా గారవించి యుచితాసనంబులం గూర్చుండఁబనిచి మెల్లగ నిట్లనియె—"ఇదివఱకు నేను మీతోఁ జిత్రభానునివిషయమై ప్రసంగించినను మనరాజుగారుగూడ దద్విషయమున మీయభిప్రాయమును స్వయముగాఁ దెలిసికొనఁగోరి మాతృశాసనమున మిమ్ము రావించిరి. మీ హృదయ మకలంకమని నేనెఱుఁగుదును. అదియే రాజుగారు మీనోటవినఁ గోరుచున్నారు. చిత్రభానుఁడు పురమునుండి వెడలవలయునా లేదా! తనయంతటఁ దాను వెడలకున్న మీరాతని సైన్యసహాయమున దేశమునుండి తోలవలయునని మనరాజుగారి యాశయము దండాధినాథు లగుటచే నీ కార్యభారము మీపైఁబడియున్నది.'' అనవచనంబులు విని దండపాణి మొగము చిట్లించుకొని యిత్తెఱంగునఁ బలుకఁజొచ్చె. "అయ్యా! మున్నొకసారి మీరీవిషయము నన్నడిగిరి. అప్పుడు నాకుంబోలిన తెఱంగున మీకుత్తరమిచ్చితిని. చిత్రభానుఁడు పురము వెడలిపోవలయునో లేదో నిర్ణయింపవలసినవారు రాజుగారును మంత్రులైన మీరును గాని మేముగాము. కార్యనిశ్చయము మీరు చేసిన వెనుక మీ యాజ్ఞాప్రకారము దళములఁగొని శత్రుమర్దనము చేయుటమాపని. అదియునుఁగాక మాటిమాటికి మమ్ముంబిలిచి మాయభిప్రాయ మడుగుటకు మేము రాజద్రోహులమా? కుట్రలుపన్నుచున్నామా? మాకు

మాత్రము గౌరవములేదా? ఇట్లవమానించుట మీకుఁదగునా?" యని కఠినస్వరముతోఁ బలుకుచున్న యాదండపాణి మాటకడ్డముపోయి విక్రమసేనుఁడు "అయ్యా! దండపాణీ! మీరు రాజద్రోహులని యెవరన్నారు? మీరు శత్రువులపన్నుచున్నారని యెవరుపలికిరి! రాజకార్య విషయములను సమాలోచించుటకు మిమ్ముఁ బిలువనంపుట మిమ్మవమానించుటా? మణివర్మ యాడినమాటలలో దోషమేమున్నది? మీకింతరోసము రాఁగారణమేమి? రాజ్యక్షేమముఁ జూడవలసినవారు మంత్రులు దండనాథులుఁగదా! రెండుచెట్లకొమ్మలొండొంటితోఁ రాపాడి నిప్పుబుట్టించి వనమెల్లఁ గాల్చునట్లు ప్రధానపురుషులగుమీరుపరస్పరవివాదములుగలిగి రాజకులమున కాపదవాటింపఁజేయుదురా? ఇది ధర్మమా ఘోరకర్మమా?" అని గంభీరముగానడిగెను. అడుగుటయు దండపాణి మొదటికన్నఁ గొంచెము శాంతించి తనచిన్నప్రభువున కిట్లనియె. "రాజా! మణివర్మవైఖరిఁ జూడ మాయెడననుమానము బూనినట్లు దోఁచుచున్నది. మేమనుమానింపవలసిన వారముగాము. ఈవరకు రెండుసారులు మమ్మతఁ డీవిషయమునఁ బ్రశ్నించుటం జేసి యాత్మగౌరవముఁ గలవారమగుటచే సహించుట కష్టముగానున్నది. అందుచే నట్లనవలసివచ్చె. అంతేగాని దేవరవారియెడ మాకెట్టి దురభిప్రాయములేదు. మే మెట్టి ద్రోహముఁ దలఁచుకొనలేదు. మీయాజ్ఞకు బద్ధులము. మీకనుసన్నలమెలఁగెదము. మీముదలయగునేని యెట్టిపనినైనఁ జేయఁగలవారము. కావున మాయందు సంపూర్ణవిశ్వాసము నిలుపవలయునని ప్రార్థించుచున్నాము." అనవుడు మణివర్మ "నావైఖరింబట్టి మీ కాగ్రహము గలిగినదా? మీ కవమానము గలిగింపవలెనని నేఁ గలఁనైన దలఁపలేదు. నామాటలలోఁగాని భావములోఁగాని నాముఖలక్షణములోఁగాని మీ కవమానకరములైన చిహ్నలేవియు లేవు. ఒకవేళ మీకట్లు దోఁచినపక్ష

మున నేను వయోవృద్ధుఁడను చంచలస్వభావుఁడను గావున నన్ను క్షమియించి రాజకార్యమును జక్కఁజేయుఁడు. మనకు వివాదములున్నపక్షమునఁ బిమ్మటఁ దీర్చికొనవచ్చు నని యనునయపూర్వకముగాఁ బలికెను. అంతట వారు రాజును మంత్రులను వీడ్కొని స్వగృహముల కరిగిరి.

వారు వెడలినపిదప మాధవసేనుఁడు మణివర్మతోఁ "జిత్తగించితిరా? వాని మాటలవరుస. వానినీడలుచూచి వారే భయపడుచున్నారు. అంతఃకరణము మలినమైనప్పుడు మానవుని కెదుటివారి మనస్సులుగూడ మలినములైనట్లు గనఁబడును. కామిలరోగికిజగమంతయుఁ బచ్చఁగాఁ గనఁబడునుగదా? చూచితిరా! గదాధరునిమాటలకు వీనిమాటలకు నెంత వ్యత్యాసమున్నదో, అతని రాజభక్తి హృదయమునుండి వెల్లివిరిసినది. వీని భక్తి జిహ్వాగ్రమునుండి వచ్చినది. కావున వీరిని విశ్వసించియుండుట శ్రేయస్కరముగాదు." అని వచియించెను. "నీవుయదార్థము వచించితివి. దోషాత్మునకు లేనిచోట ననుమానముగలుగును" అని మణివర్మ వానికుత్తరమిచ్చెను. విక్రమసేనుఁడు చిఱునవ్వునవ్వి ఉన్నమాటన్న నులుకెక్కువన్నట్లు దండపాణికి నిర్హేతుకమైన యాగ్రహమువచ్చినది. మనము వీరివిషయమున జాగ్రతగానుండవలె నని పలికెను. "మీరిద్దఱు గదాధరశూలపాణులు నను నాలుగుస్తంభములమీఁద నిప్పుడు కాశ్మీరరాజ్యసౌధము నిలిచియున్నది. దండపాణి రాజభక్తి మలినమైనదో శుద్ధమైనదోసమయమను గీటురాతిమీఁదఁగాని తెలియదు. ఇంకమీరు మీపనులమీఁద నుండుఁడు" యని యరవిందాదేవి పలికి వారికి సెలవిచ్చెను.

తొమ్మిదవ ప్రకరణము

రాచనగరమునుండి వెడలి దండపాణియుఁ సోదరుఁడునుస్వగృహం బులకుఁ జనక యూరేయి వెండియుఁ జిత్రభానుని గృహంబున కరిగి రాజగృహంబున నాఁడు జరిగినవృత్తాంత మంతయు దెలిపిరి. చిత్రభానుఁడు తనయెడ వారికిఁ గల యమితానురాగమునకు సంతసించి కొండొకవడి పొగడి యిట్లనియె. "మిత్రులారా! అయస్కాంతమునకు సూదికింబలె నాకును మీకును గాఢసంబంధము కుదిరినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. మీచెవినిఁ బడిన చిన్న మాటయు దాచక నాకు వెంటనే తెలియఁజేయవలె నని మీరు సంకల్పించుట మనకార్యసిద్ధికి సూచకము. ముందుగా వారే కలహమునకు డీకొనునట్లు మనము చేయవలయునుగాని మనము దిగఁ గూడదు. అందుచే నీలోపున సైనికులవిషయమున మీరు వలసిన ప్రయత్నము చేయుచుండుఁడు" అనుచుండ రుద్రభట్టు "కీలకమంతయు సైన్యములోనే యున్నది. దానిఁ గలఁచుట కనేకప్రయత్నములు గానలయు. కొంతయత్నము మేముఁగూడఁ జేయుచున్నాము అది యిఁకమీఁద గాలక్రమమున మీకుఁ దెలియఁగలదు" అని పలికెను. అనంతరము గొంతసంభాషణము జరిగినవెనుక దండపాణి యిట్లనియె. "మాకొక్క కోరికయున్నది. అది మీ యిరువుర సన్నిధానమున విన్నవింపఁదలఁచుచున్నాము. కర్పూరమంజరిని మావజ్రపాణికిచ్చి వివాహము చేయుటకు మీరంగీకరించిరి గనుకను మామణిమాలికను విజయసేనునకు బెండ్లిచేసికొనుటకు మీరిష్టపడిరి గావునను నీరెండుకార్యములకుఁ బ్రధానము చేసికొనవలెనని మే మువిలాటబడుచున్నాము. మాముద్దు చెల్లించి యీకార్యము చేయవలయు."

అప్పలుకులలో మొదటిభాగము చిత్రభానునకు రుచింపలేదు. ఏలయన గుణముల పేటికయైన కర్పూరమంజరి వజ్రపాణినివరించున్నో

వరింపదో చిత్రభానుఁ డెఱుఁగఁడు. ఇంతకుమున్నా మెతో నాప్రసంగముచేయనే లేదు. రెండవభాగమైన మణిమాలికా వివాహము చిత్రభానునకిష్టమే. ఆవిషయమై ప్రధానముచేసికొన్నను నతఁడు చేసికొనుటకు సిద్ధముగనుండెను. ఒకటిచేసి రెండవది మానినట్లున్న వారి కనుమానము కలుఁగవచ్చును. చేసినరెండును జేయవలయు; మానిన రెండును మానవలయు. చిత్రభానున కప్పుడు విషమపరిస్థితులు తటస్థించెను. తాము తలపెట్టిన 'కార్యములన్నియు ముగిసిన పిదపఁ బ్రధానములు చేయవచ్చునని చెప్పినచో వారికి విశ్వాసముండదని భయము. అందుచే నెద్దియుం దోఁచక యతఁడు వెంటనే యుత్తరమీయక మనోవేదనము బడుచుండ వానిచేష్టలంబట్టి మనోగతభావమెఱింగి రుద్రభట్టు "దండపాణి కిట్లనియె. దండపాణీ! నీ సంకల్పము మంచిది. 'శుభస్య శీఘ్ర'మ్మను నార్యోక్తిని బట్టియు 'నాలస్య మమృతం విష'మను న్యాయమును బట్టియు నిట్టివి వెంటనే జరుగుటమంచిది. కాని యవి క్రొత్తవారివిషయమునఁగాని, మీవంటి పూర్వపరిచితుల విషయమునఁ గావు. మాటయే ప్రధానముగాని మానవంతులకుఁ బ్రధానము ప్రధానము గాదు. పసుపుం గుంకుమ పండ్లుదెచ్చి యొండొరుల కిచ్చి పుచ్చుకొనుటచేత ననుకొన్నమాటలు స్థిరమగునా? కానిచోఁ గార్యములు భగ్నమగునా? అగ్నిసాక్షిగఁ జేసిన ప్రమాణముల కన్నఁ బ్రధానములు బలవత్తరములా? ఇది యొక ముచ్చట. అదియు నాఁడు వారిముచ్చట. మగవాండ్రు దానిం గూర్చి యంత పట్టింపులు బట్టఁగూడదు. కాఁబట్టి కాలాంతరమున నన్ని ముచ్చటలు దీర్చికొనవచ్చును. ఇది విషమసమయము. తాంబూలములు పుచ్చుకొనుటకైనఁ బదుగురు పెద్దమనుష్యులు వచ్చుటకు వీలులేని తరుణముగదా యిది! పదిమంది జేరి వెల్లడిగా జరుగవలసిన శుభకార్యము చాటున మాటున జేసికొనుట యేటి తగవు? కావున సర్వవిధముల నిది కాలాంతరమున గావచ్చును. మీఁద మీయిష్టము."

అదివఱకేమియుఁ దోఁచకయే మీ యుత్తరము జెప్పుదునా యని సందిగ్ధమనస్కుఁడై యున్న చిత్రభానునకు రుద్రభట్టు పలుకులు ధైర్యము గొలిపెను. అప్పలుకు లంతగాఁగొని చిత్రభానుఁడు వారి నుద్దేశించి "విజయసేనుఁ డెక్కడి కేగును? కర్పూరమంజరి యెక్కడి కరుగును? ప్రధానములు కాకపోవు. వివాహములు, గాకపోవు. వివాహము ప్రధానముగాని, ప్రధానము ప్రధానము గాదు. చంచలచిత్తులకు మాటనిలకడలేని వారికి బ్రధానములుగాని మన కేల? ఈమహాత్ముఁడు సెలవిచ్చినట్లు గాలాంతరమునఁ గావచ్చు" నని పలుక వజ్రపాణి "యిప్పుడు చేసికొని నందువలనఁ దప్పేమి" యని మెల్లగాఁ బలికెను. "నామాట యెటులున్నను జిన్నవాఁడైన మాతమ్ముని కోర్కె దీర్చుట సర్వోత్తమము" అని దండపాణి వాక్రుచ్చెను. వారు పట్టినపట్టు వదలకపోవుటచే సమయము దాటించుటకు రుద్రభట్టు "సరే! అట్లె యగుఁగాక! ప్రధానమునకైన మంచిముహూర్త ముండవలయు. నేనా సుముహూర్తము బెట్టి మీకుం దెలియబరచెద. మీకిష్టమేకద?" యని బలికెను. "అహా! మాకిష్టమే" యని వారిరువురు సంతుష్టులై సెలవుఁగైకొని పోయిరి. వారు వెడలినపిదప రుద్రభట్టునకును జిత్రభానునకును నీ క్రిందివిధమున సంభాషణము జరిగెను.

చిత్రభాను—స్వామీ! నేనిప్పుడు పిశాచమునకు సముద్రమునకు నడుమనున్నాఁడను. ముందరకువచ్చిన దయ్యము మ్రింగును. వెనుకకుఁబోయిన సముద్రతరంగములు ముంచి చంపును.

రుద్రభట్టు—ఏ మట్లనుచున్నాఁడవు?

చిత్ర—వజ్రపాణికోరిక దుర్ఘటముగా నున్నది. కర్పూరమంజరి మనస్సుచందము నేనరయలేను. అది వీనిపై వలపు నిలుపునో లేదో తెలియదు. అది వీనిఁగూర్చి మేలుపడదేని పండఁబాఱిన పొల

మొదలుపెట్టినట్లు గార్యమంతయు భగ్నమగును. వీరు ప్రధాన మిప్పుడే చేయవలె ననుచున్నారు.

రుద్ర—ఇందుకా యింతబెంగ? మానవుడు కష్టసమయముల యందే ధీరోదాత్తుండై, తన మనశ్శక్తిని జూపవలయును. తొందర పడక బెంగగొనక కలతనొందక నరుడు నిర్మలమగు తటాకజలము నలెఁ బ్రవిమలమనస్కుఁడై యుండినా యెంతెంత కష్టసమయము లందును మబ్బులేని యాకసమున సూర్యోదయమైనట్లు చక్కని యుపాయములు తోఁచును.

చిత్ర—అది జితేంద్రియులగు మీకు సాధ్యముగాని మావంటి సంసారులకు సాధ్యముకాదు. కష్టసమయము రాఁగానే మనస్సు నిప్పుఁ ద్రొక్కిన కోఁతివలెఁ జంచలమై యాలోచన కనర్హమై యుండును. కావున నిప్పుడు నాకేమియుఁ దోఁచకున్నది.

రుద్ర—నీ కూఁతురు మనోరథ మేమో తెలిసికొనకయే నీ వింత కలఁతజెంద నేల? ఆమె నీకోరిక నిరాకరింపకపోవచ్చును. ఆమె నడిగిరమ్ము. కార్యము సఫలమయ్యెనా సరె! కాదేని నాఁటి కొక యుపాయ మూహింపఁజాలమా?

చిత్ర—అట్లయిన నే నామె నడిగి వత్తునా?

రుద్ర—ముందుగా నీ వడుగుట యుక్తముగాదు. ఆఁడుబిడ్డ లకుఁ జిన్ననాఁటనుండి తల్లిదగ్గరఁ జనవులు మెండు. కావున నామె మనోరథ మేమొ తల్లిచే నడిగింపుము.

చిత్ర—సిగ్గుపెంపునఁ దల్లికిఁ జెప్పనిపక్షమున?

రుద్ర—అంతకన్న నెక్కుడు మచ్చికయుఁ జనవులుగలవారు చెలికత్తియలు. చంద్రికను మల్లికను వేఱువేఱుగఁ బిలిచి రహస్యముగ నడుగుము. రాజపుత్రికల తలంపులకుఁ జెలికత్తెలు ద్వారపుదు బరిణలు.

చిత్ర—అట్లయిన నేను తద్విషయప్రయత్నమున నుండెద. ఇవి యన్నియుఁ దేలినతరువాతనే మనము సుముహూర్తముఁ మాట నాలోచింపవచ్చును.

రుద్ర—నీకూఁతురు రాచనగరములో నున్నదికదా! మీ సెయ్యము లంతకంత కెడమగుచున్నప్పుడు మీపుత్రిక శత్రుగృహమున నుండుట నీకును వారికిని శ్రేయముగాదు. వెంటనే బిలువనంపుము. పాముపగయుఁ బడగ చుట్టము నగునా?

చిత్ర—ఔను! ఆమె నిటకు దోడితెచ్చుట యుభయులకు శ్రేయస్కరము. అట్లచేసెద.

అని యాతని వీడ్కొని చిత్రభానుఁడు దీర్ఘాలోచనావశంబున మెల్లమెల్ల నడుగు లిడుకొనుచు నభ్యంతర మందిరమునకుం జని యిందుమణిం గాంచి కర్పూరమంజరిని వెంటనే పిలిపింపుమని యాన తిచ్చెను. అట్ల కాక యని యామె చంద్రికామల్లికలఁ బిలిచి "రాచనగరమున కరిగి బాలికం దోడితె"మ్మని సెలవిచ్చెను. సెలవిచ్చుటయు తడవుగా వారిరువురు నచ్చోటికిం జనిరి. ఆలోపున నిందుమణితోఁ జిత్రభానుఁడు గృహకృత్యంబులం గూర్చి కొంత ముచ్చటించి కర్పూరమంజరి మాటయెత్తి ప్రసంగవశమున నిట్లనియె. "బాలిక వివాహయోగ్యమగు వయస్సును బ్రాపించినది. ఇంక మన మాలసింపక వరాన్వేషణమునకుఁ గడంగవలయు."

ఇందుమణి—నానోటితో నేననఁగూడదుగాని దానింజూచిన వారందఱు నిది సర్వలక్షణసంపన్న యగుకన్య. దీని కనుకూలుఁడగు వరుఁడు లభించుట కష్టమని పలుమాఱు నాశ్చర్యపడిరి.

చిత్రభాను—అన్ని లక్షణములు నొక్కచో గుమిగూడి యుండునా? దానికనకుఁ గావలసినంత తీపియున్నదిగాని పండ్లు లేవు. పనసపండు గర్భమున రసవంతము లైన తొనలుండును.

మీఁదిభాగము మిక్కిలి మోటగా నుండును. విశేషించి పనసకుఁ బూవులు లేవు. మామిడికి జీడియుండును. సీతాఫలమునకు లెక్కలే నన్ని గింజలు. భానునియందు దుస్సహమైన వేఁడియుండును. చంద్రునియం దతిశైత్యముండును. అట్లే పురుషులయందు నొకఁడు సత్కులప్రసూనత గలిగియుండును. ఒకఁడు చక్కదనంబున కిక్క యగును. ఒకఁడు గానమునకు స్థానమగును. ఒకఁడు మాటలలోఁ దేనె తేటలు గురిపించును. ఒకఁడు విద్యానిధియై పుంభావసరస్వతి యగును. ఒకఁడు వాక్పటిమలో నపరశేషుఁ డనిపించుకొనును. ఒకఁడు మేటిమగంటిమికిఁ బేరువడును. ఒకఁడు సౌజన్యమునకు భాజనమగును. ఇన్ని శుభలక్షణములు నొక్కచో నుండునా ? అది యసంభవముగాదా ! అందుచే నెవ్వో కొన్ని శుభలక్షణములు జూచి వరనిర్ణయము జేసికొన వలయును.

ఇందు—ఆ లక్షణములు మీకును నాకును నచ్చవచ్చును. బాలిక మెచ్చవలదా ?

చిత్ర మెచ్చ కేమిచేయును ? దివ్యౌషధుల నన్నిటినో గలిపి వైద్యుఁడు మాత్రజేసినట్లు బ్రహ్మదేవుఁడు సమస్తశుభలక్షణములు గల పురుషునిఁ గ్రొత్తగా మన కన్యకకొఱకు సృష్టింపవలెను !

ఇందు—ఇదివఱకే సృష్టింపఁబడి యున్నాఁడు. క్రొత్త సృష్టితోఁ బనిలేదు.

చిత్ర—అట్లయిన బాలిక యెవనిమీఁద మనసు నిలిపినదో చెప్పఁగలవా ?

ఇందు—[illegible] నాఁడు [illegible]గను. ఇదివఱకే సృష్టింపఁబడి నాఁడని మాటవరుస కంటిని.

చిత్ర—వజ్రపాణియుని యొక్క సేనాపతి యున్నాఁడు. వాని నెఱుఁగుదువా !

ఇందు—నేన్నఁడుఁ జూడలేదు. వినియుంటిని.

చిత్ర—వాఁడు సేనాపతియగు దండపాణికుమారుఁడు. అతని వంశము మంచిది. స్థితి మంచిది. ప్రాయమున నున్నవాఁడు. అతనికిచ్చి వివాహము చేయవలెనని నాకోరిక. అతనిం జేపట్టుమని బాలికతో నీవు నొక్కి చెప్పుము.

ఇందు—చెప్పెదనుగాని నామాటయందు దానికి విశ్వాసము లేదు. మల్లికకు దానికి నత్యంతమైత్రి. దానిచేతఁ జెప్పింపుఁడు. బిడ్డ మాత్రము యుక్తాయుక్త మెఱుఁగదా? మంచిసంబంధమైనచో నది యేల నిరాకరించును?

చిత్ర—మంచిదనుట నిస్సంశయము. నీవు చెప్పినట్లు మల్లికతోఁగూడ మాటలాడెదను.

అని సంభాషణ ముగించి యావలకు జనెను. సంధ్యాకాల మగునప్పటికి మల్లికాచంద్రికలు కర్పూరమంజరిం దోడుకొని గృహముం జేరిరి. రేయి భోజనమైనతరువాతఁ గర్పూరమంజరి పెందలకడ బండుకొనెను. ఆమె నిద్రఁబోవఁగాఁ జూచి చిత్రభానుఁడు మల్లికను దన పడకగదిలోనికిఁ బిలిచి పీటపైఁ గూర్చుండఁబెట్టి కొంతసేపు దాని సేమమరసి రాజాంతఃపురమందలి వార్త లేమని యడిగి కొండొకవడి కిట్లనియె—"మల్లికా! నీయెదుట నిన్ను బొగడఁగూడదు గాని నీవు నిజముగా గుణపుష్పములతో నిండిన వల్లికవు. ముద్దుల మూటగట్టు నీమొగముఁ జూచినను గ్రమ్మతేనియలొలుకు నీపలుకులు విన్నను హృదయంగమములయిన నీగుణములు జూచినను నాకు బ్రహ్మదేవునిఁ దిట్టబుద్ధి. ఎందుకందువా? మతిలేని యాముసలిదయ్యము బహుళగుణసంపదగల నిన్ను నేదో యొకమహారాజ గర్భమునఁ బుట్టింపక సేవకురాలిఁగా జేసినాఁడని. ఆవెఱ్ఱిముండకొడుకు చేసెడి సృష్టిలో నిట్టివి వందలకొలఁది గలవు. నిన్ను స్తోత్రము చేయుటకు

గాదు నేనిట్లనుచుంట. యదార్థము నాకడుపులో దాఁగదు. పెద్దదైన మంచిదైన కుండ పగులగొట్టినట్లు వెంటనే యనుట నాకలవాటు. కర్పూరమంజరి యొకర్తయే నాకుఁగూతురైనదని మఱియొకకూఁతురులేకపోయెనని చాలాకాలము విచారించితిని. కాని నిన్నుఁ జూచుకొని యావిచారము పోగొట్టుకొంటిని. నీవే నారెండవ కూఁతురవు. అట్లగుటచేత మీ యక్కవిషయమున నీతో నొక్కమాట ముచ్చటింపవలెనని పిలిచితిని. బిడ్డసంప్రాప్త యౌవనయైనది. వివాహయోగ్యకాలము ప్రాపించినది. వరాన్వేషణముచేయవలయును. నీ జిహ్వ దాని యభిప్రాయము ప్రతిఫలించు నద్దము. అందుచే నిన్నడుగుచుంటి. అది యీవఱకెవ్వనిమీఁదనైన మనసు నిలిపినదా? నిజము దాఁచక చెప్పు?" అనవుడు మల్లిక చిఱునవ్వునవ్వి "ఏమోనండి! నాకుఁదెలియదు. ఆమె మనస్సులో నేమున్నదో నా కెట్లు తెలియునండి" యని బదులుచెప్పెను.

అనుటయు నతడు వెండియు నిట్లనియె. "ఓసీ! నీ వెఱుఁగని రహస్యములుదానికుండవు. దానిమనసులోమాటనీచెవిలో నుండును. చెప్పకపోతివా నన్నుఁ జంపుకొన్నట్లె." యని నిర్బంధించి యడిగెను. "అయ్యో! ఇదేమిపాపమండి. చిన్నపిల్లలము. మాలో మేమేదో పరిహాసమునకో మఱెందుకో యెన్నోమాట లనుకొందుము. వాటివిషయమై నిర్బంధించి యొట్లుదిట్లుప్రయోగించిన మేమెట్లు బ్రతుకఁగలము? నన్ను మీరు నిర్బంధింపవద్దు" అని నిష్ఠురముగా నామె బలికెను. "పోనీ! నన్నుఁ జంపుకొన్నట్లె గాఁబోలును. నీవు నా కూఁతురవని చెప్పితినిగదా! నీవును గర్పూరమంజరియుఁ దండ్రి లేని కూఁతులగుదురు గాక!" యని కఠినముగఁ బలికెను.

అప్పుడు చేయునదిలేక మల్లికమెల్లమెల్లగా నిట్లనియె—"నాతో నామె చెప్పలేదుగాని మున్నామెకు జబ్బుచేసినప్పుడు మాళవ

రాజ కుమారుఁడగు మకరందుఁడువచ్చి వైద్యముచేసెను. అప్పటి నుండి యాతనిమీఁద మనసునిలిపిన దేమోయని నాయూహ. అయ్య గారూ! నే నీమాట చెప్పితినని యామెతోఁ జెప్పవద్దు. 'నీనోట నువ్వుగింజదాగదు పనికిమాలినదానా' యని నామీఁద మీబిడ్డయుఁ జంద్రికయుఁ గోపించి చెప్పుదురు."

అనవుడు చిత్రభానుఁడు "బిడ్డా! నీవుచెప్పినట్లు నేను చెప్పను. కాని, నే నొకరహస్యము జెప్పెద. అది నీమనసులో నుంచుకొని పనిచేయుము. అట్లు చేసెదవా?" యని యడిగెను. "నాచేతనైన పటిమున నదితప్పక చేసెద" నని యామె యుత్తరమిచ్చెను. అంతటఁ జిత్రభానుఁడిట్లనియె. "బిడ్డా! మకరందునిమీఁద నిలిచిన యామె మనస్సును నీవు త్రిప్పుటకుఁ బ్రయత్నము సేయవలయు. మకరందుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు, వేదశాస్త్రములు విశ్వసింపనివాఁడు. అట్టివానిఁ జేపట్టఁ గూడదని నీబుద్ధికుశలతకొలఁది హేతువులఁగల్పించి దృఢముగా చెప్పుము. నీవు బుద్ధిమంతురాలవు. ఇటు జెప్పుమటు జెప్పుమని నీకు నేఁ జెప్పవలెనా? ఓసీ! తెలియక అడుగుచున్నాను. మకరందుఁ డేలాగుండును?"

"ఏలాగుండునని చెప్పనుస్వామీ! భూలోకమున విహరింప వచ్చిన మన్మథుఁడు. గుణములు చెప్పఁదలఁచితినా వర్ణింపశక్యమే గాదు. దానికిందగిన పరాక్రమము. అందుకుఁదగిన విద్య. ఇదియది యననేల? అన్ని మంచిగుణములున్నవండీ!"యని మల్లిక యుత్తరము చెప్పెను. చిత్రభానుఁడదివిని వెండియు నిట్లనియె. "ఎఱ్ఱఁగా బొఱ్ఱఁగా నుండఁగానే సరియా? మేడిపండు మిక్కిలి మెఱయుచుండును. పొట్టవిచ్చితినా పురుగులకుంపు. ఆకారముఁజూచి యెవ్వరిని వరింప రాదు. గుణములకేమి యెవరిగుణములు వారికుండును. ఎన్ని గుణము లున్ననేమి? వాఁడు మనవాఁడు కాఁడు. బౌద్ధుఁడు పాషండుఁడు.

అట్టివానిం జేపట్టుట పాపముగాదా'' అనవుడు మల్లిక "స్వామీ! మకరందునివిడిచి యేరాజకుమారుని వరింపవలసినదని మీ యభిప్రాయము'' అని యడిగెను. అడుగుటయు నవ్వుచు మాళవేశుఁ డిట్లనియె. "ఆఁ ఇప్పుడు మంచిదారికి వచ్చితివి. చెప్పుచున్నాను విను. ఈపట్టణమున దండపాణియను సేనాపతిగలఁడు. అతని తమ్ముఁడు వజ్రపాణి కలఁడు. అతనిని వరింపవలసినదని నాయభిప్రాయము. అతఁడు సద్గుణవంతుఁడు. బాహుశాలి. సత్కులజాతుఁడు. ఎప్పుడైన జూచితివా?''

అనవుడు మల్లిక నవ్వుచు నిట్లనియె. "చూచితినండి! సన్నికల్లు మీఁది గుండ్లవలె మొగముమీఁద మశూచకము మచ్చలుఁ గలిగి నల్లగానున్నయతఁడే కాదా? చూచిచూచి యమ్మాయికొఱకు మంచి పెండ్లికొడుకు నేరినానండి! అతని యొడలతఁడే కన ప్రమాణ లేనంత లావు. అతనిశరీరమునుండి చమటలుగారినప్పుడు కొండమీఁదినుండి సెలయేళ్ళు ప్రవహించిన ట్లుండును. అతనిమీసములు మొగము నొకకే రంగున నుండును. వయస్సుచూచినను నలుపదేండ్లకుఁ దక్కువ యుండదు. ప్రథమభార్య యున్నది. ఆమెవలన నలుగురో ముగ్గురో బిడ్డలుకలరు. ఈ వన్నె పెండ్లికొడుకును జేపట్టుమని చెప్పుటకు మాకు నోరెట్లాడును? మేమొకవేళ జెప్పినను నామె యెట్లు సమ్మతించును? అట్టివివాహము లోకులెట్లు మెత్తురు? చెప్పుటకు మాకే సిగ్గగుచున్నది. ఆపెండ్లికొడుకు సరసను మీబిడ్డయెట్లు కూర్చుండునండీ? వారిద్దఱు కాటుకముద్ద పసుపుముద్దవలె నుండురు.'' అని పరిహాసోక్తులు పలుకుచున్న మల్లికకుఁ బ్రత్యుత్తరముఁ జెప్పఁదలఁచి చిత్రభానుఁ డిట్లనియె: "ఓసీ! శరీరమునల్లగా నున్న నేమి యెఱ్ఱఁగానున్న నేమి? కొఱుకుకొని తిందురా యేమి! వంశము గుణము భాగ్యము చూచుకొనవలెనుగాని రూపమెందుకే? అట్లయినఁ జైతన్యములేని బంగారపు బొమ్మను బెండ్లాడవచ్చునా? నీయుల్లసోక్తులు గట్టిపెట్టి నామాటవిని

నీచెలికత్తెదగ్గఱ వజ్రపాణిని జక్కఁగాఁ బొగడివర్ణింపుము. అతఁడు సత్కులజాతుఁడనుము. గుణనిధానమనుము. పరాక్రమంబున రెండవ కుమారస్వామి యనుము. అతనిం జేపట్టిన వీరపత్నియగుననుము. అనంతరము వీరమాతయగుననుము. కావలసినంత భాగ్యమున్నదను ము. ఒకభార్యయున్నను దానే యగ్రమహిషి కావచ్చుననుము. స్త్రీ కింత కన్నఁగావలసిన దేమున్నదనుము. ఓసీ! ఇన్నిమాటలెందుకు! ఎట్లు చెప్పవలెనో యట్లుచెప్పి కార్యము సఫలముచేసితివా నీకొక రత్నాలహారము వెలలేనియొకముత్యాలహారము బహుమానమిచ్చె దను. నీమేలు మఱచిపోను.''

అతఁడు చెప్పినదంతయు విని మల్లిక ''అయ్యా! మీయాజ్ఞ శిరసావహించి నేనామెకొఁ జెప్పుకునుగాని యామె నామాట విశ్వ సించునని నాకునమ్మకములేదు. అని యాయనయొద్ద సెలవుగైకొని మల్లిక శయనాగారమునకరిగెను. ''ఈపలుగుముండయే శకునపక్షి లాగున విరుద్ధముగాఁ జెప్పును. ఇఁకనామె నాకనుకూలముగఁజేయు నా? యని తనలో వితర్కించుకొనుచుఁ జిత్రభానుఁడు పండుకొనెను.

పదియవ ప్రకరణము

కాశ్మీరరాజు సైనికులు వసించుటకు శ్రీనగరమునకుం బడమటఁ బ్రత్యేకముగా నొకపేటకలదు. అందు సైనికులు సేనానాయకులు మాత్రమే వయింతురు. సైనికుల దేహపరిశ్రమలకు, వ్యాయామ ములకు, వారిబిడ్డల యాటలకు ధనుర్విద్యయందు నభ్యాసముచేసికొను టకు మల్లయుద్ధములు, నేర్చుకొనుటకు యుద్ధవిశారదులగుటకు కు మ్కరణములు గావించుకొనుటకుఁ దగు విశాలభూములక్కడ నేర్పడి

యున్నవి. ఉదయాస్తమయముల యందు సైనికులు నానావిధముల గూన సాధనములతో బహుపరిశ్రమల జేసి నేర్చినవిద్య మఱపురాకుండునట్లు చేసికొనుచుందురు. యోధులు సాధారణముగా విద్యావిహీనులై యుండుటచే గ్రంథపఠనము చేతగాదు కావున బహుపురాణవేత్తలు ధర్మశాస్త్రవిశారదులు చిత్రకథాకథనకుశలురు జ్యోతిశ్శాస్త్రవేత్తలునగు బ్రాహ్మణులు స్కంధావారముఁ జొచ్చి పూర్వరాజులచరిత్రములు మొదలగునవి చదివి వినిపించియు మనోహరములగు కథలు చెప్పియు వారిమనోరంజనము చేయుటయేగాక వారికిఁ బుణ్యముపురుషార్థము నెఱిఁగించి యుక్తాయుక్తవివేచన జ్ఞానముఁ గలిగించుచుందురు. అందుచే బ్రాహ్మణులన్న వారికిఁ బరమభక్తి. వారు నిజముగా స్వర్గమునుండి భూమి కవతరించిన దేవతలని నమ్మి యోధులు వారియిల్లాండ్రు మిక్కిలివినయంబుగదుర వారికి నమస్కారములు చేసి సన్మానించి యుచితాసనంబులనునిచి శక్తికొలంది ధనధాన్యముల నూత్నవస్త్రములనొసంగి సత్కరించుచుందురు. ఆఁడువాండ్రు పగలు గృహకృత్యములందగిలియు మగవాండ్రు నానావిధ పరిశ్రమలఁజిక్కియుఁ దీరికలేకయుండుటంజేసి సాధారణముగాఁ బురాణశ్రవణాదు లప్పేటలో రాత్రులే జరుగుచుండును. పౌరాణికుని వసంతఋతు రాత్రులయందు వారు చల్లని లేఁతగాడ్పులువీచు బయళ్ళయందుఁ గూర్చుండఁబెట్టి వందలకొలఁది స్త్రీపురుషులు చేరి పురాణ మాలకించి యానందించుచుందురు. వర్షకాలమునను, శీతకాలమునను భజనమందిరములయందె ఈసభలు జరుగుచుండును.

అత్తఱి నొకనాఁటిరేయి నొకబ్రాహ్మణుఁడు మార్గాయాసమున రొజుచు నొకయోధుగృహమునకుఁ బోయి "అయ్యా ! పండుకొనుటకు నాకించుక తావు నొసంగు ధర్మాత్ము లెవ్వరైన నున్నారా? నేను బాటసారిని. బ్రాహ్మణుఁడను. పగలెల్ల నెండలో మలమల

మాడి నడిచియున్న కతమున మిక్కిలిడస్సియున్నాఁడను. అడుగులు
పుడపుడబొక్కినవి" యని యడిగెను ఆగృహయజమానుఁడగుజోదు
"స్వామీ! మాయరుఁగుమీఁద మీరు పండుకొనవచ్చును. దయచే
యుఁడు" అని యుత్తరమిచ్చెను "నాయనా! నీకెంతైనఁబుణ్యముగ
లదు. రక్షించితివి" అని యాబ్రాహ్మణుఁడు తనకృష్ణాజినము నా
యింటియరుఁగుమీఁదఁ బెట్టి యంగవస్త్రముతో నడ్డికిఁగట్టిన యిత్తడి
చెంబుఁ దీసి "నాయనా! పాదప్రక్షాళనమున కుదకము కావలెను.
చేరువ నెక్కడైన నూయికలదా?" యని ప్రశ్నించెను. "స్వామీ!
అల్లదె నూయి" యని చూప విప్రుఁడు ముఖహస్తప్రక్షాళనముఁ జేసి
కొని కడుపునిండ నీరుద్రావి మరల నప్పదాతియింటికిఁజని దర్భాస
నముఁ బఱచుకొని యుచ్చైశ్వరముతో మహిమ్నస్తోత్రముఁ జదువ
నారంభించెను. అదివిని జోదులనేకు లచ్చటఁజేరిరి. కొందరాశ్లోకముల
యర్థమడిగి తెలిసికొనిరి. అది ముగిసినవెనుక వారిలోఁగొందఱు
బ్రాహ్మణుని నామధేయము దేశము నామముఁ దెలిసికొనఁగోరిప్రశ్న
లడిగిరి. వారిప్రశ్నలకు బ్రాహ్మణుఁ డిట్లుత్తరముఁ జెప్పెను.
"అయ్యా! నాపేరు వేదశర్మ, నాది గాంధార దేశము. అందుఁ దక్ష
శిలయను గ్రామముగలదు. అది నానివాసస్థలము. ఏమహానుభావుఁడు
సంస్కృతభాషయందలి శబ్దజాలమున కెల్లనియమముల నేర్పఱుపఁ
దలఁచి సర్వబుధజనశ్లాఘ్యమైన వ్యాకరణ శాస్త్రమువ్రాసిభాషా
ప్రపంచము నుద్ధరించెనో సుశబ్ద ప్రయోగము జేసినప్పు డెవ్వానిపవిత్ర
నామము ప్రతిపండితునకు మొట్టమొదట జ్ఞాపకమువచ్చునో యట్టి
మహానుభావుఁడు పాణినిజన్మించినట్టి గ్రామమది. ఆమహాత్ముఁడేగాక
బహువ్యాకరణవేత్తలు, బహువేదపారంగతులు బహుపురాణసంవి
దులు, సకలధర్మశాస్త్రవిశారదులు బ్రహ్మవాదులు, నచ్చటఁ బలు
వురుగలరు. ఆసేతు హిమాచలమగు భరతఖండమందలి నానాభాగ

ములనుండి విద్యార్థులై బ్రహ్మచారు లప్పురికివచ్చి భిక్షాటనముఁజేసి జీవించుచు గురుశుశ్రూషాపరాయణులై తమకభిమానశాస్త్రంబుల నేర్చుకొని పోవుచుందురు. అది గొప్పవిద్యాసత్రము. సరస్వతికొలువుకూటము. చదువులకోటారు. కాశ్మీరదేశమున హిరణ్యపురమున నాకుంజుట్టములున్నారు. వారింజూడఁదలంచి నేను పయనమైపోవుచున్నాఁడ, మార్గపరిశ్రమ మెక్కుడగుటచే నగరమునకుఁబోలేక నిప్పేటలో విడిసినాఁడ. కాని కాశ్మీరదేశమింతయల్పకాలములో నేయింతదుస్థితికి వచ్చునని నేను స్వప్నమందైనఁ దలఁపలేను, తక్షశిలలోనిపంతులందరిందుకై వగచుచున్నారు" ఈచివర వాక్యములు రెండు మెల్లగాననెను "ఏమి! అట్లనుచున్నారేల?" యని పలువురుతొందరతో నడిగిరి.

"అయ్యో పొరబాటున నోరుజారి యనఁగూడనిమాటంటినే అయ్యా! బాటసారిని పేదబాపఁడను. ఈగొడవలు నాకెందుకు నన్ను విడిచిపెట్టుఁడు. ప్రశ్నలవర్షముతో నన్నుఁదడుపకుఁడు" అని యతఁడు బదులుచెప్పెను.

స్వామీ! అట్లుగాదు. అది యేమోవిన్నదాఁక మామనస్సులు తత్తఱపడుచున్నవి. మీరిది చెప్పితీరవలయు, మీరుబ్రాహ్మణోత్తములు' లోకులందఱికి మేలుగోరువారు. అట్టివారు మాదురవస్థ యేమో తెలుపవలదా? దానికిం దగినప్రతిక్రియఁ జేసికొనుమా? అట్టివారు మీరు నోట పొరబాటుమాటరానియ్యనే కూడదు. మాట వచ్చినదా మూలముట్టఁ జెప్పవలయు" నని వారనిరి.

అప్పుడు బ్రాహ్మణుఁడు బలవంతముమీఁద నిట్లు చెప్పఁదొడఁగెను. "అయ్యా! ఇది రహస్యము. అయిన మాదేశములో నందఱెఱిగిన రహస్యమే. గాంధారదేశపురాజగు భాగ్యవర్ధనుఁడు కొన్నిదినములలో మీదేశముపై దండువిడిసి జయించి తనరాజ్యమునఁ గాశ్మీరమును గలుపుకొనవలయునని ప్రయత్నము జేయుచున్నాఁడు

చుట్టుప్రక్కల దేశములనుండి సమరమున ముక్కాకలు దీరినజోదులను రావించి తనసేనలోఁ జేర్చుకొనుచున్నాఁడు. మహాటవులనుండి మదపుటేనుఁగులంబట్టి తెప్పించి కదనమున కాయత్తము సేయుచున్నాఁడు. వేనవేలు పారసీకహయంబుల బహుధనము లిచ్చి కొనుచున్నాఁడు. పదివేలయేనుఁగులు, ముప్పదివేలగుఱ్ఱపుదళము ఏఁబదివేల కాల్బలము, పదివేల రథములు, రణమునకు సిద్ధమైయున్నవి. పదాతులందఱు నీటజరించు చేఁపల మింటఁబాఱు పులుఁగుల సైతము గుఱిదప్పక నొక్కయమ్మునఁ గూల్పఁగల మేటివిలుకాండ్రు. అట్టి సేనతో జయముఁ గాంచవలయునను పేరాసతో మనంబున వెల్లివిరిసిన యుత్సాహముతో నమ్మహాసేనకుఁ గావలసిన సకలసంభారములతో నతఁడు రాఁగల శరత్కాలమునఁ దండెత్తఁదలఁచుచున్నాఁడు. కటకటా! చిరకాలమునుండి స్వాతంత్ర్య మనుభవించుచున్న కాశ్మీర దేశము భూలోకస్వర్గఖండమని పేరువడసిన కాశ్మీర దేశము—హేమచంద్ర మహారాజు పరిపాలించిన కాశ్మీర దేశము—నెల్లసిరులకు నిల్లగు కాశ్మీర దేశము—దిక్కుమాలిన పడంతివలె నన్యవశవర్తిని యగుచున్నది. రత్నగర్భవంటి యీ దేశము మాసామ్రాజ్యములోఁ జేరునని నాకెంతో సంతోషముగానున్నను మీకు రాఁగలదుర్దశఁ దలంచిన నా కడుపు చుమ్మలు చుట్టుచున్నది. మా రాజును గుఱించి వేఱు తెఱంగునఁ జెప్పుట నాకు ధర్మముగాదు కాని భాగ్యవర్ధనుఁడనఁగా నెవఁడో యెఱుఁగుదురా? పాండవ ధార్తరాష్ట్రులకు మొదటఁ గలిగిన మనస్పర్ధయను చిన్నిమొక్కను తన దురాలోచన లనెడు దోహదముల చేత మహావృక్షముఁ జేసి కురుపాండవ వైరమునకుఁ బ్రధానకారణుఁడై కౌరవకులమును గూఁకటివ్రేళ్ళతో నాశనము జేసిన శకునివంశస్థుఁడు 'స్యాలకో గృహనాశాయ' యను సామెత నిజము జేసిన దుష్టచిత్తుఁడతఁడు. అతని వంశస్థుఁడైన యీ భాగ్యవర్ధనుఁడు వానికన్నఁ బది

యూకు లెక్కువ చదువుకొన్నవాఁడు. ప్రజలను మంగలములోఁబెట్టి వేఁచినట్లు హింసించును. భరింపరాని పన్నులుగట్టును. భాగ్యవంతుల గృహములపైఁబడి దోఁచుకొనును. ఎదురాడినవారి పుత్త్రులఁదీయించి కోటకొమ్మలకుఁ గట్టించును. చక్కని యూఁడువాండ్రందఱుఁ దన ప్రక్కకుఁ జేరవలసినదె. వానికి నీతిలేదు. ధర్మభీతిలేదు. పాపభయము లేదు. శాపభయములేదు. అట్టిరాజు పాలనక్రింద మే మెట్లు వేగుచున్నా మందురో? విషక్రిమిన్యాయమున బ్రదుకుచున్నాము. వాని మంత్రులు కుటిలమార్గ పరతంత్రులు. దేశము పరాక్రాంత మగుటకన్న జనులకుగొప్పకష్టము లేదుగదా? కాటకముల సహింపవచ్చును. ఈఁతిబాధల నోర్వవచ్చును. అంతఃకలహముల నడఁచుకొనవచ్చును. మహామారి మొదలగు ప్రళయరోగముల భరింపవచ్చును. కాని, పరరాజుపాలన మొక్క దినమైన సైరించుట కష్టము. దేశమందలి ధనధాన్యములనెల్ల నతఁడే తరలించుకొనిపోవును. రత్నగర్భల వంటి భూములు చవుటిపఱ్ఱులు జేయును. గనులన్నిటిని ద్రవ్వుకొని పోవును. తనదేశస్థుల కన్ని గొప్పయుద్యోగముల నిచ్చును. వెయ్యేల! జయింపఁబడిన దేశస్థులను బానిసలం జేయును. నోరున్నవారు మాటాడరాదు. చెవులున్నను వినరాదు. చేరెడు కన్నులున్నను జూడరాదు. వారిసాహసము సమసిపోవును. ధైర్యము తఱిగిపోవును, మగంటిమి మంటిపాలగును. ధైర్యమును వెడలఁగొట్టి భీతి వారి మనస్సుల నాక్రమించును. అడుగడుగునకు వారు పరరాజులకుఁ జేతులుజోడించి జోహారులు సేయుదురు. పరులను బట్టులవలె బొగడి స్తోత్రపాఠకు లగుదురు. వెయ్యేల! పరరాజు పాలనలోనున్న జనులు మృగములకన్నఁ బులుఁగులకన్నఁ బురుగులకన్న నికృష్టమైన జీవనముఁ జేయుదురు. నా శత్రువులకైన నే నెన్నఁ డట్టికష్టములఁ గోరను. ‘‘జననీ **జన్మభూమిశ్చ స్వర్గా దపి గరీయసీ’’ యను**

నార్యోక్తి మీరు వినలేదా? తల్లియు జన్మభూమియు స్వర్గముకన్న నెక్కుడని దీనిభావము. తల్లినిఁగోల్పోయి బ్రదుకవచ్చును. బిడ్డలు మృతులైన బ్రదుకవచ్చును. కులకాంతగూలిన మనవచ్చును. ధనముపోయిన బ్రతుకవచ్చును. కాని మాతృదేశము పరాక్రాంత మయినచో బ్రతుకఁజాలము. ఆదినమే దేశస్థులకు మరణదినము. ఆదినమే యాత్మగౌరవంబునకుఁ గడపటిదినము. సర్వసుఖముల కంత్యదినము. ఆదుర్దినము మీకు రాకపోవుఁగాక! ఆయాపద మీకుఁ దప్పుఁగాక !"

ఈ సంభాషణము మొదట సామాన్యస్వరముతోనే యతఁ డారంభించెనుగాని వెళ్ళఁకొలఁది క్రమక్రమముగా నుత్సాహపూరితుఁడై యెలుఁగెత్తి చెప్పెను. అదివినునప్పు డచ్చట జేరిన సైనికులలోఁ గొందఱు "హాహా"యనియు, "శివశివా"యనియు, "హరిహరీ"యనియు "నెంతకర్మ, మెంతకర్మ"మనియు సంతాపార్థకములైన పదముల నుచ్చరించిరి. అతఁడు సంభాషణ ముగించినపిదప నందులో నొకఁడు "గాంధారరాజునకు మనదేశముమీఁద నింత కోపమేల? మన మతని కే మపకారముఁ జేసితిమి?"యని తక్కిన వారి నడిగెను. అందుకు వేదశర్మ యిట్లుత్తరముఁ జెప్పెను.

"ఒకరాజు మఱియొక దేశముపై దండెత్తుటకుఁ గారణ మవసరములేదు. అపకారము చేయనక్కఱలేదు. మీ దేశము దుర్బలమగుట యొక కారణము. అతఁడు బలవంతుఁడగుట యొక కారణము. అతనికి గొప్పయాశ యుండుట యొక కారణము. కారణము లరయనేల? పెనుచేఁప చిఱుచేఁపం దినును. ముంగిస పాముం జంపును. సర్పము కప్పను గబళించును. కప్ప పురుగులను మ్రింగును. పులి మేఁకం జంపును. ఇందొకదానికొకటి యేమి యపకృతిఁ గావించెను? బలవంతులు బలహీనులం జెఱుపుట నైజము. అదియునుఁ గాక కొన్ని జంతువులకు వలెనే కొందఱు మానవులకుఁ గూడ

దుష్కార్యాచరణము సహజము. నూఱువరాలు వెలగల చీర చిమ్మెట బొత్తలు పొడిచి పాడుచేయును. ప్రశస్తమయిన పుస్తకముల జెద పురుగులు నాశనముఁ జేయును. కావున దురాత్ముల కపకారముతోఁ బని లేదు. అంతియేఁ గాక భూపతులు లాశాపిశాచగ్రస్తులు. నేలనాలుగు చెఱంగులేలినను వారియాశ దీఱదు. మూఁడులోకములు హస్తగతములైనను వారి నావహించిన యాశాపిశాచము నాఁకలిదీఱదు. భూమండలమంతయు జయించినవాఁడు సైతము భగవంతుఁడు తన విజయము నిమిత్తము నూతనఖండముల సృజియించిన బాగుండునని తలంచుచుండును. ఇవి యన్నియు నటుండనిండు! విభీషణుఁడు త్రేతాయుగమందు రావణసైన్యమునందె గాక ప్రతియుగమునందుఁ బ్రతిదేశమునందుఁ బ్రతిసైన్యమునందు నున్నాఁడు. తన నెత్తురు తన జాడఁ జూపినప్పుడు తననీడ తన్నుఁ బగతురకుఁ బట్టి యిచ్చినప్పుడు తన యడుగులజాడయె తన నెలవుఁ దెలిపినప్పుడు మానవుఁడు పరులచే హింసింపఁబడకఁ బోఁడుగదా!''

ఈ కడపటిమాటలు కర్ణములం జొఱఁబడి మనస్సునకు సూదులువలె నాటెను. ''ఎవఁడా విభీషణుఁడు? ఎవఁడా దేశద్రోహి? ఈ రాజ్యమం దట్టివాఁ డుండఁగలఁడా?''యని కొందఱు అఱచిరి. ''శాంతింపుఁడు. శాంతింపుఁడు''అని మఱికొందఱు వారిని వారించిరి. వేదశర్మ ''క్రమక్రమముగా మీకే తెలియును. నిప్పులోపలి యటకమీఁదఁ బెట్టి యిల్లంటించినను మంటలు పైకి రాకపోవు. ఓపికపట్టి యుండుఁడు''అని బదులు చెప్పెను. అందులోఁ గొందఱు ''స్వామీ! మర్మము బెట్టి మాటలాడి మమ్ముం జంపనేల? ఇంతవఱకుఁ జెప్పితిరి గదా. తక్కినదిగూడ స్పష్టముగాఁ జెప్పుఁడు. మేము పరరాజులకు దాసులము కాలేము. బెబ్బులులవలెఁ బరసైనికులువచ్చి దేశమాక్రమించి యూళ్ళు కొల్లఁగొనుచుండఁగా మేము చూడలేము. కాశ్మీర దేశముకొఱకు, రాజకుటుంబముకొఱకు, మేము మా నెత్తురు ధారవో

యుద్ధము. ప్రాణములు బలియిత్తుము. ద్రోహులను శిక్షింతుము. విషయము సమూలకముగాఁ దెలిపి మమ్మనుగ్రహింపుఁడు.'' అని పలికిరి.

"అయ్యా! మీరు బలవంతపెట్టుచున్నారు గనుక చెప్పక తప్పదు. మీరాజు చిన్నవాఁడగుటచే మంత్రులు లంచగొండులై దేశము పరుల కప్పగింపఁదలచుచున్నారు. మీరాజకుటుంబమునకు వెనుకటిరాజు సహోదరుఁడైన చిత్రభానునకు సరిపడదుగాని, యతఁడధికారము వహించునేని, నేఁటిమంత్రులు తొలఁగింపఁబడుదురేని రాజభక్తిగల దండనాధులు మీవంటి శౌర్యధైర్యములుఁగలబంట్లను రణరంగమునకు నడుపుదురేని ఇటువంటిగాంధారరాజులను నూఱు మందిని మీరు జయింపవచ్చును. అన్నిబలములుకన్న నైకమత్యబల మెక్కువది. అదియే జయమును సమకూర్చును.'' అని సన్నసన్నముగాఁ దన యుపన్యాసము ముగించెను.

ఆమాటలు వానినోట వెడలినతోడనే "మంత్రులే? మంత్రులే? ఓరీ రాజద్రోహులారా! ఓరీ దేశద్రోహులారా! ఓరీ! మీ మొగములుమండ. ఓరీ! లంచగొండిముండకొడుకులారా'' యని కొందఱు దూషింపనారంభించిరి.

"లంచగొండులు ధనమునకై దేశమునైన నమ్మివేయుదురు. వారిని నిలువనీయఁగూడ''దని కొందఱు పలికిరి. "చిత్రభానుఁ డధికారము వహించుట దేశక్షేమకర'' మని కొందఱు వచించిరి. "చిత్రభానుఁడు భ్రాతృద్రోహి. వానికధికారమిచ్చుటత'' ప్పని కొందఱు భాషించిరి.

ఇట్లు పలువురు పలువిధంబుల సంభాషించుచు నర్ధరాత్రమగుటచే నిద్రాపీడితులై స్వగృహముల కరిగిరి. వేదశర్మ తెల్లవాఱుజామున సైనికుల మనస్సులలోఁ జిచ్చుపెట్టి తనదారింబోయెను.

మఱునాఁ డుదయమున సైనికులు లేచి గుంపులుగూడి వేదశర్మచెప్పిన వృత్తాంతమంతయు బహువిధములఁ జర్చింపఁదొడఁగిరి.

అది నిజమని కొందఱు నీలి వార్తయని కొందఱుఁ దమకుఁదోఁచిన పోల్కిఁ బలికిరి. "మంత్రుల నమ్మరా" దని కొందఱు "వారివంటి సజ్జనులు లే"రని కొందఱు వాదించిరి. చిత్రభానుఁడు దుర్జనుఁ డని కొందఱు సజ్జనుఁడని కొందఱు వక్కాణించిరి.

పిమ్మట దండపాణి వజ్రపాణియు, గదాధరుఁడు శూలపాణియు నెప్పటియట్ల రాఁగా వారి కావృత్తాంత మెఱిఁగించిరి. గదాధరుఁడు శూలపాణియు "నిదియెల్లకల్ల. ఇవి శత్రువులకల్పనలు నమ్మరా"దని గట్టిగా జెప్పిరి. దండపాణియు వజ్రపాణియు "నిజమని నమ్మరాదు. కల్లయని త్రోసివేయరాదు. ఏపుట్టలో ఏపాముున్నదో మన మేఱుంగుదుము!" అని చెప్పి చాటుచాటునఁ దమకాప్తులయిన క్రింది యుద్యోగస్థులతో బాలరాజు పరిపాలనము చేటునకు మూలమనియు, సమర్థుఁడెవరైన రాజ్యాధికారమువహించిన మేలగుననియుఁ జెప్పుచు వచ్చిరి.

మఱునాఁడు మధ్యాహ్నమున కీవార్త కాఱుచిచ్చువలె శ్రీనగరమందంతట రేగెను. అత్యుత్సాహముతోఁ బ్రజలందఱు దీనిని గుఱించి మాటలాడు కొనుచుండిరి. ఏమూలఁజూచిన మనుష్యుఁ గుంపులే ఎక్కడఁనాలకించిన దండయాత్రా విషయమే. ఎక్కడ జర్చించిన మంత్రుల ప్రవర్తనమే. కొందఱు హేమచంద్రునిఁగూర్చి విచారించిరి. కొందఱు విక్రమసేనుని దురవస్థకుఁ జింతించిరి. కొందఱు మంత్రులను దూషించిరి. ఇన్నిమాట లేల? ఆఁడువాండ్రుమగవాండ్రు బాలురు వృద్ధులు బిక్షుకులు పరిచారకులు సర్వజనులు తద్విషయము లనె జర్చించుచుఁ బనిపాటలుమాని యుండిరి. ఊరంతయు నట్టుడికి నట్లుండెను. కొందఱు పిచ్చివాండ్రవలె సంచరించిరి. కొందఱు మంత్రుల యింటిమీఁదఁబడి వారిని గఠిన ప్రశ్నములనెడు రాళ్ళతో

యుర్విరి. దండయాత్రాభయమునఁ గొందఱు నగరము విడిచి పల్లెలకుఁబోవఁ దలపెట్టిరి. క్రమక్రమముగా నీవార్త రాచనగరుఁ జేరెను. విక్రమసేనుఁడు బిచ్చవడియెను. హర్షవర్ధనుఁడు తల్లికడకరిగి యవ్వార్త చెప్పి యామె నాశ్చర్యసముద్రములో ముంచెను. కొంతసేఁ పామె విచారించి యదికల్పితకథయని కొడుకులతోఁ జెప్పెను. నర్మదయేదో పనిమీఁద నగరములోనికిఁబోయి ప్రజలలో వ్యక్తమగుచున్న యమ్మహోత్సాహము భయము స్వయముగాఁజూచి వచ్చినదగుటచే నది చేతులు ద్రిప్పుకొని యభినయముఁ జేయుచు నేత్రవిభ్రమము చేతను ముఖవైలక్ష్యముచేతను నెంతో చిత్రముగా వర్ణింపఁ దొడఁగెను. నగర మెట్లుండెనో నగరునట్లె యుండెను. సేవకులు మిక్కిలి కలవళముపడిరి. గాంధారరాజ దండయాత్ర ప్రతివారి పెదవులమీఁద నుండెను.

మణివర్మయు మాధవసేనుఁడును బ్రజల కోలాహలమును దమ యుభయప్రధానముచేఁ గొంతవఱకు నివారించి యరవిందాదేవికిని విక్రమసేనునకును దప్పక చిత్తక్షోభము గలిగియుండునని తన్నివారణార్థము రాచనగరునకు దేవి పిలువనంపకయే పోయిరి. అరవిందాదేవి వారి నెప్పటియట్ల గారవించి గాంధారరాజ దండయాత్రా విషయమున నేదయిన సత్యమున్నదాయని యడిగెను. ఆ ప్రశ్నకు మణివర్మ యిట్లుత్తర మిచ్చెను.

"అమ్మా! ఇందు లేశమయిన సత్యము లేదు. మన వేగులవాండ్రు గాంధారదేశపు సరహద్దులనుండి యీ నడుమనే వచ్చినారు. ఆ దేశము యుద్ధసన్నాహము లేక నిస్తరంగమగు సముద్రమువలె నున్నదని చెప్పిరి. అదిగాక మన దేశమునుండి వణిజులు కొందరక్కడికి బోయివచ్చిరి. అక్కడనుండి బేహారము సేయుటకిక్కడికిఁ గొందఱు వచ్చియుండిరి. వారెవ్వరీమాట చెప్పలేదు. ఇది యెవ్వరో రాజ

కుటుంబమునకు నగరజనంబునకుఁ జిత్తసంక్షోభమునకుఁ గలిగింపవలె నని పుట్టించినకల్లవార్త. ఇదినమ్మి మీరు, మోసపోవుఁడు మీ మనస్సులు ప్రసన్నములుగా నుంచుకొనుఁడు. భయము సర్వావయవముల పటుత్వము నడంచును ధైర్యముం జెఱుచును. కార్యములనెల్ల విఘాత మొనర్చును. కావున భయమున కెడమీయవలదు. మేము గూడ మిమ్ము ద్రోహము సేయుచున్నామని లోకములో నపవాదములు బైలుదేఱినవి. ఆ విషయమై మేము చెప్పుకొనరాదు. మా పూర్వచరితము మా స్వభావము మా ఋజుత్వములను గుఱించి సాక్ష్యమీయవలయును గాని మా మాటలుగావు. దీనికి మీ యంతఃకరణమే ప్రమాణము''

అనవుడు రాజమాత ''ఇవి కట్టుకథ లని విక్రమసేనునితో మొట్టమొదటనే చెప్పితిని. మీపై మా కనుమానము లేదు'' అని చెప్పెను. అమాత్యులు సెలవుగైకొని యంతఃపురము విడిచిపోయిరి.

పదునొకండవ ప్రకరణము.

వేదవర్మపలుకులవలనఁ గలిగిన యలజడి సంపూర్ణముగా నడఁగకమునుపే మఱియొక విషయము రాజకులమునకు మహాందోళనము గలిగించెను. వెనుకటిగొడవ జరిగిన నాలవనాఁటిరేయి రెండు గడియలు గడిచిన వెనుక రాచనగరు కడకుఁ నొక క్రొత్త పురుషుఁడు పోయి ద్వారరక్షకులంజూచి ''అయ్యా! అరవిందాదేవిపుట్టినింటనుండి నేనువచ్చితిని. ఆ మెజనకుఁడగు మహేంద్రదేవుఁడు నన్నతి రహస్యముగా దేవిగారికొక రహస్యసందేశ మెఱిఁగించిరమ్మని పనిచె. తత్కారణమున నే నిటువచ్చితిని. నేనువచ్చినపని రాజకులమునకు మహోపకారకముగాఁబరిణమించునుగావునమీరతి శీఘ్రమున నాకొక

యమ్మహాదేవి కెఱింగించి దర్శనము చేయింపుఁడు" అని రహస్యముగఁ జెప్పెను. అప్పలకులువిని "మీరెవ్వరు? మీపేరేమి? పాంచాల నాయకులైన మహేంద్ర దేవులు మిమ్ముఁ బంపిరని మిమ్మునమ్ముట కానవాలేమున్నది?" అనియడిగిరి. అనవుడు నప్పురుషుఁడు "నాపేరు సోమభట్టు నేను బ్రాహ్మణుఁడను. పాంచాలరాజ పురోహితుఁడగు హరదత్తుని పుత్రుఁడను. దేవిగారు నాతండ్రి నెఱుగుదురు. మహేంద్ర దేవునకు వివాహకాలమున నత్తవారిచ్చిన వజ్రపు టుంగరము నాకాయన కూఁతునకుం జూపుమని యానవాలుగనిచ్చె. ఇదె యా యుంగరము. కావలయునేని దీనిం జేకొని మీరామెకుం జూపుఁడు" అని బదులుచెప్పి యప్పురుషుఁ డంగుళీయకము వారి కిచ్చెను. రాజభటులు దానిం గైకొని యంతఃపుర సంరక్షకునికడ కరిగి యావృత్తాంతముఁ జెప్పి యదివాని కిచ్చిరి. అతఁడదియెల్ల నర్మద కెఱింగించి యుంగరమామె కిచ్చి దేవికడకుఁ బంపెను.

నర్మద దానిం బుచ్చుకొని యరవిందాదేవి కడకుఁ బోయి యవ్వార్త నెఱింగించెను. ఆదేవి దీపముల వెలుఁగున నయ్యంగుళీయకము ముందరిభాగము వెనుక భాగము మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించి చూచి "ఓసీ! నర్మదా! ఇది మజ్జనకునకు వివాహకాలమున నా పూతానుమూలిచ్చిన యుంగరమే. కావున నితఁడు తప్పక మహేంద్రదేవుని చేతఁ బంపఁబడినవాఁడై యుండును. లోపలికి రానిమ్మని చెప్పుము. పురోహిత నందనుఁడగుటచే నితఁడు పరమ వైదికుఁడు గావున నన్నుం జూడఁదగును అనిదానింబంచెను. అనియు యథాక్రమముగా నంతఃపుర రక్షకునకును నతఁడు ద్వారపాలకులకును దెలుప వారా భూసురుని నగరుఁ బ్రవేశపెట్టిరి. ఒక వృద్ధకంచుకిదారి జూప నాజన్నిగట్టు బహుద్వారములు గడచి యభ్యంతర మందిరముం జేరి కిశోరద్వయమధ్యముననున్న యాఁడుసింగముంబోలి కుమారద్వయ

సమేతయైన యరవిందాదేవి యెట్టయెదుట నిలిచెను. ఆమెయుచితాసనంబున నాతనిం గూర్చుండఁబనిచి మహేంద్రదేవునియుఁ దనతల్లియు సోదరులయు బంధువులయు సేమ మరసి యాతని తండ్రిక్షేమ మడిగెను. తనతండ్రి కాలధర్మము నొందెనని యాతఁడు విన్నవించి యిట్లనియె. "అమ్మా! నాతండ్రి స్వర్గస్థుఁడగుటచేతనే మీ తండ్రిగారు మీయొద్దకు నన్నుఁబుత్తెంచిరి. ఆయనయున్న పక్షమున నాయననే పంపియుందురు" అనవుఁడు దేవి "అయ్యో! మహానుభావులైన మీతండ్రిగారు గతించిరా! సామగానమూయనతో నంతరించినదని చెప్పవచ్చును. నావివాహమాయనే చేయించిరి." అని వివాహము మాటజ్ఞప్తికి రాఁగానే తన నూతనావస్థను దలంచుకొని కన్నీరువెట్టుకొనెను. సోమభట్టు దేవిని సమయోచితముగా సమాశ్వాసించి యిట్లనియె.

"అమ్మా! నావచ్చినపని చిత్తగింపుము. మీ జనకుఁడైన మహేంద్రదేవుఁడు భర్తృహీనయైన నీయొక్కయుఁ బితృవిహీనులయిన మనుమలయొక్కయు సేమమరసి యతిరహస్యముగ మీకొక్క మాటజెప్పి రమ్మని నన్నుం బుత్తెంచెను. మీరది సావధానముగా నాలకింపుఁడు. సింధుదేశ నాయకుఁడగు పరంతపుఁడు కాశ్మీరదేశముపై దండు విడియవలెనని సంకల్పించి మహోత్సాహముతో మహాప్రయత్నము సేయుచున్నవాఁడు. పరంతపశబ్దము నేతిబీరకాయగాదు. అతఁడు పరంతపుఁడే. అతనికి మ్లేచ్ఛులు సమరదోహదులు చండప్రతాపులునగు పారసీకులు మిడుతలదండులువలె వచ్చి సాయము చేయుదురఁట. వారికి జీతములు బత్తెములు నీయనక్కఱ లేదఁట. దోఁపుడువలన నెంతసొమ్ము వారికి దొరకునో యంతయు వారికిచ్చినం జాలునఁట. సింధుదేశము మంచిగుఱ్ఱములకుఁ బేరువడియెఁ గావున నారాజు సేనలో గుఱ్ఱపు దళము మెండుగ నుండును. అవి గుఱ్ఱము

లుగావు లేళ్ళుగాని అదిగాక కాల్బలము గజబలము రథబలము గావలసినంతయుండును" అంతవఱకుఁ జెప్పునప్పటికి విక్రమసేనుఁ డందుకొని "దండెత్తువాఁడు సింధురాజనుచున్నారు. గాంధారరాజని చెప్పఁ"డని పలికెను. అనవుడు సోమభట్టు 'కాదు. కాదు. సింధు నాయకుఁడే. దానికిం దగిన తార్కాణములున్నవి. లిఖితరూపకము లైన తార్కాణములు దొరకినవి. కానిచో శాస్త్రజ్ఞానము లోకాను భవము సంపూర్ణముగాఁగల మహేంద్రదేవునివంటి రాజనీతి కోవి దుఁడు తన పురోహితుని శ్రమైక సాధ్యంబగు నీపయనమునకుఁ బురి కొల్పి పంపునా?"యని యుత్తరమిచ్చెను. అనవుడు నగవిందాదేవి మిక్కిలి విస్మయమునొంది "ఏమీ! లిఖితరూపకమగు తార్కాణము దొరకినదా? ఎవరువ్రాసినది? ఎవరికి వ్రాసినది? ఎప్పుడువ్రాసినది? ఏదేది! చూడనిమ్ము"అని మాటవెంబడి మాట వచ్చునట్లు మిక్కిలి తొందరతో నడిగెను.

అడుగుటయు సోమభట్టు "అమ్మా! ఎవరననేల! మనచేతులు మనకాళ్ళు, మనకన్నులు, మనచెవులు వారు మనతోడు నీడలవలె మనతోనుందురు. ఆనీడలేమనకు శత్రువులు మన నీడలే మనకు శత్రువులుగదా"యని బదులుచెప్పెను.

అయ్యో! వారి నామధేయములు వినువఱకు లిఖిత రూపక దృష్టాంతములు చూచువఱకు నామనస్సు తత్తఱపాటు చెప్ప నలవి గాకున్నది. కావున నీక్షణమే వాటిం బ్రదర్శించి స్థానముదప్పి భ్రమిం చుచున్న నామనస్సునకుం గుదురుపాటు గలిగింపుము"అని నగ విందాదేవి వానిం ద్వరపెట్టెను. అప్పుడు సోమభట్టు తన కృష్ణాజి నముచుట్ట విప్పి యందుండి యొక యడపసంచి దీసి యాసంచిలోఁ గట్టకడపటి సొరంగములో నట్టనడుమగున సన్నగుడ్డ చుట్టఁబడి రెండు మడతలుగానున్న యొక భూర్జపత్రముఁ దీసి విక్రమసేనుని చేతికిచ్చి చదువుమనెను. అతఁడు దీపముదగ్గఱకుఁ బోయి యిట్లు చదివెను.

శ్రీమన్మహారాజాధిరాజ త్రిభువనమల్ల కిన్నరేంద్ర ఘటాపంచానన పరరాజవేశ్యాభుజంగ సకలసమరాంగణ సార్వభౌమప్రముఖ బిరుదాంకితులును సింధుదేశాధీశ్వరులును నగు స్వస్తిశ్రీ పరంతప మహారాజుగారి దివ్యచరణారవింద సన్నిధికి కాశ్మీరరాజమంత్రియు మీ సేవకుఁడునగు మణివర్మ వందన శతపురస్సరముగా వ్రాసికొన్న విజ్ఞాపనము.

బౌద్ధభిక్షుక వేషధారియైన మీ వేగులవానిచేత దేవరవారు పరమానుగ్రహమున నాకు వ్రాయించి పంపిన లేఖనందుకొంటిని. కన్నుల నద్దుకొంటిని. పూవుదండవలె శిరమున ధరించితిని. ఈసేవకునిమీఁద విశ్వాసముగా మీకింత యనుగ్రహము గలిగినందుకు మిక్కిలి సంతసించితిని. నాహృదయానందము దెలియఁజేయుటకుఁ దగిన మాటలు నే నేరకున్నవాఁడ. మీరు కాశ్మీరదేశము వంచుకొన కుతూహలపడుచున్నట్లు వ్రాసినారు. ఆదేశ మేపాటిబలము గలదని యడిగినారు. మీసంకల్పము శ్లాఘాపాత్రము. ఈరాజ్యము పూర్వము బలమైనదే గాని నేఁటికాలమున రాజు చిన్నవాఁడగుటచే రాజ్యము దుర్బలముగానున్నది. మానవశరీరమునం దరిషడ్వర్గమువోలె నీదేశమున నంతశ్శత్రువులు బలాఢ్యులు గలరు. వారిరాజుడిచేత నెలుకలు దొలిచిన యిల్లువలె నీదేశము శిథిలమైయున్నది. దేశముసారవంతమై రత్నగర్భలగు భూములుగలదై స్వర్గఖండమువలె నుండుటంజేసి బాహ్యశత్రులనేకులు దీనిపైఁ గన్నువైచియున్నారు. మాకుముప్పది వేల సేనకంటె నెక్కువ లేదు. దేశస్థితియిది. సాయము జేయుమని నన్ను మీరు కోరినారు మీచిత్తప్రకారము నేను మీకుఁ దోడుపడియెద. నేను కోరుకొన్నచోట నాకు సారవంతములైన పది యగ్రహారములు, పదిలక్షల రూకలు మీరిచ్చెదనని వ్రాయించిరి. ఇరువది యగ్రహారములు నాకు దయచేయవలెనని కోరుచున్నాను. మీఁద

మీచిత్తము మాచిన్నరాజునుబట్టి మీకప్పగించెద. కోటమీస్వాధీనము జేసెద ధనాగారమంతయుఁ దరతరములనుండి ప్రోగుచేసిన ధనరాసులతో నిండియున్నది. అచ్చట లక్ష్మీతాండవమాడుచు మిమ్ముం బిలుచుచున్నది. మీరువచ్చి యాక్రమించుటయే కొఱంత. ఈదేశము మీస్వాధీనమగునేని స్వర్గముమీచేతిక్రిందికివచ్చినట్లు. మేరుపర్వతము మీయధీనమైనట్లుకైలాసము మీగడపలోనున్నట్లు. ఆలస్యముచేయక వెంటనే బలములఁగూర్చుకొని రండు దండపాణియు వజ్రపాణియు నేఁ జెప్పినట్లు వినరుగాని గదాధరుఁడు శూలపాణియు నాయింటి కుక్కలు. వారు నాపనుపు దప్పక సేయుదురు వారు తమతమ సైన్యభాగములతోవచ్చి మిమ్ముం జేరుదురు. మాధనసేనుఁడుగూడ మనలోనివాఁడె. ఆముగ్వురకుఁగూడ మీరు మనపనితీఱినవెనుక దగిన పారితోషికములిచ్చి సంతోషపెట్టవలయు. మీరు నాపేర దీనికుత్తరము వ్రాయునప్పుడు దానిలో నాపేరువ్రాయక యశోకవర్ధనునకని వ్రాయవలయును. పాములవానివేషము వేయించి నావేగులవానిని మీకడకీయుత్తర మిచ్చి పంపుచున్నాను. ఇదే వందన శతము.

ఇట్లు విన్నవించు మీ విధేయుఁడు,

మణివర్మ..

కుమారుఁడు జాబుచదువుట ముగించినతోడనే యరవిందాదేవి "నాయనా! నీవు మణివర్మ వ్రాఁత నెఱుఁగుదువుకదా! ఇది యతని వ్రాతయగునా?" యని యడిగెను. "తల్లీ! మణివర్మలేఖనము నే నెఱుఁగుదును. అక్షరములు గుండ్రములై యాణిముత్తెములట్టులుండును. పంక్తులువంకరలేక ముత్యాలకోవలుపఱచినట్లుండును. అక్షరములు మిక్కిలి దగ్గఱగా వ్రాయుట యతనికలవాటు. పెద్దగ్రంథము చిన్నచోటున నతఁ డిమిడింపఁ గలడు. ఆ నైపుణ్యమిందు స్పష్టముగఁ

గనంబడుచున్నది తలకట్లు పొల్లులు తీర్చుటలో నతని హస్తమున కొంకానొక వింతకౌశలముగలదు. అదియు నిందుఁ గనంబడుచున్నది. కావున నీవ్రాత యాతనిదే యని నాకుఁ దోఁచుచున్నది. అని యుత్తరము చెప్పెను. అదివిని యాదేవి నిట్టూర్పు విడిచి యీవ్రాత తప్పక మణివర్మదే యైనపక్షమునఁ గాశ్మీర రాజ్యలక్ష్మి ముఖమున బ్రహ్మ మిక్కిలి చెడ్డవ్రాత వ్రాసెనని నేను దలంచెద. అట్లు కానిచో మేరువు వంటి ధైర్యమును సముద్రునివంటి గాంభీర్యమును రాజసామాన్య దుర్లభమైన సౌజన్యమునుగల మాతండ్రిగారేల దారుణముగా నస్తమింతురు? హా రాజ్యలక్ష్మీ! నీకును మాకును ఋణముదీఱెనదా? మాపైని నీకు విసుగుదోఁచెనదా మమ్మువిడచి పరరాజుల పాలుగాఁ దలఁచితివా పరమేశ్వరు దయ యెట్లున్నదో యట్లు కాగలదు అని పలికి కుమారులధైర్య పడుదురేమో యని వెంటనే శంక దోప నా ధోరణి దప్పించి యా దేవి వెండియు సోమభట్టు నుద్దేశించి "అయ్యా! ఇది యెట్లు మాతండ్రిగారికి దొరికినది?" యని యడిగెను. అందుకు సోమభట్టిట్లనియె. "అమ్మా! ఇది చిత్రముగా లభించినది. ఒక పాములవాఁడు కన్యాకుబ్జపట్టణమునఁ దనపాముల నాడించి ధన మార్జించుకొని యుండందుఁ దిరుగుచుండెను. ఒకనాఁడు వాఁడు తా నార్జించిన విత్తముం దీసికొని యూరుచివరనున్న కల్లంగడికి బోయి రెండు లొట్టియల కల్లుద్రాని యొడలుమఱచి కొంతసేపుఁ దొరలి కొంతసేపు నేలఁబొరలి తెలివివచ్చినతోడనే మరల కొంతద్రాని ప్రక్క నున్నవారితో నిర్హేతుకముగాఁ గయ్యమునకుఁ గాలుదువ్వి వారిపైఁ బడెను. అప్పుడు జుట్టుజుట్టు పట్టుకొని వాండ్రు పోరాడిరి ఈ భూర్జ పత్రము వాఁడు తన తలపాగలో జాగ్రత్తగా దాచెను. ఆకలహములో తలగుడ్డవీడిపోవుటం జేసి యది నేలంబడెను. మహేంద్రదేవమహారాజు గారి వేగులవాండ్రు దేశమందంతట వ్యాపించియుందురు గావున

నాఁడు కల్లంగడిలోనున్న యొకవాఁడు మెల్లగా దీనిందీసికొని మహారాజుగారికిచ్చెను. ఈభూర్జపత్రముయొక్క చరిత్రమిది. ఇందు నమ్మకపోవుటకేమియు లేదు. అంతయు సహజముగానున్నది. అసంభవమేమియుఁగానఁబడదు. కావున మీతండ్రిగారిట్లు మీతోఁజెప్పమనిరి. మణివర్మను మాధవసేనుని నమ్మి మీయర్ధప్రాణము లాతని చేతంబెట్టవలదు. అవి పూలదండలుగావు. కుబుసమూడ్చిన కోడెత్రాచులు. అవి పగడములుగావు, చండ్రనిప్పులు. అవి క్షీరములుగావు, సున్నపునీళ్ళు. అవి హంసలుగావు, కొంగలు. అవి గోవులుగావు గోచర్మముఁదాల్చిన బెబ్బులులు. కావున నమ్మి మోసపోకుఁడు. మీప్రాణములు బాలురప్రాణములు విషాగ్నులవలన శస్త్రాదిసాధనములవలనఁ గాఁపాడుకొనునది.'' ఇది మీనాయనగారి సందేశము. దీనిని రత్నాభరణమువలె మీశిరంబునఁ దాల్పనగు. మహామంత్రమువలె భక్తితో స్మరియింపవలెను. అమ్మా! నావచ్చినపనియైనది. చీఁకటిపడిన తరువాత నగరుసొచ్చి రేయి రెండుజాములు గాకమునుపే యూరు విడిచి పోవలసినదని మీతండ్రిగారు సెలవిచ్చిరి. నేనిచ్చటఁ దెల్లవారువరకునుండరాదు. మీ యమాత్యులు మీసేనాపతులు నన్నుఁ బలుసిలుఁగులఁ బెట్టుదురు. మీతండ్రికి బురోహితుఁడనై మీకు హితమాచరింపవచ్చితిని. మేము ఛాందసులము. అలౌకికులము. ముక్కుకు సూటిగాఁ బోవువారము. దారిన వెళ్ళి దారిన వచ్చువారము మీక్షేమమతనికి వెంటనే యెఱిఁగింపుమనికూడ మీతండ్రిగారు సెలవిచ్చిరి. అందుచే నాకు సెలవొసంగుము.'' అని లేచెను.

అరవిందయు విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడును లేచి వానికి నమస్కరించిరి. ''అయ్యా! మేమీగడియవఱకు క్షేమముగా నున్నామని మానాయనగారితోఁ జెప్పుఁడు. ఇక్కడిస్థితిగతులనరసి సేనాయకుఁ గర్తవ్యమునుగుఱించిజాబువ్రాసి విశ్వాసముగలబంటునంపెదను.

అందఱు నడిగితినని జెప్పుఁడు. దైవానుగ్రహమున బ్రతికితిమా మరల దర్శనము జేయుదుమని జెప్పుము." అని యరవిందాదేవి వానిఁబుచ్చి వానినంపెను.

ఆభూర్జపత్రము విక్రమసేనుని చేతినుండి హర్షవర్ధనుఁడు దీసి కొని చదువుకొని "అమ్మా! మనము దొంగలగుంపు నడుమనున్నా ముసుమీ" యనిపలికెను. "కుమారా! అది యిటు తెమ్ము. నేనుజాగ్ర త్తగాదాఁచెద"నని తల్లిపుచ్చుకొని మరలమరల దానింజదువుకొని "వత్సలారా! ప్రొద్దుపోయినది పండుకొనుఁడు భయములేదు" అని వారిం బానుపులఁజేర్చి నిద్రపుచ్చెను.

అరవిందాదేవికిఁ జాలసేపు నిద్రపట్టనేలేదు. తెల్లవారుజామున నొకచిన్నకునుకుపట్టెను. అంతలోనే పగతురుకోటనాక్రమించి విక్ర మసేనునింబట్టుకొని బంధించినట్లు దుస్స్వప్నము రాఁగా నామె నిద్ర లో నయ్యోయయ్యోయని యఱచివగచిత్రుళ్ళిపడి మేల్కాని లేచి విక్రమసేనుని పాన్పుకడకుఁబోయి కొడుకుఁజూచుకొని యదికలగదా యని ధైర్యముఁదెచ్చుకొని సర్పదను లేపి తనదుస్స్వప్న మంతయు నెఱిఁగించిమరలఁ గన్నుమూసిన నెక్కడపాడుకలవచ్చునోయని శం కించి తెల్లవాఱుటకు దానితో మాటలాడుచుండెను. తెల్లవాఱిన పిదప సమయోచిత కృత్యములుదీర్చి యాదేవి మణివర్మం బిలుచుకొని రమ్మని యొక సేవకునిం బనిచెను.

అతఁడును స్నానసంధ్యాద్యనుష్ఠానములు దీర్చికొని సముచిత వేషంబుఁదాల్చి రాచనగరుఁజొచ్చి దేవిని సందర్శించెను. విక్రమసేను డామెప్రక్కనుండెను. వారిమొగము లెప్పటియట్ల ప్రసన్నములుగాక వేఱుభంగి నుండుటచే నేదో క్లిష్టవిషయము వారిమనస్సులం బీడించు చున్నదని వృద్ధమంత్రియూహించి కారణమడుగఁబోవుచుండ నంతలో నరవిందాదేవి యుచితాసనంబున నతనిం గూర్చుండఁబనిచి కడ

చినరేయి సోమభట్టు తెచ్చిన భూర్జరపత్ర మతనిచేతికిచ్చి చదువుకొమ్మనియెను ఆ సచివోత్తముఁడు లేఖ నామూలాగ్రముగఁ జదువుకొని విస్మితుఁడై యేమనుటకు నోటమాటరాక చదివినదే చదువుచు లేఖ దిరుగవేయుచు వెఱ్ఱివానివాలెనుండెను. అప్పుడరవిందాదేవి వానినుద్దేశించి "అయ్యా! లేఖలోని వ్రాత నీయది యగునా?" యని యడిగెను.

"అమ్మా! వ్రాత నాయది కాదు. ఈజాబు నెన్నఁడు నేను వ్రాయలేదు. సింధునాయకుఁడగు పరంతపుని పేరు వినుటయే కాని వాని నెన్నఁడుఁ జూడలేదు. వానికి నాకు సంబంధము లేదు. కాని యీ వ్రాత యచ్చముగ నా వ్రాతవలెనే యున్నది. అక్షరముల పొందిక తలకట్లయొక్కయు పొల్లులయొక్కయు తీరు నేను వ్రాసినప్పుడెట్లుండునో యట్లేయున్నది. ఇది చూడ నాకు మాయగా నున్నది." అని యతఁడు బదులు చెప్పెను.

"అయ్యా! వ్రాత నీ వ్రాతవలె నున్నదా? అక్షరములు పొందిక తలకట్లతీరు పొల్లులతీరు నీ వ్రాతలోనున్నట్లె యున్నవా? కాని జాబు నీవు వ్రాసినది కాదా? ఇది యెవ్వరైన విశ్వసింతురని నీవు చెప్పుచుంటివా? నీపలుకులు శిశువులు నమ్మవలయు. పసువులవంటి బాలీశులు నమ్మవలయు. మతిలేనివారు నమ్మవలయు. ఇట్టిపలుకులు నమ్ముటకు మేము వెఱ్ఱివాండ్రము కాము. నీవే తండ్రివి; నీవే సోదరుఁడవు, నీవే మా కేడుగడయు, మా మామగారినాఁటనుండి మమ్ముం గొలిచియున్నవాఁడవు నని నేనెంతో విశ్వాసముంచి మా యర్థప్రాణములు నీకప్పగించినందుకుఁ బదిలక్షలరూకలకు నిరువది యగ్రహారములకు నాసపడి మా గొంతు గోయఁదలఁచితివా? పిన్నరాజును బట్టి పగతుర కప్పగింపఁ దలఁచితివిగా! ఇంతకన్న ద్రోహమున్నదా? భర్తృవియోగదుఃఖమున మునుఁగుచున్న నన్నుఁ జూడవైతివి? తండ్రిలేని పసిపాపలని జాలిపడవైతివి? నీవు బెబ్బులులకన్నఁ దోఁడేళ్ళకన్న విషసర్పములకన్న ఘాతుక కృత్యముల సేయఁదలఁచితివే? నీవు చేయఁదలంచుచున్న ద్రోహము

నకు యమధర్మరాజు నీ నిమిత్తమై క్రొత్తనరకముల సృష్టింప వలయు గాని ప్రాతనరకములు పనికిరావు. నీ కగ్రహారములే కావలసిన పక్షమున నన్నడిగిన నే నియ్యనా? రూకల నేనియ్యనా? బిరుదుల నే నియ్యనా? దీనికై గడ్డితినవలెనే? చిరకాలము జీవించితివే. ఎందుకు నీ జీవనము? జగజ్జనులం బీడించుచు సర్పము వేయిసంవత్సరములు జీవించును. గదాధరుఁడు శూలపాణి మాధవసేనుఁడు మొదలగు వందఱనుగూడఁ జెఱచితివే. ఆహా? తేనెబూసిన కత్తి యని గడ్డి గప్పిన గొయ్యి యని యెఱుఁగక మేము మోసపోయితిమి. చాలు చాలు! చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁ డంటివి. అతఁడు మహారాజు గారిని వధించెనంటివి. అతనికన్న నీయాధిక్యమేమి? నీదుశ్చరిత్ర మువలన నికెవ్వరిని నమ్మగూడదను నీతి మేమునేర్చుకొంటిమి. బ్రాహ్మణుఁడవు వయోవృద్ధుఁడవు చిరకాలపరిచితుఁడవు కావున మే మూరకుండవలసి వచ్చెఁగాని నీవెట్టిశిక్షకైనఁ బాత్రుఁడవు. నీకంతః కరణము లేదు. నీకుగుండెలు లేవు. కటికవాఁడైన నీకన్న యోగ్యుఁడు రాక్షసులైన నీకన్న యోగ్యులు చాలుఁజాలు నీక బొమ్ము'' అని యాగ్రహావిష్టయై యరవిందాదేవి యాతని గడుంగడుఁ దూలనాడెను విక్రమసేనుఁడు ''తాతగారూ! మాయమ్మ కోపోద్రేకమున మిమ్ముం దూలనాడిన దన్నమాటే కాని యీ జాబుమీఁరు వ్రాయుని యెడల రెట్లుండుటకుఁ గారణమేమో చెప్పఁగలరా? ఇది యసంభవము గాదా'' యని యడిగెను. మణివర్మమొగము కళావిహీన మయ్యెను. చిరకాలమునుండి కడువిశ్వాసముతోఁ దానొనర్చిన సేవయంతయు బూడిదఁబోసిన పన్నీరయ్యెనని యతఁడు మనంబున విచారించెను. అయినను ధైర్యముఁదెచ్చుకొని యిట్లనియె. ''కుమారా! రాజపత్ని యైనందున నీకుంబలెనె నాకుంల్లి. తల్లి బిడ్డలను లోప మున్నప్పుడు లోపమున్నదని భావించినప్పుడు, చీవాట్లు పెట్టుట యుక్తము

నేను మహాపరాధముఁ జేసితినని నమ్మియామె బాణములవంటి మాటలతో నన్ను నొప్పించె. అందుకు నే విచారింపను. రాజ్యమీస్థితిలో నున్నప్పుడు మిక్కిలి యనుమానాస్పదమైన యిట్టి లేఖ చేయిఁజిక్కి నప్పుడు మీయమ్మయే గాదు—ఎవ్వరైన నిట్లేయుందురు. ఈయపరాధమును నేను జేసినపక్షమున నామె యన్నమాటలన్నిఁటికి నే నర్హుఁడనే. నేనీతప్పు చేయలేదని నాయంతరాత్మ యెఱుఁగును; భగవంతుఁడెఱుఁగును మాధవసేనుఁడెఱుఁగును. ఇది శత్రువులకల్పనము. బ్రహ్మసృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేసిన విశ్వామిత్రుఁడువలె నావ్రాఁతకెవరో మిక్కిలి బుద్ధిమంతుఁడు ప్రతిసృష్టి గావించినాఁడు, లోకములో నెంతెంత నెఱజాణలైనఁ గలరు. పరమేశ్వరుఁడు సృష్టించిన యాకులంబోలిన యాకులు, పండ్లఁబోలినపండ్లు మవ్వపుంజిగురులుం బోలిన మవ్వపుంజిగురులుఁ జిత్రింపఁగల చిత్రకారులున్నట్లే రూపంబులం బోలినరూపంబులనిర్మించు శిల్పులున్నట్లే వ్రాతలంబోలిన వ్రాతలసృష్టింపఁగల భూలోకవిశ్వకర్మలు, కలియుగవిశ్వామిత్రులు లోకంబునం గలరు. మీకు నామీఁద నాగ్రహముబుట్టించుటే వారి సంకల్పము. అందువారు సంపూర్ణముగాఁ గృతకృత్యులైరి. నన్ను మీరుతూలనాడినట్లు, నాయెడనమ్మిక గోలుపోయినట్లు నన్నుఁగొలువు నుండి తప్పించినట్లు వారువిందురేని వారికార్యము నెఱవేఱినట్లు వారానందింతురు. ఎట్లయినశత్రువులు సంకల్పసిద్ధులు, తల్లీ! నీవురోషావేశమున నన్నుం దూలనాడినను నేనాగ్రహింపను. నేను మనోవాక్కాయకర్మముల మీయెడ దోసమాచరింపఁడలతుఁనేని కాశీమహాక్షేత్రమున గోసహస్రమును వధించినట్లై, కురుక్షేత్రాదిపుణ్య స్థలములలో బ్రాహ్మణహత్యలు చేసినట్లై, నాతల్లిం జంపినట్లై, నాతండ్రిం జంపినట్లై. ఇంతకన్న నేనేశపథంబులు చేయుదు? నన్ను గుఱించి నేఁ జెప్పుకొనుట న్యాయము కాదు. సూర్యచంద్రులుసాక్షులుగా, భూమ్యా

ది పంచభూతములు సాక్షులుగా నేనుమీయెడఁ గృతజ్ఞుఁడనై యున్నాఁడను. ఏపాపమెఱుఁగను నాచేసినమేటిసేవ బూడిదఁబోసిన పన్నీరైనదని నాబ్రతుకు హాస్యాస్పదమైనదని నేను విచారించుచున్నాఁడను. ఏలయన మితరాజభక్తి గల్గియుండుటచేత నేనావలఁ జిత్రభానునకుఁ బగతుఁడనైతిని. అతని మాయలను నురులలోమీరు చిక్కుటంచేసి మీకు నేఁ బగతుఁడనైతిని. ఏమైననేమి? మీరునన్నుఁ గొలువులో నుండి తప్పించిననుసరే దూషించిననుసరే, రాజకులమునకు నామేనఁ బ్రాణములున్నంతసేవు నేనుపకారమేకాని యపకారముసేయను. నాతలఁదెగవేసి మీరు కోటగొమ్మలకుఁ గట్టించినను నేను విచారింపను. నామరణమువలఁ గాశ్మీరరాజకుటుంబమునకు మేలగునేని నాజన్మముసార్థకమైనదని నేను సంతోషింతును. నాబుద్ధి నాశరీరము, నాకాలము, నావయస్సు మీసేవకై గడపితిని. కొనయూపిరి యున్నంతసేపు నిఁకముందునట్లే చేయుదును. ఇట్లుసేయనైతినేని బంచమహాపాతకులు పోవుదుర్గతులకుం బోవుదును.

ఇట్లుసంపూర్ణమనోవేదనతోసంభాషించియావృద్ధసచివుఁడువారికడ సెలవుదీసికొని పోయెను. పోవుటకు సెలవిమ్మనియడిగినప్పుడుఁ గూడ నరవిందాదేవి వానితోమాటలాడలేదు. విక్రమసేనుఁడుమాత్రము "మంచిది. పోయిరం"డని పలికెను. మణివర్మ రాజాంతఃపురమున జరిగిన చిత్రకథయంతయు మాధవసేనునకు గదాధరాదులకుఁ దెలిపి రాజకుటుంబము చిత్రభానుఁడు త్రవ్వినగోతిలోఁబడి లేవలేకయున్నదని మిక్కిలివిచారించెను. వారును దేవి ప్రమాదమునఁ దప్పుదారింద్రొక్కినదని నొచ్చుకొనిరి.

మంత్రివెళ్ళినవెనుక విక్రమసేనుఁడు తల్లితో మణివర్మచెప్పిన సమాధానము ప్రశాంతమైన సమయమున వెండియునాలోచింపఁ దగియున్నదని చెప్పెను. "నాయనా! మిత్రులెవ్వరో శత్రులెవ్వరో

దెలిసికొనుటకు వీలులేని యవస్థలో మనమున్నాము. నామనస్సు చెడిపోయియున్నది. అది చక్కబడినవెనుక సట్లజేయుదము'' అని యుత్తరము చెప్పెను.

పండ్రెండవ ప్రకరణము

చిత్రభానుఁడు కర్పూరమంజరికి వజ్రపాణిపై ననురాగము గలుగునట్లు జేయవలసినదని తనభార్యతోడను మల్లికతోడను దన వాక్పటిమ మంతయు వినియోగించి చెప్పెనుగదా! తనయాశలన్నియు దానిమీఁదనె నిలిచియుండుటచే నప్పని యెట్లు పరిణమించునో యని మనసులో నింతింతయనరాని బెంగబెట్టుకొని యుండెను. ''బాలికతో మాటలాడితివా? మాటలాడితివా?'' యని యిందుమణిఁ బ్రత్యహముం దొందరపెట్టుచుండెను. మల్లిక గంటఁబడినప్పుడెల్ల ''బిడ్డయేమన్నది? చెప్పితివా?'' యని యడుగుచుండును. మూఁడునాలుగు దినములు గడచినతరువాత నొకనాఁ డిందుమణి బిడ్డంబిలచి భర్త తనతోఁ జెప్పినవిషయ మంతయు నామె కెఱిఁగించెను. అదివిని కర్పూర మంజరి యనిష్టమును సూచించు చిఱునవ్వు నవ్వి యూరకుండెను. భావజ్ఞురాలయిన తల్లి యక్కన్యామతల్లి యుల్లము దానివలనఁ దెల్లముగ నెఱిఁగి వల్లభునితో నావృత్తాంతముఁ జెప్పెను. అంత నతఁడు మల్లికను దొర పెట్టి వేధించుటచే నామె కర్పూరమంజరితో మాట లాడి యామె భావమును జిత్రభానుని కిట్లెఱిఁగించెను. ''అయ్యా! మీ బాలిక మీసందేశము నాముఖమునవిని నన్ను మొగము వాచు నట్లు జీవాట్లు పెట్టినది. బుద్ధిలేదాయని యడిగినది. ఇట్టిసందేశములు తేవలదని నొక్కి చెప్పినది. కావున దేవరవారె స్వయముగా నామె నడుగుట సమంజసము. మీయెడఁగలభక్తినైన భయమునైనఁ నామె

మీ యుపదేశమును మన్నించి మీకోర్కెఁ దీర్పవచ్చును. ఇది మాకు సాధ్యముగాదు. ఆమె కెవ్వరియెడ గౌరవమున్నదో వారీ ప్రసంగము చేయవలయుగాని మిక్కిలి చనువుగల మాబోంట్లు చేయఁ గూడదు. అనవుడు చిత్రభానుఁడు తలయూఁచి "సరే! ఆమె యభిమతము నేనే కనుఁగొనియెద" నని యారేయి భోజనానంతరమున బాలికయున్న గదిలోనికిఁబోయి సముచితాసనమునఁ గూర్చుండి "అమ్మాయి! నీతో నే నొక్కమాట చెప్పఁదలఁచి వచ్చితి స్తిమితమనస్కవై వినుము" అని చెప్పెను.

ఎన్నఁడుఁ దన గదిలోనికిరాని తండ్రి యారేయి తనకడకు వచ్చుటచేత నతఁడు తన వివాహ విషయమునుగూర్చి ప్రసంగింపఁ దలఁచి యరుదెంచి యుండునని యామె గ్రహించి యతనికిఁ జెప్పఁదగిన సమాధానము ముందుగా నూహించుకొని ధైర్యముతో నెదుట మంచముమీఁద గూర్చుండెను. అప్పుడు తండ్రికి బిడ్డకు నీ క్రింది విధమున సంభాషణము జరిగెను.

చిత్రభాను—కుమారీ! నేనును నీతల్లియు మున్ను జేసిన పూజలఫలముగా నోచిననోములపంటగా దేవతా వరప్రసాదమువలె మా యదృష్టవశమున లేక లేక యొక్కకుమారితవు జన్మించితివి. నాకు నీ వొక కన్ను. నీతమ్ముఁడు విజయసేనుఁ డొక కన్ను. అందు నీవే నా మనోరథంబవు. నా కనుల చందమామవు. నా బహిఃప్రాణంబవు. అట్లగుటచే నేను నిన్నొక్క కోరిక గోరఁదలంచి వచ్చితిని. అది నీవు సఫలముచేసెదవో బహుదుఃఖపరంపర చేత నవసియున్న నామనస్సు చెడిపోవునట్లు నిరాకరించెదవో యెఱుఁగ. ఏమనియెదవు?

కర్పూ—తండ్రీ! అదివినకుండ నేనేమియుత్తరము చెప్పగలను?

చిత్రభా—బిడ్డా! నీవది విన్నదే. నీతల్లివలన వింటివి. మల్లిక వలన వింటివి. అయినను నానోటఁగూడవిని సమాధానముఁజెప్పు. నీకు

వివాహయోగ్యకాలము ప్రాప్తించినది. తగినవరుని నన్వేషింపవలసిన భారము నాపై నున్నది. బిడ్డలకు మాతాపితలకన్న హితార్థులు క్షేమంకరులు నాప్తులు ప్రపంచమున మఱియొకరు లేరుగదా? అందుచేత మే మెల్లవిధముల నీమేలు నీసుఖముం గోరి వరనిర్ణయము సేయుదుము. స్వయంవరమనుపద్ధతి రాచకొలమునందున్నదిగాని దానివలనం గొన్ని యరిష్టములుండుటచే నది నాకిష్టములేదు. బాలికలు నవయౌవనప్రేరితలై పౌర్వాపర్యములు విచారింపక భావికాలకష్టముల నెన్నలేక "కన్యావరయతేరూప" మ్మనునట్లు కేవలము చక్కందనమునే చూచుకొని యే దరిద్రునో గుణహీనునో నాస్తికునో కులభ్రష్టునో విద్యాగంధశూన్యునో వరింతురు. స్వయంవరమునం బ్రమాదమున కెన్నో యవకాశము లున్నవి. కావున దానిని నే నంగీకరింపం జాలను. అందుచే మేముచేసిన, నిర్ణయమునే నీవు తలయొగ్గి యనుసరింపవలయునని కోరుచున్నాను. "మాతృదేవోభవ పితృదేవోభవ" యని వేదము చెప్పుచున్నది. మాతాపితలు బిడ్డల పాలిదైవతములు. వారి మాట యవశ్యము గ్రాహ్యము అట్లగుటంజేసి నీవు నామాట ననుసరింతువని నమ్మియుంటిని. విశేషించి నీవు తక్కిన రాజకన్యలవంటి దానవు కావు. కావ్యనాటకాదు లేగాక శాస్త్రములంగూడ నభ్యసించిన దానవు. గుణగ్రహణపరాయణవు. సంగీతసాహిత్య ధౌరంధర్యమున నీకు సాటియగుకన్య నేటికాలమున లేదు. నాబిడ్డ వగుటచే నేను నిన్నుం బొగడంగూడదుగాని నీవిద్యకు వినయము వన్నెపెట్టుచున్నది. ఈ నాటికన్యలవలె గర్వము పెంకెతనము నీకడనున్న పక్షమున నేనట్లు చెప్పుటకు రాకనేపోదును.

కర్పూర—తండ్రీ! స్వయంవరమునం బ్రమాదములున్నవనుట నిజమేకాని దమయంతి పొరబడినదా? రుక్మిణిపొరబడినదా? తల్లిదండ్రులకిష్టములేని పెండ్లికొడుకును జేపట్టినను సుభద్రపొరబడినదా?

విద్యావంతులైన కన్యకలు మనసులో నెంత వలపున్నను నెంతి మోహపరవశులైనను స్వయంవర సమయమునఁ దమకులగౌరవమును వరుని యాభిజాత్యమును గుణసంపదను జూచుకొనకపోరు.

చిత్రభా—బిడ్డా! అందఱు కన్యకలు దమయంతియట్టివా రగుదురా? అందఱు రుక్మిణివంటివా రగుదురా? ఎల్లరు సుభద్రలగుదురా? అవి పురాణములలోని గాథలు. అదియునుఁగాక కవిచాతుర్యమందు మెండుగా నుండును. కవులు గోరంతలు కొండంతలు జేసి వర్ణింతురు. ఆమాట నీవే యెఱుఁగుదువు. దానికేమిగాని నీ వెవ్వరికొఱకైన మేలుపడితివేమో చెప్పుము. నీవలపున కే రాజకుమారుఁడైన గుఱియైనచో నది నాకెఱిఁగింపుము. అతఁడు స్వీకరింపఁ దగినవాఁడగునో కాడో చెప్పెద.

కర్పూ—ఆ విషయమున నేనిప్పుడేమియుం జెప్పఁజాల. (అని సిగ్గునఁ దలవంచినది.)

చిత్ర—అమ్మా! మాళవరాజనందనుఁడగు మకరందుఁడు నీకు నచ్చినాఁడని కర్ణాకర్ణికగ వింటిని. అయ్యది నిజమగునో కాదో నీవు నాకెఱిఁగింపుము? నాకడసిగ్గుపడకుము. నీమనోభావము స్పష్టముగా దెల్పుము. పెఱవాఁడనుగాను. కన్నతండ్రిని. నీభావము దెలుపుదువేని నేనందున్న గుణదోషము లుగ్గడించెద.

కర్పూ—భావమున కేమిగాని యక్కుమారుని యందుఁగల గుణదోషముల నుగ్గడింపుము.

చిత్ర—బిడ్డా! గుణదోషము లుగ్గడింపవలసినదని నన్నడుగుచుంటివా? నీవు విద్యావతివి. గుణగ్రహణశక్తికలదు. అనఁగూడదుగాని నాకన్న నెక్కువచదువుకొంటివి. నీవు గ్రహింపలేని గుణదోషముల నేనెన్నఁగలనా? అయినం దండ్రినగుటచేతను బెద్దఱికము నా మీఁదఁ బెట్టుటచేతను జెప్పెద వినుము—మాళవేంద్రుఁడగు

సుదర్శనుఁడు ... మనము క్షత్రియులము. మనము వర్ణాశ్రమ ధర్మములఁ బా... వారికవి లేవు. మనకు యజ్ఞములు మొదలగు క్రతువులు కలవు. శ్రాద్ధములు మొదలగు పితృకర్మలు గలవు. సంధ్యావందనాది నిత్యకర్మలు కలవు. ఇవి వారికి లేవు. వారు వేదమును ప్రమాణముగా గ్రహింపరు. శాస్త్రములు విశ్వసింపరు. పురాణములు కల్పిత కథలందురు. ఆత్మ లేదందురు. ఉత్తరలోక ఫలమును నమ్మరు. జగన్నిర్మాణ ధురీణుఁడగు చతుర్ముఖుని కన్నను, విశ్వరక్షణ కళాప్రవీణుఁ డగు నారాయణుని కన్నను జగత్ప్రళయకారణుఁడయిన శివునికన్నను, శాక్యకులుఁడైన గౌతమబుద్ధుఁడె సర్వవిధముల నధికుఁడని వారు విశ్వసింతురు. ఇన్నిటికన్న గష్టమైన దింకొకటికలదు. వారు పరమేశ్వరుఁడు లేఁడందురు. అందుచే నాస్తికులు. ఇట్టి యపవిత్రమగు ధర్మ ముపదేశించి లోకులను ధర్మభ్రష్టులను బరమపతితులను జేసిన యాగౌతమబుద్ధునకుఁ నధమగతులే గాని యుత్తమగతు లుండవుగదా!

కర్పూర—తండ్రీ! బౌద్ధమసిద్ధాంతములు నీకు సరిపడక పోయిన బోవుగాక! నీచెప్పిన దోసములు బౌద్ధమతస్థులకడ నుండిన నుండుఁగాక! కాని, లోకోత్తర చరిత్రుఁడును, బరమపవిత్రుఁడును, సర్వదీనజనమిత్రుఁడును నయిన సిద్ధార్థుని నీవట్లు దూషించుట ధర్మము గాదు. ఆ మహాత్మునికన్న నుత్తముఁడు నమ్మహనీయునికన్న మాననీయుఁడు—నా దేవునికన్న మహానుభావుఁడు జగంబున మఱియొకఁడు గలఁడా? ఆ సిద్ధాంతములు నీవు చదువలేదు. వైదికధర్మనిరతు లగు పండితులవలన నిజములు కొన్ని యబద్ధములు కొన్ని విని సౌగత ధర్మములు నింద్యములని దురభిప్రాయముఁ గలిగియుంటివి. అది పట్టి పొరబాటు. చిత్తగింపుము. అమ్మహాత్ముఁడు పవిత్రరాజ వంశమున జన్మించి మహీమండలమేలుట కర్హుఁడై యుండియుఁ దండ్రి కొక్కఁడై

కొడుకయ్యు, నమితలావణ్యతారుణ్య సమేతయగు భార్యం గూడి యుండియు, సకలైశ్వర్యసమృద్ధిం గల్గియుండియు లోకము పాప భూయిష్ఠమై యున్నదని విచారించి దుర్గతిపాలగుచున్న మానవ లోకము నుద్ధరింపసమకట్టి యాలుబిడ్డలను, దల్లిదండ్రులను, బంధు మిత్రులను భాగ్యభోగ్యములను విసర్జించి చీనిచీనాంబరములకు మాఱుగాం గాషాయవస్త్రములం దాల్చి, ముత్యాలహారములకు మాఱుగా రుద్రాక్షమాలలు ధరించి శిరమున రత్నమకుటమునకు మాఱుగా జటాజూటమువహించి, గమగమతావుల నీను కలపంబు లకు మాఱు బూదిఁబూసికొని, యుద్యానవనములు రోసి వనముల డాసి, మేడలు విడిచి చెట్లనీడల విడిసి, హిరణ్మయపాత్రముల త్యజించి మృణ్మయపాత్రముల భుజించి, పరమనిష్ఠాగరిష్ఠుఁడై తపంబుసేసి, మేను శుష్కింపఁజేసి యింద్రియంబుల గెల్చి, జీవితముయొక్క పర మార్థముం గనిపెట్టెను. ఆమహనీయుఁడు మధ్యమలోకమున కలం కారము. క్షత్రియుఁ డగుటచే రాచకొలమాయనవలన వన్నె కెక్కెను. మానవలోక మాయనవలనఁ బవిత్రమైనది. దయాదాక్షి ణ్యములే యా మహాత్ముని మతమునకు మూలరాళ్ళు. ఆశాక్య సింహుఁడు మూర్తీభవించిన భూతదయయని చెప్పుట యతిశయోక్తి గాదు. భూతదయ యాతని కళేబరముతో నాఁడు దగ్ధమైపోయిన దనుట పొగడ్తగాదు. శాంత మామహనీయునితో నాఁడు చితి మీఁద బూడిదయయ్యెనని పలుకుట కవిచాతుర్యముగాదు. ఆయన బోధామృత మాస్వాదించినవారు ధన్యులు. ఆయనం జూచిన వారు కృతకృత్యులు. ఆయన మతము స్వీకరించినవారు పవిత్రులు. ఆయనవలన మానవులు పతితులు గాలేదు. పతితులు పావను లయిరి. దుర్జనులు సజ్జనులైరి. అపవిత్రులు పవిత్రులైరి. ఆ భగ వానుఁడు దేవుఁడున్నాఁడనిగాని లేఁడనిగాని చెప్పలేదు. అంత మాత్రముచేత నతఁడు నాస్తికుఁడుగాఁడు. అతనిమతము నాస్తిక

మతముగాదు. అతఁ డాస్తికులలో నగ్రగణ్యుఁ డని చెప్పనచ్చును. ఆస్తికులమని విఱ్ఱవీగు మానవులలో ననేకులు సత్య నాస్తికులు, ధర్మ నాస్తికులు, దయా నాస్తికులు, భక్తి నాస్తికులు, కలరు. ఆ నాస్తికులలో నెండఱో యాస్తికులు గలరు. భూతదయాజితేంద్రియ త్వమునను రెండును దన్మతమునఁ బరమసిద్ధాంతములు. ఆమత మవ లంబించినవారు జీవహింస చేయరు. ''ఆత్మవత్సర్వభూతాని'' యను ధర్మము వారియందు స్థిరమైయున్నది. జీవహింసా భయముననే వారు యజ్ఞములు మానిరి.

చిత్ర—అమ్మాయి! బౌద్ధమతసిద్ధాంతములు నీతలకెక్కినవే. అవి యెక్కడ నేర్చితివి? ఆమతమన్న నీకింతగౌరవము కలుగుటకుఁ గారణమేమి? గురివెందగింజలు నిప్పులని, గాజుపూసలు జాతిరత్నము లని, మెఱ్ఱుని పింకులు కెంపులని నీవు భ్రమించుచుంటివి.

కరుణా—తండ్రీ! నేను భ్రమించుటలేదు. నేను విదర్భలో నున్నప్పుడు మైత్రేయియను బౌద్ధయోగిని తఱుచు రాజాంతఃపురము నకు నచ్చుచు బోవుచు శుద్ధాంత కాంతలకు నప్పు డప్పుడు సుగత స్వాముల ధర్మముల నుపదేశించుచుండెను. అవి నేను మిక్కిలి శ్రద్ధగ వింటిని. పిమ్మట నామె పాళియనుభాష నాకుపదేశింప నందులో నున్న దమ్మపదము మొదలగు నుత్కృష్ట గ్రంథములఁ జదివితిని. అదికారణముగా నాకు మహనీయుఁడైన బుద్ధదేవునిమీఁదను వాని మతముమీఁదను నమితగౌరవము గలిగినది.

చిత్ర—సహవాసదోషమున సుశీలురు దుశ్శీలురగుట యాశ్చ ర్యముగాదు. నీళ్ళకు వస్త్రములకు వాయువునకు వస్తుసహవాసము లనుబట్టి సుగంధ దుర్గంధములు గలుగునట్లే మనుష్యులకుఁ గూడ దుర్జన సజ్జన సహవాసమువల్ల దురభిప్రాయ సదభిప్రాయములు పట్టు వడును. ఒకవేళ బౌద్ధమతములో నుత్కృష్ట ధర్మము లున్నను బౌద్ధు లందఱు సుగుణసంపన్ను లగుదురా?

కర్పూ—తండ్రీ! అందఱు సుగుణవంతు లుండరు. కాని మానవేంద్రుఁ డగు సుదర్శనుఁడు లాటివారితోఁ బోల్పఁ దగినవాఁడు గాఁడు. ఆయన గుణరత్నాకరుఁడు. అతఁడు తన దేశమున జీవహింస మాన్పించెను. ఆయన నిష్కళంక చరిత్రుఁడు. పరమ కృపాళుఁడు. ప్రజలం దన బిడ్డలుగాఁ జూచును. ఆత్మసుఖముకంటెఁ బ్రజాసుఖ మెక్కువగఁ జూచును. ఎక్కువ పన్నులుగట్టి ప్రజలబాధింపఁడు. బౌద్ధమతస్థులమీఁదఁ బక్షపాతము, వైదికమతస్థులమీఁద ద్వేషము లేదు. అందఱ సమానముగఁ జూచును. ఆయన కొడుకు మకరందుఁడు పితృమార్గానువర్తి. తల్లిదండ్రులకు విధేయుఁడు. ప్రజాబాంధవుఁడు. తండ్రివలెనే యతఁడుగూడ రాజ్యమందలి ప్రజలలోఁ దండ్రి లేని వారికిఁ దండ్రి. సోదరులు లేనివారికి సోదరుఁడు. మిత్రులు లేనివారికి మిత్రుఁడు. బిడ్డలు లేనివారికి బిడ్డ. ఈవిధముగా వారు సర్వజన శ్లాఘనీయులై, కృపాసముద్రులై, ధర్మతత్పరులై, రాజ్యపాలనము సేయుచున్నారు.

చిత్ర—ధర్మతత్పరులై పరిపాలించుట నీవెట్లెఱిఁగితివి?

కర్పూ—మాళవదేశమున నేనున్న కాలములో వారి గాంభీర్యాదిగుణములు దెలిసికొనుట కనేకావకాశములు గలిగినవి.

చిత్ర—అంతఃపురమునందున్న విదేశాంగనను నీకు లోకము నందలి వ్యవహారము, రాజుల పరిపాలనాపద్ధతులు దెలిసికొనుట కవకాశము గలిగినదా? ఎంతో కాలము దేశములందుండి సల్గడలు దిరిగి జనులతోఁ గలసిమెలసి యున్నవారికే తెలియుట కష్టముగదా నీ కవలీలగా దెలిసెనని నీ వనినంతమాత్రమున నమ్మవచ్చునా? ఏదో యభిమానమున నిట్లనుచుంటివి!

కర్పూ—తండ్రీ! నాపలికినది సత్యముగాని యభిమాన ప్రేరితమైన మాటగాదు! శత్రువులయందైనను గుణమున్నచో గ్రహించుట సత్పురుష లక్షణము.

చిత్ర—గుణమున్న గ్రహింపవచ్చును. లేనిచో గ్రహించు టెట్లు? ప్రస్తుతాంశము విను! మఱి రందునిమీఁద నీవువలపునిలిపితివో లేదో నీమాటలచే స్పష్టముగాఁ దేటపడలేదు. కాని, వానియెడనీకుఁ గల యభిమానముంబట్టి నీకాతనిపైఁ గూరిమిగలదని నేను నిశ్చ యింపవలసివచ్చినది. మనము వైదికాచారసంపన్నులము. వారు వేదబాహ్యులు కర్మరహితులు, మనకువారికింగలయిక యపేక్ష ణీయముగాదు. నీవు దేవాలయమున కరుగుదువు; వారు దేవాలయ ములను రోయుదురు. మనము శివకేశవులను బరమాత్ములుగా నెం తుము; వారు మనుష్యమాత్రుఁడైన బుద్ధునే యారాధింతురు. నడ వడులలో నాచారములలో నభిప్రాయములలో మనకువారికి నమిత భేదము గలదు. అట్టివారి మనసులెట్లు కలియును? పొత్తులెట్లు కలు గును? సామరస్యమెట్లు కుదురును?

కర్పూర—తండ్రీ! అన్నింటికి మనస్సుప్రధానము. మనస్సులో నిష్టమున్న యెడల నన్నిఁట సామరస్యము గుదురును. దంపతులు భిన్నమతస్థులయినను దాంపత్యమున భంగముండదు. భర్తశైవుఁడు, భార్యవైష్ణవియైన దాంపత్యములున్నవి. మతములో నెవరిష్టము వారిది. ఎవరియిచ్ఛవచ్చినట్లు వారు దేవతల నారాధించుకొనవచ్చును. అంతమాత్రముచేతఁ బరస్పరమైత్రికి భంగముండదు. అరమర లేని కూరుములునిలుపుటకు మనమడ్డమురాదు.

చిత్ర—బిడ్డా! నీవు వెఱ్ఱిపడుచున్నావు? అట్టిదంపతులకెన్నఁడుఁ గాపురము సరిగాఁబొసగదు. అయ్యాదాసునకుఁబెట్టు నమ్మజంగము నకుఁబెట్టు నన్నసామెత నిజమగును. నీవుజక్కఁదనమొక్కటే మెచ్చి యాతని వరింపఁదలచు చుంటివి. వరునియందుఁ జూడఁదగినలక్షణ మదియొక్కటియే గాదు. త్రాఁచుబాము తలలో వెలలేని మణియుం డును. అదిచూపులకెంతో చక్కఁగానుండును. ఈగుణములంబట్టి

దానినెట్టివెంగలిదైన మెడలో హారముగా వైచుకొనునే? దానిం బ్రక్కలోఁ బెట్టుకొని సందుకొనునే? మెఱయుచున్నదంతయు బంగారమనుకొనవద్దు. కస్తూరిపంకముఁబూసికొన వచ్చునుగాని బురదఁ బూసికొనఁ గూడదు.

కర్పూ—అయ్యా! చక్కఁదన మొక్కటేమెచ్చి కార్యనిశ్చయము చేసికొనుటలేదు. మెడఁదాల్చునది కుసుమసూలగాని కోడెత్రాఁచుగాదు. మేనఁ బూసికొనునది మృగనాభిగాని, మెత్తనిబురద గాదు.

చిత్ర—బిడ్డా! చదువుకొన్నదానవు గావున వీరుఁడు బాణమునకు బాణము వైచినట్లు మాటకు మాట సమయోచితముగఁ జెప్పఁ గలవు. యుక్తులనటుంచి నామాటవినుము. మకరందునిపై మక్కువ మానుము.

కర్పూ—అట్లయిన నెవ్వని పాణిగ్రహణము సేయుమందువు?

చిత్ర—భళి! ఇప్పుడు దారికివచ్చితివి. చెప్పుచున్నాను వినుము—ఈపట్టణమున దండపాణి వజ్రపాణియని యిరువురన్నదమ్ములున్నారు. వారుత్తమక్షత్రియులు; చంద్రవంశజులు, మనము పాండవసంతతి; వారు యాదవసంతతి, మనకువారికిఁ బూర్వకాలమునుండియు నిచ్చుకోలు పుచ్చుకోలుగలవు. వారిద్దరు సేనాధిపతులు, అసహాయశూరులు, సర్వశ్రపరాక్రములు, అందువజ్రపాణి భుజాబలమున భీమసేనుఁడు, ధనుర్విద్యయందు సవ్యసాచి, సౌజన్యమునందు సహదేవుఁడు, శాంతమునందు ధర్మరాజే.

కర్పూ—చక్కఁదనమందో?

చిత్ర—పాడుచక్కఁదనము. వరునకుఁ జక్కఁదనమే ప్రధానమా? అది యప్రధానమని నాయభిప్రాయము. అదిగాక యెవరి చక్కఁదనము వారికుండును. కన్ను ముక్కు చెవి నోరు కాలుసేతులు

వంకర లేక సరిగానుండెనా యెట్టినరుండైనం జక్కగానుండెను. గుణము ప్రధానముగాని చక్కదన మెందుకు? తురాయిపువ్వు కట్టెఱ్ఱగా నుండును. అందము లేదు. చందము లేదు. వాసన లేదు. అతండు నల్లగానుండును. నల్లగా నున్నంత మాత్రమున యువతీదూష్యుం డగునా? అట్లయిన నల్లనివారికిం బెండ్లి కాంగూడదా? కస్తూరి నల్లనై సువాసనలచేత మాననీయముగాదా? కోయిలనల్లనై మనోజ్ఞ ధ్వనులచే జగద్వంద్యముగాదా? ఇంద్రనీలము నిగనిగ కాంతుల నీనుచు నవరత్నములలో నొకటి కాలేదా? భగవంతుండగు పరమేశ్వరుండు స్ఫటికమువలెం దెల్లని మేను గలవాండయ్యు నల్లనిదానిని పార్వతిని బెండ్లియాడలేదా? శ్రీమహాలక్ష్మి బంగరుబొమ్మవలె నుండియు నీలమేఘశ్యాముండైన నారాయణుని వరింపలేదా? నీలవర్ణము హరిహరులకు భార్యలతోడి కూటములు చెఱిచెనా? పాంచాలి నల్లనిది; పాండవులు చక్కనివారు. ఇట్లనేక యుదాహరణము లున్నవి. కావున నల్లనివాండనిరోయక వజ్రపాణిం జేపట్టుము. అతండు వేయి కన్నులు లేని వజ్రపాణి. రక్కసులచేం బెక్కుసారులు కయ్యముల నోడిపోని వజ్రపాణి. మునిశాపంబును జెందనివజ్రపాణి. మధ్యమలోకమందున్న వజ్రపాణి.

కర్పూ—రాజ్యములేని వజ్రపాణి. పూజ్యతలేని వజ్రపాణి యని చెప్పుము.

చిత్ర—అమ్మా! ఆలాగు నిరసింపంగూడదు. అందఱకు రాజ్యములుండునా? శ్రీకృష్ణున కేమిరాజ్యము గలదు? రుక్మిణీ సత్యభామ మొదలగు కాంతలెంతమంది గుణములకువలచి యాతనిం జెట్టం బట్టలేదు.

కర్పూ—ఆయనకిదివఱ కొకభార్యయున్నది గదా?

చిత్ర—ఉండిననేమి? చిన్నదానవయ్యు నీవె పెద్దభార్య వగుదువు. నిన్నుం జేపట్టినపిదప నామె గౌరవము కడముట్టును. ఆమె నీకు దాసియై యుండును.

కర్పూ—హరిహరీ! తండ్రీ! ఆయన చెట్టబట్టి యెంతో సుఖ పడవలెనని వచ్చి సంతానవతినై మహాపతివ్రతనై యాతని సేవించిన యిల్లాలిని నేను దాసిగా నేలుదునా? అట్టిపాడుపని యెన్నటికి నేఁ జేయను. నాదురదృష్టముచేత నొకవేళ నాతని చెట్టఁ బట్టుటయే సంభవించునేని నేనాయనకు రెండవపత్నినై యామెకే నేను దాసినై యూడిగములు సేయుదునుగాని యాసాధ్వి మనస్సునకు రవంతయేని నొప్పిగలిగింపను సుమీ! నీవు లక్ష్మీదేవిని శంకరునిఁ బ్రసంగవశమునఁ బేర్కొంటివి. నారాయణుని యందున్నగుణములు వజ్రపాణి యందున్నవా? దేవతలసామ్యము పనికిరాదు. దేనికయిన మనస్సు ప్రధానము. మహారాజునకు మందిరములు కావలెను. విరాగికి విపినములు గావలెను. మనసునకు నచ్చినవాఁడె మన్మథుఁడు; నచ్చనివాఁడు నాగుఁబాము.

చిత్ర—ఇంతకు వజ్రపాణి నీకు నచ్చెనా. లేదా?

కర్పూ—తండ్రీ! అడుగుచుంటివి గాన జెప్పెద వినుము. అతనిచేయి బట్టుటకంటె శాశ్వతబ్రహ్మచర్యమున నుంట మేలు.

చిత్ర—బిడ్డా! నీవాతని చేపట్టుటవలన మనకు గొప్ప యుపకార మగును. అదియెట్లందువేని—వజ్రపాణియు వానియన్నయగు దండపాణియు మనపక్షమున నున్నారు. నీవు వజ్రపాణిని జేపట్టుదువేని వారు హేమచంద్రుని వంశమును సింహాసనమునుండి కూలఁద్రోసి కాశ్మీరరాజ్యమునకు నన్నభిషిక్తుఁ జేయుదురు. నేను పెద్దవాఁడను. నాలుగైదేండ్లు రాజ్యముచేసి చనిపోదును. నా యనంతరమున నీతమ్ముఁడు విజయసేనుఁడు రా జగును.

కర్పూ—(చెవులుమూసికొని) హరి హరీ! ఎంతమాట! విక్రమసేనుని రాజ్యభ్రష్టుం జేయుదురా? అందుకని నేను వజ్రపాణి

పాణిగ్రహణము జేయవలెనా? నావివాహమిట్టి దుష్కార్యమునకై నుపయోగింపఁబడునా? కటకటా! అట్టిపాడుపనిలో నేనెన్నఁడు బాల్గొనను. విక్రమసేనుఁడు తండ్రిలేనిబిడ్డ. మనమందఱమువానికి సాయముజేసి రాజ్యమునందతని సుప్రతిష్ఠితునిఁ జేయుటకుమాఱుగా నిట్టి దుష్కార్యము సేయఁదగునే? ఈకార్యము నింద్యము. దూష్యము. నరకహేతువు. తండ్రీ! అట్టిపని యెన్నఁడు సేయకుము. విక్రమసేనుఁడు విజయసేనుఁడుఁ గూడ నా తమ్ములే. ఎవరు గద్దె నెక్కినను నాకు దద్దయు సంతసమే. కాని, పైతృకంబగురాజ్యమునకు విక్రమసేనుఁడే యర్హుఁడు. అతఁడు రాజగుటే ధర్మము. ధర్మేతరములగు మాటలు నాకడఁ జెప్పవలదు.

చిత్ర—(రోసముతో) నయమున భయమున నే నెన్నివిధములఁ జెప్పిన నామాటలు నీమనసున కెక్కకున్నవి. తలక్రిందుగాఁ దపస్సుచేసినను నీకు మకరందుఁడు భర్త గాఁడు. నిన్ను వజ్రపాణికే పెండ్లిచేసెదను జూడు.

కర్పూ—(రోషముతో) తండ్రీ! అంతవఱకు వచ్చునేని నాశరీరమగ్ని కాహుతిఁ జేసెద. అంత కవకాశములేదేని—ఇదిగో! నాచేతి వజ్రపుటుంగరము. కర్పూరమంజరీశవమునే నీవు వజ్రపాణికి వివాహము సేయవలయునుగాని, యీ మేనఁ బ్రాణములుండఁగాఁ జేయఁజాలవు. ఒకవేళ నీవతనిచేత నా మెడలోఁ ద్రాడుగట్టించినసంకల్పసిద్ధుఁడగుదువేని యది నా మెడ కురిత్రాడగునుగాని మంగళసూత్రము గాదు. నీవు శూరుఁడవు. చలముగలవాఁడవు. నేను నీకడుపున బుట్టిన కూఁతును. నీరక్తమే నానాళములలోఁ బ్రవహించుచున్నది. నీచలమే నాలోఁ బ్రతిఫలించుచున్నది. నేను మనస్సుచేత మకరందుని వివాహమాడితిని. దేహముచేత వివాహముగాదేని, యీ దేహ

మితరులకొంటు నుపయోగపడకపోవుఁగాక! బలవంతముగఁ జచ్చి మఱియొకజన్మమెత్తియైన నతనిం జేపట్టెద.

చిత్ర—బలవన్మరణమునఁ బిశాచమగుదువు.

కర్పూ—వజ్రపాణిని వివాహమాడి వానిభార్య యనిపించుకొనుటకన్నఁ బిశాచమైనను మంచిదే. రాక్షసియైనను మంచిదే. ఆ పనుభూతముతోఁ గాపురముసేయుటకన్న భూతమునైనను మంచిదే. వివాహము సామాన్య మనుకొంటివా? నీయిచ్చవచ్చినట్లు సేయుట కిది బొమ్మలపెండ్లి గాదు. రెండుహృదయము లొకహృదయము కావలె. రెండుమనస్సు లొకమనస్సు కావలె. భర్త చంద్రుఁడు, భార్య వెన్నెల. మగఁడు సూర్యుఁడు; మగనాలు కాంతి. గృహస్థుఁడు పూవు. ఇల్లాలు తావి. ఏకమనస్సుతో వారవినాభావముగ నుండవలయు. బలాత్కారవివాహములు పనికిరావు.

చిత్ర—నీవు చచ్చిననుసరే! వివాహమాడి చావుము.

కర్పూ—ఆహాహా! నీవంటి తండ్రి ప్రపంచమున లేఁడు. నే మృతినొందిననుసరే నీకార్యమైనం జాలుఁగాఁబోలు!

చిత్ర—సరే! జాగ్రత్తగానుండుము. నీవు నాకు ధర్మప్రశ్నములు చెప్పఁదొడఁగితివి. దీనిఫల మనుభవింతువుగాక!

అని గాటమగు రోసమునఁ జవాలున లేచి గదివిడిచి యవ్వలకుం బోయెను.

పదమూఁడవ ప్రకరణము

ఆశాదేవత జగన్మోహనాకారముఁ దాల్చి హస్తమున బహురసభరితమైన రాజ్యఫలంబును బట్టుకొని మొగమునఁ జిఱునవ్వు వెన్నెలలు గాయ "నన్ను మెప్పించితివేని యీఫలంబు నీయదియ

నీయుదియ! త్వరపడుము. ప్రయత్నింపుము'' అని యూరించుచుఁ బలు తెఱంగులఁ బులిఁగొల్పుటంజేసి చిత్రభానుఁడు స్వలాభపరాయణుఁడై కన్నబిడ్డసౌఖ్యము వీటిఁబుచ్చి నిష్కరుణుఁడై కర్పూరమంజరి నట్లు తూలనాడి తన శయ్యాగారమునకుం జని నేత్రములనియెడు కొలుములనుండి రూక్షవీక్షణములను విస్ఫులింగములు చెదిరిపడ మొగము జేవురుబూసిన తెఱఁగున శోణమయి భయంకరముగఁ దోఁపఁ బండ్లు పటపటఁ గొఱుకుచు నిందుమణిం బిలిచి తనకుం గూఁతునకుం జరిగిన సంభాషణమంతయుఁ జెప్పి యామె పెంకెతనమునకుఁ దగిన దండన చేయునట్లు ప్రతినబట్టెను.

ఇందుమణి మిక్కిలి భయపడి కూఁతుకడకుఁ బోయి శాంత వచనములతో నిట్లనియె. "బిడ్డా! మీతండ్రిగారి స్వభావ మెఱిఁగి యుండియు నీవాయన కంత కోపముఁ దెప్పింపఁదగునా? తండ్రిమాట వినవలదా? పితృవాక్యపాలనము నీవంటి విద్యావతియే చేయనిపక్షమున సామాన్యబాలికలు చేయుదురా? నీవు తండ్రిని దిరస్కరించితివని లోకమున వెల్లడియైన నది మనకప్రతిష్ఠగాదా? నీవు మిక్కిలి కఠినముగా మాటాడితివఁట! అట్టి కఠినోక్తులు తగునా?'' అని మందలించుటయుఁ గర్పూరమంజరి "అమ్మా! తండ్రిమాట వినఁదగినదే. పితృవాక్యపాలన ముత్తమధర్మము. కాని, వివాహము పేరుపెట్టి నాకు దున్నపోతునో పెద్దపులినో లేక మఱియొక మోటపశువునో గట్టిపెట్టవలనని తండ్రిగారు స్వలాభపరాయణులై పనుకట్టినప్పుడు తండ్రిమాట గ్రాహ్యము. అధర్మము పలికినప్పుడు గ్రాహ్యముగాదు. తండ్రి యసత్యమాడుమన్న నాడవలెనా? జనకుఁడు నరహత్య సలుపుమన్న సలుపవలెనా? తండ్రి నీతిమాలి వర్తింపుమన్న వర్తింపవలెనా? ఆయన యధర్మము పలికెనుగావున నే నాయన యానదాఁటితిని'' అని బదులు చెప్పెను.

"బిడ్డా! చదువుకొన్నదానవు. నీకు నేను జెప్పఁజాలనుగాని యొక్కమాట వినుము! మహాత్ముఁడైన భీష్ముఁడు తండ్రిసుఖము కొఱకు స్వసుఖనిరభిలాషియై వివాహము మానుకొని బ్రహ్మచర్య దీక్షాపరతంత్రుఁడై లోకవంద్యుఁడయ్యెను. వివాహమేగాదు రాజ్యము గూడ జనకుని సుఖమునిమిత్తము తృణప్రాయముగాఁ బరిత్యజించెను. రఘురాముఁడు జనకుని శాసనంబున రాజ్యపరిత్యాగంబు గావించి సుకుమారియైన జనకకుమారితోఁగూడ వనముల కేగి పితృవాక్యపాలకులలో నగ్రగణ్యుఁ డయ్యెను. చెప్పఁబూనిన నిట్టి వనేకములుగలవు. వారి తెఱంగున నీవును నీజనకునినిమిత్తము స్వసౌఖ్యముల నాసింపక యాయన ప్రీతికొఱకు నీదేహము నర్పింపరాదే?" యని యిందుమణి యుత్తరముచెప్పెను.

"తల్లీ! రాజ్యములు వదలవచ్చును. వివాహములు మానవచ్చును. నేనును వలయునేని వివాహము మాని బ్రహ్మచారిణినై తపోవనమున కరిగి జీవయాత్ర జరిపెద. అది తండ్రిగారి కిష్టముగునేమో కనుఁగొనుము. కాని, యానరపిశాచమునుమాత్రము చేఁబట్టను. వివాహమాడదలఁచితినా నామనసువచ్చిన రాజకుమారునినాకు నచ్చిన గుణములుగలవానిని—నాకందోయి నలరించెడు లావణ్యవంతుని—నాహృదయము రంజింపఁగల రసికశిఖామణిని—నాప్రాణమునకుఁ బ్రాణమైనవాని—నామనోరథము సఫలముసేయువాని——నామేనికి గందపుంబూతవలె నుండువాని—నాకలోకవంద్యుని—గుణరత్నాకరుని—సత్కులీనుని, విద్యావంతునిఁ జేపట్టెద. లేదా గార్గివలె శాశ్వత బ్రహ్మచర్య వ్రతమవలంబించి నారలుగట్టి కందమూలములు నాకలములు దిని జడలుదాల్చి మేను శుష్కింపఁజేసి కోరికలు మొలకలెత్తకుండఁజేసి పరమ పదమునందెద. ఈ రెండు దారులేగాని మధ్యమార్గమునేనొల్ల. దాంపత్యమన నెట్టిదో యెఱుఁ

కుదువా? అదియు సుఖదుఃఖములయందద్వైతము. సర్వావస్థలలో ససంగతము. ఉదయమునకు విశ్రామము. ఆజన్మాంతము బరస్పరా నంద సంధాయకము. అట్టిది కాని పెండ్లి పెండ్లిగాదు. తల్లీ! ఇన్నిమాట లెందుకు? విదర్భరాజపుత్రికయగు దమయంతి జగత్త్రియ నాయకులు వర ప్రదాతలు మహామహిమాఢ్యులునగు దేవతలువచ్చి తెమ్ము వరింపుమని ప్రార్థించినను వారిం గ్రేగంటిచూపులనైనం దను పక మానవుఁడు-తనవలపుకాఁడు నైన నిషధరాజును వరించెను. మఱియొక విదర్భరాజపుత్రిక రుక్మిణి తలిదండ్రులు నన్నదమ్ములు, బంధుమిత్రులు తన్ను శిశుపాలునకిచ్చి పెండ్లిచేయ నిశ్చయించినను వారి కన్నుగ్రామి యతిరహస్యమున శ్రీకృష్ణునియొద్దకుఁ దనకునమ్మి కగల యొక బ్రాహ్మణుని రాయబారమంపి తన మనోరథమాయన కెరిగించి యాయనచేబలాత్కారముగాఁగొనిపోఁబడి రాక్షసవిధిచే నాయనను వివాహమాడెను. అదిగాక సాక్షాన్నారాయణావతారుఁ డైన శ్రీకృష్ణునియొక్కయు శేషావతారుఁడైన బలభద్రుని యొక్కయుఁ జెల్లెలు, వసుదేవుని కూఁతురు, సుగుణభద్ర సుభద్ర తన్ను బలదేవుఁడు దుర్యోధనునకీయఁ దలఁచినను మేనత్తకొడుకగు నర్జునుని వలచి వలపించి పితృభ్రాతృవచన తిరస్కారముఁగావించి యాతని వెంటఁ బోయెను. తల్లీ! వారి సాదృశ్యమేల తేఁగూడదు? నాచెప్పిన పలుకులన్నియుఁ జక్కఁగఁ బరిశీలించి తండ్రిగారి కోప మును శమింపఁ జేయుము. ఇంతకన్న నా చెప్పునదిలేదు.'' అని కర్పూరమంజరి బ్రతిమలాడవచ్చిన తల్లి కుత్తరమిచ్చెను.

పుత్రిక గట్టిపట్టుపట్టియున్నదనియుఁ దనమాటలామెతలకెక్క వనియు గ్రహించి యిందుమణి మాఱుమాటాడక పడకగదికిఁబోయి తనయనునయంబులుగూడఁ దనయయెడ నిష్ప్రయోజనంబులైన వని యాగ్రహావిష్టుఁడైనభర్తకెఱింగించి యతని యాగ్రహము ద్విగుణముఁజేసెను.

చిత్రభానుఁడా రేయి కన్నుమూయలేదు. చాలసేపు తోఁచక నటునిటుఁ బచారుచేసి తానుతలపెట్టిన కార్యము ఫలోన్ముఖమునకు వచ్చినప్పుడు తానెన్నఁడుఁ దలఁపని విధమునఁ గూఁతురువలన భగ్నమైనదని చింతించి కార్యసాధనము జేయుట యెటులనాయని విచారింపఁదొడఁగెను. గాఢముగ నిద్రించుచున్న రుద్రభట్టును మేల్కొల్పి కార్యాలోచనము చేయవలయునని యొకటి రెండుసారులు వాఁడు శయనించిన తావునకుఁ బోవ సమకట్టి యాతనికి నిద్రాభంగము సేయుట యనుచితమని మరలఁ దనలోఁదానే సమర్థించుకొని యూరకుండెను. అంత వేకువజామయ్యెను. తెల్లవాఱఁబోవుచున్నది. మేలుకొనుఁడో హోయని కాలపురుషునకై వైచిన కేకవోలెఁ గొక్కొరోకోయని కోడికూసెను. ఆకూఁతవినఁగానే రుద్రభట్టు మేల్కొని యఱచేతులు ఊపాడఁజేసి కన్నులు నులుముకొని పుష్పదంత విరచితమైన మహిమ్నస్తవము పారాయణముఁ జేసికొనుచుండెను. అప్పుడు చిత్రభానుఁడు సమీపించి యాస్తవము ముగిసినపిదప గడచిన రేయి దనకుం గూఁతునకు జరిగిన సంవాదప్రకారము సమగ్రముగా విన్నవించి యిట్లనియె.

"స్వామీ! మీయాశీర్వచన ప్రభావమునఁ గార్యము దాదాపుగఁ బంటకు సిద్ధమైనది. పరమదుర్ముఖురాలైన నాకూఁతువలనఁ బోటుపొడిచిన సముద్రముపాలువడినప్పుడు వెనుకకుఁ దగ్గినట్లు కార్యము యథాస్థానమునకుఁ బోవుచున్నది. ప్రధానము చేసినంగాని మనకు సేనాపతులు తోడుపడరు. వారితోడు లేనియెడల మన మిచ్చటఁ జిల్లిగవ్వకైన మాఱము. బాలిక మూఢయై నామాటలఁ ద్రోసిపుచ్చుచున్నది. వజ్రపాణి చక్కనివాఁడుగాఁడఁట. సవతియున్నదఁట. మాళవరాజనందనుఁడగు మకరందుఁడు మహీతలమున వెలసిన మన్మథుఁడఁట! అతని నేగాని వివాహమాడదఁట. బుద్ధి విశేషమున శుక్రబృహ

స్వతులను జీరికింగొనని మీారే యుక్తాయుక్తంబు లన్వేషించి తప్పు దారింబడిన యికార్యమును సన్మార్గమునకుఁ ద్రిప్పవలయును."

అనవుడు రుద్రభట్టు మెల్లగా "తలంగా! బాలిక కడుమూర్ఖురాలుగా నున్నదే. చదువుకొనిన యాఁడుది, చదువునేఱని మగవాఁడు పనికిరారని మొదటి నుండియు నేను వాదించుచుంటిని. నీకూఁతురు ముద్దుముద్దియగాక ముద్దులమాటగట్టునట్లు విద్దియలు నేర్చి పెద్ద పండితురాలయినదని తద్దయు సంతోషించితిమిగాని తుదకు నీకెదుర త్రొమ్ముమీఁది కుంపటివలెనుండి సంతాపకారిణియగునని యూహింపవైతివి. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' యని మనువు వెఱ్ఱివాఁడై చెప్పెనా? మనువుమాటలు మనము పెడచెవిని బెట్టుటచే మన కూఁతులు మనము తెచ్చిన మనుష్యుల నొల్లక తమ మనవులు సరకుగొనక యిచ్చవచ్చిన తెఱంగున మెలఁగుచున్నారు. తేలునకు ముల్లు పామునకు విసపుతిత్తి, బెబ్బులికి వాఁడికోఱ యెట్టిదో పడఁతికిఁ జదువట్టిది. స్త్రీలన్ని నేలఁబెట్టి త్రొక్కిపెట్టవలెను గాని స్వాతంత్ర్య మీయఁగూడదు. వారియెడ జాలిపడఁగూడదు" అని చేతులతో నభినయించుచు మొగము ద్రిప్పుచు వెండియు నిట్లనియె "వివాహమున నాఁడుదానికి స్వతంత్ర్యభావనయా? తా వలచినవానిని బెండ్లి చేసికొనుటా? రుక్మిణితోను సుభద్రతోను తనకు సామ్యమా? నరకమెక్కడ, దేవలోక మెక్కడ? తల్లిదండ్రులు తెచ్చిన సంబంధమంగీకరించి చచ్చినట్లు పడియుండవలసినదేగాని యాఁడుబిడ్డ వలపులు గిలపులు నిలిపి మనసుకు నచ్చిన వానిని బెండ్లియాడుటా? పూర్వకాలపుమాట నేను చెప్పనుగాని యీ కాలమున స్వయంవరమనఁగా నాఁడుపిల్ల తన చూపులకు నచ్చినవానిని దగుల్కొని పోవుటయే. ఈ వెఱ్ఱి యాగడములు సాగనీయఁ గూడదు. రాజా! నేనింత కఠినముగాఁ బల్కితినని మనసులో వేఱువిధముగాఁ దలఁపకుము. నాబిడ్డ

యొకటి నీబిడ్డయొకటిగాదు. అదియే నాబిడ్డయగునేని నీ తెలంగున నాతో వితండవాదము సేయునేని దాని శరీరము ఖండఖండములు చేయనా? ఇట్లనుటచేత నీబిడ్డం జంపుమనుటగాదు సుమీ! నామనస్సు మండిపోవుటచేత నిట్లంటిని. ఇందు కొక్కటే యుపాయమున్నది. కాలహరణమైనం గార్యము చెడును. దండపాణిని వజ్రపాణినిబిలిచి ప్రధానము చేయుదము. కర్పూరమంజరి వివాహమున కంగీకరించిన దని మనవారితోం జెప్పుదము. అబద్ధ మెట్లుచెప్పుదునాయని నీమనస్సు శంకింపవచ్చును. ఇట్టివిషయమున శంకలు పనికిరావు. మనము తెల్ల వారిలేచి యెన్ని యబద్ధములు నడువుటలేదు? రాజనీతి కసత్యము కన్నతల్లి. సత్యము సవతితల్లి. రాజనీతి యసత్యమునంబుట్టి యసత్య మునం బెరుగుచున్నది. అది యసత్యాత్మకమే. రాజయినవాండు రాజ నీతి నవలంబింపకతప్పదు. ప్రాణవిత్త మానభంగములందు సూనృ తంబువిడిచి యనృతంబు నాశ్రయింపనచ్చునని భగవానుండైన శుక్రుం డుపదేశింపలేదా? అందుచేత నిశ్శంకముగా మన మసత్యమును సత్య ముగా మార్చి మాటాడవచ్చును. ప్రధానము చేయుదునని వారికిం జెప్పిపంపుము. ఎల్లుండి మిక్కిలి మంచిది. తిథివార నక్షత్రములు సరిగాం గుదిరినవి. తారాబల చంద్రబలములు సమకూడినవి. ఆ దిన మునం దప్పక ప్రధానము జరుగునని వారికిం దెలుపుము. అతిరహస్య ముగా జరుగవలెననిమాత్రము చెప్పుము. వానిసన్నిధిని నీవూరకుం డుము. కర్పూరమంజరి సమ్మతించినదని నేనే చెప్పెద. వానితో నిన్నే వలచినదని చెప్పెద నీదర్శనమునకై నిరీక్షించుచున్న దనియెద. నీచేయిపట్టెడు భాగ్య మెప్పుడు లభించునాయని యువ్విళ్ళూరుచున్న దనియెద. నీపేరే యామెకు హరినామస్మరణ మనియెద. నీ విజయ ములే పాడుచున్న దనియెద. అదియిది యననేల! ఏమనవలెనో యన్నియు ననియెద. భగవంతుండు కపటోపాయములకు గట్టితల యిచ్చినాండు. వాటిని వాగ్రూపమున వెల్లడించుటకు నాలుక నిచ్చి

నాఁడు. ఆశక్తి నీక్రింద వినియోగించెద." అని నిశ్శంకముగఁ బలుకు చున్న రుద్రభట్టును జూచి చిత్రభానుఁడు "స్వామీ! ఎటువంటి క్లిష్ట మార్గములనైన మీబుద్ధిరథము నిరాఘాటసంచారముఁ గలిగియుండును. చిక్కిలిచేసిన కత్తివంటి మీబుద్ధి యెట్టిసంకటారణ్యములనైన ఛేదించును. మీమాటలు విషాదముచే జడములైన నామనస్సునకు నవయవములకు నెంతో చైతన్యముగలిగించినవి. మీరు చెప్పినట్లు జేసెదఁ గాని కొట్టకొనకు మనము వివాహము చేయకపోవుదుమేని దండపాణియు వజ్రపాణియు మనము వంచించితిమని యాగ్రహించి యెదురుతిరిగి యపకారము సేయరా? ఈలోపున బాలికయభిమతముఁ దెలిసి కోపించి కార్యభంగము సేయరా? బాలిక యీవార్త విని యాత్మహత్య చేసికొనదుగదా? ఈమూఁడుశంకలు నామనంబును బీడించుచున్నవి. దీనికేమియుపాయము!" అని పలికెను.

నిశ్శంకహృదయుఁడైన రుద్రభట్టు ప్రత్యుత్తరమునకై వెదకుకొనక తక్షణమే యిట్లనియెను. "కర్పూరమంజరికి వానిపై వలపు లేదనుమాట లోకమునకుఁ బొక్కకుండ మనము గోప్యముగ నుంచవలెను. ఈవార్త మనలో జీర్ణముకావలెను. ఎవ్వరియొద్ద నిది యెత్తవద్దని నీభార్యతో నొక్కిచక్కాణింపుము. చెలిమికత్తె లీమాట జాఱవిడిచిరని బ్రతికియుండఁగానే నేలం బాతిపెట్టింతుమని చెప్పుము. సలసలకాఁగుచున్న నూనెలోఁ జాఱవేయించి వడియములట్లు వేయింతుమని చెప్పుము. ఇట్లు చేసితిమేని యీమాట పైకిఁ బొక్కదు. మన కార్యమయినతరువాత వివాహము మనము సేయలేకపోయినను మనను వాఁడేమిసేయఁగలఁడు? బాలిక మొదట పెండ్లి కంగీకరించి పిదప దుర్వ్యాధులవలన మానుకొన్నదని చెప్పవచ్చును. అదివినక వాఁడు తెగనీల్గి పెంకితనము చేసెనా వానిజుట్టు మనచేతిలో నుండును గనుక నోరు మూయించి శిరచ్ఛేదము జేయించెదము. బాలికయాత్మహత్య

చేసికొనునేమో యని నీకు శంకగదా! చేసికొన్నపక్షమున నీవీడయే పోయినదని నమ్ముము. ఏదోరోగమువచ్చి చచ్చినదని మనము చెప్ప వచ్చును. దైవికమున కేమిచేయఁగలమని వాఁడు తన యదృష్టమును నిందించుకొనుచు నూరకుండి యెప్పటియట్ల మనకుసాయము జేయును. ఆమె బలవన్మరణమునొందిన నవ్వార్త లోకమునకుఁ దెలియకుండఁ జేసి నీబిడ్డ చెలికత్తెయైన మల్లికనో చంద్రికనో దెచ్చి యదే కర్పూర మంజరియని వానికి వివాహము చేయుదము. వీఁడు చిన్నప్పుడెప్పుడో బాలికం జూచియుండును గాని యీనడుమ నెప్పుడుఁ జూడలేదు గదా? "శతకోటి దరిద్రాణా మనంత కోట్యుపాయాః" అని ప్రాచీనులు చెప్పియేయున్నారు. 'నందో రాజా భవిష్యతి' యని వినలేదే? నాఁటికొక్క దైవముండఁడా? భక్తవత్సలుఁడైన మహేశ్వరుఁడు నాశిష్యుని కార్యము భంగము సేయునా? వెనుకటియట్ల నేనిప్పుడో యొక నాఁటిరాత్రి రెండుజాములవేళ మహేశ్వరసాక్షాత్కారము జేసికొని నాకభీష్టసిద్ధి చేయుమని కోరెదను. భయపడకు."

చిత్రభానున కతఁడు చేసినయుపదేశము సమంజసముగా నుండెను. మూఁడవనాఁడు ప్రధానమునకు సుముహూర్తము నిశ్చయింపఁబడినదని యతఁడు వారి కెఱిఁగించెను. వారాదినమున రాత్రి జాముప్రొద్దుపోయినతరువాతఁ దమకాప్తులైన యిరువురుబ్రాహ్మణులం దోడ్కొని పసపు, కుంకుమ, పండ్లు, యగరు, చందనము, సుగంధ పుష్పములు, వెలలేని యాభరణములు. మేలైన పట్టుచీరెలుఁ దెచ్చి తమతోడవచ్చిన సేవకులను వీధిలో నిలిపి వారైన నెఱుఁగకుండ నింటిలోని వారెఱుఁగకుండ రుద్రభట్టు నెదుటఁబెట్టిరి. యథాక్రమముగాఁ బ్రధానముజరిగెను. ఈకార్య మతిరహస్యముగా నుంచవలసినదని వచ్చినబ్రాహ్మణులతో రుద్రభట్టు చిత్రభానుఁడుఁ జెప్పిరి. రుద్రభట్టు కర్పూరమంజరి వానిసమాగమమునకై తహతహం

బడుచున్నదని మిక్కిలి దృఢముగాఁ జెప్పెను. వజ్రపాణి మేరమీరిన యానందమునొంది కర్పూరమంజరీ పాణిగ్రహణ మహోత్సవమునకై యూటలూరఁ దొడఁగెను. భవిష్యత్కాలమునఁ దన కూఁతురు కాశ్మీరదేశపు రాణియగునని దండపాణి పరమానందమునొందెను. ప్రధానము ముగిసినపిదప వారు నిజనివాసముల కరిగిరి. చిత్రభానుఁడు రుద్రభట్టు తాము త్రవ్విన మాయాకూపమున వారుపడిరని చెప్పుకొని నవ్వుకొని పిమ్మట నిద్రపోయిరి.

—•—

పదునాలుగవ ప్రకరణము.

తెల్లవాఱఁజొచ్చెను. కాశ్మీరరాజ్యలక్ష్మిని దనువశము జేసికొనుటకై గొప్పకుట్ర జరుగుచున్నది. రాజభక్తులందఱు నెంటనే మేలుకొనుఁడో"హో" యని కాలపురుషుఁడు పెట్టుబొమ్మవలె జాము కోడికూసెను. విషాదమాలిన్యముపోవఁ జిత్రభానుల మొగము తెలివొందినట్లు పూర్వదెస తెల్లబాఱెను. విక్రమసేనుని పక్షముననున్న మిత్రులు క్రమక్రమముగా నిల్లి యంతరించుచున్న వారని తెలియఁ జేయుటకో యన జుక్కలకృత్యములు కాఁజొచ్చెను. రాజ్యలక్ష్మి పరహస్తగతమగుచున్నది. పరమేశ్వరా! కావుకావుమనిపక్షులుసైతమఱచుచున్నవో యన్నట్లు కాకులుకావుకావుమని కూయఁజొచ్చెను అరవిందాదేవి మనంబున నెలకొన్న కొంచెపు టాసలుగూడ నడఁగు చుండినట్లు తెల్లవారుజామున నున్న చిలుపవన్నెలలు క్రమ క్రమముగా క్షీణించెను. దినమానియొదు కాంత నల్లచీర విడిచి తెల్లచీర కట్టినట్లు చీఁకటిపోయి వెలుఁగుపొడమెను. క్రొత్తవేసముతో శ్రీనగ

రంబున జిత్రభానుఁడు పొడసూపినట్లు పొడుపు గొండమీఁదఁ జిత్ర వర్ణములతో భానుఁ డుదయించెను. ఎవ్వరికిం గానఁబడకుండఁ బైపైని జరుగు చిత్రభానుని ప్రయత్నంబులట్టి యుదయకాల ప్రభాకరుని లేయెండలు మునుముందు నేలపైఁ బ్రసరింపక యిండ్లమీఁదను జెట్లమీఁదను వ్యాపింపజొచ్చెను. అతనిజతనంబులు క్రమక్రమంబుగ నిల్లే పురంబున వ్యాపించునని తెలుపుటకో యన లేయెండ లించుకించుక తీవ్రములై నేలం బఱువఁజొచ్చెను.

వైదికకర్మనిరతులగు బ్రాహ్మణోత్తములు స్నానముచేసి ప్రాతస్సంధ్యావిధులఁ దీర్చి భగవానుఁడగు భాస్కరున కర్ఘ్యప్రదాన మొసఁగి నిత్యనైమిత్తికములకుం జొచ్చిరి. మూర్ఛనుండి లేచిన జంతువువోలెఁ బ్రపంచమంతయు వెండియుఁ జైతన్యముగలిగి వికాసవంతమయ్యెను. మానవులు తమతమవ్యాపారములయందుఁ బ్రవేశించిరి. రుద్రభట్టు తనమొగ మప్పటికిఁ బ్రజలకుఁ జూపఁదలఁచుకొనలేదుగావున దొడ్డిలోనున్న బావికడనే స్నానము చేసి ప్రాతరనుష్ఠానములఁ దీర్చికొని, వ్యాఘ్రచర్మాసనమునఁ గూర్చుండియుండఁ జిత్రభానుఁ డాయనకడకుఁ బోయి నమస్కరించి యెట్టయెదుట నాసీనుఁడయ్యెను. "రాజా! సుఖముగ నిద్రపట్టినదా?" యని రుద్రభట్టడిగెను. "దేవా! మీ యనుగ్రహమున మనోవిచారములెల్ల దూరములగుటచే నిద్ర పట్టినది. కాని, "రాజా!" యని పిలుచుచున్నా రేమి? అది లంభింప లేదే?" యని చిత్రభానుఁడు బదులుచెప్పెను. అప్పుడు రుద్రభట్టు చిఱునవ్వు మొగమున నంకురింప నిట్లనియె—"లభింపలేదా? నీమట్టుకు లభింపలేదని తోఁచుచున్నదిగాని, నా బుద్ధికి లభించినట్లు తోఁచుచున్నది. నీవు కాశ్మీరసింహాసన మెక్కినట్లు. నీశిరంబున నానారత్న విరాజితమగు కనకకిరీటము భాసిల్లుచున్నట్లు బహుపుణ్యనదీజలంబు లందెచ్చి భూసురులు వేదోక్తముగ నీ కభిషేకము చేయుచున్నట్లు

సామంతమహీపాలురు తమ మకుటకాంతుల నీపాదములకు నీరాంజనంబిచ్చునట్లు వంగి నీకు నమస్కరించినట్లు హస్తకంకణంబులు ఘలుఘల్లుమని మొఱయ రాజులు కానుకలుగాఁ బంపినయంగనలు నీకు వింజామరలు విసరుచున్నట్లు, హెగ్గడలు కైవారము సేయుచున్నట్లు ప్రగ్గడలు రాజకార్యముల నివేదించుచున్నట్లు రాయబారులు వినయంబునఁ దమతమ రాజుల సందేశంబుల నెఱిఁగించుచున్నట్లు నీవు వారి మనవిసనవులవిని మెచ్చి తలయూచి కృపారసపూరితములగు క్రీగంటిచూపులఁ జూచుచున్నట్లు నామనోనేత్రమునకిప్పుడే పొడగట్టుచున్నది. సర్వాలంకార శోభితమగు మదపుటేనుఁగు నెక్కి నీవు శ్రీనగరంబున నూరేగుచున్నట్లు నేలవేల్పులు గంభీరస్వరమున నిన్నాశీర్వదించు చున్నట్లు పౌరాంగనలు నీపై నక్షతలు లాజలు పూవులుజల్లి మందహాస విలసితములగు సుందరవదనారవిందములతో నిన్నుం జూచి యానందించి పసిడిపళ్ళెరంబుల గప్పుటంపు టారతులిచ్చినట్లు నా మనోలోచనమునకుఁ గానవచ్చుచున్నది. కాకపోయెను కార్యంబు నామనంబున నింత దృఢముగా ముద్రయిడినట్లు నిలువదు. పరమేశ్వరానుగ్రహము నీపై సంపూర్ణముగాఁగలదు. తెల్లవాఱుజామున భగవంతుం డగు చంద్రశేఖరుఁడు నాకు స్వప్నమున సాక్షాత్కరించి మీఁదఁ జేయివైచి తట్టి 'వత్సా! నీ సంకల్ప మీడేఱును. నీవింకఁ విచారంబు దక్కియుండుము. చాణక్యుఁడు చంద్రగుప్తుని మగధరాజ్యంబునఁ బ్రతిష్ఠించిన చందంబున నీవు చిత్రభానుని గాశ్మీరసింహాసనంబున నిలుపగలవుసుమీ'యని యానతిచ్చెను. అంతలో నాకు మెలకువవచ్చెను. శాంతరసమొల్కు నామూర్తిని, సువర్ణములవంటి సువర్ణములతోఁ గూడిన యా చల్లని మాటలను మఱియొకసారి కని వినవలెనని కుతూహలము పొడముచున్నది. మరల నెప్పుడోగాని లభింపదు. ఇఁక మన కార్యసిద్ధియైనట్లే. మనదే యాలస్యము. రాజ్యలక్ష్మి రాకసివంటిది. అది

కామరూపిణి. చిఱునవ్వునవ్వి యొకనితో మేలమాడును. భయంకరాకారిణియై యొకనిని బెదరించును. ఎండమావులవలె తన యునికి నిజమ్మని భ్రమింపఁజేసి వేఱొకని బేలుపుచ్చును. ఒకని నిజముగా ననుగ్రహించి బాగుచేయును. దాని నెప్పుడు నమ్మరాదు. మాంత్రికుఁడు పిశాచము దొరకినప్పుడు మంత్రప్రభావమునఁ బట్టుకొని దిగ్బంధనము జేసి కదలనీక మెదలనీక దనవశము జేసికొనినట్లు రాజనీతికోవిదు లదను జిక్కినప్పుడు రాజ్యలక్ష్మిం బట్టుకొని బంధింపవలయు. ఇప్పు డయ్యదను వచ్చినది. మనదే యాలస్యము. కార్యమునకు దిగవలయు.''

అనవుడు చిత్రభానుఁ డుత్సాహపూరితుఁడై ''ఏమి చేయవలయునో యిప్పుడె యానతిండు. చేసెద''నని బదులుచెప్ప రుద్రభట్టు వాని కిట్లనియె. ''నీమామగారిమంత్రియగు జయంతుని మున్ను నీతోవచ్చిన విదర్భ రాజసేనాపతి నుగ్రసేనుని విదర్భకుఁబంపి యిచ్చటి పరిస్థితులు విదర్భరాజునకు విన్నవించి గొప్పసేనం దీసికొని సాధ్యమైనంత వేగముగా రమ్మనుము. ఇక్కడ దండపాణియు వజ్రపాణియు దోడ్కొనివచ్చు సేనలకుఁ దోడుగ విదర్భసేనయుండవలయు. అదియే మనకు ముఖ్యాధారము. అది ప్రథమకర్తవ్యము. తరువాత మన కరటకుని వాక్యవాయువులు ప్రశాంతమైన సేనాసముద్రమునసంక్షోభ తరంగములను సృజియించినవి. పింగళుఁడు రాజకుటుంబము మనస్సున బెట్టిన చిచ్చు నేఁటికిని మండుచునేయుండి మంత్రులయెడ విశ్వాసమును దగ్ధముచేసియుండును. రాజ్యలక్ష్మిని సమీపించుటకు మార్గమేర్పడినది. అనవుడు చిత్రభానుఁడు 'ప్రథమమున నేమి సేయవలయునోయది యానతిండు. అట్టిపనికిఁగూడ మీరు సుముహూర్తము నిర్ణయింపుడు. అమరేంద్రునకు బృహస్పతియట్లు దానవేశ్వరునకు శుక్రుడట్లు మీరు మాకు ధర్మోపదేష్టలు. విజయము మీమాట ననుసరించి

పోవును.'' అనివినయమున మనవిచేయ రుద్రభట్టు వెండియు నిట్లనియె. "రాజా! సేనానివేశమునకుఁబోయి పాములవాఁడు నాగస్వరముతో వల్మీకములలో నిద్రించుపాములను లేవఁగొట్టి యాడించునట్లు చిత్రవిచిత్రములు మహోత్సాహభరితములునగు నీవచోగుంభనలచేత సైనికులం బ్రబోధించి పురికొల్పుము. సింధుగాంధార నాయకులదండయాత్రలు నీ వాడునాటకమున కితివృత్తములగుఁగాక! నీయన్నగారి మరణము నాందియగుఁగాక! మణివర్మప్రముఖులు ప్రతినాయకులగుదురుగాక! నీవు కథానాయకుఁడవు. రాజ్యలక్ష్మి కథానాయిక. ఈ నాటకమునకు నేనే సూత్రధారుఁడను. నీవువినిపించుకలాప మెంత రసవంతముగా నుండిన నంతత్వరలో నీకు జయము చేకూఱును. నీ మాటఁ గుంజొక్కి సైనికులు తియ్యనీటికిఁ జేప లెక్కినట్లు నిన్ననుసరింపవలెను. ప్రస్తుతము నేనువచ్చుటకు వీలులేదు. అయినను నా యాశీర్వచనమె నిన్ననుసరించి నీకు జయము నాపాదించును. రేపు రేయి మంచిముహూర్తమున్నది. మనశిష్యులు సైనికులమనస్సులు కలఁచెదరుగాక!

అనవుడు జిత్రభానుఁడు "మహాప్రసాదము స్వామీ! యట్లు చేసెద" నని వానికడ సెలవుపుచ్చుకొని యావలకుంబోయి తద్విషయప్రయత్నములనుండెను.

మఱునాఁడు తెల్లవాఱుజామున సేనానివేశమున నొక కలకలముగలిగెను. తలపై నాకుపచ్చని పెద్దపాగ నమర్చి మోఁకాళ్ళంటుచున్న ప్రాఁతనిలువుటంగి దొడిగి, మెడలోనొక గవ్వలదండవైచుకొని జనులు ధర్మార్థమిచ్చిన ప్రాతగుడ్డలు రెండుభుజములపై వైచుకొని మెడలోఁ గట్టుకొన్న కంచుగంట మాటిమాటికి కంగుకంగుమని మ్రోయ నెడమభుజమునుండి వీఁపుమీఁది కొక కట్టుకుఁ దగిలించిన సంచి వ్రేలుచుండఁ గుడిచేతిలోనున్న ఢక్కడుణడుణమువాయించుచు భయంకరముగా క్షుద్రదేవతల నాహ్వానించుచు నొక స్త్రీ

యిలఁ వాడు సైన్యనివేశమందలి వీథులలోఁ దిరుగఁ జొచ్చెను గంటమ్రోఁతయు దక్కచప్పుడును వాని పెద్దకేకలును నిద్రించుచున్న సైనికులకు వారి యాఁడువాండ్రకు మేలుకొలుపులయ్యెను. అందఱు లేచి వానిం జూచుటకు గుమ్మములలో నిలిచిరి. సాయిలవాఁ డిట్లు సంభాషించెను.

"ఆ! కాళీ! పల్కవే, భద్రకాళీ! పల్కవే, జగజ్జననీ! పల్కవే, భైరవీ పల్కవే, శాంకరీ, పల్కవే, తల్లి నిజముపల్కవే, యక్షిణీ! పల్కవే, దుర్గా! పల్కవే, చెప్పవే నిజముచెప్పవే, సాయిలరామ జోగినోట పల్కవే, సత్యముచెప్పవే, ఈదేశమునకు, గొప్పకీడు రాఁ దలఁచియున్నది. పడమటినుండి పగ రాఁదలఁచియున్నది. దక్షిణము నుండి దండు రాఁదలఁచి యున్నది, రాత్రి రెండుజాములప్పుడు నల్ల చీరకట్టుకొన్న యాఁడది మొగమున పెద్దకుంకుమబొట్టు పెట్టుకొన్న యాఁడది, కాళ్ళకు గజ్జలుకట్టుకొన్న యాఁడది, చీపురుపట్టుకొని యూడ్చుచున్నది. ఈరాజ్యములో సిరులన్నిఁటిని తానాలాగేయూడ్చెద నన్నమాట. మనుష్యుల జీవాలన్నియు నూడ్చెదనన్నమాట. తనువులుదక్కవన్నమాట. ఆతల్లి దుర్గకు నీదేశముమీఁద దయదప్పినది. ఇది పరరాజులపాలై పోనున్నది. గట్టివాఁసి బట్టుకొన్న పక్షమున రానున్నయాపద తప్పిపోవును. చిన్నవారివల్లఁగాదు. చిలుతవారివల్ల! గాదు. ఆఁడవాళ్ళవల్లఁగాదు. జాగ్రత్త జాగ్రత్త! భద్రము! భద్రము, మేలుకొనుఁడు! మేలుకొనుఁడు! మూసినకన్నులు తెఱువుఁడీ, మోస పోకుఁడి. ప్రాణాలు దక్కించుకొనండి! బాగుపడుండి."

ఆమాటలువిని మనస్సులలో భయము శంకయు నెలకొన వానిఁబిలిచి కొందఱు "ఏమియాపదవచ్చు? నీకెట్లు తెలిసినది?" యని ప్రశ్నించిరి. ఆప్రశ్నలకు వాడిట్లనియె. "ఏమియాపదని చెప్పుదును! మానములు దక్కవు. మాటలుదక్కవు. తనువులుదక్కవు. ధనములు దక్కవు. నీకెట్లు తెలిసినదని మీరడుగవద్దు. మేము భద్రకాళికి పెం

పుడు కొడుకులము. ఎఱ్ఱకూరికమ్మ మాయిలువేల్పు. శంకరునిరాణి సాయిలరామజోగిని సాకును. అతఁడు రమ్మంటే యాతల్లివచ్చును. పొమ్మంటే యాతల్లి పోవును. పలుకుమన్న పలుకును. నిలువుమన్న నిలుచును. అదుగో! ఆతల్లి. నానోట పలికించుచున్నది. ఇట్టిప్రశ్నల మీరువేసితిరా తల్లికోపించి యిప్పుడే నిప్పులవాన కురిపించును. అట్టి ప్రశ్నలడుగఁబోకుఁడు. అది మీకు మేలుగాదు. అదిమీకు మంచిగాదు. కొఱవిబెట్టి తలగోఁకికొనవద్దు."

అతనిమాటలు విన్నతోడనే యెల్లవారును భయమున గడగడ వడఁకిరి. బుద్ధిమంతులగు పెద్దవాండ్రు ప్రశ్న లడుగువారిని జీవాట్లుపెట్టి యాయుద్యమము మాన్పిరి. కొందఱు "స్వామీ! సాయిలరామజోగీ! మాతప్పు మన్నింపు" మని దండములుపెట్టిరి. కొందఱు రూకలు బియ్యము వస్త్రములు మొదలగుకానుకలు భక్తియుక్తులై యాతనికి సమర్పించిరి. కాని, యాతఁడు వానిం గైకొనక యిట్టులనియె. "మాకు బట్టలువద్దు పాతలువద్దు, బియ్యమునకు రాలేదు. బిచ్చమునకు రాలేదు. రూకలు వద్దు. కోఁకలువద్దు. మీ మీఁద దయచేత జగజ్జనని దుర్గ పంపఁగా వచ్చితిని. కీడెఱిఁగించితిని. మేలుదారి తెల్పితిని. పోవుచున్నాను. పోవుచున్నాను. జాగ్రత్త! జాగ్రత్త!" అని పలుకవలసిన పలుకులు పలికి కలిగింపఁదలఁచిన యలజడి గలిగించి వెలుఁగు రాకమునుపె తనదారింబోయెను.

అంతట సైనికులు పరిపరివిధముల నవ్విషయమై చర్చింపఁ దొడఁగిరి. "ఎవఁడో బిచ్చగాఁడు పిలువనిపేరంటముగవచ్చి వానికిఁ దోఁచిన కూఁతలుగూసి పోయినాఁ"డని కొందఱనిరి. "బిచ్చగాఁడైన పక్షమున మనముసమర్పించిన తండులములు వస్త్రములు ధనము నేల గ్రహింపకపోవు నందుచేత నతఁడు తక్కిన సాయిలవాండ్రవలె జనులనుబీడించి తిరిపమెత్తువాఁడుగాఁడు, మంత్రప్రభావమున క్షుద్రదేవ

తల వశపఱచుకొన్నవాఁడుగాని సామాన్యుఁడు గాఁ''డని కొందఱు పలికిరి. 'వట్టికూఁతలుగా వానిమాటలు త్రోసిపుచ్చరా'దని కొందఱు వచించిరి. ''నల్లచీరగట్టుకొన్న యాఁడుది చీపురుపుచ్చుకొని యూడ్చుట శ్రేయస్కరముగా''దని కొందఱు వక్కాణించిరి.

అట్లు వారు గుంపులుగుంపులుగఁ జేసిరి ప్రాతఃకాలమునఁ బలు తెఱఁగులఁ బ్రసంగించుచుండ నంతలో దండపాణి యశ్వారూఢుడై యచ్చోటికిఁ బోయెను. సైనికులు లేచి జోహారులు చేసిరి. ''అట్లు గుంపులు గుంపులుగా జేరుటకు హేతువే''మని యా సేనాపతియడుగ వారు వేకువనుజరిగిన వృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లు జెప్పిరి. అదివిని దండపాణి యచ్చెరువుపడి ''ఏమీ! నల్లచీరగట్టుకొన్న యాఁడుదియా? చీపురుపుచ్చుకొని యూడ్చుచున్నదా? చిన్నవాండ్రవల్ల గాదు. చిఱుత వాండ్రవల్ల కాదని చెప్పినాఁడా? గొప్పవారియండఁ జేరుమన్నాఁడా? జగజ్జననియైన మహాకాళి తనకీదేవరహస్యములు చెప్పినదన్నాఁడా? సరే! మనకేదో మూఁడదలఁచుకొన్నది. సాయిలవాండ్ర మాటలు కల్లలని మనము త్రోసివేయరాదు. వారికి క్షుద్రదేవతలు ప్రత్యక్షమగుచుందురు. కల్లు మాంసము మొదలగు పదార్థములు నివేదించి వారాదేవతలను వశము జేసికొందురు. అందుచే నాగతానాగతములు వారికిఁ దెలియుచుండును. నల్లచీరగట్టుకొన్న యాఁడుది మనపాలిఁటి నాశనదేవత. ఇదిచాల దుశ్శకునము. దీనికిం దగినప్రతిక్రియ మనము చేసికొనవలెను. పడమటనుండి పగవచ్చునని వాఁడు చెప్పెనుగదా! పడమటిపగ యనఁగా గాంధారదేశపు దండయాత్ర. దక్షిణమునుండి దండువచ్చుననఁగా సింధురాజు దండెత్తుట. ఇది మీరెఱుఁగరుగా బోలు! పండ్లచెట్లపై ఱాళ్ళువిసరినట్లు ఫలవంతమగు దేశమునుగొట్టి యాక్రమించుట కనేలు సిద్ధమగుదురు. మనోజ్ఞవస్తువెల్ల వారి కాసగొల్పును. అట్లే కాశ్మీరరాజ్యము రాజసింహాముల కామిషము

గానున్నది. ఆరాజులిద్దఱు వచ్చి చెఱియొకప్రక్కను ముట్టడించిరా తలు పుసందునఁబడిన వెలగకాయవలె మనము నలిగిపోదుము. కావున మనము దీనికిఁ దగినప్రతీకారము సేయవలయు'' నని వారి కుపదేశించెను. ఎట్టిప్రతిక్రియ! ఏమిప్రతిక్రియ? యని వారు తొందరతో నడిగిరి.

అడుగుటయు నతఁడు సర్వము కొంచెము తగ్గించి ''యెట్టిప్రతిక్రియ యని చెప్పుదును? దానికొక్కటే మందున్నది'' అని స్వరము హెచ్చించి ''మనరాజు బాలుఁడు. ఆలముల ముక్కలుదేఱిన మీవంటి పోటుబంట్లకు మొనగాఁడై నిలిచి మిమ్ము రణరంగములకుఁ దోడుకొనిపోయి మీమనస్సులు, నుత్సాహరసముతో నించి పురికొల్పి మీచేత సాహసక్రియలు చేయించి మనదేశమును రక్షింపఁగల మేటిశూరుఁ డొక్కఁడున్నాఁ''డని యూరకుండెను. అతఁ డెవ్వఁ డెవ్వఁడని యందఱడిగిరి. ''అతఁడా—అతఁడా—చెప్పనా! మీరు నాచెప్పినచొప్పున చేయుదురా?'' యని యతఁడు సందిగ్ధమనస్కుఁడై పల్కెను. ''మీరు చెప్పినచొప్పునఁ దప్పక చేయుదుము. తప్పక చేయుదుము'' అని వారైకకంఠ్యముగఁ బల్కిరి. ''అతఁడీరాత్రివచ్చి స్వయముగానే మీతో మాటాడును లెండి. నేనిప్పుడాయన పేరు మీతోఁ జెప్పను. భానుదర్శనమునఁ దామరలువిచ్చినట్లు వానింజూచి మీమొగములు వికసింపఁగలవు. చంద్రదర్శనమున స్రవించుచంద్రకాంతశిలలవలె మీమనస్సులు వానింజూచినంతనె యుత్సాహరసపూరితములై యుండగలవు. పేరు చెప్పుమని నన్నడుగవద్దు. నేఁటిరాత్రి జాముయినతరువాత మీకడ కాయనవచ్చును. మీరు భోజనములుచేసి సిద్ధముగనుండుఁడు'' అని దండపాణి వారికినచ్చఁ జెప్పి యథేచ్ఛంబోయెను. ఆవచ్చునట్టి మహావీరుఁ డెవఁడై యుండునా యని సైనికు లూహించుచు వారిరాక నిరీక్షించుచుండిరి.

పదియైదవ ప్రకరణము

క్రమక్రమముగ సాయంకాలమయ్యెను. దీర్ఘప్రయాణముచేసిన తెలువరి గమ్యస్థానముఁజేరి విశ్రమించుతలఁగున భానుఁడు పశ్చిమాచలశృంగము నలంకరించెను. చరమగిరిమీఁద ప్రేలాడుజపాకుసుమగుచ్ఛమువలె నావృద్ధభానుని బింబము కట్టెదురనె చూపఱకనులకు విందుసేయుచుండెను. చిన్ననాఁటిగుణములు చరమకాలమునను విడువవనుటకు దృష్టాంతరముగ నుదయవేళనున్న యారుణ్యమే ప్రభాకరునియందు సాయంకాలమునఁగూడ గనఁబడెను. ఆశ్రమచతుష్టయములలోఁ గట్టకడపటిదగు సన్న్యాసమును గర్మసాక్షియయిన ప్రభాకరుఁడు స్వీకరించి ధరియించిన కాషాయాంబరమో యనునట్లు సంధ్యారాగము నభోమండలమున వ్యాపించి దర్శనీయమయ్యెను. మహాసౌధముమీఁదనుండి క్రమక్రమముగాఁ గ్రిందికిదిగునట్టిపురుషునట్లు క్రమక్రమంబుగా దివాకరుఁడు క్రిందికిదిగిదిగి యస్తమించి యగోచరుఁడయ్యెను. చంద్రశాసనుఁడగుపరమేశ్వరుని నియమప్రకారమెవ్వరి ధర్మము వారు నిర్వర్తింతురని తెలియఁజేయుటకో యన సూర్యాస్తమయానంతరమునకలనరమునఁ జంద్రోదయమయ్యెను. జనులకానందోదయమయ్యెను. కాలపురుషుండు గప్పుకొన్న తెల్లపట్టుపుట్టంబువలె విశ్వమంతట వెన్నెలవ్యాపించెను. మహాపురుషుని తేజముముందఱ నెందుకుం బనికిరాని యల్పపురుషుల ప్రభావముంబలె లెక్కకుమిక్కిలియగుచుక్కలవెలుంగు శీతమయూఖుని తేటవెన్నెలలముందఱ, వెలవెల బోయెను. చల్లదనములకు సీమయైన చందమామను జూచినతోడనే యెల్లజీవుల కనులు చల్లఁబడెను. ఉల్లములుచల్లఁబడెను. సేనానివేశములో సైనికులందఱుఁ దమకొఱకై రాదలఁచిన యాపద్బాంధవునిఁజూడ నుబలాటపడుచుఁ బెందలకడభోజనములుచేసి తెల్లబట్టపర

చినట్లు చంద్రికాపసరణముచేత వెలయుచున్న బయలునేల కరిగి గుంపులుగూడి తద్విషయికములైన ప్రసంగములు జేయుచుండిరి. ఎవరువచ్చినను నాతఁడేమోయని యష్టులెత్తి చూచుచుండిరి.

అంతలో దండపాణి యొకపురుషుని వెంటఁబెట్టుకొని యచ్చోటికివచ్చెను. అప్పురుషుఁడు కనఁబడినతోడనే "చిత్రభానుఁడు చిత్రభానుఁ"డని సైనికులు మెల్లమెల్లఁగా ననఁజొచ్చిరి. అందఱినోటఁ చిత్రభానుని పేరేయుండెను. అందఱికన్నులకు జిత్రభానుఁడే కనఁబడెను. చంద్రప్రభయు భానుప్రభయు నేకకాలమున సంభవించిన పక్షమున నెట్టి యాశ్చర్యము జనించునో నాఁటిరేయి జనులకట్టి యాశ్చర్యము జనించెను. 'ఇతఁడు హరిద్వారమునఁ జచ్చినాఁడని వింటిమిగాదా'యని యొకరు "కాదు కాదీనడుమ నిక్కడనే యున్నాఁ"డని యొకరు 'భ్రాతృమరణహేతు వితఁడే గాదా'యని యొకఁడు నది నట్టిమాటయని యొకఁడు పురమునుండి వీనిని వెడల నడువ మణివర్మ సమకట్టెఁ గాదాయని యొకరు దేవిగా రుండుమని న్నారని యొకరు సైనికులు తమలోఁ దాము నానావిధముల భాషింపఁ జొచ్చిరి. అప్పుడు దండపాణి యచ్చటఁ జేరిన జనులనుగూర్చుండఁ బనిచి యుపోద్ఘాతముగా నిట్లు చెప్పెను.

"వీరులారా! అనేకయుద్ధములఁ బేరుగాంచిన శూరులారా! మీకు మొనగాఁడై మీదేశము పరాక్రాంతము గాకుండఁ జేయఁగల మహావీరుఁడు మీయెట్టయెదుటకు వచ్చియున్నాఁడు. మీకీయన చిరపరిచితుఁడుగాని క్రొత్తవాఁడుగాఁడు. ఈ మహాశూరుని ప్రజ్ఞా విశేషములు మీరు నావంటివానివలన వినఁగోరుట చిన్నదివ్వెసాయమున సూర్యబింబమును జూడగోరుటవంటిదని తలంచి యీ మహాభాగుని విక్రమవిహారములు వర్ణింప నిశ్చగింపను. కుమారస్వామి దేవతలకు దళవాయియై మొక్కలు లగు రక్కసుల నుక్కడంచి

దేవలోకము నుద్ధరించిన తెఱంగున నీరాజకుమారుఁడు శత్రుసైన్యముల నఱుమాడి మీదేశమునకు సౌఖ్య మాపాదింపఁగలఁడు. ఈయన హేమచంద్రమహారాజు తమ్ముఁడు, చిత్రభానుఁడు. అన్నగారి కుటుంబమును బరామర్శ చేయుటకును దనకు శక్యమైన సాయము చేయుటకును వచ్చియున్నవాఁడు. విల్లుపట్టి నా రఘురాముని భృగురాముని దలపించును. ఇతఁడు బాణంబువిడిచినా శత్రువుఁడు ప్రాణంబు విడుచును. ఇతఁడు కలియుగార్జునుఁడు. మనల నాపత్సముద్రమునుండి యుద్ధరింపఁ గల యోధయిదే. మన విచారాంధకారమును మాపఁగల భానుమండలమిదే! మన సంతాపమడఁచి చల్లని నీడనిచ్చు వృక్షమిదే. కావున వీని నాశ్రయింపుఁడు. ఆయన చెప్పెడు మాటల సావధానులై యాకర్ణింపుఁడు''అని యతఁడు విరమించెను.

''జయము! చిత్రభానుఁడా జయము!''అని సభాసదులలో ననేకులరచిరి. ''స్వాగతము! మీకు స్వాగతము!''అని కొందఱు కేకలువైచిరి. ''మీవచనామృతమును వర్షించి మాసంతాపముఁ దీర్పుఁ''డని కొందఱు బిగ్గఱఁ జెప్పిరి. అదివిని సభాస్థారులలోఁ దన కనుకూలమైన భావము పొడమినదని తెలిసికొని ధైర్యము దెచ్చికొని చిత్రభానుఁడు ముందరకువచ్చి సభాసదులముందఱ నిలిచి యీవిధముగాఁ బ్రసంగించెను.

మహాయోధులారా! దండపాణి చెప్పినట్లు మీకు నేను క్రొత్తవాఁడనుగాను. పూర్వపరిచితుఁడను. హేమచంద్రమహారాజు తమ్ముఁడనని విక్రమసేనునిఁ రెండవ కొడుకునని నా పేరు చిత్రభానుఁ డని మీరందఱు తెఱుఁగుదురు. మీలో ననేకుల నేను మున్ను మాయన్నగారియనుగ్రహమునకు బాత్రమైనకాలమునఁ జూచియుంటిని. కొన్ని యుద్ధముల మిమ్ముఁగొనిపోయి గెల్చియుంటిని. మీవలన నేను పేరు గాంచియుంటిని. నావలనమీరు కీర్తిగాంచియుండిరి. కాలవశమున

మంత్రులమాయలచేత నాకును మాయన్నకును మనంబుల స్పర్థలు జనించినవి. చాటుననుండి సమిధలునైచి సచివులు వైరాగ్నిని బ్రజ్వలింపఁజేసిరి. ఆయగ్ని మాసోదరుల సహజమైత్రిని దగ్ధముచేసినది, ప్రేమను భస్మపటలము గావించినది. అప్పుడు మాయన్న మంత్రుల మాటలు విని నిరపరాధిని-నిష్కపటిని-నిర్మలచిత్తుని-నిజసోదరుని నిరాధారునిఁజేసి స్వదేశమునుండి వెడలనడఁచెను. అపుడు నేను సపుత్రముగా సకళత్రముగా నూరువిడిచి-దేశమువిడిచి-బంధుమిత్రులవిడిచి పోయి దారపుత్రుల విదర్భలోనిలిపి యత్తవారింట నుండుటయనుచితమని భావించి రాచబిడ్డనగుటచే నాత్మగౌరవమును పాటించి దేశములపాలై తిరిగితిని. నాపడినకష్టములన్నియు వరుసగా మీకుఁజెప్పఁబూనితినేని మీమనస్సులు విచారసముద్రమున మునుంగును కన్నీరు వరదలై పాఱును ఒక్కొక్కసారి యాత్మహత్య చేసికొనుట యుక్తమని ప్రయత్నించితిని. అది నామిత్రులు వారించిరి పక్షులకైన గూడులుండును. పులులకైన దలఁదాచుకొనుటకు పొదలుండును. సింగములకైన గుహలుండును. నాకెంతమాత్రమైన నెలవులేకపోయినది. రాచవాఁడనగుటచే నౌకరినడుగఁజాల ఆగర్భసుకుమారుఁడనగుటచే మేను వంచి పనిచేయఁజాల. అభిమానధనుఁడ నగుటచే నీచవృత్తులం దిగఁజాల. అన్నములేక-బట్టలులేక-నిలువనీడలేక-చుట్టములులేక-పక్కములులేక యేకాకినై చిరకాలము తిరిగితిరిగి యీశ్వరానుగ్రహమున నెట్టటో బ్రతికి యుంటిని. దైవమునే నమ్మియుంటిని. శివుని నమ్మిన వాఁడు చెడిపోవఁడని నానమ్మిక. ఎందుకు బ్రతికించెనో దైవమునన్ను బ్రతికించెను. స్వప్నావస్థయందైన నేను మాయన్నగారిని దూషింపలేదు. నా దురదృష్టమును నిందించుకొంటిని గాని మాసోదరుని నిందింపలేదు. ఆయన నిష్కళంక చరిత్రుఁడు. నిరుపమానత్యాగశీలి, లోకోత్తరచరిత్రుఁడు. అగ్నికి ధూమము పేరిట మాలిన్యముగలదు.

చంద్రునకు మచ్చగలదు. కాని యమ్మహాత్ముని చరిత్రమునకు మచ్చ లేదు. ఆతఁడు నేలపై నవతరించిన నారాయణుఁడే. అట్టివాని నీచల్లని సమయమున జ్ఞప్తికిఁ దెచ్చుకొని మనమందఱము ధన్యుల మగుదము గాక! అట్టి మహారాజును-అట్టి దయాశాలిని-అట్టి శాంతశీలుని-అట్టి పరమపవిత్రుని నట్టి లోకమిత్రుని నట్టి సుగుణరత్నాకరుని- హా! దురాత్ములెవ్వరో దారుణవధముపాలు చేసిరిగదా! హా! హేమచంద్రా!! హా! భ్రాతృవత్సలా'' అని కన్నులనీరు జొటజొటఁగార మాటాడలేక దుఃఖపరవశుడై నిలువబడలేక నేలపైఁ జదికిలంబడెను. అతని దుఃఖముఁ జూడఁగానే సభాసదులకుఁగూడ మిక్కిలి విషాదము జనించెను. వారును బాష్పధారలచేతఁ దమ దుఃఖము బ్రకటించిరి. అనంతరమునఁ జిత్రభానుఁడు వెండియు నిట్లు ప్రసంగించెను.

"ఆమహాత్ముని జంపించినవారెవ్వరో నే నెఱుఁగుదును. కానివారి పేర్లిప్పుడిక్కడఁ జెప్పను. పాప మెన్నటికైన బయలు పడకమానదు. మగనిజంపి మొగసాలలో మొత్తుకొనెనది యను సామెత నిజముగా నాపైఁ దోడును జంపించిన దురాత్ములే. తమమీఁద నెవ్వరికనుమానము లేకుండఁ జేసికొనుటకై నేనే యాఘాతకృత్యముఁ జేసితినని లోకమునం బ్రవాదము బుట్టించిరి. ఎక్కడో నరులు చేరని నట్టడవులలోఁ గాకులైనలేని కాఱడవులలో మృగములయట్ల నేనును నాకు లలములు దిని పొట్టబోసుకొని గాలక్షేపముచేయుచుండ దుస్సహమయిన యపవాదము వారు నాపై బడవైచిరి. మహేశ్వరపూజా నిరతములైన యీహస్తములాయిట్టిఘాతుకకృత్యము జేయుట? మహనీయులగుముని జనులకు నమస్కరించునట్టి యీచేతులా- యన్న నెత్తురుతోటి యపవిత్రములగుట? ఛీ! అట్టిపని నేనా చేయుట? విక్రమసేనుని కొడుకా యీనింద్యకర్మకుఁ బాల్పడుట? ఈయపవాదము వచ్చిననాఁటంగోలె నాహృదయము విషాదాగ్నిచే మండిపోవుచున్నది. ఈ సంతాపము

చేతనే నేను చిక్కుపడగ మైతిని. నాహృదయ మెవ్వరయినఁ బరీక్షించి చూతురేని యది సంతాపమను యగ్నిలోఁ బడి కాలిపోవుచున్నట్లు దెలియును. నరుఁ డేదైన మోయఁగలఁడు గాని నిందాభారము మాత్రము మోయఁజాలఁడు. నింద పడుటకంటె చచ్చుట మేలు. నాపైనున్న యపవాదము బాపుకొనుటకే నిటు వచ్చితిని. నిర్హేతుకముగ నిందపైబడినను సజ్జనుఁడు దానిం బాపుకొనుట కర్తవ్యము. కర్తవ్యమగుటచేతనే గదా సాక్షాన్నారాయణావతారుఁడైన భగవానుఁడు శ్రీకృష్ణుఁడు శమంతకమణిశ్యాపహరణ ప్రవాదముఁ తనపైఁబడినపుడు తానా దోసమెఱుంగకపోయినను లోకాపవాదముఁ బాపుకొనుటకై దేశదేశములు తిరిగి జాంబవంతుఁ డమ్మణిని గ్రహించినాఁడని తెలిసికొని యాభల్లూక ప్రభువుతోఁ బోరాడి మణిం గ్రహించి సత్రాజిత్తునకిచ్చి నిందాభారమును దించి హృదయమును జల్లనజేసికొనెను. కర్తవ్యమగుటచేతనే కదా యిక్ష్వాకు కులప్రదీపకుఁడైన రాముఁడు నిర్మలచారిత్రయైన జనకరాజకన్యకను నిందుచూలాలనియైన శంకింపక గహనాంతరములకుఁ బంపెను. మానవంతునకుఁ బ్రాణముకన్న సత్కీర్తి ప్రియము. అతఁ డసువులనైన విడుచునుగాని సద్గుణము విడువఁడు. అందుచే నేనట్టి మహాపాతకముఁ జేసినవాఁడను గానని మీరెల్లరు నమ్మి మున్ను మీమనంబుల దురాత్ములచే నాటఁబడిన యనుమాన బీజంబులఁ బెల్లగింపవలయునని చేతులుజోడించి వేడుచున్నాను. ఏమి మీయనుమానములు తీరినవా లేదా? ఇంకను శంకాశల్యములు మీమనంబులఁబీడించుచున్నవా?" అనిబిగ్గఱగాఁ నడుగ వారిలోననేకులు "లే దనుమానములేదు. శంకలుతీరినవి" యని కేకలువైచిరి. వైచుటయుఁ జిత్రభానుఁడు "మంచిది ఇప్పుడు నేను ధన్యుఁడనైతిని. ఇప్పుడు నేను మనుష్యుడనని తలంచుచున్నాను. ఇప్పుడు నేను రాచబిడ్డనని గర్వించుచున్నాను. ఈమహాజనాభిప్రాయమేమో నాకు

ధైర్యము గలిగించుచున్నది. ఇంక నే ప్రస్తుతాంశములను గూర్చి కొన్ని మాటలు చెప్పి విరమించెద" నని యుత్తేజంగున బలికెను.

"యోధులారా! పరమసాధులారా! మన దేశము కల్పవృక్షములులేని స్వర్గఖండము. ఈ నేలయంతయు రత్నగర్భ సింధునది తన బాహువులతోఁ గాశ్మీర దేశలక్ష్మిని గాఢాలింగనము చేసికొన్నదో యన్నట్లు లుపనదుల నెల్లనెల్లయెడల వ్యాపింపఁజేసి దేశమును సారవంతము జేయుచున్నది. ఎక్కడఁజూచిన తీయని నీరు. ఎక్కడఁజూచిన ఫలవృక్షములు ఎక్కడఁజూచిన బచ్చనిపంటలు, ఎక్కడఁ తృణకాష్ఠజలసమృద్ధి, ఎక్కడఁజూచిన గామధేనువువంటి పాడిమొదవులు ఎక్కడఁజూచిన ధనధాన్యసమృద్ధి. ఇక్కడిపడఁతులు చక్కదనమున వేల్పుటువిదల వెక్కిరింపగలరు. ఈపర్వతములు-ఈసెలయేళ్లు-నీపూఁదోటలు - నీవనలక్ష్ములు - మధురగానములు సేయు నీవిహంగములు-నీనానాధజాతు సంతతులు జూచిన నెవనికన్నుసట్టదు! ఎవని నోరూరదు? ఎవని కాస పుట్టదు? ఎవనిచిత్తము భ్రమింపదు? నవలావణ్యవిరాజమానయగు సుందరిని గన్నప్పుడు పరమయోగియైన వికలచిత్తుఁడగునట్లు వనంబులనియెడు శిరోజములు సరస్సులనియెడు నేత్రములు నదులనియెడు ముత్యాలహారములు వసుంధరయనియెడు మేనుగల దేశాంగనఁజూచి చుట్టుప్రక్కలనున్న రాజులు మంచివారైనను నాసపడుట సహజము. అందు ముఖ్యముగా నేలిక బాలకుఁడైనప్పుడు వెఱ్ఱివానియిల్లాలు వాడకెల్ల వదినెయైనట్లు దేశమెల్లరాజులకు లోకువయై యాసలకు గుఱియై యుండును. ఇప్పుడు గాంధారరాజు మన దేశముపై దాడువెడలఁ బోవుచున్నాఁడు. ఈవార్త మీరు వినియే యుందురు. విశేషించి సింధురాజుకూడ దీనిపైఁ గన్నువైచినాఁడు. చిఱ్ఱ్యపట్టినమేకను జూచిన బెబ్బులుల నోరూరదా! పడమటినుండి గాంధారులు దక్షిణమునుండి సింధురాజు మనపై దాడివెడలిన ముక్క-

పచ్చలారని ముద్దు బాలుఁడు దేశమును రక్షింపఁగలఁడా! తన్నుఁ గాఁచు కొనఁగలఁడా? సైన్యము నడుపఁగలఁడా? సన్నాహము సేయఁగలఁడా? చేయఁగలఁడనుకొనుము. మంత్రులతనికిఁ గాళ్ళసంకెలలు. వారు హారముల కాసపడియు నగ్రహారముల కాసపడియు, ధనములఁ గోరియు సౌఖ్యసాధనములఁ గోరియు పగఱతోఁ జేరి దేశమును వారి కప్పగింపఁ దలఁచుచున్నారు. ఇంతకన్న రాజద్రోహముగలదా? ఇంతకన్న దేశద్రోహముగలదా? ఇంతకన్నఁ బాపముగలదా? ఇట్టి యమాత్యుల- స్వామిద్రోహుల - లంచగొండుల - దేశవిక్రయులఁ- బయోముఖవిషకుంభముల గోముఖవ్యాఘ్రములఁ గొరతవేసిన పాప మున్నదా? మేనిచర్మమొలిపించిన దోషమున్నదా? బ్రతికియుండఁగఁ నిప్పులందారలించినఁ దప్పున్నదా! పాపము లేదు. లేదు దోషము లేదు. కాని రాజు బాలుఁడు సాధుశీలుఁడు తల్లియాఁడుది. అసూర్యం పశ్య పరపురుషవిముఖ. మంత్రులె యామె చెవులు. మంత్రులె యామె కన్నులు. మంత్రులె యామె చేతులు. ఇట్టిస్థితిలో నామె యేమిచేయఁగలదు! బాలుఁడేమి చేయఁగలఁడు! కావున మీ దేశ సంరక్షణము యోధులయిన మీరు మహాయుధపాణులయిన మీరు శూరాగ్రేసరులయిన మీరు దేశాభిమానులైన మీరు-రాజభక్తులైన మీరు నేఁడు చేసికొనవలయు. దానంజేసి దేశసంరక్షణమేగాక మీ యాత్మసంరక్షణము రాజకుటుంబ రక్షణము మొదలగు నన్నియు జరుగును. మిమ్మునడుపుటకుఁ దగిన దళవాయి నేర్పరచుకొని నగ రము చక్కఁజేసికొని దురాచారుల మేరమీఱకుండ బంధించి వలయు సాధనసామగ్రుల సమకూర్చుకొనిపిమ్మట బగఱపైఁ నడువవలయు. యోగ్యులైన నను ముందుగా నంతఃపురశత్రువుల గెలుతురుగదా! తగిన మొనగాఁడుండిన గాంధారరాజుగర్వ మొక్క క్షణములో నణఁపవచ్చును. సింధురాజుసేన త్రుటిలో నణఁపవచ్చును. మీ కందర కిష్టమైన

మొదల దండపాణి వజ్రపాణి ప్రముఖుల సాయముగొని నేనే గాంధారుల నెదిర్చి జయము చేకూర్చెద. కాశ్మీర రాజ్యము సురక్షితమైయుండుటే నా యభిప్రాయముగాని నా ప్రజ్ఞజూపుట నా యిష్టముగాదు. జనవాక్యంతు కర్తవ్య మ్మను లోకోక్తినిబట్టి మీ కందఱ కేదియిష్టమో యదియే చేయుట నాయిష్టము. మీయభిమత మెఱిగింపుడు" అని యుపన్యాసము విరమించెను. వెంటనే పెక్కండ్రు లేచి "అయ్యా! మీరే మమ్ము నడుపుడు. రాజ్యమును గాపాడుడు. దురాత్ములైన యామంత్రుల బంధింపుడు. స్వామిద్రోహుల సంహరింపుడు." అని బిగ్గరగా నఱచిరి. తొందరపడుట కర్తవ్యము గాదని కొందఱు లోలోపల ననుకొనిరి. కొందఱట్లు కాదని మూలగిరి. కొందఱు స్పష్టముగాఁ దెలియకుండ గొణుగుకొనిరి.

మొత్తముమీఁద సైనికులలోఁ బెక్కండ్రు చిత్రభానుని గంభీర వచఃప్రభావమువలన సమ్మోహితులైరి. జనసామాన్యమునకు నేదేనొకవిషయము మనస్సుల నాటునట్లు చెప్పుట గడ్డిమేటికి నిప్పుపెట్టుట. అది చరచర యంటుకొని మహాజ్వాలగా మండునట్లు జనసామాన్యముగూడ నట్టిసంభాషణ విన్నపిదప నొడలుదెలియక వర్తించును. 'కలౌ సంఘేశక్తిః' యను నార్యోక్తి నిజము. సంఘశక్తికి మించిన శక్తిలేదు. అందుచేత సంఘము నెదుట సాహసోక్తులుబల్కు పురికొల్పుట యేనుగునకు సిడులుచూపుటయని భావింపవలెను. మదించిన యెద్దున కెఱ్ఱగుడ్డచూపుటయని తలంపవలెను. వేఁటకుక్క నుసికొల్పుట యని యెంచవలెను. జనసామాన్య స్వభావ మిట్టిదని యెఱిగినవాఁడగుటవలననే చిత్రభానుఁడు వారి చెవులలో నయ్యుపన్యాసవిషము బోసెను. అది వారి తలకెక్కెను. "రండు! లెండు! చిత్రభానుని సేవింపుడు. దేశము గాపాడుడు. ద్రోహులఁ దుదముట్టింపుడు" అను కేకలు వినంబడెను.

అప్పుడు చిత్రభానుఁడు "యోధులారా! మీరందఱు శాంతిం పుఁడు. సాహసించి యెట్టిపని చేయఁగూడదు. నిదానించి కార్యములు చేయవలెను. అవిచారత సకలాపకలకు హేతువు. మీరు స్థిరబుద్ధితో నుండుఁడు. మఱి యెవ్వ రేమాటలు చెప్పినను వినకుఁడు. స్వకార్య పరతంత్రు లగు మంత్రులు తంత్రములుపన్ని మిమ్ముం బేలుపుచ్చఁ బ్రయత్నింతురు. వారిమాయలలోఁ బడవద్దు. ఎల్లియో తేపో నేను వచ్చి మిమ్ముం దోడ్కొనిపోయి కర్తవ్యముఁ గావించెద. ఇప్పటికి నాకు సెలవొసంగుడు." అని చెప్పి దండపాణిసహితుఁడై తన నిల యంబునకుం బోయెను. అతఁడు వెళ్ళినపిదప సైనికులు మరల గుంపులుగుంపులుగాఁ గూడి నోటికివచ్చినట్లు జెప్పుకొనఁజొచ్చిరి. "అతఁడే తమ్ము నడుపఁదగిన మొనగాఁ"డని కొందఱు పలికిరి. ఆహాహా! వాని భ్రాతృప్రేమ కనుఁగొంటిరా! అతని పేర[illegible]న యెంత దుఃఖపడెనో యని కొందఱు, వానిపలుకు లన్నియు సత్యములే యం దొక్కటి పొరపాటు లేదని కొందఱు, వానికన్న మనకు గత్యంతరము లేదని కొందఱుఁ బలికిరి.

"ఈ వెంగలిమూఁకను కల్లబొల్లిమాటలతో బేలుపుచ్చి యతఁడు స్వకార్యసాధనము చేసికొనుచున్నాఁ"డని కొంద ఱనిరి. కాని యిట్టివా రల్పసంఖ్యాకులై యుండిరి. అధికసంఖ్యాకులు చిత్ర భానుని వలలోని చేఁపలయిరి. వానిచేతి కీలుబొమ్మల ట్లాడఁదలఁచిరి. రెండుజాముల రాత్రియైనపిదప నెల్లవారు స్వగృహంబులకుం బోయి నిద్రించిరి.

విక్రమసేనునిమీఁదఁ బక్షపాతమును మణివర్మమీఁద నభి మానమును సంపూర్ణవిశ్వాసమును గల సైనికులు కొందఱు తెల్ల వాఱుజామున లేచి గదాధరుని శూలపాణినిం గలిసికొని కడచిన రేయి చిత్రభానుఁడు నెఱపిన చిత్రవృత్తాంతమును దెలిపిరి. వారును

కలఁతజెందిన మనంబులతో మణివర్మ నిలయమున కరిగి చిత్రభానుని సాహసమును, దండపాణి ద్రోహమును, సైనికుల మహోత్సాహమును దెలిపిరి. వారి పలుకులువిని యా వృద్ధసచివుఁడు వారితో నిట్లనియె.

"మిత్రులారా! ఇంతవఱకు వచ్చునని నేను మున్నే కనిపెట్టితిని. దేవి నామాటలు పాటి చేసినదికాదు. విశేషించి చిత్రభానుని మాయలవలన దేవి మనలనందఱ రాజద్రోహులుగాఁ బరిగణించినది. చేప యెఱ మ్రింగి చెడును. పక్షులు దమములచేత భంగపడును. మానవులు మాయలమారులవలన నష్టపోవుదురు. దేవి కెవ్వరో మన మీఁదఁ బలుకొండెములుజెప్పి మనపై ద్వేషముగలిగించిరి. ఇప్పుడు మన మేమిచెప్పిన నామెకు రుచింపదు. పైత్యరోగమున రుచిచెడిన [illegible]క్కరయుఁ జేఁదగును. అట్లే యాఁగాముల విచారింపక సేవకుల పూర్వచారిత్రములఁ దలంపక వంచకులమాయలం బడినవా రెండమావులు నీళ్ళనినమ్మి నశియింతురు. ఇప్పు డొకపని చేయుట కర్తవ్యము. మీరుపోయి మీపక్షమునను్న సైనికుల నందఱ వారితోఁ జేరకుండఁ జేయుఁడు. రాణికి మాధవసేనుని ముఖమున నీవృత్తాంత మెఱిఁగించెద. మీఁద నామెయిష్టము. ఇంతకు విక్రమసేనునకు రాజకుటుంబమునకు దుర్దినములు వచ్చినవి. మనకు దుర్దినములు వచ్చినవి. చిత్రభానుని యదృష్టము పండినట్లు గనఁబడుచున్నది. అఘటనఘటనా సమర్థుఁడైన పరమేశ్వరుని లీలల నధమాధములైన మనమెట్లు తెలిసికొనఁగలము? వేగమెపోయి మీరు పనిచేయుఁడు. నేనును మాధవసేనుని బిలిపించి కర్తవ్యముచేసెదను."

గదాధరాదులు తద్వచనము లాకర్ణించి వానిపనిచిన తెఱఁగునఁ జేయఁజనిరి. మణివర్మ మాధవసేనుని బిలువనంపి దేవికా వృత్తాంతము దెలియఁబంచెను.

పదియాఱవ ప్రకరణము

రాజ్యవ్యాపారము లీతెఱంగున నుండ వజ్రపాణి గృహవ్యాపార మెట్లుండవలెనో యట్లుండెను. ప్రధాననాఁటంగోలె నతఁడు ధర్మపత్నియైన సునందను మున్ను గారవించినట్లు గారవించుట మానెను. వెనుకటియట్లు దంపతు లిష్టాగోష్ఠి చెప్పుకొనుట కవకాశము లేకపోయెను. విరసోక్తులేగాని యాతనినోట సరసోక్తులు రాకపోయెను. అంతఃపురమున క్షణకాలమైన నతఁడు నిలువకపోయెను. ఏదో కారణము గల్పించుకొని యామె యతనితోఁ బలుకఁబోవ నతఁడు తగిన యుత్తరము జెప్పక విసుగుజెందుచుండెను. ఆమె సమావేశమే వానికిఁ గిట్టకపోయెను. దానికిం గారణమేమని యామె బహువిధంబుల నరసెనుగాని కారణ మామెకుం బొడగట్టలేదు. కారణ మరయుమని పలుమాఱు పరిచారికలకుం జెప్పెనుగాని వారు నందుఁ గృతకృత్యలు కాలేకపోయిరి. కర్పూరమంజరీవిరహమున నతఁడు మఱుఁగుచుండ భర్తచేసెడి ననాదరణంబున నామె తపరుచుండెను. అట్లు దంపతు లిద్దఱు వేర్వేఱు కారణంబుల మనస్తాపము నొందుచుండుటచే గృహము శోభాహీనమై యుండెను.

ఒకనాఁడు వజ్రపాణి గాఢనిద్రపోవుచుండెను. సునంద మందమతియై తన పానుపుమీఁదఁ బండుకొని నిద్దురరామి దనయవస్థంగూర్చి యిట్లు తలపోసెను. "మిక్కిలి మక్కువగల హృదయేశ్వరుఁ డాకస్మికముగ నూతనపురుషుఁడట్లు మాఱిపోవుటకుఁ గారణమేమి! నే నెఱిఁగినంతవఱకు నాచేసిన యపచార మేమియులేదు. ఎప్పటియట్ల వినయవృత్తిగలిగియుంటి. మునుపటియట్ల యాయన మనస్సు రంజించుటకై యత్నించుచుంటి. ఆయన కనుసన్నల మెలఁగుచుంటి. నాపాలిదైవమని నమ్ముకొంటి. ఆయన యడుగులు కన్నుల నద్దుకొను

చుంటి. ఇఱుప్రొద్దులు రుచ్యంబులగు భక్ష్యంబులు సేవకులచేతఁ జేయించి సమర్పించుచుంటి. గీచినగీటు దాఁటకుంటి. అనృతము చెప్పితినా? అప్రియము పలికితినా? పరపురుషులతో సంభాషించితినా? ఎన్నఁడేని దలవాఁకిటనైన నిలిచితినా? ధనవ్యయము చేసితినా? అత్తలయెడ నాఁడుబిడ్డలయెడ దుర్వినయంబు సల్పితినా? ఆయన చుట్టముల జుల్కన జేసితినా? ఏమి నావల్లలోపము? ఏరితప్పు వారికిఁ దెలియదుగదా? అడుగులొత్తుదమన్న స్పృశింపనీయరు. ఊడిగములు చేయుదమన్న నొల్లరు. మాటలాడింతమన్న పలుకరు. కేదారరాగమన్న నీయనకెంతో యిష్టము. తెలుఁగా వీణియమీఁద నది వాయింపుమని నన్ను గోరుచుండెడివారు కొంతకాలమునుండి యా మాటయే లేదు. పాడుదునాయని యడిగిన వలదని తలయూఁచు టయేగాని మాటమైనం జెప్పరు. నామీఁదిరాగ మీదారినున్నప్పుడు కేదారరాగ మెందుకు? ప్రాణేశ్వరుని మనస్సున కెక్కని పడఁతి జీవిత మేల? ఆయన చిత్తరంజనము సేయని చెలువ మేల? ఆయన కానందము గలిగింపని యలరుఁబోఁడి బ్రదుకేల? నావలనఁగల తప్పేమో చెప్పక యొప్పరికించి నప్పుడు నేనేమిసేయనగలను? నాతప్పు నాకుఁజూపిన దిద్దుకొని తగిన తెఱంగున మెలంగుదునుగదా!" యని చింతించుచు రెండు కనుగొలఁకులనుండి వేఁడినీరు పానుపుపైఁబడ సునంద వెచ్చని యూర్పులు విడుచుచు నిద్రించుచున్న భర్తపై చూడ్కులు నిగిడించెను. ఆతఁడు గాఢనిద్రలో "కర్పూరమంజరీ! కర్పూరమంజరీ! ఏల సిగ్గుపడియెదవు" అని పలవరించెను.

అప్పలుకులు చెవినిబడినతోడనే యప్పొలఁతి మిన్నకు మగని మనసుం దెలిసికొనుటకు సరియైన తాళము చెవి దొరకినట్లయ్యెను. కర్పూరమంజరి యెవ్వతెయో యామె యెఱుఁగును. ఆమెకు వివాహము కాలేదని యెఱుఁగును. ఆమె యసాధారణ లావణ్యవతియని

యెఱుఁగును. ఆమె చూపుతూపు లెవ్వరిపైఁబడునో వారి హృదయ ములు గాయములు పడునని యామె యెఱుఁగును. అప్పుడామె వెండియు నిట్లు తలపోసెను. "చిత్రభాను పుత్రికయైన కర్పూర మంజరిపై నీయనకు వలపునిలిచినదని నిద్రావశమున నప్రయత్న ముగ నీయననోట వెడలిన మాటలవలనఁ దెలిసినది. ఈయనం గూర్చి యామెయే మేలుపడెనా లేక యా లోకైకసుందరి నిమిత్త మీాయనే పరితపించుచుండెనా? ఎట్లయిననేమి? బంగారమువంటి నా కాఁపురము చెడిపోయినది. నిక్షేపమువంటి నా సంసారము నిస్సారమగుచున్నది. ఒక రొలలో రెండుకత్తు లిముడునా? ఒక యర్ధశరీరములో నిరువురు పడఁతులు నిలుచుట కవకాశమున్నదా? ఒకతెను ద్రోసిరా జనవలె, రెండవదాని నచ్చోట నెలకొల్పవలె. ఇంతకన్న గత్యంతర మేమున్నది? పెద్దదానను. జవ్వనము కొంత వఱకుఁ జెల్లిపోయినదానను. మగని మనసు రంజింపఁజాలనిదానను. నేనే మొత్తిగిలవలయుఁగాని నిండుజవ్వనంబును నెఱజాణతనంబును జక్కదనంబును సౌకుమార్యంబును గల లేమ తొలఁగిపోవునా? అట్టి వదియనయోఁట యగ్నిగుండ మన్నట్లు పదునైదేండ్లు కాపురముజేసి సంతానవతినైన నాకు నీనాఁటికి సవతిపోరా? నేను వయసు మరలిన దాన నగుటచే మిసమిసలాడు లేజవ్వనంబుగల క్రొత్తపెండ్లికూఁతురు మీాఁదనే యీాయనకు గౌరవముండును గాని నామీాఁద లేశమైన నుండదు. ఆమె యడుగులకు మడుగులొగ్గుచు నామె చేఁతనవ్వుల కలరుచు, నామె బొమముడుల కడలుచుఁ బ్రొద్దులు పుచ్చవలయుఁ గాఁబోలు! హా! పరమేశ్వరా!" యని విచారించుచు నొకమాఱు పాన్పుమీాఁదినుండి లేచి యిట్టటు దిరుగుచు నొకమాఱు పండుకొనుచు నొకమాఱు భర్తను లేపఁదలచి నిద్రాభంగము సేయఁగూడదని మరల వెనుకకుఁబోయి తెగులులేని వేదనం బడుచుండెను.

అంతలో నాలవజాము కోడికూసెను. కోడికూసిన కొలఁది సేపటికిఁ గాకులు కావుకావుమని యఱచెను. అప్పుడు వజ్రపాణికి మెలఁకువవచ్చెను. వచ్చినతోడనే యతఁడు మంచముమీఁద లేచి కూర్చుండి కన్నులు తుడుచుకొని మహేశ్వరధ్యానము చేసికొని మంచముదిగెను. సునంద చేతులుజోడించి మగని యడుగులమీఁద బడి కన్నీటితో వాటిం దడుపఁజొచ్చెను. అతడు మిక్కిలి విస్మితుఁడై విస్మయమునకు భయము తోడుగ మిక్కిలి తొట్రుపాటుతో "సునందా! ఏమిది? యేమిది? ఎన్నఁడులేనిపని చేయుచుంటివి? నీ కేమికష్టము వచ్చినది? బిడ్డలు సుఖముగా నున్నారా? నీపుట్టినింటి నుండి యేదేని చెడువార్త వచ్చినదా? నీశరీరమున నేదేని రుగ్మత కలిగినదా? చెప్పు చెప్పుము." అని పాదములపైనున్న ప్రాణసఖిని జేతులతో లేవనెత్తెను. ఆమె కన్నీరు విడుచుటయేగాని యాతని మాటలకు బదులు చెప్పదయ్యె.

అతఁడు భయము రెట్టింప నామె వీఁపుపైఁ జేయివైచి తట్టి కల్యాణీ! భయములేదు. చెప్పు చెప్పు. పాడుకల యేదేని గంటివా? భయపడకు చెప్పు చెప్పు"మని వెండియు హెచ్చరించెను. కొంతవడి కామె యూరడిల్లి గద్గదస్వరముతో నిట్లనియె. "బిడ్డ లింతవఱకు సుఖముగా నున్నారు. ఇఁక మీఁద వారికి సుఖ ముండదని విచారించు చున్నాను. నా పుట్టినింటివారికి నేటివఱకుఁ గుశలమే. ఇఁక ముందది యుండదని వెఱచుచున్నాను. నా శరీరమందింతవఱకు రుగ్మత లేదు. ఇఁకముందు జీవితశంక గలుగవచ్చునని భయపడుచున్నాను. పాడు కల నేనేదియుఁ గానలేదు. దేవరవారికే యట్టిది వచ్చినదని మనవి చేయుచున్నాను.

అప్పలుకులువిని వజ్రపాణి తెల్లబోయి "సుందరీ! నీపలుకులు నాకర్థమగుటలేదు. ఇది పిశాచభాషవలె నున్నది. విస్పష్టముగాఁజెప్పి నామనస్సును జక్కఁజేయు"మని పలికెను. అనవుఁడు సునందకంఠ

గాద్గద్యము కొంతవఱకు దిగుఁబడ స్పష్టమైనభాషతో నిట్లుత్తరము జెప్పెను. "అయ్యా! నేను మీకంటికిఁ బెద్దపిశాచమువలె గనబడుచుండుటచేత నాసంభాషణము పిశాచభాషవలె మీకుఁదోచుచున్నది. మీమనస్సు చక్కఁగ జేయుట నావంటిదానికి శక్యమా? కొంతకాలము నుండి దుర్గంధమునకుఁ దొరఁగినట్లు నాకు మీరు దవ్వు దవ్వుగ దొలఁగుచున్నారు. కర్పూరమంజరీ కారణమున దుర్గంధము తొలఁగి బోవునుగదా! నాకంపు దొలఁగించుకొని వెంటనే మీకింపుగలుగునట్లు కర్పూరమంజరిని హృదయముచెంత ధరింపుఁడు. భర్తభరింపలేని మగనాండ్రను బావులు భరించును. వాఁగులు భరించును. భగవానుఁడైన పావకుడు భరించును. మనసులోఁ గర్పూరమంజరిపై మీకు మక్కువగలదని యెఱుఁగనుగాని మీ వైఖరియంతయు మాఱిపోవుట నే గనిపెట్టుచుంటిని. కంటిచూపుకరువయ్యె. నోటిమాట యరుదయ్యె. కలలోనైన నేఁబనికి రాక కర్పూరమంజరి కావలసివచ్చె. ఎనలేని యామమత యేయేటఁ గలసె? ఆ ప్రేమ యెం దరిగె? ఆవిశ్వాసమే దేశాంతర మరిగె? ఇంతలోనే నాకింతదురవస్థ కలుగునని నేనెన్నఁడు దలంపనైతి. ఒకరాటను రెండుపశువులం గట్టిన నవి యొండొంటిం బొడుచుకొని చచ్చును. నేను కొంతకాలమైన సుఖమనుభవించినదానను. పదికాలములపాటు కాపురముచేసినదానను. సంతానవంతురాలను. కొంతవయసు మీఱినదానను జవ్వనము సడలినదానను కావున నాకు సెలవొసంగుఁడు భర్తకుఁబ్రియము సేయుటయే భార్యకు ధర్మముగనుక రాచకన్నియనగు నేను మీకును భూమికిని భారముగానున్న నామేనువిడిచి మీ కన్నుల చందమామమైన వన్నెలాడికై తావొసంగెదను. అదే! నిద్రించుచున్న యాచిన్నబిడ్డలం గాచికొనుఁడు. సవతితల్లి కప్పగింపక మీరే కనిపెట్టుఁడు. మీరు విక్రమశాలురై యనేకరణరంగముల విజయములుగాంచి విఖ్యా

తులు బడసిన మహాత్ములరు. ఇట్టిమహానీయులకు భార్యనైనందుకు నేను సంతసించుచున్నాను. ఐదవతనము బసుపుగుంకుమలతోఁ గాటికిఁబోయిన కాంత కడుధన్యురాలు. అం... చే నాకు సెలవొసంగుఁడు. రేపు తెల్లవాఱకమునుపే మీ కన్నులు చల్లనగునట్లు మీ మనస్సు చక్కఁబడునట్లు—మీమనోరథము సిద్ధించునట్లు—మీ సంకల్పమున కాటంకముదీరునట్లు—మీయుద్యమము సఫలమగునట్లు తగినమగఁడు గావలెనని తహతహపడుచున్న యీ తలిరుఁబోడి తపము ఫలించునట్లు—నేను చేయఁదలఁచిన కార్యముఁ జేసెద'' అని రోషావేశంబున నామెలనాఁగ యింక నేమియో పలుకఁబోవుచుండ వజ్రపాణి యెత్తుఁబడిన యామెకన్నులను దృఢనిశ్చయము దెలుపుచున్న యామె మొగమును- గంపించుచున్న గాత్రమును- తొట్రుపడుచున్న యామెమాటలను జూచి విని యేమియుందోఁచక భయవిహ్వలుఁడై యామె చేతులు బట్టుకొని యిట్లనియె.

''కల్యాణీ! నీ మాటలనుబట్టికలలో నేనుకర్పూరమంజరియను మాట దలపెట్టితినని తేటపడుచున్నది. నీవు విస్పష్టముగఁ జెప్పక పోయినను నీసంభాషణమువలన నది గ్రహింపవచ్చును. స్వప్నములు నీవెఱుగనివిగావు. అదృష్టపూర్వములు నశ్రుతపూర్వములు స్వప్నమున మనము గనుచుందుము. స్వర్గమునఁ బోయినట్లు కలగందుము. అప్పుడేమేమో పలవరింతుము. అవియన్నియు నిజములగునా చిత్రభానుని కూఁతురు కర్పూరమంజరియని యొక రైకలదు. ఆపేరు నాకు మిక్కిలి చిత్రముగా నున్నది. అది క్రొత్తపేరు, రమణీయమైన పేరు. మనోహరమైన పేరు. అందుచేత నాకీసారి యాఁడుబిడ్డ పుట్టునేని దానికా పేరుపెట్టవలెనని సంకల్పించుకొని తఱచుగా మనసులో దాని స్మరియించుచుందును. అందుచేఁ గలలోనప్పేరు పలవరించితి గాఁబోలు! ఇంత మాత్రమునకై యింతగొడవ కావలెనా!

కర్పూరమంజరి త్రిలోకసుందరి. లేజవ్వని. అట్టిదానిని వయస్సుచెల్లిన నాకిచ్చి తండ్రి పెండ్లిసేయునా? నాయందమును నా చందమునుజూచి యాబాల నన్ను వరించునా? ఇటువంటి పిచ్చితలంపులు తలలోఁ బెట్టుకొని సాహసంబులు చేయఁదలంతువా? నేను కొంతకాలము నుండి యెప్పటియట్లనీతోఁ జనవుగా మాటలాడకపోవుటకు గొప్పకారణముగలదు. రాజ్యవ్యవహారములు యథాపూర్వకముగ లేవు. పరిస్థితులు మాఱినవి. సేనలలో గొప్పకలఁత బయలుదేఱినది. వైదేశికులు మనదేశముపై దాడివెట్ట గమకించుచున్నారు. నిరంతరము వాటికిం బ్రతిక్రియలు వెదకుచు నామనస్సు స్తిమితముగాలేదు. అందుచే నట్లుంటిని. అంతేగాని నామనస్సులో నీపై నలుక లేదు. నీవె నాయర్ధాంగము. నీవె నాబహిఃప్రాణము. నీకన్న నాకు వేఱులేదు. కఠినోక్తులు గట్టిపెట్టుము. సాహసము లుపసంహరింపుము. నన్ను మన్నింపుము. బిడ్డల నడలఁ జేయకుము. నా కప్రతిష్ట ఘటింపకుము. నేను మనోవాక్కాయకర్మములనీయెడ నెట్టివిరుద్ధభావములేనివాడను, నమ్ము. మనకుటుంబము పరువుగలది. అవసరముమాలిన యల్లరిచేసి యప్రతిష్ఠ సంఘటింపకుము'' అని బతిమాలుటయు సునంద ''సరే! మీచిత్తము వచ్చినట్లు చేయుఁడు. బహుభార్యాపరిగ్రహణమునకు మీ కధికారము గలదు. పరకాంతాసక్తులయిన పురుషులు తఱచుగా నన్పృతంబునకు వెఱువరు. వారు చేయుబాసలు, ప్రమాణములు, విశ్వసింపఁదగినవి కావు. వారిసంభాషణలకు సత్యమునకు, జీఁకటికిఁ వెలుతురునకుఁగల దూరముండును. పాలముంచుటకు నీట ముంచుటకు మీరు సమర్థులు. ప్రాణేశ్వరుఁడె దైవంబని నమ్మి యిల్లాలి నుసురుపెట్టఁ గూడదు.'' అని కఠినముగాఁ జెప్పి గదివిడిచి లోనికిఁ బోయెను.

వజ్రపాణి కలలోఁ దాను ప్రేలిన ప్రేలాపనలవలన కార్యమింత చెడివచ్చినదని విచారించి యామె సాహసకృత్యములఁ జేసినపక్షమున హానియు లోకనిందయుఁ దనకు సంప్రాప్తించుటయే గాక కర్పూరమంజరీ పాణిగ్రహణ మహోత్సవముగూడ తప్పిపోవచ్చునని భయపడి యిల్లాలినదినఱకే తిరస్కారభావమునఁ జూచుటతప్పని గ్రహించి యిఁకమీఁద నామెనులాలించి గౌరవించుటయే కార్యసాధకమని నిశ్చయించెను. కాని యతఁడు మిక్కిలి యాలస్యముగా మేల్కాంచెను. తనయనునయములామెయెడఁ బనిసేయలేదు. తన మాటయెడ నామెకు విశ్వాసము గలుగలేదు. ఆమె హృదయమెంత మాత్రము మాఱలేదు. ఆమె యింటనడయాడుచున్నను మనస్సు మహావాయుపథమున సంచరించుచు నెన్నెన్నోపాట్లు పడుచుండెను. స్త్రీలకు సాహసము మెండని యతఁడు పెద్దలవలనఁ బలుమాఱు విని యుండుటచే నామె యాత్మహత్య చేసికొనునేమో యనుభయమున నతఁడా పగ లిల్లు గదలక నా రాత్రియు నిద్రపోక జాగ్రత్తగ నుండెను. ఆరేయిసునంద నిదురింపనేలేదు. మంచముమీఁద గూర్చున్నది. కూర్చున్నట్లె యుండెను. పండుకొమ్మని భర్త యెన్నివిధముల బతిమాలినను శయనింపదు. ఆరేయి సతీపతుల జాగరణముతోనే గడచెను.

మఱునాఁటినుండి సునందకు మతి చలించెను. ఊరకయె నవ్వును. కారణములేకయె పెద్దపెట్టున నేడ్చును. ఆహారము ముట్టదు. "కర్పూరమంజరీ, కర్పూరమంజరీ"యని పిలుచును. ఒకచోట స్థిరముగా నిలువక గృహమునందు, గృహముచుట్టనున్న దొడ్డియందుఁ దిరుగుచుండును. నిష్కారణముగా బిడ్డలం గసిరికొట్టును. పరిచారికలందిట్టును. అయ్యయ్యో! నన్ను సేవకులు కొట్టుచున్నారని కేకలు వేయును. తినుటకేదేనిబెట్టిన విసముపెట్టుచున్నారోయని యఱచును. మాటిమాటికి మొత్తుకొనును. రొమ్మువోదుకొనును. నిలువ

గల దువ్వలు వలుదెచ్చి చింపును. ఏలచింపెదవన బొమ్మలకు బట్టలు కావలెననును. అద్దములు పగులఁగొట్టును. అట్టిపని చేయువలదని భర్త నివారింప తలగోడకుఁ గొట్టుకొనును చీనిచీనాంబరములు మైలవడినవని తడుపును. తన యమూల్యాభరణములఁ దీసి పరిచారి కలంబిలిచి యొక్కొక్కరి కొక్కొకనగ పంచిపెట్టును. ఇల్లు కాలి పోవునని వంకబెట్టి ప్రొయిలో నిప్పులార్పును. కర్పూరమంజరి యాబాకంటి కనుకూణముఁ గనఁబడఁ జొచ్చెను. తనవెనుక నామె నడచుచున్నట్లు చెప్పును. కర్పూరమంజరి యటకమీఁద నున్నదని నిచ్చెనవైచుకొని యటకమీఁద కెక్కును. పెరటిలోన్న పొదరిండ్ల లోను గృహమండలి చీఁకటిభాగములలోను మంచముక్రిందను, బలుపుచుట్టలలోను భోషాణమునందునుఁ నిలువెత్తునున్న గుండిగల లోను, కర్పూరమంజరి యున్నదని శోధించిచూచును. కర్పూరమంజరి యింటప్రవేశించునని చెప్పి కవాటములు బంధించును. నిశ్శబ్దముగా నున్న సమయమునను భర్తం బిలిచి "యదిగో కర్పూరమంజరి. వీధిలోనుండి నన్నుఁ బిలుచుచున్నది. వినఁబడినదా" యని యడు గును. "పిలుచుటలేదు. నీది వట్టిభ్రమ" యని భర్త బదులుచెప్ప అయ్యో! అంతబిగ్గరగాఁ బిలుచుచున్నప్పుడు మాకు వినఁబడకపోవు టేమి? ఇది వట్టిమాట. నాకంటిలో దుమ్ముగొట్టవలెనని మీరీలా గనుచున్నారు." అని కొఱకొఱమనుచు భర్తం దూలనాడును. ఛీ! నాయింటికి రాకు నాభర్తం బిలచుటకు నీవెవ్వతెవే? వచ్చితివా! నీనెత్తురు కంటఁజూచెద. రాచకూఁతురవైనమొదల రా, నేను రాచ బిడ్డనే" యని కత్తి చేతఁబూని కర్పూరమంజరి వీధిలోనున్నదని తలుపులుదెఱచి పరుగెత్తబోవును.

వజ్రపాణి తన నూతనవధూ సమాగమము ప్రయత్న మీ విధముగాఁ బరిణమించినందుకుఁ డద్దయు విచారించి యది స్వయంకృ

తాపరాధమేయని నిశ్చయించి పశ్చాత్తాపమునొందిన గార్యము లేదని గ్రహించి యామెను నలుగురు పరిచారికల కప్పగించి తలను నిమ్మకాయలురుద్ది స్నానము చేయించుచు గదిలోనుండి యావలకు రాకుండఁ దలుపులు మూయించుచు నొక వైద్యునింబిలిచి చికిత్స చేయింపఁ జొచ్చెను.

వైద్యుఁడు చేయిచూచుటకురాఁగా 'ఛీ దుర్మార్గుఁడా ! నీవు కర్పూరమంజరికిఁ దండ్రివటరా నీవు కన్యాదానముచేయుటకు వచ్చితివా ? యని మీఁద నుమ్మివైచెను. పరిచారికల కప్పుడప్పుడు చెంపకాయలు దగులుచువచ్చెను. బిడ్డలు తల్లియవస్థఁజూచి తండ్రిం గౌఁగిలించుకొని యేడ్చిరి. బిడ్డల దైన్యముఁజూచి తండ్రియు బాష్పాకులితలోచనుఁడయ్యెను. లోకైకసుందరిని బెండ్లియాడి భూలోకస్వర్గ మనుభవింపఁదలఁచుచుండఁగా భూలోకనరక మనుభవింపవలసి వచ్చినదే యని యతఁ డింతింతయనరాని చింత చే గ్రుస్సుచుండెను.

వలవంతలు వంతలుగా మాఱుట యద్భుతముగదా ! మనుజుఁడు తలఁచిన దొకటి, దైవము గావించిన దొకటి యను సామెత వజ్రపాణియెడల నిజమయ్యెను. మానవుఁ డాకాశమున మేడలుగట్ట యత్నించును. స్వర్గమర్త్యపాతాళముల కేకసూత్రము పన్నును. కాని యఘటనఘటనాసమర్థుఁడును, సర్వశక్తుఁడును సర్వనియామకుఁడును నైన పరమేశ్వరుఁడు తలఁచుగా వారితలంపుల భగ్నము చేయుచుండును.

పదునేడవ ప్రకరణము

"ఘల్లికా! ఏమియుపాయమే నీవెంతో చతురమతివని సఖీ జనము చెప్పుకొనును. జనకుండు నన్ను వజ్రపాణి కిచ్చుటకుఁ గృతనిశ్చయుండై నాఁడు. పట్టినను మకరందుని చెట్టఁ బట్టవలె; లేదా నావంటి దైవోపహతులకుఁ బ్రాణసఖియైన మృత్యుదేవతను గాఢాలింగనముఁ జేసికొనవలెను. ఇంతియేగాని మఱియొక పురుషుని కేలువట్టనోపను. అతఁడు నవమన్మథుఁడేగాని, మర్త్యలోకమునకు దిగివచ్చిన జయంతుఁడుగాని, పురుషాకృతి దాల్చిన వసంతుఁడుగాని, యా మదనునింగన్నతండ్రిగాని యెవఁడైన నాకక్కఱలేదు. ఆతనింగలియు టెట్లే? ఎక్కడ యుజ్జయినీ పట్టణము! ఎక్కడ శ్రీనగరము! ఎన్నివందల యామడల దూరమున్నదే! మనశ్శబ్దము నపుంసకలింగ మని పాణిని, శాకల్యుఁడు మొదలగు వైయ్యాకరణులు వచించిరి. కాని యది నపుంసక లింగము గాదు. నపుంసకములకు సంచలన మెక్కడిదే? నపుంసకమైన యెడల నిమేషమాత్రమున నిన్నివందల యామడప్రయాణము జేసి మహానుభావుఁడైన మకరందునికడ కెట్లుపోఁగలదే? 'ప్రమాదో ధీమతామపి' యన్నట్లు మహామేధావంతులగు వైయాకరణులు గూడ శాస్త్రరచనలలోఁ బొరపడియుందురు. నామనస్సు నిజముగా నపుంసకమైన నేనెంతసంతోషింతునే? నపుంసకములైన వాళ్ళవలెఁ దీఁగలవలె నిదియొకచోటఁ బడియుండిన నెంతబాగుండునే? దీని కీసంచలన మెక్కడినుండి కలిగినదే? ఇంతవేగ మెక్కడినుండి వచ్చినదే? ఒక్కనిముసమైన నాదగ్గఱనుండదేమే? నేనన్న దీనికింత గిట్టకున్నదేమే? ఇది కోఁతివంటిదిగదా! దీనిని బంధించుట కేశృంఖలములు లేవుగదా? చతురమతివి నీవట్టి సంకెళ్ళ నిర్మింపలేవుగదా? నీ తెలివి తెల్లవాఱినట్లే యున్నది. నాకుఁ బనికివచ్చు నుపాయమేదియు

నీకడ లేదు ఓసీ! ఆమహానుభావుని పాణిగ్రహణభాగ్యము చేకుఱినను జేకుఱక పోయినను చిఱునవ్వు వెన్నెలలుగ్రక్కు నాతని ముఖచంద్రమండలము నొక్కసారి చూపవే. ఈ మహోపకారమునకు నీఋణమెన్నఁడైనఁ దీర్చుకొందునే. ఆహాహా! ఏమే యాముఖలావణ్యము. ఏమే యాకర్ణాంతములైన యాసోగకన్నులతీరు ఏమే యామీనాసకలసిరికి నివాసమైన తెలిదామరపువ్వుల నెవ్వఁడుచేసెనో యాకన్నుఁ నాతఁడే చేసెను. శరత్కాలచంద్రమండల మెవ్వఁడు నిర్మించెనో యాతని మొగము నాతఁడే నిర్మించెను. బంగార మెవ్వఁడు సృజియించెనో వానినెమ్మేను నాతఁడే సృజియించెను. వెన్నెల నెవ్వఁడు గావించెనో యీమందహాసముల నాతఁడే గావించెను. చందమామలోని లావణ్యము వసంతుని మార్దవము పచ్చవిల్తుని చక్కఁదనము మూఁడును మూఁడుపాళ్ళువైచి చతురాస్యుఁడు తన పురుషసృష్టి సార్థకమగునట్లు వీనిం జేసియుండును. చెలీ! అట్టిపురుషుని సందర్శించుటెట్లే? ఒక్కసారి యతనిజూచి యీమేను విడువవలెనని యున్నది. ఏల యిట్టిపని యందువా విను. అతఁ డతి దూరమందుండుటచేతను నావంటి కన్నియలు పెక్కండ్రు వాని కిచ్ఛామాత్రమున సులభముగా లభింపఁ గలుగుటచేతను నతని కాలిగోటి కయినఁ బరిచర్య సేయుటకు నేను తగియుండక పోవుటచేతను నతని దాసీజనంబులోనైనఁ జేరి యాతని యూడిగముసేయ నేఁ దలపెట్టినను నాజనకుఁడు నన్ను విడిచిపెట్టక పోవుటచేతను నా కాతని చరణంబు దుర్లభమనియు మరణంబ శరణంబయనియు నిశ్చయించుకొంటిని. కాని యాతనిఁ జూచి ప్రాణంబు విడువనలఁతు. ఆహాహా! పులుఁగులెంత యదృష్టవంతులే. ఱెక్కల కలిమిచే నవి యెక్కడి కరుగ దలంచిన నవి యక్కడి కరిగిపోవునుగదా! విమాన సంచారముచేయు దేవతాంగన లెంతయదృష్టవంతులే. ఎవడైన నొక్కయోగి మనకడకు వచ్చి ప్రవరాఖ్యునకుంబలె మనకు నొక్కపాదలేపన మిచ్చిన దాని

ప్రభావమున మన మొకసారి యుజ్జయినికి తెప్పపాటు కాలమునఁ బోయి యతని దర్శించి నమస్కరించి రాఁగలుగుదుముగదా! మందభాగ్యులకు మనకట్టి యదృష్టము పట్టునా? పోనీ, నిరాశ జెందుదమన్న మేన నసు రులున్నంతవఱకు నాశాబంధము తెగదు. అసువులతోడనే యాశలు నశించును. స్వతంత్రించిపోవుదమన్న పనికిమాలిన యీ రాచ కొల మునఁ బుట్టితిమిగదా! అడవులలో యథేచ్ఛముగా సంచరించు చెంచు కన్నియలు తొలిమేనులు నేమి నోములు నోచిరే? ఈపాడు రాచ కులమునఁ బుట్టిన కతమున మావంటి కన్నియల సూర్యవంశ్యలై చీక టులువోలె మేడలలో మిద్దెలలో నడఁగియుండవలయును. జంతువు లకు స్వేచ్ఛయున్నది. పక్షులకు స్వేచ్ఛయున్నది. కీటకములకు స్వేచ్ఛ యున్నది. సరీసృపములకు స్వేచ్ఛయున్నది. కాని చైతన్యముగలిగి జ్ఞానసంపత్తిగలిగి మెలంగు మెలంతులకు స్వాతంత్ర్యమన్నది లేదు. 'స్త్రీస్వాతంత్ర్యమర్హతి' యని మనువుచేసిన శాసనమెట్లు లోక మునఁ బ్రవర్తిల్లుచున్నదే? ఈశాసన మెన్నటికయిన మాసిపోవునే? సఖీ! నాకోరికలిసుక పాతర వలెంబడుగనున్నవి. ఎన్నో చెప్పితినని నీకు విసుగుగలుగు చున్నదిగాఁబోలు చెప్పినవి చెప్పఁగా నింక చెప్పనన్నియు న్నవి, ఎన్ని దినములు చెప్పినను దఱుగవు. చెప్పుటకు మాటలుచాలవు వాల్మీకిగాని వేదవ్యాసుఁడుగాని వేదవ్యాసునియబ్బగాని మనసులోను న్న యూహల సరియైన మాటలలోఁ దెలిపిసంపూర్ణ భావప్రకటనము చేయఁగలఁడే. అదికవికేగాదు రవికైన నసాధ్యముగాదు. అట్టిచో నేనెట్లు నీకుఁ నచ్చఁజెప్పగలను? అదియునుంగాక వలవంతయొక్క తీవ్రపు వేఁ డిమి వలవంతయను చిచ్చునంబడి మాడెడువారికేగాని పెఱవారికిం దెలియదు. కన్నియవైనను నీవున్న్యమున నీకట్టియలమట కలుగదయ్యె మల్లికా! తల్లికడనైనఁ జెప్పనోల్లని గుట్టుమట్టులు నీకడఁ జెప్పుకొంటి తల్లికని పిమ్మట మీాకప్పగించినది. కావున నీవు తల్లికన్న నెక్కుడు

దానవు. అందుచే నాయత్తలికము తీఱునట్లు తగిన తెఱంగునీవ చేయ వలయు. అట్టియదృష్టము నాకబ్బునా?" అనికన్నుదోయినీటికలిమున మంచుగ్రమ్మిన కెందామరతేకుల చందంబున నలర నామె విచారా క్రాంతయై యట మీఁదఁ బలుకలేక యూరకుండెను. మల్లిక తన చెఱంగుతో నామెకన్నీరు తుడిచి "సఖీ! నేడు కడుపులోనున్న దెల్ల వెళ్ళబుచ్చితివి. మనస్సును గలఁచునట్టి విషయములు వమన ములవలె బైకివచ్చెనేని మానిసికి సుఖముండును. దుఃఖములు మిత్రు లతోఁజెప్పుకొన్నఁ గొంతవఱకుపశమించును. చెలికాండ్రతోఁ జెప్పు కొన్నపక్షమున నానంద మతిశయించును. కావున నీకుఁ గొంత హృదయభారము తగ్గిపోవును. ధైర్యము దెచ్చుకొనుము. విచా రములవల్లఁ గార్యములుగావు. ధైర్య కవచముఁబూనిన వారిని గష్ట ములు బాధింపఁ జాలవు. నా చేతనైన సాయము నేఁజేసెద. ఏమి చేయుదునాయని విచారించుచున్నాను. ఉపాయము తోఁచకున్నది" యని బదులు చెప్పెను.

"ఓరీ! నా విచారము కొంత డీలుపడుననుచున్నావు. నాహృ దయమించుకేని జులకపడలేదు. నామనోవ్యథతగ్గలేదు. అతనికటాక్ష వీక్షణములు ప్రసరింపవలె. నామనస్సు చల్లఁబడవలె. నీవంటి బుద్ధి మంతురాలి కొక్క యుపాయమైనఁ బొడగట్టకపోవుట నా దురదృ ష్టము. అయిన దృఢముగానాలోచింపుము. నేనును నా తమ్ముఁడు విజయసేనుఁడట్లు మగపుట్టువు పుట్టక కట్టిడి యాడుపుట్టువు పుట్టిన కతమున నిట్టి బెట్టిదంబులు వాటిల్లె. ఛీ! స్త్రీ జన్మమెత్తగూడదె. అందులో రాచకన్నియయై పుట్టఁ గిట్టదు. పేదదాననై పుట్టి యిచ్చవచ్చిన మగని చెట్టబట్టి సుఖింపనై తినిగదా" యని కర్పూరమంజరి పలుకుచుండ మల్లిక యందుకొని "నెచ్చెలీ! నీ కష్టములు నీకున్నట్లే పేదలకష్టములు పేదలకుండును. సకలసౌఖ్యము

లుండి స్వాతంత్ర్యములేక నీవు విచారించుచున్నావు. స్వాతంత్ర్యముండియే సౌఖ్యములేక కడలేనికడుగండ్లఁబలు కటికిపేదలయవస్థలువర్ణింపఁదరమా? జలచరములస్థితి స్థలచరములకురాదు. జలస్థలచరముల స్థితి ఖచరములగు పక్షులకు రాదు. సుఖమున్నచోట దుఃఖముతప్పక యుండును. క్రీనీడ దీపము వెనుకనే యుండును. ఛాయ సూర్యననుసరించియే యుండును. పేదవారు వైనంతమాత్రముసుఖపడవు. భాగ్యవంతురాలయినంతమాత్రమున కష్టపడవు. ప్రస్తుతస్థితినిబట్టి యిట్లను కొందువు. దానికేమి! అతనితోనీకు సమాగమమెట్లు గలుగునా యనువిషయమునుగూర్చి విచారించుచున్నాను. పోనీ! ఇదివిను. విదర్భ రాజనందనయగు రుక్మిణి తనమనోరథసిద్ధికై వాసుదేవునికడకు బ్రాహ్మణుని దూతగానంపినట్లు మనముగూడ నెవ్వరినైన నంపరాదా? యనికడకంపుదమా?'' యని పలికెను.

''పంపవచ్చునుగాని మనము సంపూర్ణముగా విశ్వసింపఁదగిన బ్రాహ్మణుఁడు మనకెవ్వఁడుదొరకును? రుక్మిణీదేవికున్న స్వాతంత్ర్యము మనకుఁగలదా? పాతుటీఁగయైన మనయింటఁజొఱరాదు. ఎట్లో సూర్యచంద్రులుమాత్రము మన యావరణలోఁబ్రవేశించుచున్నారు. మనకట్టిపురుషుని దర్శనమెట్లగును? మాతండ్రి యింటలేనప్పుడు నీవెవ్వరినైనఁ దోడ్కొనివచ్చుటకయిన వీలులేకుండ రుద్రభట్టు హిమాలయపర్వతమువలె మనకడ్డముగనున్నాఁడు. ఇతని వైఖరిజూడ మాతండ్రి కేవో దురాలోచనలు చెప్పుచున్నట్లు తోచును. ఇతని వలన మనకుఁగొంతయపకారము జరుగుచున్నదనినాయభిప్రాయము. ఎట్లైనను బ్రాహ్మణసందేశము వలనుపడదు. మఱియొక యుపాయమన్వేషింపుము.'' అని యామె బదులుచెప్పెను.

''పోనీ యెవరినిబంపుమనియెదవు?'' అని మల్లికయడిగెను. చెలీ!'' యెవ్వరిబంపుమని నేనుచెప్పగలను. వెళ్లెడువారికి ధైర్యముం

డవలె. ఏఱులు, ఎక్కవలసిన పర్వతములుగలవు. దాఁట వలసినయేఱులు గలవు. నడువవలసిన కాఱడవులుగలవు. మెలఁగవలసిన మృగములుగలవు. అన్వేషించి క్రూరులగు చోరులు దారులుగాఁచి యుందురు. వారిబారినుండి తప్పించుకొనవలయు. రెండవది నెఱజాణ తనముండవలయు ఏలయన—ఆమహాత్మునికడకుఁ బోవునప్పుడు సమయాసమయములు తెలియఁగవలయు. అసమయంబునఁ జేసినదర్శనము కోపహేతువగావచ్చును. అకాలమందునాటినవిత్తనమువలె ప్రయత్నము నిష్ఫలమగును. దర్శనము చేసినపిమ్మట మాటనేర్పుండవలయు. సమయోచితముగా-సందర్భోచితముగాఁ బలుకఁగలవారు ప్రపంచమున మిక్కిలితక్కువగాఁగలరు. ఎదుటివారిమనసు నొవ్వకుండ వారికిష్టులగు వారిమీఁద నిందలు వేయకుండఁ దన కార్యంబుసాధించుకొనునట్టి నేర్పరితనముండవలయును. ఇట్టివెన్నో గలవు. ఇట్టిగుణములుగలవారు మనకెట్లులభింతురు? ఎన్నివిధములఁ జూచిన నట్టిగుణసంపద నా చెలిమికత్తెయొద్దనే గలదు'' అని చెలువపు మొగమునఁ దోఁపఁ గర్పూరమంజరి పలుక మల్లిక ''సరిసరి! నేనాయిట్టిపనికిఁ జాలినదానను. ఇదిపురుషులకుసాధ్యమయినపని. ఆఁడుదానికలవియగునే? ఇట్టిసాహసంబుసమకట్టుటకు నేనంతవలంతినే? కొండలెక్కఁగలనా? ఏఱులుదాటఁగలనా? మెకములబారినుండి తప్పించుకొనఁగలనా? ముష్కరములగు తస్కరుల చేతఁబడకుండ దాఁటిపోఁగలనా? ఏబాటసారులగుంపున యినఁగలసి పోయి సుఖప్రయాణము చేయఁగలననుము. ఉజ్జయిని జేరుదుననుకొనుము. ఆయుధపాణులచే సురక్షితమైన రాచనగరు ప్రవేశింపఁగలనా? నాకామహారాజకుమారునిదర్శన మగునా? అగుననుకొనుము. నన్నాయనపూరికింగొనునా? ఒకవేళ నాదరించి మాటలాడుననుకొనుము. నేనంతజాణతనముగలిగి పూర్వోత్తరవిరోధము లేకుండ సందర్భశుద్ధిచెడకుండ నాతని మనసు నొవ్వకుండఁ గార్యము పొసఁగునట్లు మా

మాటలాడఁగలనా ? ఇది నాకుఁ దగనిబరువు. నాకు శక్యముకాని కార్యము. నాకనుచితమైనకర్మము. కావున నింకొక్కని నియోగింపుము''అని యుత్తరమిచ్చి తన యసామర్థ్యమును జెప్పుకొనియెను.

''సఖీ! నీవే యిట్లన్న గార్యసాధనమగు టెట్లు? పోనీ! ప్రయత్నముడుగుదమన్న నాప్రాణ మాశయను తొడిమి నంటిపెట్టుకొని యున్నది. నిరాశయను గాలి యించుక వీచిన నాప్రాణపుష్పమూడి క్రిందఁబడును. అతనిచేత నేను నిరాకరింపఁబడితినా యీమేను విడిచెద. అతనిమనంబున నేమూలనైన నేనుంటినా మనప్రయత్నము సార్థకమగును. పోని, యామహారాజు నామారుని విడిచి మఱియొకనిపై దృష్టిపఱుపుమనన్న నట్టినాహాస ప్రియానార్యుఁడేడీ? అట్టి దాన రాధేయుఁడేడీ? అట్టి ప్రతిజ్ఞారామచంద్రుఁడేడీ? అట్టి రసికశిఖామణి యేఁడీ ? అట్టి మధ్యమలోకసుందరమేది! ఏఁడీ ప్రేలుమడఁచి చూపుము; రత్నములలో వజ్రమట్లు చుక్కలలోఁ జంద్రుఁడట్లు పువ్వులలో గమ్మసంపెఁగ యట్లు, మృగములలో సింగమట్లు, మకరందుఁడు తనకుఁదానె సాటియై లండిమగలపు దండిపగడై మన్మథమన్మథుఁడై, రాజరాజై శోభిల్లుచున్నాఁడు. ఇట్లనుటచే నితర రాజకుమారుల నిందించుచుంటినని తలంపకుము. అట్లుచేయుట నాసంకల్పముగాదు. మహానీయుఁడైన మకరందుని గుణవర్ణనము యథాస్థితిగ నేఁ జేయుచుంటిని. అట్టివాని చెట్టఁబట్టనిచో నీజన్మమేల? ఈ పుట్టుక వ్యర్థము. అడవిలోఁ బుట్టినపువ్వడవిలోనే నేలను రాలి చివికి మంటిలోఁ గలిసినట్లు నావిద్యయ-నాసౌందర్యము-నాచక్కఁదనము మంటిపాలు గావలసినదె. కావున మన చిరకాలస్నేహముఁ దలంచియైన, నాయందలి జాలిపెంపుననైన సహజమైన నీసౌజన్యాతిశయమువల్లనైన నాపనుపుసేయుము. సత్కార్యసిద్ధికొఱకుఁ బోవుచుంటిగావున నీకే యాపదలురావు'అని గడ్డముపట్టి బ్రతిమాలుకొనెను.

"చెలీ! నన్ను బ్రతిమాలవలెనా? అక్కఱలేదమ్మా. ఈ మేనుమీఁది నేను తినునన్నముమీఁది, నాకట్టుబట్టమీఁది. ఈశరీరము మీ యిచ్చవచ్చినట్లు చేసికొనవచ్చును. ఒకవేళ మధ్యేమార్గమున నేనే బెబ్బులినోటనైనఁ బడి మృతినొందినను నేను విచారింపను. ఏలయన దానియాఁకలి దీర్చినదాననగుదును. ఏహానిలేకుండ నుజ్జయిని జేరితినా ప్రియసఖి కార్యము జేసినదాననగుదును. ఎట్లయిన నీపనుపుజేసి నాతనువు ధన్యముసేసికొనియెద. కాని, మీతండ్రితోఁ జెప్పి యిల్లు గడలవలయు. ఏవంక బెట్టి యాయనకడ సెలవుపుచ్చుకొందును. నా తల్లిదండ్రులు మూఁడుగాళ్ళ ముదుసలులయిరి. వారు రమ్మని నాకు వర్తమానమంపిరి. తప్పక నేపోవలెనని చెప్పిపోయెద నీయుంగరము నాకిమ్ము. ఆయన కానవాలు జూపెదను. నీవేదైన లేఖయిచ్చెదవా? అట్లయిన వ్రాసియిమ్ము. ఏమిచెప్పుమనెదవో చెప్పుము. ఈ రేయి మీయయ్యకడ సెలవుగైకొని తెపు బైలుదేఱిపోయెద. మీనాయన గారు నన్నొంటిగఁ బోనియ్యరు. నక్షత్రకునివంటి వృద్ధకంచుకుని జంబుకుని నావెంట నంపుదురు. సరె ఆసల్లమందు వాతకు నాలుగు గంజాయాకు లిచ్చితినా కునికిపాట్లు బడుచు దారిలో నేచెట్టుక్రిందనో కూర్చుండును. అప్పుడు జేపరమేశా యని దాఁటుదును. ఇంక శాంతింపవమ్మా!' యని యామెచిత్త మూఱడిల్లునట్లు మల్లిక పలికెను.

కర్పూరమంజరి ముఖారవిందము వికసించెను. నేత్రములు విశాలములయ్యెను. చిఱునవ్వు మొగమునలంకరించెను. శరీరమంతటను నుత్సాహరసము వ్యాపించెను. ఆనందము పట్టజాలక యామె మల్లికను గౌఁగలించుకొని "సఖీజనమనఁగా సుఖదుఃఖసమానమైన జనము. నానిమిత్తమున నీప్రాణములనైన విడువఁదలఁచితివిగదా! నీఋణము వేయిజన్మములకయిన నేను దీర్పఁగలనా?" యని వెండియు నిట్లనియె.

"ఓసీ! ఏమి చెప్పుమని నీతోఁ జెప్పుదును? అది చెప్పు మిది చెప్పు మని నేఁ జెప్పఁజాలను. చెప్పవలసిన దంతయుఁ జెప్పుము. నా యలమట యంతయుఁ జెప్పుము. నీవు చూచిన దంతయుఁ జెప్పుము. చెప్పఁగూడని దంతయు విడిచిపెట్టుము. సమయోచితముగాఁ జెప్పుము. మిక్కిలి దీనముగాఁ జెప్పిన లోకువగును. ఎక్కువ బెట్టుసరిగాఁ జెప్పినఁ గార్యము చెడును. కార్యశకటమును నడిమిత్రోవ నడిపింపవలయును. పరులతో సంభాషించునప్పుడు వానిం జేరకుము. విసుగుగానున్నప్పుడు పలుకరింపకుము. విచారాక్రాంతుఁడై నప్పుడు నీసోది చెప్పకుము. ఒంటిగానున్నప్పుడు చిత్తము ప్రసన్నమైయున్నప్పుడు మొగము కల కలలాడుచున్నప్పుడు దీర్ఘాలోచనాపరతంత్రుఁడు కానప్పుడు మెల్లగఁ జేరి విన్నవింపుము. నాశరీర మాయన దేయనుము. నాప్రాణ మాయన దే యనుము. నామనస్సాయనదె యనుము. నాహృదయ మాయనదె యనుము. నాజీవిత మతని యాధీన మనుము. పరమేశ్వరుని నమ్ముకొని ప్రయాణము సేయుము. అంతట గార్యసిద్ధి కరతలామలకము. ఇదిగో! నాయుంగరముతీసికొమ్ము. ఇది యాతని కిచ్చిరమ్ము. ఆయన యే దేని మరలనిచ్చినఁ గనుల నద్దుకొందుననుము. పొమ్ము శుభముగుగాక!"

ఆ రేయి మల్లిక చిత్రభానునితో మాతాపితృ సందర్శనార్థము పోవుదునని చెప్పి యాయన నొడఁబఱచి మఱునాఁడు వఱువాత వృద్ధ కంచుకియైన జంబుకుని చిత్రభానుని యాజ్ఞాప్రకారము వెంటఁ బెట్టుకొని బైలుదేఱెను.

రెండుదినములు గడచెను. మూఁడవనాఁడు తెల్లవాఱుజామున విధిగుమ్మముకడ నేడుపు వినఁబడెను. అప్పుడే మేలుకువవచ్చిన సేవకులు తలుపుదెఱచి యదియేమోయని చూచునప్పటికి వెక్కి వెక్కి యేడ్చుచు జంబుకుఁడు నిలిచెను. వారు వాని నెట్లో లోపలికిఁ దెచ్చిరి. వాఁకిటిలో నరుగుమీఁదఁ గూర్చుండి వాఁడు వెక్కి వెక్కి యేడువఁ జొచ్చెను. సేవకులు కలవరముపడిరి. అది విని యింటివా

రండఱు లేచిరి. వానిని లోపలికి దోడ్కొనిరమ్మని చిత్రభానుఁ డాజ్ఞాపింప సేవకు లట్లుచేసిరి. ఆదుఃఖమునకుఁ గారణమేమని చిత్రభానుఁడు, రుద్రభట్టు, వాని నెన్నివిధముల నడిగినను వాఁడు వారి పలుకులు వినిపించుకొనక "అయ్యో! అయ్యో! నాతల్లీ! నాతల్లీ!" యని తొమ్మమోఁదుకొని యేడువఁ జొచ్చెనేగాని యుత్తర మీయఁజాలక పోయెను. చిత్రభానుఁడు చీవాట్లు పెట్టెను. సేవకు లేడువవద్దని బ్రతిమాలిరి. ఎట్టకేలకు వాఁడిట్లు బదులు చెప్పెను.

"ఏమి చెప్పుదును తండ్రీ! శైలు దేఱిన నాఁటిరాత్రియే నేనును మల్లికయు నొకసత్రపు టరుగుమీఁదఁ బండుకొనఁగా దగ్గఱయడవిలో నుండి పెద్దపులి వచ్చి దానిని లాగుకొనిపోయెను. నేను దుడ్డుకఱ్ఱ పుచ్చుకొని తఱిమికొట్టితినిగాని యది మల్లికనువిడువక పాఱిపోయెను. ముసలిముండకొడుకును నన్నైనఁ దీసికొనిపోయినది కాదు. దుంపలాటి బిడ్డనుదీసికొనిపోయినది" అని పెద్దపెట్టున నేడ్చెను.

సేవకు లాశ్చర్యపడిరి. కర్పూరమంజరి వగపుచే నేలఁజదికిలఁ బడెను. చిత్రభానుఁడు కటకటా యనెను చంద్రికయు నిందుమణియు గర్పూరమంజరిని లోనికిందీసికొనిపోయి పానుపుజేర్చిరి.

ఆమె కిప్పుడు రెండువిచారములు పట్టెను. ప్రాణమిత్రమైన మల్లిక మరణ మొందుట యొకటి తనసందేశము మకరమందునకందకపోవుట మఱియొకటి. ఇవి యొకదానికంటె నొకటి బలవత్తరమైన విషాదకారణములు. మధ్యాహ్నము జంబుకునిబిలిచి యామె జంబుకా! నిజముచెప్పు. చెప్పు మల్లికను బెబ్బులి యీడ్చికొనిపోవుచుండ నీవు చూచితివా?" యని గ్రుచ్చిగ్రుచ్చి యడిగెను. "అమ్మా! మీపాదములసాక్షి. పెద్దపులి లాగుకొనిపోవుచుండఁగా నేను కన్నులారఁ జూచితిని" అని వాఁడు బదులు చెప్పెను. అన్నివిధముల దైవము తన్ను బాధుచేసెనని కర్పూరమంజరి దుఃఖపరవశయై, రెండవ సఖయైన చంద్రికతో నెట్టెటో కాలక్షేపము చేయుచుండెను.

పదునెనిమిదవ ప్రకరణము.

మణివర్మనియుక్తుఁడై మాధవసేనుఁడు రాచనగరునకరిగి కంచుకిచేతఁ దనరాక నరవిందాదేవి కెఱిఁగించి యామెయాజ్ఞాప్రకారములోని కరిగి యథోచితసత్కారముల నంది సుఖాసీనుఁడై మణివర్మ చెప్పినట్లు చిత్రభానుఁడు సేనానివేశమునఁ జేసినచర్యలెల్ల విని పించెను. అది వినఁగానే యామెగుండె జల్లుమనెను. రాజకుటుంబమునకు మూఁడఁదలఁచినయాపద యామెయెట్టయెదుటఁ గనఁబడెను. ప్రక్కనున్నవిక్రమసేనునిం జూచి యాదేవి విచారసూచకమగు హీనస్వరముతో నిట్లనియె. "నాయనా! కాశ్మీరరాజ్యవృక్షమునకుఁ బురుగులు పట్టినవి. ఈకీటకములు తరువును నిర్మూలనముచేసినంగాని విడువవు. దొంగయు మనుష్యుఁడేయగుటచే మనకు హితులెవ్వరో యహితులెవ్వరో తెలిసికొనఁజాలకున్నాము. ఎవరిని నమ్మ నచ్చునో యెవరిని నమ్మఁగూడదో మనమెఱుఁగము. ఇదిచూడ నా కొకశ్లోకము జ్ఞాపకమువచ్చుచున్నది. చిన్ననాట మాతండ్రి మహేంద్రదేవుఁడు నాకు విద్దెగఱపుటకై తర్కవాచస్పతియను బిరుదుఁబొందినజయదేవుఁడను పండితుని నియమించెను. ఆయనప్రస్తావవశమున నొకనాఁడీశ్లోకముజదివి నాకర్థము చెప్పెను. అదిమిక్కిలిరసవంతమగుటచే నేనుదానినివల్లించితిని. క్రొత్తకుండమీఁదజేసిన సంస్కారమట్లులేతమనస్సు మీఁదఁబడినభావములు మఱపునకురాక యాజీవితాంతముండును గనుక నాకిప్పటికి నది జ్ఞాపకమే.

శ్లో. అగ్రే వ్యాధః కరధృతధనుః పార్శ్వయోర్జ్వాలమాలాః
పృష్ఠే వహ్ని ర్దహతి విపినం సన్నిధౌ సారమేయాః
ఏణీ గర్భా దలసగమనా బాలికాః పాదలగ్నాః
లక్ష్మీనాథ! త్వ మసి శరణం కిం కరోమి క్వ యామి.

“కుమారా! దీనిభావమిది. ఒకమగలేడి దురవస్థలోనుండి యిట్లు విచారించినదఁట. ఎట్టయెదుటఁ జేతవిల్లుబూని కిరాతుఁడు నిలిచి యున్నాఁడు. కావున ముందుకుఁ బాఱిపోవుటకు వీలులేదు. వెనుకకుఁ బాఱిపోవుదమన్న వెనుకప్రక్క భయంకరమైన కాఱుచిచ్చు వనముం గాల్చుచున్నది. ప్రక్కలకుఁ బాఱుగెత్తుదమన్నఁ గిరాతుఁడు వలలు పన్నియున్నాఁడు. సమీపమందు వేఁటకుక్కలు సిద్ధముగానున్నవి. ఆఁడులేడి చూలుదాల్చియున్నది. పరుగెత్తఁదలఁచుకొన్నను వీలు లేదు. పైఁగా బిడ్డలు కాళ్ళకడ్డముగాఁదగులుచున్నవి. ఓలక్ష్మీనాథా! నీవే శరణము. నేనేమిచేయుదును? ఎక్కడికిఁబోవుదును?’

మనయవస్థయు నట్లేయున్నది. మంత్రులు నమ్మకమన్న వారు సింధుగాంధారరాజులకు వశులై రూకలకై మనరాజ్యమును మనలను విక్రయింపఁదలచుకొన్నారు. సేనాపతులు సేనలనుచిత్రభానునివశము చేయఁదలఁచుకొన్నారు. చిత్రభానుఁడు సోదరుం గడతేర్చినట్లే నన్నును సోదరపుత్రులను రూపుమాపఁదలఁచుచున్నాఁడు. నాయనా! మీరు చిన్నవాండ్రు. లోకానుభవములేనివాండ్రు. నేనో కోటదాఁటి వెళ్ళుటకు వీలులేని యాఁడుదానను. దీనజనమందారమై దేవతా శిరోమణియై సకలలోకరక్షకుఁడై వెలయుచున్న శ్రీమన్నారాయణుఁడే మనల రక్షింపవలయు. అగతికులకుఁ గతియు ననాథలకు నాథుఁడు నైనజగన్నాథుఁడు నాఁడు విరటపుత్రిక కడుపులోనున్న పరీక్షితుని సురక్షితుఁజేసినట్లు మిమ్ముఁ గాచుఁగాక! మనుష్యయత్నమను నడ్డుగట్లు భగవదిచ్ఛయను ప్రవాహమును వారింపఁ జాలవు.” అని నిష్ఠురముగాను దయనీయముగాను సంభాషించుచున్న దేవి నుద్దేశించి మాధవసేనుఁడు వినయముగ నిట్లనియె—

“తల్లీ! నేనునుమణివర్మయు రాజకుటుంబమునెడ నమితవిశ్వాసముగలిగి చేతులుగట్టికొని మీపనులు చేయుటకు సిద్ధముగనున్నను

మాయెడ మీకు లేశమైన నమ్మిక లేదు. మేము మీవిశ్వాసమునకు వెలియైయున్నాము. చండాలురకుం దొలఁగు బ్రాహ్మణులట్లు కుష్ఠ రోగులకుం దొలఁగు సుశరీరులట్లు దుర్గంధమునకు దూరముగఁబోవు మానవులట్లు మీరు మమ్ముఁ బరిత్యజించుచున్నారు. చిత్రభానుని దుస్తంత్రములనియెడు పెద్దయేఱులువచ్చి మిత్త్రుపల్లముల నేకము జేసినవి. అందుచే నేదిమెఱకయో యేదిపల్లమో తెలియక మీరు జలమంతయు మేటిమొసళ్ళతో నిండిన యపాయకర ప్రదేశమని భయమందుచున్నారు. మాయొట్లు మాబాసలు మాప్రమాణములు మా పూర్వచారిత్రములు మీకడఁజెల్లిగవ్వయైనఁ బనికివచ్చినవిగావు. మే మేమి చేయుదుము? మా యుపదేశము విషాన్న మట్లుమీకు రుచింపదయ్యె. ఇప్పటికిని మేము మీయాజ్ఞాబద్ధులము. మీ ప్రియకింకరులము. మీకు వశవర్తులము. మాచేత మీయిచ్చవచ్చిన కార్యములు చేయించుకొనుఁడు. అట్లుకానియెడల మీరట్లు శూల నాడినను మణివర్మ మరల నన్నేల మీకడ కంపును. అతఁడు చిత్ర భానునకు మీకుఁగూడ విరోధియైనందుకు బిట్టు వగచుచున్నాఁడు. గదాధర శూలపాణులు మీకుఁబరమ విధేయులు రాజభక్తులు. మీ తిరస్కారమున రాజభక్తులు శూరశిఖామణు లగువారిరువురు పగతురతోఁ జేరుదురేమోగాని యింతదనుక వారు మన పక్షమే యున్నారు. మీఁద మీచిత్తము.''

అని మాధవసేనుఁడు తనవిశ్వాసమును దృఢముగాఁ దెల్పుట యు విక్రమసేనుఁడు తల్లికిట్లనియె. "అమ్మా! నీకు నేఁజెప్పవలసిన వాఁడనుగాను. అయినను నాపలుకులు సరిగావిచారించుము. మాధవ సేనునిమాటలు నాకునచ్చినవి. సైన్యములు పరాధీనములగుచుండుట చేతఁ గార్యభారమీ యమాత్యులమీఁదబెట్టి మీ తండ్రియైన మహేంద్రదేవుని కడకును మా తండ్రికి పరమమిత్రమైన సుదర్శనుని

కడకును సాహాయ్యము నిమిత్తము సందేశములంపుట మంచిది. నా బుద్ధికింజూడ మాధవసేనుఁడే యిప్పటికిఁ దగినవాఁడు. మీఁద నీయిష్టము" అనుటయు నరవిందాదేవి కొంతసేపు మనంబున నాలోచించి "కుమారా! నీవు రాజవు. శాస్త్రజ్ఞానము గలవాఁడవు. చక్కగానాలోచించి యేదికర్తవ్యమో చేయుము. నా బుద్ధికేదారియుఁ బొడకట్టుటలేదు. మనకందఱుఁ బగతురేయగుటచేత మన మాన ప్రాణములు చిత్రభానునిచేతఁ గోల్పోవుటకంటెఁ జిరపరిచితులైన మణివర్మ మాధవసేనులచేతనే కోల్పోవుట యుక్తము. కావున గొఱ్ఱె కటికవానినే నమ్మినట్లు వీరినే నమ్ముకొనియుందము. మణివర్మతో మంతనముండి మాధవసేనుఁడే సుదర్శనునికడకు మాతండ్రి కడకు సందేశము గొంపోవుఁగాక!" అని పలికె.

అనవుడు మాధవసేనుఁడు చింతిల్లుచు "తల్లీ! మే మెన్నివిధముల మొఱవెట్టుకొనుచున్నను మీరింకను మమ్ము చిత్రభాను ప్రముఖులతో సమానులుగాఁ జేయుచున్నారు. కాని కాలక్రమమున మా ప్రవర్తనమే మాపలుకులకు వ్యాఖ్యానమగుగాక! నేను మణివర్మతో నాలోచించి మహేంద్రదేవునికడకు సుదర్శనునికడకు సందేశము గొనిపోయి సాధ్యమైనంత వేగముగా వారిని సేనలతోఁగూడఁ దోడ్కొనివచ్చెద. మహేంద్రదేవునకు సుదర్శనునకునుమీరు జాబులు వ్రాసి సిద్ధముగ నుంచుఁడు. నేను మణివర్మతోఁజెప్పి రేప పయనము జేసెద. నాకు సెలవొసంగుడు." అని పలికి వారి యనుమతి వడసి పోయెను. అతఁడు చన్నపిదప నరవిందాదేవి కుమారునిఁజూచి "నాయనా! నా తండ్రికి వ్రాయవలసినజాబు నేనేవ్రాసెద. సుదర్శనుఁడు పరపురుషుఁడగుటను నే నాతనిపేర నేమియు వ్రాయనొల్ల. ఆ జాబు నీవ లిఖింపుము" అనిచెప్పి తనగదిలోనికరిగి జనకునిపేర జాబు వ్రాయఁ దొడగెను. విక్రమసేనుఁడు తన జాబువ్రాసి తల్లి కిట్లు వినిపించెను.

"శ్రీమన్మాళవమహీపాలు రగు స్వస్తిశ్రీ సుదర్శన మహారాజుగారికి——కాశ్మీర పాలకుం డగు విక్రమసేనుండు వినయపూర్వకముగా నమస్కరించి చేసిన విజ్ఞాపనము.

నాకు మీపరిచయభాగ్యము లేకపోయినను మాజనకుండు హేమచంద్ర మహారాజుగారును మీరును వారణాసీ నగరమున సబ్రహ్మచారులై సహాధ్యాయులై ప్రాణమిత్రులై యుండినందున నేను మీకుం బుత్రప్రాయుండ ననియు మీరు నాకు జనకప్రాయులనియు భావించి చనవుగల్పించుకొని యీ లేఖ వ్రాసి పంపుకొంటిని. ఈ లేఖం దెచ్చిన యతండు మా కమాత్యుండు. మాధవసేనుండు సింధుగాంధార వల్లభులు మా దేశముపై దాడి వెడలుదురని లోకమునం బ్రవాదము గలిగినది. అది యటుండ మాపినతండ్రి చిత్రభానుండు మజ్జనకునిచే దేశభ్రష్టుండు గావింపం బడియు నతని మరణానంతరమున శ్రీనగరముం జొచ్చి చన్న యన్నమీందను నిందున్న యన్నబిడ్డల మీందను నెంతో ప్రేమ నభినయించి సేనల సేనాపతులం దనవశము జేసికొని యేదో ద్రోహము సేయందలంచుచున్నాండు. మాతండ్రిగారి దారుణ మరణముం దలంచియు బాలుండను నిస్సహాయుండను నైన నా దీన స్థితిం దలంచియుం బగతుర బారినుండియు నాప్పుడట్లు మేంకవన్నె పులియైయున్న మాపినతండ్రి బారినుండియు మమ్ముం దప్పించి కాశ్మీరరాజ్య పరిరక్షణము సేయం బ్రార్థించుచున్నాండను. హేమచంద్రమహారాజు బ్రతికియున్నవాం డని మీరు భావింపుండు. 'మిత్ర మాపది జానీయా' త్తను న్యాయమును లెస్సగా గమనింపుండు. ఆర్తరక్షణపరాయణులు, దయాసాగరులు, పరోపకార ధురంధరులు, నిష్కళంక చరిత్రులు, మత్పితృసఖులు నగు మీకు నేనింతకన్న విస్తరించి వ్రాయనక్కఱలేదు. ఈ యమాత్యుండే తక్కిన విష

యము లన్నింటిని మీకుం దెలుపఁగలఁడు. వేయేల ? కాశ్మీరరాజ్యలక్ష్మి మీకు రక్షణీయ మాళవకాశ్మీరంబు లక్కచెల్లెండ్రట్ల యుండవలయునని కోరెద.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

విక్రమసేనుఁడు.

ఆజాబు సామూలాగ్రముగఁ గొడుకు వినుపింప విని సంతసించి యరవిందాదేవి తన వ్రాసినలేఖయుఁ మిత్రుఁడు లిఖించిన జాబును ముసలికంచుకి యగు ముంజునిచేతికిచ్చి మణివర్మకడకంపెను. అతఁడదిచూచి మాధవసేనుని బయనముచేసి పంపెను.

పందొమ్మిదవ ప్రకరణము

ఒకానొక మహాకవి వర్ణించినట్లు నాఁటిరేయి గాఢచీఁకటులు నరుల మేనుల నల్లపూతలు బూసినట్లు గగనమునుండి కాటుకవానలు గురిసినట్లు నలుదెసలవ్యాపించి దుష్టుఁడగు యజమానునికిఁ జేసినసేవయుంబోలె దృష్టి నిష్ఫలమగునట్లు చేసెను. శ్రీనగరమంతయు నిద్రామోహితమై నిస్తరంగమగు సముద్రమట్లుండెను. పగలెల్ల బహువ్యాపారపరతంత్రులై శ్రమపడి యుండుటంజేసి నగరవాసులలో దాదాపుగ నందఱు గాఢనిద్రం దగిలి విశ్రాంతిసుఖ మనుభవించుచుండిరి. పరద్రవ్యాపహర్తలు పరకాంతాసక్తులు మొదలగు దుర్వినీతులుమాత్రము గుహాలవిడి మేఁతనిమిత్తము సంచరించుదుష్టమృగంబులవలె భయపడుచు రాచబాటలు విడిచి సందుగొందులం బడి

ముసుఁగువైచికొని వలయుసాధన సామగ్రుల గ్రహించి తననీడలు చూచి తామె శంకించుచుఁ దమ దుర్యశమువలె లోకమెల్ల నిండిన యా గాఢాంధకారమున సంచరించుచుండిరి. ఆకాశలక్ష్మి తన వేయి కన్నులు దెఱచి నేలపై జరుగుచున్న దంతయుఁ గనిపెట్టుచున్నదో యనునట్లు నభోమండలమున లెక్కలేని చుక్కలు మిణుకు మిణుకు మని మెఱయఁ జొచ్చెను. నూతనపురుషులు మున్నెన్నఁడుఁ జొఱని సందులలోఁ జొచ్చిన తావుల మోరలెత్తి కుక్కలు మొఱుగఁ జొచ్చెను. నగర రక్షణము నిమిత్తమయి నియోగింపఁబడిన రాజ భటులు కొంతసేపు తిరిగి యే యరుఁగుమీఁదనో యే స్తంభముచాటు ననో నిద్రాదేవికి విధేయులై యామెపనుపు చేయుచుండిరి. తెగుళ్ళ చేత నిద్రపట్టక బాధపడు రోగుల మూల్గులు నిలువనీడ లేక వీధులలో నె రిపంచనో నిద్రించు పాంథుల గుఱ్ఱులు చెట్లమీఁద నడుమనడుమఁ బులుఁగుల యెలుంగులు పైనఁజెప్పిన కుక్కలుదప్పఁ బట్టణమున నితరశబ్దమేదియు లేదు.

సేనానివేశముమాత్ర మారేయి మిక్కిలి సందడి గలిగియుం డెను. సైనికులు తమతమ యాయుధంబుల ధరించి సమరసన్నద్ధులై మహోత్సాహభరితులై యుండిరి. దండపాణియు, వజ్రపాణియుఁ గవచంబులు తొడిగి శిరస్త్రాణంబులు ధరించి యశ్వారూఢులై డాలు కత్తులు, విండ్లు నమ్ములు మొదలగు నాయుధవిశేషంబులఁబూని సైనిక లలో ముఖ్యులగువారితో వారు వారు గావింపవలసిన కృత్యంబుల నుపదేశించుచుండిరి. సైనికులలోఁ గొందఱు దండపాణిం గలసి యీ సన్నాహ మెందుకని ప్రశ్నింప నాతఁడు ''ఈసన్నాహము మన రాజ కుటుంబ రక్షణార్థమే. గాంధార రాజపరిజనులు మాఱువేసములు వైచుకొని మనపట్టణంబున సంచరించుచున్నారు. వారిం బట్టవలయు నందునిమిత్తమై యాయుధహస్తులగు వేయిమందిజోదుల మేము తోడ్కొనిపోవుచున్నాము'' అని బదులు చెప్పెను.

"అట్టివారిం బట్టుటకు వేయిమందిచాలుగదా ! తక్కిన సైనికుల నందఱ సిద్ధముగనుండవలయునని యేల చెప్పవలయును ?" అని వారు మరలనడిగిరి. అందుకు దండపాణి యిట్లనియె. "మీరు సైనికులు మేము సేనాపతులము. మేమాయుధములు పూనుమన్న మీరు పూనవలసినదె. ఎవరితలఁ గొట్టుమన్న వారితలఁ గొట్టవలసినదె. ఎక్కడికిఁ బొమ్మన్న నక్కడికిఁ బోవలసినదె. ఏమిసేయుమన్న నది సేయవలసినదె. ప్రశ్నలు వేయుటకు మీ కధికారము లేదు. ప్రబలసమరసన్నాహము చేసి దండనాయకులు దండునడిపించునప్పుడు ప్రతిసైనికుఁడు నిలువఁబడి యెక్కడికి ? ఈదండయాత్ర యెందుకు ? ఇది న్యాయమది యన్యాయమని వితర్కమారంభించినపక్షమున రాజ్యతంత్ర మొక్క నిముసముజరుగునా? సమరములుజరుగునా ? జయములు చేకూఱునా ? ఎవరిధర్మము వారు చేయవలయును. రాజాజ్ఞ మేము మన్నింపవలె మాయాజ్ఞ మీరు మన్నింపవలె. ఇట్టిప్రశ్నలింకెవరైనఁ జేసిరేని నట్టి వారిశిరస్సులు వెంటనే ఖండింపఁబడును" అని దండపాణి కఠినముగా బలికెను. ఆయుత్తరముతో వారు ప్రశ్నలుమానిరి. అప్పుడు దండపాణి సైనికులనందఱ బారులుగా నిలువఁబెట్టి వారితో నిట్లనియె "ఈసమయమున రణదుందుభులు వాయింపఁగూడదు. నాయాజ్ఞలేక మీరు కేకలు వేయఁగూడదు. ఒండొరులతో మాటలాడఁగూడదు. నడచునప్పుడు కాలిచప్పుడు గాఁగూడదు. నేనుముందునడచెదను నావెంటనే గోవు వెంటఁదగిలిపోవు దూడవలె మీరు రావలయును. నే నెవ్వరియింటి దగ్గఱ నిలిచెదనో మీరచ్చట నిలువవలయును. నే నెవ్వరిబంధింపుమన్న వారిని బంధింపవలయును. ఏవిధమైన ప్రశ్నల నడుగఁగూడదు. దీపములు చేతఁబట్టఁగూడదు. అయిదుగురొక్కబారుగా నిలువవలె. వారివెనుక నైదుగురు వారివెనుక నైదుగురు నీవిధముగా వేయిమందియు రెండువందలు చిన్నబారులుగాఁదీరి నడువవలయు. ఈనిబంధన

లన్నియు మనంబునఁబెట్టుకొని నా వెంటరండు." అని సేనాపతి యాన తీయ సైనికులప్పుడే యెదురుగ రేసి యొక్క బారుగాఁ జేరి యొకరి వెనుక నొకరునిలువఁబడిరి. మొట్టమొదట దండపాణియశ్వారూఢుఁడై నడువ జొచ్చెను. వజ్రపాణిసేవకు వెనుక గుఱ్ఱమెక్కి రాఁజొచ్చెను. నిశ్శబ్దముగా మనుష్యవాహిని ప్రవహించునట్లు చిన్నసేన నడచి పట్టణముఁ జేరెను.

రెండుజాములురాత్రి యయ్యెను పట్టణద్వారముకడ నాజానేయతురంగమెక్కి కవచశిరస్త్రాణములు ధరించి యాయుధపాణియైన యొకమహాయోధుఁడు వారింగలిసికొనెను. వాని కిరుప్రక్కల విచ్చు కత్తులతో నలుగురుజోదు లంగరక్షకులుగానుండిరి. గాఢాంధకారమగుటచే సైనికులాతనిని గుర్తింపలేకపోయిరి. కాని దండపాణి తన గుఱ్ఱము నాతనిగుఱ్ఱము సమీపమునకుఁ దీసికొనిపోయి మెల్లగా "సరిగా సమయమునకే వచ్చితివే" యని హెచ్చరించెను ఇంతకుమున్నే వచ్చితినని యాతఁడు బదులుచెప్పెను "మున్ను మనమనుకొన్నట్లు వానిం బట్టుకొనవలసినదేగదా?" యని దండపాణి యడిగెను. "ఆహా! సందియమేమి? అదే ప్రథమకర్తవ్యము తరువాత, నిలువు బట్టి రెండనపని" యని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

ఈసంభాషణము గుఱ్ఱములనడుపుచునే వారుచేసిరి. సైన్యము నిశ్శబ్దముగా వెనుకవచ్చుచుండెను. వారుక్రమముగా రాజవీథింబ్రవేశించి యటనుండికొన్ని ప్రక్కవీథులఁజొచ్చి విశాలమయిన యావరణము-నయ్యావరణములో రమణీయమైనయుద్యానము నయ్యుద్యానమధ్యమున మనోహరమైనసౌధము-గలయొకస్థలముఁ జేరిరి. సింహద్వారము బంధింపఁబడియుండెను. గోడయెత్తుగనుండెను. దండపాణి నలుగురుజోదులంబిలిచి "యీగోడదాఁటిలోపలికిదుమికి తలుపు దీయుఁ"డని యానతిచ్చెను. వెంటనే యొకయోధుఁడునూర్చ్యాడెను.

వానిభుజములపై నింకొకయోధుఁడెక్కెను. అంతట మొదటివాఁడు లేవఁగా వానిభుజారోహణముచేసిన సైనికుఁడు గోడమీఁది కెక్కి యాగోడదఱినున్న చెట్టెక్కి మెల్లగా నావరణములోనికి దిగెను. అట్లె యిద్దఱుముగ్గురు చేసి లోనఁబ్రవేశించి మొదటివానికిఁదోడై కవాటముఁ దెఱచిరి.

దండపాణి నూఱుమందిజోదుల నావరణమునఁ బ్రవేశింపుమని తక్కినవారినింటికి నన్నిదెసలఁ గావలియుంచి యింటిలోనుండి యీఁగయైన నావలకుదాటిపోకుండ చూడుమని యానతిచ్చెను. సైనికులు కడుత్వరితముగా నట్లుచేసిరి.

లోపలిద్వారపుఁ దలుపులకు సూక్ష్మాగ్రములుగల యినుప బొంగడలు వేయఁబడియుండెను. గ్రంథులనడుమ నినుపపట్టీలు తాపటముచేయబడెను. భుజములతోఁ గెంటినఁ దలుపులూఁగవని దండపాణి యుపదేశముమీఁద నిరువురుసైనికులు గొడ్డళ్ళుదీసికొని తలుపులు పగులగొట్టనారంభించిరి. చప్పుడువిని యింటిలోనివారందఱు మేల్కొనిరి. ఎవరువారని మేడమీఁదనుండి యొకవృద్ధుఁడు గంభీరముగఁ గేకవైచెను. మేడక్రిందనున్న వారందఱు దొంగలుదొంగలని యాక్రందనముఁ జేసిరి. చుట్టుప్రక్కలనున్నవారు కొందఱా చప్పుడును గృహములోనున్నవారి యాక్రందనమును నాలకించి వీధిలోనికి రాఁబోయిరి. కాని సైనికులువారి నిండ్లుదాటి రాకుండఁ జేసిరి. తలుపులంతలోఁ బగిలిపోయెను.

దండపాణి, వజ్రపాణి, చిత్రభానుఁడు లోపలఁబ్రవేశించిరి. గృహదీపికలు వెలుఁగుచుండుటచేత వానిసాయమున వారు మేఁడమీఁదికిఁ గొందఱుసైనికులం దీసికొనిపోనసమకట్టిరి. మేడతలుపులుగూడ బంధింపఁబడెను. గృహమునందున్నస్త్రీలు బాలుర సేవకులుదొంగలు

దొంగలని గృహమునంతయుఁ బ్రతిధ్వనులిచ్చు నట్లాక్రందనము జేయుచుండిరి. మేడతలుపులుగూడ గొడ్డలిపెట్టులనలన భేదింపఁ బడెను. మున్ను పేర్కొనఁబడిన మువ్వురు నాయకులు కొంతమంది సైనికులం దీసికొని మేడమీఁదికరిగిరి. మేడమీఁద విశాలమయిన చావడిలో దొంగల నెదిరింపవలెనని చేత ఖడ్గములఁబూని నిలువం బడియున్న వృద్ధుని మణివర్మనుజూచి చిత్రభానుఁడు "సైనికులారా! వీనిచేతిలోని ఖడ్గము లాగుకొని రెక్కలు విఱిచికట్టుఁడు" అని యాజ్ఞాపించెను.

అప్పలుకులతని నోటనుండి వెలువడినవో లేవో వెంటనే యొక సేవకుఁడు ఖడ్గమూడఁదీసికొనెను. మఱియిద్దఱు మాంసహీనములై శల్యచర్మావశిష్టములయిన యాతని రెక్కలం బట్టుకొని వెనుకకుఁ దీసి మోటత్రాళ్ళతో విఱిచికట్టిరి. మణివర్మ వారిం జూచినతోడనే విస్మితుఁడై యొకట మాటలాడలేకపోయెను. తరువాత నించుక తొట్రుపాటులోనుండి వెలువడి మాటలాడఁ గమకించుచుండఁగనే నోటమాట రాకమునుపే యీ దారుణకృత్యము జరిగెను. "మీరావచ్చినవారు? అర్ధరాత్రమున నిల్లుజొచ్చుటచేతను గొడ్డళ్ళతో దలుపులు బగులఁగొట్టుటచేతను నేను దొంగలను కొన్నాను. దొంగలు ధనము హరింతురు. మీరు ప్రాణధనము హరింపవచ్చినారు. చిత్రభానుఁడువచ్చి యిట్టిదుండగము సేయుటలో నాశ్చర్యములేదు. కాని దండపాణీ! ఆవిధమున దేవిగారియొద్దను నాయొద్దను నీవును నీతమ్ముడును రాజభక్తి నభినయించి మీకపకారమెన్నఁడు సేయనివాని నేదోషమెఱుఁగనివాని, బిత్రువిహీనుని, విక్రమసేనుని ద్రోహభావమున విడిచి యీతనిఁ జేరుట మిమ్ము మొదటినుండియు నెంతో గారవమునఁ జూచి మహోన్నత పదవిలోనికిఁ దెచ్చిన నన్ను శతవృద్ధుని బద్ధునిఁ జేయుట మహాశ్చర్యము గొల్పుచున్నది. పూర్వుదండయనుకొన్నది పామయినది. ఇంద్రనీలము

మసిబొగ్గయినది. మీరు గావించిన రాజద్రోహమునకు మీయన్న దమ్ము లిరువురు నిహపరలోకముల రెంటనుగూడఁ దగినఫలం బనుభవింతురు.'' అని మణివర్మ కోపావేశమున నెఱ్ఱబాఱిన మొగముతోఁ దడబడునట్లు పలుకుచుండ నంతలో జైత్రభానుఁ డడ్డముతగిలి యా వృద్ధామాత్యు నుద్దేశించి యిట్లనియె.

ఓరీ, దురాత్మా! వృద్ధమర్కటమా! కాదుకాదు. వృద్ధజంబుకమా! విక్రమసేనునకు వారు ద్రోహముచేసిరా? ఇట్లనుటకు నీకు నోరెట్లాడెనురా? నీకాత్మలేదా? అంతఃకరణములేదా? సిగ్గులేదా? మహానుభావుఁడైన హేమచంద్రుని మాయోపాయములు బన్ని చంపించి విక్రమసేనునికి మహోపకారముఁ జేసిన దుర్జనుఁడవు నీవు. మొదటినుండియు నాకును నాయన్నకును స్పర్థలు గలిగించి వైరానలము వృద్ధినొందించి నన్ను దేశమునుండి వెడల నడపించిన పాపాత్ముఁడవు నీవు. విక్రమసేనుండను వాలునిపేరుపెట్టి కాశ్మీర రాజ్యమంతయు నేకచ్ఛత్రముగ నేలుచుఁ బ్రజలను దరిద్రులనుజేసి ధనములు దోఁచుకొని కుబేరుఁడనగుచున్న కుచ్ఛితాత్ముఁడవు నీవు. సింధు గాంధార మహీధవులను నిక్షేపము వంటి యీ దేశములమీఁద దండెత్తిరమ్మని యాహ్వానించి కొన్ని యగ్రహారములు వాని వలన లంచముగా గ్రహించి దేశమును, దేశస్థులను, రాజకుటుంబమును మా కులగౌరవమును వారికి విక్రయింపఁదలఁచిన నీచాతినీచుఁడవు నీవే. పాన్పుమీఁది పామువలె మా యన్నయొద్ద నీవు మంత్రివైయుండి యెట్టకేల కాతని దుదముట్టించిన పాతకుఁడవు నీవే. నిన్ను నమ్మి యాయన ప్రాణముఁ గోలుపోయెను. రాజ్యము నీకప్పగించి బిడ్డల నీకప్పగించి యాయన బలవన్మరణము నొంద నీవు దేశ మితరుల కప్పగించుచుంటివి. మా యన్నబిడ్డలను భార్యను బరామర్శ చేయ నేనిటకు వచ్చియుండ నన్నూరువిడిచి పొమ్మని యాజ్ఞాపించిన యమాత్యశేఖరుఁడవు నీవేగాదా? నన్ను

బొమ్మనుటకు నీ వెవ్వఁడవు? ఈ రాజ్యము నీ యబ్బసొమ్మా? నీ తాతసొమ్మా! నా యన్న రాజ్యము నా తండ్రి రాజ్యము. మాయన్న చెవులలో విసముపోసినాఁడు నన్ను వెడలఁగొట్టించి నేఁడు ను నట్టియాటలే యాఁడఁజూచితివి. నీయాట లంతమొందు సమయము వచ్చినది. నీదుశ్చరిత్రము వెల్లడియగుకాలము వచ్చినది. నీమలిన వర్తనపుగోడకు నేఁటినుక మాయ యనువెల్లవైచి జగద్వంచనముఁ జేసితివి. ఇప్పు డేమిచేసెదవు! కాశ్మీరరాజ్య ప్రధానమంత్రుల భుజములు విఱిచికట్టఁబడిన వేమి? మీదుస్తంత్రము లిప్పుడు సాఁగ వేమి! ఇప్పుడయిన బుద్ధిగలిగి బ్రతుకుము." అని యతఁ డూరకుండ దండపాణి "అయ్యో మారాక మీ కాశ్చర్యముగా నున్నదా? మేము విక్రమసేనుని మోసపుచ్చితిమా? ఇంకను మహాశ్చర్యము జూచెదవు గాక నీకన్న మే మెక్కువ వంచకులముగాము. నీవు గావించిన ద్రోహములకన్న మే మెక్కువ ద్రోహములు చేయఁజాలము. నీవు ద్రోహముల పుట్టవు. నీ వితరుల నే విషయమున దూషింపనవసరము లేదు. నీ చేసిన యపచారములకన్నిఁటికి ఫలముగా భగవంతుఁ డీ పాట్లు దెచ్చె" నని యతఁడు తన్ను మొదట నాడినమాటల కుత్తర మిచ్చెను.

అప్పుడు మణివర్మ సగము పండ్లూడిపోవుటం జేసి కొంతబోసి గానున్న నోటనుండి కొన్నిమాటలు తెలియకుండునట్లు వారికిట్లనియె. "చిత్రభానుఁడా! పిల్లి కన్నులుమూసికొని పాలుద్రావి తన్నెవ్వరుఁ జూడలేదని సంతసించును. అట్లే నీ కావించిన మహాపాతకములులోకు లెఱుఁగరని నీవు భ్రమించి పరమపవిత్రుఁడట్లు - నిష్కళంకవర్తనుడట్లు- నిరపరాధులగు నితరులపై దోషారోపణముఁ జేయుచుంటివి. నీ వర్తనము చక్కఁగా నరసియే నీయన్న నీవు పాముకన్నఁదోడేలుకన్నఁ-బెబ్బులికన్నఁ-గ్రూరుఁడవని నిన్ను దేశభ్రష్టునిఁ జేసెను. నీ సంచారములన్నియు వక్రములు. నీపలుకు లన్నియు నసత్యములు. నీ

హైదము లన్నియు దురాచారములు. నీది హృదయము గాదు. ఱాతి ముక్క. నీ కంతఃకరణము లేదు. దయలేదు. దాక్షిణ్యము లేదు. ఎగ్గులేదు. సిగ్గులేదు. ఆశాదేవత నిన్నావహించినది. భ్రాతృహంతవు ఏకగర్భజనితుండైన సోదరుని జంపించిన మహాపాతకునకు ఆ నెత్తురు కూడు భుజించి సుఖంపందలంచిన పరమదుర్మార్గునకు- జగద్వంచనమే ప్రధానవ్యాపారముగాంగలఖలునకు నీకుంగ్రుడ్డివానికింబట్టపగలుగూడ నంధకారమయమై తోచునట్లు, మావలటి రాజభక్తులు, మావంటి ధర్మమార్గానుచరులు, మావంటి నిరపరాధులు, దురాచారులుగాం గనంబడుటలో నాశ్చర్యమేమున్నది? నీవు మీ యన్నగారి దారపుత్రుల బరామర్శించుటకు రాలేదు. ఆపసికూనలంగూడం గడతేర్చి యీ గద్దియ నాక్రమింపం దలంచివచ్చితివి. ఆ యభిప్రాయముతోనె యేదో మెఱబెట్టి యీ దండనాథుల వశముం జేసికొంటివి. ఈ సేన స్వాయత్తము జేసికొంటివి. ఈమూర్ఖులు నీమాయలలోంబడిరి. సింధు గాంధారరాజుల దండయాత్రా కథలు నీకల్పించిన ప్రబంధములు. అవియెల్ల నీదు తంత్రములు. ఈవంక బెట్టి వీరింజంక బెట్టుకొంటివి. హతవిధి హేమచంద్రునకు, వానికుటుంబమునకుం బ్రతికూలుండై యుండుటంజేసి నీయాగడములు సాంగుచున్నవి. పరమేశ్వరుండొక్క డున్నపక్షమున నతండు దయాళుండైన పక్షమున - శిష్టజనసంరక్షణంబును, దుష్టజనశిక్షణంబును వానికి నైజములైనపక్షమున - ధర్మమను నదీప్రపంచమున నున్నపక్షమున—''సత్యమేవ జయతేనానృత''మ్మను వేదవాక్యములు సత్యములైనపక్షమున వేదశాస్త్రంబులు ప్రభావంతములైన పక్షమున నేండుగాకున్న మఱియొకనాండయిన నీవొనర్చిన మహాపాతకములకుం బ్రతిఫలముగా నీవు భగ్నమనోరథుండవైన సర్వవిధములంజెడినీచమరణంబు నొందకపోవు. నీచేసినదుశ్చేష్టలు ప్రాయజాలక చిత్రగుప్తుండు సైతము నీయంతముం గోరుచుండును. నీనిమిత్తమై

యమధర్మరాజు క్రొత్తనరకము నిర్మింపవలెను. విక్రమసేనుని గర్భము చెడఁ బుట్టితివి. కాశ్మీరరాజ కుటుంబమునకుఁ గలంకముఁ దెచ్చితివి. హరిశ్చంద్రుఁడు, రామచంద్రుఁడు భీష్ముఁడు, యుధిష్ఠిరుఁడు రఘువు, రంతిదేవుఁడు మొదలగు మహనీయులైన రాజర్షులకు జన్మకారణమైన క్షత్రియ వంశము నీవలన మలినమై యవమానిత మైనది. చల్లని చంద్రుఁడు పొడమిన పాలసముద్రమునందు హాలాహలము పుట్టినట్లు ధర్మస్వరూపుఁడు హేమచంద్రుఁడు పొడమిన సద్వంశమునఁ బరమనీచుఁడవు పరమపాతకుఁడవు నీవుసంభవించితివి. నీ వెన్ని ధర్మపన్నములు జెప్పిన నమ్మువారు లేరు. నీవన్న నించుకైన నాఁకు గౌరవముగాని భయముగాని లేదు. నీబంట్లు నాకించుకేనియు వెఱపు గొలుపలేరు.'' అని యంతతో నాఁగక మణివర్మ వెండియు రూక్ష వచనంబులఁ బలుకఁ బోవుచుండ నొకసేవకుఁడు ''స్వామీ! వీని కుత్తుక నుత్తరింతునా? సెలవైన వీనితల తాటిపండువలె మీయడుగులకడఁ బడవేయుదు. దేవరవారికి వీనియందు నింతశాంత మెందు'' కని ఖడ్గపాణియై ముందఱకు వచ్చెను. చిత్రభానుఁడు వానిని వారించి ఓయీ నీభక్తికి సంతసించితిని. బంటువైన నీకున్న భక్తిలో సహస్రాంశ మీ పాపకర్మున కున్నపక్షమున మారాజ్య మింతవఱ కేల వచ్చును? కాని వీని నిపుడు చంపవద్దు. ఈ చాటుచావు వీనికిం దగదు. వీని బహిరంగప్రదేశమున జెట్టునకుఁగట్టి యురిదీసి మాసొమ్ము దినుటఁచే బెరిఁగిన వీని మాంసము కాకులు గ్రద్దలు దినునట్లు వీని కళేబరమును రుద్రభూమిలోఁ బడవేయవలెను. కావున వీని నిప్పటికి రక్షించితి'' నని బంటు నావలకుఁ ద్రోసివైచెను.

''ఓహో! నన్నిప్పటికి నీవురక్షించితివా! దయామయుఁడవు గావున మహోపకారముఁ జేసితివి. నేను మరణమునకు భీతిల్లువాఁడను గాను. నీవంటి పందలు మరణమునకు వెఱతురు గాని, నేను వెఱువ,

నేను వృద్ధుఁడను. రేపో నేఁడో చావవలసిన వాఁడను. నీచేత జచ్చినను నేఁడో తెగులుచేతఁ జచ్చినను నాకొక్కటే. పరమేశ్వరుఁడు ప్రపంచమున మానవ వినాశముకొఱకుఁ గొన్నితావుల మహామారకములైన తెవుళ్ళను, మఱికొన్ని తావుల నీవంటి దురాత్ములను సృజించుచుండును. రోగములును మీవంటివారును సన్నిహితజ్ఞాతులు. జగద్వినాశనమునకై జనియించుచుందురు. నేను మరణించినను జీవించినంతకాలము విశ్వాసముతో స్వామికార్య నిర్వహణ ప్రవీణుఁడ నగుటచేతను. మనోమాలిన్యములేక నడచుటచేతను, పరవంచనావిముఖుఁడ నగుటచేతను, నాకుత్తమగతులు ప్రాపించునని నమ్మిక గలదు. జన్మాంతర మొందినను నేను మరల నరజన్మమే పొందుదును. ఇంక నీవు మృతినొందితివేని మహానరకములలో స్త్రీహంతలు శిశుహంతలు గురుహంతలు మాతాపితృ భ్రాతృహంతలు మొదలగు మహాపాతకులు వోవు దుర్గతులకుఁ బోవుదువు. ఒకవేళ జన్మాంతర మొందినను, నుత్తమమగు మానవజన్మ మెత్తక పాముఁ బెద్దపులి మొదలగు ఘాతుక మృగజన్మమో లేక హేయమైన కీటకజన్మమో నీవెత్తుదువు. మరణాంతరమున నాకళేబరమును నీవెక్కడబాఱవైచినను నాకు విచారములేదు. నామాంసము పక్షులుతిని యాకలిదీర్చికొనుటచేఁ 'పరోపకారార్థ మిదంశరీర' మ్మను మాట యొక్కింత సార్థకమైనదని నేను సంతసింతును. శరీరము భగవానుఁడైన యగ్నిదేవున కాహుతియైనను మంటిపాలైనను, విహంగముల కాహారమైనను నామనంబునకు విచారంబు గలుగదు. విగత ప్రాణమైనవెనుక వట్టికట్టెవంటి యీదేహ మేమైన నేమి ? అది నీ నైచ్యమునే తెలియఁ జేయును. నీదార్జన్యమునే ప్రకటించును. నీఘాతుకవృత్తినే వెల్లడించు నీక్రౌర్యమునె చాటును. అది నే చూడఁబోను.' అని మణివర్మ నిర్భయముగా నిశ్చలమనస్సుతోఁ జిత్రభానుని దూలనాడెను.''

"ఓహో! నేను పండను. నీవుదంతిమగఁడవు. నీకు భయము లేదు. నిజమే! ఇదియొక్కటియే నీనోట వెడలినసత్యము. నీకు దేవుని భయము లేదు. పాపభయములేదు. లోకాపవాదభయములేదు. నీవంటివారికేయుత్తమగతులు వచ్చినపక్షమున జారులకుత్తమగతులు చోరుల కుత్తమగతులు, రాజద్రోహుల కుత్తమగతులు, నీవు జేయుదు వేని యవియుత్తమగతులన్న పేరు గోల్పోవును. నీ ప్రేలరితనము మేమెఱుఁగుదుముగాని నీవు ధనమెందు దాఁచితివో చెప్పుము. కాశ్మీర రాజ్యమంతయు దోఁచుకొని నీయిల్లునిధినిక్షేపములతో నింపితివని వినుచున్నాము. అవియెల్లనిక్కడ గ్రక్కుము.' అని చిత్రభానుఁడు వాక్రుచ్చెను.

"నేను ధనము సంపాదించినమాటకల్ల. మానధనమునాకడఁ గలదు. యశోధనము కొంతకలదు. ధర్మసాధనమేసాధనము. ఇంత కన్న నాదగ్గఱ ధనములేదు' అని మణివర్మ జెప్పెను.

ఆహా! నీకుమానధనములు యశోధనములుగూడగలవా? భూమి మీఁదనవతరించిన దంభుఁడవేనీవు. ఈయాత్మస్తుతి కేమిగాని ధన మెక్కడనున్నదో చూపుము. చూపవేని నీగ్రుడ్లు దీయించెద. నీనె త్తురుకుక్కలు నాకునట్లు గుఱ్ఱముల గొట్టు కశలతో జీమలచింతకు నిన్నుఁ గట్టించి కొట్టించెద ఓరీ! జోదులారా! గుడ్డ లాముదములో ముంచి వీనిచేతులకుం గాళ్ళకుం జుట్టినిప్పంటించుఁడు. అవికాగడాల వలె వెలుఁగవలయు. అప్పుడుగాని వీఁడుధనము దాఁచినచాటు చో టులు జూపఁడు. నేనన్నంతపని జేయించెద. జాగ్రత్త. నీవువృద్ధుఁడ వని బ్రాహ్మణుఁడవనిచూచువాఁడనుగాను. వజ్రపాణీ! మేడదిగి వెళ్ళి స్త్రీలశరీరములమీఁదఁ నున్న నగలన్నియుఁ దీసి కొనిరమ్ము. తమంత టతాము నగలనొసఁగ రేని సాహసికులగు నీబంట్లను వారిమీఁదఁ

కంపి యుంగనలని సంశయింపక, సర్వాభరణముల దీయింపుము. ఆఁడువాండ్రను స్పృశియించిరని యవమానించిరని పరుషోక్తులాడిరని నేనువారినిదండింపను.'' అని చిత్రభానుఁ డానతిచ్చెను.

అనవుడు మణివర్మ యిట్లనియె. ''నీకావించుపాపముల దండలో నింకను కొన్ని గ్రుచ్చవలసియున్నవి. ఇప్పుడుతలపెట్టినదుష్కృత్యములు దండను పూర్తి చేయఁగలవు. కానిమ్ము! గ్రుడ్లుదీయించినను నాకు వెల్తి లేదు. గ్రుడ్లున్నపక్షమున నీవంటిపాపాత్ములను జూడవలసివచ్చును. బాహ్యనేత్రములు లేకున్నను మనోనేత్రముతో ఫాలనేత్రునిజూచుచుఁ గాలముఁబుచ్చెద. ఎన్నిదెబ్బలు నీవునన్నుఁగశలతోఁ గొట్టింతువో నన్నియు వడ్డితో నాపక్షమున దండధరుఁడు నీకిచ్చును. భగవానుఁడైన యగ్నిహోత్రునకు నాశరీరము మరణానంతరమైన నాహుతికావలసినదే. అదిజీవించియుండఁగానె యైనపక్షమునఁ గడుంగడుమేలుగదా! రక్తమాంసహీనమై యెండుకట్టెవలెనున్న నాశరీర మామహాత్మునకు నల్పకాలమే వినియోగించునని విచారించెద. అదియునుఁగాక భర్తృమృతినొందినప్పుడు మహాపతివ్రతలగు మనదేశపుటంగనలు మగనికాటిపై నెక్కి పదియాఱువన్నె పసిండికెనయగు తమమేనుల నగ్నిహోత్రునకు నిర్వ్యాజముగాఁ గంటఁదడికైనఁ బెట్టక యమ్మా యనక యబ్బ యనక యాహుతులుగా సమర్పించుచున్నారు. అట్టియాఁడువాండ్రే యబలలే యట్టి సాహసములు చేయుచుండ మగవాఁడ నయిననేను క్షణముసేపు భగవానుఁడైన వీతిహోత్రుని గౌఁగలించుకొనియుండఁజాలనా? ''మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః'' అని యమృతబిందూపనిషత్తు చెప్పుచున్నది. మనుష్యునిబంధమునకుఁగాని మోక్షమునకుఁగాని మనస్సేకారణము. మనస్సుస్థిరపఱచుకొన్నవారికి మున్నీరు మోకాలుబంటి, గండకత్తెర పుష్పమాల, అగ్నిప్రవేశమా

కారాగ్రవేశము, మరణము దేశాంతరప్రయాణము. కావున మమ్ము నీబెదిరింపులు వెఱపింపఁజాలవు. అవి చిన్నబిడ్డలకడఁ జెప్పుము. నేను మృత్యుదేవతకు సమీపమందున్నవాఁడను. వాడికోఱలు గల యా భయంకరముఖ మీవలకే నాకగపడుచున్నది. వృద్ధుని జంపె నను యప్రతిష్ఠ నీకు వచ్చుటకై నీకీదుర్బుద్ధులు పుట్టినవిగాని నే నెట్లయిన మరణింపకమానను. నాకడ ధనముమాత్రములేదు. నీ యిచ్చవచ్చినట్లు చేసికొమ్ము. బ్రాహ్మణుఁడని వృద్ధుఁడని, శంకలు గాని జాలిగాని నీకుండునని నేనెన్నఁడు దలంపలేదు.''

ఈ సంభాషణము జరుగుచుండఁగానే వజ్రపాణి సౌధముదిగి దిగువభాగమునకు వెళ్ళి మణివర్మభార్య మొదలగు స్త్రీజనమును నిర్బంధించి సమస్తాభరణములను దీసికొని తెచ్చెను. అంతటఁ జిత్ర భానుఁడు వీఁడు ధనమున్నతావులు చూపలేదు గావున వీనిని క్రూర దండనల పాలుచేయవలయు. అప్పని యిచ్చట చేయఁదగదు. వీనిం గారాగృహమున బంధింపుఁడు. అచ్చటనే చిత్రవధ చేయవచ్చును. వజ్రపాణీ! ఆ యాభరణంబులు నీకడనే యుంచుము. మెఱియలవంటి నలువురు జోదులను వెంటనిచ్చి వీనిం గారాగృహమున కనుపుము. అచ్చట వీనిని బంధించి నిరంతరము పదుగురుభటులు కావలియుండ వలయు''నని యానతిచ్చె 'నట్లే' యని వజ్రపాణి మొఱకులగు నలుగురు కఱకుబంట్ల బిలిచి మణివర్మఁ దోడ్కొనిపొమ్మని చెప్పెను. వారాతని రమ్మని లాగి తోడ్కొనిపోయిరి.

కాలవశమున వచ్చు సుఖదుఃఖముల ననుభవింపక తీఱదని లోకజ్ఞానసంపన్నుఁడగు మణివర్మ తన నివాసగృహమును విడిచి కారాగృహమున కరిగెను. చిత్రభానుఁడు ససైన్యముగా దండనాథ యుక్తుఁడై పిమ్మట మాధవసేను గృహమునకరిగెను. అదియుఁ గవాటభేదముఁ జేసి ప్రవేశించి చూచునప్పటి కయ్యమాత్యుఁడు లేక

పోయెను. వానిగృహము గూడ దోచుకొని వారు పిమ్మట కోడికూత వేళకు గదాధరుని యింటికిం జని యాతనిబంధించి యాతనియిల్లు కొల్లవెట్టి పిమ్మట శూలపాణిమందిరమున కరిగి వానిబంధించి యాతని గృహముం దోఁచుకొనిరి. అంతలోఁ బ్రభాతమయ్యెను.

ఇరువదియవ ప్రకరణము

రాజ్యలక్ష్మి తాను చిత్రభానునివశము గావలసివచ్చినందుకు విలపించుచున్నదో యన్నట్లు పులుఁగులయెలుంగులు నలుదెసల నెసంగెను. చిత్రభానుని బారిఁబడకుండఁ దన్నుగావుమని యామె పరమేశ్వరుం బ్రార్థించిన తెఱంగుఁ గాకులు కావు కావుమని యఱచెను. కోపోద్దీపితమయిన చిత్రభానుని నెమ్మొగంబుపగిది భానుమండలము పొడుపుగొండపయి జపాకుసుమశోణంబై కనంబడెను. రాజ్యరమాదేవికి మున్ను తోడై నిలిచినమిత్రులందఱుఁ గ్రమక్రమంబుగ వెనుకబడినట్లు తారకలదృశ్యములయ్యెను. చిత్రభానుని పన్నుగడలు గూఢభావమునుమాని వెల్లడియైనట్లు చీకటి యంతరించి వెలుఁగుదోఁచెను.

చిత్రభానుని యాజ్ఞాప్రకారము సైనికులు గదాధరశూలపాణులంగూడఁ జెచ్చెరఁజెఱలోఁబంధించి కాల్యకృత్యంబులఁ దీర్చికొనుటకు నిజనివాసంబుల కరిగిరి. దండపాణియు వజ్రపాణియు నిర్వర్తితకాల్యకృత్యులై చిత్రభానుసమేతముగ జాముప్రొద్దెక్కునప్పటికి సేనానివేశమున కరిగిరి. విక్రమసేనునియెడ భక్తిగల సైనికులనేకులు మణివర్మయొక్కయు గదాధర శూలపాణులయొక్కయు బంధనము విని

శోకించిరి. వారల్పసంఖ్యాకులయినను దమ్ము నడపింపు నాయకుండున్న పక్షమున మహోత్సాహముతో వెంటనేచని వృద్ధామాత్యుని సేనాపతులను బంధవిముక్తులం జేయదలంచిరిగాని గదాధరశూలపాణులు సయితము కారాగారబద్ధులగుటచేన త్తఱిం జేయునది లేక దైవము హేమచంద్ర కుటుంబమునకు విముఖుండై యున్నాండని తలంచియూరకుండిరి తక్కినవాండ్రందఱు మనసులో విక్రమసేనునిమీంద గొంత యభిమాన మున్నను దమయభిమానము నిష్ప్రయోజనమగుటచే రెండవ పక్షమునం జేరుట లాభకరమని చిత్రభానునిపక్షముం జేరిరి. బలహీనుల విడిచి బలవంతులు జేరుట లోకులకు నైజమేగదా!

మణివర్మ ప్రముఖులను జిత్రభానుండు జెఱలోనుంచెనని వారి యిండ్లు కొల్లగొలెనని నగరమంతట వెల్లడియయ్యెను. చిత్రభానుని బిట్టలుకయను పిట్టపిడుగు లింకెవ్వరిమీందం బడనున్నవోయని పౌరులలో ననేకులు గుండెలు చేతంబట్టుకొనియుండిరి. విక్రమసేనుని కొలువులో నున్న గొప్పయుద్యోగస్థులుంగూడ భీతచేతస్కులయిరి. ధనవంతులు చిత్రభానుండు తమయిండ్లు గొల్లబెట్టునేమో యనుభయమునం దమతమవిత్తంబులు నాభరణంబుల భూగర్భంబున నిక్షేపించిరి. ఎక్కడంజూచినం జిత్రభానునిమండగములే ప్రజలు చెప్పుకొనం జొచ్చిరి.

ఆ విషయము రాచనగరునందుం గూడ దెలిసెను. విక్రమసేనుండు మిక్కిలి యాశ్చర్యమునొంది తల్లికావార్త నెఱింగించెను. అరవిందాదేవి పిడుగువంటి యవ్వార్తవిని "కటకటా! వృద్ధుండైన మణివర్మ కారాబద్ధుడయ్యెనే" యని జాలినొంది గదాధరాదులను గూడ బంధింపబడుటచేం దమకు గృహమందున్న పరిచారకులుదప్ప నితరులయిన యాప్తులు నగరమందు లేరని విచారించి మోక్షణమందో

తమకుఁ గూడ నేదో మహాపాయమువాటిల్లునని నిశ్చయించుకొనిరి. మాధవసేనుఁడు సుదర్శనునకు రాయబారమెఱిఁగించి సాయమునొని తెచ్చు నప్పటికిఁ గార్యము పాకముదప్పుననియుఁ దమకు రావలసిన యిక్కటులన్నియు వచ్చుననియు వారు తలంచు చుండిరి.

అంతలో గడచినరేయి మణివర్మ ప్రముఖులమీఁదికిం జనిన సైనికసహస్రము వెంటరాఁ జిత్రభానుఁడు దండపాణి వజ్రపాణులు తనకిఱుగెలంకుల నడువ రాజవీథినుండి కోటవైపునకు వెడలెను. రాత్రి కొందఱి వంతయినది. పగలు కొందఱివంతు వచ్చినదని పురజనులు భయభ్రాంతులయిరి. కొందఱు తలుపులు మూసికొనిరి. కొందఱు మేడలెక్కి చూచిరి. కొందఱు దొడ్డిదారినిఁ బౌరుగూళ్ళకుఁ బయనమై పోయిరి. అందఱు నెవ్వగచే భోజనములుమాని కూర్చుండిరి. "హా! హేమచంద్రా! నీకును నీసంతతికి నెట్టి దురవస్థ వాటిల్లినది!" అని కొందఱు వెచ్చనూర్చి విచారించిరి.

అట్లు సేనాసమేతముగఁ జిత్రభానుఁడు కోటకుంజనినయెడ భయపడి కావలివాండ్రు నిశ్చేష్టులయిరి. ఎవరియాటంకము లేక సత్రమును బాటసారులు జేరునట్లు జిత్రభానుఁడు ససైన్యముగఁ గొలువుకూటముఁజొచ్చి యుం దాసీనుఁడయ్యెను. అంతఃపురమున హాహాకారములు సెలంగెను. హర్షవర్ధనుఁడు మిక్కిలి భయంపడి యన్నకడకు బోయెను. నర్మదభయముచే గడగడవడఁకి యరవిందాదేవి పాదములపైఁబడెను. ఆమెయు నివ్వెఱపడి నోటమాటలేక గోడకుఁ జేరబడి కూర్చుండెను. అంతలోఁ జిత్రభాను డంతఃపుర పరిచారకుని రావించి విక్రమసేనుని నరవిందాదేవిని దానుచూడవలయునని చెప్పెను. ఆ కంచుకి యవ్వార్త వారికిఱుపుర కెఱిగించి రావచ్చునని చెప్పెను. అప్పుడు చిత్రభానుఁడు ఖడ్గహస్తుఁడై యంతఃపురముఁ బ్రవేశించి

విక్రమసేనుం డెదుర్కొని సన్మానింప లోపలిగది జొచ్చి యుచితాసన మునం గూర్చుండెను. విక్రమసేన హర్షవర్ధనులు వానిప్రక్కం నిలువం బడియుండ వారి నతండు గూర్చుండం బనిచెను. ప్రక్కగదిలో నర విందాదేవి యుండెను, అప్పుడు చిత్రభానుండు వదినకు వినంబడునట్లు గుమారులతో నిట్లనియె.

"కుమారా! నేనిప్పుడు సేనాసమేతముగ నీకోటం జొచ్చితినని నీవు భయంపడనక్కఱ లేదు. నేను నీకెట్టికీడుం జేయందలంచి రాలేదు. నామనస్సు స్ఫటికమువలె నిష్కళంకమైయున్నది. మీామొద నాకెట్టి ద్వేషమునులేదు. కాశ్మీరరాజ్యము నీయది. నీవు దానికి నిరంకుశ ప్రభువవు. నీతమ్ముడు హర్షవర్ధనుండు యువరాజు. నీవు రాజువై యుండ నీ యనుమతిలేక నీసేనాపతులను నీదళములను వశము చేసికొని నేను కడచినరేయి గొన్నిసాహసంబులు చేసి నేడు మహాసాహసంబున సేనాసమేతముగ నీకోటకువచ్చుటకుం గారణంబేమియని నీవె యడుగ వచ్చును. బాలుండవగుటచే భయమున నీవడుగకున్నను నట్టిప్రశ్న నీవడిగినట్లే భావించి దాని కుత్తరము నే జెప్పవలసినవాడ. కాశ్మీర రాజ్యమును జూడ నెందఱకో కన్నెఱ్ఱగా నున్నది. గాంధారవసుంధ రాధిపుండు దీనిపై దండువెడలందలంచి యున్నాండు. చతురంగబల సన్నాహము జరుగుచున్నది. ఈవఱకే యాతండు బయలుదేఱి యుం డును. దక్షిణమునుండి సింధునాయకుండగు పరంతపుండు బెబ్బులి మేకపై దుముకునట్లు మనవిషయంబుపై నుఱుకందలంచున్నాండు. పరంతపుండు పరంతపు డనుటకు సందియములేదు. భాగ్యవర్ధనుండు మనదేశము జయించి నిజభాగ్యవర్ధనుం డగును. ఆ నరపాలురిద్దఱు మనమంత్రులను మనసేనాపతులలో గొందఱిని వశవర్తులుగాం జేసి కొని యున్నారు. మన ప్రధానామాత్యుండు మణివర్మను, ద్వితీయా మాత్యుండు మాధవసేనుండును బరమనీచులై యాత్మలాభపరాయ ణులై ధర్మదూరులై దేశమును బరరాజులకు విక్రయింపందలం

చున్నారు. దానికిం దగిన సాక్ష్యము నాకడ నున్నది. మాయన్న వారియందే విశ్వాసముంచి చెడిరి. మీరును వారినేనమ్మి చెడు చున్నారు. మాయన్నం జంపించిన మహాపాతకుఁ మణివర్మ. కొన్ని గ్రామముల కాసపడి కొంతధనమున కాసపడి గొప్పబిరుదుల కాసపడి మేటిపదవుల కాసపడి కాశ్మీరమును గోవును కటికవాని కమ్మినట్లు సింధుగాంధారరాజుల కమ్మ మణివర్మ దలఁచుచున్నవాఁడు. మణివర్మ యనగా దేనెబూసినకత్తి. మణివర్మయనఁగా మేఁకవన్నె పులి. మణివర్మ యనఁగా బ్రాహ్మణ వేషముతోనున్న చండాలుఁడు. మణివర్మ ప్రక్కలోఁబాము. నీవు బాలుఁడవు. నీతల్లి శుద్ధాంత కాంత కావున మీ రిరువురు వ్యవహార మెట్టిదో యెఱుఁగరు. నీవు నీతండ్రివలెనే మాయామర్మము తెలుంగనివాఁడవు. ఎవరేమి చెప్పిన నదినమ్ముదువు. తెల్లనివన్నియు పాలనియు నల్లనివన్నియు నీళ్ళనియు విశ్వసింతువు. రాజనీతియందు నీవు సంపూర్ణకుశలుండవుగావు. పాపమునీకువయస్సేది! ఒకచెంపగొట్టినఁ బాలు నొకచెంపగొట్టిన నీరుగారు లేఁతప్రాయము గదా! అంతలోనే విద్యాభ్యాసము సమగ్రము గాకుండ జనకునిచావు రాజ్యభారవహనము మనోవ్యథా ప్రారంభము మున్నగు నిక్కట్లు గలిగినవి. దేశమిట్టి దుర్దశలో నుండుటచే నిన్నరేయి దుస్తంత్రకారకుఁడును దేశద్రోహియు రాజద్రోహియు నైన మణివర్మను బట్టి బంధించితిని. మాయలాడు మాధవసేనుఁడు లేఁడట. వాఁడు వచ్చినతోడనే బంధించెదను. గదాధర శూలపాణులు మణివర్మ శిష్యులైయె దళములను మనకు విరుద్ధముగా నడపింపఁ దలఁచుచున్నారని తెలిసి వారినిఁ గూడఁ గారాగృహ బద్ధులఁజేసితి. సింధుగాంధార ప్రభువులు చతురంగబలములతో మహాసన్నాహముతోఁ దండువిడిసినను మన కింక భయములేదు. అంతః శత్రువులయిన మణివర్మ ప్రముఖులు బంధింపఁబడిరి గావున బాహ్యశత్రువులు సులభముగా నిర్జింపఁబడు

దురు. ఇఁక మీరందఱు గుండెలపైఁ జేతులువైచికొని హాయిగా నిద్రింపవచ్చును. మనసైన్యమునంతను నేనే నడపి కదనరంగము నకుం గొంపోయి బల్లిదులగు పగతుఱ జయించి చెల్లాచెదరుగఁ దోలి కాశ్మీరరాజ్యలక్ష్మిని సుస్థిరముగఁ జేసెద. మీరిందేయుండుఁడు. నీవు చేతవిల్లుదాల్పకుండ, జెక్కుచెదరకుండ, మెడలోని పువ్వుల దండయైన నలుగకుండ, మేనం జెమ్మటయైనఁ గ్రమ్మకుండ, నవలీలగ నరిబలంబుల జయింపఁగలవు. మేమందఱము మీబంట్లము. ఈదండ పాణియు వజ్రపాణియు నీకు ద్రోహులుగారు. రాజ్యపరిరక్షణము నిమిత్తము నీనిమిత్తము వారు నన్ననుసరించిరి. నాయన్నరాజ్యము, నాయన్నబిడ్డల రాజ్యము, పరాక్రాంతమగుచుండగా నన్నుఁగానట్లు నేమూరక జూచుచుండుటకంత యభిమానహీనుఁడనా? పరాక్రమ శూన్యుఁడనా? పుట్టినది రాచపుట్టుకగాదా? మూతిమీఁదనున్నది మీసముగాదా? చేతఁబట్టినది ఖడ్గముగాదా? నాయన్నకు నాకు మనస్పర్ధలుండిన నుండుఁగాక! 'మరణాంతాని వైరాని' యని మహాను భావుడైన వాల్మీకి చెప్పియున్నాఁడు. ఆ మనస్పర్ధ లాయనతోనే పోయినవి. పసిబాలురయిన మీకాపదవచ్చినఁ బ్రతిక్రియ గావింపక నేమూరకుండఁగలనా? మీయాపద నాయాపదగాదా? నీవింక భయ పడకుము. శంకవిడువుము. మూర్ఖులు నీకనేకవిధముల దుర్బోధ చేయుదురు. వానిం జెవిపెట్టకుము. నాయుపదేశము మనంబున నిలుపు కొందువేని నీకులగ్గగు. నాయంతరంగశుద్ధియు నాధర్మప్రవర్తనము నానిష్కామవ్యాపారము కాలక్రమంబున నీవ యెఱుంగఁగలవు. ధాత్రి నిష్కంటకము చేసి నీకప్పగించి తపోవనంబున కరుగవలెనని నాసంకల్పము. నాకేవిధమైన కోరికలు లేవు. సుఖదుఃఖముల ననుభ వించితిని. కాశ్మీరరాజ్యము పరహస్తగతము గాకుండఁ జూచుటయే నామనోరథము. కుమారా! దీనికి నీవేమందువు?' అని చిత్రభానుఁడు దీర్ఘోపన్యాసము జేయుటయు విక్రమసేనుఁడు విని యేమనుటకుఁ

దోఁచక పినతండ్రివైపు జూచుచుండెను. "కుమారా! నీయభిప్రాయ మేమని యతఁడు మరల నడిగెను."

"అయ్యా! నేనేమి చెప్పఁగలను? మీరు పెద్దలు. సర్వధర్మములు తెలిసినవారు. సింధుగాంధారరాజుల దండయాత్రలగుఱించియు మనము వాని నిమిత్తమై చేయవలసిన ప్రతిక్రియల గుఱించియు ముందుగా నాతోఁడ మీరాలోచింపలేదు. మణివర్మ ప్రముఖులను గారాబద్ధులను జేయునప్పుడు నా చెవిని వేయలేదు. అన్నియు జరిగిన పిదప నన్నడిగిన నేమిచెప్పగలను? మీరెట్లుండమని సెలవిచ్చిన నట్లేయుండెద. ఏమిచేయుమన్న నది చేసెద. ఈనగరము విడిచి పొమ్మన్న నాతమ్మునిఁ దల్లిని వెంటఁబెట్టుకొని పాంచాలమునకుఁ గాని మఱియొక దేశమునకు గాని పోయెద. మీతండ్రి యెక్కినగద్దె మీరేయెక్కుఁడు. అందఱకు రాజ్యము లేయున్నవా? అందఱ కైశ్వర్యము లేయున్నవా ? నాయభిమత మడుగనక్కఱలేదు. మీయిచ్చవచ్చిన తెఱంగున మీరు సేయవచ్చును." అని విక్రమసేనుఁడు మొగము చిన్నపుచ్చుకొని యుత్తరము చెప్పెను.

"కుమారా! తొందరపడకుము. మీరు దేశమువిడచి వెళ్ళ నేల? మణివర్మప్రముఖులపై నీకు సంపూర్ణ విశ్వాసముగలదు గావున వారిం బంధించెడు విషయము నీ కసమ్మతమని ముందుజెప్పనయితి. సేనలను సేనాపతులను వశముజేసికొంటినని యంటివి. నీపని నిమిత్తము నేను వారిని దోడితెచ్చితినిగాని నాపనికిగాదు. నేను వారిని వశముచేసికొనలేదు. వారికే నేను వశుఁడనైతిని. నీతో జెప్పి చేసినను జెప్పక చేసినను నీపనిచేయుటయే నాకుఁ బ్రధానము. కావున నిదియొక తప్పుగాఁబట్టుకొనకుము. నీవు మీయమ్మతోడ స్థిమితముగా నాలోచించుకొనుము." అని చిత్రభానుఁడు విక్రమసేనుని వీడుకొని కొలువుకూటమునకువచ్చి తననిమిత్తమై కనిపెట్టుకొనియున్న

సైనికులను సేనాపతులను గలసికొని వారితోఁగూడి కోటవిడిచి స్వగృహంబునకుంబోయెను. దండనాథులు సైనికులు వానికడ సెలవు గైకొని స్వగృహములకుం జనిరి.

అటఁ జిత్రభానుఁడు చన్నపిదప నరవిందాదేవి విక్రమసేనుం బిలిచి యిట్లనియె. "కుమారా! చిత్రభానుఁడు మనయెడ నభిమానముగల వారినందఱు బంధించినాడు. సైన్యమును వశపఱచుకొన్నాఁడు. దండనాథులు వానికి వశంవదులైరి. మణివర్మ మొట్టమొదటనుండియుఁ జేసిన యుపదేశము మనముఁ జెవినిబెట్టకపోవుటఁ జేసి యింతవఱకువచ్చినది. అతఁడే ఋజుమార్గవర్తనుఁడు. సింధుగాంధారవల్లభులంగూడి యతఁడు దుస్తంత్రములు పన్నెనని మనము నిశ్చయించుట పొరపాటేమో! కాని యాజాబు లతఁడు వ్రాసినట్లె యెవఁడో సృష్టించినాఁడని యాతఁడు మొఱవెట్టుకొన్నను మనము వినమైతిమి. ఆతని విశ్వసించినచో నింతవఱకు రాకపోనేమో? 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః' యను నార్యోక్తి నావంటి బుద్ధిహీనులగాలి చేష్టలంబట్టి పుట్టియుండవచ్చును. ఈ వైపరీత్యమునకు నేనే కారణమునైతిని. బిడ్డా! చేతులార నీభాగ్యమును నేను వెడలఁగొట్టితిని. ఇప్పుడేమి చేయుదుము? మనరాజ్యవ్యాపారము చుక్కానిలేని యోడపగిదినున్నది..' అని విచారించుచున్న తల్లిం జూచి విక్రమసేనుఁడు "అమ్మా! నీవు విచారింపవలదు. కార్యములు కన్నీటి కాలువలలో మునిఁగిపోవును. కన్నీరు కార్యములను సరిగాఁ జూడనియ్యదు. దుఃఖము దుర్బలలక్షణము. ధైర్యమెన్నటికిని మునుఁగనినావ. దానినెక్కిన వారుసురక్షితముగా దుఃఖసాగరమీఁది యవ్వలియొడ్డుఁ జేరుదురు. నీవు ధృతిఁదాల్చియుంటివా మే ముత్సాహవంతుల మగుదుము. నీవు ధృతిదప్పిన మా మతిచలించు. కావున ధైర్యమును నూఁతగోల విడువకుము" అనిచెప్పి యామె నూరడించెను.

చిత్రభానుఁడు మధ్యాహ్నమున దండపాణి వజ్రపాణులం బిలిచి "విక్రమసేనుఁడు మాతృభాతృసమేతుఁడై దేశమువిడిచి పాంచాలమునకుం బోయెద నని చెప్పె. అతఁడు గాని వారిపరిజనము గాని చుట్టములుగాని కోట దాఁటి పోకుండ నన్ని ద్వారములయొద్ద నన్నిబురుజులయొద్ద ముక్కాకలందేరిన మేటిమగలఁ గావలి యుంచుఁడు. మాధవసేనుని జాడలరయుఁడు. అతఁ డేదో రాజకార్యము మీఁదనే పైకిపోయియుండునని నేఁ దలంచెద" నని చెప్పి వారింబనిచి మణివర్మమాధవసేనులకు బదులుగా నూతనమంత్రుల నియమింపఁ దలఁచి యెవ్వరిని నియమింతుమని రుద్రభట్టుతో నాలోచించెను. అతఁడు కొంచెము సేపాలోచించి "నీకు మంత్రులెందుకు? నీవు మహేంద్రుఁడవు. నేనుబృహస్పతి యట్లుసకలవిషయముల ధర్మోప దేశముఁ జేయుచుండెద. నామనస్సె నీమనస్సు. నేనునీకు హితమే యుపదేశింతును. నీచేత హితమేచేయింతును. ఒకవేళ మంత్రుల నియోగింపవలసి వచ్చిన నిక్కడివారిని నియోగింపకుము. సమర్థు లయిన యమాత్యులను విదర్భాపురమునుండి రావింతము. ఇక్కడి వారు నమ్మదగినవారుకారు. నీబుద్ధిబలము వినియోగించి నీవొక్కఁ డవే పాలించుచుండుము" అని యుపదేశించెను.

అది లెస్సగా నున్నదని భావించి చిత్రభానుఁడు నాఁడు మొదలుకొని ప్రతిదినముఁ గోటకుంబోవుచుఁ గొలువుకూటమున విక్రమసేనుని గద్దెపైనునిచి ప్రక్కను దానొక చిఱుగద్దియవేయించు కొని కూర్చుండి దండనాథులను సామంతులను నగరమండలి ప్రధాన పురుషులను రావించి కొలువుదీర్చి రాజ్యవ్యాపారములను విక్రమ సేనుని పేరం జక్కఁబెట్టఁదొడఁగెను.

ప్రజలలో ననేకులాతనిన ర్తనముఁజూచి సముచితముగా నున్న దని మెచ్చిరి. నగరమండలిసంక్షోభము క్రమక్రమముగా డిందుపడెను. చిత్రభానునిపట్ల దుర్నయ మెద్దియు లేదని పౌరులు చెప్పకొన

జొచ్చిరి. వ్యవహారము మిక్కిలికట్టుదిట్టముగా జరుగఁజొచ్చెను. జారులుచోరులుమున్నగు నుండగులు చండశాసనుఁడగు చిత్రభానునకు భయంపడఁజొచ్చిరి. దేశమందు బందిపోటులు మున్నగునల్లరులు క్రమక్రమముగ నడఁగెను. అరవిందాదేవియు విక్రమసేనుఁడును జిత్రభానునిమనస్సనిమెదుం నోడ యేకడకుఁబోవునో యేరేవు జేరునో తెలియక యాతనివర్తనమంతయు నాటక మనియు నభినయ మనియు దలంచుచుండిరి.

మణివర్మకడ విశేషధనమున్నదని చిత్రభానుఁడు సంపూర్ణముగనమ్మి యతనినెట్లయిన హింసించి యానిక్షేపమును గనుగొనవలెనని ప్రయత్నములు చేయుచుండెను. దండపాణింబిలిచి యొకనాఁడ తఁడు మణివర్మను మిక్కిలికఠినముగా హింసించి విత్తంబుదాఁచిన చోటు దెలిసికొమ్మని యానతిచ్చెను. దండపాణి "స్వామీ! ఇంటిలో నేమూలనో యతఁడు సొమ్ముపాతిపెట్టియుండును. కావున మన మిల్లంతయుఁ ద్రవ్వించిచూతము. అక్కడనది కానఁబడనినాఁడు వానిని హింసింపవచ్చు" నని యుత్తరమిచ్చెను. "అదితెస్సగానున్న దని యకార్యమునకుఁ జిత్రభానుఁ డంగీకరించెను.

మఱునాఁడు ఖనికులచేత నిల్లంతయు నొక్కనిలువులోతు త్రవ్వించిరి. ఎముకలు మసిబొగ్గులు ప్రాతకుండపెంకులు కొన్ని రాగిశాసనములు మున్నగునవే కానఁబడియెనుగాని యొక్కరూకయైన నచ్చటఁ గనబడలేదు. అవ్వార్త దండపాణి చిత్రభానున కెఱిఁగింప నాతఁడు భగ్నమనోరథుఁడై మణివర్మ మఱెచ్చటనో ధనముదాఁచి యుండుననినమ్మి వానిం గ్రూరదండనలపాలు చేసిన నత్తావుబయట బడునని నిశ్చయించెను. ఒకనాఁడుసాయంకాలము చిత్రభానుఁడు దండపాణియు వజ్రపాణియు మఱిపదుగురు భీకరాకారులగు బంటులు మణివర్మయున్న కారాగృహముఁ జొచ్చిరి "నీవార్జించినధనరాసులు

మణులు మొదలగు నమూల్యపదార్థములు నీవెచ్చటదాచితివో చెప్పి దవాలేక దారుణవధపాలయ్యెదవా'' యని చిత్రభానుఁ డడిగెను.

''ధనము నాకడ లేదని యిదివఱకే చెప్పితిని నన్ను మీరెంత హింసించినను ప్రాణములేగాని నాణెములు నాకడ గ్రహింపలేరు. నెత్తురుచుక్కలేగాని మణులుమీకు దొరకవు. చివికిపోయిన యెముక లేగానిపసిఁడికణికలు మీకులభింపవు. చర్మమేగాని ధర్మముమీకు లభింపదు. ఏదోవంక బెట్టి నన్నుహింసించుటయే మీసంకల్పమైన మీరిట్లుచేయవచ్చును. పాపము మూటఁగట్టుకొనుటయే మీకోరిక యైనయెడల నట్లుచేయవచ్చును. అపకీర్తిసంపాదనము నీయభిమత మేని నన్ను నీయిచ్ఛవచ్చునట్లు హింసింపవచ్చును. పరమేశ్వరుఁడు సాక్షిగా భూమ్యాకాశములు, సాక్షులుగా నేసత్యము బలుకుచుంటిని ధనమునాకడలేదు. నాశరీరము వేఁడివేల్పున కింధనముగామీరిడినను యావజ్జీవముబంధనమునునుంచినను ధనముమాత్రము నేను మీకియ్యఁ జాల'' నని యమ్ముసలిమంత్రి యుత్తరమిచ్చెను.

''వీనిప్రమాణములు నమ్మఁజాలము. వీని కాలుచేతులకుగుడ్డలు చుట్టి కాల్పుఁ''డని చిత్రభానుఁడానతిచ్చెను. ''అట్లగాక!'' యని మొఱకులగుకొఱకుబంట్లాముదముగుంచి గుడ్డలు తడిపి వానిచేతులకు మోచేతులవఱకుఁ గాళ్ళకు మోకాళ్ళవఱకుఁజుట్టిరి. ఒకఁడు సమిధలు వైచి యగ్నిహోత్రము రవులుకొల్పుచుండెను. మణివర్మ లేశమయిన భయపడక విషాదముంజూపక కూర్చుండి కన్నులు మూసి నమక చమకములతో మహేశ్వరుని లోలోనధ్యానించుకొనుచు మరణము నకుసిద్ధముగానుండెను. ''ఇదేగుడ్డలకు నిప్పంటించుచున్నాము. క్షణ ములో భస్మమయ్యెదవు. జాగ్రత్త! ధనమెక్కడనున్నదో చెప్పు'' మని దుష్కరులగు బంట్లు మఱియొకసారియడిగిరి. మణివర్మధ్యానపరుఁడై నిరుత్తరుఁడయ్యెను.

"స్వామీ! ముమ్మాటికి సెలవేనా? నిప్పంటింతుమా" యని చిత్రభానునివంక దిరిగి రొక్కఁ డడిగెను. చిత్రభానుఁడు దండపాణి వంక జూచెను. దండపాణి తప్పని యిష్టములేకపోయినను దనయేలికకాగ్రహము వచ్చునేమో యని యతఁడు వలదనఁజాలక వజ్రపాణి వైపు జూచెను. ఆ యాజానుబాహువులు ముసలితనమం దైన వన్నె దఱుఁగని యాపచ్చని మేను విశాలమై యప్పుడు ముడుతలతో నిండియున్న ఫాలభాగమును మాంసహీనములై వ్రేలుచున్న చర్మమును జూడ సేనాపతుల కిరువురకు మనస్సు కరిగెను. వారు చిత్రభానున కుత్తరమీయ కూరకుండిరి.

"చంచలులారా! మీమనస్సులు చలించినవి. మీరు సేనాపతులై పరసేనల రూపుమాపుట కేగాని పరిచితులకడ మీరు పనికి రారు. మోమోటము జాలి మిమ్ములముచున్నవి. ఓరీ! నిప్పు బాగుగా మంటజేయుము రా" యని మాట సరిగా ముగించెనో లేదో యంతలో వృద్ధకంచుకి యగు జంబుకుఁడు వచ్చి "స్వామీ! కర్పూరమంజరి కర్పూరమంజరి యని" యేడ్చుచుఁ బలికెను. "ఏమిరా! కర్పూరమంజరి కేమి?" యని చిత్రభానుఁడు తొట్రుపడి యడిగెను. "ఉరిబెట్టుకొనె. ఉరిబెట్టుకొనె" నని వగర్చుచు వాఁడు చెప్పెను. చిత్రభానుఁడు భయసంభ్రమములతో విసవిస నడచుచుఁ బోయెను. దండపాణియు వజ్రపాణియు వాని వెనువెంటఁ జనిరి. సేవకులు నాఁడప్పని చాలించి మణివర్మ కట్లువిప్పి తలుపులు బిగించి యావలకుం బోయిరి. వజ్రపాణి జంబుకుని బిలిచి మెల్లగాఁ గర్పూరమంజరి యురిబెట్టుకొనుటకుఁ గారణ మడిగెను. "చెలికత్తెయైన మల్లిక పెద్దపులిచేఁ బట్టువడి చచ్చిపోవుటచే బెంగపెట్టుకొని యామె మాధవీలతతో మెడ కురిపెట్టుకొన్నది" యని యతఁడు బదులుచెప్పెను. "బ్రతికియున్నదా మృతినొందినదా?" యని మరల వాని నడిగెను. "ఏమో తెలియదు. మాటలేదు. చూపులేదు. నాడిలేదు. బ్రతికియున్నదో చచ్చిపోయినదో నే నెఱుఁగను" అని వాఁ డుత్తరము చెప్పెను.

ఇరువదియొకటవ ప్రకరణము

సునంద మతి యించుకేనియుఁ జక్కబడలేదు. ఆమె యున్మాదము నానాటికి హెచ్చుచుండెను. ఇంటనున్న చెంబులు తాను మోయఁగల చిన్నబిందెలు తనసగలు దీసికొనిపోయి యామె దొడ్డిలో నున్న నూతిలోఁ బడవైచుచుండును. అట్లు పాఱవైచెదవేమమ్మా యని సేవకు లడిగినప్పుడు "అయ్యో! కర్పూరమంజరి యెత్తుకొనిపోవును. అందుకని దాఁచుచున్నాను" అని బదులుచెప్పెను. రమారమి సంవత్సరము వయస్సుగల యామె చిన్నబిడ్డ నొకనాఁడు చంకఁబెట్టుకొని బావికడకుఁ గొనిపోయెను. వెంటనే పరిచారిక యొకర్తు పరుగెత్తుకొనిపోయి "ఏమమ్మా! బిడ్డ నేమిచేసెదవు?" అని యడుగ "ఓసీ! కర్పూరమంజరి వీనిం దీసికొనిపోవును. కాఁబట్టి యీనూతిలో బందుకొనఁబెట్టెద" నని బదులుచెప్పెను. వెంటనే యప్పనికత్తె బిడ్డకుఁ బ్రాణభంగ మగునని యామెచేతిలోనుండి బిడ్డను బలవంతముగా లాగుకొనెను. ఆ పెనఁగులాటలో సునంద సేవకురాలిని గట్టిగా గఱచి నాలుగుమూఁడుచోట్ల గాయములు చేసెను. గదిలోఁ బెట్టి తాళము వైచినప్పుడు కడుపునొప్పి వచ్చినదని కాలునొప్పి వచ్చినదని లేనిపోని వంకలుబెట్టి తలుపు దీయుమని పెద్దపెద్ద కేకలువేయును. పరిచారకులాయుఱపుల నరకు సేయుక పోయిరేని గదిలోఁ దనతల గోడకుఁబెట్టి గట్టిగఁ గొట్టుకొనును. తలుపు దీసినపక్షమున నేదో చెఱుపు జేయుచుండును. రెండుమూఁడు పిల్లికూనలను సేవకులు చూడకుండ నూతిలోఁ బడవైచి చంపెను. ఆమె యవస్థఁజూచి వజ్రపాణి మిక్కిలి ఖేదము నొందుచుండెను. ఎట్టి గట్టివైద్యులచేతఁ జికిత్స చేయించినను నామె యున్మాదము హెచ్చెనేగాని తగ్గలేదు. మనోవ్యాధికి మందు లేదుగదా! రాత్రులు సునంద తాను నిద్రపోవుట లేదు సరేకదా

భర్తకుం జుట్టుప్రక్కలవారికిఁ గంటిమీఁద గునుకు లేకుండ నఱచు చుండును. ఎవరో యెదుట నున్నట్లు భావించి వారితో వాదము సేయుచుండును.

కర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చి వివాహము చేయుట నిశ్చయ మయినదని యీమె యున్మాదమువల్లనో ప్రధానమయిననాఁడు వచ్చినబ్రాహ్మణులవెంగలితనముననో యెట్లో పట్టణమునం బొక్కెను. "పెండ్లి లేదు. పేరంటము లేదు. ముందుమునుపటిభార్యను మాత్రము వజ్రపాణి పిచ్చియెత్తించినాఁడు గదా" యని లోకులు చెప్పుకొని చాటుచాటున వాని నెగతాళిసేయఁ జొచ్చిరి. ఎందఱు హసించినను నెందఱధిక్షేపించినను మఱెందఱు నిందించినను భార్య యున్మాదిని యైనను గర్పూరమంజరిముఖముఁ దనమనోనేత్రములతోఁ జూచుచు సకలసంతాపహారక మయినయామె దృఢాలింగనము దనకుఁ జేకురి నట్లు భావించుచు నప్పుడప్పుడు స్వప్నములలో నామె సమాగమ సుఖము క్షణకాల మనుభవించుచు వజ్రపాణి యిల్లాలియవస్థ కెడ నెడ వగచుచున్నను మొత్తముమీఁద సంతోషముతోడనే దినములు పుచ్చుచుండెను. విశేషించి రాజ్యము చిత్రభానునివశమగుటచేఁ దన కింకను గొప్పపదవులు చేకూరునని యాసపడి యుండెను. కర్పూర మంజరి యురిపెట్టుకొన్ననాఁడు చిత్రభానునివెంట నరిగి యామె బ్రతికియున్నదో లేదో తెలిసికొనుటకును రతీదేవికిఁ బ్రతిరూప మని పేరువడసిన యాకన్నియమేనివన్నియయు ముఖవిలాసమును నొక సారి జూడవలయుననియు నాతఁడు భయసంభ్రమములతోఁ బోవు చుండ నంతలో నతనిసేవకుఁడు పరుగుపరుగున వచ్చి వగర్చుచు "మహాప్రభూ! మహాప్రభూ! ఇల్లు—ఇల్లు—" అని యఱచెను. "ఏమియిల్లు? ఏమియిల్లు? వేగము చెప్పఁగదరా" యని యతఁ డచ్చట నాఁగి యడుగ "మనయిల్లు కాలిపోవుచున్నది స్వామీ!

రండి రండి" యుని యేడ్చుచుఁ బలికెను. "అయ్యో! అయ్యో! ఏమిరా యిది" యని వజ్రపాణి నడచుచు వానిని బ్రశ్నింప నా సేవకుఁడు నడచుచునే వాని కిట్లుత్తరముఁ జెప్పెను.

"స్వామీ! ఏమి చెప్పుదును? సేవకుల కందఱకు నిద్రపట్టినది. అమ్మగారు దీపము చేతఁబుచ్చుకొని మీరు పఱుపులుకుట్టించుటకై యీ నడుమ దెప్పించిన దూదిబుంగల నంటించినారు. ఇంతటిలో నా భాగమంతయుఁ బూర్తిగా నంటుకొన్నతరువాతఁ గాని మా కెవ్వరికి మెలఁకువ రాలేదు. అంతలోఁ జుట్టుప్రక్కలవారు వచ్చి యిల్లంటు కొన్నదని కేకలువైచిరి. పొగ నలుదెసలం గ్రమ్మెను. మంట లెగసి మిన్నుముట్టెను. మీ బిడ్డలం దీసికొని మేము బయటఁబడుటయే మిక్కిలి కష్టమయ్యెను. ఇంటిలోనిసామాను దీయుటకయిన నవకాశము లేకపోయెను. దైవానుగ్రహమువలన బిడ్డలను దేవిగారిని మాత్రము బ్రతికించితిమి. ఆమె నీవలకు రమ్మన్న రాదు. చలిమంట కాగెద నిక్కడ నుండనీయుండి యని బలుకఁ జొచ్చెను. చేతులు పట్టుకొని యామెను బలాత్కారముగా నీవలకు లాగితిమి."

ఈ సంభాషణము జరుగుచుండఁగనె వారిరువురు వారియిల్లున్న వీధికి వచ్చిరి. ఆ కోలాహల మేమని వర్ణింపవచ్చును? ఆ కలకల మెంత యని చెప్పఁగలము? అత్తఱి గాలి విసరుగా వీచుచుండుటచే వజ్రపాణి గృహమేగాక నిరుగుపొరుగుననున్న రెండిండ్లుగూడఁ బరశు రామప్రీతి యయ్యెను. వజ్రపాణి సర్వస్వము వీతిహోత్రునకే శా హుతియయ్యెను. నగలు నాణెములు చీని చీనాంబరములు వెండ్లు నమ్ములు నమ్ములపొదులు చిత్తరువులు రొక్కము సమస్తము దగ్ధ మయ్యెను. ఇదియంతయు దగ్ధమైనను నతఁడు విచారింపకపోవునుగాని తనమనోరథము తనపాలిటిచింతామణి తననిధి తన నిక్షేపమునైన కర్పూరమంజరియు నురిపెట్టుకొని విగతజీవియైనదని యతని కింతింత

యనరాని విషాదము గలిగెను. కర్పూరమంజరి లేకపోవుటచేఁ దన యిల్లు గాలినలోపము భార్య యున్మత్తయయినలోపము ఘోరముగా గనఁబడజొచ్చెను. పాప మతనికారాత్రి పండుకొనుటకుఁ దావులేదు. మఱునాఁడు పండుకొనుటకు నెలవులేదు. కట్టుకొనుటకు బట్టలులేవు. ఇంటిముందర నిలువఁగానే పిల్లలు తండ్రిం గౌఁగలించుకొని యేడ్చిరి. సునంద భర్తయెదుటకుఁ బోయినిలిచి "ఏమండీ! బాగున్నదా? మనము క్రొత్తయిల్లు కట్టుకొందము. కర్పూరమంజరి రాకుండఁ జేసితిని. చూచితిరా" యని నవ్వుచుఁ బలికెను. అతఁ డేమియు ననక స్తంభమువలె నిలబడి తన దురవస్థను దలంచుకొని తన గృహమువలెనే మండిపోవుచున్న తన మనస్సును జల్లార్చుకొనలేక తన యింటియెదుట నున్న యొక యరుగుపైఁ జదికిలఁబడెను. బిడ్డలును వానితోఁ జని యతని కిరుప్రక్కలఁ గూర్చుండి కొంతసే పక్కడనే వట్టినేలఁ బండుకొని నిదురించిరి. తనువొత్తని మెత్తనిపాన్పుల నత్తమిల్లు తనబిడ్డలు బెడ్డలుగుచ్చుకొనునట్లు గటికినేలఁ బవ్వళించి యొడలెఱుఁగక నిదురింపఁజూచి యతఁడు కన్నుల నీరువెట్టుకొని యిరుగు పొరుగువారి సమాశ్వాసములవలన నూఱడిల్లి పొరుగువారు పాన్పు దెచ్చి పండుకొమ్మన్నను బండుకొనక రేయియెల్ల మేల్కొని తద్గృహమందే దృష్టినిలిపియుండెను. కాలుచున్న యాగృహముఁ జూచుచున్నప్పు డతఁడు తన మనోరథమెల్ల నట్లె దగ్ధమయినదని తన యాశలెల్ల బూడిదయైనవని, తన సౌఖ్యములెల్ల నేలపాలయినవని విచారించి తన భవిష్యదవస్థ యెట్లుండునో యని తలపోయఁజొచ్చెను.

అంతలోఁ దెల్లవారెను. తొల్లి యతి రమణీయముగానున్న తన భవన మొక్కరాత్రిలో భస్మమగుట కతఁడు మిక్కిలి యాశ్చర్యమొందెను. ఆమూడినబోడిగోడల నాకాలుచున్న దూలముల నా

ప్రేలుచున్న పెంకుల నాకూలుచున్న వాసములఁ జూచి యతఁడు కాలగతి మిక్కిలి చిత్రమయినదనియు దానికన్న విచిత్రమయినది మఱియొకటి లేదనియు నీశ్వరేచ్ఛ యగమ్యగోచరమనియుఁ బ్రపంచ మంతయు వినశ్వరమనియుఁ బెద్దలు చెప్పుమాటల స్మరించుకొనెను.

ఇరువదిరెండవ ప్రకరణము

సిప్రానది భాగీరథీమొదలగు మహానదులవలె మహావాహిని గాకపోయినను ముక్తిప్రదములయిన నగరములలో నొకటియని పురాణప్రసిద్ధిగాంచి మహాకాళేశ్వరస్వామికి నిలయమై వెలయు నుజ్జయినీనగరమునఁ బ్రవహించుటచే నదియు నొక పుణ్యనదిగాఁ బరిగణింపఁబడుచుండును. అక్కాలమునఁ బ్రతిదినముఁ దీర్థవాసులు వందలకొలందివచ్చి యయ్యేట స్నానముజేసి మహాకాళేశ్వరుని దర్శించి స్థలపురాణమును విని గతకల్మషులైనట్లు సంతసించి పోవు చుందురు. అయ్యేటియొడ్డున రామణీయకపురాశి యనందగు పూవుఁ దోఁట యొకటికలదు. అయ్యలరుదోఁటనడుమఁ గమలాకరం బగు కమలాకరం బొండు నయనోత్సవము చేయుచుండు. దానియొడ్డునఁ జూచువారి కన్నులకు విందులుసేయు సౌధమొండు నిర్మింపఁబడియె. సిప్రానదీతరంగములఁ గౌఁగలించుకొని యాసంసర్గమునఁ గడుం గడు జల్లనై యటనుండి యెలతోఁటఁజొచ్చి కుసుమపరిమళంబులఁ జూఱఁగొని మెల్లమెల్లగ మలయానిలుఁడు కొలంకుఁజొచ్చి యన్నిటి తుంపురుల మేనదాల్చి గవాక్షద్వారమున సౌధంబుజొచ్చి యందున్నవారి నానందపరవశులఁ జేయుచుండును. మాళవ రాజనందనుఁ డగు మకరందుఁడు తఱచుగా నయ్యు ద్యానమున విహరించుచుండును. ప్రాయికముగా నక్కొలంకున

జలకమాడుచుండును. వేమారు వేడుక చెలికాఁడు చంద్రచూడునిం గూడి మేడమీఁదఁ గూర్చుండి మలయమారుత సుఖమనుభవించి యుద్యానవన రామణీయకము సందర్శించి కనులం దనుపుకొను చుండును. వసంతసమయములందును శరత్కాలములందును రాకా చంద్రమండలము నిండువెన్నెలలు గాయునప్పుడు నమ్మేడ నంటి యున్న పాలఱాతి మిద్దెపైఁ గూరుచుండి చల్లనిపండువెన్నెలల సుఖ మనుభవించుచుండును.

ఒకనాఁడు కర్పూరమంజరీవిరహమున నతఁడింటికిఁ బోవక నా మెలదోఁటలోనేయుండి సాయంకాలమయినపిదప జగన్మోహనం బగు ధవళప్రభతో నుదయించిన శరత్కాలసంపూర్ణచంద్రమండల మును జూచి దానివలనఁ దనప్రియురాలి మొగంబును బండువెన్నె లలవలన నామెలావణ్యమును స్మరణకురాఁగ మిద్దెపైఁగూర్చుండి ''యోచందమామా! మేడమీఁదనుండువారికిఁ గ్రిందివారుసేయు పనులెల్ల నగపడునట్లు గగనప్రాసాదమధిష్ఠించిన నీకు సకలభూత చేష్టలుఁ గరతలామలకముగదా? నీవు చల్లనివాఁడవు కావున నా గ్రహములేనివాఁడవు. కాఁబట్టి నిన్నొకప్రశ్న యడిగెదను దయచేసి చెప్పుము. నీవు కాశ్మీరమునకరిగితివా? శ్రీనగరముంజూచితివా? అందు మాకర్పూరమంజరి కనఁబడినదా? ఆమెసుఖముగానున్నదా? ఏమి! యుత్తరము చెప్పవు? ఔను నీవేల చెప్పెదువు? ఆమె మొగమునకు నివాళినిచ్చుటకయినను నీనెమ్మొగము పనికిరాదుగదా! కళంకిత మైనది నీమొగము. అకళంకమైన దామెవదనము. ఎంతవారికయిన నీర్ష్యయుండకపోవునా? అందుచే సిగ్గుపడి నీవామెంజూచియుండవు. నిన్నడిగిన ప్రయోజనమేమి!'' అని కామార్తుఁడు చేతనంబులంబలె నచేతనంబులంగూడ సంబోధింతురను నార్యోక్తి నిజముగఁ జిత్త వికారమున జాబిల్లింజూచి యసంబద్ధప్రలాపములు చేయు మిత్రుని

డగ్గరి చంద్రచూడుఁడు మీఁదఁ జేయివయిచి తట్టి తన మొగము నతనిమొగముకడఁజేర్చి "వయస్యా! ఇదియేమి నీకువెఱ్ఱియెత్తినదా? లేక నీలేఁదోటలో నేదయ్యమయిన సోఁకినదా! లేక మద్యపానముఁ జేసితివా? చందమామకు నోరున్నదా నాలుకయున్నదా నీవడిగిన ప్రశ్నల కుత్తరముజెప్పుటకు? చంద్రుఁడనఁగా మనవంటి పురుషుఁడను కొంటివా? నీవుజ్యోతిశ్శాస్త్రవేత్తవు. చంద్రుఁడనగా సూర్యానువర్తి యగుగ్రహమని నీవెఱుంగవా? చాలు చాలు! నేనుహిమవంతునివంటి ధైర్యసారముగలవాఁడనుగనుక భయపడలేదుగాని, మఱియొకరు నీ యసంబద్ధసంభాషణములు విన్న బెదరి మేడదూకి పాఱిపోదురు. నీ కలాపమిఁకఁ గట్టిపెట్టు" మని మందలించెను.

అప్పుడు మకరందుఁడు చంద్రచూడుని చేయిబట్టుకొని మెల్లగ నిట్లనియె—"మిత్రమా! నీవు నన్నెఱుఁగనివానివలె భాషించెదవేల? స్వప్నముననైన నేను మద్యపానముసేయుదునా? భూతములు పిశాచములు పిఱికివాండ్రపైఁ బడునుగాని నాపైఁబడవు. కర్పూరమంజరీ వియోగదుఃఖము దుస్సహమగుటచే నేనేమేమో కొన్ని యసందర్భములుపలికియుంటిని. దానంజేసి నామతి చలించెనని నీవుదలంపకుము. ఎంతవారించినను నామనస్సు కర్పూరమంజరీ సమక్షమున కరుగక మానినదిగాదు. దానిమాటలలో నేమితీఁపియున్నదో—దాని మొగము మున నెంతయాకర్షణశక్తియున్నదో—దానిసాన్నిధ్యమం దేమివిశేషమున్నదో—దానికన్నులలో నేమివశీకరణప్రభావమున్నదో—నే నెఱుంగనుగాని నామనస్సు వేయిసార్లుపిలిచినను గొలుసులువైచిలాగినను నాకడకు రాకున్నది. అదిదానిమాయలలోఁ బడినది. దాని చెలిమికత్తెలుపన్నిన వలలలోనదితగులుకొనియెంగావలయు! మాటలాడించు శక్తిమనస్సుదిగదా? అదిదగ్గఱలేనప్పుడు—దగ్గఱనున్ననుసరిగాలేనప్పుడు నోరుతనయిచ్ఛవచ్చినట్లు ప్రేలును. చంద్రచూడుఁడా! నీవుచూచి

తివో లేదో, చూచినను మెచ్చితివో లేదో, కాని, కర్పూరమంజరి సౌందర్యము వర్ణనాతీతమని చెప్పుట వర్ణనముగాదు. దాని సోయగంబుఁ గనువిచ్చి యొక్కసారి జూచునేనిఁ గాలకంఠుని కఠోరహుంకారంబున మూర్ఛిల్లి యాతని కంటిమంటల గ్రగ్గిన మదనుఁడు తన నియతిని రతినిఁబిడిచి మరల దానికొఱకై భూమండలంబున నవతరించి సాంగుఁడై యనంగశబ్దముఁ బోగొట్టుకొనఁడె? వసంతుడు తాను జూచు భాగ్యము గలవాఁ డగునేనిఁ జివురుటాకులు మేనుగాఁ జేసికొని మాధవీలతాదులు కరచరణంబులుగా నిర్మించుకొని ఫలరసంబులు రక్తంబుగా సమర్చుకొని కలువరేకులు కన్నులుగాఁ గావించుకొని దొండపండులు మోవిగాఁబెట్టుకొని శుకపికంబులనుండి పలుకులు పుడికిపుచ్చుకొని మాటలుగాఁ జేసికొని మూర్తిమంతుఁడై దన్ను వరింపుమని దాసి యడుగుదోయిఁబడి వేఁడుకొనఁడె? అది నలకూబరుని కంటఁబడిన గడుముసలిదై శృంగారరస మెల్లఁ గోల్పోయిన రంభను సవ్యాలసం ద్రోసివయిచి జవ్వనియగు నివ్వనజాక్షికై తహతహంబడఁడె? వారిమాటయేల! సంసారములరోసి సౌఖ్యములబాసి కాంతారాంతర వాసులై గాలియు దుంపలు నాకులు నలములు దిని చెట్లనీడల వసియించుచుఁ జర్మంబులందాల్చు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మౌనులుసైతము పల్లమునకుం బోవు నీరుపగిది జపములు తపములు సాలించి నిష్ఠలు నీటఁగలిపి దాని వెంటంబడరే? ఆ చక్కదనముఁ గవులు వర్ణింపజాలరు. చిత్రకారులు చిత్రింపఁజాలరు."

అనుచుండఁ జంద్రచూడుఁడు "మిత్రమా! ఆమెకై నీవింత తహతహఁ బడుచుంటివి. నిన్నామె వలచునా? లేక యిది చమురు దండుగ భాగవతమా?" యని యడిగెను. "మిత్రుఁడా! ఆప్రశ్నకు నేనుత్తరము జెప్పఁగలనా? నాచక్కదనము, నా తెలివితేటలు, నా జవ్వని యడుగుఁ దామరలకు దాస్యము చేయుటకయినఁ దగవని

నే దలంచెద. ఎందఱు రాజకుమారు లామె కేలువట్ట యత్నించు చున్నారో యెందఱు నృపకుమారుల దూతలామెకడ దర్శనముగాక వేచియున్నారో యెందఱు లేఖలనువ్రాసి విజ్ఞాపనము లంపుకొను చున్నారో, యెందఱు దానితండ్రిం బతిమాలుచున్నారో యెందఱు దాని పొందుగూర్పుమని దాని చెలిమికత్తెలకు లంచము లిచ్చు చున్నారో యెందఱామె మనఃప్రీతికై కట్నములు కానుకలు నంపు చున్నారో, యెందఱామెచేఁ దిరస్కృతులై లజ్జావశంబునఁ దల యెత్తుకొనలేక యున్నారో, యెందఱామె సమాగమముఁ దమకు లభించునని యువ్విళులూరుచున్నారో! నన్నా యామె వలచుట? నాకా యాసమాగమ సౌఖ్యము గలుగుట? నేనా యంతపుణ్యము చేసినవాఁడను? మిత్రుఁడా! మనస్సునకున్న వేగము మనుష్యుని కేల యుండగూడదు? తిరస్కరిణీవిద్యాప్రభావము నేఁడు కలియుగమం దున్న పక్షమున దేవదూతయై నలుఁడు పరులకంటఁ బడకుండ విదర్భాపురముఁ జొచ్చి దమయంతీసమాగమముఁ బడసి యామె దర్శనంబున నేత్రంబులను సంభాషణంబున శ్రవణంబులను ధన్యంబుల జేసికొనినట్లు నేనును బ్రియురాలిదర్శించి నానయనశ్రవణంబులఁ జరి తార్థములఁ జేసికొననే? చిలుకవాహనము నెక్కి చిగురువిలుతుఁడును గరుడగమనుఁ డగు కమలలోచనుఁడును నెంత ధన్యులోగదా? క్షణములోఁ గామితప్రదేశంబుల కరిగి కృతార్థు లవుచుందురుగదా! మానవున కేశక్తియులేదుగదా! మనుష్యుని దౌర్బల్య మిట్టివిషయ ముల స్పష్టముగఁ గనఁబడుచుండును. ఆమె చిత్తవృత్తి యెట్లు న్నదో తెలియదు. మిత్రుఁడా! నీవు మాఱువేసమున శ్రీనగరమునకుఁ బోయి తెలిసికొనలేవుగదా!'' అని మకరందుడు పరిపరివిధములఁ బ్రియురాలి చక్కదనము దలంచి గుణములదలంచి తన కామె సంప్రాప్తించువిధ మెఱుఁగక వ్యథలుపడుచుండ మిత్రుఁడగు చంద్ర చూడుఁడు వాని విరహసంతాపముం జూచి పరిహసించుచు నిట్లనియె.

"వయస్యా! నీవు లేదన్నను నేను నమ్మఁజాల. నీతల చెడిపోయినది. ఏదో పిశాచము నిన్నావహించినది. తోటలలో దొడ్లలో నపరాహ్ణా మనక యర్ధరాత్రి మనక తిరుగఁగూడదు. నీకు భూతవైద్యము చేయింపవలెను. లేనిచో నిటువంటి పిచ్చి యేమిటి? ప్రపంచములో నామెకన్న నందగత్తియ లేదా నువ్వు. ఆ మాతల దన్నినహా రెండవలో యుండ వచ్చును. కాదాయెనంటె కొంచెమెత్తులోలు. ఆలుచిప్పలవంటి కన్నులు. ఈ మాత్రపువారు లోకమున నుండకపోరు. తావలచినది రంభ తామునిఁగినది గంగ యన్నట్లు నీకంటికామె రంభలాగు మేనకలాగు కనఁబడుచున్నది. ఆమె నిన్ను మెచ్చకపోయిన యెడల మఱియొక దానిని పెండ్లి చేసికొనవచ్చునులే. పెండ్లాలు దొరకకపోరు. నావంటి దరిద్రునకు వివాహము గాదు కాని నీకేమి తక్కువయ్యా! ఈమె దాఁటిపోయిన యెడల నేనే వెళ్ళి మఱియొక దానిని కుదిర్చెదనులే" అనవుడు మకరందుఁడు "మిత్రుఁడా! వలపెట్టిదో యెఱుఁగని ఘోటకబ్రహ్మచారికి నీకు సుందరాంగులను మెచ్చుకొనుటగూడ దెలియునా? వలపులోని తీఁపి నీకపరిచితము. గొడ్రాలు ప్రసవవేదన నెఱుఁగనట్లు బ్రహ్మచారి విరహతాపము నెఱుఁగఁజాలఁడు. ఆ మెలనాగ నాకుఁ జిక్కదేని నేను జన్మాంతము దాఁక బ్రహ్మచారినై యుండెద. కాని మఱియొకదాని కేలువట్టను" అని మఱియేమో చెప్పఁబోవుచుండ నంతలో సేవకుఁడరుదెంచి "మహాప్రభో! ఎవ్వఁడో నూతనపురుషుఁడు మీకొఱకై వచ్చియున్నాఁడు" మీదర్శనము గోరుచున్నాఁడు. అని విన్నవించెను.

"పూఁదోటలో నున్న నన్ను నడిరేయి వెదకికొనుచు వచ్చినవారెవ్వరు చెప్పుమా? సరే! తోడ్కొనిరమ్ము" అని మకరందుఁ డానతిచ్చెను. సేవకుఁడా పురుషుని వెంటఁబెట్టుకొని మకరందునిఁజూపి క్రిందికి దిగిపోయెను. నూతనపురుషుఁడు మకరందునకు వంగి జోహారు చేసి నిలువంబడియెను.

తెల్లని మొగము, తలమీఁద తెల్లనిపాగా, మోకాళ్ళనుదాఁక తెల్లని నిలువుటంగీ, పాదములను స్పృశించు తెల్లనిలాగు గల యప్పురుషుని జూచిమకరందుఁడు "మీ దేయూరు? మీ రేమిపనిమీఁద వచ్చిరి" అనియడిగెను. "అయ్యా! నాది కాశ్మీరదేశము. శ్రీనగరము కాఁపురము. నేను చిత్రభానుని సేవకుఁడను. నన్ను జయంధరుఁ డందురు. ఆయనసందేశము మీకుఁదెచ్చితిని" అని యాపురుషుఁ డుత్తరము జెప్పెను.

"సందేశము నాకా, మాతండ్రిగారికా?" యని యతఁడు మరల నడిగెను. "స్వామీ! మీకే" యని యతఁడు బదులుచెప్ప "సరే! కూర్చుండి వినిపింపు" మని మకరందుఁడు పలికెను. అనవుడు జయంధరుఁడిట్లు విన్నవించెను. "దేవా! చిత్రభానుఁడు కాశ్మీరరాజ్యమును స్వాధీనము జేసికొని పాలింపఁ బ్రయత్నించుచున్నాఁడు. అందు మీ సాహాయ్యమును గోరుచున్నాఁడు. అట్లు తోడుపడుదురేని తన కూఁతురు కర్పూరమంజరిని మీకిచ్చి వివాహముసేయఁ దలఁచుచున్నాఁడు." అనుచుండఁ జంద్రచోడుఁ డడ్డమువచ్చి "ఆమె కితనిపై వలపున్నదా? బలవంతవివాహమా?" యని యడిగెను. నాపుడు జయంధరుఁడు రెండవసారి నిట్లనియె. "స్వామీ! చిత్తగింపుఁడు. ఆమోహనాంగి మిమ్మేగాని మఱెవ్వరిని వివాహమాడదఁట. మకరందుఁడే నాబహిఃప్రాణము. ఆయన నన్ను వివాహమాడఁడేని నేను బ్రహ్మచారిణినై జీవితముగడపెదను గాని మఱియొక రాజకుమారుని కేలు పట్టనని శపథంబు జేసెను. మీనిమిత్తమే తపము సేయుచున్నది. ఆమె శ్రీనగరమునను న్నను మనస్సు నిరంతర ముజ్జయినిలో నుండును. విరహతాపమున నామె చిక్కి సగమైనది. రాజకుమారా! మీరు చేపట్టరేని యామె జీవింపదు. ఆశాబంధమే యామెనింతవఱకు నిలిపినది. ఆమె యవస్థఁజూచి తండ్రి మీకడకుఁ నన్నుఁబంపెను. మీరామెను

రెండుసారులు చూచియుండిరఁట. వెనుక నొకసారి విదర్భలో జ్వర పీడి తమైనప్పుడు మంచిమందు లిచ్చి బ్రతికించిరఁట. రెండవసారి భిల్లుల బారినుండి తప్పించి కాపాడిరఁట. ఆ రక్షణము రక్షణముగాదు. నేఁడు గాపాడుటయే కాచుట. మీ హస్తస్పర్శన మామె తాపము జల్లార్చును. మీ ముఖదర్శన మామె యలమటఁదీర్చును. ప్రస్తుత మామె స్వప్నములలో మిమ్ము దఱచుగాఁ జూచుటం జేసియు, మీ నామస్మరణంబు గావించుటం జేసియు నామె జీవించుచున్నదిగాని లేనిచో నీపాటి కామె మఱియొకలాగైనయుండును. మఱియు చెప్ప వలసిన విషయము లున్నవిగాని మగవాఁడనగు నేను శుద్ధాంతవాసిని యైన యామెఁదానిగుట్టు నంతకన్న విప్పిచెప్పనొప్పదు. అంతయు నీవే భావించుకొనుము'' అని యూరకుండుటయుఁ జంద్రచూడుఁడు ''సాహాయ్యముజేయని పక్షమున మీరాజు కూఁతును మకరందున కీయఁడా యేమి?'' యని యడుగ జయంధరుఁడు ''స్వామీ! అట్టిపరి స్థితి తటస్థించునేని కర్పూరమంజరి చిత్తమెట్టులుండునో చెప్పఁ జాలను. ఐన నింతవలవంతగల కాంత కిష్టములేకున్నను దా నెవ్వరి గూర్చి మేలుపడెనో యాతనినే వరించునుగాని వేఱు తెఱంగున జేయునా?'' యని బదులు చెప్పెను.

అది విని మకరందుఁడు తనలో ''హృదయమా! నీ కింకను శాంతిఁగలుగదు. ఆ యిందువదన హృదయము నిన్నుఁ గలియఁగోరు చున్నదిగాని దానిలో నింకను మిషగలదు. తండ్రికి నేను సాయపడిన గాని యది చేఱదు. నేనన్యథా వర్తించితినేని కర్పూరమంజరి చిత్త వృత్తి యెట్లుండునో గదా! దేవుఁడు వరమిచ్చినను నర్చకుఁడు వర మీయఁడన్నట్లు కూఁతు మేలుపడుచున్నను దండ్రి యంతరాయముఁ గలిఁగింప వచ్చునుగదా! అయినను నామీఁద నామెవలపు నిలిచిన చల్లనివార్త శ్రవణానందకరముగా వింటిని. ఇదియేచాలు. నా

పునాదిపై నాయాశాసౌధముం గట్టవచ్చును" అని తలంచి బహి రంగముగా నిట్లనియె." జయంధరా! సాయము చేయుటకుఁగా చేయకపోవుటకుగాని నే స్వతంత్రుఁడను గాదుగదా! ఇందుకు న తండ్రిగారు సుదర్శన మహారాజుగారె ప్రమాణము. ఈ విషయమై వారితో నే బ్రసంగించి కర్తవ్యము గావించెద. నీవు మాయతిథివై యుండుము. మా పట్టణమునఁ జూడవలసిన విశేషములఁ జూడుము. కర్పూరమంజరి నన్నువలచి యనుగ్రహించిన దని శుభవర్తమానము చెప్పుటచే నిదిగో నీ హారము నీకుఁ బారితోషికముగా నిచ్చు చున్నాను. గ్రహింపుము."

అనవుడు మహాప్రసాదమని జయంధరుఁడు దానిం గ్రహించి 'దేవా! మీకు నాపైఁగలదయకు సంతసించితిని. నేను మీ యతిథినై యుండఁజాల. నా కీనగరమునఁ జుట్టములుగలరు. వారికడ నుండెద. సెలవొసంగుఁడు." అని వంగి నమస్కరించి వాని యనుజ్ఞవడసి యచ్చోటు వాసిపోయెను.

అవ్వెనుక మకరందుఁడు చంద్రమూర్తుంజూచి "మిత్రమా! ఈతని వాలకము చిత్రముగానున్నది. నడక యాఁడుదానినడక. మాట లాఁడుదాని మాటలు పలుకు నప్పుడచ్చముగ నాఁడుదివలె గన్నులుత్రిప్పును. చేతులతో నభినయించును. ముదుకఁడగుబ్రహ్మ దేఁడు మతిలేక యాఁడుదానిం జేయఁబోయి పొరపాటున మగవానిం జేసెఁగాఁబోలు!" నని యామె మాటలచమత్కృతిని సందేశార్థము లను దలంచుకొనుచు నా రేయిగడపెను.

తెల్లవారెను. మకరందుఁడు రేయియంతయు జాగరము సేయుటచే మిక్కిలి బడలి జాగరణభారము సడలుటకయి వనలక్ష్మి మించుటద్దమువలె నున్నయకొలంకునీట స్నానమాడెను. చంద్రమూర్తుండు మిద్దెమీఁద గొడ్డువలెఁ బండుకొని గాఢముగ గుఱ్ఱుపట్టి నిద్రపోవుచుండెను. ప్రభాకరుని లేతకిరణములుసయిత మాతనిని మేలు

కొలుపలేకపోయెను. మకరందుఁడు కూర్చుండినను నిలిచియుండినను స్నానమాడుచుండినను, నిటునటు దిరుగుచుండినను నతని మనస్సు సర్వావస్థలయందుఁ గర్పూరమంజరిమీఁదనే యుండెను. ఆమె తన్ను ప్రేమించునో లేదో యని మున్ను సంశయించుచుండెను. ఆమె తన్ను గాఢముగా వలచియున్నదని యిప్పుడు తెలిసినను జనకుని నియమమునుబట్టి యామె తనకు దుర్లభురాలని బెంగపెట్టుకొనెను. "ఏమిచేయుదు నిందెవరు నాకుఁ దోడుపడుదు" రని బూవుఁదోఁటలో నడయాడుచుండ సేవకుఁ డొక్కఁడు వచ్చి "మహాప్రభూ! నాయనగారి సెలవైనది. దయచేయుఁడు" అని మనవిచేసెను. "ఇదే వచ్చుచున్నా" నని యాతఁడు వానివెంటం జనియె.

సుదర్శనమహారాజు స్నానముజేసి సౌగతమతప్రకారము సర్వర్తింపవలసిన ప్రాతఃకాలకృత్యముల నియమపరతంత్రుఁడై నెఱిపిపరిశుద్ధవస్త్రముల ధరియించి యంతఃపురమున రాయబారులకు దర్శనం బిచ్చు గదిలో నున్న తాసనంబునం గూర్చుండెను. ఆతని యెట్టయెదుట వృద్ధుఁడైన యొక బ్రాహ్మణుఁడు సముచితంబగు పీఠమునఁ గూర్చుండి సుదర్శనుఁ డడుగు ప్రశ్నల కుత్తరము చెప్పుచుండెను. అంతలో మకరందు డచ్చటికిఁబోయి తండ్రికి నమస్కరించి వాని యనుమతిని బ్రక్కం గూర్చుండెను. సుదర్శనుఁడు "కుమారా! మన యెదుట నున్న యీ బ్రాహ్మణుఁడు కాశ్మీరరాజమంత్రులలో నొకర[illegible] మాధవసేనుఁడు. క్షేమచంద్రుని జ్యేష్ఠకుమారుఁడగు విక్రమసేన[illegible]పున నన్నుం జూడవచ్చె. సందేశార్థము లన్నియు విక్రమసేన[illegible] వ్రాసి యిచ్చిన లేఖలోఁగలవు. అది నీవొకసారి చూడు" మని [illegible]తని కిచ్చెను. మకరందుఁడు లేఖ నామూలాగ్రముగాఁ జదువ[illegible] యములన్నియు గ్రహించి మరల దానిని దండ్రిచేతి కిచ్చెను. అంతట సుదర్శనుఁడు కుమారు నుద్దేశించి యిట్లనియె. వత్సా! బాలుఁడైన

విక్రమసేనుని జూచు జూచినది మొదలుకొని నాకడుపు జాలిపెంపున జుమ్మలుచుట్టుచున్నది. హేమచంద్రుని దలఁచిన నాకిప్పుడుసైతము గంట నీరువచ్చును. అతఁడు నేను సహాధ్యాయులము. అతనివంటి పరిశుద్ధుఁడు లోకమున లేఁడు. మంచితనము మూర్తీభవించినదని చెప్పవచ్చును. అట్టిమహారాజు మరణము పాలగుటయు, మాయామారియగు చిత్రభానుఁడు రాజ్యమాక్రమింప దలఁచుటయు, విక్రమసేనుఁడు బాలుఁడగుటయు, దండనాథాది నియోగులు స్వామిద్రోహు లగుటయుఁ దలంచిచూడ మన మవశ్య మాతనికిఁ దోడుపడవలయునని దోచుచున్నది. ఇంతకన్న హేమచంద్రునకు నేనేమి సాయముచేయగలను? అతఁడు సంతసింపకపోయినను వాని యాత్మయైన నా యభిమానమునకు సంతసించును. నీవిందు కేమందువు? ఇది నీకు సమ్మతమగు నేని నేఁడు మొదలు సమరసన్నాహంబుగావించి కతిపయదివసములలోఁ జతురంగబలంబులం దోడ్కొని మన దండనాథుఁడైన కంఠీరవ దేవుఁడును, నీవును శ్రీనగరమునకుం బోవలయును. నే నిచ్చటనుండి రాజకార్యముల నడిపెద. అట్లు పోవుటకు నీకిష్టము లేదేని సేనాసమేతుఁడనై నేన కాశ్మీరమునకుం బోవుదు. నీవు నగరమునందుండి నాస్థానమున రాజ్యపాలనము నెఱపుచుండుము.”

అనవుడు తనప్రయత్న మక్కఱలేకయే పితృప్రేరణంబునఁ దాను గాశ్మీరమునకుఁ బోవుట కవకాశము గలిగినదని కర్పూరమంజరీ దర్శనాభిలాష ముందరికిఁ ద్రోయ నతఁడు “దేవా! మీ చిత్త మెట్లో యట్లేచేయుఁడు. నన్ను బొమ్మన్న నేనపోదు. ఇచట నుండుమన్న నుందు. [illegible] వారే ప్రమాణము. కాని పెద్దలగుటచే మీరుకదలుటకు వీలు[illegible] కంఠీరవదేవుని సాయమున నేనపోయి కార్యంబు నిర్వర్తించెద” నని విన్నవించెను. “వత్సా! నాకదిపరమసంతోషము నీవెంట రత్నసేనుని వానికుమారుఁడగు భద్రసేనుని తీసికొనిపొమ్ము చంద్ర

చూడుడు పిఱికివాఁడు. యుద్ధమన్న వెఱచును. అతఁడు నీతోఁ రాఁడు కావున భద్రసేనుఁడే నీకు చెలికాఁడై హితోపదేష్టయై చేదోడు వాదోడై మెలఁగును," అని సుదర్శనుఁ డానతిచ్చెను.

అప్పుడు మాధవసేనుఁడు లేచి చేతులుజోడించి వారుగావించిన యుపకారమునకుఁ దనకృతజ్ఞతం దెల్పుచు నిట్లనియె. "మహాప్రభూ! నేనువచ్చునప్పుడు మీరేమందురోయని మిక్కిలిసంశయించుచువచ్చితిని. మీరు బాలుఁడగు విక్రమసేనునియెడఁ జూపిన దయ నిరుపమానము. మిత్రులన్న నాపద్బాంధవులన్న మీరె. చనిపోయిన మిత్రుని దలంచి చిన్నవాఁడగు వానికిమీరున కెవ్వరుపకారము సేయుదురు? పరోపకారార్థ మిదంశరీరమను వాక్యము మీయందరూఢమైనది. మారాజుపక్షమున మారాజమాతపక్షమున, నమాత్యుల పక్షమున మీకు నే ననేక కృతజ్ఞతాసూచకవందనము లాచరించుచున్నవాఁడ. పాంచాలపురపాలుఁడగు మహేంద్రదేవుని దర్శనము చేసివచ్చితిని. అతఁడుగూడఁ దన ద్రోహి మిత్రునకు సాయముచేయఁదలఁచినాఁడు. మీరుభయులు గూడిరేని జిత్రభానుని బరాజితుని జేయుట మిక్కిలి సులభము. నాకనుజ్ఞనొసంగుదురేని మరలబాంచాలమునకరిగి పాంచాలసైన్యములఁ దోడుకొని నేను కాశ్మీరమునకుఁబోయి మీరాక కెదురుచూచుచుందునని వారిముదలగైకొని మాధవసేనుఁడు వెడలిపోయెను.

అతఁడు నిర్గమించుటయు మకరందుఁడు పరిస్థితులట్లు మాఱినందుకుఁ దనలో నిట్లువిచారించెను. "ఇప్పుడు నేనేమిచేయుదును! విక్రమసేనునికి సాయముసేయుమని మాధవసేనుఁడువచ్చె. తనకుఁ దోడుపడుమని చిత్రభానుఁడు దూతనంపె. చిత్రభాను పుత్రికయందు నామనసు లగ్నమైయున్నది. ఆమెకై సేనాపతినిఁ జేరుటయు క్షేమము గాదా! కాని ధర్మమాలోచించినపక్షమున విపతంత్రిచే వంచితు

డైన విక్రమసేనునికే నేను దోడుపడవలయు. నామనస్సు య్యెల లూఁగుచున్నది. ప్రాణసఖీసమాగమముఁ గోలుపోవుదునా, ధర్మపరిత్యాగము చేయుదునా? వివాహము లేకపోయిననుసరే ధర్మమే నేనను సరింతెద. "యతో ధర్మస్తతో జయః" యను నార్యోక్తి సార్థకము గాకపోవునా!

ఇరువది మూఁడవ ప్రకరణము.

ధర్మదేవత మూర్తీభవించినట్లు జిత్రభానుఁడు కాశ్మీరమునఁ బ్రజాపాలనము సేయుచుండెను. రుద్రభట్టు ప్రజలకు బహిరంగముగ దర్శనమీయక చిత్రభానునకు నన్నివిషయముల దనుజనాయకునకు శుక్రాచార్యులట్లు హితోపదేశము చేయుచుండెను. విక్రమసేనహర్షవర్ధనులకుఁ దనమీఁద నెంతమాత్రము ననుమానము లేకుండునట్లు జిత్రభానుఁడు ప్రవర్తించుచుండెను. రాజకుమారులచేతఁ బగలు విద్యాభ్యాసము చేయించుచుండును. తగినశిక్షకుల నేర్పఱచి సాయంకాలములవారికి విలువిద్దియ నేర్పించుచుండెను. ప్రతికార్యమునఁ దనువిక్రమసేనునియాలోచనమడుగుచుండును. సింధుగాంధారవసుంధరాధిపులదండయాత్ర లెందుచేతనో, యాగిపోయెను. రాజ్యనౌకయొక్క చుక్కాని దాను ద్రిప్పుచుండుటచేఁ బరరాజులు భయంపడిరి. దండయాత్రలుమానిరని యతఁడు సైనికులతోడను దండనాథులతోడను, నృపకుమారులతోడను నగరవాసులతోడను బలుమాఱు జెప్పుచు వచ్చెను. మణివర్మను మొదటఁదలఁచుకొన్నట్లు చిత్రభానుఁడు ధనమునిమిత్తమై హింసింపలేదుగాని కారాగృహమందు బంధించియుండెను. అతని కెట్టిపాకర్యములు నొడఁగూర్పఁబడలేదు. స్నానమునకు

జలమైన నతనికి దుర్లభమయ్యెను. దినమున కొక్కసారి జొన్న రొట్టె లభింపఁజొచ్చెను. కటిక నేలం బండుకొనుచుండెను. మాసిన గుడ్డ పాత్రన నుదికించుకొనుట కుత్తరవు లేదు. త్రాగుట మొదలయిన మెల్లపనులకు నొక్క మంటిముంతమాత్రము వానికీయఁబడెను. జీవముతో నయిన నుండనిచ్చుటకు దండపాణి మాటసాయమె ముఖ్య కారణమై యుండవచ్చును. పునరాలోచనమీద దండపాణి కిష్టము లేనిపని గావించుట తనకు శ్రేయస్కరముగాదని తలంచి చిత్రభానుఁడు హింసాప్రకరణమునుండి మరలియుండవచ్చును.

చిత్రభానుఁడు వేఁటయందు మిక్కిలి తమకము గలవాఁడు. మృగయాక్రీడయందుఁ దనకుమారుఁడైన విజయసేనునకును విక్రమసేన హర్షవర్ధనులకును నభిరుచిగలిగించెను. వేఁటపేరు చెప్పిన వారు మిక్కిలి యుత్సాహముతో వెడలుచుండెడివారు. విక్రమసేనుఁడు చిన్ననాటనుండియు మృగయాక్రీడ కలవడినవాఁ డగుటంజేసి వేఁట కతఁడు ముందడుగు వేయుచుండెను. రెండుమూఁడు సారులు పిన తండ్రివెంట వారిరువురు మృగయాక్రీడల కరిగి సాయంకాలమున కింటికివచ్చిరి. ఎన్నఁడో యేదో యపకారము చేయునని మహా భయము బిడ్డలకుఁ దల్లికి నుండినను జిత్రభానుని వర్తనము కొంత వఱకు వారికి నమ్మకి గలిగించుచుండెరు. అయినను వారు జాగరూకులై యుండిరి.

అట్లుండ నొకనాఁడు చిత్రభానుఁడు విక్రమసేన హర్షవర్ధనులు విజయసేనుఁడు దండపాణి వజ్రపాణులు మఱికొందఱాప్తులుఁ బరివేష్టింపఁ గొలువుండి నగరవాసుల వ్యవహారములఁ దీర్పులు చెప్పుచుండ సూర్యాస్తమయసమయమున జిఱుచీఁకటులు పడుచుండ నొక యాటవికుఁడు నోచిపెట్టుకొని కఁబళి మీఁద గప్పుకొని చేత నొక దుడ్డుకఱ్ఱఁ బట్టుకొని పరుగుపరుగునఁ గొలువుకూటముసొచ్చి "దండాలుసామీ! దండా"లని నేలసాగిలంబడి మొక్కి నిలిచెను.

"ఎవఁడవురా నీవు? ఏమిపనిమీఁద వచ్చితి" వని చిత్రభానుఁడడిగెను. అందుకు వాఁడు ప్రభువుతో నిట్లు మనవిచేసెను.

"నేను గొల్లల చిన్నవాఁడను దేవరా! మంచుకొండదగ్గఱి చాలిలమెకములు చిఱుతపులులు సివంగులు పిచ్చిపెట్టేఁగి మాపసరములను గసగస నమలివేయుచున్నవి దొరా! పసులమందలు తగ్గిపోయినవి. ఏలినవారు వేఁటలాడి యామెకాలను చంపి మాకింత కూడుపెట్టవలె దేవరా! లేకున్న మేము బ్రతుకజాలము పసరాలే మాసొమ్ములు పసరాలే మా బ్రతుకులు రక్షించు దేవరా! రక్షించు" అని మొఱపెట్టెను.

వాని కుయ్యాలించి చిత్రభానుఁడు కన్నకొడుకును నన్నకొడుకులను జూచి "వేఁటకై యరుగుదమా? గోరక్షణముకన్నఁ బుణ్యకార్యము లేదు. అది యుభయతారకమయిన సత్కార్యము. పాపమీ పేదగొల్లలు మనకవశ్యము రక్షణీయులు." అని యనఁగ వారు ముగ్గురు వల్లెయని యుత్సాహముతోఁ బలికిరి. మఱునాఁడుదయమున మృగయాక్రీడకుఁ గావలసిన సన్నాహమంతయుఁ జేయఁబడెను. ఉరులు, నుత్తులు, వేఁటకుక్కలు, జిగురుగండెలు, దీపములు, బోనులు, విండ్లు, నమ్ములు, బల్లెములు పట్టుకొని వాటి నుపయోగించుటయందు నేర్పరులగు వేఁటకాండ్రు మహోత్సాహముతో కొలువఁ జిత్రభానుఁడు వేఁటకై బయలుదేఱెను.

"మంచుకొండ చాలదూరము. కొన్ని దినములకుఁగాని వచ్చుటకు వీలులేదు. ఎప్పటివార్త లప్పటికిఁ దెలియవు. మనస్థితి బాగులేదు. ఏదినమెట్టిదో తెలియదు. కావున మీరు పోవలదు. నాయనలారా" యని యరవిందాదేవి బిడ్డలం బతిమాలెనుగాని వేఁట తమకము వారిని ముందుకు గెంటెను. మహోత్సాహముతో ముగ్గురు కుమారులు లొకరథ మెక్కిరి. చిత్రభానుఁ డొకరథమెక్కెను. పరివారము ముందునడచెను. దండపాణియు స్వల్పసైన్యముతో వారి వెను

వెంట జనెను. ఆ బృందమెల్ల హిమవత్పర్వతప్రాంతమున కరిగి గుడారములలో బసచేసి యైదుదినములు వేటాడి ప్రముక్కడి మెకములం గొన్నింటి నుక్కడించి గొల్లపల్లియలం దిక్కట్టులం దొలగించిరి.

విక్రమసేనుడు మూడుపులులం గొట్టెను. హర్షవర్ధనుడొక్క చిఱుతం జంపెను. విజయసేనుడు రెండు భల్లూకములం గడతేర్చెను. చిత్రభానుడు రెండు సింగంబులం గూల్చెను. దండపాణి రాత్రివేళ మంచెమీద బొంచుండి చెఱువులో నీరుద్రావుచుండ గొప్ప పులి యనుకొని యొకగాడిదను జంపెను. అయిదుదినములు వేటాడి విశ్రాంతి నిమిత్తమై వారు గుడారములు విడిచి సమీపమున నొక కొండమీదనున్న చిన్నకోటలో విడిసిరి. అక్కడ రెండుదినములు గడపిరి. అక్కడి ప్రకృతిసౌందర్య మతిమనోహరముగా నుండెను. ఆ యున్నత ప్రదేశమునుండి చూడ బ్రథమచరమసంధ్యారాగము ల విశేషశోభాసౌభాగ్యము పద్మరాగమణీయకాంతులను మించి వారి కన్నుదోయి కమితానందము గూర్చెను. ఆకాశము నందుకొనుటకు హిమవంతుడు చాచిన దీర్ఘబాహువులో యన్నట్లు వెలయు మహోన్నత శృంగములతోడను, కొండరాజు తొడిగిన తెల్లని నిలువు టంగీయో యనునట్లు విలసిల్లు మంచుతోడను చేవయు నున్నతియు దట్టమయిన యాకులగలిమియుం గలిగి సూర్యరశ్మి నడ్డగించు మహావృక్షములతోడను నింద్రధనుస్సువలె నానావర్ణములుగలిగి నలుగెలంకులం బరుగులెత్తు విహంగములతోడను, ప్రాయము నైశ్వర్యములు నిల్లే యతివేగంబునం గడచిపోవునని లోకంబునకుం దెలుపుటకో యన నతివేగంబునం మీదినుండి క్రిందికిం బ్రవహించు సెలయేళ్ళతోడను, కొండగుహలు ప్రతిధ్వనులిచ్చునట్లు బొబ్బలిడు బొబ్బ మెకంబులు బెబ్బులులు మొదలగు ఘాతుకమృగంబులతోడను విండ్ల చేబూని మెకంబుల వేటాడుటకయి పిసవిస నడచిపోవు వేటకాండ్ర

తోడను, వేటకాండ్ర వెనువెంట వారి కమ్మ...లనందించుచు నుత్సాహముఁ గలిగించుచు నడచు కిరాతాంగనలతోడను విరాజిల్లు నమ్మంచుగొండం జూచి విక్రమసేనుఁడు బట్టణంబులఁ జూచినప్పటికన్న పొందని మహానందము నొంది తమ్మునకు విజయసేనునకు, వనంబులకు నుపవనంబులకుఁ గల భేదంబు దెలుపుచుఁ దొల్లి యిందే మహేశ్వరుంగూర్చి గౌరి యఖండతపంబు గావించె. ఇందే జగంబునకు మాతాపితలు పురాణదంపతులు నైనపార్వతీపరమేశ్వరులకుఁ గల్యాణమహోత్సవము జరిగె. ఇందే సప్తమహర్షులు ననేక యాగములు జేసి హవిర్భాగములచే వేల్పులం దనిపిరి. ఇందే నరనారాయణ నివాసమైన బదరికాశ్రమ మున్నది. ఇందే గంగానది మొట్టమొదట నెలవు జేసికొన్నది'' యని తత్సంబంధములయిన పురాణగాథల వర్ణించుచు నా రెండుదినములు గడపెను. రెండవనాఁటి రేయి వారందఱు సుఖముగా భుజియించి ప్రియభాషణంబులు సలిపి పండుకొనిరి. విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడు నొకగదిలో శయనించిరి. చిత్రభానుఁడు విజయసేనుఁడు మఱియొకగదిలోఁ బవళించిరి. కొలది పరివారము నచ్చటనుంచి కార్యాంతరములమీఁద దండపాణి యా సాయంకాలమే పట్టణాభిముఖుఁడై పోయెను.

విక్రమసేన హర్షవర్ధనులు గాఢనిద్రావశులై యెప్పటియట్ల ప్రభాతకాలమున మేల్కాంచి లేచిరి. లేచిచూచునప్పటికి విజయసేనుఁడు చిత్రభానుఁడు వారికి గపడలేదు. ఏఁబదిమంది యాయుధహస్తులయిన సైనికులును తమకు వంటలు నుపచారములు మొదలగునవి చేయుటకు నిద్దఱు ముగ్గురు సేవకులు మాత్రము గనఁబడిరి. ''పినతండ్రి యెందరిగె విక్రమసేనుఁడు సైనికులలోఁ బ్రధానపురుషుఁడగు శక్తివర్మయను వాని నడిగ్గె. ''మహాప్రభూ! ఏదో తొందరపనిమీఁద వారు మిమ్ము లేపుటకైన నవకాశములేక గుమారుని మిగిలిన

పరివారమును వెంటఁగొని నిన్న నడిరేయి పురమునకుం జనిరి. ఇట్లు మీతో మనవిసేయుమని నా కానతిచ్చి" రని యాతఁడు బదులు చెప్పెను.

"ఏమీ! తొందరపనిగలిగినదా? మమ్ము లేపుటకైన నవకాశములేకపోయినదా? కుమారుని బరివారమును వెంటఁగొనిచనెనా? ఆహా! మాయమ్మ పోవలదని చేసిన హితోపదేశమును నేను నిరాకరించి మోసపోతినిగదా!" యని విక్రమసేనుఁడు తమ్మునిఁ జూచి "హర్షవర్ధనా! ఎంతయు మోసము వాటిల్లినది. మనల నిందువిడిచి బుద్ధిపూర్వకముగా విజయసేనునిం దోడ్కొని చిత్రభానుఁడు పురమున కరిగినాఁడు. దురాత్ముఁడను వేఁటకు నే నొక్కఁడను రాక నిన్ను గూడ దీసికొనివచ్చితినిగదా మనరాకకై యెంతో యాత్రముతో నిరీక్షించుచుండు మనతల్లి మనము గనఁబడకపోవుటచే నెంతగుందునో యెంత బెంగపెట్టుకొనునో, యామె చిత్త మెంతక్షోభించునో, ఆమె హృదయము భిన్నముగాక యుండునా? ఇంక నామె యన్నముదినునా? నిదురించునా? మనకిది కారాగృహముగాని గృహముగాదు. మన మిక మీఁద బందితులముగాని రాజపుత్రులముగాము. ఈఘాతుకకృత్యము చేయుటకే యతఁ డీవేఁటపన్నుగడ పన్నినాఁడు అతని సంకల్పము ముప్పాతిక నెఱవేరినది, మనమిందు దిక్కులేక మన మొఱలు వినువారు లేక మన సంతాప మార్చువారులేక మనకోరికల దీర్చువారులేక యీ వనవృక్షములట్లు యెన్నఁడో నాశన మొందవలసి యుండును. ఆహా! ఏమిగతి? తమ్ముఁడా నేఁబోయిన విచారములేదు. నీవయిన నమ్మకొఱకుండిన బాగుండును గదా!" యని విచారగ్రస్తుఁడై పలికెను.

అదివిని హర్షవర్ధనుఁడు "అన్నయ్యా! నీవేలపోవలె నేనెందుకుండవలె నేను నీతోడివాఁడనే. ఉండిన నిరువురముండము. పోయిన నిరువురము పోదము. నీవుచెప్పినట్లు తల్లి పొందుతల్లడమింతింతగాదు,

ఆమె జీవింపనే జీవింపదు. అమ్మ దూరదృష్టిగలదై యిట్టి యాపదల శంకించి మనలం బోనద్దన్నది. మన మామెమాట విన్నాముకాము. మాతృశాసన తిరస్కారమునకుఁ దగినఫల మనుభవింపవలయును గదా'' యని దీనాననుఁడై ప్రత్యుత్తర మిచ్చెను.

ఆదినమున వారు వంటలుచేసి సేవకులు పిలిచినను బతిమాలినను భుజింపలేదు. శక్తివర్మ వారికడఁజేరి ''ప్రభువులారా! భోజనము సేయుఁడు ఎన్నిదినములు మానెదరు ? ఇది యొక్కనాఁటిదిగాదు. మీ కిది శాశ్వతమైనచెఱ. మీ రీయిల్లుగడలి యావలికిఁబోకుండ మమ్ము మీపినతండ్రి కాఁపుఁబెట్టెను. నా చిన్నియన్నలారా! అంతటి మహారాజు గర్భమునఁబుట్టి యంతటి మహైశ్వర్యము ననుభవించి తుదకిట్టి దురవస్థపాలైన మిమ్ముఁజూడ మిక్కిలి కఠినుండనైన నా హృదయముగూడ చలించుచున్నది. మేమేమి చేయఁగలము ? సేవకులము. దుర్భరమైన కుటుంబరక్షణమునకుఁ శరీర మన్యుల కమ్ముకొన్నాము. ప్రభువులయాజ్ఞ శిరసావహింపవలయు. లేసిచో మాబుఱ్ఱ లెగిరిపోవును. మాకూఁడు పడిపోవును. కడుపుకక్కుర్తికై ప్రభువుల కడఁ గొలువుచేసి యిట్టి దుష్కార్యములు చేయవలసి వచ్చినందుకు మేము మిక్కిలి దుఃఖపడుచున్నాము. మాకు స్వాధీనమైన పనిలేదు. సేవకు లంతఃకరణము చంపుకొని గుండె రాయిచేసికొని యుండవలయు. మేము మనుష్యులలో లెక్కగాదు. కాబట్టి మమ్ములక్షమింపుఁడు నాయనలారా'' యని కంటనీరు పెట్టుకొనెను.

''శక్తివర్మా ! నీవేమి చేయగలవు ? మే మదృష్టవంతుల మయిన పక్షమున మాతండ్రి కట్టి దుర్మరణ మేల కలుగును ? చిత్రభానున కిట్టి దుర్బుద్ధి యేలపుట్టును ? ఒకరిని నిందింపనేల ? మాభాగ్యమునే నిందించుకొందుము నీవు విచారింపకుము'' అని విక్రమసేనుఁడు వాని నూఱడించెను.

ఇరువది నాల్గవ ప్రకరణము.

చిత్రభానుఁడు వేఁటనుండి కుమారునితోడనుబలగముతోడను మరలివచ్చెనని విని యరవిందా దేవి తనకొడుకులుగూడ వచ్చుచున్నారని వారిం జూచి యానందింప నుబలాటపడుచుండ వారెంత సేపటికి రారయిరి. ఆమె సాయంకాలమువఱకు వారినిమిత్తము నిరీక్షించి యాత్ర మంతకంత కెక్కువకాఁగఁ దన నందనులు రాకబోవుటకుఁ గారణమేమో తెలిసికొనిరమ్మని దండపాణియొద్దకు సేవకుల నంపెను. 'తనకావిషయ మింతమాత్రము తెలియఁదని యాతఁ డుత్తరము జెప్పెను. బెంగ యినుమడింపఁ బుత్రవత్సలయయినయా దేవి నలుగురు బంట్ల నాలుగుప్రక్కలకంపి వేటకాండ్రను దద్విషయమై కనుఁగొని రమ్మని పంపెను. తమకావిషయము తెలియదనివాండ్రును దెలిపిరి.

అరవిందా దేవి తొట్రుపాటు వర్ణనాతీతమయ్యెను. అప్పుడామె వృద్ధకంచుకియయిన ముంజినిబిలిచి చిత్రభానునియొద్దకరికి తద్విషయ మరసిరమ్మని పంపెను. వాఁడును సత్వరంబయరిగి యతనిజోహారొనర్చి వినయపూర్వకముగా రాజకుమారు లేలరాలే' దని యడిగెను. అతనికిఁ జిత్రభానుఁడిట్లనియె. "కుమారులు సేమముగానున్నారు. మంచుకొండ చరియలలో నొకదానిమీఁద మనోహరమైన కోటగలదు. వారక్కడ గొంతకాలముండి యవ్వన సౌందర్యము శైల సౌందర్యముఁ జూడవలయునని కోరుటచే వారినక్కడ నుంచివచ్చితిని. భయములేదని మీరాణిగారితోఁ జెప్పు. పో."

ఆమాటవిని ముంజుఁడు వెంటనేరాచనగరున కరిగి యేమియుత్తరము వచ్చునోయని తత్తరపడుచున్న రాణికెఱింగించెను. అమ్మాటలు శూలపుంబోటులువలె నామెకర్ణములనాఁట నిలువఁలేక నేలం గూర్చుండి "అయ్యో! నర్మదా! నర్మదా! దురాత్ముఁడయిన

చిత్రభానుఁడు నాకొడుకులఁ గడతేర్చినాఁడే తల్లీ! కటకటా! నాపసిపాపల నితఁడు తనకడుపునఁబెట్టుకొనెనే. అయ్యో! ఏమిసేయుదునే? నర్మదా! ఏదో ఘాతుక కృత్యము జరిగినదే. ఓసీ! నేను నిలువలేను. నా గుండెలు కొట్టుకొనుచున్నవి మనస్సు మండుచున్నది. ఒడలు వడఁకుచున్నది. తల తిరుగుచున్నది. కన్నులు చీకట్లు గ్రమ్ముచున్నవి. నీవు వచ్చి పట్టుకొనవే నన్ను. ఎవరితోఁ జెప్పుకొందునే? మణివర్మ లేఁడు మాధవసేనుఁడు లేఁడు. గదాధర శూలపాణులు లేరు. ఎంత దిక్కుమాలినదాననైతినే! ఇప్పుడేమియుపాయమే? ఆలోచన చెప్పువారయిన లేరే! నీవేమనియెదవే?'' యని పరిపరివిధముల నాక్రోశింపఁ దొడఁగెను.

ఆమె దుఃఖముఁ జూచి నర్మద వెఱపుంజాలియు మల్లడిఁగొన నేమి చెప్పుటకుం దోఁచక నెట్లు సమాశ్వాసించుటకు నుపాయము గానక "అమ్మా! నేను పోయి సింహాద్రిగారిని గనుఁగొని వత్తునా'' యనెను. "ఓసీ! నీవు కాదు వెళ్ళవలసినది. పిన్నె యచ్చటికిఁ దీసికొని పొమ్ము. నేనా యిందుమణి యమ్మగులమీఁదను గర్పూరమంజరిపాదములయొద్దను బడి నా చిన్నియన్నల నాకర్పింపుమని ప్రార్థించెద. తీసికొనిరా. రథము తీసికొనిరా. జాగుసేయకు. నిమేషమాత్రమాలసించితివా యేమి జరుగునో నీవే యెఱుఁగఁగలవు'' అని కఠినముగాఁ బలుకుటయు నర్మద యప్పుని సారథినొక్కనిం బిలిచి యరదంబు పన్నించి దేవినందుఁ గూర్చుండఁబెట్టి దాను నామె ప్రక్కను గూర్చుండెను.

కోటకావలి నిమిత్తము చిత్రభానునిచే నియమింపబడిన మొఱకుజోదులు స్యందనము నిలిపి కోటలోనుండి యావలి కెవరిం బోనియ్యవలదని చిత్రభానునియాజ్ఞ యయినదని దెలిపిరి. అప్పలుకులు విని మహాగ్రహాపూరితచిత్తయై కోపావేశంబునఁ బలుకులు తడబడఁ

నరవింద రథములోనుండి బిగ్గరగా "ఓరీ! ఎవఁడురా నా స్యందన మాఁపగలవాఁడు? ఈ రథ మెవ్వరిదిగా దలఁచితివి. హేమచంద్ర మహారాజు పట్టమహిషియుఁ గుమార విక్రమసేనుని మాతయునగు నరవిందదిగా గ్రహింపుఁడు. ఆనయిచ్చుటకుఁ జిత్రభానుఁ డెవ్వఁడు? నిలుపుటకు మీ రెవ్వరు? సూతుఁడా! రథము సాఁగనిమ్ము. ఎవ్వరేని నడ్డమువచ్చిన నేనే రథము దిగి గుఱ్ఱముముందర నడచెద. వారి ప్రభువు నాజ్ఞాప్రకారము నన్నుం జంపుమని యీ బంట్లతోఁ జెప్పుము" అని పలికెను. భీషణములైన యా భాషణములు ధైర్య శోషణముగావింప నాజోదులు భయకంపితులై యేమియుఁ ననఁ జాలక నొత్తిగిలిరి. రథము నిరంతరాయముగ సాఁగి చిత్రభానుని గృహముముందర కరిగి నిలచెను. కుమారవియోగ సంజనితమయిన మనస్తాపమున నొడలెఱుఁగక దేవి యెదుటనున్న వారెవ్వరో తెలిసి కొనకయే నర్మద దారిజూప సింహద్వారము దాఁటి లోపలికి వాటములు దాఁటి యభ్యంతరమందిరమున కరిగెను. అరిగి "యిందుమణి యెక్కడ? ఇందుమణి యెక్కడ?" యని విచారించి సేవకులవలన నామెయున్న చోటెఱిఁగి యాతావునకుం జనెను.

అప్పుడు కర్పూరమంజరియు నిందుమణియు నొకమంచముపై గూరుచుండి యేదో మాటలాడుచుండిరి. విజయసేనుఁడు దాని రాక జూచి విసవిస మేడమీఁదికరిగి తండ్రి కెఱిఁగించెను. అరవిందాదేవి తనయింటికి వచ్చునని చిత్రభానుఁ డెన్నఁడు దలఁపలేదు. అతఁ డదరి పడెను. రుద్రభట్టు మహాశ్చర్యము నొందెను. వెంటనే చిత్రభానుఁడు మేడదిగి క్రిందికివచ్చెను. అరవిందాదేవి గది ప్రవేశించిన తోడనే మహాశ్చర్యముచేఁ గన్నులు పెద్దవిచేసి చూచి యిందుమణియుఁ గర్పూరమంజరియు మంచముమీఁదినుండి దిగ్గున లేచి నిలిచిరి. అరవింద వారి యిరువురపాదములపైఁ బడి "అమ్మా! పుత్రభిక్షము పెట్టుఁడు పుత్రభిక్షము పెట్టుఁడు" అని వేఁడుకొనెను.

ఆగొడవ వారేమియు నెఱుంగకపోవుటచే వారిరువురుఁ దెల్ల బోయి చేతులతోఁ నామెనెత్తి "అయ్యో! ఇదియేమివెఱ్ఱి? మా యడుగులమీఁద బడఁజెల్లునా? తల్లీ! మీకుఁబంపర మేమెంతవారము? బిడ్డలకేమియాపద వాటిల్లెను? అని తొట్రుపాటుతోఁ బలికిరి. అందు కరవింద వారింజూచి తనకొడుకులు చిత్రభానునితో వేఁటకరుగుట, బలగమంతయువచ్చినను వారు రాకపోవుటఁ గొండకోటలో నున్నా రని చిత్రభానుఁడు చెప్పుట మొదలగు వృత్తాంత మంతయు గద్గద స్వరముతో దుఃఖపూరితయై తెలిపి "తల్లీ! కర్పూరమంజరీ! నీవు నాకన్న కూఁతువుగాకున్నను నిన్నే నాబిడ్డగాఁ జూచుకొంటి. ఇద్దఱు మగబిడ్డలు నాకొకయాఁడు బిడ్డ యని సంతసించుచుంటిని. అమ్మా! నీతమ్ముల రక్షింపుము. తమ్ములం జూపుమని నీ తండ్రి నడుగుము. చూపఁడేని ఇదిగో! నేను రాచకూఁతురను సాహసంబులందు ముం దంజవేయుదానను. ఇదిగో! నాచిన్నకత్తి మొలలోనున్నది. ఇప్పుడె నీతండ్రి చూచుచుండ నీవు నీతల్లియుఁ జూచుచుండఁ బొడుచుకొని బిడ్డలకు దూరమై, భర్తకు దూరమై, వసుంధరాదేవికిని మీకును భారమైన యీశరీరము మీతండ్రిపాదములయొద్ద విడిచెను ఆయన కనులు చల్లఁబడుఁగాక! ఇదివఱకే భ్రాతృహంతయని పేరువచ్చి నది. ఇప్పుడు శిశుహంతయైనాఁడని నాయనుమానము. ఇప్పుడు నా చావుచే నాయన పాపశరీరమునకు మకుటమేర్పడును. బిడ్డా! కర్పూర మంజరీ! పద. నీతండ్రియొద్దకుఁ బద, తల్లీ! యిందుమణీ! పద నీపతి కడకు పద" అని మిక్కిలి యార్తయై తీవ్రముగ భాషించెను.

చిత్రభానుఁడు ప్రక్కగదిలోనుండి యప్పలుకులు వినుచుం డెను. రుద్రభట్టు వానిప్రక్కనేయుండి యతని చెవిలో నేదో గుసగుస లాడుచుండెను. కర్పూరమంజరి యామె దీనదశఁజూచి మెత్తని చిత్తము మిక్కిలి యుత్తలపాటునొందఁ దత్తఱంబునఁ దండ్రికడ

కరిగి "నాయనా! ఏమిది? తమ్ములేమైరి? ఎందుండిరి? కుశలముగ నున్నారా? ఆమెబిడ్డల నామె కప్పగింపుము. నీకీ యపవాదమేల! ఇదివఱకే నీతలపైఁ బడిన లోకాపవాదములు చాలవా? ఆదూర్య శోభారమున నీవెగాక మేముగూడ గ్రుంగిపోవుచుంటిమి. ఆ యప కీర్తి యను నంధకారమువలన మన కులప్రతిష్ఠ నల్లఁబడినది. సత్వర మామెబిడ్డల నప్పగింపుము" అని మందలించెను.

చిత్రభానుఁడు బిడ్డనుడువుల నాలించి "అమ్మాయి! నీతమ్ములు కుశలముగనున్నారు. ఏల యీమె తొందర? వారు హిమవత్పర్వత సౌందర్యముఁ జూడ నుబలాటపడుటచే నచ్చట నునిచితిని. పది దినములలో వత్తురు. మహారాజ్ఞి అంతఃపురవాసిని ఈమె యేమి, యీరాత్రి తొందరతో వచ్చుటేమి? ఇంత మనఃక్షోభ మెందుకు? ఏమిమునిఁగిపోయినది? ఇప్పుడు కోటకు జనుమనుము" అని నిర్వి చారముగ నుత్తర మిచ్చెను.

అదివిని యరవిందాదేవి మహారోషమున నిట్లనియె. "ఏమి మునిఁగిపోయినదా? నామనస్సు దుఃఖమున మునిఁగిపోయినది. మీ పలుకులు నే నమ్మఁజాలను. ఒకవేళ వారు బ్రతికియేయుండిన వారిని నీవు చెఱలో బంధించితివి. అందుకే యమాయకులైన పసిబిడ్డలను మాయమాటలుచెప్పి వేఁటవంకబెట్టి దూరము తీసికొనిపోతివి. నేను రాణినా? నేను రాణినిగాను నేను నీదాసిని. నారాణితనము నాఁడే పోయినది. నేను కోటకుంబజనను. నాబిడ్డలులేని కోట శ్మశానముగాని కోటగాదు. నాచిన్నియన్నలులేని నగరుఁ నట్టడవిగాని నగరుకాదు. నాబహిఃప్రాణములు లేని యీభవనము సముద్రముగాని భవనము గాదు. ఆకోట నేఁ బ్రవేశింపను. నాబిడ్డలఁ జూచినదాఁక యీ నగ రులో నే నడుగుపెట్టను. నన్నుఁజంపి శవమును శ్మశానమునకయినఁ బంపుము. లేదా నాకొడుకుల యొద్దకయినఁ బంపుము. వారింజూడమి

నాకన్నులు వాచిపోయినవి. ఏరీ! నారత్నాలరాసులు? ఏరీ! నాబంగారుబొమ్మలు? ఏరీ! నావరాలకుప్పలు. ఏరీ! నాసింగపుఁగొదమలు. ఏరీ! నాముద్దులమూటలు. ఏరీ! నా గారాల కాణాచులు. చూపవా! ఇదిగో చూరకత్తి పొడిచి చంపు. నీచేతులతో నేనన్ను నాభర్తయొద్దకుఁ బంపు." అని యతని కాళ్ళ సమీపమున నేలపై సాగిలఁబడెను.

అప్పలుకులు విన్నవారందఱు భయమున గడగడవడఁకిరి. జాలిగుండెగల చిత్రభానుని మేనుసయితము కంపించెను. "ఇది మనకుఁ దగదు. ఆమెను బిడ్డలయొద్దకైనఁ బంపుఁడు. లేదా, బిడ్డల నామెయొద్దకైనఁ దీసికొనిరండు" అని యిందుమణి చెప్పెను. "తండ్రీ! నాగుండెలు వ్రీలుచున్నవి. నాతమ్ములం దీసికొనివచ్చి యామెకుం జూపుము. నేనును వారిం జూడదలఁతు" నని కర్పూరమంజరి జనకునితోఁ బలికెను. అప్పలుకులు విని చిత్రభానుఁడు "ఆమెయు మీరు నింతనిష్ఠురోక్తులు బలుకనేల! ఆమె నిప్పుడె బిడ్డలయొద్దకు బనిచెద. ఉండుఁడు" యని యవ్వలికుం జని కరటకపింగళులం బిలిచి వారితో నేదో పదినిమేషములు చెప్పి మరల వచ్చి, "యీసేవకు లిరువురు నీరథముపై వచ్చి నిన్ను నీబిడ్డలున్నచోటికిఁ దీసికొనిపోఁగలరు. వదినె! రథమెక్కుము. నర్మదంగూడ దీసికొనిపొమ్ము నీవు నీబిడ్డలం గలిసి మరల నిక్కడికి సుఖముగా వత్తువుగాక!" అని చెప్పెను.

"నాకిదే మహోపకారము. ఇదేపోయివచ్చెద" నని వారినందఱి నామంత్రణముచేసి యరవిందాదేవి నర్మదంగూడి యరద మెక్కెను. కరటకపింగళులు సారథి కిరువంకల నయ్యరదముమీఁదనే కూర్చుండిరి. పయనము సాగెను. కరటకపింగళులు చూపిన దారిని సూతుఁడు స్యందనముఁ దోలెను.

అట్లు రెండుదినములు వారు ప్రయాణముచేసి రెండవనాఁటి సాయంకాలమునకు నట్టడవుల నడుమనున్న యొకచిన్న కొండకోటం

జేరిరి. ఆకోటచుట్టుఁ గొండలుగలవు. ఒకటిరెండు చెంచుల పల్లియలుఁ గలవు. "ప్రయాణశ్రమచే మేము మిక్కిలి యలసితిమి రెండుదినము లిక్కడ విశ్రమించి పిమ్మట మీకొడుకులున్నచోటికిఁ బోవుద"మని కరటకపింగళు లాదేవితోఁ జెప్పి మిక్కిలి కష్టముమీఁద నామె నొడంబఱచిరి. వారక్కడనుండగానే ముప్పదుగురు జోదులు సాయుధులైవచ్చి వారిం జేరిరి. ఈ బలగమెందుకని యరవిందాదేవి కరటకపింగళుల నడుగ మనము కొండలోనుండి పయనము సేయవలయు. మన కంగరక్షగా మీమఱఁది పంపె"నని వారుత్తరము చెప్పిరి.

ఆ బలగముచేరిన మఱునాఁటిరేయి సెల్లరు గాఢనిద్రం దగిలి యుండఁ గరటకపింగళులు నిదురించుచున్న సూతుని మెడ కురిబోసి వానిం గడతేర్చి యొక కొండవాఁగునం బాఱవయిచి యరదము మీఁద నెక్కి దానిం దోలుకొని శ్రీనగరమునకుం జనిరి. మఱునాఁ డుదయమునఁ గరటకపింగళులను సూతునిఁ గానక యరవిందాదేవి వారేమయిరని యంగరక్షకుల నాయకునడుగ నతఁడిట్లనియె.

"అమ్మా! ఈకొండకోట మీకుఁ జెఱసాల. మీరిందుండ వలయు. మిమ్మిటనుండి కదలనీయఁగూడదని చిత్రభానుఁ డానతిచ్చెను. సూతుఁడేమయ్యెనో మేమెఱుఁగము కరకటకపింగళులు నిన్న రేయి శ్రీనగరమునకుం బోయియుందురు. మీకు గావలసిన సకల పదార్థములు దెచ్చి యీయవలయునని మీమఱఁది యానతిచ్చె. మీకేవి కావలయునో యవి నర్మదచేత మాకెఱిఁగింతురేని మేమవి తెచ్చి మీకు సమర్పించువారము."అని యున్నదున్నట్లుగ రక్షక నాయకుఁడు పలుక తనకొడుకుల నచిరకాలమునఁ గలసికొనఁ గలుగుదునని పుట్టెడాస పెట్టుకొనియున్న యాదేవికి పిడుగడచినట్లు నిశ్చేష్టయై నేలంగూలెను. నర్మదయు దుఃఖాక్రాంత మానసయై యామె మొగంబునఁ జల్లనినీరు జల్లి సాధ్యములైన శైత్యోపచార

ములం జేసెను. అంతఁ గొండొకవడికి కాదేవి మూర్ఛనుండి మేల్కని "హా! కుమారులారా! మిమ్మింక జూచెడుభాగ్యము నాకు లేదు. మీరు జీవించియున్నారను నమ్మికయే నాకుఁ బోయినది. ఆ దురాత్ముఁడు మిమ్మే మాయోపాయములనో గడతేర్చియుండును. నన్ను మాత్రము చేతులారఁ జంపక మీనిమిత్త మాజన్మాంతము విలపింపుమని నాగరకులు రాని నట్టడవిలోఁ బడవైచె. ఇఁక నేమిసేయుదు? నర్మదా! ఇఁక నీబ్రతుకెందుకే? తీసికొనిరావే విసము! జానెడుత్రాడు తేవే! చిన్నకత్తి నాచేతికియ్యవే! నాచిన్నయన్నలారా! అట్టివంటి ప్రాణేశ్వరుడు గతించినను మీరిరువురు నారెండుకన్ను లనుకొని నా బహిఃప్రాణము లనుకొని నాకన్నుల చందమామయనుకొని నాతపః ఫలములనుకొని నేను బోయినయెడల మీకు సుఖములు జరుగవని, నేను ప్రాణేశ్వరుతో సహగమనము చేయక, తరువాతనయిన నసువులు విడువక జీవించియుంటి. ఇఁక నాజీవనమువలనఁ బ్రయోజనమేమి? హా! యెంత దురవస్థ ప్రాప్తించినది? ఓ చిత్రభానహాతిక! నా కారాగృహనివాసమునకు నేను విచారింపను. నామరణమునకు నేను చింతిల్లను. రాజ్యములేదని విచారింపను. సామ్రాజ్యమంతయు నీ వేలుకొన్నను సరే. కోటిసామ్రాజ్యములకన్న నెక్కుడు ప్రియములయిన నా గారాబుబిడ్డల నా చిన్నకూనల నాకియ్యరాదా? వారిమొగములే నాకు సామ్రాజ్యసుఖము నిచ్చును. వారిమాటలే నాకు ధనములమూటలు నా తండ్రులారా! జీవించియున్నపక్షమున మీరెంత దురపిల్లుచున్నారో? మీరెంత కష్టపడుచున్నారో? ఆ దురాత్ముఁడు మిమ్మే హింసలుపాలు చేయుచున్నాఁడో? జీవచ్ఛవమునయిన నన్నును బరలోకగతుఁడైన మీ తండ్రిని దలంచి మీరెంత గుందుచున్నారో? మిమ్మతఁడు వధించియుండిన బలవన్మరణ సమయమున మీరెంత సంక్షోభించిరో అయ్యో! తనయులారా! పలుకరేమి? నన్ను కౌగలింపరేమి! నాకథ

మొసఁగ రేమి? హర్షవర్ధనా! హర్షము వర్ధిల్ల జేయవేమి? అయ్యో! హర్షముగాను—బాష్పవర్షము వర్ధిల్లఁ జేయుచున్నావు. విక్రమసేనా! రావేమి? నాయక్క అదీర్పవేమి? హా! హేమచంద్రభూపాల! నీబిడ్డల గతి యెట్లయినదో చూడుము” అని విలపించుచు మాటిమాటికి మూర్ఛిల్లుచుఁ జిత్రభానుని దెగడుచు విధిని దూరుచుఁ దనయదృష్ట మును నిందించుకొనుచుఁ గొడుకుల సుగుణంబుల నుగ్గడించుచు సౌందర్యంబుల వర్ణించుచు మూర్తీభవించిన శోకదేవతవలెనుండెను. ఆదినము మొదలుకొని యామెయన్నము ముట్టదయ్యె. నిదురపోవ దయ్యె. నర్మద యాత్మహత్య చేసికొనకుండ నామెను బలు తెఱంగులఁ గాపాడుచుండెను.

అట్లయిదాఱు దినములు గడచినపిదప నొకనాఁటినడిరేయి రక్షకభటులు నర్మదయుఁ దద్దయు నిద్దురం దగిలియుండ నరవిందాదేవి చప్పుడుగాకుండ గడియలుదీసి తలుపులు తెఱచి మెల్లమెల్లగ నావల కుం జనియెను. తెల్లవాఱువఱకు నర్మదకు మెలఁకువరాలేదు. మెలకువ వచ్చినయనంతర మామె దేవింగానక మనంబుకలఁత జెంద నా గృహము నాలుగుప్రక్కల వెదకి కావలివాండ్ర కావార్త నెఱిఁగిం చెను. వారుం జుట్టుప్రక్కల కొండలు గుహలు వనములు వెదకి తమ కామె యెందుంగానఁబడ లేదని చెప్పిరి. నర్మద రాణియవస్థకుఁ దన యేకాకిత్వమునకు బిట్టువగచుచుఁ దన్నావలకుఁ బోనిమ్మని కావలి వాండ్రను వేఁడుకొనెను. రాజు సెలవు లేక యట్లుచేయుటకు వీలులేదని వారు చెప్పిరి. దేవి మతిచెడి తమ్ము బేలుపుచ్చి యర్ధరాత్రమున నెందో యరిగినదని యంగరక్షకులనాయకుఁడు చిత్రభానునకుఁ దెలుపు మని సేవకులనంపెను.

“నర్మదను విడువవలదనియు వారందఱక్కడనే యుండవలసిన దనియుఁ జిత్రభానుఁడు మరల వారికుత్తరువులంపెను. పదిదినములు

గడచినపిదప నొకనాఁ డొకచెంచు దేవి తప్పిపోయినదని చెప్పుకొనుచున్నయంగరక్షకులతో నిట్లనియె. "అయ్యా! ఇక్కడికినాలుగుక్రోసుల దూరమున నొకగొప్పవాఁగున్నది. నేను వేఁటకుఁ బోయినప్పుడందులో నొకయాఁడుదాని శవము గనఁబడినది. మొగము చేఁపలు తినివేయుటచే నానవాలు తెలియలేదు. వ్రేళ్ళుగూడ చేఁపలు కొఱికివైచినవి. విగ్రహము చక్కనిది. అది రాణిగారి శవము కావచ్చును. మీఁద మీచిత్తము." అని వాఁడెఱిఁగింప నాబంటులు బద్ధకించి 'ఇప్పుడు శవమును జూడనేల? పోయినదెట్లోపోయినది" యని యూరకుండిరి.

అవస్థలు తప్పినప్పు డెంతవారయినను దనుబంటులకుఁ గూడ జులకనయగుదురుకదా!

ఇరువదియైదవ ప్రకరణము

హేమచంద్రుని కుటుంబమును రాజధానికిఁ బాపి కొండలవాలు గుట్టలపాలుచేసి చిత్రభానుఁడు తాను మునుపునివాసముచేయుచుండిన గృహమువిడిచి కోటలోఁ బ్రవేశించెను. పేరునకు విక్రమసేనుఁడే రాజనిచెప్పుచున్నను నిజముగా, చిత్రభానుఁడే కాశ్మీరదేశమహారాజై రాజ్యవ్యాపారములుయథేచ్ఛముగా,నిరంకుశముగానిర్భయముగాఁ జక్కఁబెట్టుచుండెను. అంతదనుక జిత్రభానుని యింటఁ దాఁగియుండి ప్రజలకుఁదనమోముఁ జూప సంశయించుచుండిన రుద్రభట్టు చిత్రభానుని మంత్రియై సకలకార్యములయం దతని కుపద్రష్టయై కొలువుకూటమున నాతనిప్రక్కం జేరి కూర్చుండి సభాసదులయు, రాయబారులయు మన్ననలువడయుచుండెను. అతని మొగము

కంఠధ్వని బాహువులతీరు, కన్నులపొంకము మున్ను గుహలో హేమ చంద్రుని బేలుపుచ్చిన హరిశర్మ మొగమువలె నున్నదని పోలికల వలనఁ గొండఱు గ్రహించి యుండుటకుఁ గారణమేమని యెదుగఁ దలపెట్టిరిగాని చిత్రభానున కందువలనఁ గోపము వచ్చునేమోయని శంకించి యూరకుండిరి. విక్రమసేనహర్షవర్ధను లెందున్నవారని యెట్లున్నవారని యెవ్వరే నెప్పుడేని యడుగ వారు మాత్సరమేతముగా హిమవత్పర్వతప్రాంతములందలి కొండకోటలలో సుఖముగా నున్నారనియుఁ బ్రకృతిసౌందర్యము వారిని సమాకర్షించుటచే నచ్చోటు విడిచి రాఁజాలకున్నారనియు నప్పటివార్తలప్పుడు తెలియుచున్న వనియు నతఁడు చెప్పుచుండెను. అమాత్యులును బంధుగులును ముఖ్యముగఁ గర్పూరమంజరియు నమ్మి వారి కేయపాయము లేదని భావించుచుండిరి.

ఇట్లుండ నొకనాఁడు వేగులవాండ్రు చిత్రభానునికడకు వచ్చి వానితో నిట్లు విన్నవించిరి. "దేవా! మాధవసేనుఁడు పురికొల్ప మాళవరాజసైన్యములు మనపై దండు విడియుచున్నవి. ఆసేనను వారి సేనానాయకుఁ డగు కంఠీరవదేవుఁడు మొనగాఁడై నడుపు చున్నాఁడు. మాళవరాజనందనుఁ డగు మకరందుఁడు మీతోఁ బోరుటకు స్వయముగా వచ్చెచున్నాఁడు. ఇరువదివేలు కాల్వురు, ఐదువేలాశ్వికులు నేనూరు మహాగజములు వారివెంటవచ్చుచున్నవి. అవిగాక వేనవేలు శిబిరానుచరులు, బహుసహస్రములు పసువులు, పసువులకు గడ్డిసైనికుల భోజనపదార్థములు మితిమీరి యున్నవి. వా రుజ్జయినీపురము బయలుదేరఁగానే దేవరవారి కీవృత్తాంతము దెలియ జేయ మిక్కిలివేగముగా వచ్చితిమి. మీఁద దేవరచిత్తము."

అనవుడు చిత్రభానుఁడు త్రుళ్ళిపడి "ఆలాగా! మనమింక జాగరూకతమై నుండవలయు," నని వారిం బనిచి దండపాణిని వజ్ర

పాణిని తక్కిన చమూపతులను బిలువనంపి చారులు తనకు విన్నవించిన వృత్తాంతమంతయు వారికెఱింగించి సమరసన్నాహము చేయింపుమని యానతిచ్చెను.

వెంటనే సేనాపతులు క్రొత్త సైనికులం జేర్చుకొని వారికి విలువిద్దియ నేర్పి సాంగ్రామిక శాస్త్రమునం బరిచితులం జేసిరి. కోట బురుజులు దృఢతరంబుగం జేసిరి. అగడ్త నిండ నీ రెక్కించిరి. కోటలలో రెండేండ్లు పగతులు ముట్టడించినను సైనికులు చిక్కుపడకుండునట్లు సంభారముల నిలువం జేయజొచ్చిరి. ప్రతికోటయందు ముఖ్యముగా శ్రీనగరకోటయందు శస్త్రచికిత్సకులను నియమించి వారికిం గావలసిన పరికరముల సమకూర్చిరి. ముప్పదివేల కాల్బలము, పదివేల యాశ్వికబలము సహస్రగజబలము నచిరకాలములో సిద్ధమయ్యెను.

చిత్రభానుఁడు తన యాప్తసేవకుఁడైన కరటకునిం బిలిచి యిట్లు చెప్పెను. "ఓరీ! విదర్భరాజసైన్యములు మనకుం దోడుపడుటకు బైలుదేరునని చారులు నిన్న చెప్పిరి. నీవు మధ్యేమార్గమున వారింగలిసికొని వారు కాశ్మీరమునకు వచ్చుటకు మాఱుగా మన పక్షమున మాళవదేశముమీఁద దండువిడిసి యాదేశమును స్వాధీనము చేసికొని సుదర్శనుని సింహాసనభ్రష్టునిఁ జేయవలయునని చెప్పవలయు. ఇవిగో నాముద్రవైచిన జాబులు. జయంతునకు నుగ్రసేనునకు నేనిచ్చుచున్నాఁడ. వీనిం గొంపోయి వారికిం జూపుము. ఇప్పుడు మాళవదేశమును జయించుట మిక్కిలి సులభము. ఏలయన వారిసేనయంతయు మనమీఁదికి వచ్చుచున్నది. ఉజ్జయినిలో నిప్పుడు దళము స్వల్పముగానుండును. అందుచే నా రాజ్యము నిర్గళంగా మన వారిచేతఁ బడును. నేఁ జెప్పిన మాటలేగాక భట్లు నీ బుద్ధికిం దోఁచినట్లు సమయోచితములగు మాటలు చెప్పి మనపై గత్తికట్టినందుకు మాళవరాజునకు బుద్ధివచ్చునట్లు చేయుము. సుదర్శనుఁడు స్వయంకృతాపరాధఫల మనుభవించుఁ గాక!

మిక్కిలి వేగముగా నడచు నొంటెపై నెక్కి పదుగు రాశ్వికులం దోడు కొని బేహారివేషమున నీవు పోవుము. నీ విదివఱకు మాకొఱకుఁ బడిన కష్టములకు నీకు మేము కాశ్మీరమునందో, మాళవదేశమునందో, నీవు కోరుకొన్నచోట నాలుగుమూఁ డగ్రహారము లియ్యఁదలఁచు కొన్నాము. నీవును, బింగళుఁడును నాకు రెండు కన్నులై, రెండు చేతులై, రెండు కాళ్లై, యుపచరించుటం జేసి నా ప్రయత్నములు ఫలోన్ముఖము లయినవి.'' అని పలుక కరటకుఁడు ''స్వామీ! మా వలన నేమున్నది? దేవరవారియాజ్ఞాబలమే మాచేత నన్నిపనులు చేయించినది. అట్లే పోయివచ్చెద'' నని వీడ్కొని మఱునాఁడు పయనమై పోయెను.

మకరందుఁడు మహాసేనాసమేతుఁడై యమాత్యనందనుఁడగు భద్రసేనుఁడు తనకు సహకారియై మనోరంజనము సేయుచుండ. చండశాసనుఁడగు కంఠీరవదేవుఁడు సేనలు నడుప మహాసన్నాహముతో నుజ్జయిని వెడలి కర్పూరమంజరీ సమాగమాభిలాష తన్నుఁ ద్వర పెట్ట నిరంతర ప్రయాణంబులు సేయుచుండెను.

చిత్రభానుఁడును సంగ్రామసన్నాహములఁ జేయుచు నొక నాఁటిరేయి రుద్రభట్టుంగూడి కార్యాలోచనము సేయుచు దండపాణిం బిలువనంపెను. అప్పుడు రెండుజాములు రాత్రియయ్యె. దండపాణి కోటఁజొచ్చి రుద్రభట్టసమేతుఁడై యున్న చిత్రభానుం జూచి పిలువనంపిన కారణమేమని యడిగెను. చిత్రభానుఁడు కొంచెము సేపు సందేహించి ''శంకింపక చెప్పవయ్యా! దండపాణి మనవాఁడే'' యని రుద్రభట్టు పురికొల్ప మెల్ల మెల్లగ నిట్లనియె.

''మిత్రుఁడా! నీసాయమున స్వర్గతుల్యమగు కాశ్మీరదేశము నేఁడు నాపాదాక్రాంతమై యున్నది. నీ తోడ్పాటువలన నే నిప్పుడు రాజమహేంద్రుఁడ నగుటకు సిద్ధముగ నున్నాఁడను. ఇప్పుడు నే

నింకను గాశ్మీరరాజును గాలేదు. ఆ కొఱంతగూడ నీవే తీర్పవలయు. రాజ్యవ్యాపారమంతయు నేను జక్కఁబెట్టుచున్నను రాజు విక్రమసేనుఁడే కదా? నేను వానిసేవకుఁడనే కదా? నాణెములపయి వాని పేరు. వానిరూపము. ముద్రింపవలయుఁ గదా? రాయబారులతో వానిప్రతినిధి నని మాటలాడవలయుఁ గాని 'యహం మస్మి' యని స్వతంత్రముగ నేను బలుకుటకు వీలులేదు గదా? ఈనైచ్యము నా కెంత మాత్రము సమ్మతముగ లేదు. నన్నీ బంధమునుండి తొలఁగింప వలసినవాఁడవు నీవు. నీకన్న సమర్థులు లేరు." అని వెండియుఁ బలుకఁ బోవుచుండ దండపాణి వానిమాట కడ్డముపోయి "ఇందు నేఁ జేయ వలసిన దేమున్నది? మీరు రాజైతిరి గదా! పట్టాభిషేకము జేయు మన్న మేము జేసెదము. అట్లు చేయుమని సెలవా?" యని యడిగెను.

అడుగుటయుఁ జిత్రభానుఁ డిట్లనియె. "మిత్రుఁడా! రెండు ప్రక్కల రెండు బల్లెములట్లు విక్రమసేన హర్షవర్ధనులు జీవించి యుండ నేను పట్టాభిషేక మెట్లు చేసి కొందును? నేను రాజు నెట్లగుదును? రాజ్యము నిష్కంటకమయిన తరువాతఁ గదా నేను గద్దెనెక్కుట. ఆ రెండుముండ్లు పెఱికివైచిన తరువాత సుఖముగా నేను గద్దె మీఁదఁ గూర్చుండెద. అప్పుడు పట్టాభిషేకము జేసికొని యెద."

"అట్లయిన నిప్పుడేమిచేయవలయు?" నని దండపాణి యాత్రముతో నడిగెను. "ఏమిచేయవలయునో యెఱుఁగవా?" యని చిఱునవ్వునవ్వి చిత్రభానుఁడు రుద్రభట్టుమొగము జూచెను. రుద్రభట్టు దండపాణిమీఁద జేయివైచి 'కర్తవ్యము నీకు మేము దెలుపవలయునా? ఆ గాచబుడుతల నిద్దఱ నీవు కడతేర్చితివా మనయెత్తికోలు తుద నెగ్గును. ఇది నీచేతిలోని పని" యని పలికెను.

అప్పలుకులు దండపాణి శ్రోత్రములకు మిక్కిలి దారుణములై వినంబడెను. అతఁడదరిపడెను. గుండె జల్లుమనెను. "అయ్యో! రాజకుమారులం గడతేర్చుటా? అబ్బబ్బ! అది నా కిష్టము లేదు. ఆపని నేను చేయుటా? హరిహరీ! ఎంతమాట? ఆపలుకులు నాతోఁ జెప్పకుఁడు. రాజ్యవిహీనులై వారేకొండకోటలలోనో వారితల్లి కడుపుచల్లగా- హేమచంద్రుని పేరుగా బ్రతికి యుండవలయును గాని, యిట్టిదుర్దశపాలు గాఁగూడదని నాయభిప్రాయము. ఛీఛీ! ఈపాపమునకు నే నొడిగట్టఁజాల. ఇది చేయఁజాలను, వినజాలను." అని భయకంపితుఁడై పలికెను.

అతనివాలకము జూచి చిత్రభానుఁడు ముసిముసినవ్వులు నవ్వి యిట్లనియె. "దండపాణీ! నీవు నీపేరునకుఁ దగినట్లు యమధర్మరాజు వలె నిర్దయుఁడ వనుకొంటినిగాని యింత దుర్బలహృదయుఁడవని నే ననుకొనలేదు. భయపడకు. ధైర్యముదెచ్చుకో! సేనాపతులు యమ ధర్మరాజట్లు- మృత్యుదేవత యట్లు- జాలిలేక యుండవలయు."

"అయ్యో! వారు నా కేమపకారము చేసిరని వారిని నేను గడతేర్చుదును? చండమారునకు వన్నెలు దిద్దుఁ ట్టి యా ముద్దుమొగ ములు జూచిన వారి నెవ్వఁడు హింసింపఁ జేతులు చాఁపఁగలఁడు? వారిని జంప నెవరిమన సొప్పును? అందు విక్రమసేనుఁడు వెనుక నన్నొకసారి బ్రదికించెను. నాకొడుకు నొకసారి బ్రతికించెను. రాజ భక్తి యుండవలదా? దానికేమి కృతజ్ఞతయుండవలదా? కృతజ్ఞత కేమి! మానవలక్షణమైన జాలియుండవలదా? అబ్బబ్బ! ఆమాట నాతోఁ జెప్పవద్దు. మనకు రాజ్యము స్వాధీనమైనది. వారిజోలి మన కెందుకు? వారిదారిని వారినుండనీ! వారు బిచ్చమెత్తుకొనినమైన బతుకఁగలరు" అని దండపాణి స్పష్టముగాఁ బలికెను.

అది విని చిత్రభానుఁడు వెండియు వానిమనసు నొడంబఱుప నిట్లు వాక్రుచ్చెను- "దండపాణీ! నీవు దప్పుదారిం బడుచున్నావు. రాజభక్తి యేమిటి? నీకు విక్రమసేనుఁడు రాజుగాఁడు. నేను రాజును నాయెడల నీవు భక్తిగలిగి నాశాసనము నీవు శిరసావహింపవలయును. కృతజ్ఞత యనునది యర్థములేనిమాట. అది తెలివితక్కువవాండ్ర నుడి. జాలియనునది భీరుజనలక్షణము. మనహృదయము లొకప్పుడు వజ్రకఠినములై యుండవలయు, నొకప్పుడు పుష్పసుకుమారములై యుండవలయు. రాజకార్యధురంధరులు-ముఖ్యముగా దండనాయకులు జగన్నిర్మూలన పరాయణుఁడగు రుద్రుఁడట్లు, జంతుజాలగ్రసన తత్పరమైన మృత్యుదేవతయట్లు జాలియనుమాట దఱిరాకుండ వర్తింపవలయు. ముద్దుమొగము లనుచుంటివి. మృత్యుదేవత యెంతెంతో ముద్దులమూటగట్టు చిన్నబిడ్డల నెందఱిఁ గబళించుట లేదు? దానికోరలు జాలినెఱుఁగునా! వారు నాకేమపకారము జేసిరంటివి? అట్లయిన నీకెన్నఁడు నపకారము సేయని శత్రుసైనికుల వేలకొలఁది మందిని యుద్ధములో నిష్కారణము నీవేల చంపుచుంటివి? వారెన్నఁడైన నీకెగ్గులాచరించిరా? అపకారముచేయనీ, యుపకారముచేయనీ- పగతుఁడు పగతుఁడే. కావున వారి సౌందర్యము నీపని కడ్డము రాఁగూడదు. నీకృతజ్ఞత నీకార్యమున కంతరాయము గలిగింపఁగూడదు. రాజభక్తి నీమార్గము నిరోధింపఁగూడదు. కావున నక్కుమారుల నిద్దఱిఁ బరరాజకంఠలుంఠన మాచరించు నీవాఁడి కత్తికి నెఱఁ జేయవలయు."

అనుచుండ రుద్రభట్టంతలో నందుకొని వానినిట్లు హెచ్చరించె- "దండపాణీ! నీకించుక మరణతత్త్వ మెఱిఁగించెద వినుము! మరణము సకలజంతువులకు సహజము. ఎప్పుడో ప్రతిజంతువు చావక మానదు. మరణము విధినిర్ణయము. జంతువులం బలాత్కారముగఁ జంపున

ప్పుడు కత్తియెట్టినిమిత్తమాత్రమో చంపువాఁడునట్టి నిమిత్తమాత్రుఁడే. భగవానుఁడైన శ్రీకృష్ణుఁడు భగవద్గీతలో నీవలెనే కఱకుదనము విడిచి పిఱికితనముఁ బూనిన యర్జునున కేమియుపదేశించెను? నీవు శరీరమునేగాని యాత్మను హింసింపఁజాలవు. ఆత్మకుఁ జావులేదు. దానికి నాశములేదు. శరీరమాత్మతొడిగెడు యంగీ. నరుఁడు ప్రాఁత బట్టలవిడిచిక్రొత్తబట్టలఁగట్టుకొన్నట్లే, ప్రాతయిల్లువిడిచి క్రొత్తయింటఁ బ్రవేశించినట్లు, మునుపటిదేహమువిడిచి యాత్మ క్రొత్త దేహము స్వీకరించును. బ్రహ్మయీవిధముగా నాశివులకిద్దఱకు మరణము విధించెను. విధినిర్ణయ మనతిక్రమణీయము. నీవుగాకున్న మఱియొకఁడైన వారిం జంపును. అకాలమరణము వారి మొగముల మీఁదుబంతుల వ్రాసియున్నాఁడు. అది నీవు తుడిచివేయఁజాలవు. ఈపనిచేసిన నీకు దోసములేదు. ఒకనిశిరస్సు ఖండింపుమన రాజానతిచ్చును. అట్లు ఖండించిన సేవకుని కేమైనపాపముగలదా? పాపముగాని, పుణ్యము గాని యది రాజుదే. అదియుఁగాక నే నేజంతువుకు జంపనని నీవు ముక్కుమూసికొని కూర్చుండఁగలవా? వేఁటాడియెన్నిజంతువులం జంపుచున్నావు? నీపొట్టనింపుకొనుటకై యెన్నిమేకముల నెన్నిపులుఁగుల హింసించుచున్నావు? ఎన్నినల్లులఁ జంపుచున్నావు? జలముద్రాగునప్పు డెన్ని కీటకముల నీవెఱుఁగక మ్రింగుచున్నావు? ఉచ్ఛ్వాస నిశ్వాసములలో వాయువుతోఁగలసి నీకంటికగపడని పరమాణుతుల్యములగు కీటకము లెన్నివేలు నీకడుపులోనికిఁ బోవుచున్నవో యెఱుఁగుదువా? అదియెల్ల హింసగాదా? హింసలేకుండ నీవుక్షణమయిన జీవింపఁగలవా? ఈవెఱ్ఱిమాటలు విద్వాంసులకడఁ గట్టిపెట్టుము. లోకములోఁ జంపువాఁడు లేఁడు. చంపఁబడువాఁడు లేఁడు. స్వలాభము నిమిత్తమై మనము పేలనుజంపినట్లు నల్లుల నలిపినట్లు—క్రూరమృగములఁ గూల్చినట్లు—మనకడ్డమువచ్చిన మానవుల నయితము దయాదాక్షిణ్యము లేక సంహరింపవలయు."

అనుచుండఁ చిత్రభానుఁ డడ్డమువచ్చి "మిత్రుఁడా! అన్నిటి కేమి? ఈవిషయమాలోచింపుము. విక్రమసేనహర్షవర్ధనులు బ్రతికి యుండిన నేఁడు మాళవరాజు వచ్చుచున్నట్లె మనపైఁగోపమువచ్చి నప్పుడు పరరాజులు వారినిగద్దెనెక్కించుటకై వచ్చుచునేయుందురు. వారున్నంత కాలము మనకీ యలజడియున్నదే. వారస్తమించినఁగాని మనకీశ్రమ యస్తమింపదు. అదిగాక యీరాజ్యము నాదియని నీవు తలంపకుము. నేనిప్పుడుగద్దెయెక్కినను వయస్సుమళ్ళినవాఁడనగుటచే నచిరకాలమున మృతినొందుదును. అటమీఁద రాజుగావలసినవాఁడు నీయల్లుఁడు విజయసేనుఁడు. ఆబాలకుల సంహరించుట నానిమిత్తము గాదు. నీయల్లునినిమిత్తము. నీకూఁతురునిమిత్తము. జాగ్రత్తగా నాలోచించుకో! మాళవసైన్యము రాకమునుపే మనమీపనిచేయ వలయును. వారి నీలోఁగడ తేర్చితిమా మాళవసైన్యములుతమప్రయత్నములు వ్యర్థమని మరలిపోవును. ముందువెనుక లాలోచించు కొనుము" అని కొంతయుత్సాహముతోఁ నచ్చఁ జెప్పెను.

రుద్రభట్టు చేసిన తత్క్షోపదేశము కొంతవఱకు దండపాణి మతము మార్చెను. పిమ్మట విజయసేనునిదే కాశ్మీరరాజ్యమని చిత్రభానుఁడు వక్కాణించినతోడనే దండపాణిమనస్సు సంపూర్ణముగ మాఱెను. విక్రమసేన హర్షవర్ధనులు తనయల్లుని సింహాసనారోహణమున కంతరాయము గలిగించునట్టి కంటకములని వానికిందోచెను. ఆత్మలాభపరాయణతవా నిమనస్సులోనున్న కృతజ్ఞతను రాజభక్తిని జాలినిఁ ద్రోసివైచి యాస్థానము నాక్రమించెను. అతని హృదయ మప్పుడు ఱాయియైపోయెను. అప్పుడతఁడు "సరే! మీచిత్తమువచ్చినట్లుచేసెద. ఏనాఁడు సేన మీవశముజేసితినో, యానాఁడేనాశరీరము గూడ మీవశముఁ జేసితిని. ఈచేతులు మీవి. వీనిచేత మీ యిచ్చవచ్చినపని చేయించుకొనుఁడు." అని యుత్తరమిచ్చెను.

అప్పుడు చిత్రభానుఁడు సంతసించి వానిఁ గౌఁగలించుకొని మిత్రుఁడవన్న నీవే మిత్రుఁడవని ప్రశంసించెను. దండపాణి వంటి మనుష్యుఁడు ప్రపంచమున మఱియొకఁడు లేఁడని, రుద్రభట్టుకొనియాడెను. అప్పుడు చిత్రభానుఁడు వెండియు నాతని కిట్లనియె—"నీవు రేపుదయమున నేపొమ్ము. అక్కడ శక్తివర్మ యున్నాఁడు. అతఁడు నీ కీ విషయమునఁ దప్పక తోడుపడును. వాఁడు మనకు విధేయుఁడు. కార్యశూరుఁడవయిన నీకు నేను వేఱ చెప్పనక్కఱ లేదు. నీకు శుభమగుఁగాక! పొమ్ము.' అంతట రుద్రభట్టునకు నమస్కరించి చిత్రభానునికడ సెలవుగైకొని పోయెను.

ఇరువదియాఱవ ప్రకరణము.

దండపాణి వడిగాఁ బయనముచేసి రాజకుమారులు వసియించు కొండకోటకు మిక్కిలి సమీపముననున్న యొకపల్లియఁ జేరి యందలి గ్రామాధికారియింట విడిసి తనరాక రాజపుత్రులకుఁ దెలియకుండ శక్తివర్మను బిలుచుకొనిరమ్మని యొక సేవకునంపెను. వాఁడును సత్వర మరిగి సేనాధిపతి సెలవయినదని రహస్యముగఁ దెలిపి శక్తివర్మం దోడ్కొనిపోయెను. దండపాణి వాని జూచి సముచితసత్కారములు జేసి పరిజనంబునంతను నావలకంపి వానినొక గదిలోనికిఁ బిలుచుకొనిపోయి చిత్రభానుని శాసనంబునఁ దాను గావింపఁదలఁచిన దారుణకర్మ మతనికెఱిఁగించి తనకుసాయము జేయుమనికోరెను.

అ నుడువులు చెవినిబడినతోడనే శక్తివర్మ భయంబును విస్మయంబును మనంబునఁ బెనఁగొన దండపాణికిట్లనియె. "అయ్యా! నీవు పిల్లలుగలవాఁడవు. నేనును బిడ్డలంగన్నవాఁడను. కటికవాఁడైన

చేయ వెఱచు నీ ఘోరకృత్యమును నీవు స్వయముగాఁ జేయ నెట్లు వచ్చితివో నే నూహింపఁజాలకున్నాను. మిక్కిలి యల్పపదవిలోనుండి మిక్కిలి యున్నతపదవికి నిన్నుఁదీసికొనివచ్చి నీ వృద్ధికెల్లఁగారణమయిన హేమచంద్రునిఁ దలఁచియైన నీపనిమానవచ్చునే బెబ్బులిబారినుండి నిన్నును జలగండమునుండి నీ కొడుకును బ్రతికించిన విక్రమసేనుని దలఁచియైన నీ క్రూరకర్మము మానవచ్చునే? అనాథయై దిక్కుమాలి విలపించుచున్న యరవిందాదేవిని స్మరించియైన నీ పాపకర్మమునకుం దొలఁగవచ్చునే. ముద్దులుమూటగట్టు నా బిడ్డల చక్కదనమును సౌకుమార్యమునుఁ జూచియయిన నీదుష్కార్యము విడువవచ్చునే! ఆ కుటుంబముతోఁ జిరకాలసంబంధముగలిగి వారివలన బాగుపడిననీకు నిప్పనిసేయుటకు మనసెట్లులో ప్పినయ్యా? నీ మనసొప్పిన నోరొప్పెఁగాక! ఇట్టి దుష్కార్యమున నీకు నేఁదోడుపడఁజాల. నా యుద్యోగమునుండి నన్ను రాజుతొలఁగించిననుసరే—నాకు మరణదండన విధించినను సరే—నే నిప్పనియొల్ల. రాజకుమారవధము జేసి యూ నెత్తుటి కూఁడు దిని మనుటకంటె నాఁకలిచేఁ జచ్చుట మంచిది. చావలేకున్న బిచ్చమెత్తి బతుకుటమంచిది. గోచిపెట్టుకొని యడవిలో ముక్కుమూసికొని తపముసేయుట మంచిది. అంతెగాని యీపని నేఁ జేయఁజాల" నని కూర్చున్నచోటునుండి చివాలున లేచినిలిచెను.

దండపాణియుఁ దనపీఠమునుండి లేచి శక్తివర్మ చేయిపట్టుకొని "ఓయీ! నీమాటలఫలమేమో నీ వూహింపలేకున్నావు. రాజాజ్ఞా తిరస్కారము కోడెత్రాఁచుతోఁ జెరలాటమువంటిది. అదికత్తిమీఁది సాము. నిప్పులు కొంగునఁ గట్టుకొనుట. జాగ్రత! అతఁడలిగెనా నీ శిరచ్ఛేదముఁ జేయింపక మానఁడుసుమీ!" యని బెదరించెను.

"ఇటువంటి సత్కార్యమున శిరస్సు పోయిననుమంచిదే. నీ బెదిరికలకు నేను భయపడువాఁడనుగాను. ఈశ్వరేచ్ఛ యెట్లున్నదో

యట్లు జరుగుగాక!" యని శక్తివర్మ యవ్వలకుఁబోయెను. పోయి యతఁడు తనకుఁ బ్రాణమిత్రుఁడు రక్షకభటులలో ముఖ్యుఁడునయిన చండుని బిలిచి తనకును దండపాణికిం జరిగిన సంభాషణ మంతయు రహస్యముగ నెఱింగించి కర్తవ్యమేమని యతని యాలోచన మడిగెను. చండుఁడు శక్తివర్మవలెనే దుష్కార్య విముఖమయిన చిత్తవృత్తి గలవాఁ డగుటంజేసి యతఁడు చేసినపని ప్రశస్తముగా నున్నదని ప్రశంసించెను. "మిత్రుఁడా! నీవు మెచ్చుటంజేసి నాకెంతో ధైర్యము వచ్చినది. అట్లయిన మనకు రాఁదలఁచిన యపాయముఁ దప్పించుటకయి నాకొక యుపాయము దోఁచుచున్నది. అదివినుము" అని శక్తివర్మ చండుని చెవిలో రహస్యముగాఁ గొంతసేపు గుసగుసలాడెను.

అంతలో సాయంకాలమయ్యెను. కాలపురుషుని శరీరమందలి వ్రణమువలె సూర్యబింబమెఱ్ఱనై పశ్చిమాద్రిసంగమమునఁ గానఁబడియెను. ఆవ్రణమునుండి దొరలుగు క్రొన్నెత్తురోయన సంధ్యారాగము కెఱ్ఱనై దెసలవ్యాపించెను. వ్రణబాధచేతఁ గాలపురుషుండు మూల్గుచున్నప్పుడు గల్గు ధ్వనియోయన గూఁడులఁ జేరఁబోవు పులుఁగులయెలుఁగు లెసంగెను. నెత్తురు గడిగివైచి కాలపురుషుని పానుపుపైఁబఱచిన నల్లదుప్పటియో యనునట్లు కాఱుచీఁకటులు విశ్వమంతయు వ్యాపించెను. వ్రణసంబంధమయిన దుర్గంధము పొడమకుండ నాపాన్పున వయిచిన హారతికర్పూరపుఁ బలుకులో యనునట్లు నభోభాగమున నక్షత్రములు విరాజిల్లెను.

విక్రమసేన హర్షవర్ధనులు సూర్యాస్తమయ మైనతోడనే పరమేశ్వరుని హృదయపీఠమున నునిచి ధ్యానముచేసి మాతృవియోగదుఃఖమున నన్నమునరిగా రుచింపకున్నను నేదోవిధముగా సేవకుల వేఁడికోలుచేఁ గొంచెముభుజించి పడకగదిఁ జేరి యేదో

యాలోచించుకొనుచు నొండొరులతోఁ బలుకక యూరకుండిరి. కొంతసేపటికి "తమ్ముఁడా! ఏమిటి నీవాలోచించుకొనుచున్నావు?" అని విక్రమసేనుఁడు హర్షవర్ధనునడిగెను.

"అన్నయ్యా! మరేమియులేదు. నిన్నరాత్రి మనయమ్మ కనఁబడినట్లు, నాచెక్కిలి నొక్కి ముద్దాడినట్లు, ఇంత చిక్కిపోయినా వేమితండ్రీ యని నన్నడిగినట్లు నన్నుఁజూచి కన్నీరు వెట్టుకొనినట్లు నేకలగంటిని. అందుచేత నేనుదయమునుండి విచారముగానున్నాను. బాష్పపూరితమయిన మనయమ్మ మొగము నాకిప్పుడుగూడ గనఁబడుచున్నది. అన్నయ్యా! ఇఁక మన మమ్మమొగ మెప్పుడుఁ జూడలేముగదా? ఆమె యొడిలోఁ దలపెట్టుకొని పండుకొనుభాగ్యము కలుగదుకదా? నిండారుప్రేమతో నామె మనకుఁ బసిఁడిగిన్నెలోఁ బాయసము పెట్టించి యారగింపుమని బతిమాలు సుఖదినంబులురావు గదా? ఆహా! అన్నయ్యా ఎన్నడు తల్లితోఁ గలిసియుంటిమో యెన్నఁడు సుఖపడితిమో యవన్నియు స్వప్న వృత్తాంతములే యయ్యెను." అని బదులుచెప్పి వెక్కివెక్కి యేడ్చెను.

విక్రమసేనుఁడు తొట్రుపాటుతోఁ దన మంచముమీఁదినుండి లేచి తమ్మునికడకుఁ బోయి తమ్ముని మంచముమీఁద గూర్చుండి వెనుకప్రక్కనుండి రెండుచేతులుచాచి తమ్మునిగౌఁగిలించి "నాయనా! విచారింపకుము. కలిమిలేములు కావడికుండలు. ఐశ్వర్యమనుభవించి కష్టమువద్దన్నఁ బోవునా? సుఖదుఃఖములు దివారాత్రములు వలెఁ బర్యాయమున వచ్చుచుండును. వానిని వారించుట కేరికిం దగము గాదు. ఇఁక నమ్మను జూచు భాగ్యము మనకుఁ గలుగదు. ఏమన భర్తృవియోగముచే నిదివఱకే యామె కృశించియున్నది. ఈపుత్రశోకమున నామె యీపాటికే మృతినొందును. చిత్రభానుఁడు మనలఁ గూడ బ్రతుకనియ్యఁడు. ఏదోమాయోపాయమున మనలంగడతేర్చి సింహాసన మెక్కుటకై యతఁడు ప్రయత్నించుచుండును. అందుచే

మనకష్టములు చాలకాల ముండవు. బంధమునుండి గాకపోయినను దేహబంధమునుండి మన కచిరకాలములో విముక్తి కలుగును. అది యునుమేలే. ఈజీవన్మరణముకన్న నిజమయిన మరణమే మనకు మహోపకారము గావచ్చును.'' అని విక్రమసేనుఁడు పలుకుచుండ నంతలో దండపాణి వీథిగుమ్మముకడకుఁ బోయెను. సింహద్వారము కడఁ జందుఁడు శక్తివర్మయు నేదో మాటలాడుచుండిరి. దండపాణిం జూచి వారిరువురు లేచినిలిచిరి. ''శక్తివర్మ! నీనిశ్చయము మాఱలేదు గదా!'' యని యతఁ డడిగెను. ''అయ్యా! మిమ్ము విడిచివచ్చినపిదప నేను ముందువెనుక లాలోచించుకొని నీకుఁ దోడ్పడుటకే నిశ్చయించు కొంటిని. ఈవఱకు నాచేసినతప్పు క్షమింపుడు! ఈచందుఁడుగూడ మనకు సాయపడును.'' అని శక్తివర్మ బదులుచెప్పెను.

''శహబాస్! మంచిపని చేసితివి. రా నావెంటరా. తలుపు దీయుము.'' అని దండపాణి చెప్పెను. అప్పుడు శక్తివర్మ తాళముఁ దీసి తలుపు తెఱచెను. రక్షకభటులు లోపలిసేవకులు గాఢనిద్రం దగిలియుండిరి. చందుఁడు శక్తివర్మ వెంటరా దండపాణి లోనఁబ్రవే శించి తలుపులుబిగించి ''చందుఁడా! ఈగృహావరణమున నీవొకగోయి త్రవ్వి సిద్ధముగానుంచుము. బాలుర నందు వెంటనే పూడ్చిపెట్టవల యును.'' అని యానతిచ్చెను. వాఁడట్లకాకయని నొడ్డికొని కరిగెను. తలుపు చప్పుడువిని ''యిప్పుడిచ్చటి కెవ్వరు వచ్చుచుందు'' రని వారు సంశయపడుచుండ మిణుకు మిణుకు మను దీపపు వెలుంగున నెవరో మనుష్యులు వచ్చుచున్నట్లు గానఁబడెను. ''నేను దండపాణిని; ఇతఁడు శక్తివర్మ'' అని కఠినస్వరముతో మాటవినబడెను. ''ఓహో దండపాణియా? ఏమిది మామీఁద నింతదయ వచ్చినది! చిన్న నాయనగారు మానేమమరసి రమ్మని మిమ్ముఁ బంపిరా! లేక కార్యాంతరములమీఁద నీప్రాంతములకువచ్చి పూర్వప్రేమచే మా కుశల మరయుటకు మీరే స్వయముగా వచ్చిరా? ఎట్లైననేమి మీ

రాకవలన మాకిప్పుడు పంచప్రాణములు లేచివచ్చినవి. ఎల్లనుట్టము లం జూచినంత యానందము మాకిప్పుడు గలుగుచున్నది. ఓహో! ఇది యెంతసుదినము? నేఁటి ప్రాతఃకాలమున మే మెవ్వరి మొగము జూచితిమోకాని మీదర్శన లాభము గలిగినది. రమ్ము! రమ్ము! ఈ పానుపుమీఁదఁ గూర్చుండుము. మాయమ్మ సుఖముగా నున్నదా? మా వియోగదుఃఖమున మేనువిడిచినదా'' యని విక్రమసేనుఁడు వానిని సబహుమానముగా గౌరవించి పలికెను. తల్లి సేమముగురించి యేమిచెప్పునో యని వినుటకై హర్షవర్ధనుఁడు మిక్కిలి తత్తఱపడు చుండెను. అప్పుడు దండపాణి పరుషస్వరముతో ''మీయమ్మ యెట్లు న్నదో నేనెఱుఁగను. ఎక్కడనున్నదో నేనెఱుఁగను. చిత్రభానుఁడు పంపుటచేత నే నిక్కడకు వచ్చితిని.'' అని బదులుచెప్పెను.

''ఆహా! మాచిననాయన దయార్ద్రహృదయుఁడై మమ్ము బంధ విముక్తులఁ జేయుమని నిన్నంపెనా? మాకు మేలుదినములు వచ్చినవా? కాని మాయమ్మ యెక్కడ నున్నదో నీవెఱుఁగవా? మాతాత మహేంద్రదేవుఁ డామెను దీసికొనిపోయెనా?'' యని విక్రమసేనుఁడు కొంత సంతోషముతోను గొంత విచారముతోను బలికెను ''ఆహా! దేహబంధ విముక్తులఁ జేయుమని మీచిననాయన నన్ను బ పినాఁడు'' అని తనలో ననుకొని దండపాణి బహిరంగముగా నిట్లనియె.

''కుమారులారా! నేను మీకిప్పుడు గొప్ప యప్రియము దెలుప వచ్చితిని. నేను మిక్కిలి మందభాగ్యుఁడను. ఘోరవార్త తెలుపుట ఘోరకృత్యముసేయుట నాపాలఁబడినది. ఇది రాజశాసనమగుటచేఁ జేయకతప్పదు. నేను చెప్పుట కెంతో శంకించుచున్నాను—'' అన వుడు విక్రమసేనుఁడు చిన్నవోయి మెల్లగా ''అయ్యా! మీరు చెప్పఁ దలఁచినది చెప్పవచ్చును. చేయఁదలంచినది చేయవచ్చును. మీ

కార్యము వలదనువారులేరు. అడ్డగించువారులేరు.'' అనిపలికెను. హర్షవర్ధనుఁడు నిశ్చేష్టుఁడై కూర్చుండెను. అంతట దండపాణికిని విక్రమసేన హర్షవర్ధనులకును నీక్రింది విధముగా సంభాషణజరిగెను.

దండ—కుమారులారా! యీరాత్రి మిమ్ముద్దఱ సంహరింప వలసినదని చిత్రభానుఁడు నన్నుఁబంపె.

విక్ర—ఆఁ! ఆఁ! సంహరింపుమనియె పంపెనా?

హర్ష—అయ్యో! తల్లీ! (అని పాన్పుపై మూర్ఛవోయెను.)

విక్ర—అప్పని చేయనిశ్చయించి నీవువచ్చితివా?

దండ—ఆహా! నిశ్చయించుకొనియే వచ్చితిని. (అని యొఱ నుండి కత్తిదీసెను.)

విక్ర—ఈఘాతుకకృత్యము జేయ నీమనసొప్పినదా?

దండ—మనసొప్పిననేమి, యొప్పకున్ననేమి? రాజాజ్ఞ చేయక తప్పుదుగదా?

విక్ర—ఎవఁడు నీరాజు? నేను కానా?

దండ—చిత్రభానుఁడు మారాజు. నీవు కావు. నీవు కారా గృహవాసివి.

విక్ర—ఎవఁడు నన్ను కారాగృహవాసిని జేసినది? ఎవఁడు నన్ను రాజ్యభ్రష్టుఁజేసినవాఁడు?

దండ—నీపినతండ్రి చిత్రభానుఁడు.

విక్ర—అయ్యో! దండపాణీ! నీనోట నెటువంటి నిష్ఠురోక్తులు వినవలసివచ్చెను. నాతండ్రిమరణమునకుఁ గారణభూతుఁడయిన మా పినతండ్రిమాయలలోఁ బడి నీవు నీరాజుంజంపవచ్చితివా? చిన్నికుమా రులమనియైన సందియముతేదా నీకు? అగతికులమన్న మాట యయిన నీకు దోఁచఁలేదా? నీది హృదయముకాదా? నీవు మానవుఁడవుకావా? ఘాతుకమృగంబవా? దానవుఁడవా? ఘాతుకమృగములు నయితము

తమజాతిమృగముల జోలికిఁ బోవు. దానవులు వైరములేకుండఁ దమ తోడిదానవుల నుకముట్టింపరు. నీకును నాకు నెంతైన వైరమున్నదా? నిన్నెన్నడైన నే దూలనాడితినా? నీమనసు నొచ్చునట్టి పరుషోక్తు లాడితినా? నీకార్యములకు నే నాటంకము గల్పించితినా? ఏల మాపై నీకింత నిష్కారణక్రోధము? ఏల యింతనిర్దయ? నీహృదయము పుష్పసుకుమారమయిన దే! ఇంతకఠినమెట్లయ్యెను. ఈ కాఠిన్యము మున్నెన్నడు నేఁ జూడలేదే? నామీఁద నీవు చూపెడు నాదరమెందుఁ బోయె? ఆప్రేమపూర్వకభాషణంబు లెందరిగె? అయ్యో! దండపాణీ! నీవెంతలో నిట్లుమాఱితివి? నీహృదయము మాఱినను నా హృదయము నీదెస మాఱలేదు. నీవు నాకు నొకటి దండపాణివై యున్నావు. నాఁడు వేటలో బెబ్బులి గొబ్బున నీపైఁబడుచుండ విసవిస వెంట నమ్ముఁ గొడిగి నేను దానిఁ గూలనేసి నీప్రాణము రక్షించినప్పుడు నీపై నాకెట్టిప్రేమగలదో నేఁడును నా కట్టిప్రేమయే కలదు. నేను మహారాజనందనుఁడనయ్యు-కడుసుకుమారుఁడనయ్యు నత్యంతవిలువగల దువ్వలువలు దాల్చియున్నవాఁడనయ్యు-జెఱువులోఁబడి మున్కలు వేయుచుఁ బ్రాణములు గోల్పోవసిద్ధముగానున్న నీకొడుకును గాపాడుటకై చెఱువులో నుఱికినప్పుడు నీపై నాకెట్టి కూర్మిగలదో నేఁడు నట్టికూర్మియే గలదు. ఈహృదయము నీహృదయమువంటిది కాదు. కాకపోయినందుకు దీనిని దప్పకదండింపవలయును కావున నీచేతిలో దీపపువెలుగునఁ దళతళ మెఱయుచున్న నీఖడ్గపుఁగొనతో ముందుగా నాహృదయముం బొడిచి దాని నీవలకుఁ దీయుము. ఇదిగో! నా హస్తము. నాఁడు బెబ్బులిని నీనిమిత్తమై కోలం గూలనేసిన హస్తమిది. నీకఱకుగత్తితో నీచేతని ముందుగా నఱకుము. నీకుమారుని నిమిత్తమై ముందువెనుక లాలోచింపకుండఁ జెఱువులోఁబడిన యీ శరీరమును నీవాఁడికత్తితోఁ దుత్తునియలు చేయుము. ఇదిగో! నా శరీరమును నీ కప్పగించుచున్నాను.

అంతలో నతనిచేతి కత్తి పిడిదగ్గఱఁ జెమటపట్టుటం జేసి యా ఖడ్గము జాఱి క్రిం దఁబడెను. అప్పుడు విక్రమసేనుఁడు మఱల సంభాషణ మందుకొని యిట్లనియె.

దండపాణీ! సంపూర్ణజ్ఞానముగలిగి, చైతన్యముగలిగి. యుక్తాయుక్తవివేకముగలిగి, ఘాతుకకృత్యము చేయఁదలఁచి వచ్చిన నీకన్న చైతన్యశూన్యమైన యీ కత్తియే మంచిదని తోఁచుచున్నది. ఈ దుష్కార్యము చేయఁజాలక కాఁబోలు నది క్రిందఁబడెను. అయినను నీవు చిత్రభానుని కెట్లు వశవర్తివో యీకత్తియు నీకట్లు వశవర్తిని యగుటచే మా పినతండ్రి చెప్పినచొప్పున నీవు చేయఁదలఁచుకొనినట్లే, నీవు చేయుమన్న ట్లీకృపాణియుఁ జేయఁదలఁచుచున్నది. నా ప్రాణములమీఁద నా కంతయాస లేదు. ఈ కారాగృహవాసముకన్న స్వర్గలోకవాసమే నాకు సౌఖ్యప్రదము అచ్చట మా తండ్రి తోడనే నేఁ గూర్చుండెదను. మా పినతండ్రివలన భయము లేనిచోట దండపాణిఖడ్గమునకుఁ బ్రచారము లేనిచోట రాజద్రోహులు లేనిచోట ధనముకై యెట్టి ఘాతుకకృత్యమైనఁ జేయనొడంబడెడు నీచులు లేనిచోట నేను సుఖముగా నుండెద. కాని! యది యేల? నీ యెట్టయెదుట నా మంచముపై మూర్ఛిల్లియున్న యీపసిపాపని నాగారాలకొమ్మని హేమచంద్రుని రెండవపుత్రుని నందవిందాదేవి ముద్దులపట్టిని సకలజననయనానందకరసుందరవదనునకు వన్నెలుదిద్దఁగల మొగముగలవాని చక్కరవిల్తునికలపించు చక్కఁదనముగలవాని నీ వెన్నిసారులోఁ జిన్ననాఁట నెత్తికొని ముద్దులాడినవాని, మా హర్షవర్ధనుని బ్రతికింపుము. మాతండ్రి నిమిత్తమై యాతని జీవింపనిమ్ము. మహాశోకసముద్రమునమున్న మాతల్లి నిమిత్తమై యాతని బ్రతికియుండనిమ్ము. నా నిమిత్తమై యతనిని జీవింపనిమ్ము. హేమచంద్రునివంశము నిర్మూలము గాకుండ నీ మొలకకు నీదయారసముపోసి పెంచుము. ఈతేఁడు

మీ చిత్రభానుని రాజ్యమున కడ్డురాఁడు. వానికి సన్యాసమిప్పించి వనాంతరముల కంపుము. ఇదిగో వానిని బ్రతికింపుమని చేతులు జోడించి నీపాదములకు మ్రొక్కుచున్నాను. నీవు బాసచేసితివేని నేను సుఖముగా శరీరము వాయుదును. నాకు నీకడఁగల చనవు పెంపున నీవరమిమ్మని నిన్ను వేఁడుకొనియెద."

దయనీయములయిన యాతని పలుకులు శక్తివర్మ హృదయమును గరగించి గన్నీరు స్రవింపఁజేసెను. కాని స్వలాభపరాయణతచే శిలీభూతమైన దండపాణి హృదయమును మాత్ర మవికరఁగింపలేకపోయెను. "విక్రమసేనా! నీవేఁడికోలు నిష్ప్రయోజనము. చిత్రభానునియాన నేను సంపూర్ణముగాఁ జెల్లింపవచ్చితిని. మీయిరువురఁజంపి గాని నే నిచ్చోటు విడువ. నీతమ్ముని చావు నీవు చూడలేవు గావున ముందు నిన్నే వధించెద. నేను సగముసగముపనులు చేయువాఁడనుగాను" అని దండపాణి ప్రత్యుత్తర మిచ్చుచుండ నంతలో హర్షవర్ధనుఁడు మూర్ఛదెలసి "అన్నయ్యా! అన్నయ్యా! బ్రతికియున్నావా! అన్నయ్యా! అన్నయ్యా! నన్నొకసారి కౌఁగిలించుకొనుము," అని కోరెను.

విక్రమసేనుఁ డట్లుచేయుట కటుపోవుచుండ దండపాణి వాని నాఁపి "కౌఁగిలింతలు గిరుగిలింత లిప్పుడెందు" కని బిగ్గఱగాఁ బలికెను. అప్పుడు హర్షవర్ధనుఁడు మెల్లగా లేచి "దండపాణీ! మాయన్నను జూడకుండ నే జీవింపఁజాలను. నాకీ బ్రతుకుమీఁద నేవ పుట్టినది. కావున నన్నుజంపి మాయన్నను బ్రతికింపుము. మాయన్న చాలమంచివాఁడు. చదువుకొన్నవాఁడు. నాకడపటిప్రార్థన నంగీకరించి వానిని జీవింపనిమ్ము. వానికి మీ రాజ్యమక్కఱలేదు. ఏ గాంధారదేశమున కయినఁ బోయి బ్రతుకు" నని కేలుమొగిచి మ్రొక్కెను. "ఓహో అన్నను బ్రతికింపుమని తమ్ముఁడు, తమ్ముని బ్రతికింపుమని యన్న

ప్రార్థనలు చేయనారంభించిరా! మీ టక్కరితనములు నాకడ సాగి రావు మీ పంచాంగముఁ గట్టిపెట్టుఁడు'' అని దండపాణి నిష్ఠురముగాఁ బలికి హర్షవర్ధనుని దన చేతితో నొకప్రక్కకు నెంటి "శక్తివర్మా! వీని నావలి కీడ్చుకొనిపో'' అని యానతిచ్చెను. శక్తివర్మ యాబాలు నింబట్టుకొని ప్రక్కనున్న మఱియొక గదిలోనికిఁ దీసికొనిపోయి లోపలఁ బెట్టి తలుపు వైచెను.

"అయ్యా! అయ్యా దండపాణీ! అయ్యా! శక్తివర్మా! కడపటి సారి మాయన్నను గౌఁగలించుకొననిండు కడపటిసారి మాయన్న ముఖారవిందముఁ జూడనిండు! చివరవఱ కతనిసన్నిధినే నన్నుండ నిండు!'' అని హర్షవర్ధనుఁడు మొఱపెట్టఁజొచ్చెను.

"దండపాణీ! దండపాణీ! ఒక్క నిమిషమాఁగుము. ఒక్కసారి నన్నావలిగదిలోనికిఁ బోనిమ్ము. ఒక్కసారి నాతమ్ముని నాలింగనము జేసికొననిమ్ము! ఒక్కసారి వానిని ముద్దాడనిమ్ము. అధమపతులు మీరు వరమయిన నాకు దయ సేయుఁడయ్యా! నీకెంతో పుణ్యముండును.'' అని విక్రమసేనుఁడు ప్రార్థించెను

"చాలుచాలు! నీకలాపము గట్టిపెట్టుము. పండుకొనుము. ఇప్పుడే ముందుగా నీశిరఃకర్తన మాచరించెద'' నని దండపాణి పలుకుచుండ నంతలో గోయిత్రస్వ చండుఁ డచ్చటికి వచ్చెను. "చండా! శక్తివర్మా! వీనిని నేలఁబడవయిచి కాలుసేతులు పట్టుకొనుఁడు'' అని యానతిచ్చెను. "అయ్యా! నన్ను బలాత్కారముగాఁ బండుకొనఁబెట్ట నక్కఱలేదు. నా కాలుసేతులు పట్టుకొన నక్కఱలేదు. నేనీసమయమునఁ గూడ మీకేవిధమయిన కష్టమును గలిగింపను. ఇదిగో! పండుకొనుచున్నాను.'' అని విక్రమసేనుఁడు నేలఁబండుకొని చేతులు జోడించి "నారాయణా! నారాయణా! నారాయణా!'' యని హరినామస్మరణ చేయుచుండెను. దండపాణి

ఖడ్గమునెత్తి యేప్రక్కనుండి గొట్టిన నొక్కయేటున శ్రమలేకుండఁ దల తెగిపడునో యాప్రక్కను నిలిచి ఖడ్గ మెత్తెను. అంతలో శక్తివర్మ కనుసన్న సేయ వెంటనే చందురుఁడు దండపాణిమెడలో నొక త్రాడు తగిలించి త్రాడుకొననున్న యుంగరములోనుండి రెండవకొన పోనిచ్చి శక్తికొలఁది లాగెను.

ఇది రెప్పపాటుకాలమున జరిగెను. లాగినతోడనే చేతిలోనున్న కత్తి చేతిలోనుండఁగానే దండపాణి 'ఆ! ఆ!'యని మూల్గుచు గురక విడుచుచు వెనుకకుఁ బడెను. నిముసములో నతనిప్రాణము పోయెను. కన్నులు మూసికొని హరిధ్యానము సేయుచున్న విక్రమసేనుఁడు కన్నులు తెఱచి చూచునప్పటికి శక్తివర్మయుఁ జందురుఁడును నేలఁబడియున్న దండపాణిని దలయొకరు, పాదములొకరుఁ బట్టుకొని యావలకుం గొనిపోవుచుండిరి.

అన్నయ్యా! అన్నయ్యా! యని యావలిగదిలోనుండి హర్షవర్ధనుని మొఱ లతని చెవిలోఁ బడుచుండెను. విక్రమసేనుఁడు లేచి కూర్చుండి భయవిస్మయసంభ్రమంబులు మితిమీఱి పరవశుని జేయ నేమిదియని యడుగఁజాలక గ్రుడ్లప్పగించి చూచుచుండెను. చందుఁడును శక్తివర్మయు దండపాణి కళేబరమును బాలురనిమిత్తము త్రవ్వియుంచిన గోతిలోఁ బడవయిచి పూడ్చిరి.

పరమేశ్వరుని లీల లెవ్వఁడు గ్రహింపఁగలఁడు? ఆత్మలాభపరాయణుఁడై యధర్మమనక యకార్యమనక ఘాతుకమృగములీల రాజనందనుల మ్రందింపఁదలఁచివచ్చిన దండపాణి కృపాణినైన నెత్తకమునుపే యసువులుబాసి క్షణములో దండధరుని వీటికివిందయ్యెను. ఉత్తరక్షణము మనదిగాదని పెద్దలు చెప్పుమాట నిశ్చయముగదా! మానవుఁడు తనమనంబున నాకసంబున మేడలుగట్టి పదునాల్గులోకములఁ బాలింపఁ జూచుచుండును. దైవము వానిసంకల్పముల వికల్పములఁ జేయుచుండును.

అట్లు వారిరువురు దండపాణిని మహీగర్భమునం బూడ్చి రాజనందనుల కడకువచ్చి గదితలుపులుదీసి హర్షవర్ధను నీవల[illegible] దీసికొని వచ్చి ''కుమారులారా! దండపాణి తానుత్రవ్వుకొన్న గోతిలోం దానే పడెను. ఆదురాత్ముని పాపమే యాతని జంపినది. మీరింక రెండు. మిమ్మీ చెఱనుండి విడిపించి యావలకుం దోడుకొనిపోయెదము. మీరు మావలన నెట్టియపాయమును శంకింపకుండు. మేము రాజభక్తులము. మీపాదసేవకులము. చిత్రభానుని దుండగములు మేము సహింపంజాలక వానిచేం బ్రేరితుండై మిమ్ము వధింపవచ్చిన దండపాణిని దుదముట్టించితిమి. మిమ్ము సురక్షితముగా గాంధారదేశమునకుంగొనిపోయెదము. మీకుం దైవమున్నాండు. మనభాగ్యము సరిగా నుండునెడల భాగ్యవర్ధనుండు మీకుం దోడుపడవచ్చును. ఇచట నాలస్యముచేయుటకు వీలులేదు. రండు! సేవకులు మేలుకొనకమునుపే పోవుదము.''

అనవుడు నక్కుమారులు ''శక్తివర్మా! మీయిష్టము వచ్చినట్లు చేయుండు'' అని బదులుచెప్పిరి. అంతట శక్తివర్మయుం జండుండును వారిచేతులు బట్టుకొని నిశ్శబ్దముగా నావలకుం దోడ్కొని పోయిరి. అప్పటికి రెండుజాముల రాత్రి యయ్యెను. సేవకులలో నెవ్వరు మేలుకొనలేదు! చప్పుడుగాకుండం దలుపు వయిచి వారు నలుగురు నాగాఢాంధకారమున బైలుదేఱి మెల్లమెల్లగా నడచి తెల్లవారునప్పటి కొక యామడపోయి యొకపల్లియం జేరిరి. ప్రాతఃకాలకృత్యములచ్చటం దీర్చుకొన్నపిదప శక్తివర్మ చండుని బిలుచుకొనిపోయి రహస్యముగ నిట్లనియె—''రాకొమరులు దండపాణియు నీవును నేనును హఠాత్తుగా నదృశ్యులమయితిమని కావలివాండ్రు నేంటియుదయమునం దెలిసికొని భయంపడి వడివడిగాంబోయి చిత్రభానునకెఱింగింతురు. దండపాణి బిడ్డలంజంపక తన్ను వంచించెనేమోయని శంకించి యారాజు బిడ్డలను మనలను వెదకుటకై నలుదెసలకు

సేనల నంపును. అతఁ డావలించినవారి ప్రేవులెంచును. మనము పట్టుబడితిమా భంగము వాటిల్లు. కావున నీవు చిత్రభానుని కడకుఁ బోయి యాతనిం దప్పుదారిం బెట్టుము. ఈవిధముగా నతనితోఁ జెప్పుము.'' అని యాతని చెవిలో నొక రహస్యము జెప్పి పొమ్మని యెను. చంద్రుఁడును నతని యుపదేశము మంచిదేయని రాజసుతులం జూచి ''తక్షశిలలో నేను వెండియు గలిసికొనియెద. మీరు రక్కడ నుండుఁడు'' అని చెప్పి వారిని వీడ్కొనిపోయెను.

. విక్రమసేనుఁడు చండశక్తివర్మలకుఁ దన కృతజ్ఞతం దెలిపి ముందు జేయువలసినపని యేమని శక్తివర్మ నడిగెను. ''గాంధార దేశమున కరిగి భాగ్యవర్ధనుని సాహాయ్య మడుగుట సమంజస'' మని యతఁ డుత్తరముజెప్పి వారి నందు కొడంబఱచి దారిబత్తెము నిమిత్తము విక్రమసేనుని మేనిమీఁదనున్న యాభరణములలో నొక దానిని విక్రయించి రొక్కము చేఁబూని వారి యన్నపానాదులకుఁ గఱవు లేకుండఁజేసి మార్గాయాసము లేకుండ బండ్లమీఁద నెక్కించి వారి మనఃఖేదములు బాపుటకు వినోదములైన కథలు జెప్పుచు గ్రామీణుల చిత్ర చిత్రములయిన యాచార వ్యవహారములం జూపుచుఁ బయనము చేయించు చుండెను.

కొండకోటకడఁ గావలియున్న సైనికులు వంటవాండ్రు మొదలగు పరిచారకులు బాలకులను చండశక్తివర్మలం గానక యేదో మోసము జరిగినదని చండశాసనుఁడగు చిత్రభానుని యలుకకు భయపడి తమలో నొక పెద్దంబిలిచి యవ్వార్తరాజునకు విన్నవింపఁబనిచిరి.

ఇరువదియేడవ ప్రకరణము.

"ఈపాటికి దండపాణి గ్రామదేవతకు మేకపోతును బలి యిచ్చిన చందమున నాదారిలో ముండ్లవలె నున్న యీడింభకుల నిరువుర నణికియుండును. బ్రతికియున్నప్పుడువలెనే యీకుఱ్ఱలిరువురు నొండొరుల కేలుపట్టి యమునియింటికిఁ జని యీపాటికిఁ బ్రాంత కాంతులయి యుందురు. ఉయ్యాలలో నిద్రపోయినట్లు వారీపాటికి గోతిలోఁ బెద్దనిద్దురపోవుచుందురు. ఇప్పుడో రేపో మాపో యీశుభ వార్త నాకు రాకమానదు. ఇంక వారితల్లింగూడ దెగటార్చినంగాని నాప్రవేశము సఫలమ్ముగాదు." అని చిత్రభానుఁ డొకనాఁడు తన లోఁదాను వితర్కించుకొనుచుండ నంతలో ద్వారపాలకుఁడు "దేవా! దండపాణికడనుండి మనచంద్రుఁడు వచ్చియున్నాఁ"డని విన్నవించెను. సత్వరము ప్రవేశపెట్టుమని యతఁడాజ్ఞ నొసఁగఁ జంద్రుఁడు ద్వారపాలక ప్రేరితుఁడై రాజదర్శనము జేసెను చిత్రభానుఁడు వానిసేమ మడిగి దండపాణి పంపిన సందేశమేమని యడుగ నతఁడు వినయంబున నిట్లనియె

"దేవా! దండపాణి విజ్ఞాపన మిది—స్వామీ! దేవరవారి యాజ్ఞానుసారముగ నేను సురక్షితముగా మంచుకొండకుఁ బడమటి ప్రక్కనున్న మనకొండకోటఁ జేరి, చండశక్తివర్మలసాయమున నిరువుర బాలకుల నాకత్తికెఱజేసి, లోభిధనమును నిక్షేపించినట్లు వారిం గోతిలోఁ బెట్టి పూడ్చి కృతకృత్యుఁడనై దేవరవారి యనుగ్రహము నకుం బాత్రమునయితిని. స్వామికార్య నిర్వహణప్రవీణుఁడ నగుటచే నేను జరితార్థుఁడనయితిని. కాని పితృహీనులయి యగతికులయిన బాలకుల నిష్కారణముగా వధించుటం జేసి నామనస్సు మిక్కిలి దుఃఖపర

నశక్యమై యున్నది. ఈమహాపాతకము బాపుకొనుటకు నేనును, శక్తి వర్మయుఁ దీర్థయాత్రలు సలుపవలెనని సంకల్పించుకొంటిమి. ఈమహా దోషపంకమును జగత్త్రయపావనకరమగు భాగీరథీజలమె కడుగ వలయు. బదరీనారాయణ సందర్శనమే మాయాత్మలకుఁ బ్రశాంతి నొసఁగవలయు. కురుక్షేత్రనివాసమే మాచిత్తసంక్షోభంబు మాన్పవ లయు. సరయూనదీ జలపానమే మాహృదయములను జల్లపఱుప వలయు. కావున నీమహాక్షేత్రముల కరిగి మేము పావనులమగుటకు దేవరవారు సెలవియ్యవలయునని ప్రార్థించుచున్నాము. మాళవరాజ్య సైన్యములు మనప్రాంతముల వచ్చి విడియునప్పటికి మేము వెండియు దేవరవారిదర్శనముజేసి వారితో సమరంబు గావించెదము. నేనెప్పుడు మీకువిధేయుఁడైన బంటనే కావున నన్ను మన్నింపవలయు' నని మహాప్రభూ! దేవరవారితో సేనాపతి మనవిసేయుమనియె''

అప్పలుకులు విని చిత్రభానుఁడు తాననుకొన్నట్లు రాజనంద నుల దండపాణిమ్రందింపఁజేసినందుకు మిక్కిలి సంతసిల్లి ''చంద్రుఁడా! దండపాణి ఛాందసుఁడు ం చపుట్టుక పుట్టినవాఁడు రుద్రుండునుం బోలె మానవసంహారంబు సేయుచుండు. అందుచే ననుదినము విచా రించుచునె యుండవలయు. ఇంతమాత్రమున కతఁడు పశ్చాత్తప్తుఁ డై తీర్థయాత్రలు చేయవలయునా? ఎట్లో యతఁడు మనశ్శాంతి గావించుకొనుఁగాక!'' యని యాదారుణ కృత్యమునకుఁ దోడ్పడి నందు కతఁడు చంద్రున కొకప్రశస్తమైన ముత్యాలసర మొకటి పారి తోషికముగా నిచ్చెను. ఆపసదనంబు గైకొని చంద్రుఁడు తనకృతజ్ఞ తం దెలిపి చేతులు జోడించి తనకుఁగూడ తీర్థయాత్రలు సేయఁగుతూ హలము గలదని విన్నవించి శక్తివర్మ దండపాణులం గలసికొనుటకు సెలవిమ్మని ప్రార్థించెను. అట్లకాక యనినృపతి యానతియ్య నతఁడు

యుధేన్ముఁజని నిరంతరప్రయాణంబుల రాజపుత్రసమేతుఁడయిన శక్తివర్మం గలిసికొని తనకును జిత్రభానునకును జరిగిన సంభాషణ మంతయుఁ జెప్పి వారల సంతసింపఁజేసెను. వారు నలుగురు క్రమక్రమంబుగా నడిచి కాశ్మీర గాంధార దేశముల సరిహద్దుఁ జేసిరి.

ఇకఁ జిత్రభానుఁడు మఱునాఁ డుదయమునఁ దనప్రియ సేవకు నొక్కనిఁ బిలిచి వాని చెవిలో నేదో రహస్య ముపదేశించెను. అది విని వాఁడు తనపనిమీఁద బోయెను. ఆ సాయంకాలమునఁ గొండకోటకడనున్న రక్షకభటులలోఁ బెద్దవచ్చి "రాజపుత్రులు, దండపాణియు, జండశక్తివర్మలు నకస్మికముగ నదృశ్యులయి" రని చిత్రభానునితో విన్నవించిరి. అదివిని చిత్రభానుఁడు "తద్విషయమై మే మరసెదము. మీ రక్కడ గావలి యుండ నక్కఱ లేదు. సత్వర మరం" డని యానతిచ్చి వానిం బంపెను. రాత్రి జా మగునప్పటికి వగర్చుకొనుచు నొక సేవకుఁడు పరుగు పరుగునవచ్చి తక్షణమే రాజదర్శనము కావలెనని కోరెను. ద్వారపాలకులు వాని రాక నరపాలునకెఱింగించి వారి సెలవుగైకొని యాతెంకను లోనికంపెను. అప్పుడు వాఁడు చిత్రభానునకు సాగిలఁబడి మ్రొక్కి వెక్కివెక్కి యేడ్వనారంభించెను. చిత్రభానుఁడు తొట్రుపడి నట్లభినయించి కారణమడిగెను. ఇంటిలోని సేవకులు కంచుజనము, చుట్టుప్రక్కలఁ జేరి యక్కజపడి చూచుచుండిరి. అప్పుడా సేవకుఁడు వానితో నిట్లు విన్నవించెను.—"స్వామీ! ఏమనివిన్నవింతును? విక్రమసేనహర్షవర్ధనులు శక్తివర్మతోఁ గలిసి కొండకోటనుండి బైలుదేఱి సింగముల వేటాడుటకై పరిసరారణ్యముల కరిగిరి. ఒక యాఁడుసింగము రెండుమగసింగములు నొకపొదలో నప్పుడే చంపి తెచ్చిన యొక మెకము ను భక్షించుచుండెను. ఆ మహావీరులు ముగ్గురు విండ్లనారితొడిగి తీవ్ర

బాణంబును సంధించి మూఁడుసింగంబులపై మూఁడుబాణంబుల నేసిరి. ఎఱమీఁదనున్నవేమో యాసింగములు ప్రళయకాలరుద్రుఁడట్లు మహాక్రోధపరవశములై తమపైఁబడినబాణము లెంతవేగమున బోయెనో యంతవేగమున వచ్చి ముగ్వురపైబడి తక్షణ మా ముగ్వురం గడతేర్చెను. శక్తివర్మ కేమికాని మహాప్రభో! రాజకుమారులు పోయినందుకు నేను మిక్కిలి విచారించుచున్నాను. ఇంతకు దైవ నిర్ణయ మిట్లున్నది" యని మరల నేడ్వఁజొచ్చెను.

అవ్వచనంబులు కర్ణంబులసోఁకుటయు "హా! కుమారులారా" యని యతఁడు మూర్ఛిల్లెను. సేవకులందఱు మిక్కిలి కలఁతనొంది హాహాకారములు చేసిరి. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలి నుండివచ్చి శైత్యోపచారములు చేయించి కారణ మేమని యడిగిరి. వార్తాహరుఁడయిన యాకింకరుఁడే యావృత్తాంతము మరలఁ జెప్పి పెద్దపెట్టున నేడ్చెను. కర్పూరమంజరి యవ్వార్త విని యతిశోకమగ్న యయ్యెను. ఇందుమణికన్నులనుండి బొటబొట బాష్పములు దొరఁగెను. సేవకులందఱు "కటకటా! ఎంతకష్ట మని విలపించిరి. చిత్రభానుఁడు శైత్యోపచారమువలన సేదదేఱి "హా! కుమారులారా! మిమ్ము,బాసి నేనెట్లుజీవింతునురా! మీ తల్లి యీ వార్త విని యెంత శోకించుచున్నదోకదా? అయ్యో! మాయన్నగారివంశమైన లేఃపోయినదే. ఓమాలదైవమా! నాఁడు హేమచంద్రునకట్లు దారుణమరణము విధించితివి. గుణరత్నాకరులు —లోకైకసుందరులు— నగునాతని బిడ్డలనైనంజూచి సంతసింపకుండ వారింగూడ నీపొట్టబెట్టుకొంటివా! పాపాత్మురాలా! మృత్యుదేవీ! నీకంటికిఁ బేలగింజయుఁ బెద్దయయ్యెనే? నీయాఁకలి దీర్చుకొనుట కింతకన్న నీకు మఱియొక జంతువు దొరకలేదా! ఆచక్కదనమేమి? ఆలావణ్యమేమి? అవినయసంపదయేమి? ఆ

విజ్ఞానమేమి ? హా ! అంతటి గుణవంతులను భగవంతుఁడు బ్రతుక నిచ్చునా? అయ్యో! మీరు సంచరించిన యీకోటలో నేనెట్లు తిరుగ నేర్తు? ఆకొలఁకు పుకూటములో నేనెట్లుగూర్చుండఁగలను? నాయనలారా! ఏది చూచినను మీరే జ్ఞాపకము వచ్చుచున్నారు. అయ్యో! ఏమి చేయుదు ? విజయసేనుఁడితో నాకు ముగ్గురుకుమారు లనుకొంటిని. ఆకొండకోటలో నుండవలదని నేనెన్నివిధముల బతిమాలినను యువ జన సులభమైన యుత్సాహముచే వారు నామాట పెడచెవింబెట్టి యచ్చోటు విడువరైరి. విధినిర్ణయ మిట్లుండ నాపలుకులు వారికేల రుచించు ? అయ్యయ్యో ! ఆ పాడు సింగపువేఁట యేల వచ్చెనో ? శక్తివర్మా ! వయోవృద్ధుఁడవు, ప్రాజ్ఞుఁడవు, నీవైన నాచిన్నిపాప మృగయా క్రీడనుండి మరల్పఁజాల వయితివే ? మృత్యుదేవత సిగ బట్టుకొని యీడ్చుకొని పోవుచుండ నీవేమి చేయఁగలవు ?" అని పలుతెఱంగుల విలపింపఁ దొడఁగెను.

అప్పు డందఱుఁ గన్నీరు విడిచినవారె. అందఱు హాహా యన్న వారె. కర్పూరమంజరి విషాదము వర్ణనాతీతమై యుండెను. ఆమె నిజముగా విక్రమసేన హర్షవర్ధనులు తన తమ్ములే యని భావించు చున్నందున నిప్పువార్త యామెకు దుర్భరమై యుండెను. ఆరాత్రి యామె నిదుర యేపోలేదు. జగన్మోహనాకారులయిన యాయిరువురు బాలకులు చిఱునవ్వులు తళుకొత్తు నెమ్మొగములతోఁ దన యెట్ట యెదుట నిలిచి మాటలాడినట్లు మనఃప్రీకరమైన కథలు చెప్పినట్లు— నామె భావింపఁ జొచ్చెను. రెండుజాముల రాత్రియైన పిదపఁ జిత్ర భానుఁడు గాఢముగా నిద్రించి ప్రభాతమున లేచి మరల దుఃఖింప నారంభించెను. గడియ ప్రొద్దెక్కు నప్పటికి రాజపుత్రుల మరణ వార్త పట్టణమంతయు వ్యాపించెను. హేమచంద్రుఁడు మృతినొందిన నాఁడు పట్టణ మెట్లు దుఃఖాంధకార మగ్నమయ్యెనో నాఁడు నట్లే యుండెను. ప్రతిగృహమునుండి హాహాకారములు చెలఁగెను. చిత్ర

భానుఁడే వారిం జంపించి యుండునని కొందఱనిరి. వేటలో సింగము వేటుతప్పించుకొని మీఁదబడి నప్పుడు చిత్రభానుఁ డేమిచేయఁగలఁ డని కొందఱు వచించిరి. తండ్రికిం గొడుకులకుఁగూడ దారుణమరణమే విధి నిర్ణయించుట యాశ్చర్య మని కొందఱు భాషించిరి. ఆనాఁడు చంటిబిడ్డలు, రోగులు, వృద్ధులు తక్కఁ దక్కిన పురజనులు భోజనముతే చేయలేదనుట యతిశయోక్తిగాదు.

మఱునాఁ డుదయమునఁ జిత్రభానుఁడు కొలువుకూటమునకఱుగలేదు. వజ్రపాణి ప్రముఖ సేనాపతులు చిత్రభానుని సందర్శించి పరామర్శ చేసిరి. పురజనులలోని ప్రముఖులుగూడ నట్లుచేసిరి. చూడ వచ్చినవారి యందఱ యెదుటఁ జిత్రభానుఁడు గొడ్డఱచిన ట్లఱచి యేడ్చుచు బహువిధముల రాజకుమారులఁ గుణములఁ బ్రశంసించుచుఁ దన దుఃఖమును బ్రకటింపఁ జొచ్చెను. ఆ నాటకమంతయు నెఱిఁగియు రుద్రభట్టు తక్కినవారివలె దుఃఖోపశమన వాక్యములం జెప్పుచు నితిహాసంబులలోని గాథలు దెలుపుచుఁ బ్రక్కనఁ గూరుచుండెను. అది మొదలుకొని దుఃఖాతిశయమునఁ జిత్రభానుఁడు పదిదినములు కొలువుకూటమునకుఁ బోవనే లేదు. రాజ్యవ్యాపారములఁ జూడనే లేదు. రాయబారులకు దర్శన మియ్యనే లేదు. ఆలుబిడ్డలతో నయిన మనసిచ్చి మాటాడలేదు. ఇది నటన మని కొందఱు నిజమని కొందఱు, పురజనులు చెప్పుకొన సాఁగిరి.

ఇరువది యెనిమిదవ ప్రకరణము

పాంచాల దేశాధీశ్వరుఁడగు మహేంద్రదేవుఁడు తనకూఁతురు మనుమలు మహోపద్రవ సముద్రమున మునిఁగిపోవుదురని మాధవు

సేనుఁడు తెలిపినతోడనే వృద్ధుఁడయ్యుఁ గాశ్మీరముపై దండువిడియుటకుఁ జిత్రభానుని దండించుటకు సమరసన్నాహము జేసెను. 'ఆలస్యమమృతం విష'మన్నట్లు వారి సన్నాహము సిద్ధమగునప్పటికి హేమచంద్రునికుటుంబమునకు రావలసినకష్టము లన్నియువచ్చెను. అయినను వారది గుర్తెఱుంగక కాశ్మీరముపై దండయాత్ర జరిపిరి. మహేంద్రదేవుఁడు వృద్ధుఁడు. ఆతనికిం గొడుకులులేరు. అధికారము వహించెనని యోగు లందఱు పరస్పరమత్సరగ్రస్థులయి రాజకార్యనిర్వాహణముకన్న నొండొరులయెడఁ గలతమద్వేషమునకుఁ బ్రతిక్రియలు చేసికొనుటలో నెక్కువ శ్రద్ధ గలిగి నిరంతరము దుస్తంత్రములఁ బన్నుచుండిరి. ఆకారణమునఁ బాంచాలసైన్యము దుర్బలమైయుండెను. మహేంద్రదేవుఁడు కాశ్మీరమునకుఁ బోయి తనమనుములఁ దన కప్పగింపుమనియు దేశము విడిచిపొమ్మనియుఁ జిత్రభానునకు సందేశమంపెను. చిత్రభానుఁ డారాయబారిని బరాభవించి తగిన యుత్తరము చెప్పకయే పంపెను. పాంచాలసేనాపతులలోఁ గొందఱు లంచగొండులై చిత్రభానునకు వశులైరి. పాంచాలకాశ్మీరసైన్యములకు యుద్ధముజరిగెను. మహేంద్రదేవుఁడు యుద్ధమునఁ బరాజితుఁడై రాజధానికిఁ బాఱిపోయెను. రాజభక్తి గల సైనికులెల్లఁ దమ కోపినకొలఁది పోరాటముసల్పి మ్రందిరి. ప్రాణభీతిగల యోధులు చిత్రభానుని కోడి నలుదెసలకుం బరుగులెత్తి ప్రాణములఁ గాచుకొనిరి. మాధవసేనుఁడును భగ్నమనోరథుఁడై పలాయనమె శరణంబుగాఁ జేసికొనెను. పాంచాలదేశమును గొల్లపెట్టింపవలెనని రుద్రభట్టు నుపదేశమునఁ జిత్రభానుఁడు సంకల్పించెనుగాని మహాసంరంభముతో మాళవరాజసైన్యములు దమపై వచ్చుచుండుటం జేసి యతఁ డాసంకల్పమును వదలుకొని మకరందుని దాఁకుటకు సర్వసన్నాహములు సేయుచుండెను.

అంతలో మకరందునిసేనలు పొడకట్టెను. మాళవసైనికులు మహోత్సాహముతోఁ బోరాటంబున కెదురుచూచుచుండిరి. నగరంబునకుఁ బడమటివైపున మాళవసైన్యములు విడిసెను. కాశ్మీర నగరముఁ జూచినతోడనే మకరందునకుఁ గర్పూరమంజరి జ్ఞప్తికి వచ్చెను. తన కామెపై నెంతవలపున్నను నామెకుఁ దనపై నెంత మక్కువ యున్నను దానామెతండ్రికి విరోధియై కాశ్మీరముపై దండు విడియుటచే నతఁ డాకన్నియఁ దనకీయఁడనియుఁ గన్నియయుఁ దండ్రికిం బగతుఁడైన మాళవునిని కేలు పట్టుట కిచ్చగింపదనియు నిశ్చయించి తన దురదృష్టముం దూర్చి వగచుచుండెను. మకరందుఁడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చియున్నవాఁ డని వినినది మొదలుకొని కర్పూరమంజరి తనపై నతని కనురాగ మున్నను బగతునిబిడ్డ యగుటచేఁ దన కేలువట్టఁడనియుఁ, దనతండ్రి తమ సమాగమమునకు శక్యమైనన్ని యంతరాయములఁ గల్పించు ననియు నిశ్చయించి తన యాశ యడుగంటెనని వాపోవఁజొచ్చెను.

ఉజ్జయినిలో నాఁడు మకరందునకుఁ జిత్రభానుని సందేశ మెఱిఁగింపఁబోయిన జయంధరుఁడు మాళవరాజస్కంధావారముతోఁ గలిసి పయనము జేసినపక్షమున సురక్షితముగాఁ దనయూరు జేర వచ్చునని దాని ననుసరించి పోయి రెండుదినములు శిబిరమునందుండి యకస్మికముగా నదృశ్యుఁడై కాశ్మీరనగరద్వారముకడ నిలిచి మకరందుని రాయబారి నని చెప్పి కోటలోఁ బ్రవేశించి క్రమక్రమంబునఁ గక్ష్యాంతరంబులు గడచి ద్వారపాలకునిచేతఁ జిత్రభానుని సమీపమునకుఁ గొనిపోఁబడెను. చిత్రభానుఁడు వానిం జూచి "మకరందుఁడు మాకేమి సందేశములఁబంపె"నని యడిగెను.

అనవుడు జయంధరుఁ డిట్లనియె. "దేవా! ఆగ్రహింపకుండు రేని జిన్నవిన్నపము జేసెద నాచేసిన యపరాధంబు క్షమింపుడు

నేను మకరందునిరాయబారిని గాను. మీ యంతఃపురపరిచారిక యయిన చంద్రిక నా ప్రాణమిత్రము. ఈ సందడి సమయమున నన్ను లోపలికి మీవాండ్లు రానీయరనిశంకించి మకరందునిదూత నని చెప్పితిని. చంద్రికతో నొక్కసారి మాటలాడవలయు దేవరవా రనుజ్ఞ నొసంగుదురేని యట్లుచేసి పోయెద.'' అనవుడు విస్మితుండై చిత్రభానుఁడు ''ఏమీ! చంద్రికమిత్రమవా నీవు? సరే? అట్లయిన దానిం బిలిపించెద నుండు'' మని చంద్రికను రావించెను. అదివచ్చి యాతని మొగముం జూచి ''ఇతం డెవరో నే నెఱుంగ'' నని చెప్పెను. ''అయ్యో! నన్నెఱుంగవటే! ఇంతలోనే మఱచితివంటే! మహాప్రభూ! దేవరవారే నన్ను గుర్తింపలేదా? నేను మీయింటనే పెరిగితిని. మీ యడుగుల నీడనే బ్రతికితిని. మీయనుగ్రహముచేతనే వర్ధిల్లితిని. అమ్మగారు నన్నెఱుంగుదురు. మీయమ్మాయి నన్నెఱుంగును దేవరవారు రాజకార్యములగొడవలోనుండి మఱచిరి.''అని జయంధరుండు నవ్వుచుం బలికెను.

ఆకథ కడుం జిత్రముగా నుండుటచేఁ జిత్రభానుఁడు కర్పూరసుందరిని నియమపుటేవి నచ్చటికి రావించి యప్పురుషుని గుర్తింపుమని చెప్పెను. అమ్మా! నన్ను మీ రెఱుంగరా యని జయంధరుఁడు గంఠధ్వనియుం దనకుం బూర్వపరిచితములైనట్లు తోంప జప్పటులు చఱచి ''నాయనా! ఈ విగ్రహము పురుషవిగ్రహము గాదు. మల్లికయే మాఱువేసము వైచికొని యిట్లువచ్చెనని నాకుఁదోచుచున్నది'' యని నవ్వుచుం జెప్పెను. అప్పలుకులు విని చంద్రిక ''ఔనండి! ఇది నిజముగా మనమల్లికయే. ఏమే! నీ సరసము చట్టుబండలుగాను''అని దగ్గఱకుంబోయి తలపాగ నూడందీసెను. అప్పుడు దీపములవెలుఁగున దానిమొగము విస్పష్టమై కనంబడెను. ''అయ్యో! నిన్ను పెద్దపులి

యీడ్చుకొనిపోయి చంపెనని జంబుకుఁడు చెప్పె. ఎట్లు బ్రతికి వచ్చితివే" యని చిత్రభానుఁ డడిగెను. "స్వామీ! మా జంబుకుఁడు గంజాయిత్రాగి యామైకముతోఁ బండుకొని నన్ను బెబ్బులి యీడ్చికొనిపోయినట్లు కలఁగని యుండవచ్చును. దానిమత్తుచేతఁ బయనములో నాకు సాయముచేయుటకు మాఱుగా నా కంతరాయములు గలిగించుటం జేసి వానిని వదలించుకొని నే నావలికిఁ బోతిని. ఆ లాహిరికాఁడు కలయో నిజమనుకొని తన్ను వంచించిపోయిననన్నుఁ గానక మీతో నట్లు మనవిచేసియుండవచ్చును" అని మల్లిక మందహాస సుందరమైన వదనముతో నుత్తరమిచ్చెను అదివిని నవ్వి చిత్రభానుఁడు "ఓసీ! నీ యాఁడువేసముకన్న మగవేసమే బాగున్నదే. చాలు. నీవు చేసిన ప్రజ్ఞ చాలును. నీ ప్రజ్ఞకు సంతసించితిమి. ఈ పాటికి నీ వభ్యంతర మందిరమునకుఁ బో!" అని మందలింపఁ జంద్రిక దానిచేయి బట్టుకొని లోపలికిఁ దీసికొనిపోయెను. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలి కరిగిరి, పిమ్మటఁ గొంతకాలము పరస్పరవియోగదుఃఖమున సంతప్తలయిన నెచ్చెలులకు విస్రంభసంభాషణ మారంభమయ్యెను. అప్పుడు చంద్రిక ముందుగా నిట్లనియె. "ఓసీ! మల్లికా! నీవు మృతినొందితివని మే మతిదుఃఖముపాలయితిమి. నీ నిమిత్తము బెంగపెట్టుకొని కర్పూరమంజరి యురిపెట్టుకొన్నది. ఆయుశ్శేషముండుటచే తోడనే యది కనిపెట్టి పెద్ద పెట్టున మొఱ్ఱలు పెట్టితిని. నా కుయ్యాలించి వెంటనే కంచుకులు పరువెత్తుకొనివచ్చి యీమెను రక్షించిరి. మెడ కీమె తగిలించుకొన్న తీఁగత్రాడు దీయుటకయిన నాకుఁ జేతులువచ్చినవి కావు. నా యొడలు నే నెఱుఁగను. దైవానుగ్రహమున నిట్లో బ్రతికినది"

"అయ్యో! ఉరిపెట్టుకొన్నదా? అయ్యో! ప్రాణసఖీ! ఎంత పనిచేసితివమ్మా? నీవు లేని యెడల సంసార మసారము. మధ్యమ

లోకము దీపరహితము. వనము జీర్ణారణ్యము. మానవుల నేత్ర నిర్మాణము నిష్ఫలము. నాకు మరణమే శరణము. లోకమును శోకమగ్నము జేసితివా? మన్మథుని గర్వహీనుఁ జేసితివా? నీకింత సాహసముగూడనా? నావంటి నెచ్చెలులు నీకెందరో లభింతురు. నాకొఱకై ప్రాణము విడువఁదగునా?" యని యామె సాహసమును గర్హించి మల్లిక తన ప్రయాణవిశేషంబులఁ జెప్పి వారిని బ్రొద్దుపోవువఱకు నలరించెను ఆమాటలు వినుచుఁ జంద్రిక మెల్లగ నిద్రవోయెను.

అనంతరము కర్పూరమంజరి మల్లికను దనకు మిక్కిలిదగ్గఱగ రమ్మని పిలిచి యిట్లనియె—"మల్లికా! నిన్నుఁజూచి కొన్నిమాసములే యయినను జిరకాలమునుండి చూడనట్లు కన్నులు వాఁచిపోయినవే. నిన్నుఁజూడఁగా నాప్రాణము లేచి వచ్చినది. హృదయము పొంగినది. మనస్సు సంతోషముఁ బట్టఁజాలకున్నది. కన్నుల కఱవుతీరినది. నీవొక్కతవ యైనను వేయిమంది చుట్టములు వచ్చినట్లున్నది. ఇంతకు, కార్యసిద్ధియైనదా లేక నీప్రయాణమునకు దేహశ్రమమొక్కటియే ఫలమా?" అని పలుక స్నేహస్నిగ్ధభాషణముల మల్లిక యాలనెచ్చెలి కిట్లనియె. "సఖీ! నీకు నాయెడఁ జిన్నటనుండియు నిట్టిప్రేమయే గలదు. అట్లు నీవనుకొనుటకు నీ సౌజన్యమే కారణముగాని నాయందలి గుణవిశేషము గాదు. బెంగపెట్టుకొనకు. కార్యసిద్ధి కొంతవఱకయినది. నా ప్రయాణము వ్యర్థము కాలేదు. బహుశ్రమలుపడి నేనుజ్జయినిఁ జేరి వేడుక చెలికానితోఁగూడి వెన్నెలలో ముచ్చటలాడుచున్న మకరందుని జూడ మగవేసముతో వెళ్ళితిని. మగవేసమేల ధరింపవలెనందువో? మహాత్ముఁడయిన మకరందుఁడు పరస్త్రీలతో మాటలాడఁడు. జవ్వనులమొగమయినఁ జూడఁడు. కావున నాగుణరత్నాకరుని మగవేసమునం జూచు

మంచిదని యట్లుచేసితి. నీహృదయ మాతనియందు లగ్నమైనమాట విన్నవించితిని. అతఁడును నీనిమిత్తమై పరితపించుచుండెనని వేడుక చెలికాఁడగు చంద్రచూడునివలనఁ దరువాత వింటిని. కాని, యతఁడు మీతండ్రిపై దాడివెడలియున్నాఁడు. మునుపే నీతండ్రి వీరియట్లు దన మొల్లకయున్నాఁడు. ఇప్పు డీతనిమీఁద మీయయ్య యలుక నూఱురెట్లు హెచ్చును. కావున సుఖముగ నీతండ్రి నిన్నిత్తని కియ్యఁడు. ఇందుకు దైవమే స్వయముగా దౌత్యము వహింపవలెను గాని మనుష్యులవలనఁ గాదు. పరమేశ్వరుఁ డఘటనఘటనా సమర్థుఁడు.''

అదివిని కర్పూరమంజరి ''ప్రియసఖీ! నీపలుకులలోఁ గొంత యాస యున్నది. కొంతయాస లేదు. అతఁడు నాయం దనురక్తుఁడై యుండుటంజేసి యాశాబంధము తెగకయున్నది. మాయయ్యకు విరోధియగుటంజేసి వెంటనే నిరాశ యంకురించుచున్నది. ఆశా నిరాశలనడుమ నామనం బూఁగాడుచున్నది. ఈ కలహ మెట్లు పరిణమించునో తెలియదు. ఇందు మకరందునకు మరణమే సంభవించునేని నా మనోరథము లాతనితోఁ మంటఁగలియునుగదా. లేక పోరితంబున మాయయ్య కడతేరునేని దండ్రిం జంపినవాని నెట్లు చేపట్టఁగలను? దైవమొక్కఁడే యిందు సాయముజేయఁ దగినవాఁడు. నేను గౌరీసేవానిరతురాల నగుదునేని భగవతి కాత్యాయని నా మనోరథ మీడేర్పఁగాక!''యని తన మనోవేదన చెలిమికత్తె కెఱిఁగించి రేయి చాల గడచుటచే నిట్టూర్పు విడుచుచుఁ బండుకొని కన్నుమూసెను. మల్లిక మార్గాయాసముచే మిక్కిలి యలసియుండు కతనఁ బడినదేపాటుగా గాఢనిద్ర సుఖమనుభవించెను.

ఇరువది తొమ్మిదవ ప్రకరణము.

ప్రభాతమయ్యెను. తీర్థయాత్రలు సేవింపనరిగిన దండపాణి రాకపోవుటంజేసి చిత్రభానుఁడు విషణ్ణహృదయుఁడై యుండెను. వజ్రపాణి యంతకుమున్న రెండుమూఁడుసారులు తనయన్నయెందుండెనని చిత్రభాను నడుగ నతఁడు కార్యాంతరంబుల దేశాంతరంబుల కరిగెనని యుత్తరము చెప్పెనేకాని యథార్థము వచింపనేలేదు. అన్న రాక దవ్వయినకొలఁది వజ్రపాణి కనుమానము హెచ్చెను. అతని మనంబు పరిపరివిధంబులం బోయెను. "ఏమహారాజునొద్దకయినఁ జిత్రభానుఁడు వానినిరాయబారిగాఁ బంప, నారాజు వానియసువు లపహరించియుండునా? మార్గమధ్యంబునఁ జోరకిరాతాది భయంబున బ్రమందియుండునా? రోగపీడితుఁడై దేహత్యాగముచేసి యుండునా! వైరాగ్యంబున సన్యసించి యుండునా?" యని వజ్రపాణి పలుతెఱంగుల నూహించుచు నిదమిత్థమని నిశ్చయముచేయలేక యానాఁడుదయమునఁ జిత్రభానుని సందర్శించి తనసోదరుని విషయమునఁ దన కుఁగల సందియముల నెఱింగించి నిశ్చయవార్తఁ దెలుపుమని వేఁడెను చిత్రభానుఁడు వానిసంశయములఁ బాప నత్తెఱఁగు యదార్థమంతయుఁ జెప్పి యిట్లనియె. "నీయన్నమగూర్చి నీ వెంతబెంగగొంటివో నేనును నంతబెంగఁ గొనియున్నవాఁడ. అతఁడు లేకపోవుటచే నాసేనాముఖము తిలకహీనమై యున్నది. నాకుడిచేయి పడిపోయినట్లున్నది. మాళవరాజసైన్యములు పెచ్చుపెఱిఁగి యున్నవి. అతఁడు లేఁడన్న మాట వారికిఁ దెలిసికొంబోలు గర్వోన్మత్తులై వారు సంచరించు చున్నారు. నీవు మేటిమొనగాఁడవు, మహాశూరుఁడవు నని నే నెఱుఁగుదును. అయినను నతనికి నీవు నీ వతనికిఁ దోడైనయెడల మాళవ సైన్యంబు లేగావు—మహేంద్రసైన్యంబులయినను దైన్యంబునొందక

మానవు. నీ వొంటిగాఁడ వయితివని నేను విచారించుచున్నాను. నే నొంటిజెక్కతోనున్న పక్షివలెనున్నాను. నీవుమీయన్నకొఱకై బెంగబెట్టుకొనకుము. ఈయుద్ధమయిన వెంటనే కరటక పింగళులను గాశీ హరిద్వారబదరీ నారాయణాది క్షేత్రముల కంపి మీయన్న నిమిత్తమై వెదకింతము. చిత్రభానుఁడే మీయన్నయనుకొనుము."

వజ్రపాణి కాపులుకులంత దుఃఖోపశమనముఁ జేయకపోయినను సంశయనివృత్తిఁ జేసినందున నాతనిమనస్సు కొంత ప్రశాంతిజెందెను. ఆమఱునాఁడు యుద్ధముసేయుట కిరువురు నిశ్చయించుకొనిరి. ఉభయ సైన్యంబుల భేరీభాంకరణంబులు దెసల మాఱు మ్రోఁగెను. ఉభయ సేనలలోని బంట్లకు నుత్సాహము మిక్కుటమై యుండెను. గజ బృంహితంబులు, హయహేషితంబులు, రథనేమిధ్వనులు, పదాతుల యుత్సాహాంసభరిత వచనములు మిన్నుముట్టెను. ఆనాఁటిరేయి నా ప్రక్కఁ జిత్రభానుఁడు వజ్రపాణి మొదలగువారును, నీప్రక్క మకరందుఁడు, కంఠీరవదేవుఁడు మున్నగువారును దమతమనెలవుల నుచిత స్థానముల నిలిచి పిఱికితనము పటాపంచలై పోవునట్లు—వీరరసము మనంబుల నిండియుండునట్లు గయ్యంబులకు సైనికులం బురికొల్పుచుండిరి.

అంతలోఁ దెల్లవారెను. ఉభయులమనంబుల నెలకొన్న క్రోధాగ్నివలె భానుమండలము కానఁబడియెను. ఆక్రోధాగ్నిమంటలో యనఁ దొలిసంజకెంజాయ దెసల నలముకొనెను. మంట లెగసినతోడనే నంతరించు పొగచందంబున మంచు క్రమక్రమంబుగ నదృశ్యమయ్యెను. సైన్యములు మేనంబూసికొన్న వీరగంధముల చందంబున లేయెండలు వ్యాపింపఁ దొడఁగెను. రణదుందుభులు మొఱసి సన్నసేయ నుభయసేనలు తలపడెను.

ఏనుంగుల నేనుంగులు దాఁకెను. అశ్వికు లాశ్వికులం దలపడిరి. పదాతులు పదాతులం గలిసి పోరాడిరి. సాయంకాలమువఱకుఁ గయ్యము ఘోరముగా జరిగెను. ఒకమాఱు జయము వారికిఁ జేకురి నట్లు మఱియొకసారి వీరికిఁ జేకుఱినట్లు దోఁచెను.

కంఠీరవదేవుఁడు కంఠీరవంబట్లు పోరాడి యుపరాహ్ణంబున వజ్రపాణి ప్రయుక్తమయినవాలుఁటమ్మునఁ దెగటారి నేలంగూలె, అతఁడీల్గిన కొంతసేపటికిఁ జిత్రభానుండు ప్రయోగించినకఱకుటమ్మున మకరందునకు గాయము తగుల నతఁడు మూర్ఛిల్లె. చికిత్సకొఱకు పరిజనులు స్కంధావారమునకు వానిం గొనిపోయిరి. మదపుటేనుఁగు మీఁద మకరందుఁడు కనఁబడకపోయినతోడనే పరసైన్యంబులు మకరందుఁడు మ్రందెనని కోలాహలముచేసి సంతోషసూచకముగా రణదుందుభులు మ్రోయించిరి. భద్రసేనుఁడు తనమిత్రునకుఁ బ్రమాద కరమైన గాయంబు తగిలెనేమో యని శంకించి చికిత్సకులచేత వ్రణ పట్టికలు వేయించి సమయోచితమైన యుపచారంబులు చేయించు టకు వెంటనే శిబిరంబున కరిగెను.

పరసైన్యంబుల కోలాహలంబులు విని మాళవసైన్యంబులు భీతిల్లి పలాయనముసేయఁ జొచ్చెను. తెలివివచ్చినతోడనే తనగాయ మునయిన లెక్కసేయక జోటజోటఁగారుచున్న నెత్తురుసోనలతో మక రందుఁడు మరల నశ్వము నెక్కి యెలుఁగెత్తి కయ్యమునకుఁ దనసై న్యంబులఁ బురికొల్పెఁ గాని వంచినతల యెత్తక భటులు పోయిన పోకం బోయిరి. విజయలక్ష్మి చిత్రభానునిం జేపట్టెను. పరసైన్యం బులు మాళవులం దఱిమితఱిమి కత్తుల నఱికియు బల్లెములం బొడిచి యు, నమ్ముల నేసియు, గదలం జఱిమియు నాశనముచేయఁజొచ్చెను,

మకరందుఁడు ధైర్యమువిడువక రణముఖంబున నిలువ భద్ర సేనుఁడు మఱికొందఱు భటులు వాని కపాయంబు శంకించి బలిమిని

గుఱ్ఱ మెక్కించి యావలకుఁ దీసికొనిపోయిరి. గాయములకుఁ జికిత్స చేయఁబడలేదు. నెత్తురోడికకట్టి పాఱుచుండెను. దాహముచే నాల్క యెగుర్చుకొనిపోవుచున్నను వెనుక పగవారు తఱుముచున్న కతమున మంచితీర్థము త్రాగుటకయిన నవకాశము లేకపోయెను. నెత్తురు మిక్కిలి మేననుండి పోవుటచే నతఁడు దుర్బలుఁడై సోలిపోఁజొచ్చె. భద్రసేనుఁ డాతనిగుఱ్ఱముమీఁదనే యెక్కి వాని దనయొమ్మునకుం జేరవైచుకొని పట్టుకొనియుండెను. లశ్వము సుశిక్షితమైన దగుటచే యజమానునవస్థ నెఱిఁగి మిక్కిలి వేగమునఁ బరుగెత్తఁజొచ్చెను. శిబిరము విడిచి కొంతదూరము వారు పరుగెత్తి యొకచిన్న పల్లియం జేరిరి. అప్పటికి సాయంకాల మగుటచే శత్రువులకు వీరిజాడ తెలియలేదు. కావున వారు మిక్కిలి వేగమున ముందుకు సాగిపోయిరి. భద్రసేనుఁడు మకరందుని మెల్లగాఁ దోడ్కొనిపోయి వ్రణచికిత్సకుఁ డా గ్రామమున నున్నాఁడాయని యడిగి తెలిసికొని గ్రామీణు లొక మంగలివానిం జూప వానిచే నారేయి యా రాకొమరునకుఁ దగు చికిత్సలు చేయించెను.

మకరందునకుఁ దీవ్రమైనజ్వరమువచ్చెను. కలఁతనిద్దుర యే గాని గాఢమగునిద్దుర పట్టలేదు. నాలుగైదుసారులు దాహము త్రాగెను. పెక్కుసారులు పలువరించెను. అం దొకసారి "కర్పూరమంజరీ! ఎంతకాలమునకుఁ గనఁబడితివి!" అని నిదురలోనే మందహాసపురస్సరముగాఁ బలికెను. వెంటవచ్చిన నలుగురుసేవకులు మార్గమధ్యమున శత్రుబాణప్రహారముల నీల్గుటచే వాని కంగరక్ష సేయవలసిలసిన వాఁడు భద్రసేనుఁ డొక్కఁడే యయ్యెను.

ఎంతదూరము పోయినను మకరందునిజాడలు పొడకట్టమి మకరందుం బట్టుకొనుటకై వెడలినచిన్నబలఁగము వెనుకకుఁదిరిగి వచ్చి పరిసరంబున నున్నపల్లియల శోధింపఁదొడఁగెను. గాయము

తగిలిన మూర్ఛవనాఁడు మంగలి కట్టువిప్పి పుండు మానుదలపట్టెన దనియుఁ బ్రాణాపాయము లేదనియుఁ జెప్పెను. అదివిని మకరందుఁ డిట్లనియె. "భద్రసేనుఁడా! సంగరంబున గాయముదగిలి నేను మూర్ఛిల్లినప్పుడు నన్నక్కడ నుండనీయక నీవు నన్ను శిబిరమునకుం గొనిపోయి మిక్కిలి తప్పుచేసితివి. మనసేనలు పలాయనము లగు చున్నప్పుడు గాయము లెక్కసేయక యశ్వారూఢుఁడనై నేను మరల సమరరంగమునకు వచ్చినప్పుడును నీవు నన్నక్కడ నిలువ నీయక పగతులు పట్టుకొందురని భయపడి యిటు తీసికొనివచ్చితివి. నీ విట్లు చేయనిపక్షమున నేనీపాటికి మృతినొంది వీరస్వర్గమునఁ బ్రాంతికాపున్నై యుందునుగదా! నాకట్టిగౌరవముఁ గలుగనీయక పోతివి. నాప్రాణరక్షణమే చూచుకొంటివి గాని దీనికన్న వేయి మడుంగు లధికమైన నాప్రతిష్ఠారక్షణము జూడవయితివి. నీయుద్దే శము మంచిదయినను నీకార్యము శ్లాఘాపాత్రము గాదు. రణ ముఖంబున క్షత్రియుఁడు మడమ తిరుగక వెనుకంజ యిడక పగతులతోఁ బోరవలయును. లేదా తనకై ప్రాణంబుల నర్పించిన వీరయోధ సహస్రసాహచర్యమునఁ దానుంబడి ప్రాణములువిడిచి కదనరంగ మలంక రింపవలయు. అట్టి పుత్రునివలననే తల్లి వీరమాతయగును. అట్టి మగనివలనఁ భార్య వీరపత్నియగును. నామరణము కన్న మకరం దుఁడు పందయై పోలికలనువిడిచి పాఱెనని లోకులు చెప్పుకొందు రేమో యనుసరికి నేనెంతయు భయపడుచున్నాఁడ. ప్రాణాపాయము లేదని చికిత్సకుఁడు చెప్పినందుకు నాకు సంతసము లేదు."

అనవుడు భద్రసేనుఁడు "మిత్రుఁడా! 'జీవన్ భద్రాణి పశ్యతి' యను నార్యోక్తి వినవే? బ్రతికియుండిన నెన్నో శుభములు గాన వచ్చు. ఎందఱో పగతుల గెలువవచ్చు. ఎన్నో విజయములఁ బడయవచ్చు. ఎంతో యశోధనము నార్జింపవచ్చు. ఊరక మృతి నొందిన నేమిప్రయోజనము? "శరీర మాద్యం ఖలు ధర్మసాధన"

మ్మనుమాట వినవే? నిన్నెఱింగినవా రెవ్వరు నిన్నుఁ బిఱికిపందయని యధిక్షేపింపరు. సమరములో నీవు మహాద్భుతముగ బనిసేయలేదే? అదిగాక సమరమును నీయంతట నీవు విడిచిరాలేదు. నీవు సొమ్మసిల్లినప్పుడు దుర్బలుఁడవైనప్పుడు నిన్ను బలిమిం దోడ్కొనివచ్చితిమి. గాయము మానినవెనుక కాయము దృఢమయినవెనుక నీవు మరలఁ బగతుఱపైఁజని గెలువవచ్చు.'' అని యక్కుమారుని సమాశ్వాసించెను.

మకరందునినిమిత్త మన్వేషించుచున్న సైనికుల నాయకుఁడు ప్రసేనుఁడు నాఁటియుదయముననె యాపల్లియఁ జొచ్చి గ్రామాధికారులం బిలిపించి మకరందునిజాడలు తెలియునా యని యడిగెను. నిజముగా వారతనిని జూడకపోవుటచేఁ దామేమియు నెఱుఁగనట్లు జెప్పిరి. అతఁ డది నమ్మక ప్రతియిల్లు శోధింపుమని సైనికుల కానతిచ్చెను. ఇచ్చినదే చాలునని దుండగులయిన యాసైనికులు వంటయిండ్లనక పడకగదులనక యటకలనక దొడ్లనక తోఁటలనక యెల్లతావుల వెదకి యంగనల నవమానించి తమకుఁ గావలసినపదార్థములనెల్లఁ జెప్పియుఁ జెప్పకయుఁ దీసికొనిపోయిరి.

అట్లు వెదకుచు నిల్లిల్లు దిరుగుచుండ నొకమంగలియింటిలోఁ గంబళిపఱచిన నులకమంచముపైఁ బండుకొన్న యొక పురుషుఁడు, వానిప్రక్కం దాటియాకులచాపపైఁ గూర్చున్న యొక్కపురుషుఁడు సైనికుల కగపడిరి. ఆమంగలిగుడిసెలో వారు దీపముల యట్లు వెలుఁగుచుండిరి. ఇద్దఱు సుందరపురుషులే. ఇద్దఱు విశాలనేత్రులే. ఇద్దఱు మనోహరవర్చస్కులే. ఇరువురు నాజానుబాహులే. ఇరువురు స్ఫురద్రూపులే. అగుటచే మాళవరాజనందనుఁడు వారిలో నొకఁడై యుండునని ప్రసేనుఁ డూహించి మంచముపైఁ బండుకొన్నపురుషునిం జూచి నీపేరేమని యడిగెను. ''నాపేరు మకరందుఁ''డని యతఁ డుత్తరము చెప్పెను.

వెంటనే భద్రసేనుఁడు లేచి "అయ్యా! మకరందుఁ డతఁడు గాఁడు. నాపేరు మకరందుఁడు" అని పలికెను. "నిజము చెప్పుఁడు ఇం దెవ్వరు మకరందుఁడు?" అని మరల నతఁ డడిగెను. "నేనే మకరందుఁడ. నేనే సుదర్శననందనుఁడ." నని మకరందుఁడు వెండియు నుత్తరమిచ్చెను. "అతఁడు కాఁడు. నేనే మాళవరాజనందనుఁడ"నని భద్రసేనుఁడు బదులుచెప్పెను. "మిత్రుఁడా! అబద్ధమాడకుము" అని మకరందుఁడు "మిత్రుఁడా! అసత్యము పలుకకుము" అని భద్రసేనుఁడును నొండొరులం గర్హించుకొనుచు మాటలాడిరి. "అతఁడు మామంత్రికుమారుఁడైన భద్రసేనుఁడు. నేను మకరందుఁడ" నని మరల నాతఁడు బలికెను. "అయ్యా! అతఁడు నామిత్రుఁడు భద్రసేనుఁడు. నేనే మకరందుఁడ"నని వెండియు భద్రసేనుఁడు వక్కాణించెను.

వారిసంభాషణము ప్రసేనునకును, సైనికులకును, జికిత్సకుఁడగుమంగలికిని, నచ్చట గుమిగూడిన గ్రామీణులకును మహాశ్చర్యముఁ గలిగించెను. అత్తఱిఁ బ్రసేనుఁ డిట్లనియె "ఆహా! మీచరిత్రము మిక్కిలి చిత్రముగానున్నది. ఎవ్వఁడు రాజనందనుఁడో యెవఁడు వానిమిత్రుఁడో తెలియుట లేదు. మీరు మాకు శత్రువు లయినను మీయుదారభావమును మేము ప్రశంసింపక తప్పదు. ఇంగిత మంత్రినందనుఁడు తనస్వామికుమారునిప్రాణమును గాచి తనప్రాణము పగఱ కప్పగింపఁ దలఁచుచున్నాఁడు. ఓహో! అతనిచరిత్రము మిక్కిలి శ్లాఘ్యము. రాజనందనుఁడు తనమేను దాఁచుకొనక తనకొఱకై నిష్కారణముగాఁ దనమిత్రుఁ డేల పోవలెనని యథార్థము చెప్పుచున్నాఁడు. మంత్రినందనుఁడు బొంకుట పరోపకారార్థము. రాజనందనుఁడు సత్యముపలుకుట పరోపకారార్థము. వీరిం గన్నతల్లిదండ్రులు ధన్యులు. వీరిజన్మలు చరితార్థములు. అయినను మాకు

బగతుఁ అగుటచే వీరినిరువుర నేనిప్పుడు బంధించి మా రాజుకడకుఁ గొని పోక తప్పదు. ఓహో! క్షాత్రధర్మము నిష్కరుణముగదా! నే నన్యథా వర్తింతునేని నా చేతులతో నాకంఠముఁ గోసికొన్నవాఁడ నగుదును. అయ్యా! మీరిరువురు లెండు. నా వెంట రండు"

అనవుడు భద్రసేనుఁడు ప్రసేనునిం జూచి "అయ్యా! మీరు నాలుగురున్నారు. మేమిద్దఱమున్నాము. నీవామూఁకకు మొనగాఁడవు. నీవొక్కఁడవాయుధము బూని మాతోఁ బోరి మమ్ము గెలిచి యట మీఁద మమ్ము బంధించి తీసికొనిపొమ్ము. లేదా మమ్ముఁ జంపుము అంతియ కాని క్షత్రియవంశమునం బుట్టి మీ వెంట బందెలదొడ్డికిఁ బోవుపశువులవలె మిన్నక వత్తుమె?" యని వీరరస ముట్టిపడునట్లు ప్రత్యుత్తర మిచ్చెను. నావుడు ప్రసేనుఁడు "నీమిత్రుని రమ్మను నీవు కాదు. అని వచియింప మకరందుఁడు చివాలున మంచమునుండి లేచి వద్దు! వద్దు! నీగాయము ప్రమాదకర మగునని వెనుక భద్రసేనుఁడు వాదించి వారించుచున్నను వినక ప్రక్కనున్న ఖడ్గము దీసికొని "వీరుఁడా! నీమాటయే చెల్లుఁగాక!" యని ప్రసేనునియెట్టయెదుట నిలిచెను.

భద్రసేనుఁడు వానిని వారింప బహువిధప్రయత్నములఁ జేసెఁ గాని గాయపడినవానిని సులభముగా గెలువవచ్చునని నీచమతితోఁ బ్రసేనుఁడు వానినినే గోరుకొనుటచేతను మకరందుఁడు లేనియుత్సాహముఁ దెచ్చుకొని సమరసన్నద్ధుఁ డగుటచేతను, భద్రసేనుఁడు చేయునది లేక కను లప్పగించి చూడవలసి వచ్చెను. అప్పుడు ప్రసేనునకు మకగందునకు భయంకర మగుఖడ్గయుద్ధము జరిగెను.

ఖడ్గములపరస్పరసంఘట్టనమువలన జనించిన విస్ఫులింగములు ప్రసేనమకరందులనేత్రగోళములనుండి వెలువడుక్రోధాగ్ని విస్ఫులింగములతో వియ్యమొందెను. ప్రసేనుఁడు భీషణభాషణంబులతో

మాళవరాజనందనుని బలుసారు లధిక్షేపించెనుగాని యతఁడు వాటికి దన కఱుకకత్తిపోటులచేతనేగాని మాటలచేతఁ బ్రత్యుత్తరమియ్య లేదు. ప్రేక్షకులు మహాశ్చర్యముతో నా ద్వంద్వయుద్ధముఁ దిలకింపఁ జొచ్చిరి. వెనుకటిగాయముచేత రక్తక్షయముఁజెందిన తనచెలికానికే సమయమున నేయపాయము సంభవించునోయని భద్రసేనుని గుండె కడుభయంబున గొట్టుకొనుచుండెను. ఎట్టకేలకు నూతనముగాఁ గయ్యమునకుఁ దలపడిన ప్రసేనునికన్న మహాయుద్ధపరిశ్రాంతుఁడై గాయమునఁ జిక్కి స్రుక్కియున్న మకరందుఁడే మిన్నయని యెల్లవారికిం దోఁచెను.

ప్రసేనుఁడు పరిశ్రాంతుఁ డయ్యెను. మకరందుని ఖడ్గప్రహారమున వానిచేయి తెగి నేలం బడెను. మకరందుఁడును మేనముచ్చెమటలుగ్రమ్మ నతిశ్రాంతుఁడై నేలఁ జదికిలంబడెను. అప్పుడు ప్రసేనునిబలములు తమ నాయకుఁడు నేలఁగూలుట జూచి సైపక హులనగ్ని ఘుంకించి మకరందునిమీఁదికి దుమికిరి. తోడనే భద్రసేనుఁడు యొఱలోనుండి తనకరవాల మూడఁబెఱికి యమ్మూకపైఁ బడి ముందుకువచ్చిన యేవురుబంట్లను నఱికి తక్కిన వారిపయిఁ బడెను. వెంటనే వారు వానియెదుట నిలువలేక గాలికెగిరిపోవు దూది పింజల చందమున నలుదెసలకుం బరువెత్తిరి.

చూపరులు మకరందుని యొక్కయు, భద్రసేనుని యొక్కయు సౌజన్యంబును, సౌహార్దంబును, విక్రమంబును వేయినోళ్ళం గొనియాడిరి. అప్పుడు భద్రసేనుఁడు తా మచ్చోటనుండుట క్షేమంబుగాదని మిత్రునకుం దెలిపి ముందుగా నయ్యూరు విడిచి పరిసరంబున నున్న యడవికింజని యటమీఁదఁ దమ కర్తవ్యమును విచారింపఁ జొచ్చిరి.

ముప్పదియవ ప్రకరణము.

అరవిందాదేవి సర్వక గాఢనిద్రలోనున్నప్పుడు కావలివాండ్రకుం దెలియకుండ నిజవాసంబు విడిచి నడిరేయి యొంటరిం జనియెనని చెప్పబడియెగదా! అంతఃపుర మెన్నఁడు విడిచి యెఱుఁగని యా సుకుమారి, యసూర్యంపశ్యయైన యామహారాజ్ఞి, మేడ నెక్కిన నలసిపోవు నా మెలఁతమిన్న, పులుగులయెలుంగుల విని కలంగు నయ్యాదిర్భేశ్వరి, మహాటవులలో నెండయనక గొండయనక మిట్టయనక పల్లమనక వెనుదిరిగిచూడక యాహారంబు వర్జించి యేమృగంబులైనఁ దమయాఁకలిదీర్చుకొనుటకయి, తన్ను మ్రింగిన బాగుండునని యేపామయినఁ గఱచిన మేలని యేసెలయేటినీటిలో నయినఁగొట్టుకొని పోయిన యుత్తమనుచు నడచిపోవఁ జొచ్చెను. ముండ్లుగ్రుచ్చుకొనుటచే నామెపాదములు పుండ్లయ్యెను. పొదలకుందొలఁగక వానిం దాకిపోవుటచే మేను గీచుకొనిపోయి నెత్తురులోడుచుండెను. ఎండలో నడుచుటచే నడుగులు పొడపొడఁ జొక్కెను. శిరోజములు మొగమున వీఁపున జెల్లాచెదరై పడియుండెను.

మూఁడవనాఁడు మధ్యాహ్నము రెండుజాముల వేళ నామె దుర్భరముగా నున్న తనజీవితమును దుదముట్టింపవలె నని సంకల్పించి యొక యేటియొడ్డుఁ జేరి వస్త్రము బిగించి కట్టుకొని సూర్యునికి నమస్కారములు చేసి యెత్తుగానున్న చోటు జూచుకొని యటనుండి గుభాలున నయ్యేటినీట దుమికెను. దుమికి రెండుమునకలు వైచెను. రెండవమునక వైచి తేలునప్పటికి నామె శిరస్సు కాషాయాంబరధారియగు నొకభిక్షువు చేతంబట్టి శిరోజములు గ్రహించి యవ్వలి కీడ్చెను. కడుపునిండ నీరుండుటచే నామెకు సరిగా స్మారకము లేదు. ఆ భిక్షువు

తిన శిష్యుని సాయముచే నామె నొకచెట్టుక్రిందఁ బడవయిచి సమయోచితోపచారములఁ జేసి నీరు గ్రక్కించెను. అంతట నామెకుఁ దెలివి వచ్చెను. పిమ్మట నాభిక్షు వామెనుజూచి యట్టి యాత్మహత్యకుఁ గారణ మేమని యడిగి యామె పూర్వవృత్తాంతమును గూర్చి ప్రశ్నించెను. ఆమె కొంతసేపు ప్రత్యుత్తరము జెప్పుట కిష్టపడక మౌనముద్రవహించి యగ్గురుశిష్యులు ప్రశ్నలనియెడు ముండ్లు మాటిమాటికిఁ గ్రుచ్చుటచే సహింపక యెట్టకేల కిట్లనియె.

"అయ్యా! మీరు నాకుఁ బరమశత్రులు గాని మిత్రులుగారు. నామనంబు నతిదారుణంబుగా బాధించుచున్న దుర్వార వేదననుండి నేను విముక్తినొందుటకు సాధన మేర్పఱచుకొన నది సాగనీయక నాకు మీరు మహాపకారముఁ జేసితిరి. మీకిందువలనఁ బాపమేకాని పుణ్యములేదు. పుత్రశోకజ్వరపీడితనయిన నాకుఁ జల్లని యానదీ జలములు సుఖప్రదాయకము లగును. కావున నిప్పుడయిన నన్నందుఁ బోవనిండు. ఈ ప్రాణములమీఁద నాకాశలేదు. గర్భమం దున్న విషము గ్రక్కువఱకు నరుఁడు బాధపడునట్లు నేనీప్రాణములు బోఁగొట్టుకొనువఱకు నతి బాధపడుచున్నాను. ప్రాణత్యాగమే నాకు సుఖము. శరీరవిసర్జనమే నా మనోవేదనమునకుఁ జికిత్స. కావున నాయం దనుగ్రహముంచి నన్నుఁ జావనిండు!"

అని వేఁడుకొన నాభిక్షువు లక్కజంపడి "తల్లీ! మేము భిక్షువులము. బౌద్ధులము. జీవహింసకుఁ బరాఙ్ముఖులము. చూచి చూచి నిన్నుఁ జావనిత్తుమే? నీకు మరణమే విధింపఁబడినయెడల మాకంటఁ బడకపోయియుందువు. మేము తక్షశిలకుఁ బోవుచున్నాము. అక్కడ వేనవేలు యోగిను లున్నారు. నిన్నక్కడికి మేము గొంపోదుము. మావెంట రమ్ము! భగవానుఁడయిన శాక్యసింహుని ధర్మంబులు విని నీకిష్టమయినచో నతని ననుసరించి దుఃఖసాగరము నీఁదగలవు.

నీవైఖరిఁ జూడ మహారాజాంతఃపురవాసినివలెఁ గానఁబడుచున్నావు. నీకిష్టమగునేని నీచరిత్రము మాకుఁ జెప్పుము.'' అని పలికిరి. అప్పుడామె తన వృత్తాంత మంతయు వారి కెఱింగింప వారు కాశ్మీరమహారాజపత్నియుఁ బాంచాలరాజనందనయు, నైన యాదేవికిఁ బ్రాపించిన దురవస్థకు నెంతేని దురపిల్లి యతి గౌరవంబునఁ గడునాదరంబున నింతింతయనరాని వినయంబున, నామె కుపచారంబులు సల్పి నెమ్మనంబున ధైర్యము పురికొల్పి యాత్మహత్య మహాపాతకమని దానిపై రోఁత బుట్టించి తక్షశిలం జేర్చిరి. అక్కడ నుపనిషద్రహస్య పరిజ్ఞాతలై వైదిక మతావలంబకులైన సన్న్యాసులను, శాస్త్రాధ్యయనములనిమిత్తమై వచ్చి విద్యలం గఱచుచున్న బ్రహ్మచారులను, ధమ్మపదము, త్రిపిటకము, హీనాయనము, మహాయనము మొదలగు బౌద్ధగ్రంథపఠనంబులచే ధన్యులై, విశాలములగు విహారములందు విడిసియున్న బౌద్ధభిక్షువులను, బరమనిష్ఠాగరిష్ఠలై బ్రహ్మచర్యవ్రతదీక్షాపరతంత్రలై యగ్నిశిఖలవలెఁ బవిత్రలైన భిక్షుణీజనమును, జూచి సంతసించి యాభిక్షుణీసమూహముతోఁ గలసి కాలక్షేపముఁ జేయఁజొచ్చెను.

అట్లు శక్తివర్మ సింగపుంగొదమలవంటి రాకొమరులఁ దీసికొని కాశ్మీరగాంధారదేశముల సరిహద్దులం జేరునప్పటికి చండుడు నిరంతరములయిన ప్రయాణంబులం జేసి వారిం గలిసికొనెను. గాంధారదేశపు సరిహద్దులం బాలించు వీరసేనుఁడు లోకోత్తరలావణ్యవిశేషంబులు గల రాకొమరుల నెమ్మొగములు జూచి వారు సామాన్యులు గారని గ్రహించి వారిని రావించి వారిచరిత్రము లడిగి శక్తివర్మముఖమున నంతయుఁ దెలిసి జాలినొంది యతిస్నేహంబున వారిం గౌరవించి రాజకుమారులకుం దగిన యూడిగంబులఁ జేయించి యందలము లెక్కించి చండునకు శక్తివర్మకు నశ్వముల నిచ్చి యిట్లనియె.

"మామహారాజుగారు భాగ్యవర్ధనుఁడు సత్పురుషుఁడు. మీ చరిత్రము విన్న జాలినొంది మీకు సాయముఁ జేయును. ఆయనకుం గొడుకులు లేరు. సౌదామిని యనుకూఁతురుగలదు. పదునాలుగేండ్ల ప్రాయము గలది. మిక్కిలి చక్కనిది. తగినవరుని సంపాదింపలేక యాయన మేఱమీఱినవిచారము నొందుచున్నాఁడు. అందుచే నాయనకు మీ రాక పరమసంతోషజనకమై యుండును. కావున మీరీవాహనంబు లెక్కి యుచ్చోటికిం జనుఁడు. నేను మీరాక వారికి ముందుగా దెలియ బఱచెద"

అనవుడు శక్తివర్మ మహాప్రసాద మని వానిమన్నన నంగీకరించి కృతజ్ఞతఁ దెలిపి బాలకులం దోడ్కొని గాంధారమునకు జనియెను. గాంధారనాయకుఁడు నగు భాగ్యవర్ధనుఁడు వీరసేనునిజాబునూచుకొని సంతసించి రాజకుమారులకు నెదురుకోలుసల్పి తోడుకొని రమ్మని తనయమాత్యు నంపి వారు తన యంతికమున కరుదెంచిన పిదప వారిని కౌఁగలించుకొని యెంతయు సన్మానించి సంపంగి నూనెతో రాకొమరులకుఁ దలయంటించి యమూల్య వస్త్రాలంకారముల నాభరణంబుల నిచ్చి యభ్యంతరమందిరంబున విడియఁ జేసెను. చండశక్తివర్మలకును దగిన గౌరవంబు సలిపెను. ఆరేయి కుమారులవలన శక్తివర్మవలన మంచుకులకడ నున్నకొండకోటలో జరిగిన దారుణవృత్తాంత మంతయువిని భాగ్యవర్ధనుఁడు వానిమంత్రులు మహాదుఃఖపరవశులై దాని నోర్చుకొనలేక బాలకులక్లేడ్చి చిత్రభానుని దౌర్జన్యమును వేయితెఱంగుల గర్హించి యక్కిరాతునకు భగవంతుడు తగినదండనము చేయఁడే యని యొక్కపెట్టునఁ బలికిరి. బాలకులం జూచినది మొదలుకొని భాగ్యవర్ధనుఁడు వారియెడ నత్యంతస్నేహంబు గలిగి విక్రమసేనునకుఁ దన గారాబుకూఁతురగు సౌదామిని నిచ్చి పెండ్లిచేయవలె ననియుఁ దన తమ్మునికూఁతు రయిన చిత్రరేఖను

హర్షవర్ధనున కిచ్చి వివాహము సేయవలె ననియు నిశ్చయించి జ్యేష్ఠునిఁ గాశ్మీరసింహాసనమునఁ గూర్చుండఁ బెట్టవలయు నని సంక ల్పించెను. తనమనోనిశ్చయమును మంత్రులకు సేనాపతులకు రహ స్యముగఁ జెప్పి దండయాత్రా సన్నాహమును జేయింపుమని యాన తిచ్చెను. ఆనతిచ్చుటయే తడవుగా రాజకార్యపరతంత్రులగుమంత్రు లు గజరథతురగ పదాతిసైన్యంబుల నాయత్తము సేయఁ జొచ్చిరి.

గాంధారరాజాంతఃపురమున రాజకుమారులుసకలసౌఖ్యముల ననుభవించుచున్నను దల్లిజాడ తమకుఁ దమజాడ తల్లికి దెలియకపోవు టచే నెల్లయపుడు మాతృవియోగదుఃఖమున గ్రుక్కుచుండిరి. ఆమె జాడను వరయుటకై నిపుణులగు వేగులవాండ్రఁబంపుమని భాగ్యవర్ధ నునిం బ్రార్థించిరి. అతఁడు వారియభీష్టప్రకారము జేసెను.

మాధవసేనుఁడుఁ మహేంద్రదేవునిబలములు పరాజయము నొందినంతోడనే తాను పరాజితుఁడై మహేంద్రదేవునితోడఁ బాం చాలపురమునకరిగి యపజయమువలన నిర్విణ్ణుఁడై యున్న యా ముదుసలికేనిక్ ధైర్యముఁ గొలిపి యుత్సాహము పుట్టునట్లు పూర్వ రాజులచరిత్రంబులు పురాణగాథలు, జెప్పి జయము తప్పక సేకూరు నని నమ్మికపుట్టఁబలికెను. అతఁడును మాధవసేనుని దనకు హితోప దేశకునిగా నేర్పఱచుకొని రాజభక్తిశూన్యులయిన నియోగులఁ దొలఁ గించి స్వామిభక్తి యుక్తుల నధికారములందు నియోగించి మరల సమరసన్నాహము జేయింపఁజొచ్చెను. ఈసారి యుద్ధములో జయమ యిన సేకురవలయు లేదా, తనప్రాణములయినసమరరంగమునకర్పిం పవలె ననియు మాధవసేనుఁడునిశ్చయించుకొని యతఁడు దృఢప్రయ త్నము జేయఁజొచ్చెను.

అట రత్నసేనుఁడు మాళవరాజసైన్యము లోడిపోయి నానా ముఖంబులకుం బరుగులెత్తుటఁజూచి మరలసేనంగూడఁగట్టుటకు బహు

ప్రయత్నములం గావించెను. అతని ప్రయత్నము లరణ్యరోదనము లయ్యెను. ఆతని మనస్సు పరాజయమువలన జనించిన పరాభవమున ను దనకొడుకు రాజుకొడుకుం గానం బడమిం బొడమిన విషాదమువ ల్లను మిక్కిలి దుఃఖనిలయమై యుండెను. "నన్నునమ్మి నాసామర్థ్య మందు విశ్వాసము గలిగి తనకొడుకున కేయపాయము రాకుండ నేను జేయంగల నని మనోనిశ్చయముగలిగి సేనల నావశముజేసి పంపి నందుకు నేనెంత చేసితిని. పోనీ! జయాపజయములు దైవికములు. వాటి కేమి మఱియొకసారి గెలువవచ్చు ననుకొందము. అతండు తన కుమారుని నా కప్పగించె. చంద్రప్రభాదేవి పంచప్రాణము లాతని మీందనె పెట్టుకొనియుండు. ఆతలిదండ్రులు నాకొడు కేండనియడిగిన నేమిచెప్పుదును? ఇంక మాభద్రసేనునిమాట నే నేమనుకొందును! పరమమిత్రు లయిన యక్కుమారు లిరువురు సమరమున మడిసియుం దురా? పగతుఱచేం జిక్కియుందురా? ఏమిగతి! ఏమయితినేమి! నేను మాళవంబున కరిగి సుదర్శనుని గాంచి దండయాత్రా విషయములాత నికిం జెప్పి సమాశ్వాసించి మరల యుద్ధసన్నాహము జేయించెదను. ఈపరాభవవ్రణము విజయంబను నౌషధంబునం గాని కుదురదు." అని రత్నసేనుండు తనలో వితర్కించి యోడ నడిసముద్రమునం బగి లినప్పుడు దానిచెక్క నొకదానిం బట్టుకొని సాగరమీంది ప్రాణము లు దక్కించుకొను బాటసారివోలె నాతండు హతశేషమయిన సేనం గూర్చుకొని యుజ్జయినీనగరసమీపమునకుం బోయెను. పోవునప్ప టికి మాళవదేశస్థితి యెట్లుండవలెనో యట్లుండెను.

మగటిమి నెఱపంగల సైనికు లందఱుం గాశ్మీరదేశముపై దం డు విడియుటకుం బోయినందున విదర్భరాజుసైన్యంబులు గట్టిగొళ్లెము లు లేని తలుపులు గలయింట దొంగలు సులభముగం జొచ్చినట్లు లా హారశూన్యమై కృశించియున్న వానిమీన రోగములు దూరినట్లు

మాళవముఁజొచ్చి యనాయాసమున నిలిచియున్న యల్పసైన్యముల నోడించి రాజధాని నాక్రమించుకొని సుదర్శనునిం బాఱఁద్రోలి కోటలో విడిసెను.

సుదర్శనుఁడు సకళత్రముగ సపరివారముగ ఘూర్జర దేశముఁ జొచ్చి యారాజు తనకుఁ బూర్వమిత్రుఁ డగుటచేవాని కతిథియై వాని సాయమున మరల మాళవరాజ్యముపై దండు విడియవలయునని ప్రయత్నము సేయుచుండెను.

రత్నసేనుఁ డావృత్తాంత మంతయు విని విధి కాశ్మీరరాజ కుటుంబమునకే గాక మాళవరాజకుటుంబమునకుఁగూడ విముఖుఁడైన యుండుటఁ దెలిసికొని రాజధానికిం బోవక తనవెంటనున్న యల్ప పరివారముతో ఘూర్జర దేశమునకుం జని యారాజున కాశ్రయుఁడై దీనుఁడై యున్న సుదర్శనుం గాంచి దండయాత్రా పర్యవసానముఁ జెప్పి మకరంద భద్రసేనులజాడలు తెలియలేదని విన్నవించెను. పుత్రవియోగము రాజ్యభ్రంశముకన్న నానరపాలున కధికసంతాపముఁ గలిగించెను. ఎల్లదేశములయందు వానిజాడలు భద్రసేనుని వార్తలు దెలిసికొనుటకై సమర్థులగు పురుషులను బంపుమని యతఁ డానతిచ్చెను. నిజపుత్రవియోగముచేఁ గుందుచున్నను రత్నసేనుఁడు మాళవరాజ్యసింహాసనమునందు సుదర్శనుని మరల బ్రతిష్ఠించుటయే ప్రధానకర్తవ్యముగాఁ జేసికొని ఘూర్జరనాయకుని యనుగ్రహము నకుఁ బాత్రమై సేనలు ప్రోగుజేయుటలోను దదితరసన్నాహము జేయుటలోను శక్యమైనకృషిఁ జేయుచుండెను.

మకరందుఁడు సమరమునఁ బరాజితుఁడై గాయపడినాఁడని కర్ణాకర్ణిగ విని కర్పూరమంజరి మితిలేని విషాదమునొంది నిద్రాహారంబులు వర్జించి యాతని నిమిత్తము పరితపింపఁజొచ్చెను. ప్రసేనుఁడు కడతేరినతోడనే భయభ్రాంతులై పాఱివచ్చిన హతశేషసైనికులు

చిత్రభానున కావృత్తాంత మెఱిఁగించుచుండఁ జాటునను విని మల్లిక పరుగుపరుగునఁ గర్పూరమంజరికడకుఁ బోయి "సఖీ! నీకుఁ బ్రియము మెఱిఁగించెద. ప్రియమెఱిగించెద" ననియెను. "ఓసీ! మరణమునకు సిద్ధముగా నున్నదానికిఁ బ్రియమేమున్నదే!" యనియామె విసుగుతోఁ బలికెను. "సఖీ! అమంగళము నోట రానీకుము. మకరందుఁడు సుఖముగా నున్నాఁడు. గాయము కుదిరినదట. అది కుదురుట యేగాదు. మనసేనాధిపతులలో నొకఁడైన ప్రసేనుని ద్వంద్వయుద్ధమునఁ దాఁకి గూల్చునంతటిబలముగూడ నతనికిఁ గలిగినఁట. శౌర్యరాశియైన ప్రసేనుఁడు చచ్చినందుకు మీతండ్రిగారు చింతిల్లుచున్నారు." అని మల్లిక విన్నవించెను.

అప్పలుకులు కర్ణరంధ్రములఁ జొచ్చినతోడనే పండుకొనియున్న కర్పూరమంజరి దిగ్గున లేచి పాన్పుపైఁ గూర్చుండి "మల్లిక! ఏమేమి? ఆయన సుఖముగా నున్నాఁడా? నిజముగా నాకుఁ బ్రియమెఱిఁగించితివే! ఇదిగో! ఈయుంగరము నీవు పారితోషికముగా గ్రహింపుము. నా కాయనపాణిగ్రహణభాగ్యము లభించినను లభించకపోయినను జీవించి యున్నవాఁడనియు, సుఖముగా నున్నవాఁడనియు వింటి నదియె చాలు!" ననిపలికి కొంతయూరటఁ గలిగి వెండియు నెన్నఁడైన నాతనిసందర్శనము జేయు పుణ్యకాలము లభింపఁజేయుమని కాత్యాయనీదేవిని బ్రార్థించెను. మల్లిక యామె కోరిక నెఱవేర్పుమని భగవతి గౌరిని దానును వేఁడుకొని "సఖీ! తప్పక నీ కాతనిసమాగమము గలుగునని యెందుచేతనో నాకు గొప్పయాస గలదమ్మా! అందుచేత నీ వూరటగలిగి యుండుము." అని ధైర్యము జెప్పెను. "ఓసీ! నీవంతకన్న నేమనియెదవు? నీ ప్రియసఖి బెంగటిల్లి చిక్కి శల్యమై మృతినొందు ననుభయమున నీ వాశాగుటికలు నాచేత మ్రింగింపఁజూచుచున్నావు? ఏమైన నగుఁగాక!

మన మేమిసేయఁగలము! అని నిట్టూర్పువిడిచి వెండియుఁ బాన్పుపైఁ బండుకొనెను.

అట్లరణ్యమునందు మకరందభద్రసేనులు కొండొకవృక్షచ్ఛాయఁ జేరి యెటుపోవఁదగునని సమాలోచనము సేయఁజొచ్చిరి. అప్పుడు మకరందుఁడు తన మిత్రున కిట్లనియె. "భద్రసేన! నే నుజ్జయినికిఁ బోఁజాలను. ఏలయన నే నెంతో మొనగాఁడ నని మహాసైన్యముం గూర్చుకొని కాశ్మీరముపై దండువెడలి యుద్ధమునం దోడిపోయి గాయపడి పందనై రణరంగము విడిచి పాఱిపోయి యిప్పుడే మొగముఁ బెట్టుకొని యుజ్జయినిం బ్రవేశింతును? నాయం దెంతో గౌరవముగల యుజ్జయినీపురవాసుల మొగము లెట్లు చూతును? సిగ్గులేక నాతండ్రి నెట్లు చూతును? నే నాయన కడుపుచెడఁ బుట్టితిని. నాజననమువలనఁ బవిత్రమయిన మాళవరాజవంశమునకుఁ గళంకము గలిగినది. చంద్రప్రభాదేవి వీరమాత యగుటకు మాఱుగా భీరుమాత యైనది. కర్పూరమంజరీ పాణిగ్రహణమునాకు సంప్రాప్తింపక పోవుటయే మేలయ్యె. నావంటిపందను బెండ్లిచేసికొన్న పక్షమున నామె వీరపత్నిగాక భీరుపత్నియై సాటిరాజకన్యకలలోఁ దలవంచుకొనవలసి యుండును. హేమచంద్రునితనయులకు సాయముజేసి వారి నుద్ధరింపవలెననివచ్చి నే నింత జేసితినిగదా! ఆబిడ్డ లేమయిరో తెలియదు. ఛీ! నాబ్రతుకేల? మిత్రుడా! నేనింక నింటికి రాను. భగవానుఁ డైనబుద్ధదేవుని కపిలవస్తునగరమున కరిగి భిక్షువునై యుండెద. లేదా, భిక్షుకసహస్రము గలతక్షశిలకుఁ జని వారి శిష్యుఁడనై జ్ఞానసంపాదనముఁ జేసెద. పరాభవాగ్నిదగ్ధమగుచున్న నామనస్సున కింతకన్న దారి పొడకట్టుట లేదు."

అధైర్యద్యోతకము లయిన యాతనివచనములనాలకించి భద్రసేనుఁడు నవ్వి "మిత్రమా! వజ్రము మెత్తపడినది. అగ్ని వేఁడిం

గోల్పోయినది. ఏమి! యీవిచిత్రము. నీకింత యధైర్యము గలుగనేల? యుద్ధములు జూదములవంటివి. రణముల జయాపజయములు జూదమందలి జయాపజయములవంటివి. చెట్టు నెక్కెడువాఁడే పడెడువాఁడు. భారతయుద్ధమునఁ బాండవులు కౌరవులచే నెన్నిసారులు భంగపడలేదు? కాన యెట్టకేలకు వారు గెలువలేదే. శ్రీమన్నారాయణుని యవతారమయినకృష్ణుఁడు జరాసంధునిచేఁ బలుసారులు కయ్యమున నోడిపోయి యెట్టకేలకు వానిని భీమార్జునసహాయంబున సంహరింపలేదే? కావున నొకసారి యోడితి మని వీరుఁడు సిగ్గుపడి సమరపరాఙ్ముఖుఁడు కాఁగూడదు. నరుఁడు కార్యసిద్ధికై యాజన్మాంతముఁ బ్రయత్నించుచుండవలసినదె. అధైర్యము మానవుని వెలుతురునుండి తీసికొనిపోయి గాఢాంధకారమునఁ బడవేయును. ధైర్యమను తేప విపత్సముద్రముల నీఁదుటకు సాధనము. ధైర్యమువంటి మిత్రము మఱియొకటి లేదు. ఏమిత్రమును విడిచినను భయములేదు కాని ధైర్యమిత్రమును విడిచితిమా చెడిపోదుము. కావున వైరాగ్యమును విడిచి మీవియోగమునకై తల్లడిలుచుండు తల్లిదండ్రులను సందర్శించి దుఃఖోపశమనముఁ జేయుము. మరల మహోత్సాహముజేసి కాశ్మీరముపై దండు విడిసి చిత్రభానునిం గెలువుము. జయమువలనఁ గలిగెడుమహాయశస్సు నేఁటిపరాభవకళంకమును గప్పిపుచ్చఁగలదు. లెమ్ము! లెమ్ము!" అని యుత్సాహరసపూరితమయినపలుకులు పలికెను. అప్పలుకులు విని మకరందుఁడు "మిత్రుఁడా! పరాభవం బను మేఘపటలముచేత మెండుగ నాక్రమింపఁబడి నా మనస్సుజ్ఞానతేజముం గోల్పోయి యుండుటచే నట్లంటి. నీపలుకులు యుక్తియుక్తములై యున్నవి. నీచెప్పినట్ల చేసెద. కాని మార్గాయాసమున నేను మిక్కిలి దస్సినాఁడ. త్రాగుట కించుక మంచినీరు దొరకిన సేద దేరి పయనము సేయఁగలుగుదు. అది యీనట్టడవిలో నెట్లులభించును?"

నని నిట్టూర్పు విడిచి చెట్టునీడం బండుకొనియెను. "మిత్రుడా! భయపడకు. అడవులలో నేరులు, వాగులు, చెఱువులు నుండకపోవు. నే నీసమీపమున నెందయిన జలాశయమున్నదేమో యరసి యుండి నం దెచ్చెద. ఈనీడను విశ్రమింపుము" అనిపలికి తోడనే యాతఁడు జలము నన్వేషింపం బైలుదేరెను.

అమితమైన యాయాసమున నలసియున్న కతమున మకరందునకు మహీరుహచ్ఛాయను బండుకొనినతోడనే నిద్రపట్టెను. నిద్ర సుఖమెఱుంగదన్న సామెత నిజము గదా! చంద్రశాలలలో దాసదాసీ విలాసినీజనములు వట్టివేళ్ళవీవనల విసర మెత్తనిహంసతూలికాతల్పంబులపైఁ బవ్వళించు మహారాజకుమారునకు నట్టడవిలోఁ జెట్టునీడ నట్టినేలఁ బండుకొన్నను సుఖనిద్రపట్టెను. భద్రసేనుఁడు వనంబునఁ గొంతదూర మరిగి మనోహరములయిన తామరపూవులతోడను, జల్లని తియ్యనీటితోడను విలసిల్లునొక్క చెఱువుంగనుంగొని రాశీభూతమయినభగవంతునిదయారసముగా దానిని భావించి విశాలములయిన తామరాకులు దొన్నెలుగాఁగుట్టి నాలుగుదొన్నెలనిండ నీరునించి మిత్రుని నోరెండిపోవునేమోయనుభయమున నతివేగంబునవచ్చి చెట్టుకడఁజూచునప్పటికి మకరందుఁ డక్కడ లేకపోయెను. భయము విస్మయము, సంభ్రమము మనంబున మల్లడిగొన నతఁడు దాహమున కాగలేక నీరుకొఱ కెందైనఁ జనియెనేమో యని శంకించి "మకరందుఁడా! మకరందుఁడా!" యని యెలుఁగెత్తి పిలిచెను. అప్పలుకుల కుత్తరము లేదు. వెంటనే సందియములు హెచ్చెను. మనస్సు విషాదాక్రాంత మయ్యెను. శరీరమందుఁ జేవ డిందుపడియెను. నిలువలేక చెట్టునకుఁ జేరఁబడి కూర్చుండి యతఁ డిట్లు విచారించెను. "ఇతఁడేమైయుండును? అతిపిపాసావశమున మృతినొందినచోఁ గళేబర మిందుండవలయునుగదా? అట్లు కాదు. దుష్టమృగము లేవైన దస్సిబల

హీనుఁడై యున్నయీతనిఁ గొనిపోయియుండునా? లేక చోరులు, కిరాతులు వీనిఁ జంపి యుందురా? భూ? విధీ! ఆబాల్యవర్ధితస్నేహుల మగువారాను మహారణ్యమధ్యమున నెడబాటు గలిఁగించితివే! ఏమి సేయుదు నెవ్వరి నడుగుదు, నెందుఁబోవు, ఈయడవులందు వెదకుచుఁ గానఁబడఁడేని యుండే శరీరమునువిడిచెద'' నని గమ్యస్థాన మిది యని నిర్ణయించుకొనకయె మిత్రు నన్వేషించుటకై పయనముచేసెను.

ముప్పదియొకటవ ప్రకరణము

పట్టిన దల్ల బంగార మయినట్లు చిత్రభానునకుఁ దలపెట్టినతరు వాతి జయముతరువాత జయము చేకూరుటచే లోకమున నతనికి గొప్పఖ్యాతి గలిగెను. కాశ్మీర దేశప్రజలెల్ల మాళవపాంచాలురపరా జయముఁ దెలిసినతరువాత ''భళి! చిత్రభానుఁడా, భళి'' యనిప్రశం సింపఁజొచ్చిరి. ఆవిజయములు వానిపూర్వదోషముల మరపింపఁ జొచ్చెను. ప్రజలు విక్రమసేనహర్ష వర్ధనులమాటయే మఱచిపోయిరి. అరవిందా దేవి యెచ్చటనున్నది? యనియడుగువారే తక్కువయిరి. రాజభక్తులు, సదాచారులు మాత్రము చిత్రభానుఁడు సింహాసనము నిమిత్తమై చేసినదురితములను గర్హించి విక్రమసేనహర్ష వర్ధనులగుఱిం చియుఁ దల్లింగూర్చియు విచారించుచుండిరి. చిత్రభానునిగర్వమునకు మేర లేకపోయెను. అతఁడు నేలనుండియు నభోవీధిని సంచరించునట్లు వర్తింపఁజొచ్చెను. దానికిం దగినట్లు రుద్రభట్టు పలుతెఱంగుల వాని విక్రమంబుల వినుతింపఁ దొడఁగెను.

ఒకనాఁడు వారిరువురుఁ గూర్చుండిమాటాడుచుండఁ బ్రసంగ వశమున రుద్రభట్టిట్లనియె—''రాజా! నాచెప్పినచొప్పున నీవురాజ

వైతివిగదా! మహేంద్రదేవుఁడోడె. మాళవసైన్యమోడె. మకరందుఁడు కథావశేషుఁ డయ్యె. సుదర్శనుఁడు రాజ్యహీనుఁ డయ్యె. నీప్రతాపాగ్నికిఁ బగతుదళములు మిడుతలై పోయినవి. భరతఖండమునందు నేఁటికాలమున నిన్ను మించిన రాజులు లేరు. రామరంతిదేవమహాభిష మాంధాతృప్రముఖు లగు రాజన్యులతోడ సమానుఁడ వైతివి. నీయశోలతలు హిమాలయము మొదలుకొని రామసేతువఱకుఁగల భారతవర్షమంతట నలముకొన్నవి. అనేకమహీపాలురు నీసఖ్యము నపేక్షించుచున్నారు. రత్నగర్భలవంటిభూములు గలమాళవపాంచాలదేశంబులు నీపాదాక్రాంతములై యున్నవి. రాజులు నీయానఁ బూలదండవలె శిరంబున ధరించుచున్నారు. రాజన్యమకుటమాణిక్యకాంతులు నీపాదపద్మములకు నీరాజనము వెట్టుకాలము సంప్రాప్తించినది. కష్టములు గట్టెక్కినవి. ఇంక నీవు పట్టాభిషేకముఁ జేసికొమ్ము. తద్విషయిక ప్రయత్నముఁ జేయించెద. నీ వనుజ్ఞ నిత్తువేని దానికిం దగుసుముహూర్తము నిర్ణయించి వలయుపనులం బ్రారంభించెద." అని పలుక జిత్రభానుఁడు "పట్టాభిషేకమున కంత తొందర యేమి? ఎప్పుడో చేసికొనవచ్చును. మాళవపాంచాలురు మరల వత్తురేమో చూడవలయుఁగదా!" యని బదులు చెప్పెను.

"మాళవపాంచాలురు మరల వచ్చుటా! చచ్చినవాఁడు మరల బ్రతుకఁడు. పగిలినకుండ మరల నదుకుకొనదు. నేల నొలికిననీరు మరల నెత్తుట సాధ్యమా? మహేంద్రదేవుఁడు శతవృద్ధుఁడు. రాజ్యవృత్తమునకుఁ జీడపురుగులు పట్టినవి. మాళవుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు. పరమేశ్వరుఁడు నాస్తికులఁ దల యెత్తనిచ్చునా? ఆస్తికులలో నగ్రగణ్యుఁడ వయిననీచేత భక్తవత్సలుఁ డగుపరమేశ్వరుఁడు లోకద్రోహు లగుబౌద్ధులను నాశనము చేయింపఁ దలఁచినాఁడు. కాని యీసందర్భమున నిన్నొక్కవర మడిగెద. అది యేదన క్రొత్తగా

జయింపఁబడి మనయధీన, మయినమాళవదేశమునకు నీకుమారుని విజయసేనుని రాజుగాను నన్నాతనిమంత్రిగాను నీవు నియోగింప వలయు నని నాకోరిక. ఈముద్దుచెల్లింపుము. ఈవేఁడుకోలు ననుగ్ర హింపుము. ఈవర మొసఁగుదువేని మున్ను నష్టమైననాప్రతిష్ఠమరల బతిష్ఠింపఁబడును. సుదర్శనుఁడు చేసినపరాభవమువలన నేను తొల్లి పూవులమ్మినయూరిలోఁ గట్టెలమ్మితిని. నీయనుగ్రహమున్నపక్ష మున వెండియుఁ గట్టెలమ్మినయూరులోఁ బూవులమ్మెద. పూవు లమ్ముటే కాదు. ఉజ్జయినీపట్టణమును మంగలమునం బెట్టి వేచెద. బౌద్ధవిహారముల నెల్ల నేలమట్టము జేయించెద. వాటితావున శివాల యముల నిర్మించెద. నాస్తికాధముఁడయినసుదర్శనునినివాసమువలన నపవిత్రము లయినయాయంతఃపురముల, మేడల, మిద్దెలఁ బరశు రామప్రీతి గావించి నిర్మూలించి యచ్చట ముండ్లకంపలు వేయించి జిల్లేడు మొలకల నాటించెద. అంతేగాదు సుదర్శనుఁడు నన్ను నిండు కొలువుకూటములోఁ బరాభవించి దేశభ్రష్టుఁ జేసినాఁడు. సభాభవన మందుండియు నన్నుఁ బురస్కరించుకొని యొక్కమాటయిననాడక యూరకుండిన యధముల నందఱ బుద్ధివచ్చునట్లు తగురీతి దండించెద. అదియుఁగాక పలుమాఱు నాతో దైవాస్తిక్యమునుగూర్చియు వేదప్రామాణ్యాదులఁ గూర్చియు, వాదము సల్పి రాజు వానిపక్షమున నున్నకతమున వానిబలమున నన్నోడించి యపహసించిన దేవసిం హుఁడు, హిరణ్యమిత్రుఁడు, సత్యసింహుఁడు మొదలగు మానవాధ ముల నాస్తికబ్రువుల బౌద్ధపాంసనులఁ బంకులొలచినట్టుల మునఁగోళ్ళ నొలిపించియు బ్రతికియుండఁగానె గడ్డివాములలోఁ బెట్టి కాల్పించియుఁ జెఱుకుగట్టలట్లు గానుగలలో వైచి యాడించియు, నానాహింసల పాలు జేసి చిరకాలంబుననుండి నామనంబునఁ బడుచున్న క్రోధాగ్నిని వారి నెత్తురులవలనఁ జల్లార్చుకొనియెద. కేసరి యనునమాత్యు

నొక్కనే రక్షించెద. అతఁడిప్పటికిని నాపక్షమువాఁడే. మొన్న జరిగిన కయ్యంబునఁగూడ నాతఁడే వైదర్భుల కాయువుపట్లు చెప్పి కోట మనవారియధీనము జేసినాఁడట. ఇవియె నీవు నాకుఁ జేయవలసిన మహోపకారము.'' అని తీవ్రముగా రుద్రభట్టు విన్నవింపఁ బ్రభాకరుఁడు చిఱునవ్వు నవ్వి ''మహాత్మా! చిరకాలమునుండి మీమనః పేటికలో నడఁగియుండిన క్రోధసర్పము నేఁడు లేచి పడగ విప్పి యాడుచున్నదే. ఇంతవఱకు రాజుచున్న క్రోధాగ్ని నేఁడు మండుచున్నది. ఈశాంతమూర్తిలో నింత దారుణమయిన క్రోధానల మెట్లడఁగి యున్నదో యెఱుఁగకున్నాను. మీరు మహానుభావులగుటచే నింద్రియములు మీయధీనములు. క్రోధాదుల నడఁపఁగలరు. ఇచ్ఛవచ్చినప్పుడు ప్రజ్వలింపఁ జేయఁగలరు. అట్లె మీకోరిక ప్రకారము జేసెద. ముందుగా నేనును వజ్రపాణియు, మాళవమునకరిగి యచ్చటిపరిస్థితుల స్వయముగాఁ దెలిసికొని దేశ మధీనము జేసికొని మరలివత్తుము. వచ్చినతరువాత నాపట్టాభిషేక మయినవెనుక విజయసేనుని మిమ్ము మాళవమునకంపెద. మీరు నాకుఁ జేసిన మహోపకారములకు నేనీ పాటిచిన్నపని మీకొఱకై చేయుట యబ్బురమా? మీ రడిగినది మిక్కిల తక్కువకోరిక. సద్బ్రాహ్మణు లగుటచే మీరు నిస్స్పృహులు. అశ్వము లడిగిరా, యాందోళిక లడిగిరా? గజము లడిగితిరా? కాంచనములడిగితిరా? హారములడిగితిరా? యగ్రహారము లడిగితిరా? ఈపాటిచిన్నకోరిక తీర్పనియెడల నాజన్మమేల? ఈకోరికయేగాదు— రాజ్యమంతయు మీపాదములకడ సమర్పించెద. రాజ్యమేకాదు— ప్రాణములనయిననిచ్చెద.'' అని కృతజ్ఞతాపూర్వకముగా సంభాషించి వరమిచ్చినట్లు మాటయిచ్చెను.

అతని వినయంబునకుఁ గృతజ్ఞతకుఁ జాలసంతసించి రుద్రభట్టు "రాజా! బూడిద బూసికొని, నీర్కావిగుడ్డలు గట్టుకొని పండ్లు, పాలు, దిని తపంబు జేసికొను పరమవైదికునకు నాకు నశ్వములేల యాందోళికలేల హారములేల, యగ్రహారములేల? అవియాగర్భశ్రీమంతులై భగవంతునివలనఁ బ్రజాపాలనాధికారము జన్మముతోడనే వహించిన మీవంటి ప్రభువులకు విధినిర్ణీతములు. కృష్ణాజినములు, దర్భాసనములు రుద్రాక్షములు జటాజూటములు మొదలయినవి మానిమిత్తము నిర్మింపఁబడినవి. ఆశలు జయించినవారు బ్రాహ్మణులుగదా! అసంతుష్టిగల బ్రాహ్మణుఁడు సంతుష్టిగల క్షత్రియుఁడు చెడుదురని వినలేదా? రాజా! ఇంక నీపట్టాభిషేక ప్రయత్నము జేయించెద. సామంతరాజులకును నాటిమేటి నృపులకును నభిషేకమహోత్సవమునకు రమ్మని సగౌరవముగా నాహ్వానములఁ బంపించెద. సింధువు, సరస్వతి, భాగీరథి యమున మొదలగు పవిత్రనదీనదంబులజలములు స్వాధ్యాయవేత్తలగు బ్రాహ్మణోత్తములచేతఁ దెప్పించెద. ప్రతిదేవాలయమున నీ శ్రేయస్సునిమిత్తమై యభిషేకములఁ జేయించెద. నగరమందంతటను సూర్యరశ్మి గనఁబడకుండ బందిళ్ళు వేయించి యరఁటికంబములు నాటించి తోరణములఁ గట్టించి వీథివీథులయందు శృంగారలక్ష్మి ఘల్లుఘల్లుమని తాండవనృత్యము సలుపునట్లు—దేవేంద్రుఁడు తనవీటికన్న నిది యందముగా నున్నదని వేయికన్నులఁ దెఱచి చూచి వెఱఁగుపడునట్లు—పుర మలంకరించెద. దేశమందున్న భూసురోత్తముల నందఱ రావించెద. సంతర్పణముల సమారాధనములఁ జేయించెద. భూరిదక్షిణలచే వారిని దనివి నొందించెద. బ్రాహ్మణాశీర్వాదములతోడను, బ్రజలయానందధ్వనులతోడను, మంగళతూర్యారావంబులతోడను, వారవిలాసినీ గానధ్వానములతోడను, భూనభోంతరములు నిండునట్లు—దశదిశలు మాఱుమ్రోయునట్లు—గగనము

చీటలువాఱునట్లు—మహేంద్రుఁడు నన్ను మించినభూమండలాఖండలుఁడు వీఁ డెవఁడురా నూతనముగా వచ్చెనని గుండెలు పీచుపీచుమన బెదరిబెదరి చూచునట్లు—మాపటునీపురము కలియుగవైకుంఠమని యానందించునట్లు—నీకీర్తి యాచంద్రతారార్కము భూమిపై నిలుచునట్లు—మహోత్సవముఁ జేయించెదఁ జూడు. అవియుత్సాహరసము వెల్లివిరియఁ బలికెను. చిత్రభానుఁడు రుద్రభట్టుం జూచి ముసిముసి నవ్వులు నవ్వి తలయూఁచెను.

అనంతరము వజ్రపాణి వచ్చుటయు నతనిని జయములవిషయమై ప్రశంసించి పట్టాభిషేకానంతరము నాపచ్చని పందిళ్లలోనే కర్పూరమంజరి నిచ్చి వివాహము జేయించునట్లు జెప్పి పంచెను. వజ్రపాణి యాసన్నవివాహమహోత్సవమున కుర్వీశ్వరుచుఁ బిచ్చిత యున తనయిల్లాలిని బిడ్డలను వివాహమున కడ్డురాకుండ నామెపుట్టినింటికిఁ బంపెను.

ముప్పదిరెండవ ప్రకరణము

పూర్వప్రకరణమున వర్ణింపఁబడిన ప్రసంగము జరిగినరెండవ నాఁడు చిత్రభానుఁడు రుద్రభట్టు కోటలో నొకగదిలోఁ గూర్చుండి రాజ్యవ్యవహారములఁగూర్చి ప్రసంగించుచుండఁ బదుగురు రాజభటులతోఁగూడి సుషేణుం డను చిన్నసేనాపతి దర్శనాపేక్షితుఁడై ద్వారపాలకులచేతఁ దనరాక తెలిపి [illegible]గించెను. రావచ్చునని ప్రభు వానతీయ నతఁడు లోనికరిగి జోహారుచేసి యిట్లువిన్నవించెను. "మహాప్రభూ! దేవరవారిపంపున నల్పసేనం దీసికొనిపోయి యొకయడవిలో మాళవ రాజకుమారుఁడగు మకరందుని బట్టికొంటిని. అతఁడు ప్రయాణ

ఖేదమునఁ గాఁబోలు చెట్టునీడను సొమ్మసిలి నిద్రపోవుచుండెను. నిద్రాపరవశుఁడై యుండఁగానె కాళ్ళకుఁ జేతులకు సంకెళ్ళు దగిలించి గుడ్డతో నొకడోలికగట్టి యందు వానింబడవైచి తోడ్తెచ్చితిని."

అదివిని చిత్రభానుఁడు మహాసంతోషముతో "ఏఁడీ! ఆకుట్టి వాఁ డేఁడీ?" యని ససంభ్రమముగాఁ బలికెను. "ఆపాపాత్ముఁడు పట్టువడినాఁడా?" యని రుద్రభట్టడిగెను. "స్వామీ! యతఁడు వీధిలో నున్నాఁడు సెలవైనయెడల నోడ్తెచ్చెద" నని సుషేణుఁ డుత్తరము జెప్పఁ దోడ్కొనిరమ్మని రాజు సెలవొసంగ నావల కరిగి డోలికనుండి మకరందుని ప్రభుసన్నిధికి నడిపించెను. సంకెళ్ళబరువున నతఁడు సరిగా నడువలేక తొట్రుపడుచు రాజసన్నిధిం జేరెను.

వెనుకటి కయ్యమునఁ గలిగిన గాయములవలన రక్తహీనుఁడై సొక్కినవాని, మార్గాయాసమునం బడలి వాడినపూవుదండయుం బోలె నవసియున్నవాని, శృంఖలాబద్ధములైన కాలుసేతులుగలవాని, నల్లకలువ రేకులకు వన్నెలు దిద్దు విశాలనేత్రములవాని, నవమదనునైన మెచ్చని సోయగమువాని, శరత్కాలచంద్రమండలమునకు సాటియగు నెమ్మొగమువాని, మాళవరాజకుమారుని గనుంగొని చిత్రభానుఁడు వాని చెలువంబునకు నచ్చెరువడి "ఆహా! ఏమి చక్కఁదనము! ఏమి యీముఖవిలాసము! ఏమి యీకన్నులతీరు! నాజన్మమధ్యమున నే నింతచక్కని రాకొమరునిం జూడలేదు. ఇందుచేతనే మాకర్పూరమంజరి మనస్సు వీనియందు లగ్నమై యున్నది. ప్రాయమునం దున్న జవ్వని యీభూలోకమన్మథునిఁ జూచినపట్టున వీని పొందునకై యాసింపకుండునా? ఇట్టి సుకుమారుని, నిట్టిజగన్మోహనాకారుని నే నెట్లు కారాగృహబద్ధుఁ జేయుదును? అయినం బగవాఁడు గదా?" యని తనలో వితర్కించి "సుషేణ! ఇతనిని గారాగృహమున బంధింపుము" అని యానతిచ్చెను. "పాముపిల్లను వెంటనే చం

పక విడుచుట ధర్మముగాదు. రాజా! మీఁద నీచిత్తము'' అని రుద్రభట్టు చెప్పెను.

''ఓహో! నీవు రుద్రభట్టువు కావా? మాతండ్రిని వంచించి తత్ఫలముగా దేశభ్రష్టుడవై యిందుఁ జేరి యీరాజునకు దుర్బుద్ధులు గఱపుచుంటివా? మరణమన్న నాకించుకయు భయము లేదు. పాపకర్ముఁడవైన నీకే మరణభయముగలదు. పుట్టినవాఁడు గిట్టక మానఁడు; గిట్టినవాఁడు పుట్టక మానఁడు.'' అని మకరందుఁడు రుద్రభట్టునకుత్తరము చెప్పెను. అంతలో సేవకులు వానిని మెల్లగా నావలకుఁ దీసికొనిపోయి కారాగృహమున బంధించిరి.

''మల్లికా! నీ వేమో చంద్రికతో రహస్యముగాఁ జెప్పుచుంటినది యేమే? మీప్రసంగములో మకరందుఁ డనుమాట నాచెవినిబడెను. యథార్థము జెప్పవే! అతఁ డేమైనాఁడే? ప్రాణములతోనున్నాఁడా? నామీఁద దయ యుంచి చెప్పవే?'' యని కర్పూరమంజరి యడుగ మల్లిక యెప్పటికయిన నది యామెకుఁ దెలియక మానదని మకరందుఁడు కారాబద్ధుడైనవార్త యామె కెఱిఁగించెను.

అదివిని కర్పూరమంజరి యింతింత యనరాని సంతాపగిలి మల్లికంజూచి యిట్లనియె. ''ఓసి! మెత్తనిచిగురుటాకుల మెచ్చనియీ యడుగులు సంకెళ్ళ నెట్లోర్చునే? ఆ బాహులతికలు శృంఖలాబద్ధములై యెంతనలిగెనో నిరంతర మంతఃపురవాసముఁ జేయు నాసుకుమారకారాగృహంబున నెట్లుండఁగలఁడె? కటికినేలం బవ్వళింపఁగలఁడె? తినుటకువీలులేని యామోటకూఁడు నాసుకుమారి తినఁగలఁడటె? అయ్యయ్యో! ఎంతకష్ట మెంతకష్టము. అదియటుండ నాతండ్రి వానిం బ్రతుకనిచ్చునటే? అతఁడొకవేళ బ్రతుకనిచ్చినను క్షుద్రమనస్కుఁడైన రుద్రభట్టు వానిని వధింపుమని నాతండ్రిం బురికొల్పి కృతకృత్యుఁడు గాకపోవునే? అయ్యయో! నేనున్నతావుననే వాని కవసాన

డశ సంప్రాప్తించుచున్నదా?" యని పరిపరిభంగుల విలపింపఁ జొచ్చెను. నాఁటంగోలె నామె వట్టినేలం బవ్వళింప నారంభించెను. ఆహారము వర్జింప సంకల్పించెను. చెలికత్తెలు బతిమలాడ నించుకించుక దిని యూరకుండును. చెఱసాలలో నతఁడెట్లు కష్టపడుచుండెనో యంతఃపురమం దుండియుఁ దాను నట్టికష్ట మనుభవింపవలెనని సంకల్పించెను. వివాహమైన తరువాత భార్యపతివ్రతయై భర్తృమార్గ మనుసరించుట లోకమం దున్నదిగాని పాణిగ్రహణము గాకమునుపే కామించినపతితోడిదే లోకమని యాతనికొఱకై కష్టములు పడుట యెందుఁ జూడలే దని చెలికత్తెలామెతో నని యప్పనినుండి మరల్పఁ బ్రయత్నించినను నామె మానదయ్యె.

అట మకరందుఁడు కారాగృహవాసి యయ్యుఁ దనహృదయమునఁ గర్పూరమంజరిని నిలుపుకొని యన్నపానాదులఁ దెచ్చినపరిచారకులను గావలివాండ్రను, గర్పూరమంజరీకుశలవార్తల నడుగుచు నామెంగూర్చియే స్వప్నములఁ గాంచుచు నామెతో మనస్సుమాగ మసుఖము బడయుచు నామెం గలసికొనుటకు నుపాయ మేదియైన లభించునాయని నిరంతరముఁ జింతించుచుఁ గాలము పుచ్చుచుండెను.

మకరందునిఁ జూచినది మొదలుకొని సువర్ణునిమీఁదఁ గల దీర్ఘక్రోధముచేత రుద్రభట్టు మకరందుని జంపింపవలయునని దృఢసంకల్పము గలిగియుండెను. వాని చక్కఁదనముఁ జూచియు, వానిపైఁ దనకూఁతున కనురాగ ముండుటచే వానిని వధించిన దనకూఁతు రేమగునోయని సందేహము గల్గియు రుద్రభట్టు ప్రేరణచేసినను జిత్రభానుఁడు మాళవరాజనందనుని జంపింపక యూరకుండెను. అందుచే రుద్రభట్టుకు మనస్స్విమితము లేకపోయెను. త్వరితముగా వానినెట్లు తుదముట్టింపవచ్చునని యుపాయములు వెదకుచు నొకనాఁడు వజ్ర

పాణింబిలిచి యిట్లనియె—"వజ్రపాణీ! నీకొక్కహితోపదేశముఁ జేసెద. అది నీమనస్సులోనే యుంచుకొమ్ము! చిత్రభానునకైన నిది తెలియనియ్యవద్దు. ఈయుపదేశము నాకడుపులో జన్మించి నీకడుపులో నస్తమింపవలయు. కర్పూరమంజరిని జిత్రభానుఁడు నీకిచ్చి వివాహము సేయఁదలఁచినమాట నిజము. కాని, కర్పూరమంజరి యీమకరందుని వలచినది. నీయం దామెకు లేశమయిన ననురాగములేదు. అనురాగము లేకపోవుటయేగాదు. నీ పేరువిన్న నామెకుఁ దలయేఱు. దానికిఁ దోడుగా వీఁడిక్కడికి వచ్చుట యనర్థకము. వానిని వెంటనే సంహరింపవలసినదని చిత్రభానునితో నేను రెండు మూఁడుసారులు చెప్పితిని. ఎందుచేతనో యతఁడు సంహరింపక యూరకున్నవాఁడు. కావున నక్కుమారుని దెగటార్చుమని నీవును బట్టుపట్టి చిత్రభాను నొడంబఱుపుము. వానిరక్తము కన్నులఁ జూచినఁగాని నిద్రపోకుము. వానిమీఁద నాకేమియుఁ గోపములేదు. కాని, నీవివాహము నిమిత్తమె నే నీయలమటఁ బొందుచుంటిని. నీవు కర్పూరమంజరి కేలువట్టిననాఁడు నాకన్నులు చల్లఁబడును. చిత్రభానుని పట్టాభిషేకముఁ జూచి, నీపాణిగ్రహణమహోత్సవముఁ జూచి, యనంతరము నేను తపంబుచేసికొన హిమాలయమున కరిగెద. ఈరెండే నాసంకల్పములు. అందు మొదటిది జరిగినట్లె. రెండవదియు జరిగినట్లే గాని వీనిం దెగటార్చిన నిస్సందేహముగా నది జరుగును. కావున నప్పని యతివేగంబున జరుగునట్లు ప్రయత్నింపుము."

ఆపలుకులు చెవిని బడినతోడనే వజ్రపాణివజ్రహృదయము నీరయిపోయెను. పోవుటయు నతఁడు కఠిన స్వరముతో రుద్రభట్టున కిట్లనియె. "అయ్యా! కర్పూరమంజరి నన్నే వలచినదని నానిమిత్తమే పరితపించుచున్నదని నానామమే స్మరియింపుచున్నదని ప్రధానమైన నాఁడు నీవేగదా చెప్పితివి. ఆనాటితోనే యామెకు నాయందు దన్ను రక్తి లేదని నాపేరువిన్నఁ దలయేఱని యెట్లు చెప్పుచుంటివి! ఈరెండు

మాటలలో నేది నిజము?" అని యడిగెను. అడుగుటయు రుద్రభట్టు తనమాటలకుఁ గలపరస్పర వైరుధ్యము మనంబునకుఁదట్టి, నయ్యిక్కట్టు నుండి తప్పించుకొనుటకు వెంటనే యుపాయ మన్వేషించి యిట్లనియె. "ప్రధానమయినదినములలో నాబాలిక యట్లె నిన్ను వలచియుండెను. ఈనడుమ మకరందునిఁ జూచెనఁట! చూచినదాదిగా వానికై పరితపించు చున్నదఁట! పడుచుకన్నెలకు బాగోగులుగలవా? ఎదుటనున్న వాఁడె పెండ్లికొడుకు. అంతేగాని నామాటలలో వైరుధ్యము లేదు. లేదు కావుననే నీమేలుకోరి వెంటనే చెప్పితిని, నాఁడట్లు నీతోఁ జెప్పితి నన్నమాట నాకు జ్ఞాపకములేదా? కావున నీవు నామీఁద ననుమానపడక నీకార్యసిద్ధికై పాటుపడుము."

ఆమాటలు వజ్రపాణికి నచ్చెను. మఱునాఁ డావిషయమై చిత్రభానునితో నొక్కి చెప్పవలెనని యతఁడు సంకల్పించుకొని యింటికిఁ జనెను. అతఁడు పోవునప్పటికి వాని యత్తవారియూరినుండి వచ్చిన యొక సేవకుఁడు నమస్కరించి యొకజాబు చేతికిచ్చెను. ఆజాబుతీసికొని యామూలాగ్రముగఁ జదువుకొని "హా! దైవమా" యని నేలఁ గూర్చుండెను. సేవకులు "స్వామీ! ఏమియాపద వాటిల్లె" ననియడుగ నతఁ డుత్తరము చెప్పక జాబు చేతికిచ్చెను. వారు జాబు చదువుకొని "అయ్యో! సునందా దేవి యున్మాదవశమున నూతిలోఁబడి మరణించె నఁట! తల్లిలేని యాపిల్లలదుఃఖము వర్ణనాతీతమైనదఁట. హా యెంత కష్టము. ఇల్లు కాలిపోయినది. ఇల్లాలు కూలిపోయినది. గోరుచుట్టుపై రోఁకటిపోటన్న మాట నిజమైనది" యని విచారింపఁదొడఁగిరి. అప్పుడు వజ్రపాణికి దుఃఖముతో గాఢపశ్చాత్తాపము గలిగెను. తన నాదరణమువల్లనే, తనయప్రియసంభాషణములవల్లనే, తనయజాగ్రత్తవల్లనే, యామెకు మనశ్చాంచల్యము గలిగినదనియు నెట్లయిన

నామెమరణమునకుఁ దానే కారణమనియు భావించి వాపోవఁజొచ్చెను. ఆవార్త తెలిసినతోడనే మంత్రులు బంధువులు వచ్చి సమయోచితసంభాషణంబుల నూఱడించిరి. వజ్రపాణి మఱునాఁ డుదయమున నవ్వార్తఁ జిత్రభానునకుఁ దెలిపి పయనమై యత్తవారియూరు జేరి మాతృహీనులయినబిడ్డల నోదార్చి యుత్తరక్రియలు సమాప్తమగు వఱకు నక్కడనే యుండెను.

ఇల్లాలిమరణవార్త వినినతోడనే యతఁడు విషాదపరీతమనస్కుఁడైనను దినములు గడచినకొలఁది దృఢచిత్తుఁడై కర్పూరమంజరీపాణిగ్రహణమునకు మొదటియాటంకము భార్యమరణముతోఁ దీరినదనియు, మకరందునివధతో రెండవది గతించిపోవు ననియు, దైవము తన కనుకూలుఁడై యపకారరూపకమైనయుపకారము చేసె ననియు భావించి యొకవిధముగా సంతసింపఁజొచ్చెను.

ముప్పదిమూఁడవ ప్రకరణము

జనకునిక్రూరస్వభావమును, రుద్రభట్టుయొక్కదుష్టవృత్తియు లెస్సగా నెఱిఁగినదగుటచేఁ గర్పూరమంజరి మకరందునకు వారిరువురి వలన నేదేనపాయము వాటిల్లవచ్చు నని శంకింపఁ జొచ్చెను. ఆతనికి బంధమోక్షణము చేయవలెనని మల్లికతోఁ బలుమాఱు జెప్పుచుండెను. ఎన్నివిధంబులఁ జూచినను శక్యము గాకపోయెను. అందువలనఁ గర్పూరమంజరిమనస్సు తామరాకులోనినీటివలె స్థిమితము లేకయుండెను. మల్లిక కర్పూరమంజరికి మనస్సంతోషమునుగూర్ప మకరందుని జెఱనుండి విడిపించుటకై యెన్నో పన్నుగడలు పన్నుచుండెను. అట్టిసమయమునఁ జిత్రభానుఁడు మృగయాక్రీడనిమిత్తము

రాజధానివిడిచి సపరివారముగా నరణ్యములకరిగెను. విజయసేనుఁడు రుద్రభట్టు రాజ్యవ్యాపారములఁ జూచుటకై నగరమం దుండిరి. అత్తఱిఁ గర్పూరమంజరి మల్లికంబిలిచి "ఓసీ! మాయయ్య వేఁట కరిగెను. నిన్నసాయంకాల మాయన యభ్యంజనస్నానముచేసి వ్రేలి యుంగరముఁ దీసి యొకపీటపైఁబెట్టెను. నేఁటిప్రాతఃకాలమున వేఁట కరుగునప్పుడు దానిని దీసికొనుట మఱచిపోయెను. అది నాకు దొరికి నది. ఆయంగుళీయకము నీకిచ్చెద. మాళవరాజనందనునిబంధమోక్ష ణమున కది యుపయోగపడునేమో విచారింపుము. ఇట్టివిషయము లలో నీవు మిక్కిలి నిపుణురాలవు. కావున లెస్సగా నాలోచించి మాళవరాజకుటుంబము నుద్ధరింపుము. మాతండ్రి రాకమునుపే యీ పని జరుగవలయు. అతఁడు వచ్చెనా యిఁక నాసయుండదని నాయభి ప్రాయము. మకరందుఁడు తనకూఁతుఁ గత్తి గట్టి కయ్యమునకు వచ్చెననియాయనమీఁద మాయయ్యకుఁ గ్రోధము. శత్రువైనసుదర్శ నునిసూనుఁ డగుటచే రుద్రభట్టునకు ద్వేషము. వజ్రపాణికి నాకతి మున వానిపై మత్సరము. కావున నీనగర మతని నగ్నిహోత్రపుం బుంత. ఎంతవేగముగా విమోచనమైన నంతక్షేమము. పాణిగ్రహణ మైననుసరే, కాకపోయిననుసరే! ఆమన్మథమన్మథుఁడు బ్రతికినం జాలును. ఇందు నీవు కృతకృత్య వగుదువేని నాకు మహోపకారము జేసినదాన వగుదువు." అని బహువిధముల బ్రతిమాలి చెప్పెను.

"అమ్మా! ఉంగర మిటుదెమ్ము. దీనివలనఁ గార్యసాధన మయ్యెనా మంచిదె. కానియెడల నీయుంగరము నీకుఁ దెచ్చియిచ్చెద ఎట్లయిన నాతని బంధవిముక్తుని జేయవలయు ననియేనాసంకల్పము. ఆసుకుమారుని గారాగృహమున నుంచుట దిరిశెనపువ్వు నెండలో వైచుటయని నేనెంతో విచారించుచున్నదానను. నాకే యింతమనో వ్యథయుండఁగా నీమన స్సెంత మఱుఁగుచున్నదో చెప్పవలయునా"

యని యంగుళీయకముఁ దీసికొని యారేయి చాలసేపు నిద్రవోవక దానినుపయోగించువిధము నాలోచింపఁదొడఁగెను. ఎట్టకేల కామె కొకయుపాయము పొడకట్టెను. మఱునాఁడుదయమునఁ గర్పూర మంజరినిజూచి మీతండ్రి వ్రాసినలేఖ యేదయిన నీయొద్దఁ గలదా? యని యడిగెను.

"మున్ను విదర్భలో నున్నప్పుడు మాయయ్య వ్రాసినజాబొకటి నాకడఁ గలదు. అది యెందుకు? కావలసిన నిచ్చెద" నని యామె బదులు చెప్పెను. "ఎందుకని నీవడుగకు. పనిమైనపిదప దానిప్రయో జనముఁ జెప్పెద. ముందాలేఖ నిటు దెమ్ము" అని యామెకడనుండి జాబుం గైకొని రహస్యముగా నొకగదిలోఁ గూర్చుండి యేదో వ్రాసి యేదో పన్నుగడ బన్ని కర్పూరమంజరికడ సెలవుగైకొని యెందే నరిగెను.

సాయంకాల మయ్యెను. ప్రభాకరుఁడ స్తమించెను. జగమునం దెల్లెడనిండియున్న యజ్ఞానమువలెనే కారుచీఁకటులునలుదెసల వ్యాపించెను. చరమాద్రిఁ గ్రుంగినభానుఁడు ధరించినయనంతకోట్యవతారములో యనునట్లు దీపములు ప్రతిగృహంబున నలంకరించెను. సుషేణుఁడు తనగృహంబున బిడ్డలముద్దులాడుచు నుండెను. అప్పు డొక సేవకుఁడు వానిదర్శనముజేసి నమస్కరించి యెట్టయెదుట నిలచెను. "నీ వెవ్వఁడవు? ఏమిపనిమీఁద వచ్చితివి?" అని యాతఁ డడుగ నా సేవకుఁ డిట్లనియె. "మహాప్రభూ! చిత్రభానుమహారాజుగారి సన్నిధి నుండి వచ్చితిని. ఆయన యీజాబు మీకిమ్మని నాచేతికిచ్చె." నని యొకలేఖ చేతికిచ్చెను. సుషేణుఁడు దీపపువెలుఁగునఁ దానినిట్లు జదువుకొనెను.—

"చిరంజీవి యైన సేనాపతిసుషేణునకుఁ గాశ్మీరమహీపాలుఁడు చిత్రభానుఁడు వ్రాసినశాసనము. మకరందునితండ్రియగుసుదర్శనుని

కను, మాకును సంధిజరిగినందునను, సుశర్మనుఁడు మాకు విధేయుఁడై సామంతరాజై ప్రతియేటఁ గప్పముగట్ట నొప్పుకొనినందునను మకరందుని బంధమునుండి మేము విడిపింప నిశ్చయించినారము. కావున నీవీజాబుజూచినయాక్షణమే యా రాకుమారుని చెఱనుండి విడిపింప వలసినది. ఇతఁడు మాళవరాజసచివుఁడు. వీని పేరు వినయంధరుఁడు. మాకును మాళవరాజునకును వీని ద్వారముననే యుత్తరప్రత్యుత్తరములు జరుగుచున్నవి. నీకు నమ్మికగలుగుటకై నానామాక్షరములు గలయుంగుళీయకము వీనిచేతికిచ్చి పంపుచున్నాఁడను. ఇది యానవాలుగా గ్రహించి నీవు వెంటనే వాని విడిచిపుచ్చునది.

ఇట్లు,

కాశ్మీరనాయకుఁడు, చిత్రభానుఁడు"

లేఖఁ జదువుకొని సుషేణుఁడు ప్రభువుగారియుంగర మేదియని యడిగెను. తోడనే వినయంధరుఁడు దాని నతని కిచ్చెను. అది పుచ్చుకొని యా సేనాపతి దీపపువెలుఁగున దానిని బలుమాఱుశోధించి యది తనప్రభువుదే యని తెలిసికొని తత్క్షణమే వినయంధరుని వెంటఁబెట్టుకొని కారాగృహమున కరిగి తలుపుదెఱపించి మకరందుం జూచి "నిన్ను విడుపుసుమ మహారాజుగారియాజ్ఞయైనది. నీయిచ్చ వచ్చినచోటికిఁబొమ్ము!" అని చెప్పెను. మకరందుఁడు మిక్కిలి యాశ్చర్యపడి పెద్దపులినోటఁ దలయిడి చావకుండఁ బైకివచ్చినవాని నట్లు తన్నుభావించుకొని చిత్రభానుఁడు తన్ను విడిపించుట కేమి కారణముండుననుచు వితర్కించుచుఁ గారాగృహమునుండి వెలువడి వీధిలోనికి వచ్చెను. అత్తఱి వినయంధరుఁడు వానిం గలిసికొని "దేవా! నేను మీ కాపుఁడను. మీరు నన్నిప్పుడు గుర్తింపలేరు. మీరిప్పుడు బంధవిముక్తు లయినను మీ కపాయము తప్పలేదు. ఇచ్చోటు విడిచి యీక్షణమే మీరు వెడలిపోవలయు. నగరమువెలు

పల మీ నిమిత్తమై నేను కల్యాణలక్షణసంపన్నమై యతివేగవంత మైన యాజానేయతురంగమును సిద్ధముచేసి యుంచితిని. అచ్చోటనే మీ కాహారముగూడ నేర్పఱచితిని. నా వెంటవచ్చి యాహారము భుజించి యాయశ్వమెక్కి పయనముజేసి తెల్లవాఱకమున్నె జాల దవ్వరుగవలయు, ఎందుకని ప్రశ్నింపక నాచెప్పినచొప్పున మీరు చేయుఁడు. కర్పూరమంజరీపాణిగ్రహణ మయినతరువాత నేనిట్లు చేయుటకుఁ గారణము లామెవలననే తెలియఁగలవు.'' అని విన్నవించెను. అప్పలుకులు విని వెండియు నెట్టిప్రశ్నముల నడుగక మకరందుఁడు వినయంధరుని వెంట నరిగి యాహారముభుజించి యాహయము నెక్కి యథేచ్ఛంజనియెను. వినయంధరుఁడు వానిని సాగనంపి నగరంబుఁ బ్రవేశించెను.

మఱునాఁ డుదయమున మల్లిక కర్పూరమంజరిం గలసికొని మకరందుఁడు బంధముక్తుఁడై కడచినరేయి సురక్షితముగా నావలకుఁబోయె నని విన్నవించెను. కర్ణామృతము లయినయప్పలుకులు విని కర్పూరమంజరి సంతోషమున వికసితముఖయై ''సఖీ! నన్నుఁ గౌఁగిలించుకొనుము. నీవు మాకు వేంద్రముపకుఁ బుత్రభిక్షము బెట్టితివే. సఖివన్న నీవే సఖివి. ఆఁడుదానవన్న నీవే యాఁడుదానవు. వేయి జన్మములకైన నీఋణముఁ దీర్చికొనఁగలనఁటే?'' యని కృతజ్ఞతం దెలిపిబహూకరించెను. అప్పుడు వారిక్రిందివిధముగా మాటలాడిరి.

మల్లిక—అమ్మా! నేను చేసినదేమున్నది? దైవ మనుకూల మైనపక్షమున నెట్టికార్యమైనఁ జుల్కనగా సాధింపవచ్చును. అప్పుడు గుండులు నీటిలోఁ దేలును. ప్రతికూలమైన బెండులు మునుంగును. మనయత్నము నిమిత్తమాత్రము; కార్యసిద్ధి యీశ్వరాయత్తము. ఇంతకు నీవు సంకల్ప సిద్ధురాలవు.

కర్పూ—ఓసీ! అతఁ డెట్లు విముక్తుఁడయ్యెనో చెప్పవే!

మల్లిక—చెప్పెదను లేతొందరేమి! ఆత్రముకొంత సేపు నడంచుకొనుము.

కర్పూర—పోనీ, యుంగర మెక్కడనున్నదో చెప్పుము!

మల్లిక—ఉంగరము సుషేణునియొద్దనున్నది.

కర్పూర—అతనియొద్ద కెట్లుపోయినది?

మల్లిక—వినయంధరుఁ డాతని కిచ్చెను.

కర్పూర—వినయంధరుఁ డెవ్వఁడు?

మల్లిక—నీకు నమ్మినబంటు.

కర్పూ—ఏమిది! నా నమ్మినబంటా? నాకడ నెవ్వఁడైన మగవాఁడు పనిచేయుచున్నాఁడఁటె? మనకంచుకిజనములోనైన నట్టివాఁడున్నాఁడా?

మల్లిక—ఉండనీ, లేకపోనీ. అతఁడు నీ బంటు.

కర్పూర—(కోపముతో) ఓసీ! మల్లిక, మద్యపానము జేసితివా? లేక నిన్నే దేనిఁ బిశాచ మావహించినదా?

మల్లిక—మహారాజులకు, మహారాజపుత్రికలకు, మద్యము సులభముగా లభించునుగాని పేదదానికి నాకెట్లు దొరకును? నేనే పిశాచమునై యెల్లవారి నన్నమునకు, వస్త్రమునకుఁ బీకకొని తినుచుండ నన్ను వేఱొకపిశాచ మావహించునా?

కర్పూ—ఈయసందర్భప్రలాపములఁ జూడ మకరందుఁడు సురక్షితముగా నటనుండి దాఁటెనో లేదో యనిసందియము గలుగుచున్నది.

మల్లిక—నేను మల్లిక నగుదునో కానో యనువిషయమును గూర్చి సందేహపడుచున్నావా?

కర్పూ—నీవు మల్లికవే! సందియము లేదు.

మల్లిక—అట్లయిన మకరందుఁడు దాఁటిపోవుటలో సందియము లేదు.

కర్పూ—ఓసీ! నీవక్రోక్తులు తుణముగట్టిపెట్టి వినయంధరుఁ డెవ్వఁడో సరిగఁజెప్పవే?

మల్లిక—అమ్మా! నాఁటిజయంధరుఁడే, నేఁటి వినయంధరుఁడు.

కర్పూ—జయంధరుఁ డెవ్వఁడే నాకు జ్ఞాపకము లేదు.

మల్లిక—కర్పూరమంజరిపక్షమున నుజ్జయిని కరిగి యామె వలపు మకరందుని కెఱిఁగించినవాఁడె జయంధరుఁడు.

కర్పూ—(సంతోషముతో) ఓసీ! నీయిల్లు బంగారుగాను, నీవుమగవేషము దాల్చి వినయంధరుఁ డని పేరు పెట్టుకొని సుషేణుని వంచించితివా యేమి?

మల్లిక—అమ్మా! నాచేతఁ బగటివేషములు రాత్రివేషములు వేయించి మీ రంతఃపురమునఁ గూర్చుండి మీతలపెట్టిన కార్యములందు సిద్ధిఁగాంచుచుందురు.

కర్పూ—ఓసీ! నీప్రజ్ఞ శ్లాఘాపాత్రమే! నీ వేమహారాజునొద్దనైన మంత్రిత్వముఁ జేయఁదగుదువె.

మల్లిక—నీవు మకరందునిఁజేపట్టి మాళవంబునకు మహారాజ్ఞివైనప్పుడు నీకడ మంత్రిత్వము జేసెదనులే. అప్పుడుమాత్రమునన్ను మఱచిపోకుము.

కర్పూ—సఖీ! నాశరీరమును నేను మఱతునేని నాప్రాణమును నేను మఱతునేని నిన్ను మఱతును. కాని వక్రసంభాషణము లేకుండ జరిగినవృత్తాంత మంతయుఁ జెప్పుము?

మల్లిక—అమ్మా! చెప్పుట కేమున్నది? పరిచారికనైనను జదువుట, వ్రాయుట లెస్సగా నేర్చినదాన నగుటచే మకరందుని వెంటనే విడిపింపుమని మీయయ్యవ్రాసిన ట్లొకజాబువ్రాసితిని.

అక్షరములు మీ యయ్య వ్రాసిన యక్షరములవలె నున్నవి.

కర్ణ్యా—గదిలోఁ గూర్చుండి చేసినపని యిదియా!

మల్లిక—మతేమి చేసితి ననుకొంటివి? తలుపులు మూసికొని తపము జేసికొంటి ననుకొంటివా? ఆ జాబునకుఁ దోడుగా నుంగరమూనవాలు జూపితిని. దానితో నంతపని జరిగినది.

అని తన కావించినకృషి యంతయు మల్లిక సవిస్తరముగాఁ జెప్పి యామె నానందసముద్రమున ముంచెను.

—•—

ముప్పదినాలుగవ ప్రకరణము.

అట్లరణ్యమునఁ బ్రియమిత్రునింగానక భద్రసేనుఁడు పొదలు గుహలు చెఱువులు వాగులు మొదలగు సమస్తప్రదేశములు వెదకి వెదకి వేసారి మకరందునిజాడనుగూర్చి యిదమిత్థమని నిర్ణయింపఁ జాలక, స్వదేశమునకరుగుట కంతకుముందే యిష్టములేక పాంచాలదేశమునకుం బోయి యటనుండి మిత్రునిజాడ లరయవచ్చునని రాజధానియైన కన్యాకుబ్జమునకు జనెను. చని తన రాక మంత్రుల కెఱిఁగించుటయు, వారు మాళవరాజసచివుఁడైన రత్నసేనునికొడుకగుటచే వానిఁ గడుంగడు గారవించిరి. పూర్వపరిచితుఁడగు మాధవసేనుఁడు వానిరాకకు మిక్కిలి సంతసించి మకరందునిజాడ లడిగి తెలియఁ జాలక యెంతేని వగచెను.

మకరందుఁడు నాఁటిరేయియెల్ల నయ్యుత్తమ తురంగంబు నెక్కి తెల్లవాఱునప్పటికిఁ జాలదవ్వరిగి యచ్చటఁ బ్రాతఃకాలకృత్యముల నిర్వర్తించుకొని గుఱ్ఱమునకు మేఁతవైచి దానికి విశ్రాంతి నొసంగి దానునొక్కచోట విశ్రమించి మధ్యాహ్నము మజిలి బయనమై

సాయంకాలమగునప్పటికిఁ గాశ్మీర దేశపుం బొలిమేరఁ దాఁటి పాంచాల దేశముం జొచ్చెను. ఒక గ్రామమునం దారాత్రి విశ్రమించి యపాయము గతించినందున స్తిమితమనస్కుఁడై యతఁడు మెల్ల మెల్లగా బయనముజేసి తాను బిక్కిలి డస్సిపోకుండఁ బ్రాణాపాయము దాఁటించిన గుఱ్ఱము చెడిపోకుండఁ బయనంబులు సేసి కతిపయదినంబులకు రాజధానియగు కన్యాకుబ్జముఁ జేరెను. చేరి రాచనగరు ముందట గుఱ్ఱమునిలిపి తననామధేయాదులు ప్రతిహారివలన మహేంద్రదేవునకు విన్నవింప నారాజన్యుఁడు మకరందునిఁ దనమందిరమునకు రావించి సన్మానించి యాతనివలన రణమండలి పరాజయమును, దాని వెనుక జరిగిన కారాగృహనివాసాదులును విని విస్మయమును జాలియు నొంది యచ్చటఁ గొన్ని దినంబులుండుమని వేఁడెను, అట్లుగాక యని బహువిధముల వారిచే సత్కృతుఁడై యచ్చటనుండి తనమిత్రుఁడగు భద్రసేను నచ్చటం గలసికొని కౌఁగలించుకొని యాకస్మికముగాఁ దా నగపడకపోవుటకుఁ జిత్రభానుప్రేరితులైన సైనికులు తన్నుఁ బట్టుకొనుటయే కారణమని చెప్పి తన చరిత్ర కథనముచేత వానిం దుఃఖపరవశుం జేసెను.

అంతరంగము గలసినమిత్రులు కలసినప్పుడుగల్గునానందమును భవైకవేద్యమేగాని వర్ణింప నలవిగాదు. అయ్యిరువురుఁ దమక్షేమ వార్తలు దమజాడలు దెలియక దురపిల్లుచుండు తల్లిదండ్రులకుఁ దెలియఁజేయింపఁదగునని మహేంద్రదేవునితోఁ జెప్ప నాతఁడు విశ్వాసముగలబంట్ల నప్పనికై మాళవంబునకుఁ బంపెను. పిమ్మటఁ గొన్ని దినములచ్చటనుండి కాశ్మీరరాజ్యముపై మరల దండువెడలవలయునని మహేంద్రదేవునితోఁ జెప్పి మాధవసేనునితోడను, దక్షిణ పాంచాల మంత్రులతోడను, మంతనంబుండి యాసారి వేఱువేఱుగాఁగాక మాళవ పాంచాలసైన్యము లేకమై పోరాటము సలిపినఁ దప్పక జయంబు

సేకూరుసని యట్లు చేయునట్లు వారి నొడంబఱిచిరి. అవ్వల మకరందభద్రసేనులు పయనమై తమ దేశంబునకుం జనిరి. వారరుగునప్పటికి సుదర్శనుఁడు రత్నసేనుఁడు ఘూర్జరంబుననుండిరి. అందుచేవారు రాజధానికిం జనక ఘూర్జరవిషయంబునకుం జని మహారాజాధిరాజై శ్రీమంతుఁడై పండితులకుఁ గవులకుఁ బేదలకు సాధులకు నాశ్రితులకు నాశ్రయుఁడై సుగుణరాశియై, భూలోకమందారమైయున్న సుదర్శనమహీపాలుఁడు కాలవక్రగతిచేత రాజ్యభ్రష్టుఁడై కుంజరంబు దోమకుత్తుకంజొచ్చిన తెఱంగునఁ దనకన్న నన్నివిధంబులఁ దక్కువవాఁడగు ఘూర్జరేంద్రునియింట నతిథియై వానిపంచ నుండవలసి వచ్చినందుకుఁ దద్దయు విచారించి ముందుగా నమ్మహీపాలునిం గనుంగొనిరి. సుదర్శనుఁడు తనబిడ్డను, మంత్రిబిడ్డనుగూడ గాఁగిలించికొని "నాకు నేఁడు వేయిరాజ్యములు చేకురినట్లు సంతసించుచున్నాఁడను. ఇఁక రాజ్యసంపాదనము సులభము. మీరాగమనమే శుభాగమనము. ఈదినము సుదినము. దుర్దినములు నేఁటితో గతించినవి. నాకుఁ జిరమిత్రుఁడును, సధర్ముఁడును నైన ఘూర్జరనాయకుఁడు సేన నాయత్తము చేసియున్నాఁడు. ఇంక మన పూఁసేనం గైకొని మనరాజ్యంబు మనముసంపాదింపవలయు" నని చెప్పి మితిమీఱిన యానంద మొందెను. రత్నసేనుఁడు కుమారాగమనముచే నానందపరవశుఁ డయ్యెను. చంద్రప్రభాదేవి మరల వచ్చి తనకంటఁబడి యడుగులకు మ్రొక్కిన కొడుకును లేవనెత్తి హర్షబాష్పములచే నాతని మూర్ధము నభిషేకించెను.

సైన్యము దండయాత్రకుఁ దగియుండుటచే మకరందుఁడు సేనాపతియై ఘూర్జరసైన్యమును మాళవదేశంబునకుఁ దీసికొనిపోయెను. రాజ్య మాక్రమించుకొనియుండిన వైదర్భులకును, మకరందుని నాయకత్వమునను ఘూర్జరులకును, సందడికయ్యము జరి

గెను. మాళవేంద్రకుమారుని ప్రతాపాగ్నికి వైదర్భులు శలభము లైరి. రాజవాహనునిసేన సంపూర్ణముగాఁ బరాజయమొందెను. హతశేషులు నానాముఖములఁ బరుగులెత్తిరి. మకరందుఁడు సుదర్శనుని మరల మాళవరాజ్యసింహాసనము నందుఁ బ్రతిష్ఠించెను. రత్నసేనుఁడు యథాపూర్వకముగ నమాత్యుఁడయ్యెను. కేసరి రెండవ సారియుఁ ద్రోహియై వైదర్భులతోఁగూడి వారివలన లంచములు గ్రహించి దేశాపకారి యగుటచే వానింబట్టి సుదర్శనుఁడు కారాగృహంబున నుంచెను. దేశముసం బ్రశాంతము నెలకొన్నపిదప మకరందుఁడు కాశ్మీరదేశ దండయాత్రకై సైన్యసన్నాహము జేయఁ బూనెను.

అటఁ జిత్రభానుఁడు వేఁటనుండి రాజధానికి మరలివచ్చిన పిదప సుషేణుఁడు వానిని దర్శించి "దేవరవారియాజ్ఞ ప్రకారము మకరందుని విడిచిపుచ్చితి" నని మనవిచేసెను. అదివిని చిత్రభానుఁ డదరిపడి "ఏమిరా! నాయాజ్ఞాప్రకారము మకరందుని విడిచితివా? మూర్ఖుఁడా! అసత్యము లాడి నన్ను వంచించెదవా?" యని బిట్టులుకతోఁ బలికెను. "దేవా! శాంతింపుఁడు ఇదిగో! మీముద్ర. ఇదే మీ రానవాలుగాఁ బంపిన యుంగరము" అని సుషేణుఁడు రెంటెసింజూపెను. "ఎవఁ డీయుంగరమును దెచ్చినవాఁడు?" అని మరలరాజడిగెను. "ఎవఁడో వినయంధరుఁడఁట! మాళవసచివుఁడఁట! మీరు పంప వచ్చినాఁడట" యని సుషేణుఁడు బదులు చెప్పెను. అదివిని చిత్రభానుఁడు క్రాఁచుబామువలె నెగిరిపడి "దురాత్ముఁ డెవఁడోఁ మోసము జేసెను. నాయుంగరము! నావ్రేలినుండి జాఱిపోయియుండవచ్చును. అది తీసికొని నాసేవకులు నన్ను వంచించియుందురు. అంతఃపురమందు నగరమందుఁగూడ సందిరో ద్రోహులున్నారు. ఆద్రోహులలో నీవొకఁడవై యుండవచ్చును.

అయ్యయో! పరమశత్రువు దాటిపోయెనే! వాఁడు మన కడనుండిన సుదర్శనుఁడు కాళ్ళబేరమునకు వచ్చునే? ఛీ! దురాత్మా! నీమొగము జూడఁగూడదు. ఇదియంతయు నీవలననే జరిగినది. అతని స్థానమున నిన్నే కారాగృహమునం దుంచెద.'' నని రాజభటులం బిలిచి చెఱలో సుషేణుని బంధింపుమని యానతిచ్చెను. నిర్దోషియైన సుషేణుఁడు నిష్కారణముగా బంధింపఁ బడినందుకుఁ గర్పూరమంజరి మనస్సున మిక్కిలి విచారించెను. చిత్రభానునకునంతఃపుర సేవకులపై నెంతోయనుమానము గలిగెనుగాని కర్పూరమంజరిపైఁ గలుగలేదు. నిజస్థితి దెలియక పోవుటచే నతఁ డెవ్వరిని దండింపఁ జాలకపోయెను. గంజాయిమత్తుచేత జంబుకుఁడు చిత్రభానుని ప్రశ్నలకు నసందర్భము లైన యుత్తరములు చెప్పుటచే బెత్తముతో నాలుగుదెబ్బలు తినెను.

అట గాంధారవల్లభుఁడైన భాగ్యవర్ధనుఁడువిక్రమసేనునిగద్దెఁ నెక్కించుటకు నిశ్చయించి కాశ్మీరముపై దాడివెడలుటకు మహాస న్నాహముసేయఁబూని తనకడనున్న శక్తివర్మ్నఁ జూచి యిట్లనియె. ''ఓయీ! నీవు మాపక్షమునఁ బాంచాలవల్లభుఁడైన మహేంద్రదే వునికడకు సందేశముఁ గొనిపోవలయు. మహేంద్రదేవుఁడును సమర సన్నాహముచేయుచున్నాఁడని చారులవలన వినియుంటిని. అతఁ డొకసారి మే మొకసారి వేర్వేఱుఁగాఁ జిత్రభానునిం దాఁకిన జయ ము చేకురకపోవచ్చును. ఉభయసైన్యంబులు గలసియేకముఖముగాఁ బోరిన జయ మనలీలగాఁ జేకురును. కావున శరత్కాలమునఁ గార్తికమాసమున శుద్ధపూర్ణిమనాటికిఁ దనసైన్యమును దోడ్కొని కాశ్మీరముఁ బ్రవేశింపు''మని యామహారాజుతోఁ జెప్పుము. ఆనాఁ టికి మనమును గజరథతురంగాది చతురంగబలంబులతో నాదేశము బ్రవేశింతము. నాముద్రగల జాబులుగూడ నిచ్చుచున్నాను. ఇది యాషాఢమాసముగదా! వర్షకాల మాసన్నమగుచున్నది. అనియుద్ధ

మునకు వీలైన సమయముగాదు. నీవు స్వల్పపరివార సమేతుఁడవై వెంటనేపొమ్ము." అని యానతిచ్చుటయు శక్తివర్మ మహాప్రసాదమని జాబులనందుకొని మితపరివారముతోఁ బాంచాలమునకరిగి రాజధానిం బ్రవేశించి మహేంద్రదేవుని సందర్శించి సందేశార్థ మెఱిఁగించెను. అతఁడు సందేశార్థములకు సమ్మతము దెలిపి తనమనుమలు భాగ్యవర్ధనుని చెంత నున్నకుశలవార్త విని మిక్కిలిసంతసించి దాహిత్రులప్రాణములు రక్షించినందుకు శక్తివర్మకు రత్నాభరణములు పారితోషికముగ నిచ్చి గౌరవించెను.

పిమ్మట శక్తివర్మ యానృపాలునికడ సెలవుగైకొని గాంధారమున కరిగి మహేంద్రదేవుఁడు సందేశార్థము నంగీకరించెనని విన్నవించెను. మాళవ పాంచాల గాంధారదేశములం దొక్కసారిగా దండయాత్రాప్రయత్నములు మిక్కిలిత్వరితముతోఁ జరుగఁజొచ్చెను. కార్తికమాస శుక్లపక్షమునఁ గాశ్మీరమునకు ససైన్యముగా రావలయునని మహేంద్రదేవుఁడు సుదర్శనునకు రాయబారమంపెను. అతఁడు దాని నంగీకరించెను. మాధవసేఁడు శక్తివర్మవలనఁ రాజకుమారుల క్షేమ మెఱిఁగి ముప్పదురాజు లేకమగుటచేఁ దప్పక చిత్రభానుఁడు కూలిపోవునని నిశ్చయించి "కార్తికమాస మెప్పుడువచ్చు నెప్పుడు సేనలు కాశ్మీరముఁజొచ్చు, నప్పుడు చిత్రభానుఁడుఁజచ్చు" నని యాశుభదినముల కెదురు చూచుచుండెను.

విద్యాపీఠ మైనతక్షశిలలో నేఁటేఁట శ్రావణమాసమున గొప్ప విద్యాపరీక్ష జరుగుచుండును. అత్తఱి విద్యార్థుల వారు వారు నేర్చిన శాస్త్రములలోఁబండితులు పరీక్షించి యర్హులగువారికి విద్యానిధి సాహిత్యచక్రవర్తి వేదాంతకేసరి మొదలగుబిరుదములును మిక్కిలి విలువగలశాలువలును ధనమును బారితోషికములుగా నొసంగ బడుచుండును. ఆవిద్యాపీఠమంతయు గాంధారరాజులపోషణముక్రింద

నుండుటచే భాగ్యవర్ధనుఁ డేటేట నప్పురీతీర్థసమయమున నక్కడికి వచ్చు చుండును. ఆసంవత్సరమును భాగ్యవర్ధనుఁడు విక్రమసేనహర్షవర్ధనుల వెంటబెట్టుకొని తక్షశిలకుఁ బోయెను. పండితులచే విద్యార్థులు పరీక్షింపఁబడిరి. శ్రోతలు మహానందభరితులగునట్లు సామవేదముగానము చేయఁబడెను. మందిరములు ప్రతిధ్వనులిచ్చునట్లు ఋక్కులు యజస్సులు నధ్యయనము చేయఁబడెను. పూర్వమీమాంసకులు నుత్తరమీమాంసకులు, నుచ్చైస్స్వనములతో సలిపి తమ తమ శాస్త్రములే సరియని సిద్ధాంతీకరించుటకు మహావాదములు సలిపిరి. కపిలుని నిరీశ్వర సాంఖ్యమును పతంజలేశ్వర సాంఖ్యము, గౌతమకాణాదుల మతములు, పండితుల జిహ్వారంగములయందు నాట్యము చేసెను. బుద్ధదేవప్రోక్తములయిన త్రిపిటకములయందును, ధమ్మపదాది గ్రంథములయందును దగు పరీక్షలు జరిగెను. భిక్షుకులకు, సన్యాసులకుఁ గాషాయాంబరములు, విద్వాంసులకు విలువగల సేలువలు విద్యార్థులకు వస్త్రములు వైదేశికులకు పండితులకు ధనములు మొదలగునవి భాగ్యవర్ధనుఁడు విరివిగానిచ్చి విశ్వజ్ఞనవంద్యుఁడయ్యెను.

విక్రమసేనహర్షవర్ధనులు తత్పురముఁ జూడఁబోయి యొక బౌద్ధవిహారమున భిక్షుణీవేషముతోనున్న యొక యంగనం జూచి మొదట నెవ్వరో యనుకొని సాఁగి యడుగులు నడచి మరల ననుమానము దోఁప వెనుకకు నడచి యాపడఁతి యెట్టయెదుట నిలిచిరి. ఆమె తలవంచి వారివంక జూడక యేదో యాలోచించుచున్నట్లుండెను. "అన్నయ్యా! అమ్మ-అమ్మ చూడు. చూడు" అని హర్షవర్ధనుఁడు మెల్లగా ననెను. "ఔను! ఆనవాలుపట్టుటకు వీలులేకుండ వెఱ్ఱిదానివలె నున్నది." అని విక్రమసేనుఁడు దగ్గఱకుఁబోయి "అమ్మా! అమ్మా!" యని పిలిచెను. ఆమె తలయెత్తి చూచెను. ఎట్టయెదుట నామె తపఃఫలములువలె బంగారుబొమ్మలవలె నిరువుర

సూనులు కనఁబడిరి. కనఁబడినతోడనే యామె యానందపరవశయై లేచి నిలువఁబడి యిరువురు బిడ్డల నొక్కసారి కౌఁగలించుకొని 'నాయనా! బ్రతికియున్నారా? నాయనా! నీవు విక్రమసేనుండవేనా? నాయనా! నీవు హర్షవర్ధనుఁడవేనా? మీరు. నా చిన్నియన్నలేనా? దృష్టిదోషముచేత నే నెవరిబిడ్డలనో నా తనయులుగా భావించుచున్నానా?'' యని సాహసంభ్రమముతోఁ బలికెను. ''అమ్మా! నేను విక్రమసేనుఁడనే. నేను హర్షవర్ధనుండనే. తల్లీ! నీవెంత మార్పు జెందితివి? మేమే సరిగా గుర్తింపలేకపోతిమి'' అని వారు తల్లిని గౌఁగలించుకొనిరి. భిక్షుభిక్షుణీజనములు మాతాపుత్రుల సమాగమ సౌఖ్యమును గన్నులారఁ జూచి సంతసించియభినందించిరి. బిడ్డలు తల్లిని భాగ్యవర్ధనునివిడిదికిఁ దీసికొనిపోయి యాతని కెఱిఁగించిరి. ఆతఁ డామెను బహూకరించి మాతాపుత్రుల సమాగమము భావికాలశుభమునకు సూచకమని వక్కాణించెను. తల్లియు బిడ్డలు దమ కష్టముల నొండొరులకుం జెప్పుకొని తత్తన్మయోచితముగా దుఃఖమును నానందమును నొందుచువచ్చిరి. అచ్చటఁ గొన్ని దినములుండి భాగ్యవర్ధనుఁడు విక్రమసేన హర్షవర్ధనులను సరవిందాదేవిని దోడుకొని స్వనగరంబున కరిగి యుద్ధసన్నాహముఁ జేయుచుండెను.

ఆవర్షర్తువతి రమణీయముగా నుండెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండమయూఖముల తైక్ష్ణ్యమునకు గగనమంతయుఁ బీటలు వాఱఁ గాలపురుషుఁడు బీటలుగానఁబడకుండ మెత్తినబురదయో యనునట్లు నభోమండలమంతయు మేఘపటలసంఛన్నమైకనఁబడెను. భీష్మంబగు గ్రీష్మమునఁ దాపమునకోర్వలేక తహతహంబడిన భూదేవిమీఁద జల్లుకొన్న పన్నీరోయన వెల్లివిరిసి నేలంబడుచున్న యాకాశగంగయోయన వర్షములు సాంద్రములై కురిసెను. ఉఱుములధణంధణ

ధణధ్వానములతోడను, నెడనెడఘణిల్లుఘణిల్లుఘణిల్లని పడియెడు పిట్టపిడుగులచప్పుడులతోడను బెకబెకలాడు గోదురుకప్పల యఱపులతోడను, బ్రహ్మాండము ప్రతిధ్వనించుచుండెను. భగ్నమనోరథులై పరితపించు వారికి నెడనెడం బొడకట్టునల్పాశలంబోలెఁ దళతళతళమని కన్నులకు మిఱుమిట్లుగొలుపునట్లు మెఱుపులు మెఱయఁజొచ్చెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండతైక్ష్ణ్యముచేత నెండి స్రుక్కినజలాశయశిశువులను వెండియుఁ బ్రకృతిమాత దృఢగాత్రులం జేయుటకు నొసంగెడు స్తన్యమో యనఁ బయోధరములనుండి శుద్ధపయోధారలు వెల్లివిరియున ట్లొసంగెను. నదీనదంబులు పొంగెను. వాఁగులు నిండెను. తటాకములు జలపూర్ణములయ్యెను. ప్రపంచ మంతయు జలమయమయ్యెను. మార్గంబు లరికట్టఁబడెను. ప్రయాణములు దుస్సాధ్యములయ్యెను. ప్రపంచమంతయుఁ జల్లఁగా నున్నను నావర్షకాలమున మకరందునిమనస్సు వియోగవేదనాసంతప్త మగుటం జేసి యతఁడు సౌఖ్యముం గనక నిరాశామేఘచ్ఛన్నము లయిన యాదినములను దుర్దినములనుగా భావించి కాల మెట్టెటో గడుపఁజొచ్చెను. కర్పూరమంజరియు మకరందుఁడట్లె ప్రియవిరహసంతాపమునఁ బొక్కుచు నాముద్దినము లెన్నిటికయిన గతింపకపోవునా, యనిమంచికాలమున కెదురుచూచుచుండెను.

ముప్పదియైదవ ప్రకరణము

శరత్కాలము ప్రాప్తించెను. అయ్యది పరమేశ్వరసృష్టికిఁ బ్రతిసృష్టి చేయఁజాలు మహాకవివాక్ప్రౌఢిమకును జిత్రకారుని తూలికానైపుణ్యమునకును నతీతమై సౌందర్యనిలయమై యతిశోభావంతమై

యులరఁజొచ్చెను. భూమండలమున రాజేంద్రులు ధనుస్సులు పూని విజృంభింతురుగావునఁ దనధనుస్సుతో నింక బనిలే దనికాఁబోలు మహేంద్రుఁడు తనచాపంబును గగనమందుఁ బ్రదర్శింపకదాఁచెను. ఘనకారున మేఘమండలముచే నాచ్ఛాదితుం డయిన సహస్రమయూఖుఁడు బంధవిముక్తుఁ డయినమహాతేజశ్శాలియుంబోలె మున్ను జడమైనబ్రహ్మాండమున కంతకు వెండియు నఖండ చైతన్యము గలుగునట్లు దేదీప్యమానప్రభలతో వెలుఁగఁజొచ్చెను. దిక్కులు ప్రసన్నములయ్యెను. బురద లెంత నేల గట్టిపడెను. జనుల గమనాగమనముల కనుకూలముగా బాటలేర్పడెను. మున్ను కూలంకషములై దేశంబులపై దండు వెడలి గృహారామక్షేత్రాదుల నాశనంబుఁ జేసినమహావాహినులు తమగాంభీర్యముం గోల్పోయి విజృంభణము వెడలి సామాన్యజనులు తమ్ముదాఁటిపోవుపాటిరేవుల గలిగి కల్మషరహితములైన నిర్మలోదకములు గలిగి యక్కడక్కడఁ దమదిప్పలు బైలుపడఁ దొంటియైశ్వర్య మంతయుం గోలుపోయి గర్వహీనులై నెల్ల వారికిఁ జులకనై పేదల ట్లుండెను. సరోవరములు పగలు వికసించి కనుపండువుసేయుతామరలతోడను, రాత్రులు వికాసము జెంది నయనాభిరామంబు లగుకలువలతోడను వెలయుచు నిరంతర మందహాసమునఁ గళగళలాడునెమ్మొగంబులు గలవిలాసవతులట్లు శోభిల్లుచుండెను, ఏసరసుఁడు తనయింటికి వచ్చిన నాసరసునఁ గౌఁగిఁటఁజేర్చి యాదరించువెలవెలఁదుకలట్లు సరోవరంబులు పట్టపగంట దర్శనం బిచ్చుప్రభాకరుని, రేలఁగానఁబడు శీతమయూఖునిఁ బద్మదళహస్తములతోడను గలువరేకులచేతులతోడను గాఁగిలించుకొనుచు వారికరస్పర్శల ధన్యత నొందుచుండును. ఆకాశమున నగస్త్యనక్షత్రము తోఁచెను. రాకాచంద్రమండలము నిర్మల నిష్కళంకమై నిరుపమానమై నిశాంతమనోహరమై నేత్రపర్వమైనపండువెన్నెలలుగాయు

జొచ్చెను నిశాలక్ష్మి వెన్నెలయను తెల్లదువ్వలువ గట్టి నక్షత్ర మాలిక యనుముత్యాలసరముఁ దాల్చి వర్ణనాతీతమైనశోభ గలిగి విరాజిల్లుచుండెను. పొలము లన్నియుఁ బండఁబారెను. వసుంధర సస్యభరితమై చూలుదాల్చి నెలలునిండినపడంతుకవలె దర్శనీయయై యొప్పెను. ఎప్పుడు శరత్కాలము వచ్చు, నెప్పుడు మహావాహినీ సమూహములఁ గొని కాశ్మీరముపై దండువిడియ నగునని నిరీక్షించు చున్న గాంధారపాంచాలమాళవేంద్రులకు రూపుదాల్చిన తమమునో రథముంబోలె నాశరదృతువు కనఁబడెను.

గాంధారసైన్యంబులు భీష్మంబులై గ్రీష్మంబట్లు పరసైన్యం బుల శోషింపఁజేయఁగలిగి యుండె. బాణవర్షంబులఁ బగతుర ముంపఁజాలి పాంచాలసైన్యంబులు వర్షర్తువుల ట్లుండెను. మాళవేం ద్రసేనలు శీతాకాలంబట్లు తెల్లవారి గడగడ వడఁకింపఁజాలియుండెను బాణంబులు, తూణంబులు, నరదంబులు, ద్విరదంబులు, ధనుస్సులు క్షుభితయశస్సులు, హయంబులు, భటచయంబులు, గలిగి మూఁడు సేనలు శీతకాలమున సన్నిధియైన ముక్కాఁరులట్లు, ముచ్చిచ్చు లట్లు ముక్కాఁకలఁ దేరి మువ్వన్నెల వలువలఁ దాల్చినజోదులుగలిగి పైలుదేఱి కార్తికశుద్ధపూర్ణిమనాఁటికిఁ గాశ్మీరదేశముం బ్రవేశించెను. తనచేఁ బరాజితులైన మాళవపాంచాలభూపతులు మఱలమూఁగ లం గూర్చుకొని తనపై నెత్తివత్తురని చిత్రభానుఁడుతలంచుచుండెనుగాని గాంధారనాయకుఁడు తనపై దాడివెడలునని యాతఁడెన్నఁడును దలంచియుండలేదు. ముగ్వురురాజులును సకలసమరసన్నాహంబు జేసి కొని దనపై దండువిడియుచున్నా రని చారులవలనవిని చిత్రభానుఁడు తత్తఱపడి తనసేనలఁ జక్కఁజేయఁజొచ్చెను. విశ్వసింపఁదగినబంట్లను దండపాణిని వెదకుటకై కాశీమొదలగుమహాక్షేత్రములకుఁ బంపెను. క్రొత్తజోదుల సేనలోఁ జేర్చుకొనెను. మగఁటిమి గలజోదులను

మునకు వీలైన సమయముగాదు. నీవు స్వల్పపరివార సమేతుఁడవై వెంటనేపొమ్ము.'' అని యానతిచ్చుటయు శక్తివర్మ మహాప్రసాద మని జాబులనందుకొని మితపరివారముతోఁ బాంచాలమునకరిగి రాజధానిం బ్రవేశించి మహేంద్రదేవుని సందర్శించి సందేశార్థ మెఱిఁగించెను. అతఁడు సందేశార్థములకు సమ్మతము దెలిపి తనమనుమలు భాగ్యవర్ధనునిచెంత నున్నకుశలవార్త విని మిక్కిలిసంతసించి దౌహిత్రులప్రాణములు రక్షించినందుకు శక్తివర్మకు రత్నాభరణములు పారితోషికముగ నిచ్చి గారవించెను.

పిమ్మట శక్తివర్మ యానృపాలునికడ సెలవుగైకొని గాంధారమున కరిగి మహేంద్రదేవుఁడు సందేశార్థము నంగీకరించెనని విన్నవించెను. మాళవ పాంచాల గాంధారదేశములం దొక్కసారిగా దండయాత్రాప్రయత్నములు మిక్కిలిత్వరితముతోఁ జరుగఁజొచ్చెను. కార్తికమాస శుక్లపక్షమునఁ గాశ్మీరమునకు ససైన్యముగా రావలయునని మహేంద్రదేవుఁడు సుదర్శనునకు రాయబారమంపెను. అతఁడు దాని నంగీకరించెను. మాధవసేఁడు శక్తివర్మవలనఁ రాజకుమారుల క్షేమ మెఱిఁగి ముప్పదురాజు లేకనుగుటచేఁ దప్పక జిత్రభానుఁడు కూలిపోవునని నిశ్చయించి ''కార్తికమాస మెప్పుడువచ్చునెప్పుడు సేనలు కాశ్మీరముఁజొచ్చు, నెప్పుడు చిత్రభానుఁడుజచ్చు'' నని యాశుభదినముల కెదురు చూచుచుండెను.

విద్యాపీఠ మైనతక్షశిలలో నేఁటేఁట శ్రావణమాసమున గొప్ప విద్యాపరీక్ష జరుగుచుండును. అత్తఱి విద్యార్థుల వారు వారు నేర్చిన శాస్త్రములలోఁబండితులు పరీక్షించి యర్హులగువారికి విద్యానిధి సాహిత్యచక్రవర్తి వేదాంతకేసరి మొదలగుబిరుదములును మిక్కిలి విలువగలశాలువలును ధనమును బారితోషికములుగా నొసంగుచుండును. ఆవిద్యాపీఠమంతయు గాంధారరాజులపోషణముక్రింద

నుండుటచే భాగ్యవర్ధనుఁ డేటేటను పురీతొంగమయముున కక్కడికివచ్చు చుండును. ఆసంవత్సరమును భాగ్యవర్ధనుఁడు విక్రమసేనహర్షవర్ధనుల వెంటబెట్టుకొని తక్షశిలకుఁ బోయెను. పండితులచే విద్యార్థులు పరీక్షింపఁబడిరి. శ్రోతలు మహానందభరితులగునట్లు సామవేదముగానము చేయఁబడెను. మందిరములు ప్రతిధ్వనులిచ్చునట్లు ఋక్కులు యజస్సులు నధ్యయనము చేయఁబడెను. పూర్వమీమాంసకులు నుత్తర మీమాంసకులు, నుపనిషత్స్వనములతో నలిపి తమ తమ శాస్త్రములే సరియని సిద్ధాంతీకరించుటకు మహావాదములు సలిపిరి. కపిలుని నిరీశ్వర సాంఖ్యముం బతంజలేశ్వర సాంఖ్యము, గౌతమకాణాదుల మతములు, పండితుల జిహ్వారంగములయందు నాట్యము చేసెను. బుద్ధదేవప్రోక్తములయిన త్రిపిటకములయందును, ధమ్మపదాది గ్రంథములయందును దగుపరీక్షలుజరిగెను. భిక్షుకులకు, సన్యాసులకుఁ గాషాయాంబరములు, విద్వాంసులకు విలువగల సేలువలు విద్యార్థులకు వస్త్రములు వైదేశికులకు పండితులకు ధనములు మొదలగునవి భాగ్యవర్ధనుఁడు విరివిగానిచ్చి విద్వజ్జనవంద్యుఁడయ్యెను.

విక్రమసేనహర్షవర్ధనులు తత్పురముఁ జూడఁబోయి యొక బౌద్ధవిహారమున భిక్షుణీవేషముతో నున్న యొక యంగనంజూచి మొదట నెవ్వరో యనుకొని సాఁగి యడుగులు నడచి మరల నను మానము దోఁప వెనుకకు నడచి యాపడఁతి యెట్టయెదుట నిలిచిరి. ఆమె తలవంచి వారివంక జూడక యేదో యాలోచించుచున్నట్లుం డెను. "అన్నయ్యా! అమ్మ-అమ్మ చూడు. చూడు" అని హర్షవర్ధ నుఁడు మెల్లగా ననెను. "ఔను! ఆనవాలుపట్టుటకు వీలులేకుండ వెఱ్ఱిదానివలె నున్నది." అని విక్రమసేనుఁడు దగ్గఱకుఁబోయి "అమ్మా! అమ్మా!" యని పిలిచెను. ఆమె తలయెత్తి చూచెను. ఎట్టయెదుట నామె తపఃఫలములువలె బంగారుబొమ్మలవలె నిరుపుర

సూనులు కనఁబడిరి. కనఁబడినతోడనే యామె యానందపరవశయై లేచి నిలువఁబడి యిరువురు బిడ్డల నొక్కసారి కౌఁగలించుకొని 'నాయనా! బ్రతికియున్నారా? నాయనా! నీవు విక్రమసేనుండవేనా? నాయనా! నీవు హర్షవర్ధనుఁడవేనా? మీరు నా చిన్నియన్నలేనా? దృష్టిదోషముచేత నే నెవరిబిడ్డలనో నా తనయులుగా భావించుచున్నానా?'' యని సహసంభ్రమముతోఁ బలికెను. ''అమ్మా! నేను విక్రమసేనుఁడనే. నేను హర్షవర్ధనుండనే. తల్లీ! నీవెంత మార్పు జెందితివి? మేమే సరిగా గుర్తింపలేకపోతిమి'' అని వారు తల్లిని గౌఁగలించుకొనిరి. భిక్షుభిక్షుణీజనములు మాతాపుత్రుల సమాగమ సౌఖ్యమును గన్నులారఁ జూచి సంతసించియభినందించిరి. బిడ్డలు తల్లిని భాగ్యవర్ధనునివిడిదికిఁ దీసికొనిపోయి యాతని కెఱిఁగించిరి. ఆతఁ డామెను బహూకరించి మాతాపుత్రుల సమాగమము భావి కాలశుభమునకు సూచకమని వక్కాణించెను. తల్లియు బిడ్డలు దమదమకష్టముల నొండొరులకుం జెప్పుకొని తత్త్వముయోచితముగాఁ దుఃఖమును నానందమును నొందుచువచ్చిరి. అచ్చటఁ గొన్ని దినములుండి భాగ్యవర్ధనుఁడు విక్రమసేన హర్షవర్ధనులను సరవిందాదేవిని దోడుకొని స్వనగరంబున కరిగి యుద్ధసన్నాహముఁ జేయుచుండెను.

ఆవర్షర్తువతి రమణీయముగా నుండెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండమయూఖముల తైక్ష్ణ్యమునకు గగనమంతయుఁ బీటలు వాఱఁ గాలపురుషుఁడు బీటలుగానఁబడకుండ మెత్తినబురదయో యనునట్లు నభోమండలమంతయు మేఘపటలసంఛన్నమై కనఁబడెను. భీష్మంబగు గ్రీష్మమునఁ దాపమునకోర్వలేక తహతహంబడిన భూదేవి మీఁదఁ జల్లుకొన్న పన్నీరోయన వెల్లివిరిసి నేలంబడుచున్న యాకాశగంగ యోయన వర్షములు సాంద్రములై కురిసెను. ఈఱుములధణంధణ

ధణధ్వానములతోడను, నెడనెడఘుఘుల్లుఘుల్లుఘుల్లనిపడియెడు పిట్టపిడుగులచప్పుడులతోడను బెకబెకలాడు గోదురుకప్పల యఱపులతోడను బ్రహ్మాండము ప్రతిధ్వనించుచుండెను. భగ్నమనోరథులై పరితపించు వారికి నెడనెడం బొడకట్టునల్పాశలంబోలెం దళతళతళమని కన్నులకు మిఱుమిట్లుగొలుపునట్లు మెఱుపులు మెఱయఁజొచ్చెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండతైక్ష్ణ్యముచేత నెండి స్రుక్కినజలాశయ శిశువులను వెండియుం బ్రకృతిజనని దృఢగాత్రులం జేయుటకు నొసంగెడు స్తన్యమో యనఁ బయోధరములనుండి శుద్ధపయోధారలు వెల్లివిరియునట్లొసంగెను. నదీనదంబులు పొంగెను. వాఁగులునిండెను తటాకములు జలపూర్ణములయ్యెను. ప్రపంచ మంతయు జలమయమయ్యెను. మార్గంబు లరికట్టఁబడెను. ప్రయాణములు దుస్సాధ్యములయ్యెను. ప్రపంచమంతయుఁ జల్లఁగా నున్నను నావర్షకాలమున మకరందునిమనస్సు వియోగవేదనాసంతప్త మగుటం జేసి యతఁడు సౌఖ్యముం గనక నిరాశామేఘచ్ఛన్నము లయిన యాదినములను దుర్దినములనుగా భావించి కాల మెట్లెటో గడుపఁజొచ్చెను. కర్పూరమంజరియు మకరందుఁడట్ల ప్రియవిరహసంతాపమునఁ బొక్కుచు నాదుర్దినము లెన్నిటికయిన గతింపకపోవునా, యనినుంచికాలమున కెదురుచూచుచుండెను.

ముప్పదియైదవ ప్రకరణము

శరత్కాలము ప్రాప్తించెను. అయ్యాదిపరమేశ్వరసృష్టికిఁ బ్రతిసృష్టి చేయంజాలు మహాకవిప్రాక్ప్రోషితమనును జిత్రకారుని తూలికా నైపుణ్యమునకును నతీతమై సౌందర్యనిలయమై యతిశోభావంతమై

యులరఁ జొచ్చెను. భూమండలమున రాజేంద్రులు ధనుస్సులు పూని విజృంభింతురుగావునఁ దనధనుస్సుతో నింక బనిలే దనితాఁబోలు మహేంద్రుఁడు తనచాపంబును గగనమునకుఁ బ్రదర్శింపకదాఁచెను. ఘనకాలమున మేఘమండలముచే నాచ్ఛాదితుం డయిన సహస్రమయూఖుఁడు బంధవిముక్తుఁ డయినమహాతేజశ్శాలియుంబోలె మున్ను జడమైనబ్రహ్మాండమున కంతకు వెండియు నఖండ చైతన్యము గలుగునట్లు దేదీప్యమానప్రభలతో వెలుఁగఁజొచ్చెను. దిక్కులు ప్రసన్నములయ్యెను. బురద లెంత నేల గట్టిపడెను. జనుల గమనాగమనముల కనుకూలముగా బాటలేర్పడెను. మున్ను కూలంకషములై దేశంబులపై దండువెడలి గ్రామారామక్షేత్రాదుల నాశనంబుఁ జేసినమహావాహినులు తమగాంభీర్యముం గోల్పోయి విజృంభణము వెడలి సామాన్యజనులు తమ్ముదాఁటిపోవుపాటిరేవుల గలిగి కల్మషరహితములైన నిర్మలోదకములుగలిగి యక్కడక్కడఁ దమ తిప్పలు బైలుపడఁ దొంటియైశ్వర్య మంతయుం గోలుపోయి గర్వహీనులై నెల్లవారికిఁ జులకనై పేదల ట్లుండెను. సరోవరములు పగలు వికసించి కనుపండువుసేయుతామరలతోడను, రాత్రులు వికాసము జెంది నయనాభిరామంబు లగుకలువలతోడను వెలయుచు నిరంతర మందహాసమునఁ గళగళలాడుమెమ్మొగంబులు గలవిలాసవతులట్లు శోభిల్లుచుండెను, ఏసరసుఁడు తనయింటికి వచ్చిన నాసరసునఁ గౌఁగిఁటఁ జేర్చి యాదరించువెలవెలఁదుకలట్లు సరోవరంబులు పట్టపగంట దర్శనంబిచ్చుప్రభాకరుని, రేలఁ గానఁబడు శీతమయూఖునిఁ బద్మదళహస్తములతోడను గలువరేకులచేతులతోడను గౌఁగిలించుకొనుచు వారికరస్పర్శల ధన్యత నొందుచుండును. ఆకాశమున నగస్త్యనక్షత్రము తోఁచెను. రాకాచంద్రమండలము నిర్మల నిష్కళంకమై నిరుపమానమై నితాంతమనోహరమై నేత్రపర్వమైనపండువెన్నెలలుగాయ

జ్యోత్స్నను నిశాలక్ష్మి వెన్నెలయను తెల్లదువ్వలువ గట్టి నక్షత్రమాలిక యనుముత్యాలసరముఁ దాల్చి వర్ణనాతీతమైనశోభ గలిగి విరాజిల్లుచుండెను. పొలము లన్నియుఁ బండఁబాఱెను. వసుంధర సస్యభరితమై చూలుదాల్చి నెలలునిండినపడంతుకవలె దర్శనీయమై యొప్పెను. ఎప్పుడు శరత్కాలము వచ్చు, నెప్పుడు మహావాహినీ సమూహములఁ గొని కాశ్మీరముపై దండువిడియ నగునని నిరీక్షించుచున్నగాంధార పాంచాలమాళవేంద్రులకు రూపుదాల్చిన తమమునో రథముంబోలె నాశరదృతువు కనఁబడెను.

గాంధారసైన్యంబులు భీష్మంబులై గీష్మంబట్లు పరసైన్యంబుల శోషింపఁజేయఁగలిగి యుండె. బాణవర్షంబులఁ బగసుఱ ముంపఁజాలి పాంచాలసైన్యంబులు వర్షర్తువుల ట్లుండెను. మాళవేంద్రసేనలు శీతాకాలంబట్లు తెల్లవారి గడగడ వడఁకింపఁజాలియుండెను బాణంబులు, తూణంబులు, వరదంబులు, ద్విరదంబులు, ధనుస్సులు క్షుభితమనస్సులు, హయంబులు, భటచయంబులు. గలిగి మూఁడు సేనలు శేశకాలమున సన్నిధియమున ముక్కారులట్లు, ముచ్చిచ్చులట్లు ముక్కాఁకలఁ దేరి మువ్వన్నెవలువలుఁ దాల్చినజోదులుగలిగి బైలుదేఱి కార్తికశుద్ధపూర్ణిమనాఁటికిఁ గాశ్మీరదేశముం బ్రవేశించెను. తనచేఁ బరాజితులైనమాళవపాంచాలభూపతులు మఱలమూఁగలం గూర్చుకొని తనపై నెత్తివత్తురని చిత్రభానుఁడుతలంచుచుండెనుగాని గాంధారనాయకుఁడు తనపై దాడివెడలునని యాతఁడెన్నఁడును దలంచియుండలేదు. మువ్వురు రాజులును సకలసమరసన్నాహంబుచేసి కొని దనపై దండువిడియుచున్నారని చారులవలనవిని చిత్రభానుఁడు తత్తఱపడి తనసేనలఁ జక్కఁజేయఁజొచ్చెను. విశ్వసింపఁదగినబంట్లను దండపాణిని వెదకుటకై కాశీమొదలగుమహాక్షేత్రములకుఁ బంపెను. క్రొత్తజోదుల సేనలోఁ జేర్చుకొనెను. మగఁటిమి గలజోదులను

జిన్న దండనాథుఁడుగఁ జేసెను. వలయు ప్రయత్నము లన్నియుఁ జేసెను. వైదర్భులను సాయమురమ్మని సందేశమంపెనుగాని వారు మకరందునిచేఁ బరాజితులై నిశ్శేషముగాఁ జెదిరిపోవుటచే నట్టిసాహాయ్యముం జేయఁజాలరయిరి. కావునఁ జిత్రభానుఁ డసహాయుఁడై తనలావును నమ్ముకొనియుండవలసినవాఁ డయ్యెను.

యథానిర్దిష్టముగఁ గార్తికశుద్ధపూర్ణిమనాఁటికి మూఁడుసైన్యములు శ్రీనగరపరిసరంబుల విడిసెను. గాంధారవల్లభుఁడు, పాంచాలనాయకుఁడు, మాళవరాజనందనుఁ డగుమకరందుఁడు నొండొరులం గలిసికొని కుశలంబు లడిగి సమరం బెట్లు జరుగవలయునో యావిధానమునుగూర్చి తర్కించిరి. భాగ్యవర్ధనమహేంద్రదేవులు తమదళములకుం గూడ మకరందుని దండనాథుని జేసి యాతనియాజ్ఞాప్రకారము నడువవలసిన దని తమసేనానాయకుల కాజ్ఞనొసఁగిరి. భాగ్యవర్ధనునివెంట వచ్చినవిక్రమసేనహర్షవర్ధనులు, పాంచాలసైన్యముతో వచ్చినవీరాంధనసేనుని గలసికొని తమకై బెంగ వెల్లుకొనిన యావృద్ధమంత్రి కానందముఁ గలిగించిరి. విక్రమసేనుఁడు గాంధారసైన్యమున నొకభాగమునకు దండనాథుఁడై మకరందునియాజ్ఞ నిర్వర్తించుచుండెను. గాంధారవల్లభుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి తనయమాత్యుఁడయిన జీవసిద్ధినిఁ జిత్రభానునికడకు రాయబారిగాఁ బంపెను. అతఁడును గాశ్మీరనరపాలునికడఁ జెప్పవలసిన సందేశార్థము లన్నియు జాగరూకతతో సంగ్రహించుకొని చిత్రభానుని సందర్శనము వేఁడి వానియనుమతమున సన్నిధి కరిగి సత్కృతుఁడై తన సందేశము నెఱిఁగింప ననుజ్ఞ వేఁడెను. అప్పుడు వారి క్రిందివిధమున ముచ్చటించిరి,

జీవ—మహారాజా! మా ప్రభు వగుభాగ్యవర్ధనుఁడు సంగ్రహముగా సందేశ మెఱిఁగించి రమ్మని పంపెను. ఆసందేశమిది: గతించిన దానిని మరల ద్రవ్వుకొనుట నిష్ప్రయోజనము, విక్రమసేనుని గాశ్మీరసింహాసన మెక్కించి హర్షవర్ధనుని యువరాజు జేసి నీవు సకుటుంబముగాఁ గాశ్మీరరాజ్యము విడిచి పోవుదువా లేక, కయ్యమున కయ్యకొందువా? ఇందు నీ కేదియిష్టమో దానిం జేయుము. ఇంతే సందేశము.

చిత్ర—ఇంకను విక్రమసేనహర్షవర్ధను లెక్కడ! వారు మృతినొందిరి. చచ్చినవానిని రాజుం జేయు టెట్లు? యువరాజుం జేయు టెట్లు?

జీవ—రాజా! నీవు మేలుకొనియుఁ గలఁ గనుచున్నావు. విక్రమసేనహర్షవర్ధనులు జీవించియున్నారు. దండపాణి త్రవ్వించిన గోతిలో దండపాణియే పడియెను. రాజపుత్త్రులం జంపఁ దలఁచి వచ్చి తాఁ జచ్చె. నీమాయాసముద్రంబున మునిఁగిపోక రాజపుత్త్రులు సురక్షితులయి గాంధారమునకు వచ్చి నేఁ డీసేనతో నిటకు వచ్చియున్నారు.

చిత్ర—(తెల్లబోయి) ఏమేమీ! బ్రతికియున్నారా? ఇది పరిహాసమా? నీవు మతి తప్పి మాటాడుచున్నావా?

జీవ—పరిహాసముగాదు. మత్తసంభాషణముగాదు. నిజము.

చిత్ర—బ్రతికి యున్నను సరె చచ్చినను సరె! రాజ్యము నే నియ్యను. వెంటనే యిచ్చోటు విడిచి పొమ్ము. లేకున్న నీప్రాణములు దక్కవు.

జీవ—చిత్తము. ఇదే సెలవుపుచ్చుకొనుచున్నాను. (అని వెడలిపోయెను)

అప్పలుకులు వినినదాదిగాఁ జిత్రభానునిమనస్సు మిక్కిలి సంక్షుభిత మయ్యెను. "ఏమీ! దండపాణి మృతినొందెనా? రాజకుమారులు బ్రదికి యున్నారా? రాకొమరులు చచ్చిరని దండపాణి తీర్థయాత్రలు సేవించుచున్నాఁడని చందుఁడు చెప్పినమాట యబద్ధమా? చండశక్తివర్మలను వంచించి యుందురా? అయ్యయో! సర్వము. చెడిపోయినది. నాకట్టిన మేడలు కూలిపోయినవి.' అని తనలోఁ జింతించుకొనుచు రుద్రభట్టుకడకుఁ బోయి జీవసిద్ధిసందేశ మెఱిఁగించెను. అతఁడును మొదట నమ్మాట నమ్మక యెట్టకేలకు రాయబారమునం దబద్ధముండదని నిశ్చయించి యెట్లయిన సమరసన్నాహమే కర్తవ్య మని యుపదేశించెను.

చిత్రభానుని ధైర్యము సడలెను. సందేశార్థము పిడుగడచినట్లు వానియుత్సాహము నడంచెను. దండపాణి వచ్చుననునాసయుడుగంటెను. అట్టి క్లిష్టసమయమున భ్రాతృమరణవార్త వజ్రపాణికి తెలియఁగింపఁగూడ దని యవ్వార్తఁ దనమనంబుననే యడంచుకొనెను. దండపాణి లేకపోవుటయు వెనుకటియుద్ధములో మెఱియలవంటిజోదులు, దండనాథులు హతులగుటయు, బొక్కసములోనిధనముతన్నిమిత్తమై వ్యయమగుటయు రాజకుమారులు బ్రతికియుండుటయు మున్నగువిషయములు చిత్రభానున కమితవిషాదముఁ గలిగించెను. ధనము చాలమి నగరమందున్నసంపన్ను లగు బేహారులను నితరగృహస్థులను రావించి యుద్ధమునిమిత్తము తనకు సొమ్ముగావలె నని చెప్పి యిమ్మని యడిగెను. ఇచ్చినవారిని మఱికొంత హెచ్చుగా నిమ్మనియు, లేదన్నవారిని దప్పక యియ్యవలసిన దనియు నిర్బం

ధించి హింసించెను. ప్రజలు భయభ్రాంతులై చిత్రభానునిదూషించి వానివినాశమును గోరిరి. కొందఱు పాఱిపోయిరి. పరుగెత్తినవారిని యతఁడు పట్టితెప్పించి శిరచ్ఛేదముఁ జేయించి వారియిండ్లు దోఁపించెను. తనజయమునిమిత్తము దేవాలయంబులఁ బ్రార్థనలు చేయవలసినదని బ్రాహ్మణోత్తముల నియోగించెను. రాజువలన భూరిసంభావనల నపేక్షించిన బ్రాహ్మణోత్తములు వానికి జయముబ్రసాదింపుమని పరమేశ్వరుం బ్రార్థించిరి. దేశాభిమానులగు బ్రాహ్మణులు మరల వానికపజయమును మరల విక్రమసేనునిబ్రతిష్ఠయుఁ గావలెనని సర్వేశ్వరుని వేఁడుకొనిరి. రుద్రభట్టు చిత్రభానునివిజయమునిమిత్తమై గ్రహశాంతులు చేయనారంభించెను. గ్రహదోషనివారణార్థము బ్రాహ్మణులకు భూరిదానము లిప్పించెను.

జీవసిద్ధి తనసందేశపర్యవసానమును భాగ్యవర్ధనాదిప్రభువుల కెఱిఁగింప వారు యుద్ధసన్నద్ధులయిరి. రణభేరులు మ్రోఁగె. కోటలో నున్న యంగనలగుండెయలు జలుజల్లు మనఁజేసెను. ఆభయంకరధ్వానములకు నభమునఁ గాఱెకుపిట్టలు చుట్టుచుట్టుకొని బిట్టఱచుచు నేలం బడియెను. గాంధారసైన్యములు పట్టణమున కుత్తరమునను బాంచాలవాహినులు పడమటను, మాళవసైన్యములు దక్షిణమునను విడిసి స్కంధావారమును నిర్మించుకొనెను. ఊరికిఁ దూర్పున సింధువున కుపనదియైన జీలమునునది ప్రవహించుచుండుటచే నచ్చట నెవ్వరును విడియుటకు వీలులేకపోయెను. కార్తికశుద్ధ పంచమినాఁటియుదయమున యుద్ధమారంభమయ్యెను. చిత్రభానుఁ డిష్టదేవతలకుఁ గృహదేవతలకు వేదవేదాంగపారంగితులగు విప్రులకు రుద్రభట్టునకు నమస్కరించి కడపటివారియాశీర్వచనములఁబడసి కవచంబును శిరస్త్రాణంబును దొడిగి విల్లుబూని వజ్రపాణియుఁ గుమారుఁడు విజయసేనుఁడు దక్షిణసేనాపతులు వెంటరా రణరంగముఁజొచ్చెను. అతఁడు తనసైన్యములు మూఁడుభాగములుచేసి యొకభాగంబునకుఁ దాను మొనగాఁడై భాగ్యవర్ధనునిమీఁదికి నడిపెను. రెండవభాగమునకుఁ

దనకుమారుఁడైన విజయసేనుని దండనాథునిగఁ జేసి కొందఱుచిన్న సేనాపతులను వానికి సాయమిచ్చి మహేంద్రదేవునిమీఁది కంపెను. మూఁడవభాగము వజ్రపాణికిచ్చి మకరందునిమీఁది కంపెను. నాలుగు సైన్యంబులఘోషము నాలుగుసముద్రములమహాఘోషము ననుకరించెను. సమరము కురుపాండవయుద్ధమును జూపఱకు స్మరణకుఁ దెచ్చెను. ముందుగాఁ జిత్రభానుఁడు భాగ్యవర్ధనుం దలపడెను. విజయసేనుఁడు మహేంద్రదేవునిదాఁకెను. వజ్రపాణి మకరందునిమీఁదికిం జనెను. గ్రద్దఱెక్కలు గట్టినవాలుటమ్ములు యోధులచేతులనున్న విండ్లనెడుక్రొక్కాఱుమబ్బులనుండి వర్షధారలట్లు టప్పుటప్పునఁ బడఁ జొచ్చెను. ఖడ్గపాణులగుజోదులచేనఱుకఁబడినవీరులశిరంబులుమృత్యుదేవత తిని పాఱవైచిన తాటిపండ్లయట్లు ముంజెలట్లు నామెపానపాత్రంబులట్లు తోఁచెను. పాదంబులు తెగిన యూర్ధ్వభాగంబులు శిరంబులు లేని మొండెంబులు, బాహువులు తెగినొమ్ములు తెగినమ్రానులట్లుగ చూపట్టు కళేబరములు మిక్కిలిభయంకరములై కానఁబడియెను చచ్చినవారు మరణవేదనఁ బడుచున్నవారు, ప్రాణములు గుటగుటలాడుచున్నవారు, కట్టకడపటిశ్వాసలు విడుచుచున్నవారు, దాహపీడితులై మాటాడలేక సన్నలు చేయువారు, పెదచూపులుచూచువారు, ప్రాణావసాన సమయమున గూంద్రించువారు, బాధపడలేక యఱచువారు, హరిహరీ యనువారు, నయి పడినజోదులు పలుతెఱంగులగు నవస్థలకుఁ బాలయిరి.

కయ్యము మూఁడుదినములు జరిగెను. మొదటినాఁ డెవ్వరు గెలిచిరో యెవ్వరోడిరో చెప్పుటకు వీలులేకపోయెను. రెండవనాఁడు విజయసేనుఁడు మహేంద్రదేవునివాలుటమ్ముల మూర్ఛిల్లి యొడలు తెలియక పడియెను. తోడనే యంగరక్షకులు వానిని శిబిరమునకుం గొంపోయిరి. వానిసైనికులు పగఱకు వెన్నిచ్చి పరుగిడిరి. చిత్రభానుఁడవార్తవినితనగారాబుకొడుకున్న నెలవునకరిగి శస్త్రవేదనాపరవశుఁడైన యాతనింజూచి జీవనాశలేదని విచారాక్రాంతుఁ డయ్యెను. మునుపున్న యుత్సాహముగూడ వానినివిడిచెను. "కుమారా!

నీ నిమిత్తమే గదా యీరాజ్యము సంపాదించుట ? నీ నిమిత్తమే గదా మాయలుపన్ని యెన్నెన్నో పాపములు చేయుట? తండ్రీ! నీవు లేనిచో నాకీసమర మేల? సామ్రాజ్యమేల? యనిగుట్టుగలవాఁడగుటచే లోలోపల దుఃఖపడి పైకి గాంభీర్యము వెలిపుచ్చి సైనికుల మనంబుల నుత్సాహముఁ బురికొల్పుచుఁ గుమారునకుఁదగుచికిత్సలఁ జేయింపఁజొచ్చెను. చిత్రభానుని యుత్సాహమట్లే వాని సైన్యమును రెండవనాటికిఁ బలుచఁబడెను. మూఁడవనాఁటిమధ్యాహ్నమున మకరందునిచే వజ్రపాణి తెగటారెను. పాప మాతనికిఁ గర్పూరమంజరీ పాణిగ్రహణమహోత్సవము లభింపకున్నను వీరపురుషోచితమయిన శస్త్రమరణము గలుగుటచే మందారమంజరీసమేతలయిన యచ్చరమచ్చకంటుల కేలువట్టు భాగ్య మొదవెను. దండపాణి లేకపోవుట చేతను విజయసేనుఁడు గాయపడుటచేతను, వజ్రపాణి నిహతుండగుట చేతను, జిత్రభానునియుత్సాహ్న చల్లవడెను. వానిసేనలుగాంధారుల పోటులకును పాంచాలురయేటులకును, మాళవుల ప్రహారములకును, నిలువలేక వెనుకదిరిగిచూడక పరుగెత్తిరి. కొందఱు మొసళ్ళపాలయిరి. దూరముకొట్టుకొనిపోయిరి. యుద్ధభూమి గుఱ్ఱములయు. బదాతులయు నేనుంగులయుఁ బీనుంగులతోఁడ నతి భయంకరమై హేయమై మృత్యుదేవత రాజధానివలె నుండెను.

చిత్రభానుఁడు శత్రువులు తఱిమి తఱిమి మీఁదిమీఁదికి రాఁగ సేనలు లేక యుత్సాహములేక నూఱుమంది సైనికులతో యుద్ధభూమి విడిచిపోయెను. జీవసిద్ధి కొంతసేనతో వానివెనువెంట నంటిపోయి తఱిమి దాదాపుగ నందఱంజంపె. చిత్రభానునకు రెండుకన్నులట్ల రెండుచేతులట్ల పనిచేసిన కరటకపింగళులు వెంటరా నతఁడు గత్యంతరములేక ప్రాణరక్షణముకొఱకు జీలమునదిలోఁబడెను. ఈఁత యందు మిక్కిలి పరిశ్రమచేసినవాఁడగుటచేతను నప్పటికి సాయంకాలమగుటచేతను జీఁకటిచాఁటున నెట్టెటో దూరమీఁదికొనిపోయి రెండుజాములరాత్రివేళ కవ్వలియొడ్డుం జేరి తడిబట్టలతో గడగడ వడఁకుచు నేకాకియై యవ్వలియొడ్డుఁ జేరి తన యవస్థంగూర్చి భవిష్య

కర్తవ్యమునుగూర్చి తనలోఁదాను వితర్కించుకొనుచుండఁ గరటక పింగళులును దడిసిన బట్టలతో వచ్చి వానిం గలసికొనిరి. ఆ సాయంకాలమున యుద్ధభూమియందు నెత్తురు యేరులై ప్రవహించెననుట యతిశయోక్తిగాదు. ఏనుఁగుతొండములనెడు తూములనుండి నెత్తుటి వఱదలు వసుంధరపై విచ్చలవిడిగఁ బ్రవహించెను. ఆనెత్తురు వసుంధరాదేవి దాల్చిన కుసుంభారుణవస్త్రమట్లు-మృత్యుదేవత యింట సంతోషమునఁ జల్లుకొన వసంతమట్లు- నాకసమునుండి నేలకు విజృంభించిన సంజకెంజాయయట్లు నెఱసెను.

చిత్రభానుఁడు రణరంగమువిడిచి పాఱిపోయినపిదప మకరందుఁడు "భానుఁ డస్తమించె. చిత్రభానుఁ డస్తమించినట్లె యింక సైన్యములు శిబిరమునకుం జనుఁ" డని యానతిచ్చి కోటచుట్టుఁ గొంతసేనఁ గావలిపెట్టెను. చిత్రభానుని పరాజయమును బలాయనమును విని రుద్రభట్టు తద్దయు వగచి కోటయొక్క దొడ్డిగుమ్మముఁ దెఱచి పాఱిపోవు చుండెను. మాళవసైనికులలోఁ గొందఱా ప్రాంతమును గాచుచుండుటచే వారాతనింబట్టి మకరందుని కప్పగించిరి. మకరందుఁడు వానిని మాధవసేనునికడకుఁ గొంపోయెను. అతఁడు పేదకుఁ బెన్నిధి దొరకినట్లే సంతసించి కాలుసేతులు గట్టిగాబంధింపఁ జేసి వాని నొక గుడారమునఁ బడవైచి చుట్టు నమ్మికగల బంట్లం గావలియుంచెను.

ముప్పది యాఱవ ప్రకరణము.

మఱునాఁ డుదయమున భాగ్యవర్ధనుఁడు మకరందమహేంద్రదేవులను దన స్కంధావారమునకు రావించి కోటస్వాధీనముజేసికొనుటకై పోవలె నని చెప్పెను. అప్పుడు మకరందుఁ డిట్లనియె. "కోటలోఁ జిత్రభానునికుటుంబమున్నది. వారుశుద్ధాంతకాంతలు. చిత్ర

భానుఁ డనేక దురితములు చేసియుంట నిజము. కాని యాతని యాలు బిడ్డ లాదోసములం బాలుగొనలేదు. కావున వారి కేవిధమైన యవ మానముగాని, యగౌరవముగాని మనము తలపెట్టఁగూడదు. అదియునుఁగాక గాయపడిన విజయసేనుఁడుఁగూడఁ గోటలోనున్నాఁడు. అతనియెడ మన మనాదరణము జూపఁగూడదు. మఱియొక మాటగూడ జెప్పఁ దలఁచితిని. సమరవిజయగర్వముచే మనసైనికులు సేనాపతులు శ్రీనగరమును గొల్లగొట్ట నుబలాటపడుచుందురు. పుర జనుల కించుకేనియు నలజడి కలుగఁగూడ దని నామతము. వారు చేసిన యపరాధ మేమియు లేదు. నాపలికిన పలుకులు మీకు సమ్మత ములగునేని మనమందఱముఁ గోట నాక్రమించుకొందము" అన పుడు విక్రమసేనుఁ డిట్లనియె. "మకరందునిపలుకులు నాకు సమ్మ తములు. మాపినతల్లి యిందుమణి సాధుశీల. కర్పూరమంజరి తన సోదరుఁ డగువిజయసేనునియెడ నెంతయభిమానము గలిగియున్నదో మాయెడ నంతయభిమానము నంపప్రేమ కలిగియున్నది. విజయ సేనుఁడు దుర్జనుఁడు గాఁడు. తండ్రి దుశ్చరితుఁ డనుకారణమున పినతండ్రికొడుకుని హింసించుటధర్మముగాఁదు. నాపినతండ్రి దుర్మార్గుఁడుగాని తత్కుటుంబము గాదు. పురజనులు నాయం దనురక్తులు. కావున వారు మనయాదరంబునకుం బాత్రములు."

వారిరువుర పలుకులు సహేతుకముగా నుండుటచే మహేంద్ర భాగ్యవర్ధనులు వారు చెప్పినచొప్పున నడువఁ దలంచిరి. వారందఱు మాధవసేనునిగూడ వెంటఁబెట్టుకొని యాయుధపాణు లైనకొందఱు సైనికులఁ దోడ్కొని కోటం బ్రవేశించిరి. వారివలనఁ దమకేమి యపాయము వాటిల్లునో యని భయపడుచున్న యంతఃపురజనంబునకును బరిజనంబునకును నభయప్రదానంబు చేసిరి. విక్రమసేనహర్షవర్ధనులు జీవించియున్నారని తెలిసినప్పటినుండియుఁ గర్పూరమంజరి మిక్కిలి

సంతసించి వారిం జూడ నభిలషించుచుండెను. విక్రమసేనుఁడు భ్రాతృసమేతుఁడై యంతఃపురమున కరిగి యిందుమణికి నమస్కరించి యెట్టయెదుట నిలిచెను. ఆమె వానిని మెల్లగాదీవించి తనభర్తృవిషయమై విచారించుచుఁ దలవంచుకొని యుండెను. కర్పూరమంజరి విక్రమసేనహర్షవర్ధులను గౌఁగలించుకొని హర్షవర్ధనుని ముద్దుపెట్టుకొని "తమ్ములారా! మీరు మరల నాకంటఁ బడినందుకు నామనస్సు పరమానందము నొందుచున్నది. వెనుకటిదంతయు మఱచిపోండు. మీయమ్మ యెక్కడనున్నది?" అని వారిం బరామర్శ చేసెను. అప్పుడు విక్రమసేనుఁడు "అక్కా! దైవానుగ్రహమున వెండియు మిమ్ముఁ జూచుభాగ్యము గలిగినది. ప్రాంతపగను వెండియు నుజ్జీవింపఁజేయఁ దలఁచుకొనలేదు. మీకు మావలన నెట్టిభయము లేదు. చేతులారఁ జేసికొన్న దుష్కృతఫలము మీతండ్రి యనుభవించును. విజయసేనునెడఁగూడ మా కెట్టి చెడ్డతలంపులు లేవు. మీరునిర్భయముగా నుండుఁడు" అని చెప్పి యనంతరము విజయసేనునికడకుఁ బోయి వానికిఁ గూడ నభయం బొసంగి వ్రణవైద్యుల రావించి వానికిం జికిత్సలు చేయఁ బనిచెను. పిమ్మట వారందఱు వెండియు స్కంధావారంబునకుం జనిరి.

మాధవసేనుఁడు పట్టణంబునకుం జని మణివర్మయొక్కయు శూలపాణి గదాధరులయొక్కయు, దుస్థితిఁ దెలిసికొనివచ్చి వారిని బంధవిముక్తులఁ జేయు మని విక్రమసేనునితోఁ జెప్పెను. అట్ల కాక యని కొంతపరివారమునిచ్చి యతఁ డాకార్యముచేయుటకు మాధవసేనుని నియోగించెను.

మాధవసేనుఁడు పరివారసమేతుఁడై కారాగారంబున కరిగి యుపవాసంబులచేతను, దేహపీడచేతను, మనోవిచారముచేతను మిక్కిలి కృశించి యానవాలుపట్టుట కయిన వీలులేనిస్థితిలోనున్న

తనమిత్రుని మలినవస్త్రధారుని గృశీభూగాత్రునిఁగనుఁగొని కన్నుల వేఁడికన్నీ రొలుక గాఢాలింగనముఁ జేసికొని సమర వృత్తాంత మంతయు నాతనితోఁజెప్పి విక్రమసేనునివిజయ మెఱిఁగించ బంధ విముక్తునిజేసెను. అనంతరము గదాధరశూలపాణులఁగూడ నాతఁడు విడిపించెను. వారుముగ్గురును తోడనే గృహంబులకుం జనక తమ కృతజ్ఞతను రాజభక్తిని బాలుఁడైన విక్రమసేనునకుం దెలుప నాతని నిలయంబునకుం బోయి యెట్టయెదుట నిలిచిరి. మణివర్మం జూచిన తోడనే విక్రమసేనుఁడు లేచి నమస్కరించి కౌఁగలించి "తాతగారు! మాకొరకై మీరు చెప్పరాని యిడుమలు బడితిరి. మిమ్ము వెండియు మేము చూతుమనుకొనలేదు. మొదటఁ బ్రతికూలముగా నున్నను దైవము తుదకు మన కనుకూలుఁడయ్యె." నని పరామర్శపూర్వక మగు పలుకులుపలికెను. మణివర్మ వానిని దమ్మునిఁ గనుఁగొన గల్గి నందుకు సంతసించి యట్లే పట్టాభిషేకము జరుగునని సూచించు టకో యన నానందాశ్రువులచే వారిశిరంబుల నభిషేకించి "నాచిన్ని యన్నలారా! మృత్యుదేవతకోరలనడుమఁ జిక్కియు నదృష్టవశ మున జీవింపఁగల్గితిరి. దురాత్ముఁడైన చిత్రభానుఁడు రణమునఁ జచ్చి నాఁడా, చేసినపాపము వడ్డితోఁగట్టి కుడువకపోవునా? లేదా వ్రణ శేషము, రణశేషము, ఋణశేషము నుంచఁగూడదని పెద్దలు చెప్పుదురు. వానిని విచ్చలవిడిగాఁ జరింపనిచ్చితిమా పిచ్చికుక్కను గ్రామమున విడిచినట్లే. కావున సైన్యమునంపి వానిం బట్టి తెప్పిం పుము." అని బహూకరించి హితోపదేశము జేసి సెలవుగైకొనియెను. గదాధరశూలపాణులును దమకృతజ్ఞతం దెలిపి చనిరి.

అనంతరము రుద్రభట్టు నేమిచేయఁ దగునని భాగ్యవర్ధనుఁడు మకరంద మహేంద్రదేవులను, మాధవసేనుని విక్రమసేన హర్షవర్ధను లను బిలిపించి యడిగెను. మకరందుఁడు వానిని దేశమునుండి వెడలఁ గొట్టుట కర్తవ్యమని పలికెను. వానిని యావజ్జీవము కారాగృహమున

నుంచఁ దగునని విక్రమసేనుఁ డనెను. "బ్రాహ్మణో న హంతవ్యః" యని ధర్మశాస్త్రము చెప్పుచున్నదిగనుక నామనుమఁడు చెప్పినట్లు మకరందుఁడు చెప్పినట్లుజేయుట సముచితమని వృద్ధుఁడైనహేమచంద్రదేవుఁడు వాక్రుచ్చెను. మాధవసేనుఁడు వారిమాటల కిష్టపడక రోషావేశముగలిగి యిట్లనియె. "అయ్యా! మీరందఱు మూర్ధాభిషిక్తులు ధర్మాధర్మ విచక్షణులు. మీ రెఱుఁగని ధర్మములులేవు. నేను మీకీ విషయమునం జెప్పఁదగినవాఁడను గాను. అయినను నాదొక్కచిన్నమనవిగలదు. ఇతఁడు బ్రాహ్మణుఁడగుటచే నవధ్యుఁడనిపాంచాలవల్లభుఁడుపలికె. ఆయభిప్రాయముచేతనే విక్రమసేనుఁడు యావజ్జీవకారాగారాగృహవాసము విధించె. పరమదయాళువగుటచే మకరందుఁడు వానిని దేశభ్రష్టుఁ జేయుమనియె. మీమాటలు నాకుసరిపడవు వాఁడు బ్రాహ్మణుఁడుగాఁడు చండాలుఁడు. చండాలుఁ డనుట చండాలుర నవమానించుట. చండాలురు గూడ వీనికర్మలంజూచి సిగ్గుపడవలయును. కటికవాండ్రు సైతము వీనిచర్యలం జూచి కంపింతురు. వీఁడే హరిశర్మయనుపేరుపెట్టుకొని చిత్రభానుంగూడి హేమచంద్రమహారాజుంజంపించెను. వీనియుపదేశంబుననే చిత్రభానుఁడు బాలకుల దారుణంబుగఁ జంపింపఁదలఁచె. అగ్నికి వాయువుతోడైనట్లు దురాచారుఁడైన చిత్రభానునకు వీఁడుమంత్రియై యుపదేష్టయై యుండెను. వీఁడు చేయనిపాతకము లేదు. వీనియెడ దయబూనుట యనుచితము. వీనియెడ జాలిబూనుట పాతకమున కభ్యుదయము గలిగించుట. అధర్మమును బ్రోదిసేయుట. జాతముచేత విప్రుఁడైనంత మాత్రమున దురాచారుల క్షమించుట శ్లాఘాపాత్రముగాదు. కావున వీనిని దారుణవధముపాలుసేయుట మంచిది. ఏనుఁగుకాలిక్రిందవైచి త్రొక్కించియో కొరతవేసియో వీనిని తుదముట్టింప వలయు." అప్పలుకులు విని భాగ్యవర్ధనుఁడు వాని నట్లు చేయుట యుక్తమని పలికెను.

మీయిష్టమని మహేంద్రదేవుఁ డూరకుండెను. అంతకుమున్న పెద్దలు చెప్పినట్లు వినకపోవుటచేఁ దమకెన్నో యిడుములు కల్గినవని యెఱిఁగి విక్రమసేనుఁడు వారిమాట కెదురాడఁడయ్యె. మకరందుఁడు వధింపవలదని పలుమాఱు చెప్పెను గాని వానిమాట సాగదయ్యె. రుద్రభట్టుం దోడ్కొనిరమ్మని భాగ్యవర్ధనుఁ డాజ్ఞయిచ్చెను. సంకెళ్ళబరువున మెలమెల్లగ నడుగులిడి నడచుచు గతగర్వుఁడై దీనాననుఁడై రుద్రభట్టు రాజసన్నిధిఁ బ్రాపించెను అతనిం జూచి భాగ్యవర్ధనుఁ డిట్లనియె. "బ్రాహ్మణుఁడా! చిత్రభానునితోఁ గలిసి కాశ్మీరరాజకుటుంబమునెడ నీ వొనర్చిన మహాఘాతుకకృత్యములకు నీకు మరణదండన విధించినారము. మదపుటేనుఁగుకాలిక్రిందవైచి త్రొక్కించి నిన్నంత మొందించుట సముచితం బని సభాసదులు నిర్ణయించిరి. నీవర్చస్సుగూడ బ్రహ్మతేజ ముట్టిపడుచున్నది. అదిగాక నీవు వేదవేదాంగపారగుఁడ వని గూడ వింటిని. అట్టినీవ యక్కటికము లేక యక్కటికవానిచందమున దుష్కార్యంబుల నొనర్చితివి. కావునఁ దత్ఫల మనుభవింపుము" అనియాతఁడు రుద్రభట్టు బాష్పకలితలోచనుఁడై 'మహాప్రభువులారా! నావయస్సును, నాకులమును, నావిద్యయు, మీరాలోచించి నన్ను క్షమింపవలయునని ప్రార్థించుచున్నాఁడ. నాయాలుబిడ్డలకు దిక్కెవ్వరు లేరు. నేను మిక్కిలి పేదవాఁడను. మీశరణముఁ జొచ్చినాఁడను. మీపాదములాశ్రయించి బ్రతుకవలసినవాఁడను" అని బాలుఁడట్లు వెక్కి వెక్కి యేడ్చెను.

మకరందుఁడు చూడలేక చోటువాసి యవ్వలికిం బోయెను. మాధవసేనుఁడు "మహారాజులారా! ఇతఁడు నాటకమండలిపాత్రమట్లు సకలరసము లభినయింపఁగలఁడు. ఇప్పు డేడ్చి మీహృదయంబులు కరఁగింపఁగలఁడు కావున మీరు మెత్తపడవద్దు. ఈతఁ డింత

కన్నను దారుణమైనశిక్షల కర్హుఁడు. బ్రతికి యుండఁగా వీనిం గాల్చినను దోసములేదు. ఇట్టికలుషాత్మునిసంపర్కమువలన నతిపవిత్రమగునగ్నిహోత్రుఁడు మలినుం డగును. కావున నిదే వీనికిఁ దగిన శిక్ష'' యని కఠినముగాఁ బలికెను.

''బ్రాహ్మణుఁడా! నీమీఁద నెవ్వరికిం జాలి లేదు. 'అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ' మ్మని మీవంటిపెద్దలే చెప్పినారు. కావున నీవు చేసినవ్యవసాయమునఁ బండినపంట నీవ కుడువవలయు. కార్యమొకఁడు చేయ ఫలము మఱియొకఁ డనుభవించునా? మాయారూపము దాల్చి హేమచంద్రునివంటిరాజచంద్రుని పొట్టంబెట్టుకొంటివి. అట్టినృపచంద్రుఁడు మరల మనకు లభించునా? ఛీ! నీమొగముఁ జూడఁగూడదు పొమ్ము.'' అని భాగ్యవర్ధనుఁడు కోపోద్రేకుఁడై పలికెను. సేవకు లాతని నవ్వలికిం దోడ్కొనిపోయిరి.

గాంధారరాజులయొద్ద కాళరాత్రియనుమదపుటేనుఁగు కలదు. సేవకులు దానిం దోడితెచ్చి గాంధారస్కంధావారమునకు నెట్టయెదుట నిలువంబెట్టి వలదు వలదని పెద్దపెట్టున నేడ్చుచున్నరుద్రభట్టును లాగియు గెంటియుఁ ద్రోసియు నాదంతావళమునంతికమ్మునకుఁ దీసికొనిపోయి యొకయినుపగొలుసుఁ దెచ్చి రుద్రభట్టునడుమునకుఁ గట్టి దానినేనుఁగుకాలికిబంధించిరి. అప్పుడు రుద్రభట్టు తన కట్టిదారుణమరణము విధి నిర్ణయించె నని మనస్సమాధానము జేసికొని కన్నులు మూసికొని పరమేశ్వరునిధ్యానముజేసి నేలం బండుకొని యెను. మావటీఁడు మత్తేభము నంకుశంబునం బొడిచి ముందుకు నడిపించెను. తోడనే యయ్యాధి ఘీంకరించి యతిభారములై రోళ్ళవలె నున్న తనపాదములు రుద్రభట్టు వక్షస్థలంబునఁ బెట్టి త్రొక్కి తొండమున వాని లేవనెత్తి గిఱ్ఱునఁ ద్రిప్పి నేలఁ బడవైచెను. రుద్ర

భట్టు క్రొన్నెత్తురులు గ్రక్కుకొని యమమందిరమునకుం జనియెను. సైనికులందఱు మహాభయముతో విస్మయముతో నాతనిదుర్మరణముం జూచి జాలినొందిరి. శ్రీనగరపౌరులాబాలగోపాలముగ నవ్వార్త విని సంతసించిరి.

గాంధారనాయకుండు మణివర్మ చేసినహితోపదేశము ననుసరించి చిత్రభానునిం బట్టి చంపుటో లేక బ్రతికియుండంగా శ్రీనగరంబునకుం గొనితెచ్చుటో కర్తవ్యమని కొంతసేనతో జీవసిద్ధిని వానికొఱకై పంపెను. జీవసిద్ధియు నది దాంటి వానిజాడ లరయుచుం బరిసరంబుల నున్న యరణ్యములు వెదకుచుం గొంతద వ్వరిగెను. ఒకయేటియొడ్డున నొకకొండగుహలోం జిత్రభానుండు కరటకపింగళసమేతుండై తనయాప్తసేవకులు పిట్టలం గొట్టితెచ్చి యిచ్చినమాంసంబును గొన్నిపండ్లను మెసవి కాలక్షేపముసేయుచుండెను. ఒకనాంటి సాయంకాలము చీంకటిపడినవెనుక నాగుహలో మువ్వురుం గూర్చుండి తమదురవస్థకు వగచుచుండం బింగళుడు విచారాక్రాంతుండై యిట్లనియెను. "మహాప్రభూ! దేవరవారినిమిత్తమై మేము మేను దాచుకొనక యేపని జేయుమన్న నాపని జేసితిమి. మీరు మీయన్నం జంపునపుడు మేమెంతో సాయము జేసితిమి. ఎన్నోమాయవేషములం దాల్చితిమి. నేను విశారదనామముతో మాళవదూతనని బొంకి మీయన్న మనసు కలంచితిని. గాంధారదేశబ్రాహ్మణవేషము, సాయిలవానివేషము, కరటకుండు వైచి యెంతో చిత్రముగాం గథాకలాపము వినిపించి సైనికుల కుద్రేకముం గలిగించెను. నేనును మహేంద్రదేవుని పురోహితవేషము వేసి యాయన యుంగరము దొంగలించుకొనివచ్చి రాజకుటుంబముమనసు కలచితిని. మీరు వేంటకు వెళ్ళందలంచినప్పుడు నేనుగొల్లవాండనైతిని. రాకొమరులు పులినోటంబడి చచ్చిరని నేనుబొంకితిని. మీయానదాంటక యెన్ని

దుస్తంత్రములనైనఁ బన్నితిని. కాని దైవము మన కనుకూలముగ లేకపోవుటంజేసి మనప్రయత్నములన్నియు భగ్నములయ్యెను. ఇఁక నేమి చేయుదము? ఎందుఁబోవుదము? మాబ్రతుకు, మాసుఖము, మీతో నున్నది. ఆలుబిడ్డలకు దూరమైతిమి. అన్నవస్త్రములకు వెలియైతిమి. పరమేశ్వరుఁడు మనమీఁద నిర్దయుఁడగుటకుఁ గారణమేమో'' యని యంగలార్చుచుండఁ జిత్రభానుఁడు దైన్యసూచకమగు హీనస్వరముతో ''ఓరీ! మీవలన లోపములేదు. నే నేయాటలాడుమన్న నది యాడితిరి. అయినను మనము దైవోపహతుల మగుటచే నపజయమైనది. అయినను మేనఁ బ్రాణములుండ మనప్రయత్నము విడువఁదగదు. ఈయాటవికులం గూర్చుకొని క్రమక్రమముగా దేశముంగొననున్న గ్రామముల నాక్రమించి మెల్లగ విజృంభింతము.'' అని పలుకుచుండ మనుష్యులు నడచివచ్చుచున్నజాడ వారికి వినవచ్చెను. వెంటనే పింగళుఁడు గుహ వెలుపలికివచ్చి శబ్దమాలకించి 'మనుష్యుల యడుగులచప్పుడువలెఁ గొంతదూరము వినఁబడుచున్నది. మనలం బట్టఁబగతురు వచ్చుచున్నారేమో? ఈవలకురండు. పాఱిపోదము.'' అని తొట్రుపాటుతోఁ బలికెను. అదివిని వెంటనే లోపలనున్న యిరువురు వెలుపలికివచ్చిశబ్దమాలకించిరి. అంతలో జీవసిద్ధిసైన్యము మిక్కిలి దగ్గఱకు వచ్చుటయు సేవకసమేతుఁడై చిత్రభానుఁడు ప్రాణరక్షణమునకై పరువెత్తసాగెను. అదికనిపెట్టి జీవసిద్ధియు సైనికులును వారిం దఱుమనారంభించిరి. కాలిలో ముండ్లు విఱుగుటంజేసి పింగళకుండు నడువలేక యొకచోటఁబడెను. సైనికులు వానిం బట్టి తుత్తునియలుగా నఱికివైచిరి. చిత్రభానుఁడు తనపాదములు పరుగెత్తనిచ్చి నంతవేగముగాఁ పరుగెత్తుచు నొకచెంచుపల్లియ డాసి యయ్యూరు వెలుపల నున్న పాడుబావిలోఁ బడెను. చీఁకటిచాటున నది కానఁబడకపోవుటచే నట్టి ప్రమాదము సంభవించెను. అందు నీరులేదు గాని

పాములు, తేళ్లు, కండచీమలు మొదలగునవి విశేషముగ నుండెను. తేళ్ళుకుట్టెను. పాములు కఱచెను. కండచీమలు పీకెను. అతఁడాబాధలుపడలేక పెద్దపెట్టున నఱచి మరణవేదన బొందెను. చెంచుపల్లియలోనివారందఱు వడలి మేల్కొనిరి. అంతలో నాతఁ డెక్కడున్నాఁడో యెవ్వరుఁ జెప్పనక్కఱలేకయే వానియఱపులే యెఱిఁగించుటచే జీవసిద్ధి యానూతికడకుఁబోయి సైన్యసమేతుఁడై దానియొద్దున నిలిచెను. కొంతసేపటికిఁ గ్రమక్రమముగాఁ జిత్రభానుఁడు స్మారకము దప్పి హీనస్వరంబున నేమేమో గొణుగుకొనుచుఁ గాలధర్మము నొందెను.

మఱునాఁ డుదయమువఱకు జీవసిద్ధి యచ్చట నుండి శవముం దీయించి సైనికులతో నిట్లనియె. "ఆహా! చూచితిరా? యెంతయున్నతవంశముననో జన్మించెను. ఎన్ని విద్యలనో నేర్చెను. కాని దురాశాపీడితుఁడై దుస్సహవాసములం జేసి దుర్నయంబున కొడిగట్టిదుస్తంత్రంబులఁబన్ని దుష్కార్యము లాచరించి తుదకీదురవస్థం దెచ్చికొనియె. రాజద్రోహియయ్యెను. భ్రాతృద్రోహియయ్యెను. దేశద్రోహియయ్యెను. శిశుహంత కాఁదలఁచెను. తరువాత నరకమున్నదో లేదోగాని యీనూతిలోఁ బడినది మొదలుకొని ప్రాణము పోవువఱకు భూలోకమందె నరకక్లేశమనుభవించెను. శిష్టజనసంరక్షణంబును దుష్టజన సంశిక్షణంబును జేయ దీక్షవహించిన దాక్షాయణీవల్లభుఁడు పరమేశ్వరుఁడు పాపఫలంబు దురాత్ముల ననుభవించునట్లు జేయకపోవునా? పాప మెన్నటికిని జయముగాంచదనియు, సత్యమే జయించుననియు ధర్మమే సర్వోత్కృష్టమైవర్ధిల్లుననియుఁ దుదకువారికి మిగిలినది పాపమేయనియు వీని చరిత్రమువల్ల నేర్చికొనవచ్చును."

అనియుపన్యసించి శవమును భాగ్యవర్ధనవిక్రమసేనులకుఁ జూపఁదలఁచి కటుకు గట్టించి దానిపైఁబెట్టించి సేవకులచేత మో

యుంచుకొని నదియొడ్డునఁబెట్టించి నది దాఁటి తాను స్కంధావారమునకుం జని విక్రమసేనునకు భాగ్యవర్ధనునకు మకరందునకు మాధవసేనునకు నవ్వార్త జెప్పి రహస్యముగ వారిని నదిదాటించి యావలియొడ్డునకుఁ దీసికొనిపోయి శవముం జూపెను. చిత్రభానుఁ డస్తమించె నని వారప్పుడు నిజముగా నెఱిఁగి సంతుష్టు లయిరి. విక్రమసేనుఁడు వానియవస్థకు విచారించి బాష్పాకులితలోచనుఁ డయ్యెను. మాధవసేనుఁడు చేతులారఁ జేసికొన్నది యనుభవింపకతప్పునా యనెను. మకరందుఁడు జాలిపడెను. మరల నడవికిం గొనిపోయి యచ్చటనే దహనసంస్కారము చేయుఁడని భాగ్యవర్ధనుఁ డాజ్ఞ యిచ్చెను. ఆవార్త చిత్రభానునికుటుంబమునకుఁ దెలియకుండ రహస్యముగ నుంచుమని కాలాంతరమునఁ దెలియఁజేయనచ్చునని విక్రమసేనుఁడు వారినిగోరెను. శాస్త్రచోదితములైనయుత్తరక్రియలు లేక తనకొఱకు విచారించునాప్తజనము లేక, దిక్కులేక చిత్రభానుఁడు వనమధ్యంబున నెండుటాకులు గాలినట్లు దగ్ధుఁడయి యపకీర్తికాయమును లోకంబున విడిచి పోయెను. చిత్రభానుఁడు నూతఁ బడినరాత్రి కరటకుఁడు పేరాఁకలిగొన్న పెద్దపులివాఁతం బడి యంతకపురంబుఁ జేరెను.

ముప్పదియేడవ ప్రకరణము

చిత్రభానుఁడు మృతినొందినవెనుక నొకమాసమువఱకునూరకుండి భాగ్యవర్ధనుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి విక్రమసేనునకుఁబట్టాభిషేకము సేయ నిశ్చయించెను. మాతామహుఁడైనమహేంద్రదేవుఁడు నానాదేశాధీశ్వరులకు మనుమనియభిషేకమహోత్సవమునకు రావలయునని యాహ్వానముల నంపెను. మాళ

వేంద్రుఁడైనసుదర్శనుఁడు సింధునాయకుఁడైనపరంతపుఁడు ఘూర్జర వల్లభుఁడైన కువలయేశ్వరుఁడు మున్నగుమహీనాయకులు తమతమ పరివారములతో మహావైభవమున వచ్చి శ్రీనగరమునఁ దమనిమిత్త మేర్పఱుపఁబడినవిడిదలలో విడిసిరి.

నగరమంతయు సింగారింపఁబడెను. ఎచ్చోటఁజూచినఁ బచ్చని పందిళ్ళు. ఏద్వారమునఁజూచినఁ గనుపండువు సేయుతోరణములు, ఏగు మ్మముముందరఁ గనుఁగొన్న గెలలతోనిండిన యనఁటికంబములు, ఏగోడలు వీక్షించిన నతిమనోహరములైనచిత్తరువులు. ఏమేడలఁ జూచినఁ బట్టుపతాకములు ఎనెలవునదర్శించిన సర్వాలంకారశోభిత లైన విలాసవతులు. యమున, సింధు, భాగీరథి, సరస్వతీ, ప్రముఖము లగుపుణ్యవాహినులతోయంబులు హేమకుంభములతోఁ దెప్పింపఁ బడెను. ప్రకృతిజనంబులలో ముఖ్యులు తన్మహోత్సవదర్శనార్థమై వచ్చిరి. భాగ్యవర్ధనుని యానతి బూని చండశక్తివర్మలు తగుపరి వారముతో గాంధారనగరమున కరిగి కుమారాభిషేకమహోత్సవము గనుఁగొనుటకై యరవిందాదేవిని దోడితెచ్చిరి. తల్లియుం గొడు కులుఁ గలసికొని పరస్పరాలింగనసుఖంబు ననుభవించిరి.

సిద్ధాంతులు నిర్ణయించినసుముహూర్తంబున మహారాజులయు, సామంతులయు, మంత్రులయుఁ, జుట్టములయుఁ బ్రకృతిజనంబులయు సన్నిధిని బురోహితుఁడగునిగమశర్మ విక్రమసేనుని గాశ్మీరసింహాస నంబునఁ గూర్చుండఁబెట్టి పుణ్యనదీతోయంబులతో నభిషేకించెను. అరవిందాదేవిసహజమగుమాతృవాత్సల్యముచేతఁగన్నుదమ్ములనుండి దొరఁగునానందబాష్పములతోఁ బుణ్యనదీజలములఁ బవిత్రమైనకుమా రునిమూర్ధమున వెండియు నభిషేకించెను. ఉదయశైలము నలంకరిం చినభానుమండలమట్లు నవరత్నఖచితమైన సువర్ణపీఠము నధిష్ఠించిన దేదీప్యమానప్రభలతో విరాజిల్లుమణిమయమకుటంబు నౌదలఁదాల్చి

కుమారభావంబుదాల్చి వచ్చినహేమచంద్రుఁడుంబోలె వెలయు విక్రమసేనునిం జూచి మహేంద్రదేవప్రముఖబాంధవులు సుదర్శనాది మిత్రులు, భాగ్యవర్ధనప్రముఖులగునాప్తులు నానందించిరి. వందిమాగధులు కైవారముజేసిరి. వైతాళికులు జయగీతములఁ బాడిరి. వృద్ధు లాశీర్వదించిరి. ప్రకృతిజనంబులు భళి భళీ యని ప్రశంసించి సంతసించిరి. విరివిగా జరిగినయన్నదానమునఁ బేదలు సంతుష్టులైరి. భూరిసంభావన లందుకొని కవులు, పండితులు, బహుశ్లోకగర్భితములైనదీవనలనిచ్చిరి. నగరమంతయు నుత్సవమయ్యెను. ఒకచో విప్రుల వేదఘోషములు, వేఱొకచోఁ బణ్యాంగనలయాటలు, గొండొకచో బుణ్యాంగనలపాటలు, నొకమూలగానవినోదములు, నొకనెలవునఁ బండితశిరోమణులవాదములు నొకతావున మిత్రులసరససల్లాపములు నొకయెడ బాంధవులపరస్పరరామర్శలు నిట్లునగరమంతయు మహానందమయమై నయనపర్వమై మనోహరమై యుండెను.

ఉత్సవానంతరమున విక్రమసేనుఁడు తనకుండమ్మునకుఁ బ్రాణప్రదాతలైనచందుని శక్తివర్మను బిలిపించి వారిరాజభక్తిని గొనియాడి చెరిమూఁడుగ్రామములు పన్నులులేకుండ నగ్రహారములుగా నొసఁగెను. అదియునుఁగాక దమనిమిత్తమై కష్టపడినవారికిఁ, బ్రాణములుగోల్పడినవారికి, నుచితరీతిని బారితోషికముల నొసంగి వారి కుటుంబములకు జీవనాధారముగల్పించెను. చిత్రభానునియొక్కయు దండపాణి వజ్రపాణులయొక్కయు దుర్బోధనలవలన వికలచిత్తులై తనపైఁదిరుగుబాటుచేసినసైనికుల నందఱను క్షమించి మరలసైన్యమునఁ జేర్చుకొనెను. మణివర్మను. మాధవసేనుని, మంత్రులుగా నియమించెను. గధాధర, శూలపాణులు సేనాపతులైరి.

భాగ్యవర్ధనుఁడు తన గారాబుకూతురైన సౌదామినిని విక్రమసేనునకును, దనతమ్మునికూఁతురగు చిత్రరేఖను హర్షవర్ధనునకును నిచ్చి వివాహము సేయసంకల్పించినట్లు మహేంద్రదేవునితోడను,

నరవిందాదేవితోడను, జెప్పి వారి యనుమతివడసి మాఘమాసంబునఁ గళ్యాణంబులు జరుపఁదలఁచి సుముహూర్తము నిశ్చయించెను. మహేంద్రదేవుఁడు తా నతివృద్ధుఁడై రాజ్యభారము నిర్వహింప లేకుండుటచేఁ దనరాజ్యమున హర్షవర్ధను నభిషేకించి వానికి యుక్త వయసు వచ్చువఱకుఁ దా నాతనికిఁ దోడ్పడియుండి యనంతరము దపోవనమున కరుగ నిశ్చయించెను. భాగ్యవర్ధనుఁడును దనకుం దమ్మునకుఁ బురుషసంతతి లేనందునఁ దనపరోక్షమున విక్రమసేనుఁడే గాంధార దేశమునకుఁ గూడ నేలికగాఁగలఁడని యెల్లరాజులయెదుట నొక్కి-సక్కాణించెను.

సుదర్శనుఁడు మకరందుని మిత్రుఁడగు చంద్రచూడునివలనఁ దనకుమారుఁడు కర్పూరమంజరిపై వలపునిలుపుట వినియున్నకతమున విక్రమసేనుని పట్టాభిషేకమహోత్సవము నిమిత్తము నిర్మింపఁబడిన పచ్చని పందళ్ళలోనే కర్పూరమంజరిని మకరందునకు వివాహము సేయు టుచితమని యరవిందాదేవికిని నిందుమణికిని నిగమశర్మ ముఖమున సందేశమంపెను. అరవిందాదేవి యాసందేశము నాదరముతో విని యావివాహము నంగీకరించెను. భర్తృమరణవార్త తెలియక పోయినను నిందుమణి మహాపతివ్రత యగుటచే నాతనికొఱకై బెంగ గొని యన్యులతోఁ మాటలాడక సరిగా నన్నము ముట్టక నిదుర పోవక దుఃఖపరవశయై యుండియు, సంప్రాప్తయౌవనయైన కూఁతు నవివాహితగాఁ జిరకాలముంచుట యనుచితంబని తలంచి యనుకూలుఁడైన వరుఁడు చేకూరినప్పుడు వాని కామె నీయకపోవుట యధర్మమని భావించి యరవిందాదేవిం బిలచి యిట్లనియె "అక్కా! [illegible]తోఁబాటు నేనును మీకు లేనిదానినేయని భావింపుఁడు. మీమఱఁదివలన మీకైన మహోపకారముల నెల్ల మరచిపొండు. చిన్ననాఁటనుండి కర్పూరమంజరిని నీవె పెంచితివి. అది నీబిడ్డకాని

నాబిడ్డ కాదు. కడుపునఁ గాంచుటచే నేను తల్లి నైతిని, పెంచుటచే నీవు తల్లి వైతివి. దానికి నామీఁదకన్న నీమీఁదనే మక్కువ మెండు. నేను బహుకారణములచేఁ బ్రబలముఖము జూడఁజాల కావునఁ గర్పూర మంజరినిమాళవ రాజనందనుఁ డగు మకరందున కిచ్చి పెండ్లిచేయిం పుము. జనకునికి జడిసి యబ్బాలిక పైకిఁ జెప్పలేదుగాని యామె రహస్యముగ బౌద్ధమతమును స్వీకరించినది. వెనుక దండ్రితోఁగూడ నొకసారి బుద్ధదేవుని సిద్ధాంతములఁ బ్రసంగించుచు గంభీరముగ మాట లాడెను. అందుచే బౌద్ధధర్మప్రకార మామెకు వివాహము సేయిం పుము.'' అని పలికి యాఁగకుండ వచ్చు బాష్పధారలను చీరచెరఁగుతో దుడుచుకొనియెను. ''ఇందుమణీ! విచారింపకు. నీమనోభీష్టము నేను నెఱవేర్చెద. నీకు విక్రమసేన హర్షవర్ధనులతో ముగ్గురుకొడుకు లను కొనుము. నీవు చెప్పినట్లు కర్పూరమంజరి నాబిడ్డయే. కర్పూరమంజరికి శుభముహూర్తమున వివాహము చేయించెద'' నని యరవిందాదేవి నుడివి యామె యలమట దీర్చి వివాహమునకు ముహూర్త మేర్పఱచి యాహార్త సుదర్శనున కెఱింగించెను. సుదర్శనుఁడును వెంటనే వార్తాహరుల నుజ్జయిని కంపి చంద్రప్రభాదేవిని రత్నసేన ప్రముఖు లగు మంత్రులను రావించెను. అరవిందాదేవి వేగ గమనముగల యొంటెలమీఁదఁ బ్రయాణ నైపుణిగల పరిజనుల విదర్భ కంపి వివా హము నిమిత్తము సకుటుంబ సపరివారముగా రాజవాహనుని రమ్మని యాహ్వానమంపెను. అందఱును వివాహ మహోత్సవ దర్శనార్థము వచ్చిరి. తక్షశిల నుండియు మఱి తదితర ప్రదేశముల నుండియు బౌద్ధభిక్షుక భిక్షుణీ జనములు తండోప తండములుగ [illegible] శ్రీనగరమున విడిసిరి. కామందకి యను బౌద్ధ [illegible] డను బౌద్ధగురువును విజయముచేసి సౌగత [illegible] బంధుమిత్ర సమక్షమునఁ గర్పూరమంజరిని మకరందున కిచ్చి వివా

హోమముచేసిరి. ఆదంపతులం జూచి జయజయ ధ్వనులు సేయువారు భళీయని ప్రశంసించువారు "అహో! బ్రహ్మనిర్మాణకౌశల"మ్మనువారు "దాంపత్యమన నిదే దాంపత్య"మని యనువారు సంతోషమొందువారు, హర్షసూచకముగఁ జప్పట్లు చరచువారు నచ్చట గుమిగూడిన జనులలో లేరు.

ప్రపంచములో ననుకూలదాంపత్యము కుదురుట యరిదియగుటచే విధాత తుల్యగుణములు, తుల్యరూపములు తుల్యశీలములుఁ గల దంపతులను గూర్చి నేటికాలమునకు లోకనింద బాపెనని జనులు చెప్పుకొనిరి. వివాహము మహావైభవముతో జరిగెను. పేదలకు మృష్టాన్నము లభించెను. పండితులకుఁ బారితోషికములు దొరకెను. భిక్షుకభిక్షుణీజనంబులకుఁ దగు పసదనంబు లీయఁబడెను. మకరందుని మనోరథము సిద్ధించెను. కర్పూరమంజరి కామితము కడముట్టెను.

వివాహానంతరమున సుదర్శనుఁడు విజయసేనుని నిందుమణిని నరవిందాదేవిని విక్రమసేనుని తోడఁబిలిచి క్రొత్తలైన కర్పూరమంజరిని నుజ్జయినీపురంబునకుఁ దోడ్కొనిపోయెను. రతిమన్మథులవలె నున్న యాసతీపతులం జూచి యుజ్జయినీపురవాసులు మహానందభరితులై వారియుభయ సమాగమము బహువిధములఁ బ్రశంసించిరి. సుదర్శనుఁడును జంద్రప్రభాదేవియు గుసుమాయుని మాళవరాజ్యమున కభిషిక్తుని జేసి, తాము మందిరమువిడిచి యొక విహారమునం బ్రవేశించి బుద్ధదేవోపదిష్టములయిన ధర్మముల పారాయణము సేయుచుఁ బారమార్థికచింతతో గాలము గడుపఁదొడఁగిరి. మకరందుఁడు సతీసహితుఁడై ప్రత్యహముఁ దల్లిదండ్రుల సందర్శించి వారిదీవనలఁ బడసి వచ్చి ధర్మమార్గానుసారముగాఁ బ్రజాపాలనము సేయుచుండెను. ప్రతిగ్రామమున నతఁడు చెఱువులు, నూతులు, బావులు త్రవ్వించెను. పల్లెపల్లెయందును బాలుర విద్యాభివృద్ధికై పాఠశా

నెలకొల్పెను. దుర్గమములగు మార్గములఁ జక్కని రాచబాటలు నిర్మించెను. విశాలములైన యాబాటల కిరుప్రక్కల సుందర పుష్పములను, మధురఫలంబులను, శీతలచ్ఛాయలను నొసంగు వృక్షముల నాటించెను. ఎల్లరు ఫలంబుల ననుభవింపవచ్చును. ఎల్లరు పుష్పముల స్వీకరింపవచ్చును. ఎల్లరు నీడల సుఖింపవచ్చును. క్రోసుదూరమున కొక్కచోట బాటసారులు విడియుటకై సత్రములఁ గట్టించెను. రోగుల చికిత్సలనిమిత్తము ధర్మవైద్యశాలలు స్థాపించెను. తెగులు గొంట్లగు పసరములకుసైతము నట్టి చికిత్సాశాలలే నిర్మింపఁబడెను. మాంసభక్షణము దేశమందంతట నిషేధింపఁబడెను. జీవహింస యరుదయ్యెను జంతువులయెడ సహితము నిష్కరుణముగాఁ బ్రవర్తించిన వారు రాజదండనలకుఁ బాత్రములైరి. తల్లిదండ్రులయెడ భక్తి గురుజనంబుల యెడ గౌరవము క్షుద్రజంతువులయెడ దయ, పరస్త్రీలయెడ సోదరీభావము, వికలాంగులయెడ నిరుపేదలయెడ జాలి, మొదలగు సద్గుణంబులు "యథా రాజా తథా ప్రజా" యను సామెత నిజముగా రాజునడతనుండి ప్రజలు నేర్చుకొని ధర్మాచరణముచేత రాజుమనస్సు రంజింపఁజేసిరి. మకరందునకుఁ బరరాజులలో శత్రువులు లేకపోయిరి. అజాతశత్రుఁ డనుశబ్దము సరిగాపదునొకండక్షౌహిణుల శత్రువులుగల యుధిష్ఠిరునకుఁ జెల్లినదనియు నిజముగా నమ్మాట మకరందునకే చెల్లుననియు నాకాలపువారందరుఁ జెప్పుకొనుచుండిరి. మగధనాయకుని మందిరములందు మకరందునికీర్తియు, ఘూర్జరాధిపుని కొలువుకూటమ్మున మకరందునిప్రశంసయు, శూరసేననృపాలుని శుద్ధాంతములయందు మకరందుని పేరె వెయ్యేల! దేశమందెల్లెడ నాతని యశోలతలు బ్రాఁకెననుట యతిశయోక్తిగాదు. మకరందుఁడు తనప్రజలలో దండ్రిలేనివారికిఁ దండ్రియై భ్రాతృహీనులకు భ్రాతృడై మిత్రులు లేని మిత్రుఁడై ధనములేనివారికి ధనమై బలములేనివారికి బలమై

"దుర్బలస్య బలం రాజా" యనులోకోక్తిని సార్థకముజేసెను. అతఁడు దురాచారులకు దుర్నిరీక్ష్యుఁడై యుత్తముల కుపగమ్యుఁడై, విద్వజ్జనులకు వేలుపుఁజెట్టై పేదలపాలిటి పెన్నిధానమై సర్వజనరంజకుఁడై దుష్టజనభంజకుఁడై ప్రజ తనకు శరీరముగాఁ బ్రజాశరీరమునకుఁ దా నాత్మగా, నుండునట్లు మెలంగి ధర్మమార్గమునుండి యించుకేనియుం దొలఁగక, దనచేత లితర నేతలకు మార్గదర్శకములుగా మహీపాలనము చేయఁజొచ్చెను. కర్పూరమంజరి సహధర్మచారిణి యను పేరు సార్థకమగునట్లు కాంతలలో నీయింతి మేలుబంతి యని పేరువచ్చునట్లుమహాపతివ్రతలలో నగ్రగణ్యయై యత్తమామలకు విధేయయై బంధువులకుఁ బరమానురక్తయై మహారాజపత్నియయ్యు గరువంబించుకయు లేక నెల్లయంగనలకు దర్శనంబిచ్చుచు సాదరంబుగ మాటలాడుచుఁ దల్లిలేనివారికిఁ దల్లియై యాఁడుబిడ్డలు లేనివారికి బిడ్డయై, గతిలేనివారికి గతియై, జనులప్రేమకు భక్తికిఁ బాత్రమైయుండెను. ఆమె పేదలగు బాలింతరాండ్రకుఁ బథ్యపానంబు లంపును, బాలింతరాండ్రకు సూడిద లంపును. పేదలయాఁకుటిండ్లకు, గుడిసెలకు నయితము బోయి వారిసుఖదుఃఖముల నరయుచుండును. వారికిఁ గావలసినధనసాహాయ్యము జేయుచుండును. ఆదంపతులు ప్రజలనే బిడ్డలుగా భావించి, వారియానందము తమయానందముగ, వారియభ్యుదయము తమయభ్యుదయముగ వారికష్టములు కమకష్టములుగ వారికలిమి దమకలిమిగ వారిలేమి దమలేమిగ భావించి వారిసుఖమునకై యెల్లపుడుఁ బాటుపడుచుందురు.

గర్పూరమంజరికి లోకైకసుందరుఁడగు నొకకుమారుఁడును, జగన్మోహనాకార యగునొకకూఁతురుం గలిగిరి. పాడిదప్పక రాజు పాలించుటంజేసి జనుల పాడిపంటలు గలిగి సిరిసంపదలు గలిగి వరిలుచుండిరి.

భాగ్యవర్ధనునిమరణానంతరమునవిక్రమసేనుఁడు గాంధారము నకుఁగూడ రాజయ్యెను. మహేంద్రదేవునిపరోక్షమున హర్షవర్ధనుఁడు పాంచాలమునకుఁ బ్రభువయ్యెను. మాళవపాంచాల గాంధార, కాశ్మీర దేశంబు లక్కసెల్లెండ్రట్లు బరస్పరమైత్రి గలిగి సిరులతోఁ దుల దూఁగుచుండెను. ఇందుమణియు, విజయసేనుఁడును గర్పూరమంజరీ వివాహమైనవెనుక గొన్ని మాసములుదనుక శ్రీనగరమునం దుండి పిమ్మట మకరందుఁ డాహ్వానముసేయ, నుజ్జయినికిం బోయి యచ్చటనే నివసించి యుండిరి. విజయసేనుఁడు కాలక్రమంబున మాళవసైన్యంబున కధిపతియై మేటిదండనాయకుఁడని పేరుపొంది మకరందుని యాదరమునకు భాజనమయ్యెను. అనుకూలవతి యగుకర్పూరమంజరి యిల్లాలుగ భద్రసేనుఁడు మంత్రిగ విజసేనుఁడు దండనాథుఁడుగ ధర్మము మిత్రంబుగ సత్యంబు చుట్టంబుగ మకరందుఁడు జూద మాడి సిరులు గోల్పోవనినరుఁడు చండాలసేవ జేయనిహరిశ్చంద్రుఁడు వేశ్యాలోలుఁడుగాని పురూరవసుఁడు నని ప్రజలు ప్రశంసింపఁ జిర కాలము రాజ్యపాలనము జేసెను.

సమాప్తము.

శ్రీ కొండపల్లి ముద్రాశాల, రాజమండ్రి.